Dhana Vikendreekarana (Decentralisation of Wealth)

# ధన వికేంద్రీకరణ

సంకలనం
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, ఫ్లాట్ నెం.106,
సహారా కాంప్లెక్స్, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2
ఫోన్ : 040-66710795, 9441515414

వెల.........................................................................రూ. 110/-లు



| | |
|---|---|
| Name of the Title: | Dhana Vikendreekarana Telugu (Decentralisation of Wealth) |
| Compilation : | **ABUL IRFAN** Hyderabad-2 |
| Editing & Proof reading: | Hafiz, Moulvi S.M. Rasool Jamiatul Qur'an, Hyderabad |
| All rights reserved with: | Islamic Resource Centre |
| First Edition: | September, 2005 |
| Second Edition: | September, 2010 |
| Copies: | 1000 |
| Published by: | Islamic Resource Centre Sahara Complex, Pathargatti, Hyderabad-2, ✆ 9441515414 |
| Type set by: | Alifain, Geeturai Graphics Lakkadkot, Chatta Bazar, Hyderabad-500002 |
| Printed at: | Cosmic Printers Lakkadkot, Chatta Bazar, Hyderabad-500002 |
| Price: | Rs. 110/- |



====( See Page- 184 )====

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం



## ఆర్థిక మూలసూత్రం

"దేవుడు ఈ వాడవాసుల నుండి తన ప్రవక్తకు అధీనం చేసిన ధన (కనక)వస్తు సంపదల్లో దేవునికి, దైవప్రవక్తకు, బంధువులకు, అనాథలకు, పేదలకు, బాటసారులకు హక్కుంది. ధనం (ఎల్లప్పుడూ) మీలోని ధనిక వర్గంలోనే కేంద్రీకృతమయి ఉండరాదన్న లక్ష్యంతో ఈ విధానం నిర్ణయించ బడింది." (దివ్యఖుర్ఆన్-59:7)



# విషయసూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | తనివితీరని ధనపిపాస | 011 |
| 2. | ఖారూన్ పర్యవసానం | 013 |
| 3. | పరిధుల్లేని ప్రాపంచిక వ్యామోహం | 014 |
| 4. | భూస్వామ్య, బూర్జువా వర్గాలు | 016 |
| 5. | పారిశ్రామిక విప్లవంలో ఉదారవాదుల పాత్ర | 017 |
| 6. | ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ | 019 |
| 7. | సోషలిజం-కమ్యూనిజం | 021 |
| 8. | నూతన ప్రపంచ వ్యవస్థ | 027 |
| 9. | అమెరికా జియోనిస్టుల క్రూసేడ్ యుద్ధాలు | 033 |
| 10. | గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ) | 041 |
| 11. | ఇస్లాం మౌలిక దృక్పథం | 045 |
| 12. | యాజమాన్య హక్కులు | 048 |
| 13. | విషయపరిజ్ఞానం ఆవశ్యకత | 050 |
| 14. | ఆర్థిక న్యాయం | 052 |
| 15. | దుబారా ఖర్చులు | 055 |
| 16. | ధనవికేంద్రీకరణ-మౌలిక విషయాలు | 056 |
| 17. | సరిపడ సహజ ఒనరులు | 059 |
| 18. | స్వార్థానికి ప్రతిరూపమే కృతఘ్నత | 061 |
| 19. | పిసినారితనం వహించకండి | 062 |
| 20. | సంపద కూడబెట్టకూడదు | 065 |
| 21. | కపట విశ్వాసం, ప్రదర్శనాబుద్ధి | 067 |
| 22. | అవకాశం చేజారక ముందే దానం చేయాలి | 068 |
| 23. | కలిమిలేములు పరీక్ష | 069 |
| 24. | పరలోకంలో పేదలు, ధనికుల పరిస్థితి | 072 |
| 25. | దాతృత్వం, దానోద్దేశ్యం | 075 |
| 26. | ఎంత ఖర్చుపెట్టాలి, ఎలా ఖర్చుపెట్టాలి? | 076 |
| 27. | దానస్వీకార యోగ్యులు | 078 |

28. క్రిందిచేయి కంటే పైచేయి శ్రేష్ఠమైనది 079
29. ధన త్యాగం 082
30. ఆర్థిక ఒనరుల వినియోగం 079
31. పొదుపు-పేదల సంక్షేమం 087
32. అక్రమ (అధర్మ)సంపాదన 089
33. సక్రమ (ధర్మ)సంపాదన 091
34. అశ్లీలం, వ్యభిచారం 094
35. మద్య నిషేధం 095
36. జూదం, మట్కా, లాటరీలు 098
37. దోపిడి, దొంగతనం 101
38. మరికొన్ని అధర్మ సంపాదనలు 102
39. అన్యాయం, దౌర్జన్యం 104
40. భిక్షాటన నిషిద్ధం 107
41. కష్టార్జితం 108
42. శ్రామికుల పట్ల యజమాని ప్రవర్తన 110
43. కానుక రూపంలో లంచం 110
44. వడ్డీ నిషేధం 111
45. చీటీపాటలో వడ్డీ ఊటె 115
46. ఇతర మతగ్రంథాల్లో వడ్డీ 116
47. వడ్డీ తినేవాడి పర్యవసానం 117
48. రుణానుబంధం 118
49. తాకట్టు పెట్టి అప్పు తీసుకోవడం 120
50. రుణగ్రస్తుని పట్ల మృదువైఖరి 121
51. అప్పు తీర్చనివాడి పర్యవసానం 122
52. వడ్డీ ప్రమేయంలేని బ్యాంకులు 124
53. మర్చెంట్ ఆఫ్ వెనిస్ 126
54. వడ్డీ లేని రుణసంస్థలు 132
55. వడ్డీని ధర్మసమ్మతం చేసే సాకులు 133
56. కూర్చున్న కొమ్మను నరుక్కోవడమంటే ఇదే 136





57. వాణిజ్య రుణాలు 138
58. అప్పుల ఊబిలో దేశం 140
59. లైఫ్ ఇన్స్యూరెన్స్ 143
60. ఔపాధిక వ్యవహారాలు 144
61. వ్యాపారం 145
62. అబద్ధం, మోసం 147
63. సరుకుల కల్తీ, నాణ్యతలు 152
64. బ్లాక్ మార్కెట్ 153
65. తూనికలు, కొలతలు 155
66. తప్పుడు వ్యాపార పద్ధతులు 156
67. దళారీ వ్యవస్థ 157
68. వస్తుమార్పిడి విధానం 158
69. వ్యాపార ఒప్పందాలు 160
70. వ్యాపార భాగస్వామ్యం 161
71. పండ్లు, పంటల వ్యాపారం 163
72. సేద్యభూములు కౌలుకు ఇవ్వడం 164
73. షేర్ మార్కెట్ 165
- ✦ ప్రైమరీ మార్కెట్ 165
- ✦ రిజర్వుడ్ ఫండ్ 166
- ✦ రైట్ ఇష్యూస్ 167
- ✦ కోటీశ్వరుల్లోనే మళ్ళీ కోట్లు కేంద్రీకృతం 167
- ✦ సెకండరీ మార్కెట్ 167
- ✦ సెబి పాత్ర 168
- ✦ ఫండమెంటల్స్, లిక్విడిటీ 168
- ✦ సెన్సెక్స్ (ఇండెక్స్) 169
- ✦ షేర్ల రిగ్గింగ్ 169
- ✦ స్పెక్యులేషన్ 169
- ✦ మ్యూచువల్ ఫండ్ 170

74. ఇస్లామిక్ మార్కెట్ 170

| | |
|---|---|
| 75. పేదల ఆర్థికహక్కు- జకాత్ | 174 |
| 76. గత షరీఅత్‌లలో జకాత్ ప్రస్తావన | 177 |
| 77. ఆర్థిక నేరస్తులు | 178 |
| 78. జకాత్ చెల్లించనివారి పర్యవసానం | 179 |
| 79. జకాత్ వ్యవస్థ లక్ష్యం | 181 |
| 80. జకాత్ విధి కావడానికి షరతులు | 183 |
| 81. జకాత్ నుండి మినహాయించిన సంపదలు | 186 |
| 82. పశు సంపదపై జకాత్ | 187 |
| 83. జకాత్ స్వీకార యోగ్యులు | 189 |
| 84. జకాత్ స్వీకారానికి అనర్హులు | 193 |
| 85. జకాత్‌కు సంబంధించిన ఇతర ఆజ్ఞలు | 194 |
| 86. ప్రావిడెంట్ ఫండ్ | 196 |
| 87. జకాత్ విధింపుకు మూలధన పరిమితి (నిసాబ్) | 196 |
| 88. జకాత్ పరిమాణం (రేటు) | 200 |
| 89. ఉష్ర్ (వృక్ష సంపదపై జకాత్) | 202 |
| 90. ఉష్ర్‌కు సంబంధించిన ఆదేశాలు | 203 |
| 91. రికాజ్ (ఖనిజ సంపదపై జకాత్) | 205 |
| 92. ఫిత్రా దానం | 206 |
| 93. ఫిత్రాకు సంబంధించిన ఇతర ఆజ్ఞలు | 208 |
| 94. ఖుర్బానీ (త్యాగం) | 209 |
| 95. దానం చేయడంలో జనశ్రేయోభిలాష | 211 |
| 96. వారసత్వపు ఆస్తి- ప్రాథమిక సూత్రాలు | 214 |
| 97. వీలునామా (మరణ శాసనం) | 218 |
| 98. ఆస్తి పంపకం | 221 |
| 99. దత్తస్వీకారం నిషిద్ధం | 227 |
| 100. మహర్- స్త్రీ ఆస్తి | 228 |
| 101. సమర సొత్తు (అన్ఫాల్, ఫై) | 231 |
| 102. పాప పరిహారం | 234 |
| 103. రక్త పరిహారం | 236 |
| 104. ప్రజాసేవే పరమాత్మసేవ | 238 |




# ముందు మాట

ఈనాడు మన ఆర్థికరంగం దగా, మోసం, దోపిడీ, దౌర్జన్యం, అవినీతి, అన్యాయాలతో నిండిపోయింది. ధనికుడు, పేదవాడు అన్న విచక్షణ లేకుండా ప్రతి మనిషీ ఒక విధమైన అసంతృప్తికి లోనయి లోలోన సతమతమవుతున్నాడు. న్యాయప్రియులైన ఆర్థికశాస్త్ర నిపుణులు సైతం పరిష్కార మార్గం కనిపెట్టలేక తలలు పట్టుకొని కూర్చున్నారు. రోజుకురోజు ఆర్థిక త్రాసు అనేక ఒడిదుడుకులకు గురవుతూ పాలకుల్ని చికాకు పరుస్తోంది. ఒక సమస్యను పరిష్కరించబోతే మరొక సమస్య వచ్చిపడుతోంది.

గతకాలపు భూస్వామ్య, పెట్టుబడీదారీ వ్యవస్థలు పేదల నడ్డి విరగ్గొట్టి కోటీశ్వరుల కోటుజేబులు నింపుతున్నాయని సామ్యవాదులు గోలచేసి మరీ ప్రపంచంలోని ఓ పెద్ద భూభాగంపై సామ్యవాద పతాకం ఎగరవేశారు. కాని వారు ప్రజలకు చేసిన ఆర్థిక సమానత్వపు వాగ్దానం నేతిబీరకాయ మాత్రమేనని రుజువుకాగానే సామ్యవాద వటవృక్షం దభేలున కూలిపోయింది. దాంతో ఢీలాపడి ఓ మూల ఒదిగి కూర్చున్న పెట్టుబడీదారీ వ్యవస్థ కోరలుచాచి మరీ ప్రపంచ ఆర్థికరంగంపై పునర్విజృంభించింది.

ప్రపంచప్రజలు పెట్టుబడీదారీ వ్యవస్థలోని మోసాలు, అన్యాయాలు ఇదివరకే చవిచూసుకున్నారు. ఆ తర్వాత సామ్యవాద వ్యవస్థలోని హింసాదౌర్జన్యాలు, రక్తపాతాలు కూడా గమనించారు. మరిప్పుడు ఎవరికి పట్టం కట్టాలో అర్థంగాక, మర్గాంతరంలేక కొత్త కిరీటంతో వచ్చిన పాతరాజుకే పట్టం కట్టి చతికిలబడ్డారు. కాని అనేక మానవ అంతరాత్మలు మాత్రం "మా దగ్గర్నుంచి ఏమీ లాక్కోకండి, మాకు మీరేమీ అదనంగా ఇవ్వనవసరమూ లేదు. మాకు న్యాయం చేకూర్చండి, చాలు" అంటూ ఘోషిస్తున్నాయి. సరిగ్గా ఇక్కడే ఇలాంటివాళ్ళకే స్వాంతన పలుకులు పలికి సేద తీర్చడానికి ఆర్థిక త్రాసుతో సిద్ధంగా కూర్చొని ఉంది ఇస్లాం.

ఇక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థలోని మోసాలు, అన్యాయాలు లేవు. అలాగే సామ్యవాద వ్యవస్థలోని హింసాదౌర్జన్యాలు కూడా లేవు. ఇస్లాం ప్రజల శ్రమ, సామర్థ్యాలకు తగిన న్యాయం లభిస్తుందన్న గ్యారెంటీ ఇస్తోంది. అంతేకాదు, పెట్టుబడిదారీ వ్యవస్థలోని కొందరు వ్యక్తుల చేతుల్లో, సామ్యవాద వ్యవస్థలోని కొందరు 'పెద్దల' జేబుల్లో సమిష్టిగా అయ్యే సంపద కేంద్రీకరణకు భిన్నంగా ఇక్కడ నిరంతరం ధన వికేంద్రీకరణ జరుగుతుందన్న హామీ కూడా ఉంది. ఈవిధంగా ఆర్థిక న్యాయం చేకూర్చుతామంటే ఏ మానవ అంతరంగం కాదంటుంది?

ఇస్లాంలోని ఆరాధనా శకటానికి రెండే రెండు చక్రాలు ఉన్నాయి. ఈ రెండిటిలో ఏ ఒక్క చక్రం విరిగిపోయినా మానవుని ఆరాధనా శకటం పరమాత్ముని సన్నిధికి చేరుకో జాలదు. ఆ రెండు చక్రాలలో ఒకటి- దేవుని హక్కులు, రెండు- దాసుల హక్కులు. ఈ రెండవ హక్కుకు సంబంధించినదే ఆర్థిక రంగం. దేవుని హక్కులలో ఏవైనా పొరపాట్లు జరిగితే దేవుడు క్షమిస్తాడన్న ఆశ ఉంటుంది. కాని దాసుల

(మానవుల) హక్కులలో జరిగే పొరపాట్లను (అంటే హక్కుల ఉల్లంఘనను) సంబంధిత దాసులు క్షమించనంతవరకూ దేవుడు కూడా వారిని క్షమించడు.

మీరు ఎంతో కష్టపడి సంపాదించిన లక్ష రూపాయల్ని ఎవరైనా మోసంచేసి కొల్లగొడితే మీరతడ్ని క్షమిస్తారా? మీలో ఏమైనా క్షమాగుణం ఉంటే ఎప్పుడు క్షమిస్తారు? కొల్లగొట్టిన ఆ సొమ్మును మీకు తిరిగిచ్చి క్షమాపణ కోరితే అప్పుడు క్షమిస్తారు. కాని లక్ష రూపాయలు సులభంగా కొల్లగొట్టినవాడు దాన్ని తిరిగిచ్చేవాడయితే అలా మోసానికే పాల్పడేవాడు కాదు. ఆర్థిక రంగంలో ప్రత్యక్ష పరోక్ష మోసాలను, దోపిడీలను అరికట్టే న్యాయవ్యవస్థే ఇస్లాం ప్రతిపాదిస్తున్న "ధనవికేంద్రీకరణ" విధానం.

నేనీ పుస్తకంలో ఆర్థిక నేరస్థులకు విధించే శిక్షల్ని గురించి కాకుండా ధన వికేంద్రీకరణకు సంబంధించిన విషయాలను మాత్రమే ఎక్కువగా పేర్కొన్నాను. ఈ ధన వికేంద్రీకరణ ద్వారా ఇస్లాం సాధించదలచిన ఆర్థికన్యాయం ఎలాంటిదో, ఇంతకంటే మెరుగైన ఆర్థికన్యాయం మరేదైనా ఉందేమో అర్థశాస్త్ర నిపుణులే చెప్పాలి.

**అబుల్ ఇర్ఫాన్**
(రచయిత, హైదరాబాద్)

## రచనకు ఆధార గ్రంథాలు

(1) ఇస్లామీ ఫిఖ్హా (ఉర్దూ)...................మౌలానా ముజిబుల్లా నద్వి
(2) ఆసాన్ ఫిఖ్హా (ఉర్దూ)....................మౌలానా యూసుఫ్ ఇస్లాహి
(3) జదీద్ ఫిఖ్కీ మసాయెల్.................మౌలానా ఖాలిద్ సైపుల్లా రహ్మాని
(4) జదీద్ మాషీనత్రియాత్, (5) సూద్..మౌలానా అబుల్ఆలా మౌదూది
(5) సూద్...............................................మౌలానా అబుల్ఆలా మౌదూది
(6) రసాయెల్ వ మసాయెల్...............మౌలానా అబుల్ఆలా మౌదూది
(7) మస్లా మిల్కియత్ జమీన్..............మౌలానా అబుల్ఆలా మౌదూది
(8) ఇస్లాంకా మాషీ నిజాం....................డాక్టర్ ఇస్రార్ అహ్మద్
(9) షేర్స్ బాజార్ మె సర్మాయాకారి......డాక్టర్ అబ్దుల్ అజీం ఇస్లాహి
(10) హవాల ఔర్ బాజార్ సియాసత్....డాక్టర్ ఫజలుర్రహ్మాన్ ఫరీది
(11) స్టాక్ మార్కెట్...............................డాక్టర్ కిరణ్ కుమార్
(12) ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్)..........జాన్ మెడలె
(13) దావత్, త్రైదిన ఉర్దూ పత్రిక..........న్యూఢిల్లీ
(14) మిష్కాత్ షరీఫ్ (ఉర్దూ)................హకీమ్ మిస్బాహుద్దీన్ మర్దాని
(15) తక్సీమ్ఖుల్ వారిసీన్ వఖరాబతుల్ ముస్తహఖీన్...మౌలానా ముహమ్మద్ యూసుఫ్



కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# ధన వికేంద్రీకరణ

డబ్బు! డబ్బు!! డబ్బు!!! డబ్బు సంపాదించాలి....బాగా సంపాదించాలి....ఇంకా సంపాదించాలి....

వెండిబంగారాలు పోగుచేయాలి! వజ్రవైఢూర్యాలు కూడబెట్టాలి!! బహుళ అంతస్తు భవనాలు కట్టుకోవాలి....వాణిజ్య సముదాయాలు నిర్మించుకోవాలి.....కోట్లకు పడగ లెత్తాలి....కోటీశ్వరుడే కోరుకున్నది సంపాదించగలడు....కలిమిగలవాడే కలియుగ వీరుడు....సిరిగలవాడిదే సమస్తం సొంతం....సంపదే సర్వావసరాలు తీర్చగలిగే సాధనం.... కనుక వీలయినంత ఎక్కువ ధనం సంపాదించాలి.....ధనార్జనే ధ్యేయంగా పెట్టుకోవాలి..... సాధ్యమయినంత డబ్బు కూడబెట్టాలి.... బ్యాంకు బ్యాలెన్సులు పెంచుకోవాలి......

కాబట్టి ఏ విధంగానైనా డబ్బు సంపాదించాలి....నాలుగు చేతులా సంపాదించాలి... నీతిని గోతిలో పూడ్చయినా సంపాదించాలి....పేదోళ్ళ పొట్టలు కొట్టయినా సరే....ఎలాగైనా సిరిసంపదలతో తులతూగాలి....అర్థబలమే అన్నిటికీ మూలమంత్రం ....అర్థబలంతోనే అంగబలం వస్తుంది.....అర్థబలంతో అందలం కూడా ఎక్కవచ్చు....

దాహం! దాహం!! దాహం!!! ఈ ధనదాహం తీరిదెలా....?

ఇలా............

"ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించాలన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచిక సంపదే ప్రగతికి చిహ్నమని అనుకుంటున్నారు కాబోలు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంత మాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది." (ఖుర్ఆన్. 102:1-4)

"ఎంతమాత్రం కాదు. విశ్వసనీయ జ్ఞానంతో మీరు విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పకుండా నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీ కళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదల్ని గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (ఖుర్ఆన్. 102:5-8)

దైవాన్ని, పరలోకచింతనను విస్మరించి ప్రాపంచిక వ్యామోహపరుడయి పోయిన మనిషి తన సుఖసంతోషాల కోసం వీలైతే ఎన్ని అడ్డదారులైనా తొక్కి డబ్బు సంపాదిస్తాడు. అన్యాయం, అవినీతి, అక్రమాల ద్వారా కోట్లు సంపాదిస్తాడు. విలాసాల కోసం వాటిని విచ్చలవిడిగా ఖర్చుపెడ్తాడు.

కాని అతను ప్రపంచంలో ప్రభుత్వం కళ్ళు గప్పగలడు గాని, విశ్వప్రభువు కళ్ళు గప్పలేడు. అతను సంపాదించిన జీవితావసరాలు, ధన కనక వస్తువుల్ని గురించి పరలోక న్యాయస్థానంలో కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది. సిరిసంపదలు, ఇతర జీవితావసరాలు ఎంతెక్కువగా ఉంటే విచారణ అంత సుదీర్ఘకాలం సాగుతుంది. అతని అక్రమ సంపాదన, ధన దుర్వినియోగాలు రుజువైన తరువాత దైవదూతలు అతడ్ని నరకంలోకి నెట్టివేస్తారు.

# 1. తనివి తీరని ధనపిపాస

మానవుని ధనపిపాస తనివి తీరని విషయం. అతని అత్యాశకు హద్దుల్లేవు. తాను కోటీశ్వరుడయి పోవడమే గాకుండా తన కొడుకులు, కూతుళ్ళు, ఆపై తన మనవళ్ళు, మనవరాళ్ళు కూడా కోటీశ్వరులయి పోవాలని కోరుకుంటాడు. తర్వాత ఆ సిరిసంపదల భద్రత కోసం గూండాలను పోషిస్తాడు. ప్రభుత్వాధికారులకు లంచాలు ఇస్తాడు. వాటి వల్ల కూడా పూర్తి భద్రత లభించకపోతే ఎన్నికల బరిలోకి దిగి రాజకీయ రక్షణకవచం సంపాదిస్తాడు. వీటన్నిటికి పెట్టిన ఖర్చులు వడ్డీతో సహా రాబట్టడానికి రాజకీయ ముసుగులో పెద్ద పెద్ద కుంభకోణాలకు సైతం పాల్పడతాడు.

అయితే అప్పటికీ మానవుని ధనపిపాస తీరదు; అతని కడుపుమంట చల్లారదు; అతనికి ఆత్మసంతృప్తి లభించదు. మరెలా.....?

ఈ ప్రశ్నకు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా సమాధానమిచ్చారు:

"మానవునికి సిరిసంపదలతో (లేక బంగారంతో) నిండిన ఓ పెద్ద లోయ లభించినప్పటికీ, అలాంటి మరో లోయ దొరికితే బాగుంటుందని భావిస్తాడు. అతని పేరాశ కడుపు (సమాధి)మట్టితో మాత్రమే నిండుతుంది. అయితే ప్రాపంచిక వ్యామోహం వదలి పశ్చాత్తాప హృదయంతో దేవుని వైపుకు మరలితే అలాంటి మనిషిని దేవుడు మన్నిస్తాడు. అతని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు. (అతనికి ఆత్మసంతృప్తి భాగ్యం ప్రసాదిస్తాడు.)"

"అత్యధిక సిరిసంపదలతో కలిమి రాదు. నిజమైన కలిమి ఆత్మసంతృప్తి వల్లనే ఒనగూడుతుంది." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) ఓసారి మాతో ముచ్చటిస్తూ "మీ విషయంలో నాకు భూశుభాలను గురించి భయంగా ఉంది" అని అన్నారు. అప్పుడు ఒకతను "భూశుభాలు అంటే ఏమిటీ దైవప్రవక్తా!" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "భూశుభాలు అంటే ప్రాపంచిక సిరిసంపదలు" అని చెప్పారు. అప్పుడు మరొకతను "మంచి నుండి కూడా చెడు పుడ్తుందా?" అని ప్రశ్నించాడు.



దైవప్రవక్త (స) ఈమాట విని మౌనంగా ఉండిపోయారు. అలా చాలా సేపు ఉన్నారు. దాంతో మేము దైవప్రవక్త (స)పై దివ్యావిష్కృతి (వహీ) అవతరిస్తోందని భావించాము. కాస్సేపటికి దైవప్రవక్త (స) నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటూ "ప్రశ్న అడిగిన మనిషి ఎక్కడున్నాడు?" అని అడిగారు. అప్పుడా వ్యక్తి "నేను ఇక్కడే ఉన్నానండీ!" అన్నాడు... అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"మంచి విషయం వల్ల ఎప్పుడూ మంచే జరుగుతుంది. అయితే ఈ ప్రాపంచిక సంపద (పైకి) తళుకు బెళుకులతో నవనవలాడుతూ, రుచిలో ఎంతో మధురంగా ఉంటుంది. వర్షాకాలంలో ఏపుగా పెరిగి నయనానందకరంగా ఉండే పచ్చికను గనక పశువు మితిమీరి మేస్తే (అజీర్తితో) దాని పొట్ట ఉబ్బిపోతుంది. దాంతో అది చావనయినా చస్తుంది. లేదా చావు దరిదాపుల్లకైనా చేరుతుంది. అలాగాక ఆ పశువు కాస్త మితంగా పచ్చిక మేసి, కడుపు నిండగానే ఎండలోకెళ్ళి నిలబడి నెమరువేసి, మలమూత్ర విసర్జన తరువాత తిరిగొచ్చి మేస్తుంటే బాగుంటుంది. (నష్టమేమీ ఉండదు.) ఈ ప్రాపంచిక ఐశ్వర్యం కూడా అలాంటిదే. ఇది పైకి ఎంతో ఆకర్ష వంతంగా, రుచిలో మధురంగా ఉంటుంది. అందువల్ల దీన్ని (అవసరమైనంత మేరకు) ధర్మయుక్తంగా సంపాదించి ధర్మయుక్తంగా వినియోగించాలి. అప్పుడే అది మనిషికి సత్ఫలమిస్తుంది. దానికి బదులు అధర్మంగా, అక్రమంగా తనకు లభించ వలసినదాని కంటే ఎక్కువ సంపాదించి తినేవాడు, ఎంతతిన్నా కడుపు నిండనివాడితో సమానుడవుతాడు." (బుఖారి, ముస్లిం)

ధన దాహం, ప్రాపంచిక వ్యామోహం ఎంతటి ప్రమాదకరమైన విషయాలో మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచించిన ఈ క్రింది మహితోక్తులు చూడండి:

"ఐశ్వర్య పూజారి (ధన పిపాసి) శపించబడ్డాడు." (తిర్మిజి)

"ఆకలిగొన్న రెండు తోడేళ్ళను మేకలమందలోకి వదిలితే ఆ తోడేళ్ళు మేకలను ఎంత నష్టపరుస్తాయో, మనిషిలోని ధనపిపాస అతని ధర్మాన్ని అంతకంటే ఎక్కువ నష్టపరుస్తుంది." (తిర్మిజి, దార్మి)

"రెండు విషయాల్లో వృద్ధుని హృదయం కూడా యువ హృదయమైపోతుంది. ఒకటి, ప్రాపంచిక వ్యామోహం. రెండు, సుదీర్ఘకాలం బ్రతకాలన్న కోరిక." (బుఖారి)

"మానవుడు ఒకవైపు వృద్ధుడయిపోతుంటే, మరోవైపు అతనిలో రెండు విషయాలు అధికమవుతుంటాయి. (1) ధనవ్యామోహం, (2) దీర్ఘాయువు పట్ల కోరిక." (ముస్లిం)

సిరిసంపదల పట్ల మనిషికి ఇంతటి వ్యామోహం, అత్యాశలు ఉండటానికి ముఖ్య కారణం స్వార్థం, స్వప్రయోజనాలే. ఖుర్ఆన్ మూడువేల సంవత్సరాల క్రితం నాటి ఓ సంఘటనను ఈవిధంగా పేర్కొంటున్నది:

## 2. ఖారూన్ పర్యవసానం

“ఖారూన్ అనేవాడు మూసా (ప్రవక్త) జాతికి చెందినవాడు. అయితే అతను తన జాతికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ విద్రోహిగా మారాడు. మేమతనికి అపార సిరిసంపదలు, నిక్షేపాలు ప్రసాదించాము. వాటికి సంబంధించిన తాళపు చెవుల్ని బలిష్ఠులైన కొందరు వ్యక్తుల సమూహం అతికష్టం మీద పైకెత్త గలుగుతుంది.”

“ఓసారి అతని జాతిప్రజలు అతనికిలా హితోపదేశం చేశారు: ‘మిడిసిపడకు. మిడిసిపడేవారిని దేవుడు ప్రేమించడు. దేవుడు నీకు ప్రసాదించిన ఐశ్వర్యంతో పరలోక గృహం నిర్మించుకోవడానికి ప్రయత్నించు. ప్రపంచం నుండి కూడా నీ భాగాన్ని (పరలోకానికి తీసికెళ్ళడం) మరచిపోకు. దేవుడు నీకు మేలు చేసినట్లు నీవు కూడా (ఇతరులకు) మేలు చెయ్యి. ధరణిలో కలహాలు, సృష్టించకు. దేవుడు కలహకారుల్ని ప్రేమించడు”. (ఖుర్ఆన్–28:76,77)

ఈ మాటలు విని అతడు (మరింత నీల్గుతూ) “ఇదంతా నాకు నా జ్ఞానం, తెలివి తేటల వల్ల లభించింది” అన్నాడు. దేవుడు పూర్వం ఇతనికంటే ఎక్కువ శక్తిసామర్థ్యాలు, మందీమార్బలం కలవారిని నాశనం చేశాడు. ఈ సంగతి అతనికి తెలియదా? పాపాత్ములను వారి పాపాలను గురించి అడగటం జరగదు (నిజాన్ని ఒప్పుకోరు గనక).” (28:78)

“ఓరోజు అతను పూర్తి ఠీవి, దర్పాలతో తనజాతి ప్రజల ముందుకు వచ్చాడు. అప్పుడు ప్రాపంచిక వ్యామోహపరులు కొందరు అతడ్ని చూసి ‘ఖారూన్‌కు లభించిన సిరి సంపదలు మనకూ లభించివుంటే బావుండు! ఖారూన్ ఎంతో అదృష్టవంతుడు’ అన్నారు. అయితే (దైవిక)జ్ఞానం కలవారు (వారి ఆలోచనా ధోరణిని విమర్శిస్తూ) ‘మీ వైఖరి చాలా విచారకరం. విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి దేవుని (దగ్గరున్న) ప్రతిఫలం ఎంతో శ్రేష్ఠమైనది. సహనం వహించేవారికే ఈ మహాభాగ్యం లభిస్తుంది’ అన్నారు.” (28:79,80)

“చివరికి మేము ఖారూన్‌ని, అతని ఇంటిని (హఠాత్తుగా) భూమిలోకి దిగబడి పోయేలా చేశాము. అప్పుడు దేవునికి వ్యతిరేకంగా అతడ్ని ఆదుకునే వారెవరూ లేకపోయారు. అతను కూడా తనను తాను కాపాడుకోలేక పోయాడు.” (28:81)

“నిన్నటిరోజు అతని హోదా అంతస్తులు చూసి అలాంటివి తమకు కూడా కావాలని కోరుకున్నవారు ఇప్పుడు విచారం వెలిబుచ్చుతూ ఇలా అన్నారు: ‘మనం ఒక విషయం మరచిపోయాం. దేవుడు ఎవరికి పుష్కలంగా ఉపాధి ఇవ్వదలచుకుంటాడో వారికి మాత్రమే పుష్కలంగా ఉపాధి లభిస్తుంది. ఆయన మరెవరికి పరిమితంగా ఉపాధి ఇవ్వాలని భావిస్తాడో వారికి పరిమితంగానే లభిస్తుంది. దేవుడు మనల్ని అనుగ్రహించి ఉండకపోతే ఆయన మనల్ని కూడా భూమిలోకి అణగద్రొక్కేవాడు. అయ్యో! అవిశ్వాసులు సాఫల్యం చెందరన్న సంగతి (అప్పుడు) మనకు కొంచెం కూడా గుర్తుకు రాలేదే!” (28:82)



‘ధనమూలమిదం జగత్తు’ అనుకున్నాడు ఖారూన్. అందుకే అతను మంచి-చెడు, ధర్మం-అధర్మం, అనే విచక్షణ ఎంతమాత్రం చేయకుండా పెద్దఎత్తున వెండి-బంగారా లు, వజ్ర-వైఢూర్యాలు, ఇతర అనేక విలువైన వస్తువుల్ని పోగుచేసి వేలాది ఇనుప పెట్టెలలో దాచి, ఇక ప్రపంచంలో ఫిరౌన్‌రాజు తరువాత తన కంటే గొప్పవాడు లేడని మీసం మెలేశాడు. బహుశా అతను నేటి మైక్రోసాఫ్ట్ కంపెనీ అధిపతి బిల్‌గేట్స్ కంటే కూడా పెద్ద ధనికుడై ఉండవచ్చు. అసలతను సిరిసంపదలు దాచిన పెట్టెలు, బీరువా లకు సంబంధించి తాళపు చెవులే ఎన్ని ఉన్నాయో చూడండి! ఆ తాళపు చెవుల గుచ్చను మోయడానికే సుమారు పది పన్నెండు మంది మనుషులు కావలసి వుండేదట!!

కాని అంతటి ధనం కూడా ఈ దౌర్భాగ్యుడ్ని కాపాడలేక పోయింది. అతను ఓ రోజు హఠాత్తుగా తన సిరిసంపదలతో సహా నేలలోకి శాశ్వతంగా దిగబడి పోయాడు పాపం!. అయితే ఈనాడు కొందరు ఈ చారిత్రక సంఘటన నుండి గుణపాఠం నేర్చుకోవడానికి బదులు, పురావస్తు పరిశోధన పేరుతో భూమిలో లోతుగా దిగబడి పోయిన ఆ ధనరాసుల్ని వెలికితీయడానికి ప్రయత్నిస్తున్నారట!

## 3. పరిధుల్లేని ప్రాపంచిక వ్యామోహం

ధనికులు సాధారణంగా ధనవ్యామోహంలో కూరుకుపోయి ఉండటం వల్ల వారు దైవాన్ని ప్రార్థించినా ప్రాపంచిక సంపదలు ప్రసాదించమనే ప్రార్థిస్తారు. దీనికి భిన్నంగా పరలోక జవాబుదారీ భావన కలిగిన ఏకదైవారాధకులు క్షణభంగురంలాంటి ప్రాపంచిక సంపద కంటే పరలోక సంపదకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఈ రెండు విషయాలను దివ్యఖుర్ఆన్ ఈవిధంగా చిత్రించింది:

“కొందరు దేవుడ్ని ప్రార్థిస్తూ ‘ ప్రభూ! మాకు (నీవు ప్రసాదించేవన్నీ) ఇహలోకంలోనే ప్రసాదించు’ అంటారు. అలాంటివారికి (ఇహలోకంలోనే తప్ప) పరలోక(స్వర్గ)ంలో ఎలాంటి వాటా లభించదు.” (2:199,200)

“మరి కొందరున్నారు. వారు ‘ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరక యాతనల నుండి రక్షించు’ అని వేడుకుంటారు. ఇలాంటివారికి వారి సంపాదనను బట్టి ఉభయలోకాల్లోనూ తగిన వాటా (ప్రతిఫలం) లభిస్తుంది. దేవుడు త్వరలోనే (కర్మలను గురించి) లెక్క తీసుకుంటాడు.” (2:201,202)

ఈ కారణంగానే అవిశ్వాసులకు దేవుడు విశ్వాసుల కన్నా ఎక్కువ సిరిసంపదలు ప్రసాదిస్తున్నాడు. దేవుడు తలచుకుంటే ఆయన విశ్వాసులకు తాము కోరినదాని కంటే ఎక్కువ ఇవ్వగలడు. కాని ఇహలోకజీవితంలో ఈ భోగభాగ్యాలు పైపై మెరుగులు, మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. అసలు భోగభాగ్యాలు, శాశ్వత సౌఖ్యాలు పరలోకంలోనే ప్రాప్తమవుతాయి.

"మానవులంతా ఒకే వరవడిలో కొట్టుకుపోతారన్న భయం లేకపోతే మేము కరుణామయుడైన దేవుణ్ని తిరస్కరించేవారి ఇండ్ల కప్పులను, వారు మేడల పైకి ఎక్కే మెట్లను, వారి తలుపుల్ని, వారు దిండ్లకానుకొని కూర్చునే పీఠాలను, అన్నిటినీ వెండి బంగారాలతో చేసేసేవారం. కాని ఇది (మూన్నాళ్ళ ముచ్చటైన) ప్రాపంచికజీవిత సంపద మాత్రమే. (పరలోకసంపద ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది.) నీ ప్రభువు దగ్గర భయభక్తులుకలవారికే పరలోక సంపద ప్రాప్తమవుతుంది." (43:33-35)

ప్రాపంచిక సిరిసంపదల పట్ల ఉండే ఆకర్షణ వల్ల మానవులంతా ప్రపంచ పూజారులైపోయి పరలోకచింతన పూర్తిగా మరచిపోతారని, అలా జరిగే ప్రమాదం గనక లేకపోతే అవిశ్వాసుల్ని దేవుడు వెండిబంగారాలతో తులతూగేలా చేస్తాడని పైసూక్తి అర్థం. అయితే దేవుని దృష్టిలో ఐహిక జీవితానికి వీసమెత్తయినా విలువలేదని ఈ క్రింది హదీసు కూడా స్పష్టం చేస్తోంది:

"దేవుని దృష్టిలో ప్రపంచం విలువ దోమరెక్కంత ఉన్నా, ఆయన ఈ ప్రపంచంలో సత్యతిరస్కారులకు త్రాగడానికి గుక్కెడునీళ్ళు కూడా ప్రసాదించేవాడు కాదు". (బుఖారి)

ధనదాహోర్తులు, ప్రాపంచిక వ్యామోహపరుల్ని హెచ్చరిస్తూ సృష్టికర్త ఖుర్‌ఆన్‌లో అవతరింపజేసిన ఈ సూక్తులు చూడండి:

"కేవలం ప్రాపంచిక జీవితాన్ని, దాని తళుకు బెళుకుల్ని కోరుకునే వారికి వారి కర్మ ఫలాన్ని పూర్తిగా ఇక్కడే ఇచ్చివేస్తాము. అందులో వారికి ఎలాంటి కొరత చేయము. అయితే పరలోకంలో అలాంటి వారికి నరకాగ్ని తప్ప మరేమీ ఉండదు. వారు ప్రపంచంలో సమ కూర్చుకున్నదంతా నిరర్థకమయి పోయింది; వారు చేసినదంతా మిధ్యే (అని అప్పుడు తెలుస్తుంది వారికి)." (11:15,16)

ఇహపరలోకాల స్థితిగతుల్ని పోల్చుతూ దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన ఈ హితోక్తి కూడా ఎంతో గమనార్హమైనది:

"తన ప్రపంచాన్ని బాగుపరచుకోవడంలోనే మునిగిపోయేవాడు తన పరలోకాన్ని నష్టపరచుకుంటాడు. అదేవిధంగా తన పరలోకాన్ని బాగుపరచుకునేవాడు తన ఇహ లోకాన్ని నష్టపరచుకుంటాడు. కనుక మీరు శాశ్వతంగా ఉండే విషయాలను అవలంబిం చండి. త్వరలో అంతమయ్యే అశాశ్వతమైన విషయాలను అవలంబించకండి." (బైహఖీ.)

'పరలోకం సంగతి పరమాత్మునికి వదిలెయ్యి, ప్రపంచమే మనకిప్పుడు సర్వస్వం' అని సిద్ధాంతకరించుకున్నవారికి అడుగడుగునా, అనుక్షణం స్వార్థం, స్వప్రయోజనాలే కళ్ళ ముందు తిరుగుతుంటాయి. వ్యక్తులైనా, జాతులైనా, ఆనాడయినా, ఈనాడయినా స్వార్థపరత్వమే వారి జీవిత పరమార్థం. భూస్వాములు,



జాగీరుదారుల భూస్వామ్య వ్యవస్థయినా; వర్తకులు, ధనికులు కనిపెట్టిన బూర్జువా సూత్రాలైనా; పెట్టుబడిదారీ విధానాలైనా; వాటి బూజు దులిపేసి ప్రత్యక్షమైన సోషలిజం, సామ్యవాదాలయినా సరే వాటన్నిటికీ ప్రేరకాలు స్వార్థం, స్వప్రయోజనాలే. వారి థీసిస్, సింథసిస్‌ల ప్రధాన లక్ష్యం స్వప్రయోజనాలే. క్రీ.శ. అయిదవ శతాబ్దంలో పాశ్చాత్య రోమన్ సామ్రాజ్యం పతనమైపోయిన తరువాత ఉనికిలోకి వచ్చిన "భూస్వామ్య వ్యవస్థ" (Feudal System) గురించే ముందుగా చర్చిద్దాం.

## 4. భూస్వామ్య, బూర్జువా వర్గాలు

ఆనాడు శక్తిమంతమయిన ఐరోపా సామ్రాజ్యం ముక్కచెక్కలయి ఏర్పడిన చిన్నచిన్న భూభాగాలకు భూస్వాములే పాలకులయ్యారు. భూములు కలవారంతా పాలకులుగా, భూములు లేనివారు పాలితులుగా (మరోమాటలో బానిసలుగా) మారారు. ఈ భూస్వామ్య వ్యవస్థలో రూపుదిద్దుకున్న సమాజం ఒక నిచ్చెనగా, బహుళ అంతస్తుల మేడగా తయారయింది. ఇందులోని ప్రతి మెట్టుపై లేదా ప్రతి అంతస్తుపై ఉన్నవాడు తన క్రిందిమెట్టు లేక అంతస్తు వానికి దేవునిగా, పైఅంతస్తు వానికి దాసుడిగా అయ్యాడు.

ఆ కాలంలోనే దేవుని పేరు చెప్పి ప్రజలపై పెత్తనం చెలాయించడానికి ఆవిర్భ వించిన క్రైస్తవ చర్చీ వ్యవస్థ భూస్వాముల అధికారాన్ని ఎదిరించలేక వారి భూస్వామ్య వ్యవస్థతో రాజీపడిపోయింది. తత్ఫలితంగా చర్చీ భూస్వాముల అభిమతాలకు అను గుణంగా మత నియమాలు, కట్టుబాటులు రూపొందించి సమాజంలో అధికులు, అధములు అనే వివక్షలు, అసమానతలకు మరింత ఊపిరి పోసింది. అయితే భూస్వా ములు పెత్తనం వహిస్తున్న ఈ చిన్న రాజ్యాలకు వాటి సరిహద్దుల వెలుపల బాహ్య ప్రపంచంలో సంభవిస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యవహరించే కేంద్రీయ అధికారం లేకపోయింది. ఈ స్తబ్దత 13వ శతాబ్దాంతం వరకు కొనసాగింది.

ఆ తరువాత 14వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకు స్పెయిన్, సిసిలీలపై ముస్లింల ఆధిపత్యం, క్రైస్తవ మతయుద్ధాలు (Crusades), పాశ్చాత్యులపై ముస్లింల నాగరికతా సంస్కృతుల ప్రభావం, భౌతిక వైద్య గణిత సాంకేతిక శాస్త్రాల వికాసం, వ్యవసాయ వాణిజ్య రంగాల ప్రగతి మొదలైన వ్యవహారాలు కొనసాగాయి. దాంతో ఐరోపా ప్రజల, ముఖ్యంగా విద్యావంతుల ఆలోచనా ధోరణిలో కూడా మార్పు వచ్చింది. ఈ మార్పు యావత్తు ఐరోపాలో పునరుజ్జీవనోద్యమానికి నాంది పలికి సంస్కరణల పర్వానికి తలుపులు తెరిచింది. నూతనకళలు, సాంకేతికశాస్త్రం, ఎగుమతి-దిగుమతుల వ్యాపారాలు, విదేశాలతో రాకపోకల సంబంధాలకు పట్టణాలే పట్టుకొమ్మలై పోయాయి. దాని వల్ల గ్రామాల ప్రాముఖ్యం తగ్గిపోయి పట్టణాల ప్రాముఖ్యం పెరిగింది.

ఈ నూతన పరిణామాలకు, పునరుజ్జీవనోద్యమానికి నాయకత్వం వహించిన ధనికులు, బడావ్యాపారులు, పెట్టుబడిదారులు, వృత్తిపనులవాళ్ళు "బూర్జువా" వర్గంగా ఏర్పడి ఆర్థిక, సామాజిక రంగాల్లో జాగీర్‌దారుల ఆధిపత్యాన్ని; భూస్వామ్య వ్యవస్థలోని వివక్షత, నిమ్నోన్నతలను ఎదిరించడం ప్రారంభించారు. దాంతో కొద్ది కాలంలోనే జాగీర్‌దారుల పెత్తనం, భూస్వామ్య వ్యవస్థ పతనమై పెద్దపెద్ద జాతీయ రాజ్యాలు రూపొందాయి. భూస్వామ్య వ్యవస్థలో జాగీర్‌దార్ల పెత్తనం క్రింద అణిగి ఉంటూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా మతాజ్ఞలు జారీ చేస్తుండిన చర్చీవ్యవస్థ తన ధోరణి మార్చుకొని కొత్తగా ఏర్పడిన జాతీయరాజ్యాల అధికార నీడలో ఆశ్రయం పొందింది.

చర్చికి, జాగీర్‌దార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా బూర్జువా వర్గం సాగించిన పోరాటానికి (Liberalism) "ఉదారవాదం లేక విశాలదృక్పథం" ప్రాతిపదికయి పోయింది. జీవితం లోని ఏరంగం అయినా ఈ ఉదారవాదం వల్లనే ప్రగతి సాధ్యమవుతుందని బూర్జువా వర్గంవారు ప్రజలను నమ్మించడానికి విస్తృత ప్రచారం చేశారు. అంతేకాకుండా వారు ప్రగతిశీల మనిషి మార్గంలో ఎదురయ్యే సమస్త ప్రతిబంధకాలు, అవాంతరాలు, సంకుచితతత్వాలను తొలగించడానికి కూడా ఎంతగానో ప్రయత్నించారు.

ఈ సంఘర్షణలో చర్చి కలిసిన భూస్వామ్య (Feudal) వ్యవస్థ భావాలు ఒక అతివాదానికి గురయితే ఈ బూర్జువా మేధావుల ఉదారవాద వైఖరి మరో అతివాదా నికి గురయిపోయింది. కాని న్యాయం, ధర్మం, నీతి, నిజాయితీలకు సంబంధించిన ఆలోచనా వైఖరి ఈ రెండిటిలో ఏ వర్గంలో కూడా కానరాదు. ఉభయవర్గాల భావ జాలాలకు మూల ప్రేరకాలు స్వార్థం, స్వప్రయోజనాలే.

బూర్జువా వర్గీయుల పునరుజ్జీవనోద్యమం, ఉదారవాదాలు సాగిన రోజుల్లోనే మెకియావేలి అనే మేధావి రాజకీయ ప్రయోజనాల విషయంలో నైతిక సూత్రాలు పాటించే అవసరం ఎంతమాత్రం లేదనే సిద్ధాంతాన్ని బాహాటంగా సమర్థించాడు. ఆ కాలంలోనే చర్చి, భూస్వామ్య వ్యవస్థల స్థానంలో జాతుల ఘర్షణలు, వైషమ్యాలకు దారితీసే జాతీయత, జాతీయరాజ్యం, జాత్యహంకారం అనే విగ్రహాలు రూపుదిద్దు కున్నాయి. ఆ కాలంలోనే మొట్టమొదటి సారిగా వడ్డీ సక్రమమైనది, ధర్మబద్ధమైనది, ఆమోదయోగ్యమైనది అనే భావనకు అంకురార్పణ జరిగింది.

## 5. పారిశ్రామిక విప్లవంలో ఉదారవాదుల పాత్ర

18వ శతాబ్దంలో "యంత్రం" ఆవిష్కరణ ద్వారా బూర్జువా ఉదారవాదుల పునరు జ్జీవనోద్యమం మరింత తీవ్రమయిపోయింది. కొత్త శాస్త్రీయ పరిజ్ఞానంతో సరికొత్త ఆవిష్కరణలతో పరిశ్రమల్లో, వృత్తిపనుల్లో, వ్యవసాయంలో, రవాణాసౌకర్యాల్లో వృద్ధి వికాసాలు జరిగాయి. పట్టణాల్లో పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు, వాణిజ్యకేంద్రాలు వెలిశాయి. పెద్ద ఎత్తున సామగ్రి తయారవడం, ప్రపంచ నలుమూలల్లో తయారయ్యే



సామగ్రి అమ్ముడవడం ప్రారంభమయింది.

అయితే పెట్టుబడి, విద్యాజ్ఞానాలు, సాంకేతికనైపుణ్యం, కార్యనిర్వాహక సామర్థ్యం బూర్జువావర్గం చేతుల్లోనే ఉండటం వల్ల పారిశ్రామిక విప్లవం ద్వారా చేకూరిన అభివృద్ధి ఫలాలు ఆ వర్గంవారికే దక్కాయి. దాంతో పల్లెల్లో నివసించే వృత్తి పనులవాళ్ళు, చిన్న చిన్న పెట్టుబడులతో వ్యాపారం చేసేవాళ్ళు పెద్దపెద్ద ఫ్యాక్టరీల యజమానుల దగ్గర కూలీలుగా, బడావ్యాపారుల దగ్గర ఉద్యోగులుగా పని చేయవలసిన పరిస్థితి వచ్చింది.

భారీపరిశ్రమలతో, వ్యాపారాభివృద్ధితో బలిసిపోయిన బూర్జువా వర్గం తన ఉదార వాదం (Liberalism) ఆయుధానికి మరింత పదునుపెట్టి తీవ్రంగా విజృంభించింది. చర్చి అయినా, ప్రభుత్వమైనా, సామాజిక వ్యవస్థయినా, మరెవరైనా సరే వ్యక్తి చేసే ప్రగతి యత్నాలను, స్వలాభార్జనా కృషిని నిరోధించే హక్కు లేదని; ఏ రంగంలోనైనా ప్రతి మనిషికీ స్వేచ్ఛగా తన శక్తిసామర్థ్యాలను తన అభిరుచులకు అనుగుణంగా వినియోగించు కోవడానికి, సాధ్యమైన మేరకు పురోగమించడానికి అవకాశం లభించాలని; ప్రతి మనిషికీ సంపూర్ణ స్వేచ్ఛనివ్వడం ద్వారానే దేశ సమాజాల ప్రయోజనాలు కూడా సాధ్య మవుతాయని ఈ వర్గం నాయకులు ప్రచారం చేయడం మొదలెట్టారు.

అంతేకాదు, బూర్జువా వర్గం తన భారీపరిశ్రమలు, పెట్టుబడుల బలుపుతో పాలకులను, రాజకీయ నాయకుల్ని సైతం శాసించే స్థాయికి ఎదిగింది. ప్రభుత్వానికి పన్నులు చెల్లించేది ప్రజలే గనక వారి అభిమతాలకు అనుగుణంగానే ప్రభుత్వాలు ఏర్పడటంగాని, పడిపోవడంగాని జరగాలని; శాసననిర్మాణ హక్కు కూడా ప్రజలకే ఉండాలని ఈవర్గం గట్టిగా వాదించింది. అలాగే ఆర్థికరంగంలో వ్యక్తులు తమ అభిరుచులకు అనుగుణంగా సాగించే ప్రయత్నాలకు, వారి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ప్రభుత్వం ఎలాంటి అవరోధాలు సృష్టించడంగాని, జోక్యం కలిగించుకోవడంగాని చేయకూడదని కూడా ఈవర్గం డిమాండ్ చేసింది. స్వేచ్ఛావిపణి (Free Enterprise)కి సంబంధించిన ఈ డిమాండే ఆధునిక పెట్టుబడిదారీ విధానానికి మూలసూత్రమయి పోయింది.

పునరుజ్జీవన కాలంలోని ఉదారవైఖరి మాదిరిగానే పారిశ్రామికవిప్లవ కాలంలోని ఉదారవైఖరి కూడా కొన్ని యదార్థాల ఆధారంగా రూపొంది, అవే దాని విజయానికి కారణభూతాలయ్యాయి. అయితే ఈ యదార్థాలతో పాటు బూర్జువా వర్గంలో రెండు బలహీనతలు కూడా చోటుచేసుకున్నాయి. అవే స్వార్థపరత్వం, తీవ్రవాదం. వారు తమకు ఏ హక్కులు కావాలని డిమాండుచేశారో వాటిని స్వయంగా తమ దగ్గర పనిచేసే కార్మికులకు, ఉద్యోగులకు, నిరుపేదలకు ఇవ్వడానికి సంసిద్ధం కాలేక పోయేవారు.

# 6. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ

సంపాదనా మార్గంలో హద్దుమీరిన స్వేచ్ఛతో కూడిన "ఉదారవాదం" సిద్ధాంతం ఆధారంగా రూపొందిన ఆర్థిక వ్యవస్థనే "ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ" (Modern Capitalism) అంటారు. ఇల్లు, వాహనం, బట్టలు, ఫర్నీచర్, వంటపాత్రలు, పెంపుడు పశువులు మొదలైన నిత్యావసరాలతో పాటు యంత్రాలు, పనిముట్లు, భూములు, ముడిపదార్థాలు వగైరా వస్తువుల్ని కూడా ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ మనిషి వ్యక్తిగత ఆస్తులుగా పరిగణిస్తుంది. ఈ వ్యవస్థ ప్రకారం వీటన్నిటిపై మనిషికి యాజమాన్యపు హక్కులతో సహా వాటిని అమ్ముకోవడానికి, వృద్ధిచేసుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉండాలి.

పెట్టుబడిదారులు తమ వ్యాపారాభివృద్ధి కోసం అనేక సూత్రాలు కనిపెట్టారు. ఓపెన్ మార్కెట్‌లో ఉత్పత్తిదారుల మధ్య పోటీ పెరుగుతుందని, తద్వారా ఉత్పాదక వస్తువుల నాణ్యత కూడా పెరిగి ధరల్లో దానంతటదే ఒక సముచిత ప్రామాణికత నెలకొంటుందని, అలాగే సామర్థ్యం కల కార్మికులకు వారి పనితనాన్ని బట్టి అధిక వేతనాలు లభిస్తాయని ఈ వ్యవస్థ సమర్థకులు చెబుతారు.

కాని హద్దుమీరిన స్వార్థం, అవినీతులు వాటి మాటలు బూటకం అని నిరూపిస్తున్నాయి. లార్డ్ కేన్స్ అన్నట్లు "ప్రపంచంలో నైతిక, సహజ సిద్ధాంతాల ఆధిపత్యం అంత పటిష్ఠంగా లేదు. ఉంటే దాని ద్వారా వ్యక్తుల సొంత ప్రయోజనాలకు, సంఘం సామూహిక ప్రయోజనాలకు మధ్య సమన్వయం తప్పకుండా దానంతటదే కుదిరేది. ఆర్థిక సూత్రాల ద్వారా 'అభ్యుదయకరమైన స్వార్థం ఎల్లప్పుడూ సామూహిక శ్రేయం కోసమే కృషి చేస్తుంది' అని సూత్రీకరించడం ఏమాత్రం సరైన సూత్రీకరణ అన్పించుకోదు. అలాగే స్వార్థం ఎల్లప్పుడూ అభ్యుదయకరమైనదే అని చెప్పడం కూడా సరికాదు. స్వప్రయోజనాల కోసం కృషి చేసేవారు చాలా మూర్ఖంగా, బలహీనంగా వ్యవహరిస్తారు. ఒక్కొక్కసారి వారు తమ సొంత ప్రయోజనాలను సైతం నెరవేర్చుకోలేరు. అలాంటప్పుడు వారు సామూహిక ప్రయోజనాల కోసం ఎల్లప్పుడు తప్పకుండా సేవ చేస్తారన్న విషయం వట్టి బూటకం."

బూర్జువా పెట్టుబడిదారులు తమ స్వార్థం అభ్యుదయకరమయినది కాదని స్వయంగా తమ ఆచరణ ద్వారా నిరూపించుకున్నారు. పారిశ్రామిక విప్లవం వల్ల చేకూరే ప్రయోజనాలన్నీ తామే కాజేయాలన్న ఉద్దేశ్యంతో వారు పరస్పరం కుమ్మక్కయి కొను గోలుదారులైన ప్రజలు, వేతనానికి పనిచేసే కార్మికులు, శాంతియుత వాతావరణం సృష్టించే ప్రభుత్వం- ఈ మూడింటి ప్రయోజనాలకు వ్యతిరేకంగా కుట్రపన్నారు. చివరికి స్వేచ్ఛావిపణి (Free Enterprise)ని బాహాటంగా సమర్థించే ఆదామ్ స్మిత్ లాంటి మేధావి సైతం ఇలా వ్యాఖ్యానించవలసి వచ్చింది:



"వ్యాపారులు ఒక చోట కలవడం అంటూ జరిగితే వారి ఈ సమావేశం ప్రజలకు వ్యతిరేకంగా ఏదో కుట్ర పన్నకుండా, ధరల్ని పెంచే నిర్ణయం జరగకుండా ముగియదు. చివరికి ఏవైనా వేడుకల్లో పాల్గొన్నా అక్కడ కలసి కూర్చునే అవకాశం లభిస్తే దాన్ని కూడా వీరు ఈ నేరం చేయకుండా వృధా పోనివ్వరు."

అంతేకాకుండా ఈ పెట్టుబడిదారులు తమ స్వప్రయోజనాల కోసం సంఘం సామూహిక ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎన్నో అక్రమ పద్ధతులు అనుసరించ సాగారు. ఉదాహరణకు ఇక్కడ పేర్కొన్న కొన్ని పద్ధతులు చూడండి:

(1) భారీపెట్టుబడులతో నిత్యావసర వస్తువుల్ని కొని పెద్ద ఎత్తున నిల్వచేయాలి. చివరికి బజారులో వాటి సరఫరా కొరవడి డిమాండు పెరగాలి. ఇలా ధరల్ని కృత్రిమంగా పెంచడం జరగాలి.

(2) ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య దళారీ వ్యవస్థను సృష్టించి కేవలం బ్యాంకుబ్యాలెన్సులు, టెలిఫోన్ల ఆధారంగా సరుకును పరోక్షంగా క్రయ విక్రయాలకు గురిచెయ్యాలి. ఈవిధంగా ఉత్పాదన, రవాణా తదితర పనుల కోసం ఏమాత్రం ఖర్చు పెట్టకుండానే అధిక ధరలతో దళారులకు లాభాలు చేకూర్చాలి.

(3) ఉత్పత్తి అయిన సరుకు మార్కెట్‌కు తరలిస్తే ధరలు పడిపోయే ప్రమాదం ఉన్నప్పుడు దాన్ని కాల్చివేయడమో లేక సముద్రంలో పారవేయడమో జరగాలి.

(4) పెద్ద ఎత్తున విలాస వస్తువులను తయారుచేసి ప్రచారం, ప్రేరణల ద్వారా మొదట ఉచితంగా పంచి, రకరకాల మాటలు అల్లి వాటికి లేనిపోని డిమాండును సృష్టించాలి. తరువాత వాటిని నిత్యావసరాలను సైతం నెరవేర్చుకోలేని పేద, మధ్య తరగతి ప్రజల జీవితావసరాల్లో అనవసరంగా చొప్పించాలి.

(5) నిత్యావసర వస్తువులకంటే విలాసవస్తువుల వ్యాపారం పెట్టుబడిదారులకు ఎక్కువ లాభసాటిగా ఉంటుందిగనక జనసామాన్యం అవసరమైన వాటికంటే అనవసరమైన వస్తువుల కోసం డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టేలా వాతావరణాన్ని సృష్టించాలి.

(6) ప్రజల ఆరోగ్యానికి హానికరమైన, నైతికతను నాశనం చేసే, సభ్యతా సంస్కారాలను మంటకలిపే వస్తువుల్ని అందంగా, ఆకర్షనీయంగా రూపొందించి మార్కెట్‌లోకి విడుదల చేయాలి. పెద్దఎత్తున ప్రకటనల ద్వారా ప్రజల మూఢనమ్మకాలను, వారి క్షుద్రభావాలను ఉత్తేజపరచి, వారిని పిచ్చోళ్ళుగా చేసి భార్యాపిల్లలను సైతం పోషించుకోవడానికే సరిపోని వారి స్వల్పాదాయం నుండి ఓ పెద్దభాగాన్ని ఈ వస్తువుల కోసం ఖర్చు పెట్టేలా చేయాలి.

(7) వాణిజ్యాభివృద్ధి, ఆర్థిక లాభాల కోసం బలహీన జాతుల హక్కులను కొల్లగొట్టాలి. ప్రపంచాన్ని విభిన్న ప్రభావాల మండలాలుగా విభజించి లోబరచుకోవాలి. ఆ జాతుల (దేశాల)లోని ధనికులు, భూస్వాములు, పారిశ్రామికులు, వ్యాపారులు

తమ తమ జాతిప్రజల్ని మితిలేని తమ స్వార్థ ప్రయోజనాలకు పనిముట్లుగా మలచుకొని వారు పరస్పరం కలహించుకుంటూ శాశ్వత సంఘర్షణలో పడివుండేలా చేయాలి. ఆ సంఘర్షణలు ఇటు యుద్ధం ద్వారా పరిష్కృతం కాకూడదు; అటు సంధి ఒడంబడికల ద్వారా కూడా ఓ కొలిక్కి రాకూడదు.

ఇవన్నీ బూర్జువా వర్గం విశృంఖలమైన స్వేచ్ఛ ద్వారా మితిమీరిన లాభాలతో కూడిన స్వప్రయోజనాల కోసం చేసే అకృత్యాలు కావా? అవధుల్లేని స్వార్థం ఏ మేరకు అభ్యుదయకరమవుతుంది? సమాజానికి సామూహిక ప్రయోజనాలు చేకూరుతాయన్న బూటకపు ప్రచారం ద్వారా పెట్టుబడిదారులు తమ స్వప్రయోజనాలు సాధించు కోవడానికి చేస్తున్న కుటిలయత్నాలు కావా ఇవి?

పెట్టుబడిదారీ వ్యవస్థలో కష్టజీవులైన పేద, మధ్య తరగతి ప్రజలే ఎక్కువగా నష్ట పోయేవారని తెలుస్తూనే ఉంది. అయితే పెట్టుబడిదారులు అంతటితో తృప్తి చెందలేదు. ఆర్థికంగా చితికిపోయిన కష్టజీవుల్ని ఆదుకోవడానికి అన్నట్లు వడ్డీ ముసుగుతో ముందుకు వచ్చారు. ముందుగా వారు వ్యాపారులకు, ప్రజలకు, ప్రభుత్వానికి వడ్డీ లాభాల విశ్వరూపం ప్రదర్శించి వాణిజ్యాభివృద్ధికైనా, శ్రామికుల సంక్షేమానికైనా, సమాజ శ్రేయస్సుకైనా, ప్రభుత్వ పథకాల అమలుకైనా వడ్డీ వ్యవస్థే కల్పతరువని విస్తృత ప్రచారం చేసి ప్రజల్ని నమ్మబలికారు.

ఈ ప్రచారంలో విజయం సాధించిన తర్వాత వారు వాణిజ్య సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు వడ్డీ ప్రాతిపదికపై రుణాలు ఇచ్చేవారు. వాణిజ్య సంస్థలు వడ్డీ మొత్తాలను తమ లాభాల నుండి తీయకుండా తమ ఉత్పత్తుల ధరలను పెంచడం ద్వారా కొనుగోలుదారుల జేబుల నుండి తీసిచ్చేవారు. ప్రభుత్వాలయితే వడ్డీ బరువుని తొలగించు కోవడానికి పన్నులు, శిస్తులు పెంచి ప్రజల నుండి వసూలుచేస్తాయి. ఇక చిన్నచిన్న వ్యాపారులు, సన్నకారు రైతులు, పూటగడవని శ్రమజీవులు గత్యంతరంలేని పరిస్థితుల్లో వడ్డీవ్యాపారుల దగ్గర ఆస్తులు తాకట్టుపెట్టి రుణాలు తీసుకోవలసి వస్తుంది. ఒక్కొక్క సారి వడ్డీ తీర్చడానికి కూడా మళ్ళీ అప్పు తీసుకోవలసి వస్తుంది. సకాలంలో అప్పులు తీర్చలేని పక్షంలో వడ్డీవ్యాపారుల, బ్యాంకుల నిర్దయకు గురయి తమకున్న కొద్దిపాటి ఆస్తుల్ని కూడా పోగొట్టుకోవలసిన దుస్థితి ఏర్పడుతుంది.

## 7. సోషలిజం-కమ్యూనిజం

పెట్టుబడిదారీ వ్యవస్థలో పేదలు, కార్మికులు తీవ్రమైన అణచివేతకు గురయి ఎంతో నష్టపోయారు. వారి సహనం సరిహద్దులకు చేరుకొని బ్రేకు పడిన బండిలా ఆగి పోయింది. వారి గుండెల్లో గూడుకట్టుకున్న క్రోధం అగ్నిపర్వతంలా బ్రద్దలయి పోయింది. దాని లావా నుండే మరో అతివాదమైన "సోషలిజం" పుట్టుకొచ్చింది. సాధారణంగా సరైన మార్గదర్శకత్వం లేనిచోట ఒక అతివాదాన్ని అంతమొందించ



డానికి దానికి భిన్నమైన మరొక అతివాదమే ఉనికిలోకి వస్తుంది. పచ్చి స్వార్థంతో కూడిన పెట్టుబడిదారీ వ్యవస్థను కార్మికులు, కర్షకుల సుత్తీ కొడవళ్ళతో అంత మొందించడానికి సోవియట్ రష్యా, చైనా తదితర దేశాల్లో సోషలిస్టు వ్యవస్థ బుసలు కొడ్తూ ముందుకొచ్చింది.

సోషలిజం ఉద్యమం వ్యక్తుల ఆస్తి హక్కుపై దాడిచేయడంతో ప్రారంభ మయింది. సోషలిజం అంటే "సామూహికతత్వం" అని భావం. ఈ పదం వ్యక్తిత్వానికి వ్యతిరేకార్థంలో సృష్టించబడింది. వ్యక్తిత్వం (Individualism) ఆధారంగానే ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ రూపొందింది. దీనికి పూర్తి భిన్నంగా కారల్‌మార్క్స్ యావత్తు శ్రేయం సమాజానికి లభింపజేసే ఉద్దేశ్యంతో సోషలిజం పేరుతో ఓ ప్రత్యేక సామూహికతత్వాన్ని ప్రవేశపెట్టారు. దీన్నే సైంటిఫిక్ సోషలిజం, మార్క్సిజం, కమ్యూనిజం వగైరా పేర్లతో పిలిచారు.

వ్యక్తుల ఆస్తులను సమాజపరం చేయడం ద్వారానే ఆర్థిక సమానత్వం, ఆర్థిక న్యాయం నెలకొంటుందనేది సోషలిజంలోని మూలసూత్రం. వ్యక్తులు ఆస్తిహక్కు కలిగివుండటమే అసలు చెడుకు మూలమని సోషలిస్టుల అభిప్రాయం. తొడుక్కునే బట్టలు, వాడుకునే పాత్రలు, ఇంటి ఫర్నీచర్, ఇంకా ఇలాంటివే ఇతర వస్తువులు వ్యక్తిగత ఆస్తిలో ఉంటే పరవాలేదు. కాని భూమి, యంత్రాలు, మెషీన్లు, సంపాదనా సాధనాలయిన ఇతర వస్తువులపై మాత్రం వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్తిహక్కు ఉండరాదు. ఒక మనిషి ఈ ఆస్తులలో ఏదైనా ఒకటి కలిగివుంటే దాని ద్వారా అతను ధనం సంపాదిస్తాడు. ధనం సంపాదిస్తే దాన్ని కూడబెడ్తాడు. కూడబెడ్తే దాంతో మరేదైనా యంత్రాన్నిగాని, భూమినిగాని కొని ఆదాయ వనరుల్ని పెంచుకుంటాడు. వనరులు పెరిగితే కొందరు వ్యక్తులకు జీతం లేక కూలి ఇచ్చే లేదా మరే పద్ధతి ద్వారానైనా ఒప్పందం చేసుకొని వారి చేత పని చేయించుకుంటాడు. ఇంతవరకు వచ్చాడంటే అతను తప్పనిసరిగా బూర్జువా పెట్టుబడిదారుడు చేసేదంతా చేస్తాడు. కాబట్టి ఈ పిశాచం పుట్టుక మూలాన్నే నరికేస్తే పీడ విరగడయి పోతుంది.

అయితే వ్యక్తిగత ఆస్తులను అంతమొందించే మార్గంలో సోషలిస్టులకు మత సంప్రదాయాలు, నైతిక చట్టాలు అవరోధాలుగా నిలిచాయి. అందువల్ల ధనికుల, భూస్వాముల ప్రయోజనాలను కాపాడేందుకు వారి తాబేదారులైన కొందరు వ్యక్తులు ప్రవక్తలుగా, రుషులుగా, నైతికతా ప్రబోధకులుగా, శాసనకర్తలుగా అవతారమెత్తి ఈ సంప్రదాయాలు, చట్టాలు రూపొందించారని, ఎంతో కాలం నుంచి వారి మాయా జాలంలో పడివున్న కష్టజీవులు దాన్ని ఛేదించి తీరుతారని వీరు మతాల మీద దాడికి దిగారు. ఈ విధంగా సోషలిస్టులు అనాదిగా వస్తున్న నీతిసూత్రాలను, మతపరమైన సత్సంప్రదాయాలను సైతం వ్యతిరేకించి నాస్తిక, భౌతిక వాదాలను ఉనికిలోకి తెచ్చారు.

కాని మత సంప్రదాయాలను, నీతిసూత్రాలను అంతమొందించడం అంత తేలికైన పనికాదు. వాటిని అంతంచేయడానికి పెద్ద పోరాటం జరపవలసి ఉంటుంది. దాని కోసం సోషలిస్టు సిద్ధాంతకర్తలు ఓ చిట్కా కనిపెట్టి దానికి "గతంలో మానవ నాగరికతా పరిణామ ప్రగతులన్నీ వర్గపోరాటం ద్వారానే జరిగాయన్న" చారిత్రక యధార్థపు రంగు పులిమి జనంలోకి వదిలారు. అంతేకాదు తమ సోషలిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకంగా సత్యప్రాతిపదికపై ఎలాంటి విషయం ముందుకొచ్చినా దాన్ని వారు తర్కంతో ఖండిస్తూ అసలు "నిత్యసత్యాలనేవి ఏవీ లేవ"ని సూత్రీక రించారు. ఈవిధంగా వారు తాము కనిపెట్టిన సూత్రాలు, సిద్ధాంతాలు మాత్రం నిత్య సత్యాలేనని చెప్పకనే చెప్పారు.

అయితే "పాతొక రోత, కొత్తొక వింత"అనే సామెత ప్రకారం ఐరోపా జన సామాన్యం ప్రారంభంలో సోషలిజాన్ని ఒక వింతగా చూసి, ఆ తరువాత పాత విషయాలపై రోతపుట్టి కొత్తవిషయం పట్ల ఆసక్తి చూపారు. అయినా సోషలిజం శకటం తగినంత ముందుకు సాగలేదు. దాని కోసం రెండు ప్రతిపాదనలు వచ్చాయి. ఒక ప్రతిపాదన ప్రకారం ఈ మార్పు కోసం ప్రజాస్వామిక విధానాలు అవలంబించాలి. దీనికనుగుణంగా ప్రజాభిప్రాయాన్ని మలచి రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవాలి. తరువాత శాసననిర్మాణం ద్వారా క్రమంగా వ్యావసాయిక ఆస్తుల్ని, పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాల్ని సామూహిక ఆస్తులుగా జాతీయం చేయాలి.

దీనికి భిన్నంగా రెండోవర్గం ప్రతిపాదన ప్రకారం ప్రజాస్వామిక విధానాలతో ఈ మార్పు రాదు. దీనికి విప్లవాత్మక విధానాలు కావాలి. పేదల్ని, కార్మికుల్ని సంఘటితం చేయాలి. ధనిక, భూస్వామ్య, పారిశ్రామిక వర్గాలను ఎదిరించి వీలైన పద్ధతులన్నిటినీ అవలంబించి పోరాటంజరపాలి. వారి భూములు, కర్మాగారాలు, వ్యాపార కేంద్రాలను దోచుకోవాలి. వ్యతిరేకించేవారిని అంతమొందించాలి. ఈవిధంగా బూర్జువా పాలనను తుదముట్టించి శ్రామికవర్గ నియంతృత్వం నెలకొల్పాలి.

తరువాత (మన) చట్టంద్వారా వ్యక్తి లేక వ్యక్తుల చేత పని చేయించుకోవడాన్ని, లాభం గడించడాన్ని నిషేధించడం జరగాలి. ఈ విప్లవం విజయవంతం అయిన తర్వాత పెట్టుబడిదారులు మళ్ళీ బ్రతికి బట్టకట్టే ప్రమాదం ఉండదు. అప్పుడు ఈ కార్మిక నియంతృత్వం తనంతటదే ఎండి రాలిపోతుంది. దాని స్థానంలో ఎలాంటి బలాత్కారాలు లేని, పరస్పరామోదం, సలహాసంప్రదింపులతో సాగే ఓ కొత్త వ్యవస్థ దానంతటదే దాని స్థానం ఆక్రమించుకుంటుంది. (ఎలాగో, ఏమో!) ఈ రెండవ పంథా పేరే విప్లవసోషలిజం. దీన్ని బొల్షెవిజం, మార్క్సిజం అని కూడా అంటారు.

కమ్యూనిస్టులు రెండవ ప్రతిపాదనను అమలుపరచడానికి నిర్ణయించుకొని సమయం కోసం నిరీక్షించారు. చివరికి 1914-18 మధ్య జరిగిన మొదటి ప్రపంచ



యుద్ధం అలజడిని ఆసరాగా తీసుకొని రష్యాలో ఓ విప్లవం లేవదీశారు. ఆ తరువాత తమ సిద్ధాంతాల ప్రకారం అక్కడ ఓ నాగరికతా వ్యవస్థను నెలకొల్పారు. విప్లవం తరువాత రష్యాకు కలిగిన లాభనష్టాలను గురించి ఆలోచిస్తే లాభాలలో అత్యధిక భాగం సమర్థకులు, నిజాయితీపరులైన వ్యక్తుల కారణంగా ఒనగూడాయని, అలాగే నష్టాలు అసమర్థకులు, వంచకుల మూలంగా కలిగాయని తెలిసింది. కొత్తసిద్ధాంతాల వల్ల ఒనగూడిన లాభాలు బహుస్వల్పం. నష్టాలే ఎక్కువగా ఉన్నాయి.

**లాభాలు**:- వ్యక్తుల అధీనంలోని భూములు, కర్మాగారాలు, వాణిజ్య సంస్థల్ని జాతీయం చేయడం వల్ల వాటి ద్వారా వచ్చే లాభాలను ప్రభుత్వం సామూహిక సంక్షేమ కార్యాల్లో వినియోగించగలిగింది. ఈ లాభాలలో కొంత భాగాన్ని "సోషల్ ఇన్సూరెన్సు" పథకం ఏర్పాటుచేసి తద్వారా కష్టపడి పని చేయలేని బలహీనులు, వృద్ధులు, వికలాంగులు మొదలైన వారికి సహాయం అందజేయడం సాధ్యమయింది.

**నష్టాలు**:- వ్యక్తుల నుండి భూములు, పరిశ్రమలు, ఇతర ఉత్పత్తి సాధనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి దుర్భర హింసాకాండకు పాల్పడవలసి వచ్చింది. ఒక అంచనా ప్రకారం ఈపథకం ఆచరణలో దాదాపు 19 లక్షలమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు; 20 లక్షల మందికి కఠినాతి కఠిన శిక్షలు విధించబడ్డాయి; 40 లక్షల మందికి పైగా జనం స్వదేశం వదలి చెట్టుకొకరు, పుట్టకొకరు కావలసి వచ్చింది. ఒక్క ఉమ్మడి వ్యవసాయ పథకాన్ని అమలుజరపడానికి ప్రభుత్వం సన్నకారు రైతులు, మధ్య తరగతి కమతగాళ్ళను గుడ్డిగా నాశనం చేసిన తీరును చూసి ఆవేశపరులైన రష్యా సమర్థకులు సైతం నెత్తీ-నోరూ బాదుకొని రోదించారు.

వ్యక్తుల ఆస్తులు జాతీయం చేయబడి ప్రభుత్వపరం అయినప్పుడు ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతి, లంచగొండితనం తీవ్రంగా విస్తరించి ప్రజలను ఎన్నెన్ని ఇక్కట్ల పాలుజేస్తుందో అందరికీ తెలిసిందే. ప్రభుత్వ పర్మిట్లు, లైసెన్సులు, రేషన్ కార్డులు, కోటాలపై ఆధారపడిన ఏ జీవితావసర వస్తువయినా దాని కోసం ప్రజలు పడరాని పాట్లు పడవలసి వస్తుంది. ప్రభుత్వాధికారులు మాత్రం నిత్యకల్యాణం పచ్చ తోరణంగా వెలిగిపోతుంటారు. కమ్యూనిస్టురష్యాలో జరిగింది ఇదే. రష్యా ఉక్కుతెరల నుండి ప్రక్షాళన జరిగి అప్పుడప్పుడు బయటికి పొక్కే వార్తలో ఒకటి- అక్కడ ప్రభుత్వాధికారులు, వివిధ ఆర్థిక సంస్థల నిర్వాహకులు "అవినీతి" గడ్డు సమస్యను పుట్టించి అక్కడి పాలకులకు తలనొప్పిగా తయారయ్యారన్నది కూడా ఉంది.

సోషలిస్టు వ్యవస్థలో ఇలా జరగడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. జరగక పోవడమే ఆశ్చర్యకరమైన విషయం. ఒక వ్యవస్థను అవినీతి, అన్యాయం, అక్రమా లతో విచ్ఛిన్నం చేసి మరో వ్యవస్థను నెలకొల్పినప్పుడు ఆ వ్యవస్థలో మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లేవి అవినీతి, అన్యాయాలు కాకపోతే నీతి, న్యాయాలు వర్ధిల్లుతాయా?

మానవ నైజం, సహజ ప్రవృత్తులు, వారసత్వంగా వచ్చే భావాలు అన్నీ బూర్జువా తత్వశాస్త్రం, సైన్సు చెప్పే బూటకాలని, అలాంటివేవీ మానవునిలో అసలు లేవని, తాము స్వప్రయోజనాభిలాషను, స్వార్థభావాలను ప్రజల ఆంతర్యాల నుండి తీసేసి వాతావరణంలోని మార్పుద్వారా వారిలో సామూహికభావన జనింపజేస్తామని కమ్యూనిస్టులు ప్రగల్భాలు పలికారు. కాని ఆచరణలో వారు ఘోరంగా విఫలమయ్యారు.

ప్రభుత్వం వ్యక్తుల ఆస్తులు స్వాధీనం చేసుకోవడానికి హద్దుమీరిన దౌర్జన్యాలు, దండనలతోపాటు వంచన, వాగ్దానభంగాలు, అబద్ధాలు, అక్రమాలకు సైతం పాల్పడ వలసి వచ్చింది. ఈ మార్గంలో అవరోధాలుగా నిలిచిన నీతి సూత్రాలు, మత సంప్రదాయాలను తుంగలో తొక్కి, నిరసన తెలిపిన ముస్లిం, క్రైస్తవ మతవర్గాలను, వారి నాయకుల్ని ఉక్కుపాదంతో అణచివేసింది; రక్తపుటేరులు ప్రవహింపజేసింది. సోషలిజం ఒడిలో ఊపిరి పోసుకున్న నాస్తికరక్కసి దేశమంతటా కరాళనృత్యం చేస్తూ వేలాది ఆరాధనాలయాలను, లక్షలాది మతగ్రంథాలను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టింది.

దీని కోసం కమ్యూనిస్టు నాయకులు ఓ కొత్త నైతిక దృక్పథం సృష్టించారు. స్వయంగా లెనిన్ అన్న ఈ మాటలు వినండి:

“మేము ఏ దైవిక భావానికైనా ఆధారపడే ప్రతి నైతిక దృక్పథాన్ని నిరసిస్తున్నాం. లేక అది ‘వర్గవిభజన’ భావనకు అతీతమైన ఏ భావాల నుండి పుట్టేదయినా మేము దాన్ని తిరస్కరిస్తున్నాం. మా దృష్టిలో నైతికత అనేది కేవలం వర్గపోరాటానికి లోబడి ఉంది.....శ్రామిక నియంతృత్వ ప్రభుత్వాన్ని పటిష్టంగా, సుస్థిరంగా నెలకొల్పడానికి నిరంతర పోరు సలపడం ఒక్కటే కమ్యూనిస్టు నైతికత. ఈ కార్యంలో ఎన్ని ఎత్తులు, జిత్తులు, వంచనలు, ఉపాయాలు, సాకులు, సాధనాలు, అసత్యాలు, అక్రమాలు అవసరమైనా సరే వాటన్నిటినీ ఉపయోగిస్తాం.”

వస్తువుల ఉత్పత్తి ఖర్చులు, వాటి మార్కెట్ ధరల మధ్య ఉన్న వ్యత్యాసం అంటే “లాభాలు” కేవలం భూస్వాములు, పారిశ్రామికవేత్తలు, బడా వ్యాపారస్తులు వంటి కొన్ని ప్రత్యేక వర్గాల జేబుల్లోకి పోకుండా మొత్తం సమాజానికి చెందేలా సామూహిక (ప్రభుత్వ) ఖజానాలోకి చేరితే వాటిని అన్ని వర్గాల ప్రజలకు సమానంగా లేదా కనీసం సమంజసంగానైనా పంపిణీ చేయవచ్చని కమ్యూనిస్టు నాయకులు భావించారు. వ్యక్తిగత ఆస్తులను అంతమొందించడానికి అసలు కారణం ఇదే. కాని వాస్తవంగా జరిగిందేమిటీ?

మొత్తం ప్రభుత్వ శాఖలు, ఆర్థిక వ్యవహారాల సంస్థలలో సాధారణ ఉద్యోగుల జీతాలకు, ఉన్నతాధికారుల జీతాలకు మధ్య తేడా ఇతర బూర్జువా సమాజాల్లో లాగానే ఉంది. అలాగే ఒకవైపు సాధారణ కార్మికుని వేతనం, అతని జీవన ప్రమాణం అమెరికా, ఇంగ్లాండు దేశాల్లోని కార్మికులకన్నా చాలా తక్కువగా ఉన్నాయి. మరోవైపు



డైరెక్టర్లు, మేనేజర్లు, ప్రభుత్వాధికారులు, సైనికాధికారులు, సైంటిస్టులు, నటీనటులు, ఎడిటర్లు, రచయితలు వగైరా వర్గాలవారి ఆదాయాలు పెరిగిపోతూ యేడాదికి కొన్ని లక్షల రూబుళ్ళకు చేరిపోయింది. అంటే పూర్వం బూర్జువా సమాజాల్లో పైతరగతులు, క్రింది తరగతుల మధ్య ఎలా ఆర్థిక అసమానతలు ఉండేవో ఇప్పుడు సోషలిస్టు సమాజంలో కూడా అలాంటి ఆర్థిక అసమానతలే చోటుచేసుకున్నాయన్న మాట.

కాకపోతే ప్రతి మనిషికీ తినడానికి రెండు పూటలా కూడు, వళ్ళు కప్పుకోవడానికి కాస్తంత బట్ట, తలదాచుకోవడానికి ఓ కొంప లభించే ఏర్పాటు మాత్రం జరిగింది. దాంతోపాటు మనిషికి ఏదైనా గడ్డుకాలం వచ్చినప్పుడు “సామాజిక భీమా” ద్వారా అతడ్ని ఆదుకునే అవకాశం కూడా లభించింది.

అయితే ఈ మాత్రం ప్రయోజనం కోసం ప్రజలు ఎంత మూల్యం చెల్లించవలసి వచ్చింది? భయంకరమయిన రక్తపుటేరుల్లో లక్షలాది మంది జనసంహారం! యావజ్జీవ కారాగార శిక్షలు, దేశ బహిష్కరణలు!! తీవ్రమైన గూఢచార వ్యవస్థలో సన్నిహితుల మధ్యనే లేనిపోని అనుమానపు, విద్వేషపు కారుమేఘాలు!!! ప్రజల అంతరంగాలతో మమేకమయి ఉన్న దైవికభావన, నీతినియమాలు, మత సంప్రదాయాల సర్వనాశనం!!!!

కాని కమ్యూనిస్టు నాయకులు ఎంత కఠినంగా ప్రవర్తించినా తిరుగుబాటు ధోరణులు అప్పుడప్పుడు తొంగిచూస్తుండేవి. ఎలాంటి నియంతృత్వమైనా మానవ స్వభావంలో సహజసిద్ధంగా వేళ్లూని ఉన్న భావప్రకటనా స్వాతంత్ర్యం, దైవిక భావన, నీతినియమాలను ఎంతో కాలం అణచిపెట్టలేదు. లావాతో లోలోన కుతకుతలాడే అగ్ని పర్వతం ఎప్పటికైనా పేలిపోవలసిందే. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన రష్యా నేతలు కొన్ని ఉపశమనపు మందులతో చికిత్స చేయడానికి ప్రయత్నించారు. కాని అప్పటికే వ్యాధి ముదిరిపోయి సోషలిస్టు వ్యవస్థ కాటికి కాళ్ళు జాపింది.

సోషలిస్టు రష్యా చివరి అధ్యక్షుడు గొర్బచెవ్ పాలనలో స్వయంగా కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుల్లో ఒకడయిన ఎల్సిన్ ఎంతో చాకచక్యంతో అధికారం హస్తగతం చేసుకొని దేశంలోని సోషలిస్టు వ్యవస్థకు శాశ్వతంగా సమాధికట్టాడు. చైనాలో పాలకులు రష్యన్లకు ముందే మేల్కొని కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టారు. అందువల్ల అక్కడ సోషలిస్టు వ్యవస్థ నామమాత్రంగానైనా మిగిలి ఉంది.

రష్యాలో జరిగిన సోషలిజం ప్రయోగం వల్ల పెట్టుబడిదారీ దేశాల్లో పాలకులు కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టారు. కాని పెట్టుబడిదారి వ్యవస్థల్లోని అసలు చెడులు అలాగే ఉండిపోయాయి. అంతేకాదు, సోవియట్ రష్యాలో కమ్యూనిజం అంతం కాగానే అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ విశ్వరూపంతో ముందుకొచ్చింది.

# 8. నూతన ప్రపంచ వ్యవస్థ

పెట్టుబడిదారీ వ్యవస్థ ఈసారి "న్యూ వరల్డ్ ఆర్డర్" (నూతన ప్రపంచ వ్యవస్థ) అనే కొత్త ముసుగు ధరించి ప్రపంచ దేశాల ముందుకు వచ్చింది. ఈ విషయంపై త్రిదిన ఉర్దూ పత్రిక "దావత్"లో డాక్టర్ అబ్దుల్‌బారీ గారు 1992 మేలో రాసిన వ్యాసానికి అలిఫైన్ గారు చేసిన సంక్షిప్త అనువాదాన్ని ఇక్కడ ఇస్తున్నాను:

ప్రస్తుతం పాశ్చాత్య ప్రపంచం, దాని కుటిల అనుచరగణం తీవ్ర ఆందోళనకు గురయి ఉన్నాయి. అవి తమ పాదాల కింద భూమి కంపిస్తున్నట్లు అదరి పోతున్నాయి. గల్ఫ్‌యుద్ధంలో ఇరాఖ్‌ని సర్వనాశనం చేయడం, అరబ్ నేతలను తమ కనుసన్నలలో మెలిగేలా చేసుకోవడం, వారి అపార చమురు సంపదపై పెత్తనం సంపాదించడం, ఆపై సోషలిస్టు రష్యా ముక్కచెక్కలయి కూటి కొరకు తమ ముంగిట నిల్చోవడం మొదలైన విజయాలు సాధించినప్పటికీ అమెరికా, దాని మిత్రదేశాలను ఓ భయంకరమైన అనుమానపు పెనుభూతం వెంటాడుతూ వాటికి నిద్రాహారాలు లేకుండా చేసింది.

ఈ అనుమానపు పెనుభూతం ఏమిటీ? వాటి నూతన ప్రపంచ వ్యవస్థ (న్యూ వరల్డ్ ఆర్డర్) బాటలో "ఇస్లాం పునరుజ్జీవనోద్యమం" ఓ పెద్ద అవరోధంగా నిలిచి వాటి సుందర ఊహాసౌధానికి తూట్లు వేస్తోంది. ఈనాడు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఎగిసిపడుతున్న ఇస్లామీయ ఉద్యమ కెరటాలను చూసి అవి గగ్గోలుపెడుతూ, ఈ నూతన చైతన్యానికి మతఛాందస వాదమని, పునాదివాదం (Fundamentalism) అని, పేర్లుపెట్టి ప్రజాస్వామ్యానికి, సెక్యులరిజానికి బద్ధ విరోధని మానవహక్కులకు, స్వేచ్ఛా ప్రియత్వానికి పెద్ద ప్రమాదం ముంచుకొచ్చిందని దుష్ప్రచారం చేస్తున్నాయి.

నిజానికి ఈ దేశాల పరిస్థితి గమనిస్తుంటే పెట్టుబడిదారీ వాదం, ఆర్థిక దోపిడి, జూదం, వడ్డీ ప్రాతిపదికలపై ఏర్పడిన పాశ్చాత్యనాగరికతా ప్రాసాదం ఇస్లాం ప్రభంజనానికి తట్టుకోలేక ఊగిపోతున్నట్లు గోచరిస్తోంది. మరోవైపు అభివృద్ధి, ఆధునికీకరణ, మానవమైత్రి, ఉదారవాదం (Liberalism), పాశ్చాత్యతరహా ప్రజా స్వామ్యం, ఐరోపా తరహా జీవన సరళి అనే పేర్లతో మొన్నటిదాకా మోసంలో పడివున్న పీడిత జాతులు ఇప్పుడు ఈ మోసపు ఎత్తుగడల నుండి బయటపడటానికి ప్రయత్నించడంతో అమెరికా, దాని మిత్రదేశాలు బెదిరిపోతున్నాయి.

ఐరోపాలో కమ్యూనిజం తుడిచిపెట్టుకుపోవడం, మధ్యప్రాచ్యంలో తన సర్వాధికార పతాకాన్ని ఎగరవేయడం జరిగాక అమెరికా ప్రపంచంలో ఏకైక అగ్ర రాజ్యంగా నిలిచింది. కాని అదే సమయంలో దానికి తన పతనఛాయలు కూడా గోచరించసాగాయి. సమతా వాదానికి, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి, ఆర్థిక న్యాయాని



(Economical justice)కి ప్రతీకగా పైకి ఎదిగివస్తున్న ఇస్లాంను చూసి బిత్తరబోయి తత్తరపాటుతో దానిపై నిరాధారమైన దుష్ప్రచారానికి పాల్పడింది.

ఐరోపా తన పెట్టుబడిదారీ శక్తి, ఆయుధాలు రాజకీయ జిత్తులు, ఎండమావి సిద్ధాంతాలతో ఈ శతాబ్దం ఆరంభంలో యావత్‌ప్రపంచాన్ని ప్రభావితం చేయ గలిగింది. పేద, వర్ధమాన దేశాల్లో అది తన ఔన్నత్యపు బావుటాను ఎగరవేయడానికి తననుతాను అందరికంటే గొప్ప మానవమిత్రునిగా, మానవహక్కుల పరిరక్షకునిగా, స్వేచ్ఛాశాంతుల కాముకునిగా నిరూపించుకోవడానికి ప్రయత్నించింది. అంతేగాక ప్రజాస్వామ్య తరహా పాలనావ్యవస్థను తన ప్రత్యేక ఆవిష్కరణగా ప్రచారం చేసుకున్నది. కాని ఆ తరువాత సంభవించిన అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో దాదాపు అన్ని దేశాలు ఆంగ్లేయుల రాజకీయ బానిసత్వం నుంచి విముక్తి పొంద గలిగాయి. అయితే పాశ్చాత్యజాతుల ఆర్థిక, సాంస్కృతిక దాస్యం నుంచి బయట పడేందుకు తూర్పు జాతులు సాగిస్తున్న స్వాతంత్ర్య సమరం అమెరికాకు ఇంకా తలనొప్పిగానే ఉంది.

అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్, అతని మిత్రకూటమి తమ సర్వసాధన సంపత్తితో, యావత్తు యంత్రాంగంతో, తమ రాజకీయ చదరంగంతో, సైనికశక్తితో దీన్ని నిరోధించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రయత్నం నుంచి పుట్టుకొచ్చిన ఆలోచనే New World Order (నూతన ప్రపంచ వ్యవస్థ). కాని ఈ న్యూ వరల్డ్ ఆర్డర్ వాస్తవానికి కొత్తసీసాలో పోసిన పాతసారా లాంటిదే తప్ప మరేమీకాదు. దీని ఉద్దేశ్యం యావత్తు ప్రపంచజాతులు అమెరికా అడుగుజాడల్లో నడుస్తూ స్వేచ్ఛాయుత ఆర్థిక వ్యవస్థ (Free Economy)ను, ఉదారసమాజాన్ని (Liberal Society) ఏర్పరచు కోవాలి; సెక్యులర్ ప్రజాస్వామ్యాన్ని పెంపొందించుకోవాలి; మతవిశ్వాసాలను ప్రజల సామూహిక వ్యవహారాలకు దూరంగా ఉంచాలి; రాజకీయాలపై నైతికఆంక్షలు ఉండ కూడదు; ఐరోపాతరహా సమాజ విధానాన్ని, ఉదారవాదాన్ని కొత్త సమాజ నిర్మాణానికి ప్రాతిపదికలుగా చేసుకోవాలి. ఈ విధంగా ప్రపంచదేశాలను న్యూ వరల్డ్ ఆర్డర్ పేరుతో తమకు అనుకూలంగా మలచుకొని, వాటిపై పెత్తనం చలాయించాలని అమెరికా, దాని మిత్రదేశాలు కలలు కంటున్నాయి.

అయితే యూరప్‌లోనే కొన్నిచోట్ల పాశ్చాత్యవ్యతిరేక పవనాలు వీస్తున్నాయిప్పుడు. పశ్చిమ యూరప్‌లో ప్రస్తుతం తొంబై లక్షల మంది ముస్లింలు నివసిస్తున్నారు. "న్యూస్ వీక్" పత్రిక కాలమిస్టు 'స్కార్ట్ సెల్యూన్' కథనం ప్రకారం ఇటీవల అల్జీరియాలో సంభ వించిన పరిణామాలు యావత్తు పశ్చిమ యూరప్ ముస్లింలను ఎంతో ప్రభావితం చేశాయి. దాంతో తమ ఉద్యోగ, వ్యాపార వ్యవహారాలు మాత్రమే చూసుకుంటూ గుట్టుగా జీవితం సాగిస్తున్న ఈ ముస్లింలు తమ ముస్లిమేతర పొరుగు ప్రజలకు వేరుగా (ఇస్లామీయ)జీవితం గడపడానికి, తమ ప్రత్యేకప్రతిపత్తిని కాపాడుకోవడానికి

అనువైన వాతావరణం జనించింది. అల్జీరియా (సార్వత్రిక ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన) ఇస్లామిక్ సాల్వేషన్ ఫ్రంట్‌పై వారు ఎనలేని అభిమానం పెంచుకున్నారు.

**తా చెడ్డ కోతి వనమెల్లా చెరచున్:-** స్కార్ట్ సెల్యూన్ అభిప్రాయం ప్రకారం ఈ ముస్లింలలో ఒక వర్గం (ఈరాన్ షియాముస్లింల నాయకుడు) ఆయతుల్లా ఖుమైనీ యొక్క మతఛాందస ఆలోచనావైఖరితో ఏకీభవిస్తున్నది; యూరప్ ముస్లింలు తమ (ధార్మిక) ప్రత్యేకతలను ఏర్పరచుకునే హక్కు కోసం పోరాడేందుకు వారిని ఉసి గొల్పడం జరుగుతోంది. ఈ సందర్భంలో గమనించవలసిన విషయాలు- ప్యారిస్‌లో సల్మాన్‌రుష్దికి వ్యతిరేకంగా ముస్లింలు పెద్దఎత్తున ప్రదర్శనలు జరిపారు. రుష్ది పైశాచిక నవలను ఇటాలియన్ భాషలో అనువదించిన ఇటలీ రచయితపై దాడి కూడా జరిగింది. ఫ్రాన్స్‌లోని ఒక కళాశాలలో చదువుకుంటున్న ముగ్గురు మొరాకో బాలికలు 'స్కార్ఫ్'ని బురఖాగా ఉపయోగించి ఫ్రాన్స్ విద్యాశాఖాధికారుల్ని చికాకు పరిచారు. వీటితోపాటు అనేకప్రాంతాల్లో హలాల్ మాంసం లభించే ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు కూడా చేయడం జరిగింది.

న్యూస్‌వీక్ పత్రిక (27-1-92) ప్రకారం పాశ్చాత్యులు ముస్లింల ధార్మిక ప్రతిపత్తిని, ఇస్లామీయ రాజకీయాలను ఏమాత్రం సహించరు. ఆస్ట్రియా, స్వీడన్, బెల్జియం, జర్మనీలలో ఇటీవల జరిగిన ఎన్నికలలో ముస్లింవ్యతిరేక పార్టీలు సాధించిన ఘనవిజయాలే ఇందుకు తార్కాణం. జర్మనీలో నాజీవర్గాలు విదేశీ పౌరులపై 2368 సార్లు దాడిచేశాయి. వీరిలో అత్యధిక మంది టర్కీ, మొరాకోకు చెందిన శ్రామికులే ఉన్నారు.

పాశ్చాత్యదేశాల్లో ఇస్లాంవ్యతిరేక ప్రచారం ఎంతగా సాగుతున్నప్పటికీ దైవాను గ్రహం వల్ల ఇస్లాం అతివేగంగా వ్యాపిస్తోంది. ముస్లింలు ఇస్లాం బోధనలను స్వయంగా ఆచరించడమేగాక వాటిని ముస్లిమేతరులకు కూడా పరిచయం చేస్తున్నారు. 1965లో ఫ్రాన్స్‌లో పది మసీదులే ఉండేవి. ఇప్పుడక్కడ వేయికి పైగా వెలిశాయి. డెబ్బయి వేల మంది ముస్లింలు నివసిస్తున్న ఇంగ్లాండులో 34 మసీదులు ఉన్నాయి. రోమ్‌లో యావత్తు ఐరోపాలోకెల్లా అతిపెద్ద మసీదు నిర్మించబడుతోంది.

యూరప్‌లో ముస్లింలు ఎక్కడెక్కడయితే నివసిస్తున్నారో ఆయా ప్రాంతాల్లో ఖుర్‌ఆన్ బోధనాకేంద్రాలు నెలకొన్నాయి. వారు తమ పండుగ దినాలను సెలవులుగా ప్రకటించమని తమ ప్రభుత్వాలను కోరుతున్నారు. కార్యాలయాల, కర్మాగారాల వద్ద మసీదులు నిర్మించుకోవడానికి స్థలాలు కేటాయించమని, హలాల్ మాంసం సరఫరాకై తగిన పశువధశాలలు ఏర్పాటు చేయమని అడుగుతున్నారు. ఇంగ్లాండులో కలీం సద్దీఖి ముస్లింల సమస్యల పరిష్కారం కొరకు 'ముస్లిం పార్లమెంట్'ను ఏర్పరచబోతున్నట్లు ప్రకటించారు. ఇది బ్రిటన్ ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపరచింది.



ఉదార సమాజం, సెక్యులర్ ప్రజాస్వామ్యం, మానవహక్కులు, నవనాగరికతల పేరిట ఇప్పటిదాకా తూర్పుదేశాలను మోసగిస్తున్న పాశ్చాత్యసిద్ధాంతాల, తాత్విక చింతనల గుట్టును రట్టుచేసే శక్తి ఇస్లాంకు మాత్రమే ఉంది. ఈ కారణంగానే పాశ్చాత్యదేశాలు, ప్రత్యేకంగా అక్కడి ప్రచార ప్రసార సాధనాలు ఇస్లాంపై కత్తిగట్టాయి. ఇస్లాం మీ జీవన సరళిని నాశనం చేసే అతి ప్రమాదకరమైన ఐడియాలజీ అని, మీ పొరుగు ముస్లింలు ఇస్లాంపై తమ అభిమానం వ్యక్తపరుస్తూ మిమ్మల్ని ప్రమాదంలో పడవేస్తున్నరని ఈ ప్రచార సాధనాలు పాశ్చాత్య క్రైస్తవ, యూదు ప్రజానీకాన్ని హెచ్చరిస్తున్నాయి. ముస్లింలు ఐరోపా జీవనస్రవంతి నుండి వేరైపోయి ఇస్లామీయ జీవనసరళిని అవలంబిస్తే, అది తమ భోగభాగ్యాలకు, విలాసజీవితానికి, విశృంఖలత్వానికి ఆటంకం కలిగిస్తుందని పాశ్చాత్యులు భయపడిపోతున్నారు. అంచేత ముస్లిం దేశాలలో ఇస్లామీయ ఉద్యమాలు తలెత్తడాన్ని, అక్కడ ఇస్లాం చట్టాల ప్రవేశాన్ని వారు సహించలేకపోతున్నారు.

పాశ్చాత్యుల దృష్టిలో నియంతృత్వం చెడ్డ వ్యవస్థ. అయితే ఆ స్థానంలో ఇస్లామీయ పాలనా వ్యవస్థ ఏర్పడితే అది వారి దృష్టిలో మరింత చెడ్డ వ్యవస్థ అవుతుంది. పైగా అది 'నూతన ప్రపంచ వ్యవస్థ' మార్గంలో అన్నిటికంటే అతిపెద్ద అడ్డుగోడగా నిలుస్తుంది. అందుకే వారు ఇస్లామీయ వ్యవస్థను అప్రతిష్ఠ పాలుచేయడానికి కావాలనే దుష్ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారు.

వారి అభిప్రాయం ప్రకారం మానవహక్కులను గౌరవించే, ప్రజలకు ఆర్థిక స్వేచ్ఛ, ఆర్థిక సుఖాలను అందజేయగలిగే విస్తృత దృక్పథంగల ప్రభుత్వాన్ని స్థాపించే సత్తా ఇస్లాంకు లేదు. వారి దృష్టిలో మానవ హక్కులను గౌరవించడమంటే వ్యక్తికి అతని వ్యక్తిగత, సామూహిక జీవితాల్లో అన్ని రకాల చెడులకు, అశ్లీల చేష్టలకు, విచ్చలవిడితనానికి పాల్పడే స్వేచ్ఛ ఉండాలి. ఫ్రాన్స్‌లో స్వజాతి సంపర్కం లాంటి నీచకార్యానికి వ్యతిరేకంగా ముస్లింలు మాట్లాడితే, అక్కడి సమాజమంతా అభ్యంతరం తెలుపుతూ ముస్లింలు వ్యక్తిస్వాతంత్ర్యంలో జోక్యం చేసుకుంటున్నారని గగ్గోలు పెట్టింది.

పాశ్చాత్యుల దృష్టిలో ఆర్థిక స్వేచ్ఛ అంటే- వడ్డీతో కూడిన ఆర్థిక విధానాల ద్వారా పేదల రక్తాన్ని పిండుకునే స్వేచ్ఛ పెట్టుబడీదారులకు ఉండాలి; ఎలాంటి ఆంక్షలు, ఆటంకాలు లేకుండా వారి హద్దుమీరిన లాభార్జనా కార్యకలాపాలు సాగేందుకు పూర్తి స్వాతంత్ర్యం ఉండాలి.

ఇలా అసభ్యకరాలకు, కుచేష్టలకు సైతం పాల్పడేందుకు వ్యక్తికి విశృంఖల స్వేచ్ఛ; పేదల రక్తం పీల్చుకునేందుకు పెట్టుబడిదారులకు, భూస్వాములకు ఆంక్షలులేని ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలన్నదే పాశ్చాత్యసమాజం సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రాతిపదికపై ప్రపంచ జాతులను తమకు అనుకూలంగా మలచుకొని

వాటిపై ఆధిపత్యం వహించడానికి యూరోపియన్లు ప్రయత్నిస్తున్నారు. అయితే సమానత్వం, సాంఘికన్యాయాలతో కూడిన ఇస్లామీయవ్యవస్థ ముందు ఈ సిద్ధాంతం ప్రాతిపదికలు ప్రపంచజాతులను ఎంతోకాలం కట్టి ఉంచలేవని యూరోపియన్లు నేడు భావించసాగారు. ఈ కారణంగానే వారు ఇస్లాంకు బద్ధశత్రువులై పోయారు.

పాశ్చాత్యదేశాలు ప్రపంచంలో తాము ప్రజాస్వామ్య జ్యోతిని వెలిగించి హింసా దౌర్జన్యాల చీకట్లను పారదోలడానికి ఎంతగానో కృషి చేసినట్లు గొప్పలు చెప్పుకుంటారు. కాని ఆసియా, ఆఫ్రికాలలో ప్రజాస్వామ్యం వృద్ధిచెందడాన్ని వారు ఏనాడూ చిత్తశుద్ధితో అంగీకరించలేదు. పైగా అక్కడ సైనికపాలనకో లేదా ఏకపార్టీ నియంతృత్వానికో కొమ్ముకాస్తూ వస్తున్నారు. ఈ శతాబ్దం ఆసియా, ఆఫ్రికా దేశాలలో ప్రభుత్వాలను నడిపిన నియంతలలో దాదాపు అందరూ పశ్చిమదేశాల్లోని విద్యానాగరికతలను వంటబట్టించుకొని వచ్చినవారే. వారు తమ దేశప్రజలను భావదాస్యంలో మగ్గిపోయేలా ఉంచడానికి ప్రయత్నించారు. పాశ్చాత్యదేశాల నుండి పెద్దఎత్తున ఆయుధాలు తెప్పించుకొని తమకు వ్యతిరేకంగా తలెత్తిన ప్రతి ప్రజాస్వామ్య ఉద్యమాన్ని కఠినంగా అణచివేశారు. వారి అణచివేత చర్యలకు పశ్చిమదేశాలు వత్తాసు పలికాయి.

**ఇస్లామీయ ప్రజాస్వామ్యం కంటే ఇస్లామేతర నియంతృత్వమే మేలట!!** దైవభీతి, పరలోక జవాబుదారీ భావన ప్రాతిపదికలపై ఏర్పడే ఇస్లామీయ ప్రజా స్వామ్యం మానవహక్కులను గౌరవిస్తూ సాంఘిక, ఆర్థిక న్యాయాన్ని, నైతిక ప్రమాణాలను, శాంతీ సుస్థిరతలను నెలకొల్పగల ఏకైక సైద్ధాంతిక వ్యవస్థ అని పశ్చిమదేశాలకు తెలుసు. అంతేకాదు, పాశ్చాత్యులు మానవహక్కుల కొరకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించి సాధించలేక పోయారు. ఇస్లామీయ ప్రజాస్వామ్యంలో దాన్ని సునాయాసంగా సాధించవచ్చని కూడా వారికి తెలుసు. అయితే వారు ఎలాంటి విషయంలోనూ తూర్పుదేశాల ముందు తల వంచడానికి సిద్ధంగా లేరు.

అల్జీరియా సార్వత్రిక ఎన్నికల్లో ఇస్లామిక్ సాల్వేషన్ ఫ్రంట్ ఘనవిజయం సాధించినప్పుడు పాశ్చాత్యమేధావులు చిరైత్తిపోయి అక్కడ మతఛాందసులు అధికారం చేజిక్కించుకోబోతున్నారంటూ గగ్గోలు పెట్టారు. ఈ ఎన్నికల ఫలితాలపై అమెరికా ప్రభుత్వ ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానిస్తూ "మేము ప్రజాస్వామ్యాన్ని తప్పకుండా గౌరవిస్తాం. కాని దీనిద్వారా అల్జీరియాలో మితిమీరిన అధికార ప్రాబల్యంతో ప్రజా స్వామ్యాన్ని, మానవ హక్కులను గౌరవించని వర్గం అధికారంలోకి వస్తే మాత్రం, అది మాకు సంతోషకరమైన విషయం కాదు" అని అన్నారు. ఇస్లాం పట్ల అమెరికా అవలంబించిన ఈ వైఖరి, ఇస్లామిస్టులకు వ్యతిరేకంగా అల్జీరియా సైనికనియంతలు మరింత బరితెగించారు. (తత్ఫలితంగా అక్కడ ఎన్నికల ఫలితాలను రద్దుచేసి ఎమర్జెన్సీ విధించడం, సైనిక పాలకులు ఇస్లాంప్రియులపై హింసాదౌర్జన్యాలకు పాల్పడటం జరిగిపోయాయి.)



పాశ్చాత్య ఆలోచనాసరళికి అద్దంపట్టే 'న్యూస్‌వీక్' పత్రిక రిపోర్టర్ 'టోనీ ఎయిర్సన్' రాచరికవ్యవస్థకు దుష్ట స్మారకచిహ్నంగా మిగిలిన షాహ్ హుసైన్ (జోర్డాన్ రాజు) చేసిన వ్యాఖ్యను ఇలా పేర్కొన్నాడు: "ఫండమెంటలిజం (పునాదివాదం) ఎంతో ప్రమాదకరమైనది. ఇది నియంతృత్వానికి సంబంధించి ఏదో ఒక అతి ప్రమాదకరమైన పోకడను తప్పకుండా తెచ్చిపెడ్తుంది." అలాగే పశ్చిమదేశాలకు ఇష్టమైన మరో సైనిక నియంత జైనుల్ ఆబిదీన్ (టునిషియా అధ్యక్షుడు) ఇస్లామిస్టులను అణచడానికి సైన్యాన్ని అప్రమత్తం చేశాడు. ఇస్లామిస్టులే దేశానికి అత్యంత ప్రమాదకారులంటూ, ఆయన పాశ్చాత్య ప్రభువుల పట్ల తనకున్న స్వామిభక్తిని చాటుకున్నాడు.

ప్రస్తుతం ఇస్లాంకు, అజ్ఞానికి మధ్య విశ్వవ్యాప్త సంఘర్షణ జరుగుతోంది. అమెరికా తన 'న్యూ వరల్డ్ ఆర్డర్' ద్వారా యావత్తు అజ్ఞాన, అనాగరిక శక్తులకు నాయకత్వం వహిస్తోంది. ఆసియా, ఆఫ్రికా దేశాలలో- ప్రత్యేకంగా ముస్లిందేశాలలో భోగలాలసులైన, పాశ్చాత్య నాగరికతాభిమానులైన నియంతలను ప్రోత్సహిస్తోంది. తనకు విధేయులయిన ఆ నియంతల ద్వారా అక్కడి ప్రజా ఉద్యమాలను ఉక్కు పాదంతో అణచివేస్తోంది. ఇస్లాంను గురించి, ఇస్లాం అభిమానులను గురించి అసత్య ప్రచారంచేస్తూ ప్రపంచాన్ని అపమార్గం పట్టిస్తోంది.

ఈవిధంగా అమెరికా సోవియట్ యూనియన్ పతనానంతరం తన 'న్యూ వరల్డ్ ఆర్డర్' మార్గంలో అతిపెద్ద అవరోధంగా మిగిలిన ఇస్లామీయ శక్తిని కూడా తొలగించి యావత్ ప్రపంచానికి నాయకత్వం వహించాలని ఉవ్విళ్ళూరుతోంది. కాని అమెరికా దుష్ట పథకాలు ఎంతోకాలం సాగవు. ఈ అసత్యం, అన్యాయం, అణచివేతల కారుమేఘాల చాటు నుంచే ఏదో ఒకరోజు శాంతీసుస్థిరతలు, నీతిన్యాయాలకు ప్రతీక అయిన ఇస్లాం భానుడు తప్పకుండా తన సహస్ర కిరణాలతో ఉదయిస్తాడు.

**'నూతన ప్రపంచ వ్యవస్థ' అంటే ఇలా ఉంటుందట!-** అమెరికా సమాచారశాఖ ప్రకారం "న్యూ వరల్డ్ ఆర్డర్" ఈ క్రింది అంశాలతో కూడి ఉంది:

(1) ఏ దేశానికైనా తన భౌగోళిక సరిహద్దుల భద్రత కోసం అవసరమైన మేరకే సైనిక, రక్షణ శక్తి కలిగి ఉండేందుకు అనుమతించడం జరుగుతుంది.

(2) ఏ దేశమైనా తన రక్షణ, సైనిక శక్తిని పెంచుకోదలిస్తే అది ఐక్యరాజ్య సమితి అనుమతి తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుంది. (ఐక్యరాజ్యసమితి ఇప్పుడు పూర్తిగా అమెరికా అడుగులకు మడుగులొత్తే సంస్థగా మారిందన్న సంగతి తెలిసిందే.)

(3) అణ్వాయుధాలు ప్రపంచ వినాశానికే ఉపకరిస్తాయి కనుక, వాటిని వీలైనంతవరకు అంతమొందించాలి. అణుశక్తి ప్రజల (చిన్నదేశాల) చేతుల్లో ఉండ కూడదు.

(4) ఏ దేశంలోనయినా రాజకీయ పరిధికి సంబంధించిన మార్పు రాజకీయ విధానాల ద్వారానే తీసుకురావాలి.

(5) ఏ దేశంలోనయినా పార్లమెంటరీ వ్యవస్థ లేక అధ్యక్ష తరహా వ్యవస్థ వంటి పాలనా విధానాన్ని మార్చే విషయంలో పాలకులు స్వయంగా నిర్ణయం తీసుకోకుండా ప్రజల అభీష్టానికి వదలిపెట్టాలి. (ప్రజల అభీష్టం) తన అభిమతానికి వ్యతిరేకంగా ఉంటే మాత్రం అమెరికా దాన్ని నిరంకుశ పాలకుల చేత బలవంతంగా అణచి వేయవచ్చు. (అల్జీరియా, అఫ్గనిస్తాన్ సంఘటనలు దీనికి మంచి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.)

(6) వాణిజ్యానికి సంబంధించిన అంతర్జాతీయ కేంద్రాలు, మార్కెట్‌లు, కాలనీలపై ఏ ఒక్కరికీ గుత్తాధిపత్యం ఉండకూడదు. అందులో ప్రవేశించడానికి ప్రతి ఒక్కరికీ అనుమతి ఉండాలి. ఈ విషయంలో అంతర్జాతీయ అభీష్టం నిర్ణయాత్మక స్థాయి కలిగి ఉండాలి. (అంతర్జాతీయ అభీష్టమంటే ఇక్కడ అమెరికా అభీష్టమే.)

ప్రజాస్వామ్యవిలువలకు, మానవహక్కులకు తాను నిలువుటద్దం అని చెప్పుకునే అమెరికా ఈ విలువలను, హక్కులను తన సొంతనేలపై మాత్రమే గౌరవిస్తుంది కాని బయటి దేశాలలోని, ముఖ్యంగా ఆసియా-ఆఫ్రికాల, పేద-వర్ధమాన దేశాలలోని ప్రజా స్వామ్యవిలువలను, మానవహక్కులను కించిత్తయినా గౌరవించదని పైన పేర్కొన్న అంశాలు చెప్పకనే చెబుతున్నాయి.

## 9. అమెరికా జియోనిస్టుల క్రూసేడ్ యుద్ధాలు

పైన పేర్కొనబడినవన్నీ పాత విషయాలు. అమెరికా ఇప్పుడు వాటికి కొత్తరంగు పులిమి మరింత శక్తితో విజృంభించింది. అది తన వాడిగోళ్ళ చేతుల్ని మరింత సాగదీసి ముస్లిం దేశాలపై విరుచుకుపడింది. టెర్రరిజంపై యుద్ధప్రకటన పేరుతో ఇస్లాంధర్మాన్ని అభిమానించే, ఇస్లాం సంప్రదాయాలను అనుసరించే ముస్లింలకు, ముస్లిందేశాలకు వ్యతిరేకంగా క్రూసేడ్ యుద్ధాల పరంపర ప్రారంభించింది. "నూతన ప్రపంచ వ్యవస్థ" పథకంలోని రెండవ ఘట్టంగా అమెరికా అఫ్గనిస్తాన్‌లో ప్రజాస్వామ్య పద్ధతి ద్వారా అధికారంలోకి వచ్చిన తాలిబాన్ ప్రభుత్వాన్ని కూలదోసింది.

ఇస్లామీయవిలువల ప్రాతిపదికపై చట్టబద్ధంగా ఏర్పడిన తాలిబాన్ ప్రభుత్వాన్ని కూలదోయడంవల్ల ఇస్లాం దురభిమానులైన జియోనిస్టులు సంబరపడ్డారు గాని, అఫ్గనిస్తాన్‌లో అమెరికాకు లభించిన సిరులూగిరులూ ఏమీ లేవు. కాకపోతే తాలిబాన్ ప్రభుత్వం నిషేధించిన గంజాయి పంటను తన కీలుబొమ్మ ప్రభుత్వం ద్వారా మళ్ళీ పండించుకుంటూ పాశ్చాత్య మత్తుభాయీల పంటను పండిస్తోంది. అసలు సిరులూ గిరులూ ఉన్న ఇతర ముస్లిం దేశాలపై పంజా జాపడానికి అఫ్గనిస్తాన్‌పై దాడి అమెరికాకు ఒక వారధి మాత్రమే. ముస్లిం దేశాలకు తాలిబాన్ యోధుల టెర్రరిజం బూచీని మాటి మాటికి చూపిస్తూ వాటిని బెదరగొట్టి పూర్తిగా లోబరచుకోవడానికి కూడా అమెరికాకు మంచి అవకాశం లభించింది.



అఫ్గనిస్తాన్‌లో తాలిబాన్ ప్రభుత్వాన్ని కూలదోసిన తర్వాత ఈ అవకాశం అమెరికాకు ఇరాఖ్‌లో లభించింది. కాని అఫ్గనిస్తాన్ విషయంలో చూపిన టెర్రరిజం బూచీ ఇరాఖ్‌లో ఏదీ లేకపోయినా కేవలం చమురు సంపద కోసం అక్కడ జీవ రసాయనిక ఆయుధాలు ఉన్నాయంటూ ప్రపంచమంతటా గోలగోల చేసి మరీ ఆ దేశాన్ని సర్వనాశనం చేసింది. అయినా దాని యుద్ధదాహం తీరలేదు; ఇస్లాం పట్ల రగులుతున్న దాని విద్వేషాగ్ని కూడా చల్లారలేదు. ఇంతకుముందు పేరాల్లో పేర్కొనబడినట్లు అమెరికా 'నూతన ప్రపంచ వ్యవస్థ' పథకానికి అన్నిటికంటే పెద్ద అవరోధంగా ఉన్న ఇస్లాంను పూర్తిగా తుడిచి పెట్టేందుకు ఆరాటపడుతోంది. అఫ్గనిస్తాన్, ఇరాఖ్ పర్యవసానాలతో బెంబేలు పడిపోయి అమెరికాకు పూర్తిగా దాసోహమైపోయిన ముస్లిం దేశాలు ఇప్పుడు అమెరికా నుంచి ఇస్లాం విషయంలో ఏచిన్న హెచ్చరిక వచ్చినా వణికి పోతున్నాయి.

జియోనిస్టుల అసలు లక్ష్యమైన "అఖండ ఇజ్రాయీల్" సాధనకోసం క్రైస్తవ జనాభా అధికంగావున్న అమెరికా, బ్రిటన్, ఇతర యూరప్ దేశాలకు ముస్లిందేశాలపై రాజకీయ పెత్తనాన్ని, అక్కడి సిరిసంపదల్ని ఎరగా చూపి వాటిని పావులుగా వాడుకుంటున్నారు. ఈ మార్గం సుగమం చేయడానికి మొట్టమొదట అఫ్గనిస్తాన్, ఇరాఖ్‌ల నడుములు విరగ్గొట్టి తద్వారా ముందుకు సాగాలన్నది వారి దుష్టపథకం. ఈ దుష్టపథకంలో వారు చాలావరకు విజయం సాధించారనే చెప్పాలి. అయితే ఇస్లామిస్టుల రూపంలో వారికి కన్పిస్తున్న "టెర్రరిజంభూతం" వారినింకా వెంటాడుతూనే ఉంది. ముఖ్యంగా అఫ్గనిస్తాన్, పాకిస్తాన్, ఇరాఖ్‌లలో 'ఈ భూతం' మాటి మాటికి కన్పిస్తూ వారిని చికాకు పరుస్తోంది.

అఫ్గనిస్తాన్‌లో ఇస్లాంయోధులకు వ్యతిరేకంగా తమకు మద్దతు నిస్తున్న నార్త్రన్ అలైయన్స్ ట్రైబల్ ముస్లింల ముందు అమెరికా సైనికాధికారులు కొన్ని డాలర్ నోట్లు పడవేయడం మినహా వారిని ఇప్పటికీ కుక్కలకన్నా నీచంగా చూస్తున్నారు. ఆ నార్త్రన్ అలైయన్స్‌లో పనిచేసి మానేసిన ఒక ముస్లిం అనుభవాలు అతని నోటే వినండి:

"నేను చెప్పుకోవడానికి ముస్లింనే. ముస్లిం కుటుంబంలోనే పుట్టాను. ఇస్లాం అంటే ఏమిటో, విశ్వాసం అంటే ఏమిటో, సత్యం అంటే ఏమిటో, అసత్యం అంటే ఏమిటో, మంచేమిటో, చెడేమిటో నాకు బొత్తిగా తెలియదు. నేను పుట్టుకతోనే యుద్ధప్రియుడ్ని, కొండగుహలలో పెరిగినవాడ్ని. ఆయుధాలు ప్రయోగించడం, ఆయుధాలతో ఆడుకోవడం నాకు వారసత్వంలో లభించిన వ్యాపకాలు. మా తెగలలో విరోధాలు తరతరాల నుంచి సాగుతూ వస్తున్నాయి......

అఫ్గనిస్తాన్‌పై అమెరికా దాడి చేసినప్పుడు అమెరికా అధికారులు మాకు పెద్ద ఎత్తున డాలర్లు పంచిపెట్టారు. డాలర్లు తమ పని చేసుకుపోయాయి. తాలిబాన్లు, అరబ్ యోధులు తమ శక్తినంతా ధారపోసి చివరివరకు తీవ్రంగా ప్రతిఘటించారు.

కాని అమెరికా భారీఆయుధాల ముందు వారు నిలువలేక పారిపోయారు. ఆ తర్వాత అఫ్గనిస్తాన్‌లో అమెరికా సైనికులు, నార్తర్న్‌అలైయన్స్ వారు జరిపినంతటి దుర్భర దౌర్జన్యకాండ మరెక్కడా జరగ లేదు. హింసాదౌర్జన్యాలు జరిపిన నార్తర్న్‌అలైయన్స్‌లో అప్పుడు నేనూ ఉన్నాను. అమెరికన్లు జరిపిన హింసాకాండను కూడా చూశాను.

**అంతంకాని ఆగడాలు:-** నార్తర్న్‌అలైయన్స్ వారు అమెరికన్లకు మద్దతు ఇవ్వడంలో, వారిఆజ్ఞల్ని పాటించడంలో అతిగా ప్రవర్తించారు. వారు అమెరికన్ల ప్రసన్నత కోసం తమ స్వమతస్థులైన, తమ దేశపౌరులైన వారిపైనే తుపాకులు ఎక్కుపెట్టారు. వాళ్ళను ఇండ్లలో మూసేసి సజీవదహనంచేశారు. వారిస్త్రీల మానాలు దోచుకున్నారు. అనేక మంది కుటుంబ స్త్రీలను వేశ్యగృహాలకు అప్పగించారు. అరబ్ ముజాహిద్‌ల స్త్రీలను, పిల్లలను వివస్త్రచేసి వారి నగ్నశరీరాలపై అమెరికా జెండాలు చిత్రీకరించారు........ ఈ హింసాకాండలో ఎక్కువగా అమెరికన్ యూదులే పాల్గొన్నారు.... నార్తర్న్ అలైయన్స్ సహాయసహకారాలు లేకుండా తాలిబాన్‌లను, అరబ్‌ముజాహిద్‌లను అణచివేయడం తమకు సాధ్యమయ్యేది కాదని అమెరికన్లు కూడా ఒప్పుకుంటారు. కాని మేము ఇంత చేసినా వారు మమ్మల్ని (నార్తర్న్‌అలైయన్స్ వారిని) పరమఅసహ్యంగా దూషించేవారు.

ఖైదీలను కొన్నాళ్ళు ఖంధార్, బగ్రామ్ పట్టణాలలో ఉంచిన తరువాత వారిని క్యూబా జైళ్ళకు తరలించేవారు. అలా క్యూబాకు పంపే ఖైదీలతో "మీ కష్టాలకు మేము బాధ్యులం కాము; మీపై హింసాకాండ సాగించిన మీ సోదర ముస్లింలైన నార్తర్న్ అలైయన్స్‌వారే బాధ్యులు. ధనాశతో వారు మా తరపున గూఢచారులుగా పని చేస్తూ మిమ్మల్ని మాకప్పగించారు" అని చెప్పేవారు అమెరికన్లు. ....మేము అమెరికన్ల తరపున గూఢచారులుగా పనిచేస్తూ తాలిబాన్లను, అరబ్ యోధులను పట్టించి ఇస్తుంటే వారు మాకు కృతజ్ఞతలు చెప్పడానికి బదులు మమ్మల్ని, ధనాశాపరులైన కుక్కలని, గాడిద కొడుకులని, పందులని పిలిచేవారు.....

ఖందార్‌లో ఒక అమెరికన్ సైనికాధికారితో నాకు స్నేహమయింది. మేమిద్దరం పిచ్చాపాటిగా మాట్లాడుకునేవాళ్ళం. ఇద్దరం కలసి మద్యం సేవించేవాళ్ళం. అలాంటి పరిస్థితిలో ఒకసారి నేను మాట్లాడుతూ "మీరు తాలిబాన్లను, అరబ్‌యోధులను దూషించడానికి కారణం అర్థమవుతోంది కాని, మేము శక్తివంచనలేకుండా మీకు మా సహాయసహకారాలు అందజేస్తున్నప్పటికీ మమ్మల్ని మీరు దూషించడమే నాకు అర్థం కావడం లేదు" అని అన్నాను."

**అమెరికా అసలు పథకం:-** అమెరికన్ అధికారి ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నాడు. అతను నా మాటలు వినగానే మొదట నన్ను, యావత్తు ప్రపంచ ముస్లింలను ఘోరమైన ఒకతిట్టు తిట్టాడు. తరువాత ఇలా అన్నాడు: "ఎవరైనా ఒక్కసారి కలిమా (సద్వచనం) పఠించడంగాని లేదా ముస్లింకుటుంబంలో పుట్టడం గాని జరిగితే అతనిలో ఎక్కడో ఓచోట ఇస్లాం విశ్వాసకణం తప్పకుండా మిగిలి



ఉంటుంది. జీవితంలో ఎప్పటికైనా దాన్నతను వ్యక్తపరుస్తాడు. కనుక మా దృష్టిలో ఈ రోగానికి ఒకేఒక చికిత్స ఉంది. మొదట మేము ముస్లింలకు ధనాశ చూపి వాళ్ళను కొని వారి మతవిశ్వాసాన్ని బలహీనపరుస్తాము. తరువాత వాళ్ళను శాశ్వతంగా అంతమొందిస్తాం. బోస్నియాలో మేము ఈ పనే చేశాము. పాలస్తీనాలో కూడా ఈ పనే చేస్తున్నాం. ఇప్పుడు అఫ్గనిస్తాన్, ఇరాఖ్‌లలో కూడా మేము ఈ పనే చేస్తున్నాం."

"మోమిండ్‌ఖాన్! బోస్నియా ముస్లింల కంటే మీరేమంత ధైర్యవంతులు, స్వేచ్ఛాప్రియులు కాదు. వారి రెండు మూడు తరాలవారు మాతో కలసి తిన్నారు, తాగారు. వారి వృద్ధులకు ఖుర్‌ఆన్ ఏమిటో, మసీదులేమిటో తెలియదు. వారి యువకులు మాతో కలిసి నైట్‌క్లబ్బుల్లో రేయింబవళ్ళు గడిపేవారు. వారు మాతో కలసి మద్యం కూడా సేవించేవారు, పందిమాంసం కూడా తినేవారు. అయినప్పటికీ మా మతస్థులు వారిపట్ల ఎలా ప్రవర్తించారో నీకు తెలుసు."

"మోమిండ్‌ఖాన్! బోస్నియా ముస్లింలు ఆచరణపరమైన ముస్లింలు కాదన్నది నిజమే. కాని వారి పేర్లు ముస్లింపేర్లే కదా! అలాగే నార్తర్న్‌అలైయన్స్ ముస్లింలు మాకు పూర్తి సహాయసహకారాలు అందించిన మాట కూడా నిజమే. కాని వీరి పేర్లు కూడా ముస్లింపేర్లే కదా! పైగా వారు మా కోసం చేసిన పనులు మనస్ఫూర్తిగా చేసినవి కావు, ధనాశలో పడి చేశారు. ప్రపంచంలో రెండు రకాల ముస్లింలు మాత్రమే ఉన్నారు. ఒకటి, తాలిబాన్‌లు, అరబ్‌యోధుల్లాంటి నిస్వార్థపరులైన ముస్లింలు. రెండు, నార్తర్న్‌అలైఅన్స్ ముస్లిముల్లాంటి ధనాశపరులైన కుక్కలు, పందులు,...."

"వారి ముందు ఓ మాంసపుముక్క పడవేస్తే చాలు, వారు మాచుట్టూ తోకలూపుకుంటూ తిరుగుతారు; మా సైగలతో తమ స్వమతస్థుల్ని సైతం కరుస్తారు. ఇలాంటి కుక్కలు మాంసపుముక్కలు దొరుకుతున్నంత కాలం విధేయులైఉంటాయి. మాంసం ముక్కలు దొరకటం ఆగిపోగానే అవి తమ యజమానినే కరచి తింటాయి. అలాంటి పరిస్థితి రాకముందే వారికి తగిన చికిత్స కూడా మేము చేయవలసి ఉంటుంది."

"మిత్రమా! విను. అమెరికాలో మాకు ఎలాంటి సౌఖ్యాలు, సౌకర్యాలున్నాయో అఫ్గనిస్తాన్‌లో వాటిని గురించి ఊహించనైనా లేము. అఫ్గనిస్తాన్ సుందరమైన దేశం కాదు. ఇక్కడ బంగారు గనులు కూడా లేవు. అయినా అఫ్గనిస్తాన్‌పై దాడిచేసి గుంతలు పడిన రోడ్లు, పంజరుకొండలు ఉన్న ఈ దేశంలో మేము కూర్చున్నామంటే దానికి ఓ ప్రత్యేక కారణం ఉంది. ప్రస్తుత శతాబ్దం క్రైస్తవులు-యూదులు ప్రాబల్యం వహించే, ముస్లింలు అంతమయ్యే దశాబ్దం కానున్నది. అఫ్గనిస్తాన్‌లో తాలిబాన్‌లను, అరబ్‌యోధులను అంతమొందించకుండా ఇరాఖ్‌పై దాడిచేస్తే అది మాకెన్నో ఇబ్బందులు తెచ్చిపెట్ట వచ్చు. అంచేత ఇరాఖ్‌పై దాడి, ఆ తర్వాత మధ్యప్రాచ్యంలో అఖండ యూదసామ్రాజ్యం స్థాపన కోసం ముందుగా అఫ్గనిస్తాన్‌లోని ఇస్లామీయ యోధుల నడుములు విరగ్గొట్ట వలసిన అవసరమొచ్చింది."

“ముస్లిం పంక్తులలో నీలాంటి ధనాశపరులయిన ముష్టివెధవలు ఉండటం మాకెంతో ఆనందంగా ఉంది. నీలాంటివాళ్ళ సహకారంతో మాకు అఫ్గనిస్తాన్‌లో విజయం లభించింది. ఆ తర్వాత కూడా మేము ముస్లింజగత్తుపై విజయపరంపరలు సాధించడానికి, సిలువప్రాబల్య పతాకాలు ఎగరవేయడానికి ప్రారంభించే పవిత్ర యుద్ధంలో ముస్లిం జగత్తు నుంచి మాకు వేలాదిమంది మోమింద్ ఖాన్‌లు లభిస్తారు....”

“మిత్రమా! నీకు చరిత్ర పట్ల ఆసక్తి ఉంటే విను. పాలస్తీనాను సాధించుకోవడానికి, బైతుల్‌ముఖద్దస్ (జెరూసలేం)ను స్వాధీనం చేసుకోవడానికి క్రైస్తవులు శిలువ యుద్ధ పరంపరలు ప్రారంభించినప్పుడు ఆ యుద్ధాలలో పాల్గొన్నవారు ఈనాటి (క్రైస్తవ)సైనికుల కంటే ఎంతో ఎక్కువ తాగుబోతులు, వ్యభిచారులు, సంస్కార హీనులుగా ఉండేవారు. మా పాలకులలో, పాదరీలలో కూడా ఇదే పరిస్థితి ఉండేది. వారు సాధారణ పరిస్థితులలో మందు-మగువ మత్తులో మునిగితేలుతుంటారు. కాని సిలువ-నెలవంక సంఘర్షణ సమయం వస్తే మాత్రం శత్రువులతో ప్రాణాలు తెగించి పోరాడుతారు. మద్యపానం మా మతభావోద్రేకాలను రెచ్చగొడ్తుంది.”

“సోవియట్ రష్యా పతనం తరువాత ముస్లింలు ప్రపంచంలో ఇస్లాం ఆధిక్యతా కలలు గనడం ప్రారంభించారు. సైన్సు, సాంకేతిక రంగాల ప్రగతి కోసం మేము పాటుపడాలి; నేలపై, నీటిపై మా నిర్వహణ సాగాలి; అంతరిక్ష విజయాలు మేము సాధించాలి. కాని రాజకీయ, మతపరమైన పటిష్ఠత, ప్రాబల్యాల కలలు మాత్రం ముస్లింలు కనాలా! ఇదెలా సాధ్యం?’......

(మోమింద్‌ఖాన్ కథనం:).......యధాప్రకారం ఓరోజు ఖంధార్ జైలు నుంచి ఇంటరాగేషన్ కోసం పొడవైన గడ్డాలున్న కొందరు అరబ్ ఖైదీలను ఖంధార్ ఎయిర్ పోర్టుకు తీసుకురావడం జరిగింది. మొదట వారిని ఇనుప సంకెళ్ళతో కాళ్ళుచేతులు కట్టివేశారు. తరువాత వారి శిరోజాలు, గడ్డాలు, కనుబొమలు గొరిగించి వారిని భయంకరమైన చిత్రహింసలకు గురిచేశారు. ఆ తరువాత ఒక అమెరికన్ అధికారి వారి ముందు నిలబడి ఇలా ప్రసంగించాడు:

“మీరు గౌరవం, సాఫల్యాలు ధర్మాన్ని ఆచరించడం వల్ల లభిస్తాయిని అంటారు. మీ ముహమ్మద్ (సల్లం) ఆజ్ఞ కనుక గడ్డాలు పెట్టుకుంటున్నామని చెబుతారు. ఇస్లాం ప్రాబల్యం, సిలువను విరగొట్టే కలలు కంటున్న ముస్లింలారా! మీ స్థాయి ఏమిటో, మీరెంతటివాళ్ళో ఆలోచించుకోండి. మీకు ఎలాంటి ఇళ్ళు లేవు, స్వస్థలాలు లేవు. మీ మాతృదేశాలలో మీ కోసం ఉరితాళ్ళు ఎదురుచూస్తున్నాయి. మీ పాదాల కింది నుంచి మేము అఫ్గనిస్తాన్‌ని లాక్కున్నాము. మీ కిప్పుడు ప్రపంచంలో ఎక్కడా ఆశ్రయం లేదు. అఫ్గనిస్తాన్‌లో మీరు నిర్మించుకున్న ఇండ్లను మేము నేలమట్టం చేశాం. మా బాంబుదాడులు మీనుండి మీ పసిపిల్లలను లాగివేశాయి. పరదా



పాటించడం ఖుర్‌ఆన్ ఆజ్ఞ అని మీరు ఏడేసి పరదాల చాటున దాచిన మీ తల్లులు, అక్కచెల్లెళ్ళు, భార్యలు, కుమార్తెలు మా లైంగికేచ్ఛకు బలయిపోయారు....”

“బాగా వినండి. మేము మిమ్మల్ని అణచివేస్తాం, నలిపేస్తాం, తొక్కివేస్తాం. ఇతర ముస్లింలకు కనువిప్పు కలిగేలా మేము మీకు చావును కోరుకునేటటువంటి నరక యాతనలకు గురిచేస్తాం.....మీరు మొత్తం ప్రపంచంలోనే పెద్ద టెర్రరిస్టులు. మీ ధర్మం టెర్రరిజాన్ని బోధిస్తుంది. మీ ఖుర్‌ఆన్ టెర్రరిస్టు శిక్షణ ఇస్తుంది. మీ ప్రవక్త ప్రపంచంలో అందరికంటే అతిపెద్ద టెర్రరిస్టు. (దైవం క్షమించుగాక). మేము మీ మతాన్ని తుడిచిపెడతాం. మీ ఖుర్‌ఆన్‌ని కాల్చిపారేస్తాం. (దైవం క్షమించుగాక.)......”

అమెరికన్ అధికారి చేసిన ఈ ప్రసంగం తరువాత సంకెళ్ళతో బంధించబడిన ఖైదీలలో ఒక అరబ్ ఖైదీ ముందుకొచ్చి అదురూ బెదురూ లేకుండా ఇంగ్లీషులో ఇలా ధారాళంగా మాట్లాడాడు:

**చేసిన మేలు మరచిన క్రైస్తవులు:-** “మిస్టర్! జాతుల గతచరిత్ర వాటి వర్తమాన చరిత్రకు అద్దంలాంటిది. రా. మన ఉభయజాతుల గతచరిత్రలను ఓసారి పరిశీలిద్దాం. మిమ్మల్ని మీరు గొప్ప ప్రజాస్వామ్య ధ్వజవాహకులని, పరమ శాంతికాముకులని చెప్పుకుంటారు. మేము మాత్రం మీ దృష్టిలో టెర్రరిస్తులం! మేము కాదు, మీరే పెద్ద టెర్రరిస్టులు. మన ఉభయుల గత చరిత్రలేమిటో చరిత్ర గ్రంథాలలో భద్రపరచబడి ఉన్నాయి. సిలువ పూజారులు బైతుల్ ముఖద్దస్ (జెరూసలేం)పై విజయపతాకం ఎగరవేసిన వెంటనే ముస్లింలపై మారణకాండ జరిపి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. వారి గుర్రాల గిట్టలు ముస్లింల నెత్తుటితో తడిసిపోయాయి. పట్టణవీథుల్లో ముస్లింల రక్తం వర్షపు నీరులా ప్రవహించింది. మీయీ వైఖరికి భిన్నంగా సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి బైతుల్ ముఖద్దస్‌ని జయించిన తరువాత క్రైస్తవుల పట్ల ఆయన కనబరచిన న్యాయవైఖరి ఎలాంటిదో మీ చరిత్రకారులకు కూడా తెలుసు.”

“స్పెయిన్ చరిత్రను ఓసారి గుర్తుకు తెచ్చుకోండి. స్పెయిన్‌లో మేము మీకు ఎన్నెన్నో భాగ్యాలు ఇచ్చాము. విద్య, వివేకం, వైద్యం, విజ్ఞానం, ఐశ్వర్యం- ఒకటేమిటీ, అనేక సంపదలతో స్పెయిన్ ఖజానాలు నింపేశాము. మేము యూరప్‌కు వ్రేలు పట్టుకొని నడిపించాము; చేయిపట్టుకొని వ్రాయించడం నేర్పాము. మీ విశ్వవిద్యాలయాల్లో, పరిశోధనాశాలల్లో మా మేధావులు, వైజ్ఞానికులు, తాత్వికులు వ్రాసిన పుస్తకాలను శతాబ్దాల తరబడి చదివించడం జరుగుతుండేది. అది మీ పాదరీలు, పోపులు తాము అజ్ఞానులుగా ఉండటాన్ని గర్వకారణంగా భావిస్తుండిన కాలం. ఒకవేళ ఎవరైనా క్రైస్తవుడు ముస్లింలతో ప్రభావితుడయి జ్ఞానార్జన కోసం ప్రయత్నిస్తే చర్చిఅధికారులు అతడ్ని సజీవసమాధి చేసేవారు.”

“ఈ యదార్థాలన్నీ చరిత్ర పుస్తకాలలో భద్రపరచబడి ఉన్నాయి. మీకు ధైర్యముంటే వాషింగ్టన్‌లోని ఏదైనా లైబ్రరీకు వెళ్దాం పదండి. నగరం మీదే, లైబ్రరీ

మీదే, అందులోని పుస్తకాలు కూడా మీవే. మేము అధికారంలో, ఉచ్ఛదశలో ఉన్నప్పుడు మీపట్ల మేము ఎలా వ్యవహరించామో మీ పుస్తకాలే తీర్పిస్తాయి. ఈనాడు మీరు ఉచ్ఛదశలో ఉండి మాపట్ల మీరు ఎలా ప్రవర్తిస్తున్నారో పాలస్తీనాలోని ప్రతి అంగుళం భూభాగం సాక్ష్యం ఇస్తోంది. యూదులు ఈనాడు మీ తలలపై బలవంతపు కిరీటాలయి కూర్చున్నారు. వారు మీ మెడలపై ఎక్కి మీచేత ముస్లింల మీద దౌర్జనకాండలు జరిపిస్తున్నారు. ఈ యూదులకే మేము స్పెయిన్‌లో చోటిచ్చాం, ఆశ్రయమిచ్చాం, ఆదరించాం, గౌరవించాము. కాని స్పెయిన్ మీ అధికారంలోకి వచ్చిన తరువాత మీరు ఈ యూదుల్ని దేశం నుండి తరిమికొట్టారు. అప్పుడు ఉస్మానియా ఖిలాఫత్ ప్రభుత్వం వారి కోసం తన ద్వారాలు తెరచిపెట్టింది.''

"రండి, మీ మేధావులు, చరిత్రకారుల సమక్షంలో నాతో సంభాషణ జరపండి. వాస్తవాలు వీటికి వ్యతిరేకంగా ఉంటే మీరన్నట్లు మేము నిజంగా టెర్రరిస్టులమే. కాని వాస్తవాలు ఇవే అయితే మీ ఇష్టం; మీ హృదయాలు, అంతరాత్మలు ఎలా మసిబారి ఉన్నాయో, అలా మీముఖాలక్కూడా మసిపూసుకొని పాడుచేసుకోండి. నల్లహృదయాలతో, నల్ల అంతరాత్మలతో వున్న తెల్లమొహాలకు నల్లపనులు శోభించవు.... సత్యాసత్యాల సంగ్రామ పరంపర ప్రారంభమైంది. ఈ సంగ్రామంలో అసత్యం పరాజయం పాలవుతుంది. సత్యమే విజయం సాధిస్తుంది. ఈనాడు మేమీ సత్యవిజయం చూడ లేకపోతే మా భావితరాలు దైవచిత్తమయితే తప్పక చూస్తాయి.''

"మీరు ఉసామా బిన్‌లాదిన్, ముల్లాఉమర్‌ల పేర్లను ఆసరగా తీసుకొని ముస్లింలపై హింసాకాండకు పాల్పడ్డారు. మీ యుద్ధం అసలు ముస్లింలకు వ్యతిరేకంగా కాదు, ఇస్లాంకు వ్యతిరేకంగా జరుగుతోంది. మీరు ఇస్లాం వాస్తవికత, సత్యతల పట్ల భయపడుతున్నారు. ప్రపంచంలో పెరుగుతున్న ఇస్లాం ప్రభావం, ప్రాబల్యాలు చూసి బెంబేలెత్తి పోతున్నారు. కాని ఒక విషయం గర్తుంచుకోండి. ఇస్లాంను తుడిచి పెట్టేందుకు మీరు పన్నుతున్న కుట్రలు కుతంత్రాలు చివరికి మీకే ఉరిత్రాడులుగా మారుతాయి....''

"యుద్ధం తీవ్రరూపం దాల్చినప్పుడు మీరు పిరికిపందల్లా మడమ తిప్పి రంగం నుంచి పారిపోవడం మీ చరిత్రలో ఒక భాగమయిపోయింది. ఈసా (అలైహి)ను దేవుడు సజీవంగా ఆకాశంలోకి పెకెత్తుకున్నాడని మా ఖుర్‌ఆన్ అంటున్నది. దీనికి భిన్నంగా మీ మతగ్రంథాలు ఈసా (అలైహి)ను సిలువపై ఎక్కించినప్పుడు ఆయన శిష్యులు ప్రాణత్యాగం చేసి ఆయన్ని కాపాడటానికి బదులు పారిపోయారని చెబుతున్నాయి. మీకు గుర్తుందా? సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి పాలస్తీనా భూభాగం నుండి మీ నాయకులను, పెద్దలను తరిమి తరిమి కొడ్తున్నప్పుడు, మీ నాయకుల్లో ఒకతను క్రైస్తవుల ప్రాణాలు కాపాడేందుకు లంచంగా తన చెల్లెల్ని సుల్తాన్ సోదరుడు మలిక్ ఆదిల్‌కు అప్పగించడానికి సిద్ధమయ్యాడు.''



**బతికితే సమరయోధులు, చస్తే అమరవీరులు:-** "మిస్టర్! మీరు మా పర్యవసానం గురించి కాదు, (పరలోకంలో) మీ పర్యవసానం ఏమవుతుందో ఆలోచించుకోండి. మేము సజీవంగా ఉంటే సమరయోధులు అనబడతాము. మీ చేతిలో మరణిస్తే అమర వీరులవుతాము. మీరిప్పుడు రానున్న భయంకర పర్యవసానం నుండి కాపాడు కోదలిస్తే ఒకేఒక మార్గం ఉంది. మీరు ఇస్లాం స్వీకరించి మాలో చేరిపోండి. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆశ్రయం పొంది ఏకదైవారాధకులుగా జీవితం గడపండి. మీరు (పరలోక) దుష్పర్యవసానం నుండి కాపాడుకునే ఏకైకమార్గం ఇదే....''

ఆ తరువాత ఆ అరబ్ యోధుడు తల పైకెత్తి ఆకాశం వైపు చూస్తూ, చేతులు జోడించి ఈ విధంగా ప్రార్థించాడు: "దేవా! దేవా! నేను నీ ధర్మసందేశాన్ని వీరికి అందజేశాను. దీనికి నీవే సాక్ష్యం. దేవా! నీయీ దాసులకు రుజుమార్గం ఏమిటో, అపమార్గం ఏమిటో తెలియదు. సత్యం ఏమిటో, అసత్యం ఏమిటో, ధర్మం ఏమిటో, అధర్మం ఏమిటో బొత్తిగా తెలియదు. నీయీ దాసులపై దయజూపు. వీరిని నరకాగ్ని నుండి కాపాడు. నరకాగ్ని నుండి కాపాడు.....''

అరబ్ యువకుని ప్రసంగం ముగిసిన తరువాత ఆ అమెరికన్ అధికారి బెల్లం కొట్టిన రాయిలా కాస్సేపు మౌనంగా నిలబడ్డాడు. ఆ తరువాత ఓ గావుకేక పెట్టి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. ఇతర అధికారులు కూడా పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ అతని వెనకాలే నడిచారు....

ఈ సంఘటన మొదటిసారిగా నా రాతిగుండెపై సుత్తిదెబ్బ వేసింది... ఆ తరువాత ఖంధార్ ఎయిర్‌పోర్ట్ దగ్గర జరిగిన మరో సంఘటనతో నాకు పూర్తిగా కనువిప్పు కలిగింది. సంకెళ్ళతో కాళ్ళుచేతులు కట్టివేయబడిన తాలిబాన్, అరబ్ ఖైదీలు ఒకవైపు  నిల్చున్నారు. ఇంతకు ముందు అరబ్‌యువ ఖైదీతో సంభాషణ జరిపిన అమెరికన్ సైనికాధికారి, అతని అనుచరులు వారి ముందు నిలబడ్డారు. కాస్సేపటి తరువాత అమెరికన్ అధికారి హఠాత్తుగా తన జేబులో చేయిపెట్టి ఓ పుస్తకం బయటికి తీశాడు. దాన్ని ఖైదీలకు చూపిస్తూ ఇలా అన్నాడు:

**ఖుర్‌ఆన్ పట్ల అపచారం:-** "ముస్లింలారా! నా చేతిలో ఉన్న ఈ పుస్తకం ఏమిటో మీకు తెలుసా? మీకు తప్పకుండా తెలుసు. మీ భాషలో ఖుర్‌ఆన్ అని చెప్పే పుస్తకం ఇది. ఖుర్‌ఆన్ ప్రకారం ఆచరిస్తే ఇహపరలోకాల్లో సాఫల్యం లభిస్తుందని అంటారు మీరు. ఖుర్‌ఆన్ మీ ప్రవక్తపై దేవుడు అవతరింపజేసిన దివ్యగ్రంథం అని చెబుతారు. మీరు దీన్ని ప్రాణంకన్నా మిన్నగా చూసుకుంటూ దీనిద్వారా మీరు ప్రపంచంలో ప్రాబల్యం వహించగల్గుతామని భావిస్తున్నారు. మీ దేవుడు యావత్తు విశ్వానికి ప్రభువు, యజమాని కదా! అయితే మీ దేవుడ్ని పిలుచుకోండి, ఆయన మీకు ఎంత సహాయం చేస్తాడో మేము చూస్తాం. నేనిప్పుడు మీ

ఖుర్‌ఆన్ పట్ల ఎంత చెడుగా ప్రవర్తిస్తానో చూడండి. నన్నీ పని నుండి మీ దేవుడొచ్చి అడ్డుకుంటాడేమో చూస్తాను.''

ఈ మాటలు చెప్పి ఆ అమెరికన్ అధికారి చేతిలోని ఖుర్‌ఆన్ ప్రతిని నేలకేసి విసిరికొట్టాడు. తరువాత దాని మీద కాలు పెట్టి తొక్కివేస్తూ ''ముస్లింలారా! నేనిప్పుడు మీ పవిత్ర గ్రంథాన్ని కాళ్ళతో తొక్కి ఎలా పాడుచేస్తున్నానో అదేవిధంగా మేము ప్రపంచంలోని ముస్లింలందరినీ తొక్కివేసి అంతమొందిస్తాం. మరి మీలో ఎవరైనా నన్ను అడ్డుకునే వారున్నారా?'' అని అన్నాడు.

ఆ తరువాత ఆ దుర్మార్గుడు మరికొన్ని ఖుర్‌ఆన్ ప్రతులు తెప్పించి వాటిలో కొన్నిటిని చింపి గాలిలో ఎగరేశాడు; మిగిలిన ప్రతులను పక్కనే ఉన్న మలవిసర్జన డ్రమ్ములలోకి విసరిపడేశాడు....

(త్రైదిన ఉర్దూపత్రిక 'దావత్' 1-6-05, 4-6-05 సంచికల సౌజన్యంతో)

## 10. గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ)

పెట్టుబడిదారీ వ్యవస్థకు జవజీవాలిచ్చి పోషిస్తున్న ఏకైక అగ్రరాజ్యం అమెరికా తన వ్యాపారానికి అనువైన మార్కెట్‌ల అన్వేషణలో యావత్ప్రపంచాన్ని ముఖ్యంగా ఆసియాదేశాల్ని తన గుప్పెట్లో పెట్టుకోడానికి ఇప్పుడు ''గ్లోబలైజేషన్'' (ప్రపంచీకరణ) పేరుతో మసిబూసిన మారేడుకాయ చూపిస్తూ పేద, వర్ధమాన దేశాల్ని ఊరిస్తోంది.

పాశ్చాత్యదేశాలు ప్రపంచీకరణను అంతర్జాతీయ వాదంగా చూపెట్టే ప్రయత్నం లో ''ఆధునిక ప్రపంచంలోని దేశాలు ఒకదానిమీదొకటి ఆధారపడుతున్నాయి; ఒకదానికొకటి అనుసంధానింపబడుతున్నాయి. ప్రపంచీకరణ అంటే ఇదే'' అని బ్రిటిష్ సర్కారు శ్వేతపత్రం పేర్కొంటున్నది. కాని వాస్తవం దీనికిభిన్నంగా ఉంది. ఒక బహుళ జాతి సంస్థ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాటల్లో వాస్తవం ఇలా ఉంది:

''నా సంస్థకు ఎక్కడ కావాలంటే అక్కడ స్వేచ్ఛగా పెట్టుబడి పెట్టే అవకాశాన్ని ప్రపంచీకరణ కల్పిస్తుంది. ఏదనుకుంటే దాన్ని ఉత్పత్తి చేసుకునే హక్కును ఇస్తుంది. ఎక్కడనుండైనా ముడిసరుకులు తెచ్చుకోవడానికి, ఉత్పత్తుల్ని ఏ చోటనైనా అమ్ముకో వడానికి ఇది అవకాశం కల్పిస్తుంది. ఈ ప్రక్రియలో కార్మికుల హక్కులు, సామాజిక నియంత్రణలు వంటివేవీ మాకు అడ్డుగా నిలబడవు.''

మరోమాటలో చెప్పాలంటే బహుళజాతి సంస్థల (Multi National Companies)కు హద్దులులేని స్వేచ్ఛ కల్పించడానికి రూపొందించిన దుష్టప్రక్రియే ఈ ప్రపంచీకరణ. ప్రపంచమంతా ఒకే మార్కెట్‌గా రూపొందాలని, దానికి ఎలాంటి ఆర్థికఅడ్డంకులు లేకుండా తాము యధేచ్ఛంగా కార్యకలాపాలు నిర్వహించుకో గలగాలనేదే ఈ బహుళజాతి సంస్థల కోరిక. తద్వారా బహుళజాతి సంస్థల షేర్‌హోల్డర్లు



విపరీతంగా లాభాలు దండుకోవాలన్నమాట!

బ్రిటన్ ప్రధాని టోనీబ్లెయర్ దీనిపై స్పందిస్తూ ''ప్రపంచీకరణను మార్చేందుకు వీలులేదు, దీన్ని అడ్డుకునేందుకు అవకాశం లేదు'' అని అన్నారు. అలాగే అమెరికా మాజీఅధ్యక్షుడు బిల్‌క్లింటన్ ''ప్రపంచీకరణ అనేది ఎంపిక చేసుకున్న విధానం కాదు, ఇది అనివార్యమైన అవసరం'' అని అన్నారు.

నేనీ శీర్షిక వివరాల్లోకి పోకుండా 'ప్రపంచీకరణ' ప్రక్రియలోని వినాశ తీవ్రతను వివరించడానికి మాత్రమే ఇక్కడ కొన్ని ఉదాహరణలు పేర్కొంటున్నాను.

**కొత్తసీసాలో పాతసారా:-** మెక్సికోకు చెందిన గుస్తవో ఎస్తెవా ప్రపంచీకరణను 'కొత్తసీసాలో పాతసారా'గా పరిగణిస్తూ ఇలా అన్నారు: ''ఏకైక ప్రపంచమనే పశ్చిమ దేశాల భావనకు గత 300 ఏళ్ళుగా ఒక ఆర్థిక రూపాన్నిచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పెట్టుబడి అనే గొడుగుకింద దీన్ని విశ్వప్రాజెక్టుగా పాశ్చాత్యదేశాలు రూపొందించాయి. రెండో ప్రపంచయుద్ధం తర్వాత అమెరికా ఈ ప్రణాళికను తనఆధిపత్యం కిందికి తీసుకొని తన ప్రతిష్ఠ, ప్రయోజనాల పెంపుదలకు వాడుకుంది. 20-1-1949న అమెరికా కమ్యూనిజంపై ప్రచ్ఛన్నయుద్ధం ప్రకటించింది. దీనికోసం అభివృద్ధి మంత్రాన్ని నినాదంగా స్వీకరించింది. నాల్గు దశాబ్దాల తర్వాత ఆ నినాదాన్ని మార్చి ప్రపంచీకరణ జపాన్ని స్వీకరించింది. ప్రతి మనిషిని ఆర్థికజీవిగా మార్చే ఆర్థిక-సాంస్కృతిక ప్రాజెక్టు ఇది. ప్రపంచీకరణ ప్రక్రియకు రాజకీయకోణం కూడా ఉంది. అది ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విస్తరణ, మానవ హక్కుల పరిరక్షణల పేర్లతో దీనికొక నైతిక దృక్కోణం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నది.''

ఇంగ్లాండ్‌కు చెందిన 'వరల్డ్ డెవలప్‌మెంట్ మువ్‌మెంట్ డైరెక్టర్' బ్యారీకోట్స్ ఇలా అన్నారు: ''ప్రభుత్వాల ఊతంతో బహుళజాతి సంస్థలు సాగిస్తున్న ఆర్థిక ఏకీకరణ విధానమే ప్రపంచీకరణ. ప్రపంచబ్యాంకు (WB), అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్-IMF), ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్-WTO)ల పూనికతో ఈ ప్రక్రియ సాధ్యమవుతున్నది. ప్రభుత్వాలు నియంత్రణలు ఎత్తివేయడం వల్ల కార్పొరేట్ సంస్థల నేతృత్వంలోని ప్రపంచీకరణకు మార్గం సుగమమవుతున్నది. ప్రపంచీకరణకు, అంతర్జాతీయకరణకు చాలా తేడా ఉంది. భిన్న సంస్కృతులు, ఆహారపుటలవాట్లు, సంగీతం, అనుభవాలు పంచు కోవడమే అంతర్జాతీయకరణ.''

''ఫ్రెండ్స్ ఆఫ్ ద ఎర్త్ (యు.కె.)''కు చెందిన రోనీహాల్ ఇలా వ్యాఖ్యానించారు: ''ప్రపంచీకరణ ప్రక్రియ ఆచరణలో ధనికదేశాలు, సంపన్న కంపెనీలు, భాగ్యవంతు లకు మాత్రమే లాభాల పంటలు పండిస్తుంది. పేదదేశాలు, చిన్న వ్యాపారులు, బీద ప్రజానీకం, పర్యావరణం ఈ ప్రక్రియ పర్యవసానంగా దెబ్బతింటాయి. అసలీ సిద్ధాంతమే పూర్తిగా అన్యాయపూరితమైనది. దీనివల్ల ముఖ్యంగా ప్రకృతి ఒనరులు

పూర్తిగా ధ్వంసమై పోతాయి. ప్రపంచీకరణ పదఘట్టనలలో నేటి, భావి తరాల ప్రజలు నలిగిపోతారు.''

భారతదేశ పార్లమెంట్‌సభ్యుడు బీర్‌సింగ్ మహతో వ్యాఖ్యానిస్తూ "బలవంతులు-దుర్బలురు, సంపన్నులు-పేదల మధ్య పోటీతత్వమే ఈ ప్రపంచీకరణ. ఈ విధానం వల్ల ధనికదేశాలు లాభపడ్తాయి, పేదదేశాలు నష్టపోతాయి.''

ప్రపంచీకరణ వల్ల సంపన్న-పేద దేశాల మధ్య అఖాతం మరింత పెరుగుతోంది. అలాగే వివిధ దేశాలలోని ధనిక-పేద వర్గాల మధ్య కూడా ఆర్థిక వ్యత్యాసం అధికమవుతోంది. 1960వ దశకంలో ప్రపంచంలో అత్యంత సంపన్నులైన 20 శాతం జనాభా చేతిలో కిందితరగతి 20 శాతం ప్రజానీకానికన్నా 30 శాతం ఎక్కువ సంపద ఉండేది. 1997 నాటికి ఇది 74 శాతానికి చేరుకుంది. 1970-1995 మధ్యకాలంలో బహుళజాతి సంస్థల సంఖ్య 7 వేల నుండి 40 వేలకు పెరిగింది. 2005 నాటికి 46 దేశాల రాబడికన్నా ఐదు గుత్త కార్పొరేషన్ల మొత్తం ఆదాయమే అధికమైపోయింది.

"అభివృద్ధి నిధి (నార్వే)'' ప్రతినిధి అక్సెల్ నీర్‌స్తాద్ పరిశీలన ప్రకారం 143 దేశాల స్థూల జాతీయ ఆదాయం కన్నా ఒక్క ఫిలిప్ మోరిస్ కంపెనీ ఆదాయమే ఎక్కువ. అలాగే ప్రపంచంలోని 225 మంది అత్యంత సంపన్నుల వార్షికాదాయం భూమండలం లోని 250 కోట్ల పేద ప్రజానీకపు రాబడితో సమానంగా ఉంది.

"పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్'' సభ్యుడు జెన్నిఫర్ మొరీన్ ఇలా అన్నారు:

"ప్రపంచీకరణ మా ఆహారపుటలవాట్లను, మా సంస్కృతిని, మా జీవనశైలిని తీవ్రంగా దెబ్బతీసింది. టెలివిజన్లలో నేడు ఎప్పుడూ ఒకేరకమైన ముఖాలు దర్శనమిస్తున్నాయి. ఒకే తరహా సంగీతం విన్పిస్తోంది. ఇవి మా సంస్కృతిని ఏమాత్రం ప్రతిబింబించడం లేదు. మా సంస్కృతికి దర్పణం పట్టే వైవిధ్యభరితమైన ఆహారం నేడు కనుమరుగవుతోంది. అత్భుతమైన, భిన్నరుచులతో కూడిన సమగ్రమైన భోజన పదార్థాలిప్పుడు మాయమైపోయాయి. పూర్వం మా జీవితం ఎంతో వైవిధ్యభరితంగా ఉండేది. అదే మా సంస్కృతి, అదే మా ఆత్మ. భిన్నత్వం లేకుంటే ఇక అంతా వినాశనమే. మా ఆహారపదార్థాలు మాయమైపోయాయి. మా భూమి దూరమైపోయింది. రైతులు, మత్స్యకారులు ముఖ్యంగా మహిళలు అత్యంత దుర్భర పరిస్థితుల్లో మనుగడ సాగిస్తున్నారు. మా స్వతంత్ర వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడమే చాలా కష్టమైపోతోంది. నేడు అమలవుతున్న ప్రపంచీకరణ ప్రక్రియ ప్రపంచమంతటా ఏకశిలా సదృశమైన సంస్కృతిని రూపొందిస్తోంది. ఈనాడు మమ్మల్ని మేము కాపాడుకోలేని దుస్థితిలో పడిపోయాము.''

ప్రముఖ ఆర్థికవేత్త హాజూన్ చాంగ్ 'ప్రపంచీకరణ' పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతల్ని పెంచిందని విమర్శిస్తూ తన అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చారు:



"ప్రపంచీకరణవల్ల దేశాల మధ్య ఆర్థికలావాదేవీలు ఎంతో సరళవంతమయ్యాయి. దీంతో స్పెక్యులేషన్ వ్యాపారం విపరీతంగా విస్తరించింది. పర్యవసానంగా షేర్‌మార్కెట్లు దేశాల ఆర్థిక స్థితిగతుల్ని నిర్దేశించసాగాయి. ఇవి ఊహించని రీతిలో సంపన్నులకు లాభాలు పండిస్తున్నాయి. మరోపక్క ఆటోమొబైల్ ఫ్యాక్టరీలను తక్కువ వేతనాలుండే దేశాలకు తరలిస్తున్నందున అభివృద్ధిచెందిన దేశాల కార్మికులు సైతం నిరుద్యోగులవుతున్నారు. వర్ధమాన దేశాలు గతంలో తమ పరిశ్రమల మనుగడకు వీలైన రక్షితచట్టాలు అమలుచేసేవి. ఇప్పుడు స్వేచ్ఛావిపణి (Free Enterprise) ప్రక్రియ వీటన్నిటిని తుడిచిపెట్టింది. విదేశీ పెట్టుబడుల రాక కారణంగా దేశీయ కర్మాగారాలు మూతపడ్తున్నాయి. అందులో పనిచేసే కార్మికులు వీధిన పడ్తున్నారు.''

"యాంటి గ్లోబలైజేషన్ నెట్‌వర్క్ (బ్రిటన్)'' సభ్యుడొకడు ఇలా చెబుతున్నాడు: "బహుళజాతి సంస్థలు పేద వర్ధమాన దేశాలలో తమ కార్యకలాపాలు స్వేచ్ఛగా నిర్వహించుకునేందుకు అత్యంతనుకూల పరిస్థితుల్ని ఏర్పరచుకోవడమే ప్రపంచీకరణ. దీనికోసం తక్కువ పన్నులు, స్వల్ప వేతనాలు, అతిసరళమైన పర్యావరణ చట్టాలు, బలహీనమైన ఆరోగ్య-భద్రతా చట్టాల్ని ఇవి దబాయించి మరీ చేయించుకుంటాయి.''

రచయిత పీటర్ ఫ్లెమింగ్ ప్రపంచీకరణలోని ఓ ముఖ్యకోణాన్ని వివరిస్తూ ఇలా అన్నారు: "ప్రపంచీకరణ అంతా చౌకగా లభించే చమురు, గ్యాస్ ఒనరులపైన ఆధారపడి నడుస్తోంది. ఎరువులు, సేద్యం, ప్రాసెసింగ్, కెమికల్స్, రవాణా తదితర రంగాలకు ఇవి ప్రత్యక్షంగా అవసరమవుతాయి. చమురు, గ్యాస్‌లే పరోక్షంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి, మరోవైపు అధిక లాభాలు సాధించేందుకు ఉపయోగపడతాయి.''

"బంగ్లాదేశ్ పీపుల్స్ సాలిడారిటీ సెంటర్ (బ్రస్సెల్స్)'' సభ్యుడు పీటర్ కుస్టర్స్ ఇలా చెబుతున్నారు: "దక్షిణదేశాలకు చెందిన ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక పరికరాలను ఉత్తరదేశాలు దిగుమతి చేసుకుంటున్నాయి. వీటికి బదులుగా అవి ఆయా రాజ్యాలకు ఆయుధసామగ్రిని అంటగడ్తున్నాయి. దీన్ని మనం నష్టదాయక మారకంగా పేర్కొనవచ్చు....ఉత్తరాది దేశాలు, ముఖ్యంగా అమెరికా 1970వ దశకంలో పన్నిన వ్యూహ ఫలితమే ఈ తరహా నష్టదాయక బదలాయింపు....సౌదీఅరేబియా, ఈరాన్ వంటి దేశాలు చమురు ఎగుమతుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఖరీదైన ఆయుధాల కొనుగోలు కోసం వెచ్చించేలా అమెరికా వాటిని ప్రోత్సహించింది.....''

అమెరికా పన్నిన వ్యూహం ఫలితంగానే గల్ఫ్‌దేశాల మధ్య ఆయుధ కొనుగోలు పోటీతత్వం పెరిగి 1980వ దశకంలో పరస్పరం యుద్ధజ్వాలలు రగుల్చుకొని ఎంతో ధన, ప్రాణ నష్టాలకు గురయ్యాయి. ఆ తరువాత అమెరికా 1991లో ఇరాఖ్‌ను కువైట్ పైకి ఎగదోసి, ఇరాఖ్ కువైట్‌ను ఆక్రమించుకోగానే సౌదీ, కువైట్‌ల పక్షాన

నిలబడి ఇరాఖ్‌పై ప్రత్యక్షచర్యకు పాల్పడింది. ఈ వ్యూహం వల్ల అమెరికాకు సౌదీ, కువైట్‌ల నుండి పెద్దఎత్తున చమురు పిండుకునే అవకాశం దొరికింది. అయినా దాని చమురుదాహం తీరలేదు. చివరికి 11-9-2002న న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై జరిగిన దాడికి ఉసామా బిన్ లాదిన్‌ని బాధ్యునిగా చేసి అఫ్గనిస్తాన్‌పై దాడి చేసి సర్వనాశనం చేసింది. ఇలా అమెరికా ఎంతో పకడ్బందీగా అఫ్గనిస్తాన్ భుజాలపై నుంచి ఇరాఖ్ భుజాలపై దూకి కూర్చున్నది. దీనివల్ల అమెరికాకు చమురుసంపద పుష్కలంగా లభిస్తూ ఉండటమే గాక అమెరికా యూదులకు ముస్లిందేశాల్లో తమ మతదురభిమాన పథకాలను అమలుపరచుకునే మార్గం కూడా సుగమం అయింది.

ఏమైనప్పటికీ 'అమెరికా మార్కు ప్రపంచీకరణ' దక్షిణదేశాల ఆర్థిక, సాంస్కృతి రంగాలను అతలాకుతలం చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రపంచీకరణ వ్యతిరేకవాదులు "స్థానికీకరణ" (Localisation) సిద్ధాంతం రూపొందించి పనిచేయడానికి సమాయత్తమవుతున్నారు. కాని దక్షిణదేశాలు అమెరికా కర్రపెత్తనాన్ని ఎదిరించే స్థితిలో ఉన్నాయా అన్నదే అనుమానం. ముస్లిందేశాలను అస్థిరపరచే, ఇతరదేశాల దృష్టిని తనవైపు తిప్పుకునే ప్రయత్నంలో అమెరికా ఉసామా బిన్ లాదిన్, అల్‌ఖాయిదాలను సింబాలిక్‌గా వాడుకుంటూ టెర్రరిజం భూతాన్ని క్లోజప్‌లో చూపుతున్నప్పుడల్లా దాని టెర్రరిజం మాటలకు వంతపలికే దక్షిణదేశాలు ప్రపంచీకరణ విషవలయం నుండి బయటపడతాయని ఆశించలేము.

## 11. ఇస్లాం మౌలిక దృక్పథం

ఇస్లాం నమాజ్, ఉపవాసం, వివాహం, విడాకులు, కర్మకాండ, దానధర్మాలు లాంటి కొన్ని ఆరాధనలకు, ఆదేశాలకు మాత్రమే పరిమితమైన ధర్మం కాదు. ఇదొక సంపూర్ణ జీవితవిధానం. మానవ జీవితంలోని సమస్త రంగాల్లోనూ దాని సూత్రాలు, నియమ నిబంధనలు పరివ్యాప్తమయి ఉన్నాయి. ఇస్లాం నైతిక, ఆధ్యాత్మిక, సామాజిక, కౌటుంబిక, రాజకీయ, ఆర్థిక విషయాలక్కూడా ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది.

ఇస్లాం అంటే ఏమిటనే ప్రశ్నకు సాధారణంగా ప్రజలు ఇతరమతాల్లా ఇస్లాంను కూడా ఒక మతవ్యవస్థగా భావించి "ఆ... ఇస్లాం అంటే ఏముంది, పూజాపునస్కారాలే కదా! కాకపోతే ముస్లింలు వాటిని నమాజ్, రోజా వగైరా పేర్లతో పిలుస్తార"ని అంటారు. కాని ఇస్లాం ప్రారంభదశలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ అపోహను తొలగించడానికి ఇస్లాం అంటే ఏమిటని ఒక అనుచరుడు హజ్రత్ అమ్ర్ బిన్ అబస (రజి) అడిగిన ప్రశ్నకు ఎలాంటి సమాధానం ఇచ్చారో చూడండి:

హజ్రత్ అమ్ర్ బిన్ అబస (రజి) ఉల్లేఖనం- నేను దైవప్రవక్త (సల్లం) సన్నిధిలో "ఇస్లాం అంటే ఏమిట"ని ప్రశ్నించాను. దానికి ఆయన "(ఇస్లాం అంటే) మంచి మాటలు చెప్పడం, (ఆకలిగొన్నవారికి) అన్నం పెట్టడం" అని సమాధానమిచ్చారు.



నేను మళ్ళీ "విశ్వాసం అంటే ఏమిట"ని అడిగాను. దానికి ఆయన "సహనం వహించడం, దానం చేయడం" అని అన్నారు. (అహ్మద్- మిష్కాత్)

ఈ విషయం గురించి ఖుర్‌ఆన్‌లోని ఈ కింది సూక్తులు కూడా చదవండి:

"కాలచక్రం సాక్షి! మానవుడు ఘోరంగా నష్టపోయాడు. అయితే సత్యాన్ని విశ్వసించి (తదనుగుణంగా) సత్కార్యాలు చేస్తూ, సత్యం, సహనాలను గురించి పరస్పరం ఉపదేశించు కునేవారు మటుకు ఏమాతం నష్టపోరు." (103:1-3)

"అతను కఠినమైన కనుమ గుండా నడవడానికి సాహసించలేదు. కఠినమైన కనుమ అంటే ఏమిటో నీకు తెలుసా? (కఠినమైన కనుమంటే) బానిసను బంధవిముక్తి చేయడం, లేదా (కరువుదినాల్లో) ఆకలిగొన్న రోజు సమీప అనాథకుగాని, దారిద్ర్యంలో మగ్గే నిరు పేదకుగాని పట్టెడన్నం పెట్టడం, ఆపై ఓర్పు, దయాదాక్షిణ్యాల్ని గురించి పరస్పరం ఉప దేశించుకునే విశ్వాసుల్లో చేరిపోవడం." (90:11-17)

"నీవు అనాథగా ఉన్నప్పుడు ఆయన నీకు ఆశ్రయం కల్పించలేదా? నీవు మార్గవిహీను డవై ఉండగా ఆయన నీకు మార్గం చూపలేదా? నీవు నిరుపేదగా ఉండటం చూసి ఆయన నిన్ను ధనవంతుడ్ని చేయలేదా? కనుక అనాథల పట్ల కఠినంగా ప్రవర్తించకు. యాచకుడ్ని కసరికొట్టకు. నీ ప్రభువు అనుగ్రహాలను (గురించి) చాటుతూ ఉండు." (93:6-11)

దీన్నిబట్టి ఇస్లాం శారీరక ఆరాధనలతో పాటు ధన సంబంధమైన ఆరాధనలకు కూడా ఎంతో ప్రాముఖ్యం ఇస్తుందని తెలుస్తోంది. మనిషికున్న సంపదలో తనకంటే దిగువ స్థాయిలో ఉండే పేదవాడికి ఎంతో కొంత హక్కు తప్పనిసరిగా ఉంటుంది. ఇక్కడ్నుంచే ఇస్లామీయ అర్థశాస్త్రానికి పునాదులు ప్రారంభమవుతాయి.

ఇస్లామీయ ఆర్థిక విధానానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇస్లాం ప్రతి వ్యవహారాన్ని పరలోకపు జవాబుదారీ భావనతో ముడిపెడ్తుంది. సాధారణంగా మనిషి ఏ పనయినా లాభనష్టాల ఆధారంగానే చేస్తాడు. అయితే ఇస్లాం ప్రాపంచిక లాభనష్టాల కన్నా పరలోక లాభనష్టాలను గురించిన ఆశాభయాలనే ఎక్కువగా మనిషిలో జనింపజేస్తుంది.

ఇస్లాంలో నమాజ్, ఉపవాసాలకు ఎంత విలువ, ప్రాముఖ్యతలు ఉన్నాయో దానధర్మాలకు, ఇతర సత్కార్యాల కోసం ధనవినియోగానికి కూడా అంతే విలువ, ప్రాముఖ్యతలు ఉన్నాయి. ధనత్యాగం లేని ఆరాధనలకు ఇస్లాంలో ఏమాత్రం విలువ లేదంటే అతిశయోక్తి కాదు. నమాజ్, ఉపవాసాలు, దైవనామ స్మరణలు "శారీరక ఆరాధనలు" అనబడతాయి. జకాత్, ఉష్ర్, సదఖా, ఫిత్రా, ఫిదియాలను "ధన సంబంధమైన ఆరాధనలు" అంటారు. బండి చక్రాల్లాంటి ఈ రెండు విధాల ఆరాధనలలో ఏ ఒక్కటి లేకపోయినా "ఆరాధనా శకటం" ఒక్క అంగుళం కూడా ముందుకు సాగదు.

దైవం నిర్దేశించిన శారీరక ఆరాధనలతో ప్రమేయంలేకుండా ఉన్నదంతా దాన ధర్మాలకు వెచ్చిస్తే ప్రపంచంలో మనిషి దానకర్ణుడిగా, హాతింతాయిగా ఖ్యాతి పొంద గలుగుతాడు కాని, దైవప్రసన్నత మాత్రం పొందలేడు. అలాగే ప్రపంచ వ్యవహారాలు వదలి ఏకాంతకుహురాల్లో కూర్చొని జీవితాంతం కఠోర తపస్సు చేసినా పరలోకంలో మోక్షం పొందలేడు. సత్కార్యాల కోసం ధనం ఖర్చుపెట్టనివాడు తనను తాను సర్వ నాశనం చేసుకున్నట్లేనని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తోంది:

"దైవమార్గంలో ఖర్చుపెట్టండి. చేజేతులా నాశనం కొనితెచ్చుకోకండి." (2:195)

హ్‌జత్ అదీ బిన్ హాతిం (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలిపారు:- "త్వరలో దేవుడు ప్రళయదినాన మీలోని ప్రతి మనిషితో ప్రత్యక్షంగా మాట్లాడుతాడు. ఆరోజు దేవునికి, దాసునికి మధ్య ఎలాంటి అనువాదకుడు ఉండడు. దాసుడు తలపెకెత్తి చూస్తాడు. మొదట తన ముందు ఏదీ కన్పించదు. రెండవ సారి మళ్ళీ తల పెకెత్తి చూస్తాడు. అప్పుడతని ముందు ఎటు చూసినా అతనికి స్వాగతం చెబుతూ (భగభగ మండే) అగ్ని కన్పిస్తుంది. అందువల్ల మీలో ఎవరైనా ఓ ఖర్జూరపు ముక్కయినా సరే దానంచేసి నరకం నుండి కాపాడుకోగలిగితే కాపాడుకోండి."

హ్‌జత్ అదీ (రజి) కథనం ప్రకారమే మరో సందర్భంలో దైవప్రవక్త (సల్లం) నరకం గురించి ప్రస్తావిస్తూ "నరకాగ్ని నుండి కాపాడుకోండి" అన్నారు. ఈ మాట చెప్పి ఆయన ముఖం ఓ పక్కకు తిప్పుకున్నారు. (తాను నరకాగ్నిని ప్రత్యక్షంగా చూస్తున్నట్లు) నరకాగ్ని పట్ల భయం, అసహ్యతలు వెలిబుచ్చారు. ఆ తరువాత తిరిగి ఆయన "నరకాగ్ని నుండి రక్షించుకోండి" అన్నారు. మళ్ళీ ఆయన నరకాగ్ని పట్ల భయం, అసహ్యతలు వెలిబుచ్చాతూ ముఖం ఓ పక్కకు తిప్పుకున్నారు.

ఈవిధంగా దైవప్రవక్త (సల్లం) మూడు సార్లు చేశారు. చివరికి ఆయన నిజంగానే నరకాగ్నిని చూస్తున్నారేమోనని మాకు అనుమానం వచ్చింది. ఆ తరువాత ఆయన ఇలా అన్నారు: "ఓ ఖర్జూరపు ముక్కయినా సరే దానంచేసి నరకాగ్ని నుండి కాపాడుకోండి. అదీ దొరక్కపోతే ఓ మంచి మాటయినా పలకండి. నోట ఓ మంచి మాట వెలువడటం కూడా దానం (సదఖా)గానే పరిగణించబడుతుంది." (బుఖారి)

ఆర్థికవ్యవహారాల్లో ఇస్లాం పెట్టుబడిదారీ విధానానికి, సామ్యవాద ఆర్థికవ్యవస్థకు అతీతంగా, వాటి అతివాద ధోరణులకు భిన్నంగా న్యాయవంతమైన ఓ మధ్యేమార్గాన్ని అవలంబించింది. ముందుగా ఇది మనిషిలోని పేరాశ, పిసినారితనం, హృదయ కాఠి న్యాలను పోగొట్టి అతనిలో ఆత్మసంతృప్తి, దానశీలత, త్యాగనిరతుల్ని జనింపజేస్తుంది. ఆ తర్వాత సమాజంలో అవినీతి, అన్యాయం, అశ్లీలం, అసత్యం, వడ్డీ, మోసం, జూదం వగైరా చెడుల్ని వ్యాపింపజేసే సంపాదనా పద్ధతులన్నిటిని నిషేధిస్తుంది. పెట్టు బడిదారీ, సామ్యవాద విధానాలు ఈ చెడులకు అంతగా ప్రాముఖ్యాన్ని ఇవ్వవు.



ప్రతి వ్యవస్థ వృద్ధివికాసాలకు ప్రేరణగా, మౌలిక విషయం (Basic theme)గా ఒక నినాదం (Slogan) ఉంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రేరణగా "స్వేచ్ఛ" (Freedom) అనే నినాదం ఉంది. సామ్యవాద వ్యవస్థకు ప్రేరణగా "సమానత్వం" (Equality) అనే నినాదం ఉంది. ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థకు ప్రేరణగా, మౌలిక విషయంగా "న్యాయం" (Justice) అనే నినాదం ఉంది.

పెట్టుబడిదారీవ్యవస్థలోని వ్యక్తుల 'స్వేచ్ఛ'లో ఒకరి విశృంఖలస్వేచ్ఛ మరొకరికి నష్టం కలిగించవచ్చనే విషయాన్ని క్యాపిటలిస్టులు పట్టించుకోరు. అలాగే సామ్యవాద వ్యవస్థలోని 'సమానత్వం' అనే ప్రేరకం ప్రజలపై పాలకుల బలప్రయోగాలకు దారి తీస్తుందనే విషయాన్ని సోషలిస్టులు కూడా పట్టించుకోరు. ఈ రెండిటికి భిన్నంగా ఇస్లామీయ రాజ్యంలో పాలకులు, పాలితులు ఆర్థికవ్యవహారాలతో పాటు సమస్త వ్యవహారాల్లో పరలోకపు జవాబుదారీ భావనతో 'న్యాయాని'కి కట్టుబడి ఉంటారు.

పెట్టుబడిదారీ, సామ్యవాద వ్యవస్థలలోని అతివాద విధానాలు సంపదను కేంద్రీకరింపజేస్తాయి. మనం గతంలో చెప్పుకున్నట్లు పెట్టుబడిదారీవిధానం సంపదను కొందరు వ్యక్తుల చేతుల్లో కేంద్రీకరింపజేస్తే, సామ్యవాద విధానం పాలకుల చేతుల్లో కేంద్రీకరింపజేస్తుంది. ఇస్లాం ఈ రెండు పద్ధతులకు భిన్నంగా సంపదను వికేంద్రీక రింపజేస్తుంది. "ధనవికేంద్రీకరణ" (Decentralisation) దీని మూలసూత్రం. దీన్ని ఇస్లాం ఆర్థికవ్యవస్థలోని 'మౌలిక విషయం' (Basic theme) అని కూడా చెప్పవచ్చు.

సంపద ఏఒక్క చోటా, లేదా ఏవో కొన్నిచోట్లా పేరుకుపోకుండా అది ఎల్లప్పుడు సమాజంలో తిరుగుతూ ఉండాలని ఇస్లాం కోరుకుంటుంది. సంపద పెద్దఎత్తున ప్రభుత్వ ధనాగారాల్లో, బ్యాంకులలో, ధనికుల ఇనుపపెట్టెలలో ఉండటాన్ని, అవసరానికి మించిన(Surplus) వస్తుసంపదను ప్రోగుచేయడాన్ని, దుబారాఖర్చును ఇది సహించదు. అదేవిధంగా అధికోత్పత్తుల్ని దుర్వినియోగం చేయడాన్ని, ఉత్పాదక సాధనాల్ని నిరుపయోగం (Idle)గా ఉంచడాన్ని కూడా సహించదు. ఇది ధన వికేంద్రీకరణ ద్వారా సమాజంలో ఆర్థిక న్యాయాన్ని నెలకొల్పదలచింది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దీన్ని ఆచరణాత్మకంగా నిరూపించారు కూడా.

## 12. యాజమాన్య హక్కులు

ఏ వస్తువు మీదైనా యాజమాన్య హక్కులు వాస్తవానికి మానవుల్ని సృష్టించిన దేవునికే ఉన్నాయి. భూమ్యాకాశాలలోని ప్రతి వస్తువుకూ ఆయనే యజమాని, వారసుడు. మానవులు ఆయన ఆజ్ఞలను శిరసావహించవలసిన దాసులు మాత్రమే. వారు తమకు దేవుడు ప్రసాదించిన వస్తువులకు తాత్కాలిక యజమానులు మాత్రమే. కనుక ఆయన నిర్దేశించిన ఇస్లాంధర్మం ప్రకారమే మానవులు నడచు కోవలసి ఉంటుంది. కనుక తనది అనుకున్న వస్తువు ఏదీ నిజానికి తనది కాదు.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఆదం పుత్రుడు (మానవుడు), నాధనం, నాధనం అంటాడు. కాని ఆదంపుత్రుడా! నీవు తిని హతం చేసినది, తొడిగి పాతబట్ట గా చేసినది, దానంచేసి పంపుకున్నది మాత్రమే నీధనం అవుతుంది." (ముస్లిం)

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) (తన అనుచరులతో మాట్లాడుతూ) "తమ సొంతఐశ్వర్యం కంటే తమ వారసుల ఐశ్వర్యాన్ని ఎక్కువగా అభిమానించేవారు మీలో ఎవరైనా ఉంటారా?" అని అడిగారు. దానికి అనుచరులు "దైవప్రవక్తా! మా అందరికి మా వారసుల ఐశ్వర్యం కంటే మా ఐశ్వర్యమే ఎక్కువ ప్రీతికరమైనది" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "(పరలోకంలో పుణ్యఫలం కోసం) ముందు పంపుకున్నది మాత్రమే తన సొంతధనం అవుతుంది. అతను వదలి వెళ్ళినది అతని వారసులది అవుతుంది" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "శవం వెంట మూడు వస్తువులు వెళ్తాయి. వాటిలో ఒకటి మాత్రమే మృతునితో పాటు ఉంటాయి. మిగిలిన రెండు వెనక్కి తిరిగొస్తాయి. అతని కర్మలు అతనితో పాటు ఉంటాయి. అతని సిరిసంపదలు, బంధువులు వెనక్కి తిరిగొస్తారు." (మిష్కాత్)

ఇస్లాం ప్రకారం ఆస్తిపాస్తులు, సిరిసంపదలు లేదా మరే వస్తువు మీదయినా వ్యక్తి యాజమాన్య హక్కు మూడు విధాలుగా ఉంటుంది. (1) కష్టపడి సంపాదించిన ఆస్తి, (2) వారసుల నుండి సంక్రమించిన ఆస్తి, (3) బదిలీ చేయబడిన ఆస్తి.

**వ్యక్తిగత యాజమాన్యం:-** ఒక పౌరుడు కష్టపడి తన శక్తిసామర్థ్యాల ద్వారా ఎంత సంపాదించినా, వారసుల నుండి ఎంత ఆస్తి లభించినా, బదిలీచేసిన ఆస్తి ఎంత సంక్రమించినా అలాంటి ఆస్తులన్నిటికీ ఇస్లామీయ ధర్మశాస్త్రం అతడ్నే యజమానిగా గుర్తిస్తుంది. అతనా ఆస్తులపై జకాత్, ఉష్ర్ వగైరా విధిదానాలు చెల్లిస్తున్నంత వరకు, అతని వల్ల ఇతర దైవదాసులకు ఎలాంటి హానిగాని, వారి హక్కులకు భంగంగాని కలగనంతవరకు లేదా అతను సంపాదించిన ఆస్తులు ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం అక్రమార్జన అని రుజువుకానంతవరకు లేదా తాను సంపాదించిన ఆస్తులు దుబారా, దుర్వినియోగం చేయనంతవరకు ఇస్లామీయ ప్రభుత్వం అతని ఆస్తిపాస్తులలో ఏవిధమైన జోక్యం చేసుకోదు.

పైన పేర్కొన్న హద్దులను అతిక్రమించినప్పుడు మాత్రం ఇస్లామీయ ప్రభుత్వం అతని ఆర్థికవ్యవహారాలలో తప్పక జోక్యం చేసుకుంటుంది. అంతేకాదు, అవసరమైతే ఆ ఆస్తులపై అతనికి యాజమాన్య హక్కులు లేకుండా చేసే అధికారం కూడా ఇస్లామీయ ప్రభుత్వానికి ఉంటుంది. అంతేగాని ఆర్థికసమానత్వం పేరుతో లేదా మరేదైనా పేరుతో ప్రకృతివిరుద్ధమైన విధానాలు అవలంబించి ప్రజల సొంత ఆస్తుల్లో అనవసరంగా తలదూర్చడానికి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించదు.



అలాగే ఇస్లామీయ ప్రభుత్వంలో వ్యక్తిగత యాజమాన్యానికి విశృంఖల స్వేచ్ఛ నిచ్చి వదలి పెట్టడం కూడా జరగదు. ఇస్లామీయ ధర్మశాస్త్రం ఈ రెండు పద్ధతులకు భిన్నంగా ఒక నిర్దుష్టమైన నైతికనియమావళితో పాటు న్యాయవంతమైన మధ్యేమార్గం అవలంబిస్తూ వ్యక్తుల యాజమాన్య హక్కులను గుర్తిస్తుంది.

నేడు కొన్ని దేశాల్లో ప్రభుత్వాలు హద్దుమీరిన ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ధన విభజన (Distribution of wealth) చాలా అవసరమని భావించి వ్యక్తుల నుండి ఉపాధి ఒనరుల్ని స్వాధీనం చేసుకుంటున్నాయి, అంటే జాతీయం చేస్తున్నాయి. ఇస్లాం ధన విభజనకు బదులు "ధన వికేంద్రీకరణ" (Decetralisation of wealth) పద్ధతి అవలంబించింది.

దేవుడు ఈ భూమిపై ప్రళయంవరకూ యావత్తు మానవాళికి సరిపడినంత ఉపాధి ఒనరులు సృష్టించాడు. మానవులకు ఉపాధి ప్రసాదించే బాధ్యత స్వయంగా దేవుడే తీసుకున్నాడు. కనుక మానవులు తమతమ శక్తిసామర్థ్యాలతో ఉపాధిని సంపాదించుకో గలుగుతారు. ఈ విషయాన్ని ఖుర్ఆన్ ఇలా తెలియజేస్తోంది:

"ఆహారం అర్థించే సమస్త ప్రాణికోటికి దేవుడు అవసరమైన మేరకు లెక్క ప్రకారం దానిపై ఉపాధి సామగ్రి కూడా ఏర్పాటుచేశాడు." (41:10) "భూమండలంపై సంచరించే ప్రతి ప్రాణికీ ఉపాధినిచ్చే బాధ్యత దేవునిపైనే ఉంది." (11:6)

## 13. విషయపరిజ్ఞానం ఆవశ్యకత

ఇక్కడ ఉపాధి అంటే ఆహారం మాత్రమే కాదు, మానవ మనుగడకు కావలసిన జీవితావసర వస్తువులన్నీ ఉపాధి క్రిందికే వస్తాయి. ఈ జీవితావసర వస్తువులు మానవు లందరికీ న్యాయవంతంగా అందాలంటే ధనవిభజన విషయంలో నిర్దుష్టమైన కొన్ని హద్దులను, పటిష్ఠమైన నైతిక నియమావళిని కూడా రూపొందించవలసి ఉంటుంది. ఇలాంటి నైతిక నియమావళి, నిర్దుష్టమైన హద్దులు ఇస్లాంలోనే ఉన్నాయి.

ఇవన్నీ తెలుసుకోవడానికి విద్య నేర్చుకోవడం చాలా అవసరం. విద్యార్జన ప్రతి ముస్లిం విధ్యుక్తధర్మం. అంటే ముస్లింలందరూ విధిగా నేర్చుకోవలసి ఉంటుంది. విషయపరిజ్ఞానం సంపాదించడానికి విద్య ఒక మాధ్యమం. విద్య, విషయపరిజ్ఞానం ఒకదాని నుంచి మరొకటి విడదీయరాని సముదాయం. ఈ సముదాయాన్ని "జ్ఞానార్జన" అని చెప్పవచ్చు. అయితే ఎలాంటి జ్ఞానం ఆర్జించాలి? ధర్మజ్ఞానం, లౌకిక జ్ఞానం (అంటే సైన్స్, గణితం, చరిత్ర మొదలైనవి) రెండూ నేర్చుకోవలసిందే. కాకపోతే ఇస్లాం బోధనల ప్రకారం ముస్లింలు ధర్మజ్ఞానం తప్పనిసరిగా నేర్చుకోవాలని తెలుస్తోంది. ధర్మజ్ఞానం లోపించిన లౌకికజ్ఞానం విశ్వాసి (మోమిన్)కి నెయ్యిలేని నేతిబీరకాయ వంటిదే.

విద్యాజ్ఞానాల విషయంలో మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు: "మూడు విషయాలను గురించిన జ్ఞానార్జనే విద్య అనబడుతుంది. ఒకటి, మనిషి ఖుర్‌ఆన్‌లోని స్పష్టమైన సూక్తులు నేర్చుకోవాలి; రెండు, లేదా నిరూపిత సంప్రయాలను (హదీసుల్ని) నేర్చుకోవాలి; మూడు, లేదా న్యాయవంతమైన ధనవిభజనకు సంబంధించిన విద్య నేర్చుకోవాలి." (అబూదావూద్)

**దున్నేవాడిదే భూమి:-** ఎవరైనా సరే, దేవుడు ప్రసాదించిన ఉపాధి ఒనరుల్ని సరయిన పద్ధతిలో ఉపయోగించకపోతే లేదా దాన్ని వెట్టిగా వదిలేస్తే దానిపై ఉండే యాజమాన్య హక్కులు అతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది. దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"పాడుపడిన లేదా బీడుపడిన భూమిని ఎవరు సద్వినియోగం చేస్తారో ఆ భూమి అతనిదవుతుంది. (దానిపై అతనికే యాజమాన్యహక్కులుంటాయి.)" (అహ్మద్, తిర్మిజి)

"ఎవరి యాజమాన్యంలో లేని బంజరు భూమిని ఎవరైనా సాగుచేసుకుంటే ఆ భూమిపై అతనికే యాజమాన్య హక్కులు సంక్రమిస్తాయి." (బుఖారి, నసాయి.)

"ఎవరైనా ఏదైనా బంజరుభూమికి (సాగుచేసే ఉద్దేశ్యంతో) కంచె కట్టి స్వాధీనం చేసుకుంటే అది అతనిదే అవుతుంది." (అబూదావూద్)

"భూమి దేవుని సొత్తు, దాసులు (మానవులు) కూడా దేవుని సొత్తే. కనుక ఎవరైతే బంజరు భూమిని సాగుచేస్తాడో ఆ భూమి అతనిదే అవుతుంది." (అబూదావూద్)

"ఎవరి యాజమాన్యంలోలేని, ఏ వారసుడు సంరక్షుడులేని భూమి దేవునికి, దైవప్రవక్తకు చెందుతుంది. ఆ తరువాత (అనుచరులారా!) అది మీదవుతుంది. కాబట్టి ఎవరైతే బంజరుభూమిని సాగుచేస్తాడో అది అతనికే చెందుతుంది. బంజరుభూమిని (తాను సాగుచేయకుండా, ఇతరులకు ఇవ్వకుండా) ఆపివుంచేవాడికి మూడు సంవత్సరాల తరువాత దానిపై ఎలాంటి హక్కు ఉండదు." (కితాబుల్ ఖిరాజ్)

(హజ్రత్ ఉమర్-రజి. మనవడు) సాలమ్ బిన్ అబ్దుల్లా కథనం: "(మసీదులోని) ప్రసంగవేదికపై నిలబడి 'ఎవరైతే బంజరు భూమిని సాగుచేస్తాడో అది అతనికే చెందుతుంది. బంజరుభూమిని సాగుచేయకుండా ఆపివుంచేవాడికి మూడు సంవత్సరాల తరువాత దానిపై ఎలాంటి హక్కు లేదు' అని బహిరంగంగా ప్రకటించారు. కొందరు సేద్యభూములను సాగుచేయకుండా బీడుపడవేస్తారు. అందువల్ల ఆయన ఇలా ప్రకటించవలసి వచ్చింది." (కితాబుల్ ఖిరాజ్)

**దొరికిన వస్తువులపై యాజమాన్య హక్కులు:-** దొరికిన వస్తువులు తక్కువ విలువ గలవయితే వాటిని చేజిక్కించుకున్న వ్యక్తి సొంతం చేసుకోవచ్చు. ఒకవేళ ఆ వస్తువు యజమాని వచ్చి ఆనవాలు చెప్పి అడిగితే అతనికి వాపసు చేయవలసి ఉంటుంది.



ఎక్కువ విలువ గలవయితే వాటిని సొంతం చేసుకోకుండా వాటి యజమాని వచ్చి అడిగే వరకు ఒక నిర్ణీతకాలం వేచిచూడవలసి ఉంటుంది.

హజ్రత్ జాబిర్ (రజి) కథనం: "పట్టుకర్ర, చంద్రకోల, తాడు, అలాంటి ఇతర వస్తువులు దొరికితే వాటిని సొంతం చేసుకొని వాడుకోవడానికి దైవప్రవక్త (సల్లం) అనుమతి ఇచ్చారు." (అబూదావూద్)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: ఓసారి అలి (రజి) బిన్ అబూ తాలిబ్‌కు ఒక దీనార్ (డబ్బు) దొరికింది. దాన్ని ఆయన ఫాతిమా (రజి)కు తెచ్చిచ్చారు. తరువాత ఆయన ఆ దొరికిన వస్తువు గురించి ఆజ్ఞ ఏమిటని దైవప్రవక్త (సల్లం)ను అడిగారు. దైవప్రవక్త (స) "అది దేవుడు ప్రసాదించిన ఉపాధి" అన్నారు. ఆ దీనార్‌తో (కొన్న పదార్థాలు దైవప్రవక్త (స) కూడా తిన్నారు; అలి, ఫాతిమా కూడా తిన్నారు. ఆ తర్వాత ఒక స్త్రీ తాను పోగొట్టుకున్న దీనార్‌ని వెతుక్కుంటూ వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) "అలీ! ఆమె దీనార్‌ని ఆమెకు ఇచ్చెయ్యి" అన్నారు. (అబూదావూద్)

హజ్రత్ జారూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ముస్లిం పోగొట్టుకున్న వస్తువు (ఇతరులు సొంతం చేసుకుంటే అది వారి కోసం) అగ్నిజ్వాల అవుతుంది." (దారిమి-మిష్కాత్)

హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ (రజి) కథనం: ఒకతను దొరికిన వస్తువు గురించి ఆజ్ఞ ఏమిటని దైవప్రవక్త (సల్లం)ను అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "రాకపోకలు జరిగే దారులలో, ప్రజలు నివసించే గ్రామాలలో వస్తువు దొరికితే దాన్ని గురించి ఒక సంవత్సరం పాటు ప్రకటన చేస్తుండాలి. ఈలోగా ఆ వస్తువు యజమాని వస్తే దాన్ని అతనికి వాపసుచెయ్యి. రాకపోతే అది నీ సొంతం అవుతుంది. పోతే పాడుపడిన ప్రదేశాలలో దొరికిన వస్తువులలో, గనులలోని నిక్షేపాలలో అయిదోవంతు దేవునికి చెందుతుంది. (అంటే ప్రభుత్వ ఖజానాకు చేర్చాలి.) (అబూదావూద్)

## 14. ఆర్థిక న్యాయం

'స్వేచ్ఛ' ఒక్కోసారి విశృంఖలస్వేచ్ఛకు దారితీసే ప్రమాదం ఉంటుంది. అలాగే 'సమానత్వం' బలప్రయోగాలకు, రక్తపాతాలకు దారితీసే ప్రమాదం ఉంటుంది. ఇవి రెండు ప్రజలకు అనుభవైక విషయాలే. ఇస్లాం ఇలాంటి స్వేచ్ఛా సమానత్వాలకు ప్రాముఖ్యం ఇవ్వదు. ఇది న్యాయానికి అత్యంత ప్రాముఖ్యం ఇస్తుంది. న్యాయం లేని స్వేచ్ఛా సమానత్వాలు వ్యక్తులకే గాకుండా సమాజానికి, రాజ్యానికి కూడా నష్టం కలిగిస్తాయి. ఇస్లాం ఆర్థికరంగంలో కూడా న్యాయానికే భద్రపీఠం వేస్తుంది. ఆర్థిక న్యాయం ద్వారానే ఆర్థికప్రగతి సాధ్యమవుతుందని చెబుతోంది.

ఆర్థికన్యాయం సాధించడానికి ఇస్లాంలో రెండురకాల ఆర్థిక విధానాలు ఉన్నాయి. ఒకటి, ఇస్లాం పెట్టుబడిదారీ వ్యవస్థలోని 'స్వేచ్ఛ'కు ధర్మస్మృతి (ఫికహ్),

చట్టాల (ఖానూన్) ద్వారా ముకుతాడు కట్టి "పరిమిత పెట్టుబడిదారీ విధానం" (Controlled Capitalism)కు ద్వారం తెరచిపెట్టింది. రెండు, సామ్యవాదపు "సమానత్వం"లోని బలప్రయోగాలకు నైతికత, ఆధ్యాత్మికతల ద్వారా అడ్డుకట్ట వేసి "ఆధ్యాత్మిక సామ్యవాదం" (Spiritual Socialism)కు రాచబాట నిర్మించింది. ఈ రెండు విధానాల ప్రాతిపదికల పైనే ఇస్లాం ఆర్థికన్యాయం నెలకొల్పదలచింది.

ఇస్లామీయ విశ్వాసం ప్రకారం మానవులకు ఏవస్తువు పైనా యాజమాన్య హక్కులు లేవు. చివరికి మానవులకు తమ శరీరాలపై, ఆత్మలపై కూడా యాజమాన్య హక్కులు లేవు. అంతేకాదు, వాటిని తమ ఇష్టమొచ్చినట్లు ఉపయోగించుకునే అధికారం కూడా మానవులకు లేదు. ఈ క్రింది ఖుర్‌ఆన్ సూక్తులు చూడండి:

"భూమ్యాకాశాల్లోని సర్వస్వం దేవునిదే. ఆయనే వాటికి వారసుడు. అలాంటప్పుడు మీరు దైవమార్గంలో సంపదను ఎందుకు ఖర్చుపెట్టరు?" (57:10)

"ఆయనే సూర్య చంద్ర నక్షత్రాలను సృష్టించినవాడు. సకల సృష్టిరాసులూ ఆయన ఆజ్ఞే శిరసావహిస్తున్నాయి. వినండి! సృష్టి ఆయనదే, ఆజ్ఞ (అధికారం) కూడా ఆయనదే. సకలలోక ప్రభువయిన ఆ దేవుడు ఎంతో శుభదాయకుడు." (7:54)

సృష్టిలోని మానవులతో సహా సమస్త వస్తువులపై సృష్టికర్తకే యాజమాన్యపు హక్కులున్నాయి. కనుక ఆయన ఆదేశాల ప్రకారమే మానవులు నడచుకోవలసి ఉంటుంది. ధనం, ఇతర ఆర్థిక ఒనరులు కూడా సృష్టికర్త, విశ్వపాలకుడైన దేవుని ఆదేశాల ప్రకారమే వినియోగించబడాలి. 'నాసంపద, నాడబ్బు. నేను నా ఇష్టమొచ్చి నట్లు ఖర్చుపెట్టుకుంటాను' అంటే ఇస్లాంలో కుదరదు. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

"(మానవుడు పేరుప్రతిష్ఠల కోసం ధనాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నాడు! పైపెచ్చు ప్రగల్భాలు పలుకుతూ) "నేను లక్షలాది రూపాయలు మంచి నీళ్ళలా ఖర్చు పెట్టాను" అంటున్నాడు. తనను (పైన) ఎవరూ చూడటం లేదని భావిస్తున్నాడా అతను? మేమతనికి రెండు కళ్ళు, ఒక నోరు, రెండు పెదవులు ఇవ్వలేదా? (మంచికి, చెడుకు సంబంధించిన) రెండు స్పష్టమైన మార్గాలు అతనికి చూపలేదా? (90:6-10)

"కాని అతను కఠినమైన కనుమ గుండా నడవడానికి సాహసించలేదు. కఠినమైన కనుమ అంటే ఏమిటో నీకు తెలుసా? (కఠినమైన కనుమంటే) బానిసను బంధవిముక్తి చేయడం, లేదా (కరువుదినాల్లో) ఆకలిగొన్న రోజు సమీప అనాథకుగాని, దారిద్ర్యంలో మగ్గే నిరుపేదకుగాని పట్టెడన్నం పెట్టడం, ఆపై ఓర్పు, దయాదాక్షిణ్యాల్ని గురించి పరస్పరం ఉపదేశించుకునే విశ్వాసుల్లో చేరిపోవడం". (90:11-17)

"మద్యన్‌జాతి ప్రజల దగ్గరకు వారి సోదరుడు షుఐబ్‌ని (ప్రవక్తగా నియమించి) పంపాము. అతను (వారిని దైవమార్గం వైపు పిలుస్తూ) ఇలా అన్నాడు: 'నా



జాతిప్రజలారా! ఏకైక దేవుడ్ని (మాత్రమే) ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యదైవం లేదు. తూనికల్లో, కొలతల్లో (సరుకులు) తగ్గించి ఇవ్వకండి. నేనీ రోజు మీరు మంచి స్థితిలో ఉండటం చూస్తున్నాను. కాని (మీ వైఖరి ఇలాగే కొనసాగితే) రేపు మీమీద అందర్నీ చుట్టు ముట్టే ఆపద విరుచుకు పడవచ్చని భయపడుతున్నాను. (11:84)

"కనుక న్యాయంగా సరయిన కొలమానాలతో పూర్తిగా తూచి, కొలిచి ఇవ్వండి. ప్రజలకు రావలసిన సరుకులు తగ్గించి వారికి నష్టం కలిగించకండి. లోకంలో కలహాలు, కల్లోలాలు రేకెత్తిస్తూ తిరగకండి. (అక్రమ లాభార్జనకన్నా) దేవుడు ప్రసాదించే (సక్రమ) ఆదాయమే మీకు శ్రేష్ఠమయినది, మీరు నిజాయితీపరులయితే (దాంతోనే తృప్తిచెందాలి). ఏమైనప్పటికీ నేను మాత్రం మీమీద కావలివాడుగా (అనుక్షణం) కనిపెట్టుకొని ఉండలేను". (11:85,86)

"దానికి వారిలా అన్నారు: 'షుఐబ్! మా తాతముత్తాతల కాలం నుండి వస్తున్న ఈ దైవాలను ఆరాధించడం మేము మానుకోవాలా? మా ధనాన్ని మా ఇష్టమొచ్చినట్లు ఖర్చుపెట్టుకునే అధికారం కూడా లేదా మాకు? ఇదేనా నీప్రార్థన నీకు నేర్పుతున్నది? (మాఅందరిలో) సాధుస్వభావి, సన్మార్గగామివి నీవొక్కడివే మిగిలావు కాబోలు!" (11:87)

విశ్వప్రభువు ఖుర్‌ఆన్‌లో తాను లోకంలో త్రాసుని కూడా సృష్టించానని తెలియ జేస్తున్నాడు. త్రాసు అంటే న్యాయమే. న్యాయస్థానాలలో కళ్ళకు గంతలు కట్టుకొని చేతిలో త్రాసు పట్టుకొని నిల్చున్న బొమ్మను ఉంచడానికి కారణం త్రాసు న్యాయానికి ప్రతీక కావడమే. అయితే ఈ ప్రాపంచిక న్యాయస్థానాలకు చెవులేగాని కళ్ళుండవు. ఇలాంటి న్యాయస్థానాలు ఏ మేరకు న్యాయం చేకూర్చుతాయో ఆ బొమ్మ కళ్ళకు కట్టిన గంతే చెబుతుంది. న్యాయానికి ప్రతీకయిన త్రాసును సృష్టించిన విశ్వపాలకునికి కళ్ళూ, చెవులూ రెండూ ఉన్నాయి. నేరం చేసినవాడు విశ్వపాలకుడి నుండి ఏ మాత్రం తప్పించుకోలేడు. ఆయన ఖుర్‌ఆన్‌లో ఇలా ఆదేశిస్తున్నాడు:

"మేము మా ప్రవక్తలకు నిర్దిష్టమైన సూచనలు, నిదర్శనాలు ఇచ్చి పంపాము. వాటితోపాటు దివ్యగ్రంథాలను, జనం న్యాయానికి కట్టుబడి ఉండేందుకు త్రాసును కూడా అవతరింపజేశాము." (57:25)

"ఆయనే త్రాసును (న్యాయాన్ని) కూడా సృష్టించాడు. కనుక మీరు త్రాసు సమతూకాన్ని చెడగొట్టకండి. న్యాయంగా, సవ్యంగా తూచి ఇవ్వండి." (55:8,9)

"వారికిలా చెప్పు: 'నేను దేవుడు పంపిన ప్రతి గ్రంథాన్ని విశ్వసిస్తున్నాను. మీ వ్యవహారాలన్నీ న్యాయంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించాలని నాకు ఆజ్ఞయింది." (42:15)

"విశ్వాసులారా! దేవుని కోసం నీతి నిజాయితీలకు కట్టుబడిఉంటూ, న్యాయమైన సాక్ష్యం ఇవ్వండి. ఇతరుల పట్ల విరోధం ఉన్నా సరే మీరు న్యాయానికి తిలోదకాలు

ఇవ్వకూడదు. ఎల్లప్పుడూ న్యాయంగానే వ్యవహరించాలి. దైవభీతి పరాయణత అంటే అదే. ప్రతి విషయంలోనూ దేవుని పట్ల భయభక్తులతో మసలుకోవాలి. మీరు చేసేదంతా దేవునికి తెలుసు. విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి, వారి పొరపాట్లు మన్నించ బడతాయని, వారికి గొప్పప్రతిఫలం లభిస్తుందని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు. అవిశ్వాసులై దేవుని సూక్తులు తిరస్కరించేవారు నరకానికి పోతారు." (5:8-10)

"విశ్వాసులారా! న్యాయానికి కట్టుబడి ఉండండి. స్వయంగా మీకుగాని, మీ తల్లి దండ్రులకుగాని లేదా మీ బంధువులకుగాని నష్టం వాటిల్లినాసరే దేవుని కోసం నిజమైన సాక్ష్యం ఇవ్వండి. కక్షిదారుడు ధనికుడైనా, పేదవాడైనా వారి విషయంలో మీకంటే దేవుడే ఎక్కువ శ్రేయోభిలాషి. కనుక మీరు మీ మనోవాంఛల్ని అనుసరిస్తూ న్యాయానికి తిలోదకాలు ఇవ్వకండి. ఒకవేళ మీరు విషయాన్ని వక్రీకరిస్తే లేదా నిజాన్ని దాటవేస్తే మీరు చేసేదంతా దేవుడు గమనిస్తుంటాడని తెలుసుకోండి." (4:135)

## 15. దుబారా ఖర్చులు

ఇస్లాం దుబారా ఖర్చుచేయడాన్ని, సంపదను వృథాచేయడాన్ని సుతరామూ ఇష్ట పడదు. అది పొదుపును గురించి బోధిస్తుంది. ఈనాడు సంపదను, ముఖ్యంగా ఆహారపదార్థాలను దుబారా చేయడమే గాకుండా గోడౌన్లలో ముక్కిపోయే వరకు నిల్వవుంచడం, కొన్నిదేశాల్లో అవసరానికి మించి పండిన ఆహారోత్పత్తుల్ని తగలబెట్టడం లేదా సముద్రంలో పారవేయడం జరుగుతోంది. ఇవి చాలా హేయమైన చర్యలని, పైశాచిక చేష్టలని ఇస్లాం చెబుతోంది. ఈ క్రింది సూక్తులు చూడండి:

"దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు." (6:141)

"దుబారా ఖర్చు చేయకండి. దుబారాఖర్చు చేసేవారు షైతాన్ సోదరులుగా పరిగ ణించబడతారు. షైతాన్ తన ప్రభువుకు కృతఘ్నుడై పోయాడు." (17:26,27)

"మీరు మీచేతిని (ఏమాత్రం దానంచేయకుండా) మెడకేసి కట్టి ఉంచకండి. అలాగే దాన్ని పూర్తిగా తెరచి ఉంచడం కూడా సరికాదు. అలాచేస్తే మీరు నిందితులయి, నిస్సహాయులై పోతారు. నీ ప్రభువు తాను కోరిన విధంగా కొందరికి ఇతోధికంగా ఉపాధి నిస్తే, మరికొందరిని లేమికి గురిచేస్తాడు. ఆయనకు తన దాసుల స్థితిగతులు బాగా తెలుసు. ఆయన వారిని చూస్తూనే ఉన్నాడు." (17:29,30)

"వారు (విశ్వాసులు) తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా ఖర్చుచేయరు; ఇటు పిసినారితనం కూడా వహించరు. వారి ఖర్చు ఆ రెండు అతిచర్యలకు మధ్యస్తంగా ఉంటుంది." (25:67)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "తినండి, తాగండి, దానం చేయండి, ధరించండి. అయితే దుబారా ఖర్చులు చేయకండి; అహంకారానికి లోనుకాకండి." (నసాయి)



హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అన్నారు: "మీలో రెండు విషయాలు లేనంత వరకు మీరు కోరుకున్నది తినండి, తాగండి, ధరించండి. ఆ రెండు విషయాలు- దుబారా ఖర్చులు, అహంకారం." (బుఖారి)

పేరుప్రతిష్ఠల కోసం, గర్వకారణం కోసం పెద్దపెద్ద భవనాలు నిర్మించడాన్ని కూడా ఇస్లాం హర్షించదు. ఖుర్ఆన్‌లో ఆద్‌జాతి ప్రజలకు హూద్ ప్రవక్త (అలైహి) చేసిన ఈ హితోక్తులు గమనించండి:

"మీరు ఎత్తయిన ప్రతి చోటా పనికిమాలిన స్మారకభవనం నిర్మిస్తున్నారేమిటీ? ఇక్కడే శాశ్వతంగా ఉండాలన్నట్లు పెద్దపెద్ద మేడలు కడ్తున్నారు. మీరు ఎవరినైనా పట్టుకుంటే వారి పట్ల చాలా క్రూరంగా వ్యవహరిస్తారు. (ఇప్పటికైనా) దేవునికి భయపడండి. నాకు విధేయులై పోండి." (26:128-131)

ఖుర్ఆన్‌లో సమూద్‌జాతి ప్రజలకు వారి ప్రవక్త హజ్రత్ సాలిహ్ (అలైహి) చేసిన ఈ ఉపదేశం కూడా గమనించండి:

"ఈ తోటలు, కాలువలు, పచ్చటిపొలాలు, పండ్లతో నిండిన ఈ ఎడారి వనాల మధ్య మిమ్మల్ని హాయిగా ఎల్లకాలం ఉండనివ్వడం జరుగుతుందని భావిస్తున్నారా? అదీగాక మీరు కొండల్ని తొలచి బడాయికోసం పెద్దపెద్ద కట్టడాలు నిర్మిస్తున్నారే. కాస్త దేవునికి భయపడండి. నాకు విధేయత చూపండి." (26:146-150)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "భవననిర్మాణం కోసం చేసేఖర్చు తప్ప ఇతర ఖర్చులన్నీ దైవమార్గంలో చేసిన ఖర్చులుగా పరిగణించ బడతాయి. భవననిర్మాణం కోసం చేసేఖర్చులో ఎలాంటి పుణ్యం లేదు." (తిర్మిజి)

ఈ హదీసులో భవననిర్మాణం అంటే బడాయి కోసం, పేరుప్రతిష్ఠల కోసం భవనాలు నిర్మించడం అని అర్థం కావచ్చు.

## 16. ధనవికేంద్రీకరణ-మౌలిక విషయాలు

ప్రజలకు ఆర్థికన్యాయం చేకూరడానికి సంపద ఏవో కొన్ని చోట్ల, కొందరు వ్యక్తుల దగ్గర పేరుకొని ఉండకూడదు. అది సమాజంలో నిరంతరం పరిభ్రమిస్తూ ఉండాలి. ఈవిధంగా ధన వికేంద్రీకరణ విధానం ద్వారా మాత్రమే ఆర్థికన్యాయం నెలకొంటుంది. ధన వికేంద్రీకరణకు సంబంధించిన మౌలిక సూత్రం ఖుర్ఆన్‌లో ఈ విధంగా ఉంది:

"దేవుడు వారిఅధీనం నుండి తీసి తన ప్రవక్తకు హస్తగతంచేసిన సిరిసంపదలు, నిజానికి (యుద్ధరంగంలో) మీరు గుర్రాలు, ఒంటెల్ని పరుగెత్తించి సాధించిన సిరి సంపదలు కావు. దేవుడు తన ప్రవక్తలకు తానుకోరిన వారిపై ఆధిక్యతనిస్తాడు. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వ శక్తిమంతుడు." (59:6)

"దేవుడు ఈ వాడవాసుల నుండి తన ప్రవక్తకు అధీనం చేసిన ధన (కనక) వస్తు సంపదల్లో దేవునికి, దైవప్రవక్తకు, బంధువులకు, అనాథలకు, పేదలకు, బాటసారులకు హక్కుంది. ధనం (ఎల్లప్పుడూ) మీలోని ధనిక వర్గంలోనే కేంద్రీకృతమయి ఉండరాదన్న లక్ష్యంతో ఈ విధానం నిర్ణయించబడింది. దైవప్రవక్త మీకు దేన్నిస్తాడో దాన్ని తీసుకొని, దేన్నుండి మిమ్మల్ని నిరోధిస్తాడో దాని జోలికి పోకండి. దేవునికి భయపడండి. దేవుని శిక్ష చాలా కఠినంగా ఉంటుంది." (59:7)

ఈ సూక్తే ఇస్లాం ఆర్థిక విధానానికి మూలసూత్రం. ధనం కొందరు వ్యక్తుల దగ్గర పోగయి ఉండటాన్ని, అసహజమైన ఆర్థిక సమానత్వ మార్గాలు తెరవడాన్ని ఇస్లాం అంగీకరించదు. ఇది ఆర్థిక న్యాయాన్ని నెలకొల్పదలచింది. దాని కోసం ఈ సూక్తిలో పేర్కొన్న "ధన వికేంద్రీకరణ" విధానాన్ని ప్రతిపాదిస్తోంది. ఇస్లాం నెలకొల్ప దలచిన ఆర్థికన్యాయం ఎలాంటిదో పరిశీలిద్దాం:

ఇస్లాం మొట్టమొదట అధర్మసంపదనా మార్గాలను మూసేసి, ధర్మసమ్మతమైన సంపదనా మార్గాలను మాత్రమే తెరచిపెడ్తుంది. ఖుర్‌ఆన్‌లో ఒకచోట ఇలా ఉంది:

"విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్ము మరొకరు అన్యాయంగా కబళించకండి. పరస్పరామోదంతో వ్యాపారలావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడాలు జరుపుకోవచ్చు. (అన్యాయం, అక్రమం, హత్యల ద్వారా) మిమ్మల్ని మీరు హతమార్చుకోకండి". (4:29)

సంపదనా మార్గాల్లో కొన్ని నిషిద్ధ మార్గాలు ఖుర్‌ఆన్ ప్రకారం ఇవి: 1-లంచం, దౌర్జన్యం, అన్యాయం, అపహరణల ద్వారా సంపాదించడం (2:188). 2-అనాథల సొమ్ము కాజేయడం ద్వారా (4:1). 3-కొలతల్లో, తూనికల్లో మోసం చేయడం ద్వారా (17:35, 55:9, 26:181, 83:4). 4-దొంగతనం ద్వారా (5:38). 5-విగ్రహాల ద్వారా (5:90). 6-మద్యం ద్వారా (5:90). 7-జూదం, లాటరీల ద్వారా (5:90). 8-జోస్యం, పాచికల ద్వారా (5:90). 9-వడ్డీ వ్యాపారం ద్వారా (2:277). 10-వ్యభిచారం, అసభ్యత, అశ్లీలతల ద్వారా (24:19,33).

ధనం ధర్మసమ్మతమైన మార్గాల ద్వారా సంపాదించినా దాన్ని పిసినారితనంతో కూడబెట్టరాదు (3:180, 9:34, 2:268). దుబారాఖర్చు చేయకూడదు (17:26,27). కుటుంబ అవసరాలకు పోగా మిగిలింది దైవమార్గంలో ఖర్చుచేయాలి (2:219). ఆ తరువాత ధనాన్ని సద్వినియోగం చేయవలసిన పద్ధతులు అవలంబించాలి.

- **జకాత్:** నిర్ణీతమొత్తం కంటే ఎక్కువ సంపాదించినవాడు ఆ మొత్తం నుండి ప్రతియేడూ రెండున్నర శాతం తీసి నిరుపేదలకు, అగత్యపరులకు, అనాథలకు, బాటసారులకు, రుణగ్రస్తులకు, బానిసత్వం నుండి విముక్తి కలిగించడానికి, జకాత్ వసూలు చేసే ఉద్యోగుల జీతాల కోసం, ధర్మసంస్థాపనాకార్యాలతో పాటు ఇతర ప్రజాసంక్షేమ కార్యాల కోసం ఖర్చుచేయాలి (ఖుర్‌ఆన్-9:60).



- **ఉష్ర్:** భూఉత్పత్తుల (వృక్షసంపద)పై కూడా జకాత్ ఉంది. దీన్ని ఉష్ర్ అంటారు. పంట చేతికొచ్చినప్పుడు ఆ పంటనుండి దేవునిహక్కు (అంటే పేదలహక్కు) నెరవేర్చాలి (6:141). సహజ నీటివనరుల ద్వారా పండే పంట నుండి పదిశాతం, కృత్రిమ వనరుల ద్వారా పండే పంట నుండి ఐదుశాతం ఫలసాయం ఉష్ర్ చెల్లించాలి. ఇలా పంటపండిన ప్రతిసారీ (ఏడాదికి ఎన్ని పంటలైనా) ఉష్ర్ తీయాలి. ఉష్ర్ కూడా జకాత్ స్వీకార అర్హులకే అందజేయవలసి ఉంటుంది.
- **రికాజ్:** భూపొరలలో నిక్షిప్తయి ఉండే ఖనిజ నిక్షేపాల నుండి ఇరవై శాతం జకాత్ తీసి ప్రభుత్వ ధనాగారం (బైతుల్‌మాల్)లో జమచేయాలి. దీన్ని ప్రభుత్వం నిరుపేదలకు, ఇతర ప్రజాసంక్షేమ కార్యాల కోసం ఖర్చుపెడుతుంది. (హదీసు)
- **ఫిత్రా:** ప్రతి సంవత్సరం రమజాన్ నెలలో స్థితిపరుడు తన తరఫున, తన కుటుంబసభ్యులందరి తరఫున విడి విడిగా 1100 గ్రాములు (మరొక అభిప్రాయం ప్రకారం దాదాపు 1700 గ్రాములు చొప్పున గోధుమలుగాని లేదా దాని ధరగాని పేదలకు దానం చేయాలి. (హదీసు)
- **అన్ఫాల్ (సమరసొత్తు):** యుద్ధభూమిలో శత్రువర్గం నుండి లభించిన సొత్తులో 80% సైనికులకు లభిస్తుంది (జీతాలు నిర్ణయించబడని కారణంగా). మిగతా 20% ప్రభుత్వధనాగారానికి, (పేద) బంధువులకు, అనాథలకు, నిరుపేదలకు, బాటసారులకు చెందుతుంది. (8:41)
- **ఫై:** యుద్ధం జరగకుండా శత్రువు రాజీఒప్పందానికి వచ్చి అప్పగించే పంట భూములు, ఇండ్లు, వగైరా స్థిరచరాస్తుల్ని 'ఫై' అంటారు. ఇందులో కూడా ప్రభుత్వ భాగం పోగా మిగిలినది అనాథలకు, పేదలకు, బాటసారులకు చెందుతుంది. (59:7)
- **వారసత్వపు ఆస్తి:** మనిషి చనిపోయిన తరువాత అతను వదలి వెళ్ళిన ఆస్తిని అతని వారసులకు పంచడం జరగాలి. ఎవరెవరికి ఎంతెంత ఆస్తి పంచాలో ఆ వివరాలన్నీ ఖుర్‌ఆన్ నిర్ణయించింది. (4:11,12 సూక్తులు) ఆ వాటాలను మార్చడానికి ఎవరికీ అధికారం లేదు. మృతుడు ప్రత్యేకంగా ఏ నిరుపేద బంధువుకైనా లేదా మరే సత్కార్యం కోసమైనా తన ఆస్తి నుండి కొంత ఇవ్వాలని వీలునామా రాయ దలచుకుంటే మొత్తం ఆస్తిలో మూడోవంతు మాత్రమే రాయాలి. మిగతా రెండు వంతులు వారసులకు తప్పనిసరిగా సంక్రమించాలి.

వారసుల్లో పురుషునికి లభించే వాటాలో, స్త్రీకి సగం లభించాలన్నది వారసత్వపు ఆస్తి ప్రాథమిక సూత్రం. స్త్రీకి వివాహంలో భర్త నుండి 'మహర్' రూపంలో కొంత ఆస్తి లభిస్తుందనే విషయం గమనార్హం. మృతునికి సంతానం లేకపోతే ఎవరినైనా దత్తత తీసుకొని అతనికి ఆస్తి కట్టబెట్టే అధికారం లేదు. మృతునికి దగ్గరి బంధువులెవరూ లేకపోతే దూరపు బంధువులకు అతని ఆస్తి లభిస్తుంది. దూరపుబంధువులు కూడా

లేకపోతే అతని ఆస్తి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు, ప్రజాసంక్షేమ కార్యాలకు వినియోగిస్తుంది. 4వ అధ్యాయం (నిసా) చూడండి.

ఈవిధంగా ఇస్లాం ధనాన్ని పెట్టుబడిదారీవ్యవస్థలో మాదిరిగా కొందరు వ్యక్తుల్లో, సామ్యవాద వ్యవస్థలోలాగా పాలకుల చేతుల్లో కేంద్రీకృతమై ఉండకుండా నిరంతరం సమాజంలో పరిభ్రమించేలా చేస్తుంది. ఇదే ఇస్లాం ప్రతిపాదిస్తున్న ఆర్థిక న్యాయం. ఇస్లామీయ ప్రభుత్వాలు నడిపే ఇలాంటి ఆర్థిక వ్యవస్థలో ఏ పౌరుడు కూడా టాటా, బిర్లాల మాదిరిగా కోటీశ్వరుడయ్యే ఆస్కారం ఉండదు. ఒకవేళ ఎవరైనా ఒకరిద్దరు కోటీశ్వరులైపోతే అది ఎంతో అద్భుత విషయమని, ప్రపంచ వింతల్లో ఒక వింతని చెప్పవచ్చు. ఒక మనిషి ధర్మసమ్మతమైన మార్గాల ద్వారా నిజాయితీగా సంపాదించి కోటీశ్వరుడయితే ఇస్లాం దాన్ని దైవానుగ్రహం అని అభివర్ణిస్తుంది.

## 17. సరిపడ సహజ ఒనరులు

మన భూమండలం మీద యావత్తు మానవులకు కావలసిన సహజ ఒనరులు పుష్కలంగా ఉన్నాయి. అప్పుడప్పుడు వచ్చే ప్రకృతి వైపరీత్యాల వల్ల కొంత నష్టం జరుగుతున్నప్పటికీ అందరికీ సరిపడే సహజ ఒనరులలో ఏమాత్రం కొరత రాదు.

దేవుడు సృష్టికర్త, ఆరాధ్యుడు మాత్రమే కాదు; ఆయన శాసనకర్త, పోషకుడు కూడా. ప్రాణికోటిని పోషించే బాధ్యతను ఆయనే తీసుకున్నాడు. ఉపాధి సముపార్జనకు మానవులు కృషి మాత్రమే చేయగలరు. ఉపాధి ప్రదాత నిజానికి దేవుడే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆయన ఆహారోత్పత్తి కుడా పెంచుతున్నాడు. అధికోత్పత్తి కోసం నేడు వ్యవసాయరంగంలో అద్భుత విధానాలు, అసాధారణ సాంకేతిక పద్ధతుల్ని మానవులకు అనుగ్రహించినవాడు ఆ ప్రభువే.

మానవుడు దేవుడు నిర్దేశించిన రుజుమార్గం వదలి అపమార్గం పట్టిపోతే షైతాన్ అతడ్ని రకరకాల భయప్రలోభాలకు గురిచేసి తప్పుడు పనులకు పాల్పడేలా చేస్తాడు. ఆర్థిక విషయాలకు వస్తే షైతాన్ ముందుగా మానవుడ్ని పేదరికం గురించి భయపెడతాడు. దాంతో అతను పేదలకు సహాయంచేయడంలో, ఇతర సత్కార్యాల కోసం డబ్బు ఖర్చుపెట్టడంలో పిసినారితనం చూపుతాడు. పిసినారి పనులను ఖుర్ఆన్ సిగ్గుమాలిన పనులతో పోల్చుతోంది:

"షైతాన్ మిమ్మల్ని పేదరికం గురించి భయపెట్టి సిగ్గుమాలిన పనులకు పాల్పడేలా ప్రేరేపిస్తాడు. కాని దేవుడు మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. ఆయన ఎంతో ఉదారస్వభావుడు, సర్వం తెలిసినవాడు."(ఖుర్ఆన్-2:268)

చివరికి ఈ పేదరికం భయంతోనే మానవుడు తన సంతానాన్ని చంపుకోవడానికి కూడా సిద్ధమవుతున్నాడు. ఈ దారిద్ర్యభయమే స్వార్థానికి జన్మనిస్తుంది. స్వార్థం నుండి నిర్దయ, హృదయకాఠిన్యతలు పుట్టుకొస్తాయి.



"పేదరికం భయంతో మీ సంతానాన్ని (చేజేతులా) హతమార్చుకోకండి. మేము మీకూ ఆహారమిస్తున్నాము, వారికీ ఆహారమిస్తున్నాము." (ఖుర్ఆన్-6:151)

మనదేశంలో యాభైయేళ్ళ క్రితంనాటి 45కోట్ల జనాభా జీవనప్రమాణం కంటే నేడు 100 కోట్ల జనాభా జీవనప్రమాణం మెరుగ్గాఉంది. ఇతరదేశాల్లో కూడా అంతే. ఎక్కడో కొన్నిచోట్ల మాత్రమే కొందరు కనీసావసరాలు దొరక్క బాధపడ్తున్నారు. దీనిక్కారణం భూమిపై ఆహారోత్పత్తి తగ్గిపోయిందని అర్థంకాదు. మానవులు దైవ బోధనలు వదలి అనుసరిస్తున్న అసహజ ఆర్థికవిధానాలే ఉపాధి పంపిణిలో అపసవ్యత, సమతులనారాహిత్యాలను సృష్టిస్తున్నాయి.

తత్ఫలితంగా లక్షలాది టన్నుల ఆహారధాన్యాలు గిడ్డంగులలో ఏళ్ల తరబడి పంపిణీకి నోచుకోలేక ముక్కిపోతున్నాయి. కొన్ని దేశాల్లో నయితే అదనంగా పండిన ఆహారోత్పత్తుల్ని పెద్దఎత్తున తగలబెట్టడమో, సముద్రంలో పారవెయ్యడమో జరుగుతోంది. ఈ నిర్వాకం కోసం ఆ దేశాలు కోట్లాది డాలర్లు ఖర్చుపెడుతున్నాయి. ఈ అసహజ ఆర్థికవిధానాలకు స్వార్థ రాజకీయాలు తోడయితే పరిస్థితి ఏ రూపు ధరిస్తుందో ఊహించవచ్చు. నేడు "రాజకీయ ఆర్థికం" (Political Economy) అనే అందమైన పేరుతో అమెరికా, బ్రిటన్ వంటి బలమైన దేశాలు ఆసియా, ఆఫ్రికాల లోని బలహీన దేశాలలో ఎన్నో అరాచకాలు, అలజడులు సృష్టిస్తున్నాయి.

నేటి పాలకులు, ఆర్థికవేత్తలు సరైన ఆర్థికవిధానాలతో ఆహారోత్పత్తులు సక్రమంగా పంపిణీ చేయలేక ఏకంగా సంతానోత్పత్తినే అరికట్టే చర్యలకు పాల్పడుతున్నారు. అంటే తోటి మానవసంతతినే హతమార్చుతున్నారన్నమాట. ఇంతకంటే ఆత్మహత్యా సదృశం మరొకటి ఉండదు.

"ప్రవక్తా! వారికీ సంగతి చెప్పు: "కేవలం రెండురోజుల్లో భూమిని సృష్టించిన దేవుడ్ని మీరు తిరస్కరిస్తున్నారా? ఆయనకు ఇతరులను సాటికల్పిస్తున్నారా? సకల లోకాలకు ఆయనే కదా ప్రభువు! ఆయనే భూమి (దొర్లిపోకుండా దాని) మీద పర్వతాలు పాతిపెట్టాడు. అందులో అనేక శుభాలు ఉంచాడు. అంతేకాదు, ఆహారం అర్థించే సమస్త ప్రాణికోటికి అవసరమైన మేరకు లెక్క ప్రకారం దానిపై ఆహారసామగ్రి కూడా ఏర్పాటు చేశాడు". (ఖుర్ఆన్-41:9,10)

అనాది నుండి అంతిమదినం వరకు పుట్టే సమస్త ప్రాణికోటికి సరిపడ ఆహార సామగ్రిని దేవుడు ప్రపంచంలో ఏర్పాటు చేశాడని పై సూక్తులు తెలియజేస్తున్నాయి. అయితే ఈ ఆహారం అవసరమయిన మేరకు అందాలంటే దేవుడు నిర్దేశించిన జీవన విధానం ప్రకారం ఆర్థిక విభజన ప్రక్రియ న్యాయంగా, నిష్పక్షపాతంగా నిరంతరం జరుగుతుండాలి. కాని స్వార్థమే పరమార్థంగా భావించిన నేటి మానవుడు దేవుడు నిర్ణయించిన సత్యధర్మాన్ని, ఆర్థికన్యాయాన్ని త్రోసి పుచ్చి అన్యాయం, అక్రమం, దగా,

దోపిడీ, హింసాదౌర్జన్యాలతో కొన్ని వర్గాలకు కృత్రిమ కొరత సృష్టిస్తున్నాడు. ఆ విధంగా కూడబెట్టిన ఆర్థిక ఒనరుల్ని ఎరగా చూపుతూ దేవుని దాసుల్ని తన దాసులుగా చేసు కోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

## 18. స్వార్థానికి ప్రతిరూపమే కృతఘ్నత

నేటి మానవుడు సృష్టికర్త చేసిన మేళ్ళను గుర్తించకుండా ఆయన శాసనాలకు వ్యతిరేకంగా అసహజ పద్ధతులు అవలంబించి ఆర్థిక అసమానతలు సృష్టిస్తున్నాడు; తనకంటే బలహీనులైనవారిపై పెత్తనం చలాయిస్తూ వారిని దోచుకుంటున్నాడు.

“ఆయన రెండు సముద్రాలు పరస్పరం కలసిపోయేలా వదలిపెట్టాడు. ఆయినా వాటి మధ్య ఒక అడ్డుతెర ఉంది. దానివల్ల అవి ఒకదానిలో ఒకటి చొచ్చుకు పోలేవు. మరి మీరు మీప్రభువు శక్తిపరిధిలోని ఏ మహిమను నిరాకరిస్తారు? ఆ సముద్రాలలో ముత్యాలు, పగడాలు లభిస్తాయి. కనుక మీరు మీ ప్రభువులో ఉన్న ఏ ఔన్నత్యాన్ని కాదనగలరు? సముద్రంలో కొండల్లా ఎత్తుగా నిలబడి సాగిపోయే ఓడలు కూడా ఆయనవే. కనుక మీరు మీప్రభువు చేసిన ఏమేళ్ళు తిరస్కరించగలరు?” (ఖుర్ఆన్-55:19-25)

ఖుర్ఆన్ 55వ అధ్యాయంలోని మొదటి 25సూక్తులలో ఆనాటి ప్రజలకు ప్రసా దించబడిన ఐహిక మేళ్ళు ఉదాహరించబడ్డాయి. అయితే ఈనాటి ప్రజలకు వాటితో పాటు, అంతకంటే మెరుగైన ఎన్నోమేళ్ళు అనుగ్రహించబడ్డాయి. సైన్సు, సాంకేతిక పరిజ్ఞానాలు నేటి మానవునికి అనేక సౌఖ్యాలు, సౌకర్యాలు, సౌలభ్యాలు చేకూర్చాయి.

ఉదాహరణకు విద్యుచ్ఛక్తి మానవుని జీవితవిధానాన్నే మార్చివేసింది. గతంలో అసాధ్యమనుకున్న ఎన్నో పనుల్ని నేడు విద్యుచ్ఛక్తితో నడిచే యంత్రాలొచ్చి సుసాధ్యం చేశాయి. పట్టణాలలో ఈనాడు లైట్లు, ఫ్యాన్లు లేని ఇండ్లు దాదాపు లేవు. ఒక్కరోజు కరెంటు లేకపోతే జీవితం దుర్భరం అవుతుంది. అలాగే కార్లు, బస్సులు, రైళ్ళు, విమానాలు ప్రయాణ బడలికను తీర్చడమేగాక, సమయాన్ని ఎంతో ఆదా చేస్తున్నాయి. విద్యుచ్ఛక్తి వల్ల ప్రజలు అనుభవిస్తున్న సౌఖ్యాలు, సౌకర్యాలను గమనిస్తే ఓగంట సేపయినా విద్యుచ్ఛక్తి లేకపోతే వారి జీవితం గడవనే గడవదని అన్పిస్తుంది.

ఆ తరువాత ఎలాక్ట్రానిక్స్ పరిజ్ఞానం పరిస్థితుల స్వరూపాన్ని మరింత మార్చి వేసింది. జీవితం మరింత సుఖమయమయింది. ఈ ఎలాక్ట్రానిక్స్ పరిజ్ఞానం సమాచార రంగంలో గొప్ప సంచలనమే సృష్టించింది. రేడియో, టెలిఫోన్, టెలివిజన్, టెలిప్రింటర్, ఫ్యాక్స్, ఇ-మెయిల్, ఇంటర్‌నెట్ వగైరా మాధ్యమాలు మానవునికి గణనీయమైన సేవలు అందజేస్తున్నాయి.

ఆ తరువాత కంప్యూటర్లు వచ్చి మానవుని జీవితంలో ఓ పెద్ద అద్భుతాన్నే సృష్టించాయి. వందలమంది కార్మికులు కలసి నెలల తరబడి చేసే పనుల్ని ఒక



కంప్యూటర్ కొన్ని గంటలలోనే చేసివేస్తుంది. ఈ కంప్యూటర్ల నుండే తయారయిన ‘రోబోట్‌లు’ అనేక రంగాలలో మానవులతో పోటీ పడుతున్నాయి. అభివృద్ధి చెందిన కొన్ని దేశాలలో ఇవి గనులలో త్రవ్వకం, కర్మాగారాలలో వెల్డింగ్, బ్యాంకులలో ఎకౌంట్స్ మొదలైన పనులు నిర్వహిస్తున్నాయి. అంతేకాదు, అమెరికా, బ్రిటన్‌లలో మనుషులకు శస్త్రచికిత్సలు జరపడానికి కూడా వీటిని ఉపయోగిస్తున్నారు.

వైద్యరంగంలోనూ విజ్ఞానశాస్త్రం ఎన్నోమార్పులు తెచ్చింది. ప్రాచీన విధానాలైన యునానీ, ఆయుర్వేదం చికిత్సలతో పాటు ఆధునిక వైద్యవిధానాలైన అల్లోపతి, హోమియోపతి చికిత్సలు కూడా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతున్నాయి. శస్త్రచికిత్సల కోసం కొత్త కొత్త పరికరాలు వినియోగించ బడుతున్నాయి. ఎక్కువ నొప్పి లేకుండా, ఎక్కువ రక్తస్రావం కాకుండా లేజర్ చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. శరీరంలో కృత్రిమ అవయవాలు ప్రవేశపెడ్తున్నారు. క్యాన్సర్, పార్కిన్‌సన్స్ లాంటి మొండి వ్యాధుల్ని నయం చేయడానికి, మేధాశక్తిని, ఆయుష్షును పెంచడానికి కూడా జీన్‌థెరపీ (జన్యుచికిత్స) ద్వారా కృషి జరుగుతోంది.

వ్యవసాయరంగంలోనూ నేడు సైన్సు మానవునికి గణనీయమైన సేవ చేస్తోంది. యంత్రాలు, రసాయనిక ఎరువులు, నూతనవిధానాల ద్వారా ఉత్పత్తులు అనూహ్యా మైన రీతిలో పెరిగిపోయాయి. జెనిటిక్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీలు వ్యవసాయో త్పత్తులను పెంచడంలో ప్రముఖపాత్ర వహిస్తున్నాయి. జపాన్‌లో ‘హైడ్రోపోనిక్స్’ అనే అత్యాధునిక పద్ధతి ద్వారా మొక్కలకు కావలసిన వాతావరణం, పోషకాంశాలు కృత్రిమంగా కల్పించి అట్టలపై కూరగాయలు పండిస్తున్నారు. ఈనాడు ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న ఆహారధాన్యాలను గనక ప్రపంచ ప్రజలందరికీ అవసరమైన మేరకు న్యాయంగా పంచడంజరిగితే, అవి పోగా ఏడాదికి లక్షలాది టన్నుల ఆహారధాన్యాలు మిగిలిపోతాయంటే అతిశయోక్తి లేదు. కాని స్వార్థం, సంకుచితత్వాలు ఆధునిక మానవుని ఆలోచనలను భౌతిక, జాతీయతత్వ సరిహద్దుల్ని దాటనివ్వడం లేదు.

ఏమైనప్పటికీ ఇవన్నీ దేవుడు ప్రసాదించిన సౌకర్యాలనడంలో సందేహం లేదు. ఆ దేవుడే మానవులకు సుఖాలు, సౌలభ్యాలు పొందడానికి కావలసిన జ్ఞానం, తెలివి తేటలు అనుగ్రహించాడు. మరి అలాంటి కరుణామయునికి కృతజ్ఞులయి ఉండటం మానవుల విధ్యుక్త ధర్మం కాదా? సృష్టికర్తకు కృతజ్ఞులయి ఉండటమంటే ఆయన తన ప్రవక్తల ద్వారా పంపిన జీవిత విధానాన్ని, శాసనాలను అనుసరించడమే. దీనివల్ల సృష్టికర్తకు కాదు, స్వయంగా మానవునికే ప్రయోజనకరం.

## 19. పిసినారితనం వహించకండి

విశ్వసృష్టికర్త మానవుడిలోని పిసినారితనాన్ని, సంకుచితత్వాలను నిరసిస్తూ ఖుర్ఆన్‌లో ఇలా ఉపదేశిస్తున్నాడు:

“దైవమార్గంలో ఖర్చుపెట్టండి. చేజేతులా నాశనం కొనితెచ్చుకోకండి. సత్కార్యాలు చేస్తూఉండండి. సత్కార్యాలు చేసేవారిని దేవుడు తప్పకుండా ప్రేమిస్తాడు.” (2:195)

“అలాగే తాము పిసినారితనం వహించడమే గాకుండా ఇతరులను కూడా పిసినారితనం గురించి పురిగొల్పేవారిని కూడా దేవుడు ప్రేమించడు. (ఇదంతా తెలిసి కూడా) ఎవరైనా సత్యానికి విముఖులయిపోతే దేవుడు కూడా వారిని ఖాతరు చేయడు. ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు.” (57:23,24)

“అలాగే తాము పిసినారితనం వహించడమేగాక ఇతరులక్కూడా పిసినారితనం నూరి పోసేవారిని సైతం దేవుడు ప్రేమించడు. వారు తమకు దేవుడు ప్రసాదించిన అనుగ్రహాన్ని (ధనాన్ని) కూడబెడ్తారు. ఇలాంటి కృతఘ్నుల కోసం మేము నీచమైన (నరక) యాతనను సిద్ధపరచివుంచాము. వారొకవేళ ఏదైనా ఖర్చుపెట్టినా లోకుల మెప్పు కోసం మాత్రమే ఖర్చు పెడ్తారు. వారు దేవుణ్ణీ విశ్వసించరు, పరలోకాన్నీ విశ్వసించరు. కారణం, అలాంటివారికి షైతాన్ సహచరుడై పోయాడు. షైతాన్ సహచర్యం అత్యంత దుష్టసహచర్యం.” (4:37,38)

“దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది. యావత్తు భూమ్యాకాశాలకు దేవుడే వారసుడు. మీరు చేస్తున్నదంతా దేవునికి బాగా తెలుసు.” (3:180)

“వారిలో కొందరు “దేవుడు తన అనుగ్రహంతో తమకు సిరిసంపదలు ప్రసాదిస్తే తాము (ఉదారంగా) దానధర్మాలు చేస్తామని, సజ్జనులయి ఉంటామ”ని ప్రమాణం చేశారు. కాని దేవుడు తన దయతో వారిని ధనికులుగా చేయగానే వారు పిసినారితనం వహించారు. వారు తమ ప్రమాణాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా భంగపరిచారు. ఇలా వారు దేవుని విషయంలో వాగ్దానభంగానికి పాల్పడటం వల్ల, వారు పలుకుతున్న అబద్ధాల వల్ల దేవుడు వారి హృదయాల్లో కాపట్యం జనింపజేశాడు. వారు దేవుని సన్నిధిలో ప్రవేశపెట్టబడేవరకు ఈ కాపట్యజాడ్యం వారిని వదలదు.” (9:75–77)

“వారితో ఇలా అను: ‘ఒకవేళ మీ అధీనంలో నా ప్రభువు కారుణ్యనిక్షేపాలు ఉంటే వాటిని మీరు ఖర్చయిపోతాయన్న భయంతో తప్పకుండా దాచివుంచేవారు. మానవుడు నిజంగా చాలా సంకుచిత మనస్కుడయి పోయాడు”. (17:100)

ధనవ్యామోహం మనిషి చేత ముఖ్యంగా రెండు తప్పులు చేయిస్తుంది. ఒకటి, ధనార్జన కోసం అక్రమ పద్ధతులు అవలంబించడం. రెండు, ధనాన్ని అత్యధికంగా కూడ బెట్టడం లేదా దుబారా, దుష్కార్యాల్లో దుర్వినియోగపరచడం. ఇవి రెండు తీవ్రమైన నేరాలు. వీటికి పరలోకంలో ఘోరశిక్ష చవిచూడవలసి వస్తుంది.



“నిందించే, హేళనచేసే, చాడీలుచెప్పే ప్రతివాడికీ వినాశం ఉంది. అతను (మితిమీరిన ధనవ్యామోహంతో) డబ్బు కూడబెడ్తున్నాడు. (పరమలోభి అయి) దాన్ని మాటిమాటికి లెక్కపెట్టి దాచిపెడ్తున్నాడు. అతనీ సంపద శాశ్వతంగా తన దగ్గర ఉంటుం దని భావిస్తున్నాడు. ఎంతమాత్రం ఉండదు. అతను కసకస నలిపి తొక్కివేసే చోట విసిరే యబడతాడు. కసకస నలిపి తొక్కివేసే చోటంటే ఏమిటో నీకు తెలుసా? దేవుని (నరకా)అగ్ని. అది భగభగ మండుతూ గుండెలదాకా చేరుతుంది. వారిని ఆ అగ్ని గుండాలలో పడవేసి మూసివేయడం జరుగుతుంది. ఈవిధంగా వారు (నానా యాతనలు అనుభవిస్తూ) పొడవైన (అగ్ని)కీలల మధ్య చిక్కుకొని ఉంటారు.” (104:1–9)

“మీలో ఎవరయినా దేవునికి శ్రేష్ఠమైన రుణదానం అందజేసేవారు ఉన్నారా? ప్రతిఫలంగా ఆయన దాన్ని అనేక రెట్లు పెంచి తిరిగి మీకు అందజేస్తాడు. దేవుడే మీ ఉపాధిని తగ్గించేవాడు. దాన్ని వృద్ధి చేసేవాడు కూడా ఆయనే. చివరికి ఆయన సన్నిధికే మీరంతా మరలి పోవలసి ఉంది.” (2:245)

ఇక్కడ శ్రేష్ఠమైన రుణదానం అంటే కేవలం దైవప్రసన్నత కోసం పుణ్యఫలాపేక్షతో ఇచ్చే రుణం అన్నమాట. ఇలా దాసుడు ధర్మసంస్థాపనా కృషికి, ఇతరసత్కార్యాల కోసం ఇచ్చే ధనాన్ని దేవుడు అప్పుగా పరిగణించి, దానికి అనేక రెట్ల ప్రతిఫలం ఇచ్చే బాధ్యతను స్వయంగా తీసుకున్నాడు.

“షైతాన్ మిమ్మల్ని పేదరికం గురించి భయపెట్టి సిగ్గుమాలిన పనులకు పాల్పడేలా ప్రేరేపిస్తాడు. కాని దేవుడు మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. ఆయన ఎంతో ఉదారస్వభావుడు, సర్వం తెలిసినవాడు. తాను తలచుకున్న వారికి వివేకం, విచక్షణ జ్ఞానం ప్రసాదిస్తాడు. వివేకం, విచక్షణల జ్ఞానం లభించినవాడు ఎంతో అదృష్టవంతుడు. నిజంగా అతనికి అపారసంపదలు లభించినట్లే. బుద్ధిమంతులు మాత్రమే (మా) హితోపదేశం గ్రహిస్తారు.” (ఖుర్ఆన్–2:268,269)

“ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, తమాషా (లాంటి మూన్నాళ్ళ ముచ్చట) మాత్రమే. మీరు విశ్వాసులై భయభక్తులతో నడచుకుంటే దేవుడు మీకు రావలసిన ప్రతిఫలం తప్పకుండా ప్రసాదిస్తాడు. ఆయన మిమ్మల్ని మీ సిరిసంపదలు ఇవ్వమని అడగటం లేదు. ఆయన మీ ధనాన్ని అడిగితే, చాలా తరిగిపోయే వరకు ఇవ్వమని అడుగుతుంటే మీరు పిసినారితనం చూపుతారు. ఈవిధంగా దేవుడు మీ బలహీనతలను బయటపెడ్తాడు.” (ఖుర్ఆన్–47:36,37)

“వినండి, (అవసరార్థం) దైవమార్గంలో ధనం ఖర్చుపెట్టమని మిమ్మల్ని కోరడం జరుగుతోంది. కాని మీలో కొందరు పిసినారితనం వహిస్తున్నారు. అయితే పిసినారితనం వహిస్తున్నవాడు నిజానికి తన సొంత విషయంలోనే పిసినారితనం వహిస్తున్నాడు (అని వారు తెలుసుకోలేకపోతున్నారు). దేవుడు నిరపేక్షాపరుడు. మీరే (సమస్త అవసరాలకు) ఆయనపై ఆధారపడేవారు. మీరు గనక (మా ఆజ్ఞలకు) విముఖులైతే దేవుడు మీ

స్థానంలో కొత్తగా మరో జాతిని తెచ్చిపెడతాడు. వారు మీలా ప్రవర్తించరు." (ఖుర్ఆన్–47:38)

"వారికిలా చెప్పు: 'నా ప్రభువు తన దాసులలో తానుకోరిన విధంగా కొందరికి విస్తృతంగా, మరికొందరికి స్వల్పంగా ఉపాధి ప్రసాదిస్తున్నాడు. మీరు (దైవమార్గంలో) ఏది ఖర్చుపెట్టినా ఆ వెల్తిని భర్తీచేయడానికి ఆయన మీకు మరింత ప్రసాదిస్తాడు. ఆయన యావత్తు ఉపాధి ప్రదాతల్లోకెల్లా గొప్ప ఉపాధిప్రదాత". (ఖుర్ఆన్–34:39)

"ఈ కాందిశీకులు రాకపూర్వమే విశ్వసించి (మదీనా) పట్టణంలో నివసిస్తున్న వారికి కూడా (ఆ సంపదలో) హక్కుంది. (మక్కా నుండి) తమ దగ్గరకు (మదీనా) వలస వచ్చిన వారిని వీరు అభిమానిస్తున్నారు. వీరికి ఏదిచ్చినా అది తమకు అవసరమని వీరు తమ హృదయాల్లో సయితం ఆకాంక్షించరు. వారు స్వయంగా నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తారు. పేరాశ, పిసినారితనాల నుండి రక్షించ బడినవారే ధన్యులు." (ఖుర్ఆన్–59:9)

"పరలోక తీర్పును ధిక్కరించే వాణ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు. పేదల అన్నదానం కోసం ప్రోత్సహించనివాడు. ప్రార్థనపట్ల అశ్రద్ధ, ఏమరు పాటులు వహించేవారికి వినాశం (రాసిపెట్టి) ఉంది. వారు ప్రతిపనీ లోకుల మెప్పు కోసం ప్రదర్శనాబుద్ధితో చేస్తుంటారు. (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణ వస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు." (ఖుర్ఆన్–107:1–7)

## 20. సంపద కూడబెట్టకూడదు

వెండిబంగారాలను సత్కార్యాల కోసం ఉపయోగించకుండా కూడబెట్టేవారిని గురించి ప్రస్తావిస్తూ ఖుర్ఆన్ ఇలా హెచ్చరిస్తోంది:

"విశ్వాసులారా! గ్రంథప్రజలకు చెందిన ధర్మవేత్తలు, సాధువులలో అనేకమంది అక్రమ పద్ధతుల ద్వారా ప్రజల ధనాన్ని కాజేస్తున్నారు. పైగా వారిని దైవమార్గంలోకి రాకుండా నిరోధిస్తున్నారు. వెండిబంగారాలు కూడబెట్టి వాటిని దైవమార్గంలో వినియోగించని పిసినారులకు దుర్భరయాతన కాచుకొని ఉందని శుభవార్త విన్పించు! ఆ వెండి బంగారాలనే నరకాగ్నిలో బాగా కాల్చి వారి నుదుళ్ళపై, పక్కలపై, వీపులపై వాతలు పెట్టే రోజు (త్వరలోనే) వస్తుంది. 'ఇవే మీరు కూడబెట్టుకున్న సిరిసంపదలు, ఇక వీటిని చవిచూడండి' (అని అప్పుడు వారికి చెప్పబడుతుంది)." (9:34,35)

"నిందించే, హేళనచేసే, చాడీలుచెప్పే ప్రతివాడికీ వినాశం (రాసిపెట్టి) ఉంది. అతను (మితిమీరిన ధనవ్యామోహంతో) డబ్బు కూడబెట్టున్నాడు. (పరమలోభి అయి) దాన్ని మాటిమాటికి లెక్కపెట్టి దాచిపెడ్తున్నాడు. అతనీ సంపద శాశ్వతంగా తన దగ్గర ఉంటుందని భావిస్తున్నాడు. ఎంతమాత్రం ఉండదు.



అతను కసకస నలిపి తొక్కివేసే చోట విసిరి వేయబడతాడు. కసకస నలిపి తొక్కి వేసే చోటంటే ఏమిటో నీకు తెలుసా? దేవుని (నరకా)అగ్ని. అది భగభగ మండుతూ గుండెల దాకా చేరుతుంది. వారిని ఆ అగ్నిగుండాలలో పడవేసి మూసి వేయడం జరుగుతుంది. ఈ విధంగా వారు (నానాయాతనలు అనుభవిస్తూ) పొడవయిన (అగ్ని) కీలల మధ్య చిక్కుకొని ఉంటారు." (ఖుర్ఆన్–104:1–9)

"ఎవరైతే ధనగర్వంతో ధనం అయిపోతుందన్న బెంగతో దురాశాపరుడయి దయ్యంలా కూడబెడతాడో, ఖర్చుపెట్టకుండా, దానం చేయకుండా ఉంటాడో అతడు 'సూచీముఖ' అనే నరకంలో పడతాడు. అక్కడ యమదూతలు అతణ్ణి సూదులతో పొడుస్తుంటారు." (శ్రీమద్ భాగవతం-5:26)

హజ్రత్ అహ్నఫ్ బిన్ ఖైస్ (రజి) కథనం:- నేనొక సారి ఖురైష్ నాయకుల దగ్గర కూర్చొని ఉన్నప్పుడు ఒకతను వచ్చాడు. అతను ముతక బట్టలు ధరించి ఉన్నాడు. తల వెంట్రుకలు చాలా బిరుసుగా ఉన్నాయి. అతని రూపురేఖలు చూస్తే చాలా మొరటుగా ఉన్నాడు. అతను వారి దగ్గర నిలబడి సలాం చేసి ఇలా అన్నాడు:

"డబ్బు కూడబెట్టేవారికి శుభవార్త చెప్పండి! (దైవదూతలు) నరకాగ్నిలో ఒక రాయిని కాల్చి దాన్ని వారి గుండెల మీద ఉంచుతాడు. అది వారి భుజపు టెముకల దగ్గర్నుంచి (దేహాన్ని మాడ్చుతూ) రెండో వైపుకు వచ్చేస్తుంది. తర్వాత దాన్ని వారి భుజపుటెముకల మీద ఉంచుతాడు. అది వారి గుండెల నుండి రెండో వైపుకు వస్తుంది. ఇలా ఆ రాయి నిరంతరాయంగా అటూఇటూ తిరుగుతుంటుంది."

ఈ మాటలు చెప్పి ఆ మనిషి (కొంచెం దూరంలో ఉన్న) ఒక స్తంభం దగ్గరికి వెళ్ళి కూర్చున్నాడు. ఆ మనిషి ఎవరో నాకు తెలియదు. నేనతనితో "మీ మాటలు వారికి కోపం కలిగించాయనుకుంటున్నాను నేను" అని అన్నాను. దానికా మనిషి "వారు బుద్ధిహీనులు. నాకీ విషయం నా ప్రాణస్నేహితుడు తెలియజేశాడు" అని అన్నాడు. నేను "మీ ప్రాణస్నేహితుడు ఎవరు?" అని అడిగాను.

అప్పుడా వ్యక్తి ఇలా అన్నాడు: "నా ప్రాణస్నేహితుడు దైవప్రవక్త (సల్లం). ఆయన నాతో "అబూజర్! నీకు ఉహద్ పర్వతం కన్పిస్తోంది కదూ?" అని అన్నారు. ఈ మాట విని ఇంకా ఎంత పొద్దుందోనని నేను సూర్యుని వైపు చూశాను. ఆయన నన్ను ఏదైనా పని మీద ఎక్కడికైనా పంపదలచుకున్నారేమోనని భావించాను. నేను (వెంటనే ఆలోచన నుంచి తేరుకొని) "కన్పిస్తోంది దైవప్రవక్తా!" అన్నాను. అప్పుడాయన "నా దగ్గర ఉహద్ పర్వతమంత బంగారం ఉండి, మూడు వరహాలు తప్ప ఆ బంగారమంతా ఖర్చుచేయ కుండా అట్టిపెట్టుకోవడం నాకు (ఎంతమాత్రం) ఇష్టం లేదు" అని అన్నారు.

(సహీ బుఖారి, సహీ ముస్లిం)

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి) కథనం:- నేనొక రోజు సాయంత్రం దైవప్రవక్త (సల్లం) వెంట మదీనా పట్నం వెలుపల కంకర నేలపై నడచివెళ్తుంటే మా ఎదురుగా ఉహద్ పర్వతం వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "అబూజర్! నా దగ్గర ఉహద్ పర్వతమంత బంగారం ఉండి, ఒకరాత్రి లేక మూడు రాత్రులు గడిచి నంత కాలంలో అప్పు తీర్చడానికి ఉంచుకునే దీనార్ తప్ప ఆ బంగారంలో ఒక దీనార్ కూడా నా దగ్గర ఉండిపోవడం నాకిష్టంలేదు. నేనా సంపదను దైవదాసుల కోసం ఇలా అలా ఖర్చుపెడతాను." దైవప్రవక్త (సల్లం) ఈమాట అంటూ తన చేతిని అటూ ఇటూ తిప్పి చూపారు. (బుఖారి)

## 21. కపట విశ్వాసం, ప్రదర్శనాబుద్ధి

"వారిలో కొందరు 'దేవుడు తన అనుగ్రహంతో తమకు సిరిసంపదలు ప్రసాదిస్తే తాము దానధర్మాలు చేస్తామని, సజ్జనులయి ఉంటామ'ని ప్రమాణం చేశారు. కాని దేవుడు తన అనుగ్రహంతో వారిని ధనికులుగా చేయగానే వారు పిసినారితనం వహించారు. వారు తమ ప్రమాణాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా భంగపరిచారు. ఈవిధంగా వారు దేవుని విషయంలో వాగ్దానభంగానికి పాల్పడటం వల్ల, వారు పలుకుతున్న అబద్ధాలవల్ల దేవుడు వారి హృదయాల్లో కాపట్యం జనింపజేశాడు. వారు దేవుని సన్నిధిలో ప్రవేశపెట్టబడేవరకు ఈ కాపట్యాజాడ్యం వారిని వదలదు." (ఖుర్ఆన్-9:75-77)

"వారితో ఇలా అను: 'ఒకవేళ మీ అధీనంలో నా ప్రభువు కారుణ్యనిక్షేపాలు ఉంటే వాటిని మీరు ఖర్చయిపోతాయన్న భయంతో తప్పకుండా దాచివుంచేవారు. మానవుడు నిజంగా చాలా సంకుచిత మనస్కుడయి పోయాడు". (17:100)

"చెప్పు: 'మీరు మీ ధనాన్ని (దైవమార్గంలో) సంతోషంగా ఇచ్చినా, లేక అయిష్టంగా ఇచ్చినా ఎట్టి పరిస్థితిలోనూ దాన్ని స్వీకరించడం జరగదు. మీరు పరమదుర్మార్గులు'. వారిచ్చే ధనం స్వీకరించకపోవడానికి కారణం- వారు దేవునిపట్ల, ప్రవక్తపట్ల తిరస్కార వైఖరి అవలంబించారు. ప్రార్థన చేయడానికి లేస్తే వళ్ళు విరుచుకుంటూ చాలా బద్ధకంతో లేస్తారు. దైవమార్గంలో డబ్బు ఖర్చుపెట్టవలసివస్తే ఏడ్పుగొట్టు ముఖంతో అయిష్టంగా ఖర్చు పెడతారు. కనుక (విశ్వాసులారా!) వారి సంతానం, సిరిసంపదలు చూసి ఆశ్చర్య పడకండి. వాటి ద్వారా దేవుడు వారిని ఇహలోక జీవితంలోనే శిక్షించగోరుతున్నాడు. వారు ప్రాణాలు వదలినా అవిశ్వాసస్థితిలోనే వదలుతారు." (ఖుర్ఆన్-9:53-55)

"వారొకవేళ ఏదైనా ఖర్చుపెట్టినా లోకుల మెప్పు కోసం మాత్రమే ఖర్చుపెడ్తారు. వారు దేవుడ్నీ విశ్వసించరు, పరలోకాన్నీ విశ్వసించరు. కారణం, అలాంటివారికి షైతాన్ సహచరుడై పోయాడు. షైతాన్ సహచర్యం అత్యంత దుష్టసహచర్యం." (4:37,38)

"(మానవుడు పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడుతూ, ధనాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నాడు! పైపెచ్చు ప్రగల్భాలు పలుకుతూ) "నేను లక్షలాది రూపాయలు మంచి



నీళ్ళలా ఖర్చుపెట్టాను" అని అంటున్నాడు. తనను (పైన) ఎవరూ చూడటం లేదని భావిస్తున్నాడా అతను?" (ఖుర్ఆన్-90:6,7)

యూదులను గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

"యూదులు 'దేవుని చేతులు కట్టివేయబడ్డాయి' అంటారు. వారి చేతులే కట్టి వేయబడ్డాయి. ఇలాంటి కారుకూతల వల్లే వారిపై (దైవ)శాపం విరుచుకుపడింది. దేవుని చేతులు నిక్షేపంగా తెరిచే ఉన్నాయి. ఆయన తాను తలచినవారికి తలచుకున్నంత అనుగ్రహిస్తాడు." (5:64)

ధర్మసంస్థాపనా పోరాటానికి నిధులు కావలసి వచ్చినప్పుడు దేవుడు ముస్లింలను ఉద్దేశించి "దేవునికి శ్రేష్ఠమైన రుణదానం అందజేసేవారు మీలో ఎవరైనా ఉన్నారా...." (2:245) అంటూ వారిని విరాళాల కోసం ప్రేరేపించాడు. యూదులు దాన్ని గేలిచేస్తూ "పాపం దేవుడు దరిద్రుడయి పోయాడు. (పాపం క్షమించుగాక) ఇప్పుడాయన గారు తన దాసుల దగ్గర అప్పు కూడా అడుక్కుంటున్నాడు" అని చెప్పసాగారు. "దేవుడు దరిద్రుడు, మేము ధనికులం" (3:181) అని కూడా చెప్పుకుంటూ విర్రవీగి పోయారు.

అయితే కొంతకాలానికి పరిస్థితులు మారిపోయాయి. దైవమార్గంలో సాధించిన అనేక విజయాలతో ముస్లింలు స్థితిపరులయ్యారు. అటు సత్యతిరస్కారం వల్ల యూదులు పేదవాళ్ళయి పోయారు. అప్పుడు యూదులు 'దేవుడు ధనికుడు, మేమే పేదవాళ్ళం' అనడానికి బదులు, 'దేవునిచేతులు కట్టివేయబడ్డాయి' అని చెప్పసాగారు. అంటే, దేవుడు తమకు చేస్తుండిన సహాయాన్ని పిసినారితనంతో నిలిపివేశాడని అర్థం. దేవుడు ఈసూక్తిలో వారికి సమాధానమిస్తూ, తన చేతులు యధాతథంగా తెరిచే ఉన్నాయని, తాను కోరినవారికి కోరినంత అనుగ్రహిస్తూనే ఉన్నానని అన్నాడు.

"వేరొక సంఘటన గుర్తుకు తెచ్చుకోండి: అల్లాహ్‌ను తప్ప మరెవర్నీ ఆరాధించ రాదని; తల్లిదండ్రులకు, బంధువులకు, అనాథలకు, నిరుపేదలకు మేలు చేయాలని; ప్రజలతో చిరునవ్వు మోముతో మంచిమాటలు పలకాలని; ప్రార్థనా వ్యవస్థ స్థాపించాలని; (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లిస్తూ ఉండాలని మేము ఇస్రాయీల్ సంతతిచేత ప్రమాణం చేయించాం. (కాని ఆతర్వాత) మీలో కొందరు తప్ప అంతా దానికి విముఖులై పోయారు. ప్రమాణంచేసి ఉల్లంఘించడం మీకు అలవాటేగా!" (ఖుర్ఆన్-2:83)

## 22. అవకాశం చేజారక ముందే దానం చేయాలి

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒక వ్యక్తికి హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు: "నీవు ఐదు విషయాలను మరో ఐదు విషయాలకు పూర్వమే శ్రేష్ఠమైనవని తెలుసుకో. వృద్ధాప్యానికి పూర్వం యౌవనాన్ని, వ్యాధికి పూర్వం ఆరోగ్యాన్ని, దారిద్ర్యానికి పూర్వం భాగ్యవంతాన్ని, కార్యకలాపాల వత్తిడికి పూర్వం తీరికను, మృత్యువుకు పూర్వం జీవితాన్ని శ్రేష్ఠమయినవని తెలుసుకో." (తిర్మిజి)

ఇస్లాం పిసినారితనం, సంకుచితత్వాల్ని ఖండించిన తర్వాత అతడ్ని దానశీలత, ఔదార్యాల వైపు ప్రోత్సహిస్తుంది. ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

“విశ్వాసులారా! ఎలాంటి క్రయవిక్రయాలు జరగని, స్నేహసహకారాలు ఉపయోగ పడని, ఎవరి సిఫారసు కూడా చెల్లని (పరలోక తీర్పు) దినం రాకముందే మేము మీకు ప్రసాదించిన సంపద నుండి (కొంత దైవమార్గంలో కూడా) ఖర్చుపెట్టండి. (మా మాటలు నమ్మని) సత్యతిరస్కారులే పరమ దుర్మార్గులు.” (2:254)

“కనుక మీరు వీలైనంతవరకు దేవునికి భయపడుతూ జీవితం గడపండి. వినండి, విధేయత పాటించండి. (దైవమార్గంలో) మీ ధనాన్ని ఖర్చుపెట్టండి. ఇది మీకెంతో మంచిది. పిసినారితనాన్ని దరికి చేరనివ్వనివారే కృతార్థులవుతారు.” (64:16)

“మీరు (దైవమార్గంలో) ఖర్చు చేసిందయినా, లేక మీరు మొక్కుబడి చేసుకున్నదైనా సరే, అంతా దేవునికి తెలుసు. దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయరు. మీరు దానధర్మాలు బహిరంగంగా చేసినా మంచిదే; ఒకవేళ మీరు ఇతరుల కంట పడకుండా రహస్యంగా అగత్యపరులకు దానం చేస్తే అది మరీ మంచిది. అలాంటి దానం మీ పాపాలను కడిగివేస్తుంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు.” (2:270,271)

“వారికిలా చెప్పు: ‘నా ప్రభువు తన దాసులలో తానుకోరిన విధంగా కొందరికి విస్తృతంగా, మరికొందరికి స్వల్పంగా ఉపాధి ప్రసాదిస్తున్నాడు. మీరు (దైవమార్గంలో) ఏది ఖర్చుపెట్టినా ఆ వెల్తిని భర్తీచేయడానికి ఆయన మీకు మరింత ప్రసాదిస్తాడు. ఆయన యావత్తు ఉపాధి ప్రదాతల్లోకెల్లా గొప్ప ఉపాధిప్రదాత”. (34:39)

## 23. కలిమిలేముల పరీక్ష

ఈ ప్రపంచం మానవుల పాలిట పరీక్షాగృహం. ఇక్కడ మానవులు రకరకాలుగా పరీక్షించబడతారు. ఈ పరీక్షలలో కృతార్థులైనవారే పరలోకంలోనూ కృతార్థులవుతారు. మానవుడు పేదరికం ద్వారా, సిరిసంపదలద్వారా కూడా పరీక్షించబడతాడు. పేదరికం లో సహనం వహించకుండా అక్రమాలకు పాల్పడటం వల్ల పరలోకంలో నరక యాతనలు అనుభవిస్తాడు. ఇక్కడ ప్రపంచంలో కూడా దేవుడు తన నొసట రాసిన మేరకే ఉపాధి పొందగల్గుతాడుగాని, కోరుకున్న భోగభాగ్యాలు అనుభవించలేడు.

“ప్రజల్లో ఎవరు సత్కార్యాలు చేస్తూ సదాచార సంపన్నులవుతారో పరీక్షించడానికే, మేము సకల వస్తుసామగ్రితో భూమిని శోభాయమానంగా తీర్చిదిద్దాము. చివరికి మేము దాన్నంతటినీ (తుడిచిపెట్టి) బంజరుభూమిగా మార్చివేస్తాము.” (18:7)

“ఆయనే మిమ్మల్ని ధరణిపై దైవప్రతినిధిగా నియమించాడు. మీకు ప్రసాదించిన దాని విషయమై మిమ్మల్ని పరీక్షించడానికి ఆయన మీలో కొందరికి కొందరికన్నా ఎక్కువ హోదా, అంతస్తులు ప్రసాదించాడు.” (6:165)



“మేము మిమ్మల్ని మంచీ-చెడు స్థితులు కలిగించి పరీక్షిస్తున్నాము. చివరికి మీరంతా మా దగ్గరికే తిరిగి రావలసి ఉంది.” (21:35)

“ఆయనే భూమ్యాకాశాల్ని ఆరు రోజుల్లో సృష్టించినవాడు. దీనికి పూర్వం ఆయన (అధికార) సింహాసనం నీటి మీద ఉండేది. మీలో ఎవరు నీతిగా నడుచుకుంటారో పరీక్షించడానికే ఆయన ఇదంతా సృష్టించాడు.” (11:7)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “విశ్వాసి వ్యవహారం చాలా వింతగా ఉంది. అతని విషయంలో దేవుడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అది అతని పాలిట మంచి విషయమే అవుతుంది. కష్టాలు వచ్చిపడినప్పుడు సహనం వహిస్తాడు. ఈ సహనం అతనికి మంచి విషయమే. సౌఖ్యాలు కలిగినప్పుడు కృతజ్ఞత చూపుతాడు. ఈ కృతజ్ఞతా భావం కూడా అతని పాలిట మంచి విషయమే. ఈ మహాభాగ్యం విశ్వాసికి తప్ప మరెవరికీ ప్రాప్తం కాదు”. (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు: “ఎవరు తన దారిద్ర్యం లేక ఆకలి గురించి ఎవరికీ చెప్పుకోకుండా సహనం వహిస్తాడో దేవుడు అతనికి ఒక ఏడాది పాటు ధర్మసమ్మతమైన ఉపాధి ప్రసాదిస్తాడు.” (బైహఖి)

“ఐశ్వర్యం దైవభీతిపరుడికి ఉంటే పరవాలేదు. అయినా దైవభీతిపరాయణుడి కోసం ఐశ్వర్యం కంటే దేహారోగ్యం, అన్ని భాగ్యాల కంటే ఆత్మసంతృప్తి ఎంతో శ్రేష్ఠ మైనవి.” (అహ్మద్-మిష్కాత్)

హజ్రత్ సుఫ్యాన్ సౌరి (రహ్మలై) ఉల్లేఖనం: “ధర్మపరాయణత ముతక బట్టలు ధరించడంలో, ఎండిన రొట్టెలు తినడంలో లేదు. ప్రపంచంలో కోర్కెలను అదుపులో ఉంచుకోవడంలోనే (అసలైన) ధర్మపరాయణత ఉంది.” (షర్‌హుస్సున్న)

హజ్రత్ జైద్ బిన్ హుసైన్ (రహ్మలై) కథనం:- ఇమామ్ మాలిక్‌ని ఎవరో ప్రపంచంలో ధర్మపరాయణత అంటే ఏమిటని అడిగారు. దానికాయన “ధర్మపరాయ ణత అంటే ధర్మసంపాదన, కోర్కెలపై అదుపు” అని చెప్పారు. (బైహఖి)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) సిరిసంపదల విషయంలో ఎంతో జాగ్రత్తగా మసలుకునేవారు. ఆయన దారిద్ర్యం కీడు నుండి కూడా దైవాన్ని శరణుకోరేవారు; అలాగే ఐశ్వర్యం కీడు నుండి కూడా దైవాన్ని శరణుకోరేవారు. ధన పరీక్ష నుండి గట్టెక్కి నవారే ధన్యులు. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

“మీ సంతానం, సిరిసంపదలు మీకు పరీక్షగా చేయబడ్డాయి. (ఈ పరీక్ష నుండి గట్టెక్కితే మీ కోసం) దేవుని దగ్గర గొప్ప ప్రతిఫలం ఉంది.” (ఖుర్‌ఆన్-64:15)

“విశ్వాసులారా! (వాస్తవం తెలిసికూడా) మీరు దేవునికి, ఆయన ప్రవక్తకు ద్రోహం తలపెట్టకండి. మీకప్పగించబడే బాధ్యతల విషయంలో కూడా ద్రోహబుద్ధితో వ్యవహ

రించకండి. మీ సంతానం, సిరిసంపదలు మీపాలిట పరీక్షా సాధనాలని గుర్తుంచుకోండి. మీకోసం దేవుని దగ్గర ఇంతకంటే ఎంతో గొప్పప్రతిఫలం ఉంది." (ఖుర్ఆన్–8:27,28)

మనిషికి సాధారణంగా సంతానం, సిరిసంపదల పట్లే ఎక్కువ ప్రేమావ్యామోహాలు ఉంటాయి. సంతానం, సిరిసంపదలే అతనికి దైవమార్గంలో అవరోధాలై నిలుస్తాయి. అందుకే విశ్వాసి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సూక్తి చెబుతోంది. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"నీవొక శత్రువుని చంపి విజయం సాధించాననో లేక అతను నిన్ను చంపడం వల్ల నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందనో అనుకుంటావు. కాని నీ అసలు శత్రువు అతను కాదు. నీ అసలు శత్రువు నీ కడుపున పుట్టిన పిల్లవాడు కావచ్చు. అంతకంటే పెద్ద శత్రువు నీ అధీనంలో ఉన్న నీ సిరిసంపదలే'. (తబ్రాని)

ఒకసారి ఈసా ప్రవక్త (అలై) ఓ శిష్యుడ్ని వెంటబెట్టుకొని ఎక్కడికో వెళ్తున్నారు. దారిలో ఒక చోట ఆగవలసివచ్చింది. ఆయన దగ్గర మూడు రొట్టెలు ఉన్నాయి. ఆయన తన శిష్యుడితో "మన దగ్గర మూడు రొట్టెలున్నాయి. ఒకటి నేను తింటాను, ఒకటి నువ్వు తిను, ఒకటి రేపటి కోసం వుంచు" అని చెప్పి తను ఒక రొట్టె తిన్నారు. తిన్న తర్వాత ఆయన సెలయేటి దగ్గరకు వెళ్ళారు. నీరు త్రాగి తిరిగి వచ్చేసరికి ఒక్క రొట్టె కూడా లేదు. ఆయన మూడో రొట్టె ఏమైందని శిష్యుడ్ని అడిగారు. దానికా శిష్యుడు తాను ఒక రొట్టె తిని సెలయేటి దగ్గరకు వెళ్ళి నీరు త్రాగి తిరిగివస్తుండగా ఎవరో ఒకతను వచ్చి ఆ రొట్టె తీసుకుని పారిపోయాడని చెప్పాడు.

శిష్యుడి సంకల్పం చెడిందని ఈసా (అలై) గ్రహించారు. అతనా రొట్టెను స్వయంగా తినేసిందేగాక అబద్ధం కూడా చెబుతున్నాడు. శిష్యుడిని ఏమీ అనలేదు. మూడు ఇసుకదిబ్బలు తయారుచేసి దేవుడ్ని ప్రార్థించారు. దాంతో ఆ మూడు ఇసుక దిబ్బలు బంగారురాసులుగా మారాయి. అప్పుడాయాన శిష్యుడితో "చూడు, ఇక్కడ మూడు బంగారురాసులున్నాయి. ఇందులో ఒకటి నీది, ఒకటి నాది, ఒకటి మూడవ రొట్టె తిన్నవాడిది" అన్నారు. ఇది వినగానే శిష్యుడికి దురాశ కలిగింది. వెంటనే అతను "అయ్యా! మూడవరొట్టె తిన్నది నేనే. కాబట్టి ఈ బంగారురాశి నాకే దక్కాలి" అన్నాడు.

హజ్రత్ ఈసా (అలై) శిష్యుడి పేరాశకు చిరునవ్వు నవ్వారు. "శిష్యా! మూడు రాసులూ నువ్వే తీసుకో. అయితే ఇప్పుడిక నీకూ నాకూ పొత్తు కుదరదు" అని చెప్పి ఆయన వెళ్ళిపొయ్యారు. శిష్యుడు అక్కడే నిలబడ్డాడు, ఈ మూడు రాసుల్నీ ఎలా తీసుకుపోవాలని ఆలోచిస్తూ. కూలివాడు దొరుకుతాడేమోనని ఎదురుచూశాడు. ఎవరూ దొరక్కపోయేసరికి ఆ రాత్రి అక్కడే జాగారంచేస్తూ ఉండిపోయాడు.

ఆ రాత్రి ఎక్కడ్నుంచో నలుగురు దొంగలు వచ్చి ఆ బంగారురాసుల్నీ, అక్కడ పడుకున్నవాడ్నీ చూశారు. వెంటనే వారు అతడ్ని చంపి బంగారాన్ని చేజిక్కించు



కున్నారు. తరువాత ఆ దొంగలు "ఈ మూడు బంగారురాసుల్ని మనం నలుగురం ఉదయాన్నే తూకం వేసి పంచుకుందాం" అని చెప్పుకొని బంగారురాసుల దగ్గరే పడుకొని నిద్రపోయారు. ఉదయం మేల్కోగానే వాళ్ళకు ఆకలివేసింది. తమలో ఒకరు బజారుకు వెళ్ళి భోజనం తీసుకురావాలని, మిగిలిన ముగ్గురు బంగారానికి కాపలాగా వుండాలని, భోజనంచేసి బంగారాన్ని పంచుకుందామని చెప్పుకున్నారు.

దాని ప్రకారం ఒకడు భోజనం తీసుకురావడానికి బజారుకు వెళ్ళాడు. మిగతా ముగ్గురి బుద్ధులు మారిపోయాయి. "భోజనం తేవడానికి వెళ్ళినవాడ్ని తిరిగిరాగానే చంపేద్దాం. అప్పుడు మనం ముగ్గురమే వుంటాం. రాసులూ మూడే వున్నాయి కనుక పంచుకోవడం సులభం. తలా ఒక రాసి పంచుకోవచ్చు" అని చెప్పుకున్నారు వారు. అటు భోజనం తేవడానికి బజారుకు వెళ్ళినవాడికి కూడా దుర్బుద్ధి కలిగింది. ఎలాగైనా ఆ మూడు బంగారురాసుల్నీ తానే చేజిక్కించుకోవాలని భావించాడు. ఆ ముగ్గుర్నీ చంపే ఉద్దేశంతో భోజనంలో విషయం కలిపి తెచ్చాడు.

భోజనం తేవడానికి వెళ్ళినవాడు రాగానే ఆ ముగ్గురు దొంగమిత్రులు అతని మీద కర్రలతో దాడిచేసి చంపేశారు. తరువాత ముసిముసి నవ్వులతో భోజనం చేశారు. అందులో విషం వుందన్న సంగతి తెలియని ఆ ముగ్గురు మూర్ఖులు తినగానే గిలగిల కొట్టుకొని ప్రాణాలొదిలారు.

## 24. పరలోకంలో పేదలు, ధనికుల పరిస్థితి

మనకెవరైనా ఓ యాభై రూపాయల విలువగల సహాయం చేస్తే మనం అతనికి ఎంతో కృతజ్ఞత చూపుతాం. మరికాస్త ఎక్కువ సహాయంచేస్తే 'నేను మీకెంతో రుణపడి ఉన్నాను, మీ మేలు ఎన్నటికీ మరచిపోలేను' అంటాము. తోటి మానవులు చేసే ఈ చిరుసహాయం సృష్టికర్త చేసిన, చేస్తున్న సహాయంలో 0.00000001 శాతం కూడా ఉండదు. అయినా ఈ మానవుడు సృష్టికర్తను వదలి సృష్టితాల వెంటపడ్డాడు!

అయితే దేవుడు తాను ప్రసాదించిన మహాభాగ్యాలను గురించి మానవుల నుండి పరలోకంలో లెక్క తీసుకుంటాడు; ఈ మహాభాగ్యాలను నా ఆదేశాల ప్రకారం మీరు ఏ మేరకు సద్వినియోగం చేశారు? అని తప్పకుండా నిలదీస్తాడు. అప్పుడు దైవాజ్ఞలను విస్మరించి వాటిని దుర్వినియోగం చేసినవారి గతి ఏమవుతుంది?

ఇది తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం. ఈ మహాభాగ్యాలు ప్రసాదించిన సృష్టికర్తకు కృతజ్ఞులయి ఆయన ఆదేశాల ప్రకారం, ఆయన ప్రవక్తల హితవుల ప్రకారం జీవితాంతం సత్కర్మలు ఆచరించినవారే నరకయాతనల నుండి తప్పించుకుంటారు. అలాంటివారే స్వర్గప్రవేశానికి, దైవదర్శనభాగ్యానికి నోచుకుంటారు.

దైవప్రసాదిత భాగ్యాల విచారణ గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన అయిదు విషయాలను గురించి అడిగిన ప్రశ్నలకు

సమాధానం ఇవ్వనంతవరకు మానవుడు నిల్చున్న చోటు నుంచి ఒక్క అంగుళం కూడా కదలలేడు. ఆ అయిదు విషయాలివి: (1) నీ వయస్సును ఏ కార్యకాలాపాలలో అంతమొందించావు? (2) నీ యౌవనాన్ని ఎక్కడ వ్యర్థపరిచావు? (3) నీవు ధనాన్ని ఎలా సంపాదించావు? (4) దాన్ని ఏవిధంగా ఖర్చుపెట్టావు? (5) నీకు ప్రసాదించిన (ధర్మ) జ్ఞానాన్ని ఏమేరకు ఆచరించావు?" (తిర్మిజి)

"ప్రళయదినాన మానవుడు ఎలాంటి విలువ, బలం లేని మేకపిల్లలా తీసుకురాబడతాడు. తరువాత దేవుని ముందు ప్రవేశపెట్టబడతాడు. దేవుడు అతడ్ని 'నేను నీకు ఎన్నో మహాభాగ్యాలు ప్రసాదించాను. వాటిని ఏం చేశావు?' అని అడుగుతాడు.

దానికి మానవుడు సమాధానమిస్తూ 'ప్రభూ! నేను ధనాన్ని కూడబెట్టాను. ఎన్నో లాభాలతో దాన్ని అభివృద్ధిచేశాను. ప్రారంభంలో ఉన్న ఆస్తికి ఎన్నోరెట్లు పెంచి వదిలేసి వచ్చాను. మీరు అనుమతిస్తే నేనా సంపదంతా తెచ్చి మీముందు పెడ్తాను' అంటాడు.

'(ఇక్కడ్నుంచి తిరిగెళ్ళే ప్రసక్తే లేదు.) నీవు ముందుగా ఇక్కడకు పంపుకున్నదేమిటో చూపించు' అంటాడు దేవుడు. మానవుడు మళ్ళీ అదే సమాధానమిస్తాడు. తనను వెనక్కి తిప్పిపంపితే ఆ సంపదంతా తెచ్చి మీ ముందు పెడ్తానంటాడు.

కాని ఆ మానవుడు ముందుగా ఎలాంటి సత్కర్మలు పంపుకోలేనందున అతడ్ని నరకానికి పంపడం జరుగుతుంది." (తిర్మిజి)

ప్రళయదినాన దేవుడు మానవులందర్నీ సమావేశపరచిన తర్వాత "ఈ అనుచర సముదాయానికి చెందిన పేదవాళ్ళు ఎక్కడున్నారు?" అని అడుగుతాడు. ఆ తరువాత "మీరేం చేశార"ని అడుగుతాడు వారిని. దానికి వారిలా అంటారు: "మీరు అధికారం, సిరిసంపదలు మాకు కాకుండా వేరేవాళ్ళకు ఇచ్చారు. మమ్మల్ని పేదవాళ్ళుగా చేసి పరీక్షించారు. మేము (మీ ప్రసన్నతా భాగ్యం ఆశిస్తూ) సహనం వహించాము."

దైవప్రవక్త (సల్లం) పైన పేర్కొన్న మాటలు చెప్పి "ఆతర్వాత ఆ పేదలు స్వర్గానికి పంపబడతారు. ధనికుల్ని, అధికారుల్ని మాత్రమే నిలదీసి కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది" అని అన్నారు. (తర్గీబ్, తబ్రానీ)

దైవప్రవక్త (స) ప్రవచించిన మరికొన్ని హితోక్తులు చూడండి:

"ఆదం పుత్రుడు (మానవుడు) రెండు విషయాలను అసహ్యించుకుంటాడు. ఒకటి, మృత్యువుని. కాని విశ్వాసికి మృత్యువు కల్లోలం, సంక్షోభాల కన్నా శ్రేష్ఠమైనది. రెండు, ధనం కొరతను. కాని స్వల్ప ధనం వల్ల (పరలోకంలో కర్మల) లెక్క కూడా తక్కువగా ఉంటుంది." (అహ్మద్)

"ఏ మనిషిలో రెండు లక్షణాలు ఉంటాయో అతడ్ని దేవుడు కృతజ్ఞుడిగా, సహనశీలిగా పరిగణిస్తాడు. అందులో ఒకటి- ధర్మపరాయణతలో తన కంటే అధికుడ్ని చూసి అతడ్ని అనుసరించడం. రెండు- ప్రాపంచిక విషయాల్లో (అంటే సిరిసంపదలు,



సుఖభోగాలలో) తన కంటే తక్కువ స్థాయి వాడ్ని చూసి, దేవుడు తనకు అతని కంటే ఎక్కువ భాగ్యం ప్రసాదించాడన్న భావనతో దైవాన్ని ప్రశంసించడం. ఇలాంటి మనిషిని దేవుడు కృతజ్ఞుడిగా, సహనశీలిగా పరిగణిస్తాడు. దీనికి భిన్నంగా ధర్మపరాయణతలో తన కంటే తక్కువ స్థాయివాడ్ని చూసి సంతోషించే, ప్రాపంచిక విషయాల్లో తన కంటే అధికుడ్ని చూసి, తనకు అంతటి భాగ్యాలు లభించలేదే అని విచారించే మనిషిని దేవుడు కృతజ్ఞుడిగా, సహనశీలిగా పరిగణించడు." (తిర్మిజి)

"ఎవరైతే కొంచెం ఉపాధి (ప్రాపంచిక సామగ్రి)తో దేవునిపట్ల తృప్తి చెందుతాడో దేవుడు అతను చేసుకున్న కొంచెం సత్కర్మల పట్ల తృప్తి చెందుతాడు." (బైహఖి)

"పేదవాడు ధనికుడి కంటే అయిదు వందల సంవత్సరాలకు ముందే స్వర్గంలో ప్రవేశిస్తాడు. ఇది (దేవుని దృష్టిలో) సగం దినంతో సమానం." (తిర్మిజి)

కొన్ని హదీసులలో పేదలు, ముహాజిర్‌లు (శరణార్థులు) ప్రళయదినాన ధనికుల కంటే నలభై సంవత్సరాలు ముందుగా స్వర్గంలో ప్రవేశిస్తారని ఉంది.

ఒకసారి దైవప్రవక్త (స) తన అనుచరుల్ని "దరిద్రుడంటే ఎవరో మీకు తెలుసా?" అనడిగారు. దానికి అనుచరులు "డబ్బు, ఇతర సంపదలు లేనివాడ్ని మేము దరిద్రుడని భావిస్తున్నాం" అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:

"నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజాలు వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. అయితే అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరిపైనయినా అపవాదు లేపిఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసి ఉంటాడు. ఎవరినైనా హత్యచేసి ఉంటాడు. ఎవరినైనా అన్యాయంగా కొట్టి ఉంటాడు.

అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారందరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారందరి హక్కులు పూర్తిగా నెరవేరక ముందే అతని పుణ్యకర్మలు అంతమయిపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది." (ముస్లిం)

"ఒకవేళ దుర్మార్గుల దగ్గర లోకంలోని యావత్తు సిరిసంపదలకు రెట్టింపు సిరిసంపదలుంటే, ప్రళయదినాన కలిగే పరమనీచమైన ఘోరశిక్ష నుండి బయటపడేందుకు ఆ సంపదనంతటినీ (పాప)పరిహారం క్రింద ఇవ్వడానికి సిద్ధపడతారు. (అయినా వారా శిక్ష నుండి తప్పించుకోలేరు.) అక్కడ దేవుని వైపు నుండి వారిపైకి వారు ఎన్నడూ ఊహించని దారుణం వచ్చిపడుతుంది. వారి కర్మల దుష్ఫలితాలన్నీ వారిముందు ప్రత్యక్షమవుతాయి. (ఈరోజు) వారు అపహాస్యం చేస్తున్నదే (రేపు) వారిమీద విరుచుకుపడుతుంది." (ఖుర్‌ఆన్-39:47,48)

"అవిశ్వాసుల్ని నరకాగ్ని ముందు నిలబెట్టి వారితో (దైవదూతలు) ఇలా అంటారు: 'మీరు ప్రపంచజీవితంలో మీవాటాకు వచ్చిన సిరిసంపదలన్నీ తనివితీరా అనుభవించి

కాజేశారు. అదీగాక అక్కడ ఎలాంటి నీతి న్యాయం లేకుండా అహంకారంతో విర్రవీగేవారు. ఎన్నో అక్రమాలకు, అధర్మాలకు పాల్పడ్డారు. తత్పర్యవసానంగా ఈరోజు మీరు అత్యంతవమానకరమైన శిక్షగా యాతనలకు గురికాబోతున్నారు." (ఖుర్ఆన్–46:20)

## 25. దాతృత్వం, దానోద్దేశ్యం

"దైవమార్గంలో సంపద ఖర్చుచేసేవారి (ఖర్చు) పోలిక, ఒక విత్తనం నాటగా అది ఏడు వెన్నులు ఈని ప్రతి వెన్నులో వందేసి గింజలున్నట్లు ఉంటుంది. అదే విధంగా దేవుడు తాను తలచుకున్న వారి కర్మఫలాన్ని అనేకరెట్లు పెంచుతాడు." (ఖుర్ఆన్–2:261)

"పోతే కేవలం దైవప్రసన్నత కోసం చిత్తశుద్ధితో తమ సంపదను ఖర్చుచేసే వారు మెరకప్రాంతంలో ఉండే తోట లాంటివారు. ఆతోట వర్షాలు బాగా ఉంటే రెండింతలు ఫలసాయాన్నిస్తుంది. అంతగా వర్షాలు లేకుండా సన్నటి జల్లులు పడినా దానికి సరిపోతుంది. మీరు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్ఆన్–2:265)

"మీలో ఎవరికైనా ఒక పండ్లతోట ఉందనుకోండి. అందులో కాలువలు కూడా ప్రవహిస్తుంటాయి. తోటలో అతని కోసం రకరకాల పండ్లు ఫలాలు పుష్కలంగా పండి సిద్ధంగా ఉంటాయి. అతనికి వృద్ధాప్యం కూడా వస్తుంది. అయితే అతని పిల్లలు ఇంకా పిన్న వయస్సులోనే ఉంటారు. అలాంటి స్థితిలో ఓరోజు హఠాత్తుగా తీవ్రమైన వడగాల్పులకు తోట మొత్తం మాడి మసయిపోతుంది. ఇలా సంభవించడాన్ని అతను ఇష్టపడతాడా? మీరు (సత్యాన్ని) అర్థం చేసుకోవడానికి దేవుడు ఇలా తన సూక్తుల్ని మీముందు వివరిస్తున్నాడు." (ఖుర్ఆన్–2:266)

"వారు ఐహికజీవితంలో చేసే ధనవ్యయం మంచుతో కూడిన తీవ్రమయిన గాలి వంటిది. అది ఆత్మద్రోహం చేసుకున్నవారి పంటపొలాలపై వీచి సర్వనాశనం చేస్తుంది. దేవుడు వారికి అన్యాయం చేయడం లేదు. వారు తమకు తామే అన్యాయం చేసుకుంటున్నారు." (ఖుర్ఆన్–3:117)

"మీసంపద నుండి మీరు (దైవమార్గంలో) ఏది ఖర్చుచేసినా అది మీకే లాభదాయకం. మీరు చేసేదంతా దైవప్రసన్నత కోసమే కదా! దైవప్రసన్నత కోసం మీరు ఏది ఖర్చుచేసినా దాని పుణ్యఫలం మీకు పూర్తిగా లభిస్తుంది. మీకేమాత్రం అన్యాయం జరగదు." (ఖుర్ఆన్–2:272)

"రాత్రింబవళ్ళు బహిరంగంగానూ, గోప్యంగానూ (దైవమార్గంలో) తమ సంపదను ఖర్చు చేసేవారి కోసం తగిన ప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. వారికి (అక్కడ) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు." (ఖుర్ఆన్–2:274)

"మీరు (దైవమార్గంలో) ఖర్చు చేసిందయినా, లేక మీరు మొక్కుబడి చేసుకున్నదైనా సరే, అంతా దేవునికి తెలుసు. దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయరు. మీరు



దానధర్మాలు బహిరంగంగా చేసినా మంచిదే; ఒకవేళ మీరు ఇతరుల కంట పడకుండా రహస్యంగా అగత్యపరులకు దానంచేస్తే అది మరీ మంచిది. అలాంటి దానం మీ పాపాలను కడిగివేస్తుంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు." (ఖుర్ఆన్–2:270,271)

"దైవమార్గంలో ధనాన్ని ఖర్చుచేయడంతో పాటు, చేసినమేలు గుర్తుచేసి (దానగ్రహీత) మనస్సు నొప్పించనివారి కోసం వారి ప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. దానంచేసి (దానగ్రహీత) మనస్సు నొప్పించే పనికన్నా మృదువుగా మాట్లాడటం, క్షమించడం అనేవి ఎంతో శ్రేష్ఠమైన పనులు. దేవుడు నిరపేక్షాపరుడు, విశాల హృదయుడు." (2:262,263)

"(కనుక) విశ్వాసులారా! లోకుల మెప్పు కోసం దానధర్మాలు చేసేవాడిలా, మీరు మీ దానధర్మాలను ఎత్తిపొడుపు మాటలద్వారా, (గ్రహీత) మనస్సు నొప్పించి వృధా చేసుకోకండి. అతనికి దేవునిమీద, పరలోకమ్మీద నమ్మకం లేదు. అలాంటి వ్యక్తి (చేసే దానం) భారీవర్షం కురవగానే పైనున్న పల్చటి మట్టిపొర కాస్తా తుడిచిపెట్టుకుపోయి నున్నగా మిగిలిపోయే రాతి (ప్రదేశం)తో సమానం. అలాంటివారు సత్కార్యాలు చేసి ఎలాంటి పుణ్యఫలం పొందలేరు. సత్యతిరస్కారులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు." (ఖుర్ఆన్–2:264)

"దైవప్రసన్నత కోసం మీరు చెల్లించే జకాత్ (మీకు శుభాన్ని స్తుంది). అలా జకాత్ చెల్లించేవారే నిజానికి తమ ధనాన్ని వృద్ధిచేసుకుంటారు. (ఖుర్ఆన్–30:39)

"(మానవజీవితానికి) మార్గం నిర్దేశించవలసిన బాధ్యత మాపైనే ఉంది. ఇహలోకం మాదే; పరలోకమూ మాదే. కనుక నేను మిమ్మల్ని ప్రజ్వరిల్లే అగ్ని గురించి హెచ్చరిస్తున్నాను. సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకునే దౌర్భాగ్యుడు తప్ప మరెవరూ అందులో పడిపోరు. అయితే పునీతమవడానికి ధనమిచ్చే దైవభీతిపరుడు మాత్రం అగ్నికి దూరంగా ఉంచబడతాడు. (ఇలా ధనమిచ్చి) బదులుతీర్చడానికి అతని మీద ఎవరి ప్రత్యుపకారం లేదు. అతను మహోన్నతుడైన తనప్రభువు ప్రసన్నత కోసమే ఈ (పుణ్య)కార్యం చేస్తున్నాడు. కనుక అతనిపట్ల ఆ ప్రభువు తప్పకుండా ప్రసన్నుడవుతాడు." (ఖుర్ఆన్–92:17–21)

## 26. ఎంత ఖర్చుపెట్టాలి, ఎలా ఖర్చుపెట్టాలి?

దైవమార్గంలో (సత్కార్యాల కోసం) ఎంత ఖర్చుపెట్టాలి, ఎలా ఖర్చుపెట్టాలి అనే విషయం గురించి ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు కూడా గమనార్హమైనవి:

"దైవమార్గంలో ఏం ఖర్చుపెట్టాలని వారు నిన్నడుగుతున్నారు. తమ అవసరాలకు పోగా మిగిలింది ఖర్చుచేయాలని చెప్పు వారికి. మీరు ఇటు ప్రపంచం గురించి, అటు పరలోకం గురించి యోచిస్తారని దేవుడు ఈ విధంగా తన ఆజ్ఞలను మీకు స్పష్టంగా వివరిస్తున్నాడు." (2:219)

"విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేలనుండి మీ కోసం ఉత్పత్తిచేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైమార్గంలో ఖర్చుచేయండి. దైవమార్గంలో ఖర్చు చేయడానికి నాసిరకం వస్తువుల్ని ఏరితీసే ప్రయత్నం చేయకండి. అలాంటి వస్తువుల్ని మీకే గనక ఎవరైనా ఇస్తే మీరు తీసుకోవడానికి ఇష్టపడతారా? కళ్ళు మూసుకొని స్వీకరిస్తారేకాని, మనస్ఫూర్తిగా మీరు ఎన్నటికీ వాటిని స్వీకరించరు. దేవుడు నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడని తెలుసుకోండి." (2:267)

దేవుడు మానవునికి అతని మనుగడ కోసం ప్రపంచంలో అనేక రకాల సంపదల్ని ప్రసాదించాడు. అందుకుగాను అతడు దేవునికి కృతజ్ఞుడయి ఉండటంతో పాటు, ఆ సంపదలో కొంత భాగం నిరుపేదలైన తోటి మానవులక్కూడా అందజేయాలి. స్తోమత కలిగినవారు తమ ధన, కనక, వస్తు, పశు సంపదల నుండి ప్రతి ఏడూ రెండున్నర శాతం చొప్పన తీసి పేదలకు దానం చేయాలి. దీన్ని జకాత్ అంటారు.

అంతేకాకుండా వారు ధాన్యం, అపరాలు, పండ్లు, కూరగాయలు తదితర భూ ఉత్పత్తుల నుండి కూడా జకాత్ తీయవలసి ఉంటుంది. దీన్ని "ఉష్ర్" అంటారు. అయితే ఉష్ర్ యేడాదికి ఒకసారి మాత్రమే గాక, సంవత్సరానికి ఎన్నిసార్లు పండిస్తే అన్నిసార్లు తీసి పేదలకు దానం చేయాలి. వర్షం వల్ల పండే పంట నుండి పది శాతం, ఖర్చుతో కూడిన నీటిపారుదల సౌకర్యం వల్ల పండే పంట నుండి అయిదు శాతం చొప్పన ఉష్ర్ తీసి పేదలకు విధిగా అందజేయాలి.

"(విశ్వాసులారా!) మీరు అమితంగా ప్రేమించేవాటిని సైతం (దైవమార్గంలో) వినియోగించనంత వరకూ మీరు ధర్మపరాయణులు కాలేరు. మీరు (దైవమార్గంలో) ఏది వినియోగించినా అది దేవునికి తెలుసు." (ఖుర్ఆన్–3:92)

సాధారణంగా ప్రజలు ప్రార్థన, ధ్యానం, దైవనామ స్మరణ, గ్రంథపారాయణం, ఉపవాస వ్రతం, పరిమిత స్థాయిలో దానధర్మాలు, ఓ ప్రత్యేక పంథాలో బాహ్య వేషధారణ మొదలైన వాటిని మాత్రమే గొప్ప పుణ్యకార్యాలుగా, ధర్మపరాయణతకు ప్రబల నిదర్శనాలుగా పరిగణిస్తున్నారు. కాని ఖుర్ఆన్ ఈ అపోహను దూరంచేస్తూ, దేవుని ప్రసన్నత కోసం అవసరమయితే ఎంతటి ప్రియమైన వస్తువునయినా త్యాగం చేయాలని, అప్పుడే మనిషి దేవుని దృష్టిలో నిజమైన ధర్మపరాయణుడుగా పరిగణించ బడతాడని చెబుతోంది.

"(మీకోసం) పందిళ్ళ మీద ప్రాకే, ప్రాకని చెట్లతో సహా రకరకాల తోటలు, తోపులను సృష్టించినవాడు ఆ దేవుడే. వివిధ రకాల ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసే పొలాలు, ఖర్జూరపు చెట్లను సృష్టించినవాడు కూడా ఆయనే. ఆయనే ఆలివ్, దానిమ్మ వృక్షాలను సృజిస్తున్నాడు. వాటి పండ్లు చూడటానికి ఆకారంలో ఇంచుమించు ఒకేలా ఉన్నప్పటికీ రుచిలో వ్యత్యాసం ఉంటుంది. అవి పంటకు వచ్చినప్పుడు వాటి పండ్లు హాయిగా తినండి. దాంతోపాటు పంట కోతకు వచ్చినప్పుడు అందులో నుంచి దేవుని



హక్కు (పేదల ఆర్థికహక్కు) కూడా నెరవేర్చండి. దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు." (ఖుర్ఆన్–6:141)

"ధనికుడు తన ఆర్థిక స్తోమతను బట్టి ఈపోషణ ఖర్చులు భరించాలి. తక్కువ ఉపాధి ఇవ్వబడిన (పేద)వాడు దేవుడు తనకిచ్చిన దాన్నుంచే ఎంతోకొంత ఖర్చుపెట్టాలి. దేవుడు ఎవరికెంత ఇచ్చాడో అంతకుమించి వారిపై భారం మోపడు. దేవుడు మనిషికి లేమి తరువాత కలిమి కూడా ప్రసాదించవచ్చు." (ఖుర్ఆన్–65:7)

"మీరు మీచేతిని (ఏమాత్రం దానంచేయకుండా) మెడకేసి కట్టి ఉంచకండి. అలాగే దాన్ని పూర్తిగా తెరచి ఉంచడం కూడా సరికాదు. అలాచేస్తే మీరు నిందితులయి, నిస్సహాయులైపోతారు. నీ ప్రభువు తాను కోరిన విధంగా కొందరికి ఇతోధికంగా ఉపాధినిస్తే, మరి కొందరిని లేమికి గురిచేస్తాడు. ఆయనకు తన దాసుల స్థితిగతులు బాగా తెలుసు. ఆయన వారిని చూస్తూనే ఉన్నాడు." (ఖుర్ఆన్–17:29,30)

# 27. దానస్వీకార యోగ్యులు

దానధర్మాలు చేయదలచుకున్నవారికి ప్రపంచంలో అర్హులైన దానగ్రహీతలకు, ఇతర సత్కార్యాలకు కొదువ లేదు. దాతలకు కావలసిందల్లా విశాల హృదయం, ఉదార స్వభావాలే. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"వారు (దైవమార్గంలో) సంపద ఏ విధంగా ఖర్చుచేయాలని అడుగుతున్నారు. వారికి  ఇలా చెప్పు: "మీరు ఖర్చు చేయదలచుకున్నది మీ తల్లిదండ్రులు, బంధువులు, అనాథలు,  అగత్యపరులు, బాటసారుల శ్రేయస్సు కోసం ఖర్చుచేయండి. ఎవరు ఏ సత్కార్యం చేసినా  దాన్ని గురించి దేవునికి బాగా తెలుసు." (ఖుర్ఆన్–2:215)

"ముఖ్యంగా దైవకార్యాల్లో నిమగ్నులయిపోయి, జీవనోపాధి కోసం ధరణిపై తిరిగే అవకాశంలేని నిరుపేదలకు (ఆర్థికసహాయం చేయండి). వారి స్థితిగతులు ఎరగనివారు వారి ఆత్మాభిమానం చూసి వారు స్థితిపరులేనని భావిస్తారు. కాని వారి ముఖాలు చూస్తే మీరు వారి వాస్తవస్థితి గ్రహిస్తారు. వారు (సిగ్గు వదలి) ప్రజల వెంటబడి అర్థించే (యాచకుల్లాంటి) వారు కాదు. వారి సహాయం కోసం మీరు చేసే ఏ ఖర్చయినా దేవునికి తెలియకుండా ఉండదు." (ఖుర్ఆన్–2:273)

"(మానవుడు పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడుతూ, ధనాన్ని ఎలా దుర్వినియోగం చేస్తున్నాడు! పైపెచ్చు ప్రగల్భాలు పలుకుతూ) "నేను లక్షలాది రూపాయలు మంచి నీళ్ళులా ఖర్చుపెట్టాను" అని అంటున్నాడు. తనను (పైన) ఎవరూ చూడటం లేదని భావిస్తున్నాడా అతను? మేమతనికి రెండు కళ్ళు, ఒక నోరు, రెండు పెదవులు ఇవ్వలేదా? (మంచికి, చెడుకు సంబంధించిన) రెండు స్పష్టమైన మార్గాలు అతనికి చూపలేదా? (ఖుర్ఆన్–90:6-10)

"కాని అతను కఠినమైన కనుమ గుండా నడవడానికి సాహసించలేదు. కఠినమైన కనుమ అంటే ఏమిటో నీకు తెలుసా? (కఠినమైన కనుమంటే) బానిసను బంధవిముక్తి చేయడం, లేదా (కరువుదినాల్లో) ఆకలిగొన్న రోజు సమీప అనాధకుగాని, దారిద్ర్యంలో మగ్గే నిరుపేదకుగాని పట్టెడన్నం పెట్టడం, ఆపై ఓర్పు, దయాదాక్షిణ్యాల్ని గురించి పరస్పరం ఉపదేశించుకునే విశ్వాసుల్లో చేరిపోవడం". (ఖుర్ఆన్-90:11-17)

దయాదాక్షిణ్యాలను గురించి మహాప్రవక్త (స) మహితోక్తులు చూడండి:

"కరుణించేవారినే కరుణామయుడు కరుణిస్తాడు. భువిలో ఉండేవారిని కరుణించండి, దివిలో ఉండేవాడు మిమ్మల్ని కరుణిస్తాడు". (అబూదావూద్, తిర్మిజి)

"తోటి మానవుల్ని కనికరించనివాడ్ని దేవుడు (కూడా) కనికరించడు". (బుఖారి)

"మన పిల్లలను కరుణించని, మన పెద్దలను గౌరవించనివాడు మనవాడు కాదు." (తిర్మిజి)

"ఒక ముస్లిం తోటి ముస్లింకు సోదరుని వంటివాడు. అతనికి ఈ ముస్లిం అన్యాయం చేయడు. అతనికి సహాయం చేయకుండా దూరంగా ఉండడు."

"ఎవరు తన తోటి సోదరుని అవసరం తీర్చడంలో నిమగ్నుడవుతాడో, దేవుడు అతని అవసరం తీర్చడంలో నిమగ్నుడవుతాడు. మరెవరు ఒక ముస్లింను ఏదైనా ఆపదలో ఆదుకుంటాడో, దేవుడు ప్రళయదినం ఆపదల్లోని ఒక ఆపద నుండి అతడ్ని ఆదుకుంటాడు. ఎవరు ఒక ముస్లిం లోపాన్ని మరుగు పరుస్తాడో దేవుడు ప్రళయ దినాన అతని లోపాన్ని మరుగు పరుస్తాడు". (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "తన పొరుగువాడు పస్తుండగా తాను కడుపు నిండా తినేవాడు నిజమైన విశ్వాసి (ముస్లిం) కాడు." (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "(దైవసందేశం చేరవేసే దైవదూత) జిబ్రీల్ (అలైహి) పొరుగువాని గురించి నన్ను మాటిమాటికి తాకీదు చేసేవారు. ఈ తాకీదు తీరును గమనిస్తుంటే ఆ పొరుగువానికి (నా) ఆస్తిలో వాటా కూడా ఇప్పిస్తారేమోనని నాకు అనుమానం కలిగింది." (బుఖారి)

## 28. క్రిందిచేయి కంటే పైచేయి శ్రేష్ఠమైనది

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా తెలియజేశారు:-

"ప్రతిరోజూ ఉదయం ప్రజలు నిద్ర నుండి మేల్కొనగానే ఇద్దరు దైవదూతలు అవతరిస్తారు. వారిలో ఒకతను దైవాన్ని ప్రార్థిస్తూ 'దేవా! (దానం) ఇచ్చేవాడికి మరింత (పుణ్యఫలం) ఇవ్వు' అనంటాడు. రెండో దూత 'దేవా! పిసినారి సంపదను నాశనం చెయ్యి' అని ప్రార్థిస్తాడు." (బుఖారి)



"దేవుని దగ్గరకు పవిత్ర వస్తువు మాత్రమే చేరుతుంది. అందువల్ల ఎవరైనా తన పవిత్ర సంపద (కష్టార్జితం) నుండి ఒక ఖర్జూరపుటంత దానం చేసినాసరే, దేవుడు దాన్ని కుడిచేత్తో స్వీకరిస్తాడు. ఆ తరువాత మీరు గుర్రపుపిల్లను పెంచి పెద్ద చేసినట్లు ఆయన ఆ దానాన్ని వృద్ధి పరుస్తాడు. ఆ విధంగా వృద్ధిచెందుతూ చివరికది పర్వతం మాదిరిగా పెరిగిపోతుంది." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అస్మా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా బోధించారు:- "(దైవమార్గంలో) ఖర్చుపెట్టు. లెక్కపెట్టకు. లెక్కపెట్టి ఇస్తే దేవుడు కూడా నీకు లెక్కపెట్టి మరీ ఇస్తాడు. (అంటే నీపట్ల ఉదారంగా వ్యవహరించడు.) అలాగే కూడబెట్టి ఉంచకు. కూడబెడ్తే దేవుడు కూడా (నీకు పుణ్యఫలం ప్రసాదించకుండా) ఆపి ఉంచుతాడు." (బుఖారి)

బుఖారి, ముస్లిం గ్రంథాలలోని ఒక హదీసు ప్రకారం దేవుని కారుణ్యఛాయ తప్ప మరెలాంటి ఛాయ లభించని (ప్రళయ)దినాన దేవుడు ఏడుగురు మనుషులకు తన నీడపట్టు ప్రసాదిస్తాడు. ఆ ఏడుగురిలో "కుడిచేత్తో ఇచ్చింది ఎడమచేతికి సయితం తెలియనంత గోప్యంగా దానధర్మాలు చేసిన మనిషి" కూడా ఉన్నాడు.

ఒకతను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! ఎవరి దానధర్మాల పుణ్యఫలం అందరికంటే అధికంగా ఉంటుంది?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా సమాధానమిచ్చారు:

"నీవు ఆరోగ్యంగా ఉండి, అత్యధిక ధనాశ కలిగివున్న రోజుల్లో (ఖర్చుచేస్తే) పేద వాణ్ణయి పోతానన్న భయంతో పాటు ధనికుడయి పోవాలన్న కోరిక కలిగి ఉన్నప్పటికీ చేసే దానం అత్యంత శ్రేష్ఠమయినది. కనుక దానం చేయడంలో నీవు అంత్యకాలం దాపురించే దాకా వేచిఉండకు. ప్రాణం కంఠంలోకి వచ్చి కొన ఊపిరితో కొట్టుమిట్టాడే స్థితి వచ్చినప్పుడు, నేను ఫలానా మనిషికి అంతిస్తాను; ఫలానా మనిషికి ఇంతిస్తాను అని చెబితే ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇప్పుడది ఫలానా, ఫలానా వారిదయి పోయినట్లే (నీవిచ్చేదేమీ లేదు)." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ హారిసా బిన్ వహబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "(సిరిసంపదలు పొంగిపొరలే) ఒక కాలం రానున్నది. అప్పుడు దానధర్మాలు చేయడానికి ఒక వ్యక్తి బయలుదేరితే అతనికి దానం స్వీకరించేవారే దొరకరు. అతను ఎవరికి దానం చేయాలన్నా 'నాకిప్పుడు అవసరం లేదు. నీవు నిన్న తీసుకొని వచ్చి వుంటే నేనీ దానం స్వీకరించేవాడ్ని' అనంటాడు." (బుఖారి)

ప్రజలందరూ ధనికులైపోయి దానగ్రహీతలు కొరవడే వరకు దానధర్మాలు చేయ కుండా చేతులు కట్టుకొని ఉండకూడదని, సమాజంలో పేదరికం ఉన్నప్పుడే వీలైనంత ఎక్కువగా దానం చేయాలని ఈ హదీసు మనకు తెలియజేస్తోంది.

మహాప్రవక్త (సల్లం) ప్రవచనం:- "క్రిందిచేయి కంటే పైచేయి ఎంతో శ్రేష్ఠమైనది. పైచేయి అంటే (దానం) ఇచ్చే, (సత్కార్యాల కోసం) ఖర్చుపెట్టే చేయి. క్రిందిచేయి అంటే (దానం) అడిగి తీసుకునే చేయి." (బుఖారి, ముస్లిం)

ప్రార్థన, దానం రెండూ ఒకదానికొకటి విడదీయరాని ఆరాధనలు. ప్రార్థన దేవుని హక్కు, దానం దాసుల హక్కు. కొందరు 'ఉన్నవాడే దానం చేయగల్గుతాడు, లేనివాడు ఏం చేస్తాడూ?' అనంటారు. ఇలా ప్రశ్నించేవారు తమకు దిగువనుండే వారి వైపు జాలిగా చూస్తే సమాధానం లభిస్తుంది. ఖుర్‌ఆన్, హదీసు బోధనలు గమనిస్తే పేదలకు దానం చేయడం, ఇతర సత్కార్యాల కోసం డబ్బు ఖర్చుపెట్టడం ప్రతి మనిషికీ దైవం నిర్దేశించిన విధి అని తెలుస్తోంది.

హజ్రత్ అబూజర్ (రజి) కథనం:- నేను దైవప్రవక్త (స)ను "అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ ఏది?"ని అడిగాను. దానికాయన "దేవుణ్ని విశ్వసించి ఆయన మార్గంలో పోరాడటం" అని చెప్పారు. "బానిసకు స్వేచ్ఛనివ్వడం (కూడా) శ్రేష్ఠమైన ఆచరణేనా?" అనడిగాను నేను. "విలువను బట్టి ఎక్కువ ధరకు అమ్ముడుపోవడంతో పాటు, యజమానికి అందరికన్నా ఎక్కువ ఇష్టమైన బానిసకు స్వేచ్ఛనివ్వాలి" అన్నారు దైవప్రవక్త (స). "ఒకవేళ నేనీ పని చేయలేని పరిస్థితిలో ఉంటే?" అని అడిగాను నేను. "అప్పుడు ఏదైనా పని చేసేవాడికి ఆ పనిలో సహాయపడు లేదా పని చేయడం రాని వాడికి పని చేసిపెట్టు" అన్నారాయన. "నేనీ పని కూడా చేయలేని స్థితిలో ఉంటే?" అడిగాను మళ్ళీ. "అయితే ప్రజలను ఎలాంటి కష్టనష్టాలకు గురిచేయకు. ఇది కూడా నీ పాలిట ఒక విధమైన దానమే" అన్నారు దైవప్రవక్త (స). (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఓసారి తన అనుచరులతో మాట్లాడుతూ "ప్రతి ముస్లిం విధిగా దానం చేయాలి" అన్నారు. అనుచరులు ఈ మాట విని "మరి ఎవరి దగ్గరైనా దానం చేయడానికి ఏమీ లేకపోతే ఎలా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "అప్పుడా వ్యక్తి కష్టపడి సంపాదించి తానూ అనుభవించాలి, దాన్ని (పేదలకు) దానం కూడా చేయాలి" అన్నారు.

"ఒకవేళ అలా చేసే శక్తి కూడా లేకపోతే లేదా అలా కూడా చేయకపోతే?" అని మళ్ళీ అడిగారు అనుయాయులు. "అప్పుడు ఎవరైనా అగత్యపరుడు ఏదైనా ఆపదలో చిక్కుకుంటే అతడ్ని ఆదుకోవాలి" అన్నారు దైవప్రవక్త (సల్లం).

అనుచరులు మళ్ళీ "అది కూడా చేయకలేక పోతేనో?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "(అదీ చేయలేకపోతే) మేలు చేయాలని లేక సత్కార్యాలు చేయాలని ఇతరులకు సలహాలివ్వాలి" అని చెప్పారు.

"అదీ చేయలేకపోతే...?" అని మళ్ళీ అడిగారు అనుచరులు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "(అలాంటి పరిస్థితిలో కనీసం) తాను చెడ్డపనులు చేయకుండా, ఇతరులకు



చెడు తలపెట్టకుండా ఉండాలి. ఇది కూడా దానం (సదఖా) కిందికే వస్తుంది" అని సమాధానమిచ్చారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ (రజి) కథనం:- నేనొక సారి దైవప్రవక్తను (కొంత ధనం) అడిగితే ఆయన ఇచ్చేశారు. (అది చాలక) నేను మళ్ళీ అడిగాను. దైవప్రవక్త (సల్లం) నాకు మరికొంత ప్రసాదించారు. నేను తృప్తిచెందక మళ్ళీ అడిగాను. ఆయన నాకు మరికాస్త ప్రసాదించి ఇలా అన్నారు:

"హకీమ్! ఈ ప్రాపంచిక సంపద (పైకి) ఎంతో (కనుల పండుగగా) పచ్చపచ్చగా, తియ్యగా ఉండవచ్చు. కాని దాన్ని ఆత్మసంతృప్తితో తీసుకునేవారికే శుభం కలుగుతుంది. అత్యాశతో అడిగేవాడికి అందులో ఎలాంటి శుభం ఉండదు. అతను ఎంత తిన్నా కడుపు నిండని వ్యక్తి లాంటివాడు. (గుర్తుంచుకో.) ఇచ్చే చేయి పుచ్చుకునే చేయి కంటే ఎంతో శ్రేష్ఠమైనది."

అప్పుడు హజ్రత్ హకీమ్ (రజి) ఇలా అన్నారు: "దైవప్రవక్తా! మిమ్మల్ని సత్యానిచ్చి పంపిన ఆ ప్రభువు సాక్షిగా చెబుతున్నాను. నేనీ క్షణం నుంచి ఇహలోకం వీడిపోయే వరకు ఏ వస్తువు కోసం కూడా ఎవరి ముందూ చేయిజాపను."

(బుఖారి, ముస్లిం)

హజ్రత్ హకీమ్ (రజి) తాను దైవప్రవక్త (సల్లం) ముందు చేసిన వాగ్దానానికి కట్టుబడి ఉంటూ ఇహలోకం వీడిపోయే వరకు ఎవరి నుండీ దానం స్వీకరించలేదు.

## 29. ధనత్యాగం

త్యాగభావంలేని ధర్మపరాయణత నిజమైన ధర్మపరాయణత అన్పించుకోదు. ఆ త్యాగల్లో కూడా ప్రాణత్యాగం తరువాత ధనత్యాగం ఎంతో గొప్పవిషయం. ఈ వాస్తవాన్ని గురించి ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

"భూమ్యాకాశాల్లోని సర్వస్వం దేవునిదే. ఆయనే వాటికి వారసుడు. అలాంటప్పుడు మీరు దైవమార్గంలో సంపదను ఎందుకు ఖర్చుపెట్టరు? విజయానికి పూర్వం ధనత్యాగం చేసి యుద్ధం చేసినవారితో, విజయానంతరం సంపద ఖర్చుపెట్టి సమరంలో పాల్గొనేవారు ఎన్నటికీ సమానులు కాలేరు. దేవుడు ఉభయులకూ (ప్రతిఫలం విషయంలో) మంచి వాగ్దానం చేసినప్పటికీ హోదా, అంతస్తులలో వీరికంటే విజయానికి పూర్వం ధనత్యాగం చేసి యుద్ధం చేసినవారే అధికులు. మీరు చేసేదంతా దేవునికి తెలుసు." (ఖుర్‌ఆన్-57:10)

"మీలో దేవునికి రుణమిచ్చే వారెవరైనా ఉన్నారా? శ్రేష్ఠమైన రుణం? అలాంటి వారికి దేవుడు ఆ రుణాన్ని అనేకరెట్లు పెంచి తిరిగి ఇచ్చివేస్తాడు. పైగా వారికి అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం కూడా లభిస్తుంది." (ఖుర్‌ఆన్-57:11)

భూమ్యాకాశాలన్నీ దేవునివే అయినప్పుడు, ఆ దేవుడు ప్రసాదించిన ధనకనక వస్తువుల్ని ఆయన నిర్దేశించిన మార్గంలో (పుణ్యకార్యాల కోసం) ఖర్చు చేయడానికి మానవులకు ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. కాని మానవుడు పిసినారితనం వల్ల సత్కార్యాల కోసం డబ్బు వెచ్చించడానికి వెనుకంజ వేస్తాడు. అందువల్ల ఉపాధి ప్రసాదించేది తానేనని, మీరేదైనా దానం చేస్తే ఆ కొరతను తాను తీరుస్తానని దేవుడు అంటున్నాడు (34:39). అంతేకాదు, నేను ప్రసాదించిన ఆ ధనాన్ని నాకు రుణంగా అందజేస్తే ఆ రుణాన్ని నేను అనేక రెట్లు పెంచి తిరిగి తీర్చుతానని, ఆపై అదనంగా తగిన ప్రతిఫలం కూడా ప్రసాదిస్తానని ఆయన వాగ్దానం చేస్తున్నాడు. ఈ వాగ్దానం పరలోకంలో నెరవేరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

అబుద్దహ్దా అన్సారీ (రజి) దైవప్రవక్త (స) నోట ఈసూక్తి (57:11) విని "దైవప్రక్తా! దేవుడు మనల్ని అప్పు అడుగుతున్నాడా?"అని ప్రశ్నించారు. దానికాయన అవునన్నారు. అప్పుడు అబుద్దహ్దా (రజి) "అయితే కాస్త మీ చేయి జాపండి" అన్నారు. దైవప్రవక్త (స) చేయిజాపారు. అబుద్దహ్దా (రజి) ఆయన చేతిని తన చేతిలోకి తీసుకొని "నేను నా ప్రభువుకు నా తోటను (అప్పుగా) ఇస్తున్నాను" అని చెప్పారు.

హజ్రత్ అబుద్దహ్దా (రజి) తోటలో ఆరొందల ఖర్జూర చెట్లున్నాయి. తోటలోనే ఆయన ఇల్లు కూడా ఉంది. అక్కడే ఆయన భార్యాపిల్లలు నివసిస్తున్నారు. ఈ మాట చెప్పి ఆయన నేరుగా తోట దగ్గరికి వెళ్ళి "ఉమ్మె దహ్దా! బయటికి వచ్చేసేయి. నేనీ తోటను నా ప్రభువుకు అప్పుగా ఇచ్చేశాను" అన్నారు. ఆయన భార్య కూడా ఎంతో సాధ్వీమణి. ఆమె ఈ మాటలు విని "మీరు చాలా లాభదాయకమైన వ్యాపారమే చేశారు" అన్నారు. అప్పటికప్పుడు ఆయన తన ఇంటి సామగ్రిని, భార్యాపిల్లలను తీసుకొని తోటలో నుంచి బయటికి వచ్చేశారు. మనం గనక అప్పుడా దానశీలుడ్ని చూస్తే ఆరొందల చెట్లకు బదులు ఆరొందల కోట్ల రూపాయలు ఆర్జించానన్న ధీమా ఆయన ముఖ వర్చస్సులో తప్పకుండా గమనించగలం.

రోమన్లు మదీనాపై దాడిచెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందడంతో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) వారిని ఎదుర్కోవడానికి "తబూక్" దండయాత్రకు సన్నాహాలు చేయవలసి వచ్చింది. సిరియా సరిహద్దున గల తబూక్ ప్రాంతానికి ముస్లిం యోధులు సుదీర్ఘ ప్రయాణం చేయవలసి ఉండింది. పైగా అది తీవ్రమైన ఎండాకాలం. పకడ్బందీగా భారీఎత్తున సన్నాహాలు చేయడానికి అత్యధిక ఆయుధాలు, ఆహారపదార్థాలు, వాహనాలను సమీకరించవలసి వచ్చింది. అందువల్ల దైవప్రవక్త (సల్లం) ధన, కనక, వస్తు త్యాగాల కోసం ప్రజలను ప్రేరేపించారు.

దైవప్రవక్త (స) బోధతో ఉత్తేజితులైన ప్రజలు విశాలహృదయంతో భూరి విరాళాలు అందజెయ్యడం ప్రారంభించారు. కొందరు ధర్మసంస్థాపనా మార్గంలో తమ సర్వస్వం త్యాగం చెయ్యాలన్న వీరావేశంతో తమ శక్తికి మించిన విరాళాలు కూడా ఇచ్చారు.



హజ్రత్ ఉస్మాన్ (రజి) వేయి దీనార్‌ల విలువగల వస్తువుల్ని దైవప్రవక్త (సల్లం)కు అందజేశారు. ఆయన ధనికులైనప్పటికీ ఈ విరాళం ఆ కాలంలో అత్యధికమైనదే.

హజ్రత్ ఉమర్ (రజి) ధనత్యాగం విషయంలో అబూబకర్ (రజి)ని మించిపోవాలని నిర్ణయించుకొని తన యావదాస్తిలో అర్ధభాగం తీసుకొని వచ్చారు. దైవప్రవక్త (స) అది చూసి "భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చి పెట్టావా లేదా?" అని అడిగారు. దానికి హజ్రత్ ఉమర్ "వాళ్ళ కోసం సగం వదలిపెట్టాను" అన్నారు.

ఆ తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి ప్రవక్త (స) పాదాల చెంత పోశారు. ఈ అసాధారణ దాతృత్వం చూసి ఆయన అబ్బురపడ్డారు.

"అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలి పెట్టావు?" అని అడిగారు ఆయన.

"భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు" అన్నారు అబూబకర్ (రజి).

ఇది భాగ్యవంతుల పరిస్థితి. మరి మధ్యతరగతి ప్రజల పరిస్థితి ఏమిటీ? వాళ్ళు కూడా ఈ మహాకార్యం కోసం శక్తివంచన లేకుండా తమకున్న దాంట్లోనే అత్యధికంగా విరాళాలు అందజేశారు. పేదవాళ్ళు కూడా తమ సంపాదనలో అంతో ఇంతో తెచ్చి విరాళాల గుట్టలో పెట్టేశారు.

పాపం అబూఖలీల్ (రజి) దగ్గర విరాళం ఇవ్వడానికి ఏమీ లేదు. ఆయన కూలినాలి చేసి బ్రతికే నిరుపేద శ్రమజీవి. ఒక్కోరోజు ఆ కూలిపని కూడా దొరికేదికాదు. అప్పుడాయన కుటుంబం పస్తులుండవలసి వచ్చేది.

అయితే దైవప్రవక్త (స) ప్రకటన వినగానే అబూఖలీల్ (రజి) ఓ తోటయజమాని దగ్గరికెళ్ళి చెట్లకు నీళ్ళు తోడిపోస్తానని చెబితే అతను ఒప్పుకున్నాడు. ఆరోజు అబూఖలీల్ (రజి) ఇషానమాజ్ తర్వాత తోటకెళ్ళి రాత్రి తెల్లవారేదాకా బావి నుంచి నీళ్ళు తోడారు. ఇంత కష్టపడితే తోటయజమాని కూలి కింద ఆయనకు నాలుగు సేర్లు ఖర్జూరపండ్లు ఇచ్చాడు. అబూఖలీల్ (రజి) వాటిని తీసుకొని సంతోషంగా ఇంటికి వచ్చారు.

ఆ ఖర్జూర పండ్లలో సగం భార్యాపిల్లల కోసం వదలిపెట్టి మిగతా సగం పండ్లు మూటకట్టుకొని ఆయన దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళారు. కాని జనం పెద్దపెద్ద విరాళాలు ఇస్తుంటే తాను ఈ చిన్న విరాళం ఇవ్వాల్సి వస్తున్నదే అని భావించి సిగ్గుపడి పోతున్నారు. అందువల్ల ఆయన ఓ క్షణం అటూ ఇటూ చూసి ఆ పండ్ల మూటను విరాళాల కుప్పలో ఎక్కడో అడుగు భాగాన పెట్టేశారు సిగ్గుపడుతూనే.

కాని దైవప్రవక్త (సల్లం) అది గమనించారు. వెంటనే ఆయన ఆ పండ్ల మూటను అక్కడ్నుంచి తీసి విరాళాల కుప్పలో అన్నిటికన్నా పైభాగాన పెట్టేశారు. అబూఖలీల్ (రజి) అది చూసి ఎంతో సంతోషించారు.

అయితే అపహాస్యం, కువిమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్న కపట విశ్వాసులు చిన్నచిన్న విరాళాలు ఇచ్చిన పేద ముస్లింలను ఎగతాళి చేయసాగారు.

"వీరు మనస్ఫూర్తిగా విశ్వాసులు చేస్తున్న ధన త్యాగాల్ని గురించి ఎత్తిపొడుస్తూ మాట్లాడుతున్నారు. కష్టపడి చెమటోడ్చి ఎంతోకొంత దైవమార్గంలో దానమిస్తున్న (నిరుపేద) విశ్వాసుల్ని ఎగతాళిచేస్తున్నారు. (అలా ఎకసక్కెం, ఎగతాళి చేస్తున్న ఈ పిసినారుల సంగతి దేవునికి బాగా తెలుసు.) అసలు దేవుడే వారిని ఎగతాళి చేస్తున్నాడు. వారికోసం దుర్భరమైన యాతన కాచుకొని ఉంది." (ఖుర్ఆన్-9:79)

హజ్రత్ అనస్ (రజి):- హజ్రత్ అబూతల్హా (రజి) మదీనాలోని అన్సార్ ముస్లింలలో కెల్లా గొప్ప ధనికులు. ఆయనకు (అనేక) ఖర్జూరపు తోటలు ఉండేవి. వాటిలో 'బైర్హా' అనే తోటంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఈ తోట మస్జిదె నబవీ ముందు భాగాన ఉండేది. దైవప్రవక్త (సల్లం) ఆ తోటలోకి తరచుగా వెళ్తుండేవారు. అక్కడ లభించే మంచినీళ్ళు త్రాగేవారు. ఖుర్ఆన్‌లో "మీకు అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవ మార్గంలో ఖర్చు చేయనంత వరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేరు" అనే సూక్తి (3:92) అవతరించినపుడు హజ్రత్ అబూతల్హా (రజి) లేచి ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! 'మీకు అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చు పెట్టనంత వరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేర'ని దేవుడు (ఖుర్ఆన్‌లో) సెలవిస్తు న్నాడు కదా! 'బైర్హా' తోట నాకెంతో ఇష్టమైనది. అంచేత నేనా తోటను దైవమార్గంలో దానం చేస్తున్నాను. దైవం నుండి దాని పుణ్యఫలం ఆశిస్తున్నాను. పరలోకంలో అది నా కోసం గొప్పనిక్షేపంగా తయారవుతుందని నమ్ముతున్నాను. దైవప్రవక్తా! మీరు దైవాజ్ఞ ప్రకారం దాన్ని ఉప యోగించండి."

అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా అన్నారు: "చాలా మంచిది. ఇదెంతో లాభదాయకమైన సంపద. నిజంగా ఇదెంతో లాభదాయకమైన సంపద. నీ మాటలు నేను విన్నాను. అయితే నాదొక సలహా. ఆ తోటను నీ (పేద) బంధువులకు పంచిపెట్టు. "హజ్రత్ అబూతల్హా (రజి) ఈమాట విని "నేను మీఆజ్ఞ శిరసావ హిస్తున్నాను" అన్నారు. తర్వాత ఆయన ఆతోటను తన పెదనాన్న, చిన్నాన్న కొడుకులకు, ఇతర బంధువులకు పంచివేశారు. (బుఖారి).

## 30. ఆర్థిక ఒనరుల వినియోగం

ఆర్థిక ఒనరుల వినియోగం గురించి ఈ సూక్తులు గమనించండి:

"ప్రవక్తలారా! (మేము ప్రసాదించిన) పరిశుద్ధ పదార్థాలు తింటూ సత్కార్యాలు చేస్తూ ఉండండి. మీరు చేసేదంతా నాకు తెలుసు. మీ సమాజమంతా ఒకే (ధర్మానికి చెందిన) సమాజం. నేను మీ ప్రభువును. కనుక మీరు నాకు మాత్రమే భయపడుతూ ఉండాలి' (అని చెప్పాము)." (ఖుర్ఆన్-23:51,52)



ఒకవైపు నమాజ్, రోజా, జకాత్, హజ్ లాంటి పుణ్యకార్యాలు చేస్తూ మరోవైపు అక్రమ పద్ధతుల ద్వారా ధనార్జన చేసి సుఖాలు అనుభవించడం ధర్మపరాయణత అన్పించుకోదు. కొందరు సత్కార్యాల కోసం కష్టపడి ధర్మసమ్మతంగా సంపాదించిన పైకాన్నే వినియోగించాలని, తాము స్వయంగా అనుభవించడానికైతే అక్రమ సంపదైనా పర్వాలేదని భావిస్తారు. ఇది సరికాదు. తాము అనుభవించేదైనా, సత్కార్యాల కోసం ఖర్చు పెట్టేదైనా నీతిగా, ధర్మసమ్మతంగా సంపాదించిన పైకమే వినియోగించాలి.

ప్రవక్త ప్రవచనం: "ఒక వ్యక్తి సుదూర ప్రయాణం చేసి దుమ్ము ధూళి కొట్టుకొని వస్తాడు. అతను ఆకాశం వైపు చేతులెత్తి ప్రభూ! ప్రభూ! అంటూ ప్రార్థిస్తాడు. కాని అతను తిన్నది అధర్మమైన తిండి, అతను కట్టుకున్నవి అధర్మ వస్త్రాలు, అతని శరీరం అక్రమ సంపాదనతో పోషించబడింది. అలాంటప్పుడు అతని ప్రార్థన ఎలా స్వీకరించ బడుతుంది?" (ముస్లిం, తిర్మిజి)

"దుబారాఖర్చు చేయకండి. దుబారాఖర్చు చేసేవారు షైతాన్ సోదరులుగా పరిగ ణించబడతారు. షైతాన్ తన ప్రభువుకు కృతఘ్నుడైపోయాడు." (ఖుర్ఆన్-17:26,27)

"మీరు మీ చేతిని (ఏ మాత్రం దానం చేయకుండా) మెడకేసి కట్టి ఉంచకండి. అలాగే దాన్ని పూర్తిగా తెరచి ఉంచడం కూడా సరికాదు. అలాచేస్తే మీరు నిందితులై, నిస్సహాయులై పోతారు." (ఖుర్ఆన్-17:29)

"వారు తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా ఖర్చుచేయరు; ఇటు పిసినారి తనం కూడా వహించరు. వారి ఖర్చు ఆ రెండు అతిచర్యలకు మధ్యస్తంగా ఉంటుంది." (ఖుర్ఆన్-25:67)

"దేవుడు మీకు జీవనాధారంగా చేసిన సంపదను మూఢులకు అప్పగించకండి. అయితే వారికి తిండీ, బట్టా (లాంటి జీవితావసరాలు) సమకూర్చండి. వారికి హితబోధ చేస్తూ ఉండండి." (ఖుర్ఆన్-4:5)

"దానికి వారిలా అన్నారు: 'షుఐబ్! మా తాత ముత్తాతల కాలం నుండి వస్తున్న ఈ దైవాలను ఆరాధించడం మానుకోవాలా? మా ధనాన్ని మా ఇష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టుకునే అధికారం కూడా లేదా మాకు? ఇదేనా నీప్రార్థన నీకు నేర్పుతున్నది? (మా అందరిలో) సాధుస్వభావి, సన్మార్గగామివి నీవొక్కడివే మిగిలావు కాబోలు!" (ఖు-11:87)

మానవుడ్ని దేవుడు "ఖలీఫా"గా నియమించి భూలోకానికి పంపించాడు. ఇక్కడ తన ఇష్టమొచ్చినట్లు జీవించడానికి దైవం అతనికి విశృంఖల స్వేచ్ఛ ఇవ్వలేదు. అతను జీవిత సకలరంగాల్లోనూ దైవాజ్ఞలకు బద్ధుడయి జీవితం గడపాలి. ఈ విషయం 'ఖలీఫా' అనే పదాన్నే బట్టే స్పష్టమవుతోంది. ప్రపంచంలో ఎవరైనా రాజ ప్రతినిధిగా నియమించబడినప్పుడు అతను తన ఇష్టమొచ్చినట్లు వ్యవహరించకుండా ఏవిధంగా రాజాజ్ఞలను మాత్రమే అమలుపరుస్తాడో, అదేవిధంగా దేవుని ప్రతినిధిగా

మానవుడు కూడా దేవుని ఆజ్ఞలను మాత్రమే శిరసావహిస్తూ ఆయన అభీష్టాన్ని నెరవేర్చవలసి ఉంటుంది.

మన దేశాన్ని ఆంగ్లేయులు పరిపాలించిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటే ఈ విషయం మరింత స్పష్టంగా బోధపడుతుంది. ఇక్కడ పాలనచేసే ఆంగ్లేయ ప్రతినిధిని "వైస్రాయ్" అనేవారు. అతను స్వయంగా ఎలాంటి చట్టాలు చేయకుండా బ్రిటిష్ రాజు నిర్మించిన చట్టాలు మాత్రమే ఇక్కడ అమలుపరిచేవాడు. అతను రాజాజ్ఞలకు వ్యతిరేకంగా ప్రవర్తించాడంటే ప్రాతినిధ్య అధికారాలను దుర్వినియోగం చేసినట్లే. అదే విధంగా మానవుడు కూడా దైవశాసనాలను త్రోసిరాజని విశృంఖల జీవితం గడిపితే, లేదా తనలాంటి మానవులు నిర్మించిన కాల్పనిక చట్టాలు, సిద్ధాంతాలను అనుసరిస్తే దైవం ప్రసాదించిన ఖిలాఫత్ అధికారాలను దుర్వినియోగ పరచిన వాడవుతాడు.

"విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేలనుండి మీ కోసం ఉత్పత్తిచేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైమార్గంలో ఖర్చుచేయండి. దైవమార్గంలో ఖర్చు చేయడానికి నాసిరకం వస్తువుల్ని ఏరితీసే ప్రయత్నం చేయకండి. అలాంటి వస్తువుల్ని మీకే గనక ఎవరయినా ఇస్తే మీరు తీసుకోవడానికి ఇష్టపడతారా? కళ్ళు మూసుకొని స్వీకరిస్తారేకాని, మనస్ఫూర్తిగా మీరు ఎన్నటికీ వాటిని స్వీకరించరు. దేవుడు నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడని తెలుసుకోండి." (ఖుర్ఆన్-2:267)

## 31. పొదుపు-పేదల సంక్షేమం

ఇస్లాంలో పొదుపు చేయడం అంటే పిసినారితనం వహించి ఒక్కొక్క రూపాయి కూడబెట్టూ ఆస్తులు పెంచుకోవడం కాదు. విలాసాలకు పోకుండా అనవసరపు ఖర్చులు వీలైనంత తగ్గించుకొని, ఆ విధంగా పొదుపు చేయడం ద్వారా పేదల సంక్షేమం కోసం పాటుపడాలన్నదే పొదుపు లక్ష్యం. ఈ లక్ష్యంతోనే ఇస్లాం పురుషులు స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలు ధరించకూడదని ఆంక్షలు విధించింది.

హజ్రత్ బరా బిన్ ఆజిమ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మాకు ఏడు రకాల పనులు చేయాలని ఆదేశించారు. అలాగే ఏడు రకాల పనులు చేయకూడదని మమ్మల్ని వారించారు. చేయమని ఆదేశించిన ఏడు పనులు ఇవి-

(1) వ్యాధిగ్రస్తుడ్ని పరామర్శించడం, (2) శవం వెంట (ఖనన వాటికకు) వెళ్ళడం, (3) తుమ్మి ఎవరైనా 'అల్‌హమ్దులిల్లాహ్' అంటే, దానికి సమాధానంగా 'యర్హముకల్లా' అని పలకడం, (4) విందు ఆహ్వానాన్ని స్వీకరించడం, (5) సలాంను సర్వసామాన్యం చేయడం, (6) పీడితుడ్ని ఆదుకోవడం, (7) వాగ్దానపాలన చేయడం.

చేయవద్దని వారించిన ఏడు పనులు- (1) బంగారపు ఉంగరం పెట్టుకోవడం, (2) వెండి పాత్రలలో నీరు తాగడం, (3) పట్టు జీనును వాడటం, (4) ఖిస్



(ప్రాంతం)లో తయారైన బట్టలు వాడటం, (5) పట్టువస్త్రాలు ధరించడం, (6) ముతక పట్టువస్త్రాలు ధరించడం, (7) పల్చటి పట్టువస్త్రాలు ధరించడం. (బుఖారి)

దైవప్రవక్త (స) స్త్రీలకు మాత్రమే వెండి బంగారాలను నగలుగా వాడటానికి అనుమతిచ్చారు. అయితే స్త్రీలు తమ భర్తల కోసం మాత్రమే బంగారు నగలు ధరించాలి. ప్రదర్శనాబుద్ధితో ఇతరుల మెప్పుకోసం ధరించకూడదు. దైవప్రవక్త (స) ఈ విషయాన్ని చెబుతూ "ఏస్త్రీ అయినా జనానికి చూపే ఉద్దేశ్యంతో బంగారు నగలు ధరిస్తే ఆమె (నరక) యాతనలకు గురవుతుంది" అని అన్నారు. (మిష్కాత్)

పురుషులు బంగారు గొలుసులు, ఉంగరాలు, చెవిపోగులు మొదలైన నగలు వాడటాన్ని ఆయన నిషేధించారు. అలాగే స్త్రీలైనా, పురుషులైనా పాత్రలు, గ్లాసులు, ఇతరత్రా సామగ్రి కోసం వెండి బంగారాలు వాడటాన్ని కూడా ఆయన నిషేధించారు.

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "వెండి బంగారాలతో చేసిన పాత్రలలో గాని, లేదా వెండి బంగారాలు కలిపి ఇతర లోహాలతో చేసిన పాత్రలలోగాని ఎవరైనా తింటే, తాగితే అలాంటివాడు తన పొట్టను నరకాగ్నితో నింపుకున్నాడన్న మాట. (దార్‌ఖత్ని)

ప్రవక్త ప్రవచనం: "ఎవరైతే వెండిచెంబుతో మంచినీళ్ళు తాగుతాడో అతనసలు ఒక్కో గుక్కతో పాటు తన పొట్టలో అగ్ని పోసుకున్నట్లే." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అలి (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం)కు ఓసారి స్వచ్ఛమైన పట్టువస్త్రాల జత ఒకటి కానుకగా లభించింది. దాన్ని మా ఇంటికి పంపిస్తే నేను ధరించాను. కాని అది చూడగానే దైవప్రవక్త (సల్లం) ముఖారవిందం ఆగ్రహోదగ్రమయింది. దాంతో నేనా పట్టువస్త్రాలను చించి మా కుటుంబంలోని స్త్రీలకు ఇచ్చివేశాను. (బుఖారి)

ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కథనం: ఓరోజు నేను మస్జిద్ ద్వారం దగ్గర స్వచ్ఛమైన పట్టువస్త్రాల జతను చూసి "దైవప్రవక్తా! ఈ జతబట్టల్ని మీరు కొని శుక్రవారం రోజున, బయటి నుండి మిమ్మల్ని కలుసుకోవడానికి ప్రతినిధి వర్గాలు వచ్చినప్పుడు వాటిని ధరిస్తే ఎంత బాగుంటుంది!" అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) "పరలోకం (స్వర్గం)లో ఎలాంటి (ప్రతిఫలం) వాటాకు నోచుకోనివాడే దీన్ని ధరిస్తాడు" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం)కు కానుకగా ఒక సిల్కు కోటు పంపబడింది. ఆయన దాన్ని ధరించి (మసీదులో) నమాజు చేశారు. అయితే (ఇంటికి) తిరిగొచ్చి దాన్ని తీసిపారేశారు తనకది ఇష్టంలేనట్లుగా. తరువాత (పట్టువస్త్రాలను గురించి మాట్లాడుతూ) "దైవభీతిపరులకు ఇలాంటి బట్టలు శోభించవు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని బంగారపు ఉంగరం ధరించడాన్ని వారించారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) బంగారపు ఉంగరం చేయించుకొని దాని రాయి చేతిలోపలికి ఉండేలా ధరించసాగారు. అది చూసి ఆయన అనుచరులు కూడా అదేవిధంగా ధరించడం మొదలెట్టారు. ఆ తరువాత ఓరోజు దైవప్రవక్త (స) మసీదు వేదికఎక్కి ఉంగరాన్ని తీసేసి ఇలా అన్నారు. "నేనీ ఉంగరం ధరించేవాడ్ని. దీని రాయి చేతికి క్రింది వైపు ఉండేలా పెట్టుకునే వాడ్ని" అని అన్నారు. తరువాత ఆయన ఆ ఉంగరాన్ని పారేసి "దైవసాక్షి! నేనిక నుంచి ఈ ఉంగరం ఎన్నటికీ పెట్టుకోను" అని అన్నారు. ఈమాట వినగానే అనుచరులు కూడా తమతమ ఉంగరాలను తీసి పారేశారు. (బుఖారి, ముస్లిం)

**ముఖ్యావసరాలు:-** ఈనాటి పొదుపు ఉద్యమాలలో పొదుపు అంటే అనవసరపు ఖర్చులు తగ్గించుకొని వీలైనంతవరకు కూడబెట్టడం, తద్వారా స్థిరచరాస్తులు సమకూర్చు కోవడం అనే అర్థంలో ఈ పదాన్ని ప్రయోగిస్తున్నారు. కాని ఇస్లాం దుబారా ఖర్చులు, విలాసాలు మానుకొని పొదుపుగా జీవితం గడపాలని బోధిస్తోంది.

జీవితం గడపడానికి కావలసిన తిండి, బట్ట, నివాసం లాంటి కనీసవసరాలే మనిషి ముఖ్యావసరాలని, అంతకు మించి కోరుకోవడం తగదని చెబుతోంది ఇస్లాం. అంతకుమించి కోరుకోవడమంటే విలాసజీవితం గడపడానికి ఉబలాట పడటమే. విలాస జీవితానికి హద్దంటూ ఉండదు. అది క్రమంగా అక్రమ జీవనోపాధికి దారి తీస్తుంది. అందుకే దైవప్రవక్త (స) కూడా ముఖ్యావసరాల పరిధిని ఇలా పేర్కొన్నారు:

"ఆదం కుమారుడికి (మానవుడికి) ఈ (మూడు) విషయాల్లో తప్ప మరెందు లోనూ హక్కు లేదు- (1) తల దాచుకోవడానికి ఒక ఇల్లు, (2) వళ్ళు దాచుకోవడానికి బట్ట, (3) (కడుపు నింపుకోవడానికి) అన్నపానీయాలు." (తిర్మిజి-మిష్కాత్)

## 32. అక్రమ(అధర్మ) సంపాదన

"విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా కబళించకండి. పరస్పరామోదంతో వ్యాపార లావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడాలు జరుపుకోవచ్చు. (అన్యాయం, అక్రమం, హత్య, ఆత్మహత్యల ద్వారా) మిమ్మల్ని మీరు హతమార్చుకోకండి. దేవుడు మీ విషయంలో ఎంతో దయామయుడని తెలుసుకోండి. అన్యాయం, అక్రమాలతో ఇలా చేసేవాడ్ని మేము త్వరలోనే నరకాగ్నిలో విసరేస్తాం." (ఖుర్ఆన్-4:29,30)

"మీరు ఒకరి ధనాన్ని మరొకరు అక్రమంగా కబళించకండి. అలాగే ఇతరుల సొత్తును అన్యాయంగా కాజేసే ఉద్దేశ్యంతో ఆ వ్యవహారాన్ని అధికారుల దగ్గరకు తీసి కెళ్ళకండి." (ఖుర్ఆన్-2:188)

"భూమ్యాకాశాలలో ఉన్న సమస్తం దేవునిదే. మీరు మీ హృదయాల్లో ఉన్న విషయాన్ని బహిర్గతం చేసినా, దాచినా ఎట్టి పరిస్థితిలోనూ దాన్ని గురించి దేవుడు



మీనుండి లెక్క తీసుకుంటాడు. ఆ తర్వాత ఆయన తాను తలచిన విధంగా కొందరిని క్షమిస్తాడు. మరికొందరిని శిక్షిస్తాడు." (ఖుర్ఆన్-2:284)

"నీవు చూస్తూనే ఉన్నావు, వారిలో (అంటే యూదులలో) చాలామంది పాప కార్యాలు, హింసాదౌర్జన్యాలు, అన్యాయం, అక్రమాలు చేయడానికే అనుక్షణం పరుగులు పెడతారు. అక్రమ సంపాదనతో కడుపు నింపుకుంటారు. వీరు ఎంతటి ఘోరమైన వికృత చేష్టలకు పాల్పడుతున్నారు! వారి పండితులు, ధర్మవేత్తలు వారిని పాపకార్యాల నుండి, అక్రమ సంపాదనల నుండి ఎందుకు వారించరు? వీరు చేస్తున్నది కూడా చాలా చెడ్డ పనే." (ఖుర్ఆన్-5:62,63)

ముస్లిం గ్రంథంలోని ఒక ఉల్లేఖనంలో "ఆ తర్వాత వచ్చేవారు (పూర్తిగా ప్రాపంచిక వ్యామోహంలో పడిపోయి అక్రమ సంపాదనలతో విలువైన ఆహారం తింటూ) బలిసిపోవడానికి ఇష్టపడతారు" అని ఉంది.

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం:- "ఒకతను సుదూర ప్రయాణం చేసి దుమ్ము కొట్టుకొని వస్తాడు. అతను ఆకాశం వైపు చేతులెత్తి ప్రభూ! ప్రభూ! అంటూ ప్రార్థిస్తాడు. కాని అతను తిన్నది అధర్మమైన తిండి, అతను కట్టుకున్నవి అధర్మ వస్త్రాలు, అతని శరీరం అక్రమ సంపాదనతో పోషించబడింది. అలాంటప్పుడు అతని ప్రార్థన ఎలా స్వీకరించబడుతుంది?" (ముస్లిం)

"ఎంతమాత్రం కాదు. విశ్వసనీయ జ్ఞానంతో మీరు విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పకుండా నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీకళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదలను గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (ఖుర్ఆన్. 102:5-8)

దైవాన్ని, పరలోకచింతను విస్మరించి ప్రాపంచిక వ్యామోహపరుడయి పోయిన మనిషి తన సుఖసంతోషాల కోసం వీలయితే ఎన్ని అడ్డదారులైనా తొక్కి డబ్బు సంపాదిస్తాడు. అన్యాయం, అవినీతి, అక్రమాల ద్వారా కోట్లు సంపాదిస్తాడు. విలాసాల కోసం వాటిని విచ్చలవిడిగా ఖర్చుపెడ్తాడు.

అతను ప్రపంచంలో ప్రభుత్వం కళ్ళు గప్పగలడు గాని సకలజ్ఞాన సంపన్నుడు, సర్వశక్తి సంపన్నుడయిన దేవుని కళ్ళు మాత్రం కప్పలేడు. ఆ మనిషి సంపాదించిన సమస్త జీవితావసరాలు, ధన కనక వస్తువుల్ని గురించి పరలోక న్యాయస్థానంలో కఠినాత కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది. సిరిసంపదలు, ఇతర జీవితా వసరాలు ఎంత ఎక్కువగా ఉంటే కర్మవిచారణ అంత సుదీర్ఘకాలం సాగుతుంది. అతని అక్రమసంపాదన, ధన దుర్వినియోగాలు రుజువయిన తరువాత దైవదూతలు అతడ్ని నరకంలోకి నెట్టివేస్తారు.

# 33. సక్రమ (ధర్మ)సంపాదన

నేటి నీతిరాహిత్య సమాజంలో ధర్మసంపాదన వల్ల మనిషి లక్షలు ఆర్జించలేక పోయినా అతని ముఖ్యావసరాలు తీరకపోవు. దేవుడు విశ్వప్రభువు, సృష్టికర్త, యజమాని మాత్రమే గాకుండా ఆయన మన పోషకుడు, ఉపాధిప్రదాత కూడా అన్న విషయాన్ని నిష్ఠాపరుడయిన ముస్లిం గట్టిగా నమ్ముతాడు. ధర్మసంపాదన వల్ల ఇహలోకంలో అధిక లాభాలు రాకపోయినా పరలోకంలో మటుకు తనకు గొప్ప ప్రతిఫలం లభిస్తుందని అతను విశ్వసిస్తాడు. అయితే ఒక్కొక్కసారి ఇహలోకంలో కూడా ధర్మసంపాదన వల్ల అనూహ్యమైన శుభాలు చేకూరుతాయి. ఈ విషయంలో ఓ చారిత్రక సంఘటనను గురించి తెలుసుకుందాం:

ఢిల్లీ చక్రవర్తి దర్బారులో కొలువుతీరి కూర్చున్నాడు. కాస్సేపటికి ఎక్కడ్నుంచో ఆయన గురువుగారు ఒకాయన వచ్చాడు. గరువుగారిని చూడగానే చక్రవర్తి అమితమైన సంతోషంతో ఎదురేగి ఎంతో గౌరవమర్యాదలతో ఆయన్ని తన పక్కనే కూర్చోబెట్టు కున్నాడు. యోగక్షేమాలు విచారించాడు. ఆ తరువాత కొన్నాళ్ళపాటు ఆయన్ని తన దగ్గర అతిథిగా పెట్టుకొని ఎంతో సేవ చేశాడు.

చక్రవర్తి దగ్గర ఆతిథ్యం ఇవ్వడానికి కొదవేముంటుంది? కాని గురువుగారు కొన్నాళ్ళ తర్వాత ఇంటికి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాడు. అప్పుడు చక్రవర్తి గురువుగారి పట్ల ఎంతో వినయం చూపుతూ చిరుకానుకగా ఆయనకు ఓ పావలా నాణెం సమర్పించుకున్నాడు. ఆ చిరుకానుక చూసి దర్బారులో సభికులంతా ఆశ్యర్యపోయారు.

"ఏమిటీ! ఎంతో విశాలమైన సామ్రాజ్యాన్ని ఏలే మన చక్రవర్తి అంతపెద్ద గురువుగారికి కానుకగా ఓ పావలా బిళ్ళేనా ఇచ్చేది!! అని భావిస్తూ మంత్రులు, అధికారులు విస్తుబోయి చూడసాగారు. ఆవిధంగా చక్రవర్తి తన గురువుగారిని కించపరుస్తున్నాడని అనుకున్నారు వారు. కాని గురువుగారు అల్పసంతోషిలా ఆ పావలా కాసునే తీసుకొని సంతోషంతో పొంగిపోతూ మనసారా చక్రవర్తిని దీవించి మరీ వెళ్ళిపోయారు. ఇది చూసి సభాసదులు మరింత ఆశ్చర్యపోయారు.

"ఏమిటీ, నేను గురువుగారికి పావలా మాత్రమే ఇచ్చానని మీరు ఆశ్చర్యపోతు న్నారా? మీకు వాస్తవం తెలియదు. అంచేత గురువుగారిని నేనేదో కించపరచానని మీరు భావిస్తున్నారు" అన్నాడు చక్రవర్తి. కాని అలా అన్నాడేగాని ఆ వాస్తవం ఆయన సభికు లకు చెప్పలేదు. సభికులు కూడ కారణం అడగడానికి సాహసించలేదు.

కొన్నేళ్ళ తరువాత గురువుగారు గొప్ప ధనికుడయిపోయాడు. అనేక తోటలు, పొలాలు, పశువులకు ఆయన యజమాని అయ్యాడు. ప్రతిరోజూ వందలాది మంది జనానికి ఆతిథ్యం కూడా ఇవ్వసాగాడు. ఈ సంగతి చక్రవర్తికి తెలిసి చాలా సంతో షించాడు. గురువుగారు ఆస్తిపరుడయిన తరువాత ఓ రోజు మళ్ళీ చక్రవర్తిని కలుసు



కోవడానికి వచ్చాడు. చక్రవర్తి యథాప్రకారం గురువుగారికి అత్యంత గౌరవమర్యాదలు జరిపాడు. అతిథిగా స్వీకరించి గొప్ప సేవలు చేయడం ప్రారంభించాడు.

ఓరోజు దర్బారులో గురువుగారు చక్రవర్తితో మాట్లాడుతూ 'ఆ పావలా కాసు' ప్రస్తావన తెచ్చారు. అప్పుడు గురువుగారు ఇలా అన్నాడు: "శిష్యా! ఆరోజు నీవు నాకిచ్చిన పావలాతోనే ఈరోజు నేనింత ధనికుణ్ణయ్యాను. ఆ పావలాతో నేనొక చిన్న వ్యాపారం మొదలెట్టాను. ఇంకేముంది, నా వ్యాపారం క్రమంగా దినదినాభివృద్ధి చెందుతూ కొన్నేళ్ళకే నేను లక్షాధికారి నయ్యాను. సరే, ఇంతకూ నీవు ఆ పావలాను ఎక్కడ్నుంచి తెచ్చిచ్చావు? దాని కథాకమామీషు ఏమైనా ఉందా?"

చక్రవర్తి ఈమాట విని కోశాధికారి వైపు తిరిగి "కోశాధికారీ! ఏదా పద్దులపుస్తకం, కాస్త ఇటు తీసుకురా" అని ఆజ్ఞాపించాడు. కోశాధికారి వెళ్ళి ఒక పెద్ద రిజిష్టర్ తెచ్చి చక్రవర్తికి అందించాడు. చక్రవర్తి రిజిష్టర్‌లో కొన్ని పేజీలు తిరిగేసి, ఓ చోట వేలుపెట్టి చూపిస్తూ "నీవు ఫలానా తారీఖున పావలా ఖర్చు పెట్టినట్లు రిజిష్టర్‌లో రాశావు. కాని ఆ డబ్బు ఏపద్దు కింద ఎందుకు ఖర్చుపెట్టావో చూపించలేదే?" అని అడిగాడు.

ఈ మాట వినగానే కోశాధికారికి వణుకు పుట్టింది. "క్షమించండి మహారాజా! పొరపాటయింది. మీరు అనుమతిస్తే ఆ పావలా సంగతి వివరిస్తాను" అన్నాడతను వినయంగా. దానికి చక్రవర్తి "అలాగే అనుమతిస్తున్నాము, చెప్పు" అన్నాడు. అప్పుడు కోశాధికారి ఇలా చెప్పడం ప్రారంభించాడు:

"మహారాజా! ఒకరోజు ఉదయం నుండి వర్షం ప్రారంభమయి రాత్రి పొద్దు పోయేదాకా కురిసింది. ఆ రాత్రి వర్షానికి మాఇల్లు కారడం మొదలెట్టింది. పైకెక్కి కన్నం పడినచోట మట్టి పోయమని నాభార్య చెప్పింది. కాని ఆ ముసురులో, ఎముకలు కొరికే ఆ చలిగాలిలో బయటికెళ్ళి మిద్దెపై ఎక్కడానికి నాకు ధైర్యం చాల్లేదు. ఏం చెయ్యాలో తోచక ఎవరైనా కూలివాడు వస్తే బాగుంటుందని ఆలోచిస్తూ కూర్చున్నా. అయినా ఇంత రాత్రివేళ ఈ వర్షంలో ఏ కూలివాడు వస్తాడు అనుకున్నాను.

"అంతలో బయట తలుపు తట్టిన చప్పుడయింది. నేను ఆదుర్దాగా ఎవరూ? అన్నాను. 'కూలివాణ్ణయ్యా!' అంటూ సమాధానమొచ్చింది. నేను సంతోషంతో తలుపు తెరచి కూలివాణ్ణి లోపలికి తీసికెళ్ళాను. అతనికి ఇల్లు కారుతున్న చోటు చూపించి మరమ్మత్తు చేయమని చెప్పాను. అతను వర్షంలో తడుస్తూ మట్టిగంప తీసుకొని మిద్దె పైకెక్కాడు. కాస్సేపటికి కారుతున్న చోట మట్టిపోసి సరిచేసి కిందికి దిగివచ్చాడు.

"అతని పరిస్థితి చూసి నాకు జాలి వేసింది. తడిసి ముద్దయి చలికి గజగజ వణికిపోసాగాడు. చీకట్లో అతను ఎవరైందీ నేను గమనించలేక పోయాను. ఎవరైతేనేం, మొత్తానికి మమ్మల్ని ఆ రాత్రి ఆపద నుండి గట్టెక్కించాడు. నేను సంతోషిస్తూ అతనికి కూలి కింద పావలా ఇచ్చాను. ఆ డబ్బే మన పద్దుల పుస్తకంలో రాసిన ఈ పావలా."

కోశాధికారి ఇలా వివరించిన తరువాత చక్రవర్తి ఏం చెబుతాడోనని ఆలోచిస్తూ గురువుగారు, సభాసదులు చక్రవర్తి వైపు దృష్టి మళ్ళించి తదేకంగా చూడసాగారు.

"గురువర్యా! ఆరోజు మా కోశాధికారి ఇంటిని మరమ్మత్తు చేసిన ఆ కూలివాడు నేనే" అన్నాడు చక్రవర్తి. ఈమాటలు వినగానే అందరూ నిర్ఘాంత పోయారు. "ఏమిటీ! మన చక్రవర్తి కూలిపని చెయ్యడమా!!" అంటూ సభాసదులు ఆశ్చర్యచకితులయ్యారు. చక్రవర్తి తన మాటను కొనసాగిస్తూ ఇలా అన్నాడు:

"గురువర్యా! ఆ రోజుల్లోనే మీరు రాజధానికొచ్చి నా దగ్గర అతిథిగా ఉండ సాగారు. మీరు గురువులు, గౌరవనీయులు. అందుకని నేను నా స్వహస్తాలతో కష్టపడి సంపాదించిన డబ్బునే మీకు కానుకగా ఇద్దామని భావించాను. సమయం కోసం ఎదురుచూస్తూ ఆ రాత్రి కూలివాడి వేషంలో బయలుదేరాను.

"బజారులో నడుస్తూ మన కోశాధికారి ఇంటి ముందు నుంచి పోతుంటే అతని భార్య చెబుతున్న మాటలు నా చెవిలో పడ్డాయి. వెంటనే తలుపు తట్టి నన్ను నేను కూలివాణ్ణిగా చెప్పుకున్నాను. ఆరోజు అక్కడ సంపాదించిన ఆ పావలా కాసునే నేను మీకు కానుకగా సమర్పించుకున్నాను."

గురువుగారు ఈ మాటలు విని "నిజంగా ధర్మసంపాదనలో ఎంతో శుభం ఉంది" అంటూ వ్యాఖ్యానించారు.

ఇంతకూ కూలివాడిగా పావలా డబ్బు సంపాదించి తన గురువుకు కానుకగా ఇచ్చిన ఆ చక్రవర్తి ఎవరో ఈ మొత్తం సంఘటన సందర్భంగా నేను పేర్కొనలేదు. వినండి. ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని వారికి సహాయపడేందుకు కూలివాడి అవతారం ఎత్తిన ఆ చక్రవర్తి ఎవరో కాదు, ప్రఖ్యాత మొగల్ చక్రవర్తి ఔరంగ్‌జేబ్ ఆలమ్‌గీర్! ఆయన ఖుర్ఆన్ ప్రతులు రాసి, టోపీలు కుట్టి అమ్ముకుంటూ మనుగడ సాగించే వాడని చరిత్రకారులు రాసిన సంగతి చాలా మందికి తెలుసు.

దీన్నిబట్టి ధర్మసంపాదనకు ఇస్లాం ఎంత విలువ ఇచ్చిందో, దానివల్ల ఇహపర లోకాల్లో ఎన్ని శుభాలు చేకూరుతాయో ఊహించవచ్చు. ఈ కారణంగానే దైవప్రవక్త (స) ధర్మసంపాదన కోసం చేసేకృషికి, నీతి నిజాయితీలలో చేసే వ్యాపారానికి ఎంతో ప్రాముఖ్యం ఇచ్చారు. మిష్కాత్‌లోని ఒక హదీస్ ప్రకారం ఆయన ఇలా అన్నారు:

"ఇతరుల ముందు చేయిజాపకుండా ఉండే, భార్యాపిల్లల్ని పోషించే, పొరుగు వారిని కనికరించే ఉద్దేశంతో ధర్మసమ్మతంగా ధనార్జన చేసిన వ్యక్తి ప్రళయదినాన దేవుణ్ణి కలుసుకోవడానికి వెళ్ళేటప్పుడు అతని ముఖం పూర్ణచంద్రునిలా వెలిగి పోతుంది. ధర్మసమ్మతంగా ధనార్జన చేసినప్పటికీ ఇతరులకంటే ఎక్కువ కూడబెట్టే, ఇతరులకంటే తాను ధనికుడ్ననిపించుకునే, తనకంటే తక్కువ స్థితిపరుల్ని చూసి మిడిసిపడే ఉద్దేశం కలవాడైతే ప్రళయదినాన అలాంటి వ్యక్తిని దేవుడు ఆగ్రహిస్తాడు."



అంతేకాదు, నీతినిజాయితీలతో వ్యాపారం చేసే వర్తకుడ్ని దైవప్రవక్తలు, సత్య సంధులు, అమరగతుల సరసన నిలబెడ్తూ ఆయన "నీతిమంతుడైన వ్యాపారి అంతిమ (ప్రళయ) దినాన దైవప్రవక్తల, సత్యసంధుల, అమరగతుల సహచర్యంలో ఉంటాడు" అని ప్రవచించారు. (తిర్మిజి)

# 34. అశ్లీలం, వ్యభిచారం

"మానవుల్లో మనసును మభ్యపెట్టే వ్యర్థవస్తువుని కొనితెచ్చేవాడు కూడా ఒకతను ఉన్నాడు. అతను (సరయిన) జ్ఞానం లేకుండా ప్రజల్ని దైవమార్గం నుండి తప్పించి, ఆ ప్రచారాన్ని పరిహసించడానికే ఇలాంటి చేష్టలకు పాల్పడ్డాడు. ఇటువంటి వారికి అవమానకరమైన శిక్ష కాచుకొని ఉంది." (ఖుర్ఆన్-31:6)

ఈ సూక్తిలో "మనస్సును మభ్యపెట్టే వ్యర్థవస్తువు" అనే పదం వచ్చిన చోట మూలభాషలో "లహ్వల్‌హదీస్" అనే పదం వాడబడింది. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి)ని లహ్వల్‌హదీస్ అంటే ఏమిటని అడిగితే, ఆయన దేవుని మీద ప్రమాణంచేసి "లహ్వల్‌హదీస్ అంటే పాటలు (సంగీతం)" అని మూడుసార్లు నొక్కి చెప్పారు. (ఇబ్నె జరీర్, బైహఖి)

"పాటలుపాడే స్త్రీలను అమ్మడం-కొనడం, వారి వ్యాపారం చేయడం ధర్మసమ్మతం కాదు" అన్నారు దైవప్రవక్త (స)- (తిర్మిజి). ఆయన మరో సందర్భంలో "పాటలు పాడే బానిసస్త్రీ సభలో కూర్చొని, ఆమె పాటలు వినేవాడి చెవిలో ప్రళయ దినాన కరిగిన సీసం పోయబడుతుంద"ని అన్నారు. (అహ్‌కాముల్ ఖుర్ఆన్-ఖాజీ అబూబకర్)

ఈనాడు ఆర్ట్ పేర అశ్లీలాన్ని వ్యాపింపజేస్తూ, కల్చరల్ ప్రోగ్రాం పేర అర్ధనగ్న విన్యాసాల్ని ప్రదర్శిస్తూ జీవిత ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టిని మరలింపజేసే వ్యర్థ కార్యకలాపాలన్నీ 'లహ్వల్ హదీస్' క్రిందికే వస్తాయి.

"మీ బానిస మహిళలు శీలవతులుగా ఉండదలచుకున్నప్పుడు, ప్రాపంచిక ప్రయోజనాల కోసం వారిని మీరు బలవంతంగా పడుపు వృత్తిలోకి దించకండి. వారిని ఎవరైనా బలవంతంగా అలా మార్చితే ఆ బలాత్కారం తరువాత వారి విషయంలో దేవుడు ఎంతో క్షమించేవాడు, కరుణించేవాడు (అవుతాడు)." (ఖుర్ఆన్-24:33)

దేవుడు తన ప్రవక్త (స)కు పితృలోకంలో పాపాత్ములు అనుభవించే యాతనలు చూపించడానికి ఇద్దరు దైవదూతలను పంపిస్తాడు. దైవప్రవక్త (స) వారిద్దరి వెంట బయలుదేరుతారు. మిష్కాత్‌లోని ఒకహదీసు ప్రకారం ఆ పాపాత్ములలో వ్యభిచారం చేసిన స్త్రీపురుషులు అనుభవించే సమాధియాతన ఇలా ఉంటుంది:

"మేము ముందుకు నడిచాము. అలా మేము ఒక బిలం దగ్గరకు చేరుకున్నాం. ఆ బిలం నేలలో పాతబడిన మట్టిపొయ్యిలా ఉంది. దాని పైభాగం సన్నగా, క్రింది

భాగం వెడల్పుగా ఉంది. అందులో అగ్ని మండుతోంది. ఆ అగ్నిజ్వాలలో దిశమొలలతో ఉన్న కొందరు స్త్రీలు, పురుషులు కాలిపోతున్నారు. ఆ అగ్నిజ్వాలలు పెకి ఎగిసినప్పుడల్లా వాటితో పాటు ఆ స్త్రీలు, పురుషులు కూడా పైకి లేస్తున్నారు. మరికాస్తయితే వారు ఆ పొయ్యి నుండి బయట పడిపోయేవారు. కాని అంతలోనే అగ్ని జ్వాలలు క్రిందికి పోవడం, వాటితోపాటు వారు కూడా పొయ్యిలో క్రిందికి జారిపోవడం జరుగుతోంది. నేను ''ఏమిటీ వ్యవహారం?'' అనడిగాను. దానికి వారు ''ముందుకు నడవండి (తరువాత చెబుతాం)'' అన్నారు..... ఆ తరువాత వారు ఆ స్త్రీపురుషులు వ్యభిచారులని తెలియజేశారు.'' (మిష్కాత్)

అలాగే మేరాజ్ (సప్తాకాశాల పర్యటన) సందర్భంగా దైవప్రవక్త (సల్లం) వ్యభిచారులు అనుభవించే శిక్షను ఈ విధంగా ఉన్నట్లు చూశారు:

“ఒకచోట కొందరు స్త్రీపురుషులు ఉన్నారు. వారికి ఒక వైపు రుచికరమైన ఘుమఘుమలాడే మంచి మాంసం ఉంది. మరోవైపు కుళ్ళి కంపుకొడ్తున్న మాంసం ఉంది. అయితే ఆ వారు మంచి మాంసం వదిలేసి కంపుకొడ్తున్న మాంసం తింటున్నారు. వీళ్ళెవరని అడిగితే, ‘వీళ్ళు ధర్మసమ్మతమైన భర్తలను, భార్యలను వదలి నిషేధితాలతో తమ కోరికలు తీర్చుకునే స్త్రీ పురుషులు’ అని చెప్పారు జిబ్రీల్ (అలైహి).”

హిందూ మతగ్రంథాలలో కూడా వ్యభిచారులకు విధించే శిక్షలను గురించి ఇలా ప్రస్తావించబడింది:

“అగమ్య’ స్త్రీ లేక పురుషునితో సంభోగించేవారిని కొరడాలతో కొడుతూ ‘తప్పృసర్మి’ అనే నరకంలోకి తీసికెళ్ళి పడవేస్తారు. ఆ తర్వాత ఎర్రగా కాలుతున్న ఇనుప విగ్రహాలకు వారిని కట్టిపడేస్తారు. అక్కడ వారు కాలుతూఉంటారు...” (శ్రీమద్‌భాగవతం-5:26)

“ఎవరైతే ఒక వ్యక్తిని మోసగించి అతని భార్యను వలలో వేసుకుంటాడో అతణ్ణి యమదూతలు అంధకార నిలయమైన నరకంలో పడవేస్తారు. అందులో పడిన మనిషి బాధతో మూల్గుతాడు. అతనక్కడ వెంటనే గ్రుడ్డివానిగా, పిచ్చివానిగా మారిపోతాడు. ఇంకా అతడు మొదలు నరికిన మ్రానులా పడిపోతాడు.” (దేవీ భాగవతం: 8:5-6)

## 35. మద్యనిషేధం

ఖుర్‌ఆన్ మూడుసార్లు ఆదేశాలిస్తూ మద్యం, మత్తుపదార్థాలను అంచెలవారిగా నిషేధించింది. మొదటి ఆదేశం “వారు నిన్ను మద్యం, జూదాలను గురించి అడుగుతున్నారు. ఈ రెండిటిలోనూ ఎంతో నష్టముందని చెప్పు. వీటిలో ప్రజలకు కొన్ని లాభాలున్నా ఆ లాభాలకన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి” అని 2:219 సూక్తిలో వచ్చింది. అందులో మద్యం నష్టదాయకమైనదని, దేవునికి అయిష్టమైనదని మాత్రమే చెప్పబడింది. ఆనాటి నుంచే కొందరు ముస్లింలు మద్యసేవనం మానుకున్నారు.



అయితే చాలామంది మానుకోలేదు. వారు ఒక్కొక్కసారి మద్యం మత్తులో ఉండే నమాజు చేస్తుండేవారు. దానివల్ల నమాజులో ఏకాగ్రతకు భంగం కలిగి వారు ఒక దానికి బదులు మరొకటి పఠిస్తుండేవారు. అంచేత మైకంలో ఉన్నప్పుడు నమాజ్ చేయకూడదని ఇలా ఆదేశించడం జరిగింది: “విశ్వాసులారా! మీరు మైకంలో ఉన్నప్పుడు ప్రార్థన దరిదాపులకు పోకండి. ప్రార్థనలో మీరు పఠిస్తున్నదేమిటో మీకు తెలుస్తున్నప్పుడే ప్రార్థన చేయాలి” (4:43)

ఈ ఆదేశంతో చాలామంది మద్యసేవనం మానుకున్నారు. అలవాటు మానుకోలేకపోయిన కొందరు నమాజు వేళలు తప్పించి మద్యం సేవిస్తుండేవారు. ఆ తరువాత కొంతకాలానికి 5:90,91 సూక్తులలో మద్యాన్ని పూర్తిగా నిషేధించడం జరిగింది. దీంతో పాటు ఇతర మత్తుపదార్థాలన్నీ నిషేధించబడ్డాయి.

“విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం – ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థకమవుతుంది. మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీ మధ్య విరోధం, విద్వేష బీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి.” (ఖుర్‌ఆన్–5:90)

ఈఆదేశం వెలువడిన తర్వాత మద్యం నిషేధించబడిందని, ఇక నుండి ఎవరూ మద్యం ముట్టడంగాని, అమ్మడంగాని చేయకూడదని దైవప్రవక్త (స) ఒక బహిరంగ ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ముస్లింలంతా తమ తమ ఇండ్లలో ఉన్న మద్యాన్నంతటినీ వీధుల్లోకి తెచ్చి పారబోశారు. ఆరోజు మదీనా వీధుల్లో మద్యం ఏరులై ప్రవహించింది. సారాఅంగళ్ళు శాశ్వతంగా కనుమరుగై పోయాయి.

మత్తు కలిగించే ప్రతి వస్తువూ మద్యం క్రిందికే వస్తుంది. అలాంటి దాన్ని సేవించడం, అమ్మడం, కొనడం నిషిద్ధం.

కొందరు మద్యం గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావిస్తూ “దీన్ని యూదులకు కానుకగా ఇవ్వచ్చా?'' అనడిగారు. దానికి దైవప్రవక్త (స) ''మద్యాన్ని నిషేధించినవాడు(దేవుడు) దాన్ని ఇతరులకు కానుకగా ఇవ్వడాన్ని కూడా నిషేధించాడు'' అన్నారు. మరొకతను దీన్ని మందుగా వాడుకోవడానికి అనుమతివ్వమని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) అనుమతి నిరాకరిస్తూ “అది మందు కాదు, వ్యాధి” అన్నారు.

వేరొకతను వచ్చి ''దైవప్రవక్తా! మేము తీవ్రమయిన చలి ఉండే ప్రాంతంలో ఉంటున్నాం. కాయకష్టం కూడా ఎక్కువగా చేయవలసి వస్తుంది. మద్యం వల్ల మాకు కాస్త సేద తీరుతుంది. చలికి తట్టుకునే శక్తి కూడా వస్తుంది” అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ''మీరు తాగే ఆ పానీయం వల్ల మత్తు కలుగుతుందా?''అని అడిగారు. దానికా వ్యక్తి “కలుగుతుంది” అన్నాడు. “అయితే దాన్ని మానుకోవాల్సిందే”

అన్నారు దైవప్రవక్త (స). "కాని మా ప్రాంతం జనం ఒప్పుకోరే ఎలా?" అన్నాడా వ్యక్తి. "ఒప్పుకోకపోతే వారితో యుద్ధం చేయండి" అన్నారు దైవప్రవక్త (స).

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) హజ్రత్ అబూమూసా అష్అరి (రజి), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి)లను యమన్ దేశానికి (పాలకులుగా) పంపేటప్పుడు వారికి ఇలా ఉపదేశించారు: "(ప్రజలకు) సౌలభ్యాలు కలగజేయండి. (వారిని) కాఠిన్యాలలోకి నెట్టకండి. శుభవార్తలు విన్పించండి, ద్వేషం కలిగించకండి. పరస్పర సహకారంతో మెలగండి, సంతోషంగా ఉండండి."

ఆ సందర్భంలో అబూమూసా (రజి) "దైవప్రవక్తా! మా ప్రాంతంలో బార్లీతో ఒక విధమైన సారాయి తయారుచేస్తారు. తేనెతో 'బితా' అనే మరో విధమైన సారా కూడా తయారుచేస్తారు. (వీటిగురించి మీ అభిప్రాయం ఏమిటీ)?" అనడిగారు. దానికి ఆయన "మత్తు కలిగించే ప్రతి వస్తువూ నిషిద్ధమే" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఈ హదీసులో మత్తు కలిగించే మద్యం మాత్రమే నిషిద్ధమని ఉంది. కాని వేరొక హదీసుని బట్టి ఏ మద్యం అధిక పరిమాణం మత్తు కలిగిస్తుందో ఆ మద్యం అల్ప పరిమాణం కూడా నిషిద్ధమేనని స్పష్టంగా తెలుస్తోంది. (ఇమామ్ నవవీ-రహ్మాలై)

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (సల్లం) సారాయికి సంబంధించిన పన్నెండు మంది వ్యక్తులలో పది (10) మందిని శపించారు. వారు-(1) సారాయి పిండే వాడు (అంటే తయారుచేసేవాడు), (2) దాన్ని పిండించేవాడు (తయారు చేయించే వాడు, (3) దాన్ని తాగేవాడు, (4) మోసేవాడు, (5) మోసేవాడి నుంచి తీసుకునే వాడు, (6) దాన్ని తాగించేవాడు, (7) దాన్ని అమ్మేవాడు, (8) దాని ధర తినేవాడు, (9) దాన్ని కొనేవాడు, (10) ఎవరి కోసం కొంటే అతను." (తిర్మిజి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (స) కాలంలో మద్యం సేవించినవాడికి శిక్షగా గరిష్ఠ స్థాయిలో నలభై వరకు కొరడా దెబ్బలు కొట్టడం జరిగేది. హజ్రత్ అబూబకర్ (రజి) పాలనా కాలంలో నలభై కొరడాదెబ్బల శిక్షే ఉండేది. హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలం తొలిరోజుల్లో కూడా నలభై కొరడాదెబ్బల శిక్షే ఉండేది. కాని దానివల్ల సారాయి త్రాగేవారు తమ అలవాటు మానుకోలేక పోయారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇతర నాయకు లతో సంప్రదించి ఈశిక్షను ఎనభై కొరడాదెబ్బలకు పెంచారు. ఇమామ్ మాలిక్ ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై)లు ఎనభై కొరడాదెబ్బల శిక్షనే నిర్ణయించారు. హజ్రత్ ఉమర్ (రజి) పాలనలో రూయషిద్ అనే వ్యక్తి రహస్యంగా సారాయి అమ్ముతున్న కారణంగా అతని దుకాణాన్ని కాల్చివేయడం జరిగింది.

దైవప్రవక్త (స) ఈవిధంగా పేర్కొన్నారు: "నా ప్రభువు ప్రమాణం చేసి ఇలా అన్నాడు- 'నాదాసులలో ఎవరైనా సారా తాగితే, ఎంత సారా తాగివుంటే అంత చీము (నరకంలో) నేనతనికి తాగిస్తాను. అలాగే నా దాసులలో ఎవరైనా నాకు భయపడి



మద్యపానం మానుకుంటే, అతనికి నేను (స్వర్గంలో) పరిశుద్ధ కోనేరులలోని (మద్యం, మకరందం, పాలు వగైరా) పానీయాలు తాగిస్తాను." (అహ్మద్)

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) మద్యం గురించి ప్రస్తావిస్తూ "మద్యసేవనానికి అలవాటు పడి అదే స్థితిలో చనిపోయిన మనిషికి దేవుడు (నరకంలో) గౌతా సెలయేటి పానీయం తాగిస్తాడు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "గౌతా సెలయేరు అంటే ఏమిటీ దైవప్రవక్తా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) గౌతా సెలయేరు అంటే వ్యభిచార స్త్రీపురుషుల మర్మావయవాల నుండి వెలువడే ద్రవాలు కలిగిన సెలయేరు అన్నమాట" అని చెప్పారు. (అహ్మద్)

హిందూమత గ్రంథాలలో కూడా మద్యపానం సేవించినవారికి నరకశిక్షలు పడతా యని ఉంది. కాని దేవతలే సురపానం చేయగా లేనిది మనం తాగితే తప్పేముంది అని చెబుతూ చాలామంది మద్యసేవనాన్ని ధర్మసమ్మతం చేసుకున్నారు. మరి దేవతలు చేసే పనులన్నీ మానవులు చేస్తున్నారా అని అడిగితే వారి దగ్గర సమాధానం ఏముందో తెలియదు. అలాంటివారు శ్రీమద్‌భాగవతంలోని ఈ సూక్తిని గమనించాలి:

"ఏ బ్రాహ్మణ, క్షత్రియులు, వైశ్యులు లేక వారి స్త్రీలయినా ఎలాంటి జంకు లేకుండా మద్యాన్ని సేవిస్తారో వారిని 'అయఃపానం'అనే నరకంలో పడవేసి వారి నోటిలో కరిగిన ఇనుప రసం పోస్తారు యమదూతలు...." (శ్రీమద్‌భాగవతం-5:26)

# 36. జూదం, మట్కా, లాటరీలు

పోతే జూదం కూడా ఘోరమైన పాపకార్యమే. ఇందులో అనేకమంది వ్యక్తుల డబ్బు ఎలాంటి శ్రమ లేకుండానే ఒక వ్యక్తికి లభిస్తుంది. ఈనాటి మట్కా, లాటరీలు, వ్యాపారస్థులు నడిపే కొన్ని రకాల స్కీములు కూడా జూదం క్రిందికే వస్తాయి.

ఖుర్‌ఆన్ అవతరణకు పూర్వం అరబ్ సమాజంలో పేరుకుపోయి ఉన్న అనేక రుగ్మతలలో "జూదం" కూడా ఒకటి. ఖుర్‌ఆన్ అవతరణ కాలంలో మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇతర రుగ్మతలతో పాటు జూదాన్ని కూడా నిషేధించారు. పాచికల ద్వారా, పేకాటద్వారా, చదరంగం ద్వారా, పశుపక్షుల పందేల ద్వారా, లాటరీ ద్వారా, మరెలాంటి పద్ధతి ద్వారానైనా సరే పదిమంది జేబులు ఖాళీచేసి ఒక్కడి జేబును నింపే జూదాన్ని ఇస్లాం శాశ్వతంగా అంతమొందించింది.

"విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం - ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థక మవుతుంది. మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీ మధ్య విరోధం, విద్వేష బీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి." (ఖుర్‌ఆన్-5:90)

పాచికల ద్వారా జోస్యం చెప్పడమనేది అజ్ఞానకాలం అరబ్బుల్లో ఉండే మూఢ నమ్మకం. జాతకం, జోతిష్యం, వారఫలాల పేరుతో ఈనాడు కూడా అనేకమంది ఈ జాడ్యానికి గురవుతున్నారు.

జూదంలో ప్రధానాంశం శ్రమ, వ్యాపారం ఏమీ లేకుండా గిమ్మిక్కుల ద్వారా అనేకమంది వ్యక్తుల ధనాన్ని దోచి ఒక్కడికి కట్టబెట్టే అక్రమ సంపాదనే. డబ్బు లేదా మరేదైనా విలువగల వస్తువుల ప్రమేయం లేకుండా ఏఆట ఆడినా పర్వాలేదు. కాక పోతే అవి కాలహరణక్రీడల క్రిందికి వస్తాయి. కాని కాలహరణక్రీడలు కూడా సృష్టికర్తను, ఆయన ప్రవక్త (స)ను దృఢంగా విశ్వసించే ధర్మపరాయణులకు శోభించవు.

అహ్కాముల్ ఖుర్ఆన్ రచయిత ఖాజీ అబూబకర్ ఇలా పేర్కొన్నారు:

“లాభ నష్టాలకు సంబంధించిన అత్యాశ, భయాల ప్రాతిపదికపై చేపట్టే ప్రతి వ్యవహారమూ జూదం క్రిందికే వస్తుంది.”

“అజ్ఞానకాలంలో ప్రజలు ధనంతో పాటు తమ భార్యలను కూడా జూదం, పందేల కోసం ఉపయోగించేవారు. ఆ కాలంలో ఇవన్నీ ధర్మసమ్మతంగానే చలామణి అయ్యేవి. గెలుపు ఓటముల ప్రాతిపదికపై ఈ వ్యవహారాలన్నీ నడిచేవి. అంటే ఫలానా విషయంలో “నీవు గెలిస్తే నేను నీకు ఇంత సొమ్ము ఇస్తాను. ఓడిపోతే అంత సొమ్ము నీవు నాకు ఇవ్వాల్సి ఉంటుంది. లేదా ఈ ఆటలో నీవు గెలిస్తే నా భార్యను నీకిస్తాను. నేను గెలిస్తే నీ భార్యను నాకు అప్పగించాలి” అని పందేలు పెట్టుకుంటారు.

“ఇస్లాం ధర్మశాస్త్రం క్రయవిక్రయాలకు, దానధర్మాలకు సంబంధించిన వ్యవహారాలకు మాత్రమే అనుమతి ఇచ్చింది. పందెం షరతుపై చేసుకునే ప్రతి ఒప్పందం మిథ్య, మాయ మాత్రమేనని ధర్మశాస్త్రం పేర్కొన్నది. అంతేకాదు, ఫలానా మనిషి ఈ దేశం వీడిపోవాలి లేదా వేరే దేశంలో ఉన్న ఫలానా మనిషి ఇక్కడికి వచ్చేయాలి అనే షరతుపై ఈ వస్తువును అమ్ముతానని; లేదా వర్షం కురిస్తే ఫలానా వస్తువును నీకు బహూకరిస్తానని షరతు విధించడం మొదలైనవన్నీ అధర్మకార్యాలే...”

ఇలా గెలుపు, ఓటముల ఆధారంగా జరిగే ఈ వ్యవహారాలన్నిటిపై ప్రతివ్యక్తికీ తనకు లాభం వస్తుందనే ఆశతోపాటు నష్టపోతాననే భయం కూడా పట్టిపీడిస్తుంది. తత్ఫలితంగా ఇందులో మోసం, వంచన, అహంకారాలతో పాటు ఇరువురి మధ్య విద్వేషం, విరోధ భావాలు జనించే అవకాశం కూడా ఎంతో ఉంటుంది. చివరికి ఇది పరస్పరం జగడాలకు, హత్యలకు కూడా దారితీస్తుంది. ఈ కారణంగానే ఇస్లాం వంచన, విద్వేషం, విరోధభావాలకు దారితీసే జూదపు విధానాలన్నిటినీ నిషేధించింది.”

మానవుల బద్ధశత్రువైన షైతాన్ మనిషిలో రక్తంలా ప్రవహిస్తూ అక్రమ(అధర్మ) వ్యవహారాలను సక్రమ(ధర్మ) వ్యవహారాలుగా చూపించి లేనిపోని భ్రమలు కల్పిస్తాడు.



కొత్తకొత్త పేర్లతో, ప్రకటనలతో ఆశల గుర్రాలపై ఎక్కించి వదలిపెడ్తాడు. ఆ పేర్లు, ప్రకటనలేమిటో కాస్త పరిశీలిద్దాం:

(1) వివిధ ఫైనాన్స్‌కంపెనీలు, ప్రభుత్వసంస్థలు రకరకాల పేర్లతో ప్రైజ్‌బాండ్స్, సేవింగ్స్‌స్కీముల ద్వారా పెట్టుబడుల్ని అభివృద్ధిచేసే పథకాలు. మట్కాలు, లాటరీల ద్వారా పెట్టుబడులకు భద్రత చేకూర్చడంతోపాటు ధనికులుగా చేసే కార్యక్రమాలు.

(2) వివిధ రకాల సేవింగ్స్ సర్టిఫికెట్‌లు. వీటిని కొనడం వల్ల స్కీమ్ ప్రకారం ప్రతి నెలా లాభాలతో పాటు ప్రతి మూడు నెలలకో లేదా ప్రతి ఆర్నెలలకో చీటి లేక లాటరీ వేసి అందులో పేరు వస్తే లక్షలాది రూపాయల బహుమానాలు లభిస్తాయని చేసే ప్రకటనలు కూడా ఉన్నాయి.

(3) వివిధరకాల వర్తకులు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోడానికి, అత్యధిక లాభాలు గడించడానికి స్కీముల ద్వారా, వాయిదా పద్ధతుల ద్వారా తమ వస్తువుల్ని విక్రయిస్తారు. ఈ స్కీముల్లో రెండు విషయాలు ప్రజలను సహజంగానే ఆకర్షిస్తాయి. ఒకటి, కొనదలచిన వస్తువు కోసం ఒకేసారి మొత్తం ధర చెల్లించనవసరం లేకుండా నెలకో, రెండు నెలలకో ఇంతని విడతల (Instalments) ద్వారా పైకం చెల్లించడం. రెండు, నిర్ణీత విడతలన్నీ పూర్తికాక ముందే ఏ విడత తరువాతైనా చీటి లేదా లాటరీ ద్వారా వస్తువు లభించవచ్చు అన్న ఆశను కల్పించడం. విడతల ద్వారా పైకం కట్టాలి కనుక ఆ వస్తువు అసలుధర కంటే ఎంతో ఎక్కువధర కలిగివుంటుంది. మధ్యలో ఏదైనా ఒక విడత పైకం కట్టకపోతే దానికి కొంత పెనాల్టి కట్టవలసి ఉంటుంది.

ఈ కంపెనీలు తమ ఖాతాదారుల పేరున లాటరీలు నిర్వహిస్తారు. ఈ లాటరీలో ఎవరి పేరు వస్తుందో అతనికి అప్పటివరకు చెల్లించిన విడతల పైకంతోనే వస్తువు లభిస్తుంది. దానికోసం మిగిలిన విడతల ద్వారా పూర్తి పైకం కట్టనవసరం లేదు. ఒకవేళ ఆ ఖాతాదారుడు ఆ వస్తువును తీసుకోకపోతే దాని ఖరీదును నగదు రూపంలోనైనా ముట్టజెబుతాయి కంపెనీలు.

(4) కొన్ని బూటకపు సంస్థలు కంపెనీల షేర్లు అమ్మకం, కొనుగోళ్ళు నిర్వహిస్తూ లాభాలు ఇస్తామని ప్రకటిస్తాయి. మరికొన్ని సంస్థలు లాటరీల ద్వారా లక్షలాది రూపాయల బహుమతులు ప్రదానం చేసే పథకాలు చేపడ్తాయి. ఇలా రకరకాల బాండ్లు, లాటరీలు, స్కీములు, పజిళ్ళు మొదలైనవన్నీ జూదం, వడ్డీ వ్యవహారాలకు సంబంధిం చినవే కనుక ఇవన్నీ ఇస్లాంలో అధర్మం, అక్రమం, నిషిద్ధం. జూదం ఎంత తీవ్రమైన విషయమో ఈ క్రింది హదీసులో గమనించండి:

మహాప్రవక్త (సల్లం) మహితోక్తి :- “ఎవరైనా తన స్నేహితుడ్ని జూదం ఆడదాం రమ్మని పిలిస్తే దానికి అతను పాపపరిహారం చెల్లించవలసి ఉంటుంది.” అంటే కొంత పైకం పేదలకు దానం చేయాలి.

# 37. దోపిడి, దొంగతనం

ఇస్లామీయ రాజ్యంలో నేరస్థులకు విధించే శిక్షలు చాలా ఘోరంగా ఉంటాయన్న ఒక అపోహ ప్రజలలో ఉంది. సాధారణంగా మనిషికి కావలసిన కనీసవసరాలు సమకూరినప్పుడు దొంగతనానికి పాల్పడవలసిన అవసరముండదు. ఆర్థిక న్యాయంతో పాటు సర్వత్రా శాంతిభద్రతలు నెలకొన్న ఇస్లామీయ రాజ్యంలో ఒకవేళ ఎక్కడయినా మనిషి గత్యంతరంలేని పరిస్థితిలో కడుపుమంట చల్లార్చుకోవడానికి ఒక రొట్టెముక్క దొంగతనం చేస్తే దానికి ఎలాంటి శిక్ష ఉండదు. పైగా ఇస్లామీయ రాజ్యం మనిషికి అలాంటి పరిస్థితి కలగడానికి కారణం ఏమిటో పరిశోధించి దాన్ని నివారించడానికి ప్రయత్నిస్తుంది. అంతేగాని దొంగతనం ఎలాంటిదైనా దొంగతనమే అనే ధోరణిలో ప్రవర్తించి శిక్షలు విధించదు.

కనీసవసరాలకు మించిన సుఖాల కోసం దొంగతనాన్ని వృత్తిగా చేసుకునేవారిని ఇస్లామీ ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించదు. ఇది మనిషిలో నేరప్రవృత్తిని సూచించే, తోటిపౌరుల హక్కులను కొల్లగొట్టే తీవ్రమైన విషయం. ఇలాంటి నేరస్థులకు కఠిన శిక్షలు విధించినప్పుడే దేశంలో దొంగతనాలు తగ్గుముఖం పడ్తాయి. గతకాలంలో పనిచేసిన ఇస్లామీయ ప్రభుత్వాలు కఠినశిక్షల ద్వారానే నేరాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలిగాయి. కఠినశిక్షల భయం వల్లనే ప్రజలు నేరాల జోలికి పోకుండా ఉండగల్గుతారు. దైవభీతి పరాయణులైన ప్రజలయితే 'ప్రపంచ పోలీసుల కళ్ళుగప్పగలం గాని, పరలోకపోలీసుల (అంటే ఎల్లప్పుడూ మనిషిని వెన్నంటి ఉండే ఇద్దరు దైవదూతల) కళ్ళు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ కప్పి తప్పించుకోలేమని కూడా నమ్ముతారు. ఇలాంటి విశ్వాసులు దొంగతనం భావాన్ని తమ మనసులోకే రానివ్వరు.

"స్త్రీ అయినా, పురుషుడైనా దొంగతనం చేస్తే ఇద్దరికీ చెయ్యి నరికివేయండి. ఇది వారు సంపాదించుకున్న దానికి ప్రతిఫలం. దేవుని తరపున కనువిప్పు కలిగించే శిక్ష ఇది. దేవుడు సర్వాధికారి, సర్వశక్తిమంతుడు. ఆయన ఎంతో వివేకవంతుడు కూడా. అయితే తప్పు చేసిన తరువాతయినా పశ్చాత్తాపం చెంది తమ నడవడిక సరిదిద్దుకుంటే, దేవుడు గొప్ప క్షమాశీలి, అపార కృపాశీలుడని తెలుసుకోండి." (ఖుర్ఆన్–5:38)

దొంగకు శిక్షగా ఒకచేయి మాత్రమే నరకవలసి ఉంటుంది. ఇస్లామీయ రాజ్యంలో సర్వత్రా "ఆర్థికన్యాయం" నెలకొన్న తర్వాతనే హస్తఖండన శిక్షలు అమలు జరపాలి. అయితే (యుద్ధంలో వాడే) ఒక డాలు విలువకు లోపు వస్తువుని దొంగిలిస్తే చేతిని నరకకూడదని దైవప్రవక్త (స) అన్నారు. అలాగే పండ్లు, కూరగాయలు, ఆహార వస్తువుల్ని (పరిమిత స్థాయిలో) దొంగిలించినా హస్తఖండన శిక్ష ఉండదని చెప్పారు. ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) ప్రకారం పండ్లు, కూరగాయలు, మాంసం, వండిన ఆహారం, నూర్పిడికాని ధాన్యం, ఆటవస్తువులు, వాయిద్య పరికరాలు వగైరా విషయంలో హస్తఖండన శిక్ష లేదు. అయితే వీటికి తేలికపాటి శిక్షలు ఉంటాయి.



దైవప్రవక్త (స) ప్రవచనం: "సొంత ఆస్తిని కాపాడుకునే ప్రయత్నంలో (దోపిడీ దొంగలచేత) చంపబడిన మనిషి అమరగతి (వీరమరణం) పొందుతాడు." (బుఖారి)

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: "దేవుడు వాగ్దానం చేసిన ప్రతి వస్తువూ మీకు లభిస్తుంది. కాని నా దగ్గరకు నరకం తేబడింది. నేను దాని వేడి భరించలేక వెనక్కి తగ్గుతున్నప్పుడు మీరు నన్ను చూశారుకదా! నేనా నరకంలో వంకరతల కర్ర (గొడుగుకర్ర) మనిషిని చూశాను. అతను నరకంలో తన పొట్టలోని పేగులు లాక్కుంటున్నాడు. అతను (ఇహలోకంలో ఉన్నప్పుడు తన కర్రతో హజ్‌యాత్రికుల వస్తువుల్ని దొంగిలిస్తుండేవాడు. ఒకవేళ పట్టుబడితే 'నా వంకరతల కర్ర ఆ వస్తువులో ఇరుక్కుపోయింది' అని చెప్పేవాడు. పట్టుబడకపోతే ఆ వస్తువును తీసుకునేవాడు." (ముస్లిం-మిష్కాత్)

# 38. మరికొన్ని అధర్మ సంపాదనలు

హజ్రత్ అబూమస్‌వూద్ అన్సారీ (రజి) కథనం: "కుక్క ధరను, వ్యభిచార సంపాదనను, జ్యోతిష్కుని వేతనాన్ని దైవప్రవక్త (స) నిషేధించారు." (బుఖారి)

అత్యధికమంది ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం కుక్కలను కొనడం, అమ్మడం ధర్మసమ్మతం కాదు. వేట కుక్కనైనా, పెంపుడు కుక్కనైనా మరెలాంటి కుక్కనైనా సరే ఎవరైనా చంపితే దానికి నష్టపరిహారం కూడా లేదు. కాని ఇమాం అబూహనీఫా (రహ్మాలై) అభిప్రాయం ప్రకారం ప్రయోజనకరమైన కుక్కలను కొనడం, అమ్మడం ధర్మసమ్మతమే. వాటికి నష్టం కలిగిస్తే యజమానికి నష్టపరిహారం చెల్లించాలి.

ఈ అభిప్రాయాన్ని కొన్ని హదీసులు కూడా సమర్థిస్తున్నాయి. ఇక్కడ మచ్చుకు రెండు హదీసులను పేర్కొంటున్నాను:

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరైనా వేట కోసం లేదా పశురక్షణ కోసం తప్ప ఇతరత్రా ఉద్దేశాలతో కుక్కను పెంచితే అతని సత్కర్మల నుండి ప్రతిరోజూ రెండు యూనిట్ల చొప్పున పుణ్యం తగ్గుతూ ఉంటుంది." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఎవరైనా కుక్కను పెంచితే అతని సత్కర్మల నుండి ప్రతిరోజూ ఒక యూనిట్ చొప్పున పుణ్యం తగ్గుతూ ఉంటుంది. అయితే పొలాన్ని, పశువుల్ని కాపాడుకునేందుకు మాత్రం కుక్కను పెంచుకోవచ్చు." (బుఖారి, ముస్లిం)

వ్యభిచార సంపాదన పూర్తిగా అధర్మ సంపాదనే అని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అలాగే జ్యోతిష్యం, సోది, హస్తసాముద్రికం, జాతకం, వారఫలాలు చెప్పేవారి సంపాదన కూడా అధర్మ సంపాదనే. జ్యోతిష్కుల, హస్తసాముద్రికుల, భూతవైద్యుల

సంపాదనలను అరికట్టడం (అంటే ఆ సంపాదనా మార్గాలను నిషేధించడం) పాలకుల కర్తవ్యమని, అవసరమైతే అలాంటివారికి శిక్షలు కూడా విధించాలని హజ్రత్ ఖతాబీ (రహ్మలై) తన గ్రంథం "అహ్కాముస్సుల్తానియా"లో పేర్కొన్నారు.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: మక్కా జయించబడిన సంవత్సరం దైవప్రవక్త (సల్లం) మక్కాలోనే ఉన్నప్పుడు (ప్రజల్ని సంబోధిస్తూ) "సారాయిని, మృత పశువుని, పందిని, విగ్రహాల అమ్మకం-కొనుగోళ్ళను దేవుడు, దైవప్రవక్త నిషేధించారు" అని అన్నారు. (అప్పుడు ఒకతను లేచి) "దైవప్రవక్తా! మృతపశువు కొవ్వును మేము నౌకలకు పూతగా వాడతాము. దాంతో చర్మానికి పదును పెడ్తాము. ప్రజలు దాన్ని దీపాలు వెలిగించుకోవడానికి (నూనెగా) వాడుకుంటారు. మరి ఇలాంటి కొవ్వు విషయంలో మీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగాడు.

దానికి దైవప్రవక్త (స) "కాదు, అది నిషిద్ధం" అన్నారు. ఆ సందర్భంలో ఆయన "దేవుడు యూదుల్ని నాశనం చేయుగాక! మృతపశువు కొవ్వును దేవుడు నిషేధిస్తే వారు దాన్ని కరగబెట్టి అమ్ముకొని తినడం మొదలెట్టారు" అని అన్నారు. (బుఖారి)

ఈ హదీసులో "కాదు, అది నిషిద్ధం" అంటే కొవ్వును అమ్మడం ఎట్టి పరిస్థితిలో కూడా మంచిదికాదని అర్థం అన్నారు ఇమాం నవవీ (రహ్మలై). అంటే దాని వ్యాపారం మాత్రమే నిషిద్ధం, దానిద్వారా ప్రయోజనం పొందడం నిషిద్ధం కాదన్న మాట. ఇమాం షాఫయి (రహ్మలై), ఆయన అనుచరులు కూడా మృతపశువు కొవ్వు ద్వారా ప్రయోజనం పొందడం ధర్మసమ్మతమేనని తీర్పిచ్చారు. అంటే దాంతో ఓడలకు లేపనం పూయడం, దీపాలు వెలిగించుకోవడం వంటి పనులు ధర్మసమ్మతమే. ఈ కొవ్వును ఆహారంగా వాడటం, మానవ శరీరానికి రాయడం మాత్రమే నిషిద్ధం. అతా బిన్ రబాహ్, ముహమ్మద్ బిన్ జరీర్ తబ్రీ (రహ్మలై)ల అభిప్రాయం కూడా ఇదే.

అత్యధిక మంది ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం కొన్ని ప్రత్యేక పనులకు వాడటం తప్ప మృతపశువుల కొవ్వు ద్వారా ప్రయోజనం పొందడం ఎంతమాత్రం ధర్మసమ్మతం కాదు. ఉదాహరణకు పదును పెట్టిన చర్మం వగైరా వంటనూనె, నెయ్యి లాంటి ఆహార పదార్థాలతో కలిసి కలుషితమయిపోతే దాని ఆజ్ఞలు వేరుగా ఉన్నాయి. దీపాలు వెలిగించుకోవడానికి, ఆహారంగా ఉపయోగించడానికి, మానవ దేహానికి రాయడానికి తప్ప ఇతర పనుల కోసం కొవ్వును ఉపయోగించడం ధర్మ సమ్మతమే. సబ్బులతయారీ, పశువులదాణా కోసం కొవ్వు వాడకం విషయంలో సలఫీ ధర్మవేత్తలలో భిన్నాభిప్రాయాలున్నాయి.

కాని ఇమామ్ నవవీ (రహ్మలై) అభిప్రాయం ప్రకారం ధర్మసమ్మతమే. ఖాజీ అయాజ్ (రహ్మలై) తెలియజేస్తున్నట్లు ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి, సుఫియాన్ సూరీ, ఇమామ్ అబూహనీఫా (రహ్మలై), ప్రవక్త ప్రత్యక్ష అనుచరుల్లో (అంటే



సహాబీలలో) అనేకమంది అభిప్రాయం కూడా ఇదే. అపరిశుభ్రమైన నూనె అని ముందుగా తెలియజేసి దాన్ని అమ్మడం వారి దృష్టిలో ధర్మసమ్మతమే. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ఇమామ్ మాలిక్ బిన్ మాజుషూన్ (రహ్మలై) ల దృష్టిలో ఏ విధంగానైనా సరే కొవ్వు వాడకం ధర్మసమ్మతం కాదు.

ఎలాంటి అపరిశుద్ధ వస్తువునైనా అమ్మడం ధర్మసమ్మతం కాదని పండితుల అభిప్రాయం. యుద్ధంలో చనిపోయిన అవిశ్వాసి మృతదేహం, విగ్రహాలను అమ్మడం కూడా నిషిద్ధమే. అయితే విగ్రహాల ముక్కలను అమ్మే విషయంలో భేదాభిప్రాయం ఉంది. కొందరు అమ్మవచ్చని, మరికొందరు అమ్మకూడదని అన్నారు. కాని మృత పశువు, మద్యం, పందుల అమ్మకం పూర్తిగా హరాం (నిషిద్ధం) అనే విషయంలో ఎలాంటి భేదాభిప్రాయం లేదు.

(అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్‌వారి "మహాప్రవక్త మహితోక్తుల" నుండి)

## 39. అన్యాయం, దౌర్జన్యం

ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభం నుంచీ ఇస్లాం దేవుని హక్కులతో పాటు దాసుల హక్కులకు కూడా ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది. దాసుల హక్కులలో తల్లిదండ్రుల హక్కులు ప్రథమస్థానం వహిస్తాయి. ఆ తర్వాత అనాథల, నిరాధారుల (వికలాంగుల) హక్కులకే ప్రాధాన్యం ఇవ్వబడింది. ఈ క్రింది ఖుర్‌ఆన్ సూక్తులు చూడండి:

"ఎంత మాత్రం కాదు. మీరసలు అనాథను ఆదరించరు; పేదవాడికి పట్టెడన్నం పెట్టే విషయంలో ఒకర్నొకరు ప్రోత్సహించుకోరు. (బంధువుల బలహీనలతను ఆసరాగా చేసుకొని, వారికి దక్కవలసిన) వారసత్వపు ఆస్తినంతటినీ కాజేస్తున్నారు. మీరసలు ధనవ్యామోహం ఊబిలో పూర్తిగా కూరుకుపోయారు." (ఖుర్‌ఆన్-89:17-20)

"అనాథలకు రావలసిన ఆస్తులు వారికి ఇచ్చివేయండి. వారికి దక్కవలసిన మంచి సొమ్ముకు బదులు నాసిరకం సొమ్ము అప్పగించకండి. వారి ధనాన్ని మీ ధనంతో కలిపేసి (లెక్కాపత్రం లేకుండా) తినకండి. అలా చేయడం ఘోరమైన పాపం." (ఖుర్‌ఆన్-4:2)

"అనాథ బాలలకు పెళ్ళీడు వచ్చేవరకు వారి స్థితిగతులు గమనిస్తూ ఉండండి. ఆ తరువాత వారిలో తగిన యోగ్యతార్హతలు ఉన్నాయని మీకు అన్పిస్తే వారి ఆస్తిని వారికి అప్పగించండి. అంతేగాని, వారు పెద్దవారయిన తరువాత తమ (ఆస్తి) హక్కు అడుగుతారన్న భయంతో ముందుగానే వారి సొమ్మును (దుబారా చేస్తూ) త్వరత్వరగా తిని హరించి వేయకండి. (అనాథ) సంరక్షకుడు స్థితిపరుడయితే అలాంటి సొమ్ము జోలికే పోకూడదు. ఒకవేళ అతను పేదవాడయితే సముచితరీతిలో కొంత సొమ్ము వాడుకోవచ్చు. వారి ఆస్తి వారికి అప్పగించవలసి వచ్చినప్పుడు కొందరు సాక్షుల్ని కూడా పెట్టుకోండి. లెక్క తీసుకోవడానికి దేవుడు ఒక్కడే చాలు." (ఖుర్‌ఆన్-4:6)

దైవప్రవక్త (సల్లం) ఒక హదీసులో ఇలా ప్రవచించారు: "చేతివ్రేళ్ళు రెండు ఒక దానికొకటి అతి దగ్గరగా ఉన్నట్లు అనాథను పోషించే వ్యక్తి, నేను స్వర్గంలో పరస్పరం ఎంతో దగ్గరగా ఉంటాము." (బుఖారి)

మరొక హదీసులో ఆయన ఇలా అన్నారు: "ఏ ముస్లిం ఇంట్లో అనాథ పట్ల మంచిగా మసలుకోవడం జరుగుతుందో ఆ ఇల్లు ముస్లింల ఇండ్లన్నిటి కంటే ఎంతో శ్రేష్ఠమైనది. అలాగే ఏ ముస్లిం ఇంట్లో అనాథ పట్ల చెడుగా వ్యవహరించడం జరుగుతుందో ఆ ఇల్లు ముస్లింల ఇండ్లన్నిటి కంటే అతి చెడ్డ ఇల్లు." (ఇబ్నెమాజ)

ఉహుద్ యుద్ధం తరువాత హజ్రత్ సాద్ బిన్ రుబై (రజి) భార్య తన కుమార్తెలిద్దర్ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు. ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువుపెడ్తూ ఇలా అన్నారు: "దైవప్రవక్తా! వీళ్ళిద్దరూ సాద్ కుమార్తెలు. సాద్ మీతోపాటు ఉహుద్ యుద్ధంలో పాల్గొని అమరగతులయ్యారు. ఆ తరువాత ఈ బాలికల పినతండ్రి మా ఆస్తినంతటినీ స్వాధీనం చేసుకున్నాడు. వీరి కోసం ఒక్క పైసా వదలిపెట్ట లేదు. ఇలాంటి స్థితిలో ఈ బాలికల్ని ఎవరు పెళ్ళి చేసుకుంటారు?" దీన్ని గురించే ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు అవతరించాయి:

"ప్రజలు చనిపోతూ తమ పసిపిల్లలను నిస్సహాయ స్థితిలో వదలి వెళ్ళవలసివస్తే, ఆ తర్వాత వారి పరిస్థితి ఏమిటని ఆలోచించి భయపడాలి. కనుక వారు (ఇతరుల అనాథ బాలల విషయంలోనూ) దేవునికి భయపడుతూ సవ్యమైన మాటనే పలకాలి. అన్యాయంగా అనాథబాలల ఆస్తుల్ని తింటున్నవారు నిజానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు. వారు తప్పకుండా భగభగ మండే అగ్నిగుండంలో విసరి వేయబడతారు." (4:9,10)

అన్యాయపరులైన భూకబ్జాదారులను గురించి దైవప్రవక్త (స) ఇలా హెచ్చరించారు:

"ఇతరుల భూమిని ఏ కొంచెమైనా సరే అన్యాయంగా ఆక్రమించుకున్న వాడ్ని పాతాళలోకంలోకి దిగబడే వరకు భూమిలోకి అణచివేయడం జరుగుతుంది" అన్నారు దైవప్రవక్త (స). వేరొక ఉల్లేఖనంలో "ఎవరైనా అన్యాయంగా జానెడు భూమిని ఆక్రమించుకున్నా ప్రళయదినాన అతని మెడలో ఏడు భూముల కంఠపాశాన్ని వేయడం జరుగుతుంద"ని అన్నారు ఆయన. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూసల్మా (రజి) కథనం: (ఒక స్థలం విషయంలో) కొందరితో నాకు తగాదా వచ్చింది. నేనీ వ్యవహారాన్ని హజ్రత్ ఆయిషా(రజి) గారి ముందు ప్రస్తావించాను. ఆమె విని ఇలా అన్నారు: "అబూసల్మా! స్థలాల వ్యవహారానికి దూరంగా ఉండు. 'ఎవరైనా ఇతరులకు చెందిన స్థలాన్ని అన్యాయంగా ఒక జానెడు ఆక్రమించుకున్నా సరే, (ప్రళయదినాన) అతని మెడలో ఏడింతల భూపరిమాణం గల హారం (గుదిబండగా) వేయబడుతుంద'ని దైవప్రవక్త (స) సెలవిచ్చారు." (ముస్లిం, బుఖారి)



ఉర్వా బిన్త్ అవేస్ (అనే స్త్రీ) ఒకస్థలం విషయంలో తన యాజమాన్య హక్కును చాటుకుంటూ (దైవప్రవక్త-సల్లం స్వర్గవాసులవుతారని ప్రకటించిన పదిమంది ప్రముఖ అనుచరులలో ఒకరైన) హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి)కు వ్యతిరేకంగా మర్వాన్ బిన్ హకమ్ న్యాయస్థానంలో ఒక వ్యాజ్యం వేసింది. అప్పుడు హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) మాట్లాడుతూ "ఎవరైనా ఇతరులకు చెందిన ఒక జానెడు స్థలాన్ని ఆక్రమించు కున్నా ప్రళయదినాన భూమికి ఏడు రెట్ల పరిమాణం గల హారం చేసి అతని మెడలో (గుదిబండగా) వేయడం జరుగుతుంద"ని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. స్వయంగా నేనందుకు సాక్ష్యమిస్తున్నాను. అలాంటప్పుడు నేనామె హక్కును ఎలా కాజేయగలను?" అని అన్నారు. (బుఖారి)

ఈ హదీసు 'ముస్లిం' గ్రంథంలో మరింత వివరంగా వచ్చింది. హజ్రత్ సయీద్ బిన్ జైద్ ప్రవక్త ప్రవచనం వినిపించిన తరువాత న్యాయమూర్తి మర్వాన్ మాట్లాడుతూ "నేను మీ నుండి మరెలాంటి సాక్ష్యం అడగబోను" అని అన్నాడు. అదీగాక హజ్రత్ సయీద్ (రజి) ఆ స్థలాన్ని ఆ స్త్రీ ఉర్వాకు వదిలేశారు. అయితే ఆయన ఆ స్త్రీని శపిస్తూ "దేవా! ఈ స్త్రీ మాటలు అబద్ధమయితే ఈమె కళ్ళు పోగొట్టు. ఈ స్థలమే ఈమెకు సమాధి అవుగాక!" అని ప్రార్థించారు.

హదీసు ఉల్లేఖకుడు ఇలా తెలియజేస్తున్నాడు: "ఆ తరువాత ఆమె నిజంగానే అంధురాలయి పోయింది. గోడలు వెతుక్కుంటూ నడుస్తూ 'నాకు సయీద్ బిన్ జైద్ (రజి)గారి శాపం తగిలింది' అని చెబుతుండేది. చివరికి ఒకరోజు ఆమె అదే స్థలంలో కట్టుకున్న తన ఇంట్లో నడుస్తూ నూతిలో పడి చనిపోయింది. ఈవిధంగా ఆ ఇల్లే ఆమెకు సమాధి అయిపోయింది."

ఒకసారి దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో మాట్లాడుతూ "దరిద్రుడంటే ఎవరో మీకు తెలుసా?" అని అడిగారు. దానికి అనుచరులు "డబ్బు, ఇతర సంపదలు లేనివాడ్ని మేము దరిద్రుడని భావిస్తున్నాం" అని అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజాలు వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. అయితే అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరిపైనయినా అపవాదు లేపి ఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసి ఉంటాడు. ఎవరినైనా హత్యచేసి ఉంటాడు. ఎవరినైనా అన్యాయంగా కొట్టి ఉంటాడు.

అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారందరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారందరి హక్కులు పూర్తిగా నెరవేరక ముందే అతని పుణ్యకర్మలు అంతమయిపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది." (ముస్లిం)

# 40. భిక్షాటన నిషిద్ధం

దైవప్రవక్త (సల్లం) భిక్షాటనను గర్హిస్తూ ఇలా ప్రవచించారు:

"ఎల్లప్పుడూ ప్రజల దగ్గర అడుక్కుంటూ ఉండేవాడు ప్రళయదినాన ముఖాన ఒక్క మాంసపు తునకయినా లేనివాడయి (వికృత ముఖాకృతితో) వస్తాడు." (బుఖారి)

"ఉదయం, సాయంత్రం రెండు పూటలా తిండి ఉంచుకొని కూడా ముష్టెత్తే వాడు వాస్తవానికి తన కోసం అగ్ని సేకరించుకుంటున్నాడు." (హదీసు)

"లోకుల దగ్గర ముష్టెత్తడం కన్నా (అడవి నుండి) కట్టెల మోపు మోసుకొచ్చి అమ్ముకొని తినడం మనిషికి ఎంతో మేలు. అతనికి వారు ఏదైనా (దానం) ఇవ్వచ్చు లేదా ఇవ్వడానికి నిరాకరించనూ వచ్చు." (బుఖారి, ముస్లిం)

"నిరుపేద అంటే వీధుల వెంబడి తిరుగుతూ ఒకటి రెండు ముద్దలు అన్నం లేక ఒకటి రెండు ఖర్జూరపు పండ్లు అడుక్కునేవాడు కాదు. సిసలైన నిరుపేద అంటే ఇతరుల్ని అర్థించనవసరం లేనంత ఆర్థికస్తోమత లేనివాడు. అటు దానం చేయడానికి ప్రజల దృష్టిలో అతనంత పేదవాడిగా కూడా కన్పించడు. పైగా అతను ప్రజల ముందు దేబిరిస్తూ తిరగడు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) నాకేదైనా ప్రసాదిస్తున్నప్పుడు "దీన్ని అతనికివ్వండి. నాకంటే అతనికి దీని అవసరం ఎక్కువగా ఉంది" అని అనే వాణ్ని నేను. ఈ విషయం గురించి (ఓరోజు) దైవప్రవక్త (స) ప్రస్తావిస్తూ "అత్యాశకు పోకుండా ఉండి, అర్థించకుండానే మీకేదైనా సంపద లభిస్తే నిస్సంకోచంగా తీసు కోండి. అలా లభించకపోతే దాన్ని గురించి పట్టించుకోకండి" అని అన్నారు. (బుఖారి)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: కొందరు అన్సార్ ముస్లింలు దైవ ప్రవక్త (స) సన్నిధికి వచ్చి కొంత ధనం అర్థించారు. దైవప్రవక్త (స) వారికి కొంత ధనం ఇచ్చారు. కాని వారు మళ్ళీ అడిగారు. దైవప్రవక్త (స) రెండవసారి కూడా ఇచ్చారు. ఇలా ఇస్తూపోయారు. చివరికి ఆయన దగ్గర ఉన్నదంతా ఐపోయింది. అప్పుడాయన ఇలా అన్నారు- "నా దగ్గరున్న ధనసంపద (ఎంతయినా) మీ కివ్వడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. మీకు ఇవ్వకుండా నేను ఏదీ దాచుకోను. కాని (ఒక విషయం గుర్తుంచుకోండి.) దానం అడక్కుండా ఉండేవాడికి దేవుడు అలాంటి పరిస్థితి రాకుండా కాపాడుతాడు. నిరపేక్షా వైఖరి అవలంబించేవాడికి దేవుడు అక్కరలేనంతగా ప్రసాదిస్తాడు. సహనం వహించేవాడికి సహనశక్తి ప్రసాదిస్తాడు. (దైవానుగ్రహాలలో) సహనానికి మించిన మహాభాగ్యం మరేదీ లేదు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం)కు ఎవరైనా ఆహార పదార్థాలు సమర్పిస్తున్నప్పుడు "ఇది దానంగా ఇస్తున్నావా లేక కానుకగా ఇస్తున్నావా?"



అని అడిగేవారు ఆయన ఆ వ్యక్తిని. అతను గనక ఆ వస్తువుని దానంగా ఇస్తున్నానని చెబితే దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల్ని ఉద్దేశించి "దీన్ని మీరు తినండి" అని అంటారు. ఆయన మాత్రం దాన్ని ముట్టరు. ఒకవేళ అతను ఆ వస్తువుని కానుకగా ఇస్తున్నానని అంటే మాత్రం దైవప్రవక్త (సల్లం) దాన్ని స్వీకరించి, ఇతరుల్ని కూడా కలుపుకొని తినేవారు. (బుఖారి)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు:-

ఒకతను తానీ రోజు (రాత్రి) దానం చేస్తానని నిశ్చయించుకొని ఇంటి నుండి బయలుదేరాడు. అయితే అతను (తెలియక) ఒక దొంగకు దానంచేశాడు. మరునాడు ఉదయం జనం, ఒకతను రాత్రి ఒక దొంగకు దానం చేశాడని చెప్పుకోసాగారు. ఈ మాట విని "దేవా! సకల స్తోత్రాలకు నీవే అర్హుడివి" అన్నాడతను. తరువాత అతను తానీ రోజు (రాత్రి) మళ్ళీ దానం చేస్తానని సంకల్పించుకొని ఇంటి నుంచి బయలు దేరాడు. (కాని ఆరోజు కూడా తెలియక ఒక వేశ్య చేతికి దానం అందించాడు.)

మరునాడు ఉదయం జనం మళ్ళీ, ఒకతను రాత్రి ఒక వేశ్యకు దానం చేశాడని గుసగుసలాడుకున్నారు. అతనీ మాట విని "దేవా! సకల స్తోత్రాలకు నీవే అర్హుడివి. నా దానం ఒక వేశ్య చేతికి చిక్కింది" అని అన్నాడు. ఆ తరువాత తానీ రోజు (రాత్రి) మళ్ళీ దానం చేస్తానని నిశ్చయించుకొని బయలుదేరాడు. అయితే (ఆరోజు కూడా) అతను దానం ఒక ధనికుడి చేతిలో పెట్టాడు.

మరుసటి రోజు ఉదయం జనంలో, ఒకతను రాత్రి ఒక ధనికుడికి దానం చేశాడని గుసగుసలు బయలుదేరాయి. ఆ సంగతి తెలిసి "దేవా! సకల స్తోత్రాలకు నీవే అర్హుడివి. నా దానం ఒకసారి ఓ దొంగకు, మరోసారి ఒక వేశ్యకు దొరికింది. ఇప్పుడేమో ఒక ధనికునికి చిక్కింది. దేవా! ఏమిటీ వైపరీత్యం!!" అని అన్నాడు. ఆ తరువాత (రాత్రి) ఒక వ్యక్తి కలలో కన్పించి ఇలా అన్నాడు:

"(నీ దానం స్వీకరించబడింది.) దొంగ చేతికి లభించిన దానంవల్ల ఆ దొంగ దొంగతనాలు మానేయవచ్చు. వేశ్యకు దొరికిన దానంవల్ల ఆ వేశ్య తన వేశ్యవృత్తిని వదలిపెట్టవచ్చు. ధనికుడికి లభించిన దానంవల్ల ఆ ధనికుడు సిగ్గుపడి తనకు దేవుడు ప్రసాదించిన సంపదలో కొంత దైవమార్గంలో ఉపయోగించవచ్చు." (బుఖారి)

# 41. కష్టార్జితం

కష్టపడి ఆర్జించే సంపాదనను ఖుర్‌ఆన్, హదీసుల్లో ఎంతో ప్రశంసించడం జరిగింది. అయితే కష్టార్జితం పెట్టుబడి సంపాదనకు వ్యతిరేకంగా చెప్పిన విషయం కాదు. కష్టపడి సంపాదించడం, ఒకరి దగ్గర కూలిపని చేయడం అవమానకరమైన విషయం కాదని చెప్పడమే దీని అంతరార్థం. కనుక కష్టపడి పని చేయడం, కూలీపని చేయడం ఆత్మగౌరవానికి భంగకరమైన విషయంగా, నామోషిగా భావించకూడదు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒకసారి ఇలా చెప్పారు: "వేతనంపై మేకలు కాయకుండా ఉండని ఏ ప్రవక్తనూ దేవుడు ప్రభవింపజేయలేదు."

అనుచరులు ఈ మాట విని "దైవప్రవక్తా! మరి మీరు కూడా ఈ పని చేశారా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "నేను కొన్ని పైసల (వేతనం)పై మక్కావారి పశువులు కాసేవాడ్ని" అని అన్నారు. (బుఖారి)

మరొకసారి ఆయన కష్టార్జితం ఔన్నత్యం గురించి ప్రస్తావిస్తూ "తన చేతులతో కష్టపడి సంపాదించిన ఉపాధి కంటే శ్రేష్ఠమైన ఉపాధి తిన్నవారెవరూ లేరు. దైవప్రవక్త దావూద్ తన చేతులతో పనిచేసి ఉపాధి సంపాదించేవారు" అని అన్నారు. (బుఖారి)

ఎక్కువ సంపాదించాలన్న యావతో అక్రమపద్ధతులకు పాల్పడకుండా కొద్దిగానైనా కష్టపడి సంపాదించి తినడం ఎంతో మేలని ఈ హదీసులు తెలుపుతున్నాయి.

మన దేశాన్ని పాలించిన చక్రవర్తులలో నాసిరుద్దీన్ మహ్మూద్, ఔరంగజేబ్ (రహ్మలై)లు ప్రభుత్వ ధనాగారాలలోని ఒక్క పైసా కూడా ముట్టుకోకుండా కష్టపడి పని చేసి తమ కుటుంబాలను పోషించుకునేవారు.

దైవప్రవక్త (సల్లం) ప్రియ అనుచరుడు హజ్రత్ అబూబకర్ (రజి) బట్టలు అమ్మి కుటుంబాన్ని పోషించేవారు. దైవప్రవక్త (స) ఇహలోకం వీడిపోయిన తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) తొలి శ్రేష్ఠఖలీఫాగా ఎన్నికయ్యారు. అయితే ఆయన ఖలీఫా అయిన మరుసటి రోజే బట్టలమూట భుజాన వేసుకొని అమ్ముకోవడానికి బయలు దేరారు.

దారిలో హజ్రత్ ఉమర్ (రజి) ఎదురయి "ఏమిటి మీరు చేస్తున్న ఈ పని? ఈ బట్టల మూటేమిటీ?" అని అడిగారు. దానికి హజ్రత్ అబూబకర్ (రజి) "ఈ పని చేయకపోతే భార్యాపిల్లలను పోషించేదెలా?" అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "ఇప్పుడు మీమీద ముస్లింల నాయకత్వపు (పరిపాలనా) బాధ్యత వచ్చిపడింది. ఆ బాధ్యతతో పాటు ఈపని పొసగదు. పదండి, (ప్రభుత్వ కోశాధికారి) అబూఉబైదా (రజి)ను కలసి మాట్లాడుదాం" అన్నారు.

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి)ను వెంట బెట్టుకొని ప్రభుత్వ కోశాధికారి హజ్రత్ అబూఉబైదా (రజి)ని కలుసుకున్నారు. ఆయనతో మాట్లాడి ఖలీఫా జీతభత్యాల కోసం సగటు పౌరుని ఆదాయం దృష్టిలో పెట్టుకొని సాలినా దాదాపు నాలుగు వేల దిర్హమ్‌లు నిర్ణయించారు.

అయితే హజ్రత్ అబూబకర్ (రజి) రెండేళ్ళ పాలన తరువాత మరణసమయం సమీపించినప్పుడు తన ఆస్తిలో నుంచి ఎనిమిది వేల దిర్హమ్‌లు తీసి ప్రభుత్వ ధనాగారానికి వాపసు చేయాలని వీలునామా రాశారు. (కన్జుల్ ఉమ్మాల్)



# 42. శ్రామికుల పట్ల యజమాని ప్రవర్తన

కార్మికుల హక్కుల విషయంలో ఇస్లాం నిర్దేశించిన మౌలిక సూత్రాలు సోషలిస్టు వ్యవస్థలో కూడా కానరావు. ఈ మౌలిక సూత్రాలలో మొట్టమొదటి సూత్రం ఇబ్నెమాజ గ్రంథంలోని ఒక హదీసులో చూడవచ్చు. అందులో దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"శ్రామికుని చెమట ఆరక ముందే అతనికి రావలసిన వేతనం ఇచ్చేయండి."

దైవప్రవక్త (స) దేవుని పలుకుల్ని ఇలా పేర్కొన్నారు: "ప్రళయదినాన నేను ముగ్గురు మనుషులతో పోట్లాడుతాను. వారిలో ఒకడు- నా పేరుతో ప్రమాణం చేసి దాన్ని ఉల్లంఘించినవాడు. రెండోవాడు- స్వేచ్ఛాపరుడ్ని పట్టుకొని అమ్మి ఆ ధరను తిన్నవాడు. మూడోవాడు- కూలిడబ్బుపై కూలివాడ్ని పెట్టుకొని అతనిచేత పని చేయించుకొని అతనికి ఇవ్వాల్సిన కూలిడబ్బు ఎగవేసినవాడు." (బుఖారి-మిష్కాత్)

రెండవ మౌలిక సూత్రం తమ క్రింది ఉద్యోగుల పట్ల అధికారుల ప్రవర్తనకు సంబంధించిన విషయం. బుఖారి, ముస్లిం గ్రంథాలలో హజ్రత్ మామూర్ ఇబ్నె సువైద్ తెలిపిన ఒక హదీసు ఈ విధంగా ఉంది:

నేనొక సారి హజ్రత్ అబూజర్ గిప్ఫారి (రజి)ని, ఆయన సేవకుడ్ని ఒకే విధమైన దుస్తులు ధరించి ఉండటం చూశాను. నేను ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగాను. దానికాయన ఇలా చెప్పారు: నేనొక సారి ఒకతను తన బానిసను దూషిస్తుంటే చూశాను. అప్పుడు దైవప్రవక్త (స) ఆగ్రహోదగ్రులయి అతనితో "వీరు నీ సోదరులే, మానవులే, ఆదం-హవ్వా (అలైహి)ల సంతతికి చెందిన వారే. దేవుడు వీళ్ళను నీ అధీనం లో ఉంచాడు" అన్నారు. తరువాత ఆయన ఈ విధంగా ఆదేశించారు:-

"దేవుడు ఒక మనిషిని మరొక మనిషికి అధీనం చేసినప్పుడు ఆ మరో మనిషి తాను తినేటటువంటి తిండే అతనికి పెట్టాలి; తాను ధరించేటటువంటి దుస్తులే అతనికి ఇవ్వాలి. అతను మోయలేనంత బరువు అతనిపై మోపకూడదు. ఒకవేళ అంతటి బరువు మోపడం తప్పనిసరి అయినప్పుడు ఆ పనిలో తాను కూడా పాల్గొని అతనికి సహకరించాలి."

# 43. కానుక రూపంలో లంచం

ఉద్యోగులు లంచం ఏ రూపంలో తీసుకున్నా అది అధర్మకార్యంగానే, అక్రమ సంపాదనగానే పరిగణించబడుతుంది. కానుక రూపంలో ఇవ్వబడినా సరే దాన్ని తీసుకో వడం ఇస్లాంలో నిషిద్ధం. ఈ క్రింది హదీసు చూడండి:

హజ్రత్ అబూ హమీద్ సాయిదీ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) జకాత్, సదఖాలు (రెవెన్యూ) వసూలు చేయడానికి ఒకతడ్ని నియమించారు. అతను తనకప్పగించబడిన పని పూర్తి చేసుకొని తిరిగొచ్చి "దైవప్రవక్తా! ఈ ధనం మీది, ఇది నాకు

పారితోషికంగా లభించింది" అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "నువ్వు నీ తల్లిదండ్రుల ఇంట్లోనే ఎందుకు కూర్చోలేదు? అప్పుడు నీకెవరైనా పారితోషికం తెచ్చిస్తారో లేదో తెలుస్తుంది కదా!" అని అన్నారు.

ఆ తరువాత ఆయన ఇషా నమాజ్ చేసి (ఉపన్యాసమివ్వడానికి) నిలబడ్డారు. ముందుగా ఆయన సత్యసాక్ష్య వచనం పఠించి దైవస్తోత్రం చేశారు. స్తోత్రం దేవునికే శోభిస్తుంది. తరువాత ఆయన ఇలా అన్నారు:

"ఈ కార్యనిర్వాహకులకు ఏమయింది? మేమొక వ్యక్తిని కార్యనిర్వాహకునిగా (రెవెన్యూ వసూలుచేసే ఉద్యోగిగా) నియమించి పంపితే అతను తిరిగొచ్చి 'ఇది నన్ను వసూలుచేసి తీసుకురమ్మని పంపిన ధనం, ఇది నాకు పారితోషికంగా లభించిన ధనం' అంటున్నాడు. అతను తన తల్లిదండ్రుల ఇంట్లోనే ఎందుకు కూర్చో లేదు? అప్పుడు తెలుస్తుందిగా అతనికి పారితోషికం ఎవరు తెచ్చిస్తారో! ఎవరి అధీనం లో ముహమ్మద్ ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ఈ (ప్రభుత్వ)రాబడిలో ఎవరు నమ్మకద్రోహానికి పాల్పడతాడో ప్రళయదినాన దొంగిలించబడిన ఆ ధనం అతని మెడపై పెనుభారంగా పరిణమిస్తుంది. అతను ఒంటెను దొంగిలించిఉంటే, ఆ ఒంటె అతని మెడ మీదెక్కి అరుస్తూ అతనికి దుర్భరంగా మారవచ్చు. ఒకవేళ అతను ఆవును దొంగిలించిఉంటే, ఆ ఆవు అతని మెడ మీదెక్కి అంబా అంటూ అరుస్తుండవచ్చు. మేకయితే మ్యామ్యా అంటూ అరుస్తుండవచ్చు. గుర్తుంచుకోండి! నేను దేవుని ఆజ్ఞలన్నీ మీకు అందజేశాను. (నా బాధ్యత తీరిపోయింది. ఇక ఎవరి కర్మలకు వారే బాధ్యులు.)" (బుఖారి)

ఈ హదీసుని బట్టి ప్రభుత్వఉద్యోగులు (ప్రజల నుండి) కానుకలు, పారితోషికాలు స్వీకరించకూడదని, అది ప్రభుత్వ ధనం లేక సమరసొత్తు నుండి దొంగిలించి నమ్మక ద్రోహానికి పాల్పడినట్లు అవుతుందని తెలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగి కానుకలు (లంచం) స్వీకరించడమంటే తన హోదా, అధికారాల ద్వారా అక్రమ ప్రయోజనాలు పొందడమే; తన బాధ్యతలను దుర్వినియోగం చేయడమే. అందువల్లనే దైవప్రవక్త (సల్లం) సమర సొత్తు కాజేసే మనిషికి ఎలాంటి శిక్ష పడుతుందో, కానుక (లంచం) తీసుకునే వాడికి కూడా అలాంటి శిక్షే పడుతుందని హెచ్చరించారు.

## 44. వడ్డీ నిషేధం

"ప్రజల ధనంలో కలిసిపోయి వృద్ధిచెందుతుందన్న ఉద్దేశ్యంతో మీరిచ్చే వడ్డీ దేవుని దృష్టిలో ఎన్నటికీ వృద్ధిచెందదు. (దీనికి భిన్నంగా) దైవప్రసన్నత కోసం (పేదల ఆర్థిక హక్కుగా) మీరు చెల్లించే జకాత్ (మీకు శుభాన్నిస్తుంది). అలా జకాత్ చెల్లించేవారే నిజానికి తమ ధనాన్ని వృద్ధిచేసుకుంటారు." (ఖుర్ఆన్-30:39)

"పోతే వడ్డీ తినేవాడు పిశాచం పట్టిన పిచ్చివాడిలా (బిత్తరచూపులతో సమాధి నుండి) లేస్తాడు. ఈ దుస్థితికి కారణం, వారు వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా



అంటారు. కాని దేవుడు వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేశాడు. వడ్డీని అధర్మకార్యంగా నిర్ణయించాడు. కనుక ఈ హితబోధ అందినవారు ఇకముందు వడ్డీ తినటాన్ని మానుకోవాలి. జరిగిందేదో జరిగింది. ఇక నుండి మాత్రం మానుకోవాలి. ఆలాంటివారి వ్యవహారం (రేపు) దేవుడు పరిష్కరిస్తాడు. ఒకవేళ ఈ ఆదేశం అందిన తర్వాత కూడా మళ్ళీ ఎవరైనా ఈ పాపకార్యానికి పాల్పడితే వారు నరకం పాలవుతారు. నరకంలోనే ఎల్లకాలం పడివుంటారు. దేవుడు వడ్డీని తుదముట్టిస్తాడు. దానధర్మాలకు వృద్ధివికాసాలు కలిగిస్తాడు. (ఖుర్ఆన్-2:275,276)

ఈనాడు కూడా కొంతమంది 'వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా!' అని అనడం మనం వింటున్నాం. కాని వడ్డీ వ్యవస్థను దేవుడు పూర్తిగా నిషేధించాడు. వడ్డీ తినే (తీసుకునే) వాడ్ని, తినిపించే (ఇచ్చే) వాడ్ని, దానికి సాక్షులుగా ఉండేవారిని, వడ్డీ పత్రం రాసేవాడ్ని- అందర్నీ దేవుడు శపించాడని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. (అబూదావూద్, ఇబ్నెమాజ, నసాయి.)

డబ్బుద్వారా డబ్బు సంపాదించే హేయమైన పద్ధతే వడ్డీ. వడ్డీ కూడా వ్యాపారం లాంటిదే నన్న అర్థం స్ఫురించేలా 'వడ్డీవ్యాపారం' అనే పదాన్ని సృష్టించి జనంలోకి వదిలేశారు వడ్డీకోరులు. ధర్మవిద్య అంతగాలేని కొందరు ముస్లింలు సైతం వడ్డీ రక్కసి కబంధహస్తాలలో చిక్కుకొని, క్రమంగా స్థిరపడి చివరికి దాని ఒడిలో దత్తపుత్రులయి కూర్చున్నారు. కాని డబ్బు ద్వారా డబ్బు గడించే, ఒకే విధమైన ఒకే విలువగల వస్తువు ద్వారా లాభంపొందే పద్ధతుల్ని దైవప్రవక్త (స) నిషేధిస్తూ ఇలా ప్రవచించారు:

"ఒక దిర్హమ్ (రూపాయి)ని రెండు దిర్హమ్‌లకు బదులుగా అమ్మకండి. ఇలా చేస్తే మీరు వడ్డీకోరుతనంలో చిక్కుకుంటారని నేను భయపడుతున్నాను." (ముస్లిం)

"బరువులో, విలువలో సమానంగా యథాతథంగా ఉన్నప్పుడు తప్ప బంగారానికి బదులు బంగారం, వెండికి బదులు వెండి అమ్మకండి." (అహ్మద్, ముస్లిం)

"బంగారానికి బదులు బంగారం, వెండికి బదులు వెండి, గోధుమలకు బదులు గోధుమలు, యవలకు బదులు యవలు, ఖర్జూరాలకు బదులు ఖర్జూరాలు, ఉప్పుకు బదులు ఉప్పు యథాతథంగా తప్ప, చేబదులు తప్ప మార్పిడి చేయకండి. ఎవరైనా తాను తీసుకున్నదాని కంటే ఎక్కువ ఇచ్చినా, ఇచ్చినదాని కంటే ఎక్కువ తీసుకున్నా అతను వడ్డీ వ్యవహారానికి పాల్పడినట్లే. ఆ విధంగా ఇచ్చేవాడు, తీసుకునే వాడు ఇద్దరూ పాపంలో సమానులవుతారు." (అహ్మద్, ముస్లిం)

ఒకసారి హజ్రత్ బిలాల్ (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరకు బర్నీ ఖర్జూరపండ్లు (ఒక విధమైన మేలుజాతి ఖర్జూరాలు) తెచ్చారు. దైవప్రవక్త (సల్లం) వాటిని చూసి "వీటిని ఎక్కడ్నుంచి తెచ్చావు?" అని అడిగారు. దానికి బిలాల్ (రజి) "మా దగ్గర నాసిరకం ఖర్జూరాలు ఉంటే వాటిని రెండు 'సా'ల ఎత్తుకు బదులుగా ఒక 'సా' ఎత్తు

ఈ బర్నీ ఖర్జూరాలు కొన్నాను" అని సమాధానమిచ్చారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "ఇది కచ్చితంగా వడ్డీయే, ఇది కచ్చితంగా వడ్డీ కిందకు వస్తుంది. మీరు మేలుజాతి ఖర్జూర పండ్లు కొనదలచినప్పుడు మీ దగ్గరుండే నాసిరకం పండ్లను నగదు పైకానికిగాని, లేదా మరేదైనా వస్తువుకు బదులుగాని అమ్మేయండి. ఆ తరువాత ఆ పైకంతో మేలుజాతి ఖర్జూరాలు కొనుక్కోండి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

మరొక హదీసులో దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "అధర్మకార్య కలాపాలతో సత్యాన్ని అణచివేసే ఉద్దేశ్యంతో అన్యాయపరుడికి అండగా నిలిచిన వ్యక్తి దేవుని రక్షణ నుండి, దైవప్రవక్త రక్షణ నుండి బయటికి పోయినట్లే. ఒక్క దిర్హం (రూపాయి) కూడా వడ్డీ తిన్నవాడి పాపం 33 సార్లు వ్యభిచారంచేసిన పాపంతో సమానం. అధర్మ సంపాదనతో పోషించబడిన శరీరానికి (నరకా)అగ్నే తగిన శిక్ష". (తబ్రాని)

వేరొక హదీసులో ఆయన ఇలా అన్నారు: "మీలో ఎవరైనా వేరొకరికి అప్పు ఇచ్చి నట్లయితే (అప్పు తీసుకున్న) అతను ఆ వ్యక్తికి కానుకలు పంపినప్పుడు లేదా తన వాహనమ్మీద కూర్చోబెట్టుకోడానికి ముందుకొచ్చినప్పుడు (రుణదాత) ఆ కానుకను స్వీకరించడంగాని, అతని వాహనమ్మీద ఎక్కడంగాని చేయకూడదు. అయితే ఈ పనులు ముందునుంచీ సాగుతూ వస్తుంటే అలా చేయడంలో తప్పులేదు". (ఇబ్నెమాజా)

కొన్ని హదీసులలో "మనిషి అక్రమ సంపాదన-సక్రమ సంపాదన అనే విషయాన్ని పట్టించుకోకుండా ఎలాగైనా సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకునే రోజులు వస్తాయి" అని; మరికొన్ని హదీసులలో "వడ్డీ తిననివారంటూ ఉండని రోజులు వస్తాయి. ఒకవేళ ఎవరైనా వడ్డీ తినకపోయినా వారిపై వడ్డీ ధూళి మాత్రం వచ్చి పడుతుంద"ని ఉంది.

ఈనాడు వడ్డీవ్యాపారం ఓ పెద్ద మహమ్మారిలా తయారయింది. నాలుగు కాసులు వెనకేసుకున్న ప్రతివాడూ సంపదలో తన కింది స్థాయివాడికి అప్పిచ్చి వడ్డీ గుంజు తున్నాడు. జాలి, దయ, సానుభూతులు ఏమాత్రం లేకుండా డబ్బుసంపాదనే ధ్యేయంగా పెట్టుకున్నవారు పేదవాడి ఆర్థిక బలహీనతను వడ్డీ రూపంలో సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు తమ మిగులు ధనాన్ని బ్యాంకుల్లో పెట్టి దానిపై వచ్చే వడ్డీని అనుభవిస్తున్నారు.

నేడు చాలామంది ముస్లింలు కూడా దీనికి అతీతులుగా లేరు. స్వయంగా వారు వడ్డీ తీసుకోకపోయినా పెళ్ళిళ్ళలో అనవసరమైన ఖర్చుల కోసం, ఆనందోత్సవా లలో దుబారా ఖర్చుల కోసం, విలాసాల కోసం వడ్డీపై వేలాది రూపాయలు అప్పులు తీసుకుంటారు. ఇలాంటివారు దేవుని దృష్టిలో పాపాత్ములుగా పరిగణించబడతారు. దానికి బదులు వ్యాధులు, దుర్భర దారిద్ర్యం లాంటి గత్యంతరంలేని పరిస్థితుల్లో వడ్డీపై పరిమిత స్థాయిలో అప్పు తీసుకుంటే పరవాలేదు.



ఇక బ్యాంకుల్లో దాచుకునే డబ్బుపై వచ్చే వడ్డీ పైకాన్ని ముస్లింలు తీసుకోవాలా లేక బ్యాంకులకు వదిలేయాలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. దీనికి మన దేశంలో కొందరు ధర్మవేత్తలు "వడ్డీ పైకాన్ని బ్యాంకులకు వదలి వాటి పెట్టుబడీదారులకు మరింత బలం చేకూర్చడానికి బదులు, దాన్ని ముస్లింలు తీసుకొని పుణ్యఫలం ఆశించకుండా దారిద్ర్యంలో మగ్గుతూ మార్గాంతరంలేక అప్పులు చేసే నిరుపేదలకు ఇవ్వడం; లేదా పేద ముస్లింల సంక్షేమకార్యాల కోసం వినియోగించడం మంచిది" అని సమాధానమిచ్చారు.

మరికొందరు ధర్మవేత్తలు అలాంటి వడ్డీ పైకాన్ని మసీదుల్లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం వినియోగించాలని అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాలు సరైనవి, సమంజసమైనవే.

ఏది ఏమైనప్పటికీ సాధారణ పరిస్థితుల్లో ముస్లింలు వడ్డీ తీసుకోవడం, ఇవ్వడం నిషిద్ధం అనే విషయంలో ఎవరికీ ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. సృష్టికర్త తన గ్రంథంలో స్పష్టంగా ఇలా హెచ్చరిస్తున్నాడు:

"విశ్వాసులారా! దేవునికి భయపడండి. మీరు నిజంగా విశ్వసించిన వారయితే మీకు రావలసిన వడ్డీని వదిలేయండి. మీరిలా చేయకపోయారా, జాగ్రత్త! దేవుని తరపున, ఆయన ప్రవక్త తరపున మీకు వ్యతిరేకంగా యుద్ధప్రకటన వెలువడినట్లేనని తెలుసుకోండి. కనుక ఇకనయినా పశ్చాత్తాపం చెంది (వడ్డీ తీసుకోవడాన్ని మానేసి) నట్లయితే మీకు మీ మూల ధనం తీసుకునే హక్కు ఉంటుంది. దానివల్ల మీకూ నష్టం ఉండదు; ఇతరులకూ నష్టం ఉండదు." (ఖుర్ఆన్-2:278,279)

"విశ్వాసులారా! రెండింతలు, నాల్గింతలు పెరిగే ఈ వడ్డీని తినడం ఇకనైనా మాను కోండి. దేవునికి భయపడండి, మీ జీవితాలు సార్థకమవుతాయి. సత్యతిరస్కారుల కోసం సిద్ధంచేయబడిన నరకాగ్ని నుండి తప్పించుకోండి. దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులై ఉండండి, మీరు కరుణించబడతారు. మీ ప్రభువు క్షమాభిక్ష వైపు పరుగెత్తండి. అలాగే భూమ్యాకాశాలంత విశాలమైన స్వర్గసీమ వైపుక్కూడా పరుగెత్తండి. అది భయభక్తులు కలవారి కోసం సిద్ధం చేయబడిఉంది." (ఖుర్ఆన్.3:130-133)

ఇస్లామీయ పాలనలో ఉండేవారు ముస్లిములైనా, ముస్లిమేతరులైనా సరే వడ్డీ వ్యాపారం చేయడం నేరం. హజ్రత్ ఇబ్నె అబ్బాస్, హసన్ బస్రీ, ఇబ్నె సీరీన్ లాంటి ప్రముఖ షరీఅత్‌వేత్తలు ఈసూక్తిని బట్టి వడ్డీ తీసుకునే వ్యక్తిపై వత్తిడితెచ్చి ఆపని మాన్పింపజేయాలని, మానుకోకపోతే అతడ్ని వధించాలని అభిప్రాయపడ్డారు. అయితే మరికొందరు షరీఅత్‌వేత్తలు, అలాంటి వ్యక్తిని వడ్డీ తీసుకోవడం మానేవరకు జైల్లో పెడితే చాలని అభిప్రాయపడ్డారు. దివ్యఖుర్ఆన్‌లోని 3,4 అధ్యాయాల్లో వడ్డి తీసుకోవడాన్ని వారించడం జరిగింది.

# 45. చీటీ పాటలో వడ్డీ ఈటె

ఈనాడు కొందరు చీటీపాట పేరుతో పరోక్షంగా వడ్డీ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఏదైనా అత్యవసరమైన పని కోసం ఖర్చుచేయడానికో లేదా తమకు ఇష్టమైన ఒక విలువైన వస్తువు కొనడానికో తగినంత డబ్బు లేకపోతే దాని కోసం ఈ చీటి పద్ధతిని ఆశ్రయిస్తున్నారు ప్రజలు. ముఖ్యంగా ఈ పద్ధతిని కుటుంబ స్త్రీలు ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

ఈ పద్ధతి ప్రకారం కొందరు వ్యక్తులు కలసి నెలకు ఇంత డబ్బుని చీటీ కడ్తారు. నెల ముగిసిన తరువాత ఆ మొత్తం పైకాన్ని పాట పాడుతారు. ఇందులో ఎవరెంత తక్కువ పాట పాడితే ఆ చీటీపైకం వారికి లభిస్తుంది. పాట డబ్బు పోగా మిగిలిన డబ్బు చీటీ సభ్యులందరూ పంచుకుంటారు. ఇలా ఈ చీటీవిధానంలో ఒక వ్యక్తి కోల్పోయిన పైకం మిగిలిన సభ్యులు పంచుకుంటారు.

ఉదాహరణకు- ఒక్కొక్కరు నెలకు 500/- రూపాయలు చొప్పున కడ్తూ పదిమంది వ్యక్తులు ఈ చీటీ విధానంలో సభ్యులుగా చేరుతారు. ఈవిధంగా పది నెలలు కట్టాలని నిర్ణయించుకుంటారు. పదిమంది సభ్యులు కట్టిన పైకం నెలకు 5000/- రూపాయలు అవుతాయి. నెల పూర్తయిన తర్వాత ప్రతి నెలా ఆ 5000/- రూపాయల చీటీ పైకంపై పాట పాడుతారు. ఈ పాటలో చివరికి ఒకడు 4500/- రూపాయలకు పాడుతాడను కుందాం. అప్పుడు ఆ 4500/- రూపాయలు పాట పాడిన వ్యక్తికి లభిస్తాయి. మిగిలిన 500/- రూపాయలు సభ్యులంతా తలా 50/- చొప్పున పంచుకుంటారు. అంటే చీటీపాడినవాడికి 4500+50=4550/- రూపాయలు మాత్రమే లభిస్తాయి. మిగిలిన 450/- రూపాయలు ఇతర తొమ్మిది మంది సభ్యులు పంచుకొని తింటారన్న మాట.

ఈవిధంగా పదిమంది సభ్యులు పది నెలల పాటు చీటీ కడ్తారు. అందరికంటే తక్కువ పాటపాడి నష్టపోయిన సభ్యులకు పది నెలల చీటీ మాత్రం కట్టక తప్పదు. ఈ విధానంలో ఎవరైనా అత్యవసరమైన ఖర్చుల కోసం తక్కువ పాట పాడుతున్నాడంటే అది అతని బలహీనత లేక గత్యంతరంలేని పరిస్థితి మాత్రమే. ఇలా ఒక సభ్యుని ఆర్థిక బలహీనతను సొమ్ముచేసుకోవడం, అతనికి నష్టం కలిగించి తద్వారా మిగతా సభ్యులు ప్రయోజనం పొందడం వడ్డీ కిందికే వస్తుంది.

ఇలాంటి పద్ధతికి బదులు చీటీ కట్టే సభ్యులందరూ లాటరీ పద్ధతి అవలంబిస్తే బాగుంటుంది. ఈ లాటరీ (చీటీ)లో సభ్యులందరి పేర్లలో ఎవరో ఒకరి పేరు వస్తుంది. వారికి పూర్తి పైకం లభిస్తుంది. సభ్యులందరూ ఇష్టపడితే తమలో ఎక్కువ అవసరముండే సభ్యునికి ఆ పైకం ఇవ్వచ్చు. ఈపద్ధతి ద్వారా తోటి సభ్యుడ్ని అవసరానికి ఆదుకున్నట్లవుతుంది. ఇలా పుణ్యం, పురుషార్థం రెండూ కలసివస్తాయి.



# 46. ఇతర మతగ్రంథాలలో వడ్డీ

ఆర్థిక చెడులన్నిటికీ వడ్డీయే మూలకారణమని పూర్వం ఆర్థికశాస్త్రవేత్తలంతా అంగీకరించారు. వెనకటిమతాలు వడ్డీని దాదావు నిషేధించాయి. గ్రీకు తత్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ వడ్డీని నిరసించారు. ప్లేటో Laws అనే తన గ్రంథంలో ఒక ఆదర్శ నగరాన్ని వర్ణిస్తూ అందులో వడ్డీని నిషేధించాడు. అరిస్టాటిల్ "పాలిటిక్స్" అనే తన గ్రంథంలో "డబ్బు సంపాదించే పద్ధతులలో వడ్డీ అత్యంత నీచమైన పద్ధతి" అన్నాడు. మరోచోట "ధనార్జన విధానాలలోకెల్లా వడ్డీ ఎంతో ప్రకృతి విరుద్ధమైన పని" అన్నాడు.

బైబిల్ పాతనిబంధనలో వడ్డీ నిషేధం గురించిన కొన్ని వాక్యాలు చూడండి:

"నా ప్రజలలో నీయెద్ద నుండు ఒక బీదవానికి సొమ్ము అప్పిచ్చిన యెడల వడ్డీ కిచ్చువాని వలె వాని యెడల ప్రవర్తించకూడదు; వానికడ వడ్డీ తీసుకొనకూడదు". (నిర్గమ కాండము-22:25)

"అప్పిచ్చి వడ్డీ పుచ్చుకొనుటయు, లాభము చేపట్టుటయు మున్నగు పనులు చేయువాడు బ్రతుకునా? బ్రతుకడు. ఈ హేయకార్యములు చేసెను గనగ ఆవశ్యముగ వానికి మరణశిక్ష విధించవలెను". (యెహెజ్కేలు- 18:13)

క్రైస్తవ మతసంస్కర్తల్లో అగ్రగణ్యుడైన మార్టిన్ లూథర్ వడ్డీని గురించి రాసిన విషయాన్ని కారల్ మార్క్స్ ఇలా పేర్కొన్నాడు: "వడ్డీ ఒక పెద్ద రాక్షసి. ఇది సర్వనాశనం చేస్తుంది. మనం దోపిడీ గాండ్రను, హంతకులను, దొంగలను చంపుతాము కదా! మరి ఈ వడ్డీ తీసుకునే వారిని ఏం చెయ్యాలి? వారిని వేటాడి తలకాయలు నరికి వేయాలి". (క్యాపిటల్ 2వ భాగం-పే.652)

వడ్డీ నిషేధం గురించి బైబిల్‌లో ఇంత స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ నేటి క్రైస్తవులు, అది సలహా మాత్రమేనని, ఆజ్ఞ కాదని చెబుతున్నారు. వడ్డీవ్యాపారం విషయంలో క్రైస్తవులకు యూదులు గురువులు. యూదుల గ్రంథమైన తౌరాత్‌లో కూడా వడ్డీ నిషేధించబడింది. కాని వారు దైవాజ్ఞలను ఉల్లంఘించారు.

"యూదులుగా మారినవారు (ఈవిధంగా) ఎన్నో అన్యాయాలు, అక్రమాలకు పాల్పడ్డారు. వారు దైవమార్గంలో ఆటంకాలు సృష్టిస్తారు. వడ్డీ నిషేధించబడినప్పటికీ వారు దాన్ని (నిస్సంకోచంగా) తీసుకుంటారు. ప్రజల సొమ్మును అక్రమపద్ధతుల ద్వారా కాజేస్తారు. ఈ కారణాల వల్ల మేము గతంలో ధర్మసమ్మతం చేయబడిన అనేక పరిశుద్ధ వస్తువుల్ని వారికి నిషేధించాము. వారిలో అవిశ్వాసులైనవారి కోసం మేము దుర్భరమైన (నరక) యాతనల్ని సిద్ధపరచి ఉంచాము." (ఖుర్‌ఆన్–4:160,161)

మనుస్మృతిలో కూడా వడ్డీ నిషేధించబడింది. మనువు వడ్డీ జీవితం ఆపద లందు జీవికగా చెబుతూ బ్రాహ్మణ, క్షత్రియులు మాత్రం ఆపదలందు సయితం వడ్డీ కిచ్చి జీవనం చేయరాదని అన్నాడు. (IV- 220)

మరోచోట "నిష్కాహర్షషిక స్యాన్నం" (వడ్డీవ్యాపారి అన్నం మలంతో సమానం) అని పేర్కొన్నాడు. అయితే ఆ తరువాత ధర్మశాస్త్రకారులు వైశ్యుల కోసం వడ్డీ వృత్తిని ధర్మసమ్మతం చేశారు. పైగా ఆర్య ధర్మకారులు ఎవరెవరి వద్ద ఎంతెంత వడ్డీ తీసు కోవాలో కూడా నిర్ణయించారు.

ఈనాడు ప్రాచీన మతవిలువలన్నీ రాతలకు మాత్రమే పరిమితమై పోయాయి. ఇస్లాం వీటన్నిటికీ భిన్నంగా రాతలకు, చేతలకు పొంతనలేని వైఖరిని గర్హిస్తుంది. "ఆదేశం అందిన తరువాత మళ్ళీ ఎవరైనా పాపకార్యానికి పాల్పడితే వారు నరకం పాలవుతారని" తీవ్రంగా హెచ్చరిస్తోంది.

## 47. వడ్డీ తినేవాడి పర్యవసానం

"వడ్డీ తినేవాడు పిశాచం పట్టిన పిచ్చివాడిలా (బిత్తరచూపులతో ప్రళయదినాన సమాధి నుండి) లేస్తాడు" అంటోంది ఖుర్ఆన్ (2:275). వడ్డీ వ్యాపారస్తులు ఇహలోకంలో కూడా పిచ్చివాళ్ళయి పోయిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ఈనాడు వడ్డీ వ్యవస్థ తామరతంపరలా ప్రపంచమంతటా విస్తరించింది. బ్యాంకుల నుండి తక్కువ వడ్డీతో అప్పు తీసుకొని దాన్ని ఎక్కువ వడ్డీలతో తిప్పే ప్రబుద్ధులు కూడా ఉన్నారు. అంతేకాదు, వడ్డీ నిషిద్ధం అని తెలిసిన ముస్లింలలో కూడా అనేక మంది వడ్డీపై అప్పులు చేయడం, వడ్డీవ్యాపారం చేయడం జరుగుతోంది.

వడ్డీ వల్ల బోలెడు లాభాలున్నాయని, పేదోడి నడ్డి విరగొట్టయినా సరే వడ్డీ వ్యాపారం చేయాలని షైతాన్ ధనికుల్ని ఉసిగొల్పుతాడు. ప్రభుత్వ బ్యాంకులు పేద రైతులకు అందమైన ప్రకటనలు గుప్పించి, ఊరించి మరీ వడ్డీపై అప్పులిస్తాయి. పంటపొలాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల తగిన ఫలాసాయం ఇవ్వకపోయినా లేదా పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయినా సరే రైతులు ఆ అప్పులు సకాలంలో తీర్చ లేకపోతే ఈ బ్యాంకులు వారి ఇళ్ళను, ఇంటి సామగ్రిని బలవంతంగా జప్తు చేయించడం కూడా జరుగుతోంది.

కాని వడ్డీ తినేవాడి నడ్డి ఇహలోకంలో ఎంత నిటారుగావున్నా పితృలోకంలో, ఆ తర్వాత నరకకూపంలో అతని నడ్డి ముక్కలు ముక్కలుగా విరగడం మటుకు ఖాయం. జనం ఈ వాస్తవం తెలుసుకోలేక వడ్డీ తీసుకోకుండా తాము శ్వాస తీసుకో లేమని భావిస్తున్నారు. చివరికి కొందరు తాము పూజించే దేవుడికి సైతం వడ్డీ కాసుల వాడని పేరుపెట్టి, దేవుడే తమకీ వడ్డీ భుక్తం ప్రసాదించాడని భ్రమిస్తున్నారు. వడ్డీ వ్యాపారికి పితృలోకంలో ఎదురయ్యే యాతన గురించి వింటేనే శరీరం గగుర్పొడుస్తుంది.

ఇబ్నె హజర్ మక్కి కథనం: నేనింకా లేత వయస్సులో ఉన్నాను. అప్పుడు నేను కీర్తి శేషులయిన మా తండ్రిగారి సమాధిని దర్శించడానికి, ఆయన ఆత్మశాంతి కోసం ఖుర్ఆన్ పఠించి దుఆ (ప్రార్థన) చేయడానికి తరచుగా వెళ్తుండేవాణ్ని. ఒక రోజు



రమజాన్ నెల చివరి దశకంలో ఫజ్‌నమాజ్ (ప్రభాత సమయం ప్రార్థన) ముగించుకొని శ్మశానానికి వెళ్ళాను. నేను సమాధిపై కూర్చొని ఖుర్ఆన్ పఠిస్తున్నాను. ఆ సమయం లో అక్కడ నేను తప్ప మరెవరూ లేరు. కాస్సేపటికి హఠాత్తుగా "ఆహ్...ఆహ్..." అనే బాధాకరమైన మూల్గుడు విన్పించసాగింది.

తీవ్రమైన ఈ మూల్గుడు శబ్దం విని నాగుండె అదిరిపోయింది. ఈ శబ్దం బహుశా పక్కనున్న సమాధి నుండి వస్తోందని భావించాను. ఆ సమాధి గచ్చుతో పటిష్ఠంగా నిర్మించబడి ఉంది. నేనా సమాధి దగ్గరికెళ్ళి చెవులు రిక్కించి వింటే సమాధిలోని శవం నుండే హృదయ విదారకమైన ఈ శబ్దం వస్తోందని గ్రహించాను.

సూర్యుడు ఉదయించే వేళయింది. భయంకరమైన ఆ మూల్గుడు క్రమంగా తగ్గి పోయింది. కాస్సేపటికి అటుగా ఒక వ్యక్తి వచ్చాడు. నేనతని దగ్గరకు పోయి ఈ సమాధి ఎవరిదని అడిగాను. "ఇదొక వ్యాపారస్థుడి సమాధి. నేనతడ్ని చూశాను. చాలా మంచివాడు. అయిదు పూటల నమాజు క్రమం తప్పకుండా ఆచరిస్తాడు. ఎంతో మౌనంగా ఉంటాడు" అంటూ వివరించాడు ఆ వ్యక్తి. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇంత మంచి మనిషి సమాధిలో ఇలా బాధాకరంగా మూల్గడం ఏమిటో నాకు అర్థం కాలేదు. మొత్తానికి ఏదో బలమైన కారణం ఉండాలి అనుకున్నాను.

తర్వాత నేను ఆ మనిషి గురించి మరిన్ని వివరాలు కోసం ఆరా తీశాను. అప్పుడు నాకు అతను గొప్ప భక్తుడయినప్పటికీ వడ్డీ తినేవాడని తెలిసింది. వడ్డీ తీసుకుంటే నీ పెట్టుబడి పెరుగుతుందని షైతాన్ భ్రమలు కల్పించి అతడ్ని మోసం చేశాడు. దాంతో ఆ భక్తుడు వ్యాపారి కూడా అయినందున వడ్డీ తీసుకోవడం ప్రారంభించాడు. చివరికి ఇలా సమాధి యాతనలు అనుభవిస్తున్నాడు. (జవాజిర్-మౌత్కారుఖుట్కా)

దైవప్రవక్త ముహమ్మద్ (స) తన మేరాజ్ పర్యటన సందర్భంలో పితృలోకంలో జరిగే సంఘటనలు చూస్తారు. ఒకచోట ఆయన బానకడుపులు కలిగినవారు కొందరిని చూస్తారు. వారి పొట్టలు పాములతో నిండిపోయి ఉంటాయి. వీళ్ళెవరని అడిగితే ఆయనకు దైవదూత జిబ్రీల్ (అలై), వీళ్ళు వడ్డీ తినేవాళ్ళని చెబుతారు.

## 48. రుణానుబంధం

అప్పుచేసి పప్పుకూడు తినడం కంటే ఉన్నదాంతోనే తృప్తిచెందడం మంచిదని ఇస్లాం బోధనల ద్వారా తెలుస్తోంది. అయినా ఒక్కోసారి అప్పుచేయవలసిన పరిస్థితి వస్తుంది. ఈనాడు ప్రతిమనిషీ ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు కొద్దో గొప్పో చేబదులు తీసుకోవడం సర్వసాధారణ విషయం. దీనికి లెక్కా పత్రం ఉండవు. అయితే అధిక మొత్తాలు అప్పుగా ఇచ్చినపుడు మాత్రం దస్తావీజు రాయించుకోవాలి.

"విశ్వాసులారా! మీరు ఏదైనా ఒక నిర్ణీత కాలానికిగాను అప్పు ఇచ్చిపుచ్చుకోవడం గురించి పరస్పరం మాట్లాడుకుంటే ఆ విషయాన్ని వ్రాతపూర్వకంగా నమోదు

చేసుకోండి. అయితే రుణపత్రం రాసేవ్యక్తి ఎవరికీ ఎలాంటి నష్టం కలగనీయకుండా న్యాయంగా, నిష్పక్షపాతంగా వ్రాయాలి. దేవుడు తనకు నేర్పినవిధంగా వ్రాయాలి. అతను దస్తావీజు వ్రాయడానికి నిరాకరించకూడదు. బాధ్యత పైనబడిన వ్యక్తి (రుణగ్రస్తుడు) మాత్రమే విషయం చెప్పి వ్రాయించాలి. అతను తన నిజప్రభువైన దేవునికి భయపడుతూ నిర్ణీత వ్యవహారంలో ఎలాంటి తగ్గింపు చేయకుండా వ్రాయించాలి." (ఖుర్ఆన్-2:282)

రుణదాతకు రుణగ్రస్తులపై ఎంత నమ్మకం ఉన్నప్పటికీ ముందుజాగ్రత్త కోసం దస్తావీజు రాయించుకోవడం చాలా మంచిది. దస్తావీజులో సాక్షుల్ని కూడా పెట్టు కోవాలి. దీనివల్ల ఉభయుల మధ్య సంబంధాలు సవ్యంగా ఉంటాయి. దస్తావీజు రాయించుకోకుండా అప్పిచ్చినప్పుడు విధివశాత్తు రుణగ్రస్తుడు అప్పు చెల్లించకుండా ఎగవేస్తే రుణదాతకు జరిగిన ఈ నష్టానికి దేవుడు కూడా బాధ్యత తీసుకోడు.

దైవప్రవక్త (స) హితోక్తి: "మూడు విధాల వ్యక్తులు దేవుడ్ని మొరపెట్టుకుంటారు. కాని దేవుడు వారి మొరలు ఆలకించడు. ఒకడు, భార్య శీలంలేనిస్త్రీ అని తెలిసినా ఆమెకు విడాకులివ్వని వ్యక్తి. రెండోవాడు, (తన అధీనంలో ఉన్న) అనాథ బాలుడు యుక్త వయస్సుకు చేరుకోక ముందే అతని ఆస్తిని అతనికి అప్పగించిన వ్యక్తి. మూడోవాడు, ఎవరికైనా అప్పిచ్చి దానికి సాక్షులు పెట్టుకోని వ్యక్తి." (మిష్కాత్)

ఎంతో అవసరమయితే తప్ప అప్పు చేయడాన్ని దైవప్రవక్త (సల్లం) ఇష్టపడేవారు కాదు. ఒక వ్యక్తి ధర్మసంస్థాపనా మార్గంలో అమరగతి (షహాదత్) పొందినప్పటికీ చేసిన అప్పు తీర్చకపోతే మాత్రం దేవుడు అతడ్ని క్షమించడని తెలుస్తోంది.

"దైవమార్గంలో ప్రాణాలర్పించిన వ్యక్తి పాపాలన్నీ క్షమించబడతాయి, ఒక్క అప్పు తప్ప" అని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. (ముస్లిం)

ఆయన ఒకసారి "దేవా! నేను పాపం, రుణ(భార)ం నుండి నీ శరణు కోరు తున్నా"నని అన్నారు. అప్పుడు ఒక అనుచరుడు "దైవప్రవక్తా! మీరు తరచుగా రుణ భారం నుండి శరణు కోరుతున్నారేమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "మనిషి అప్పుల పాలైనప్పుడు మాట్లాడితే అబద్ధమాడుతాడు; వాగ్దానం చేస్తే దాన్ని నిలబెట్టుకోలేడు" అన్నారు. (బుఖారి)

"ఒకవేళ అప్పు తీసుకునే వ్యక్తి బుద్ధిమాంద్యం కలవాడో, బలహీనుడో అయిన ట్లయితే లేదా చెప్పి వ్రాయించే శక్తి లేనివాడైతే అతని సంరక్షకుడు చెప్పి న్యాయంగా వ్రాయించాలి. (ఈ వ్యవహారం గురించి) మీలో ఇద్దరు పురుషుల్ని సాక్షులుగా పెట్టుకోండి. పురుషులు ఇద్దరు లభించకపోతే ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలయినా చాలు. వారిలో ఒక స్త్రీ మరచిపోతే రెండో స్త్రీ అయినా గుర్తుచేస్తుంది. సాక్షులు మీకు ఆమోదయోగ్యమైన వారుగా ఉండాలి. సాక్ష్యం కోసం పిలిచినప్పుడు సాక్షులు (సాక్ష్యం ఇవ్వడానికి) నిరాకరించకూడదు."



"గడువు నిర్ణయించబడిన రుణవ్యవహారం చిన్నదైనాపెద్దదైనా దస్తావీజుగా రాయడంలో అశ్రద్ధ చేయకండి. ఇది దేవునిదృష్టిలో ఎంతో న్యాయమైన పద్ధతి. సాక్షమివ్వ డానికి కూడా చాలా మంచిపద్ధతి. దానివల్ల మీరు ఎలాంటి అనుమానాలకు లోనయ్యే తావుండదు."

"పోతే మీరు పరస్పరం ఎప్పటికప్పుడు అక్కడికక్కడ జరుపుకునే క్రయవిక్రయాల విషయంలో దస్తావీజు వ్రాసుకోకపోయినా పర్వాలేదు. మీరు పరస్పరం వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకునేటప్పుడు సాక్ష్యం పెట్టుకోండి. దస్తావీజు వ్రాసే వ్యక్తికిగాని, సాక్షులుగా ఉండే వారికిగాని నష్టం వాటిల్లరాదు. అలాంటి నష్టం ఏదైనా జరిగితే మీకది పాపకార్యంగా పరిణమిస్తుంది. దేవునికి భయపడుతూ మసలుకోండి. చూడండి, ఆయన మీకు ఎలాంటి మంచి విషయాలు నేర్పుతున్నాడో! దేవుడు సమస్త విషయాలు ఎరిగిన వాడు." (ఖుర్ఆన్-2:282)

# 49. తాకట్టు పెట్టి అప్పు తీసుకోవడం

ఈనాడు ఆర్థిక వ్యవహారాల్లో నిజాయితీ లోపించింది. ధార్మికులు, దగ్గరి బంధువులు, స్నేహితులు సైతం మాటకు కట్టుబడి ఉండటంలేదు. అందుకే ఖుర్ఆన్ అప్పు విషయంలో సాక్షులతో సహా దస్తావీజు రాయించుకోవాలని, వస్తువులు కుదువ పెట్టుకొని మరీ డబ్బివ్వాలని చెప్పింది.

"మీరు ప్రయాణావస్థలో ఉన్నప్పుడు దస్తావీజు వ్రాసేవారు లభించకపోతే ఏదైనా వస్తువు తాకట్టుపెట్టి అప్పు తీసుకోండి. అప్పిచ్చేవాడు అప్పుతీసుకునే వ్యక్తిని నిజాయితీ పరుడని భావించి తాకట్టు లేకుండానే అప్పు ఇస్తే రుణగ్రహీత నిజాయితీగా దాన్ని (గడువు తీరగానే) రుణదాతకు తిరిగి చెల్లించాలి. అతను తన నిజప్రభువయిన దేవునికి భయపడాలి. సాక్ష్యాన్ని దాచకూడదు. సాక్ష్యాన్ని దాచేవాడి అంతర్యం పాపపంకిలంతో నిండిపోతుంది. మీరు చేసేదంతా దేవుడు గమనిస్తూనే ఉంటాడు." (ఖుర్ఆన్-2:283)

వడ్డీ లేకుండా అప్పివ్వడం గొప్ప పుణ్యకార్యమే, సందేహంలేదు. కాని నిజాయితీ లోపించిన నేటి సమాజంలో స్నేహితులకు సైతం అప్పివ్వడమంటే తగాదా కొనితెచ్చు కోవడమే. చిన్న మొత్తంలో అప్పివ్వ వలసివస్తే అది తిరిగి రాకపోవచ్చని భావించి మరీ అప్పివ్వడం మంచిది. పెద్ద మొత్తంలో అప్పివ్వవలసివస్తే ఏదయినా వస్తువు కుదువ పెట్టుకొని అప్పివ్వడం చాలా మంచిది. మనిషి ప్రయాణావస్థలో ఉన్నప్పుడేగాక స్వస్థలంలో ఉన్నాసరే నేటి పరిస్థితుల్లో వస్తువులు తాకట్టు పెట్టుకొని మరీ అప్పివ్వడం ఉభయత్రా ఎంతో శ్రేయస్కరం.

వడ్డీ ఎలాంటి పరిస్థితిలోనైనా నిషిద్ధమే. చివరికి తాకట్టుగా పెట్టిన వస్తువు ద్వారా ప్రయోజనం పొందడం కూడా నిషిద్ధమే. ఉదాహరణకు- ఎవరైనా ఇల్లు తాకట్టుపెట్టి అప్పు తీసుకుంటే రుణదాత ఆ ఇంటికి వచ్చే అద్దెపైకం తింటే వడ్డీ తిన్నట్లే అవుతుంది.

అయితే తాకట్టు వస్తువు కోసం ఖర్చు చేయవలసి వచ్చినప్పుడు అలాంటి వ్యవహారాలకు ఈ షరతు నుండి మినహాయింపు ఉంది. ఉదాహరణకు- ఎవరైనా గేదెను తాకట్టుపెడ్తే రుణదాత ఆ గేదెను మేపడానికి, పోషించడానికి డబ్బు ఖర్చుచేయవలసి వస్తుంది గనక అతను దాని పాలను వాడుకోవచ్చు.

తాకట్టు వస్తువులపై రుణగ్రస్తునికి సంబంధించిన చిహ్నాలు ఏవైనా ఉంటే లేదా తాకట్టు వస్తువులు రుణగ్రస్తునికి సంబంధించిన దస్తావీజులయి ఉంటే అప్పిచ్చేవాడు ఆ వస్తువులు కుదువ పెట్టుకోవడంతో పాటు దస్తావీజు కూడా రాయించుకోవాలి. దస్తావీజు రాయించుకోకుండా తాకట్టుపై అప్పిస్తే తరువాత రుణగ్రస్తుడు లేనిపోని సమస్యలు సృష్టించ వచ్చు.

## 50. రుణగ్రస్తుని పట్ల మృదువైఖరి

"ఒకవేళ రుణగ్రస్తుడు ఇబ్బందులతో సతమతమవుతుంటే పరిస్థితి చక్కబడే వరకు అతనికి అవకాశమివ్వండి. రుణం మాఫీచేస్తే మరీ మంచిది. మీరు (విషయం) గ్రహించ గల్గితే ఇది మీకెంతో శ్రేయస్కరమైనది. మీరంతా చివరికి దేవుని సన్నిధికి చేరుకోవలసిన దినం గురించి భయపడండి. (ఆరోజు) ప్రతివ్యక్తికీ అతను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు." (ఖుర్ఆన్- 2:280,281)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మా ఇంటి ముందు ఎవరో తగాదాలాడుకోవడం విన్నారు. ఇద్దరు వ్యక్తులు బిగ్గరగా పోట్లాడుకుంటున్నారు. వారిలో ఒకతను రెండవ వ్యక్తికి బ్రతిమాలుతూ "కొంత వదిలేయండి. కాస్త (నాపట్ల) మృదువుగా వ్యవహరించండి" అని అన్నాడు. దానికి రెండవ వ్యక్తి "దైవసాక్షి! నేనిలా ఎన్నటికీ వదలను" అన్నాడు. అంతలో దైవప్రవక్త (సల్లం) బయటికి వెళ్ళి "ఎవరతను, దేవుని మీద ప్రమాణం చేసి మరీ తాను పుణ్యకార్యం చేయనంటున్నాడు?" అని అడిగారు. అప్పుడు వారిలో ఒకతను (ముందుకొచ్చి) "దైవప్రవక్తా! ఆ వ్యక్తిని నేనే. నేనితనికి (ఇప్పుడు) తాను కోరిన వస్తువుని తానే ఉంచుకోవచ్చని అనుమతిస్తున్నాను" అని అన్నాడు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) కథనం: నేనొక రోజు మసీదులో అబ్దుల్లా బిన్ అబీహద్ర్ (రజి)ని నాకివ్వాల్సిన బాకీ ఇవ్వమని నిలదీశాను. మేమిద్దరం (అరచుకుంటూ) బిగ్గరగా మాట్లాడుకోసాగాము. మా అరుపులు ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న దైవప్రవక్త (స)కు విన్పించాయి. ఆయన వెంటనే తమ కుటీరం తెరను పైకెత్తి "కాబ్!" అని పిలిచారు. నేను "వస్తున్నానండీ" అన్నాను. అప్పుడాయన "నీకు రావలసిన బాకీలో కొంచెం తగ్గించుకో" అని చెప్పారు. చేత్తో సైగచేస్తూ "సగం తగ్గించుకో" అన్నారు. నేను "మీరెలా ఆజ్ఞాపిస్తే అలా చేస్తాను" అన్నాను. "మరయితే లే, వెంటనే అతని హక్కు నెరవేర్చు" అని ఆదేశించారు దైవప్రవక్త (సల్లం) (బుఖారి)



దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు: "మీ పూర్వీకులలో ఒకతని ఆత్మకు దైవదూతలు వచ్చి స్వాగతం చెప్పారు. "(నిన్నింతగా స్వాగతించాలని ఆజ్ఞ జారీకావడానికి కారణం) నువ్వేమైనా (విశేష) పుణ్యకార్యం చేశావా?" అని అడిగారు దైవదూతలు. దానికా వ్యక్తి "నేను నా సేవకుల్ని పేద(రుణగ్రస్తు)లకు తగిన వ్యవధి నివ్వమని, ధనికుల్ని క్షమించమని ఆజ్ఞాపించేవాడ్ని" అని అన్నాడు. అందువల్లనే దేవుడు అతని తప్పులు క్షమించి అతనిపట్ల మంచిగా వ్యవహరించమని దైవదూతలను ఆజ్ఞాపించాడు." (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "(పూర్వం) ఒక వర్తకుడు ప్రజలకు అప్పులిస్తుండేవాడు. వారిలో ఎవరైనా పేదవాడు ఉన్నాడని తెలిస్తే 'అతడ్ని క్షమించండి. అప్పు తీర్చమని వత్తిడి చేయకండి. దీనివల్ల దేవుడు మన పాపాలను క్షమించవచ్చు" అని సేవకులతో అంటుండేవాడు. ఆ సత్కార్యం కారణంగానే దేవుడు అతడి పాపాలను, పొరపాట్లను క్షమించాడు." (బుఖారి, ముస్లిం)

## 51. అప్పు తీర్చనివాడి పర్యవసానం

ఈనాడు రుణదాతలోని మృదువైఖరి, మంచితనాలను ఆసరాగా చేసుకొని కొందరు రుణగ్రస్తులు ఆర్థిక స్తోమత ఉన్నప్పటికీ సకాలంలో అప్పు చెల్లించకుండా వాయిదాలు వేయడం, మరికొందరు కల్లబొల్లి మాటలతో ఆలస్యం చేసి, చివరికి పూర్తిగా ఎగవేయడం కూడా జరుగుతోంది. ఈ వైఖరి రుణగ్రస్తులకు పరలోకంలో ఘోర యాతనలు తెచ్చిపెడుతుంది. అప్పు తీసుకోవడం తప్పు కాదు. కాని సకాలంలో అప్పు తీర్చకుండా వాయిదాల మీద వాయిదాలు వేయడం లేదా ముఖం చాటేయడమే తప్పు. ఇది మామూలు తప్పు కాదు, ఘోరమైన పాపం అవుతుంది. ఈ విషయం గురించి దైవప్రవక్త (సల్లం) చేసిన ఈ ఉపదేశాలు వినండి:

"దైవమార్గంలో పోరాడి అమరగతిపొందిన మనిషి పాపాలన్నీ క్షమించబడతాయి, ఒక్క అప్పు తప్ప. (అప్పు తీర్చని పాపం క్షమించబడదు.)" (ముస్లిం)

మరొక హదీసు ప్రకారం ఒకతను దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి, తాను దైవ మార్గంలో జిహాద్ చేయడానికి వెళ్తున్నానని చెప్పి, తన పాపమన్నింపు కోసం ప్రార్థన చేయమని అంటాడు. దైవప్రవక్త (స) సరే అంటారు. ఆ వ్యక్తి వెళ్ళిపోవడానికి వెనుతిరుగుతాడు. అప్పుడు దైవప్రవక్త (స) అతడ్ని పిలిచి "నీ పాపాలన్నీ క్షమించబడతాయి కాని, అప్పుకు సంబంధించిన పాపం మటుకు క్షమించబడదు" అన్నారు. (ముస్లిం)

"ఎవరైనా ప్రజల నుండి అప్పు తీసుకొని దాన్ని తీర్చే ఉద్దేశ్యముంటే దేవుడు అతనిద్వారా ఆ అప్పు తీర్చుతాడు. ప్రజలనుండి అప్పు తీసుకొని (దాన్ని తీర్చకుండా) నష్టం కలిగించే ఉద్దేశముంటే అలాంటివాడికి దేవుడు నష్టం కలిగిస్తాడు." (బుఖారి)

"విశ్వాసి చనిపోయిన తర్వాత అతనిఆత్మ కేవలం అప్పు కారణంగా (ఆకాశానికి ఎక్కలేక) ఒక చోట ఆగిపోతుంది. అప్పు తీర్చనిదే అతని ఆత్మ స్వర్గానికి చేరుకోలేదు. (తిర్మిజి, ఇబ్నెమాజ, బైహఖి)

హ్రజత్ అనస్ (రజి) కథనం: మేము ఓరోజు దైవప్రవక్త (స) దగ్గర కూర్చొని ఉంటే కొందరు ఒక జనాజా (శవం) తెచ్చి జనాజానమాజ్ (శవప్రార్థన) చేయమన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) వారిని "ఈ మృతునిపై రుణభారం ఏదైనా ఉందా?" అని అడిగారు. వారు ఉంది అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని ఇలా అన్నారు:

"ఇలాంటి మనిషి కోసం జనాజానమాజ్ చేయడం వల్ల లాభం ఏమిటీ? ఇతని ఆత్మ సమాధిలో ఆగిపోయింది. ఆకాశం వైపు అధిరోహించలేదు. మీలో ఎవరైనా ఇతని అప్పు తీరుస్తామని హామీ ఇస్తే నేనితని జనాజానమాజ్ చేస్తాను. లేకపోతే చేయలేను. ఎవరైనా ఇతని అప్పు తీర్చడంగాని, లేదా తీరుస్తామని హామీనివ్వడంగాని జరిగినప్పుడే నేను చేసే జనాజానమాజు వల్ల ఇతనికి ప్రయోజనం చేకూరుతుంది." (త్రబాని)

అప్పు తీర్చడం ఎంత ముఖ్యమైన బాధ్యతో ఈ హదీసు నొక్కి చెబుతోంది. మనిషి తాను జీవించి ఉండగానే అప్పు తీర్చవలసిన అవసరాన్ని కూడా ఈ హదీసు సూచిస్తోంది. ఇమామ్ నవవీ (రహ్మలై) ఈ హదీసుపై వ్యాఖ్యానిస్తూ "రుణగ్రస్తుడు చనిపోయినప్పుడు అతని (పాపమన్నింపు కోసం) జనాజా నమాజ్ చేయడానికి దైవప్రవక్త (సల్లం) అంగీకరించ లేదంటే, తద్వారా బ్రతికున్నవారు దైవానికి భయపడి తమ అప్పులు తీర్చివేయడానికి ప్రయత్నిస్తారని ఆయన ఆశించడమే"నని అన్నారు.

ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒకరోజు ప్రభాతవేళ ప్రార్థన చేసిన తర్వాత "ఇక్కడ హుజైల్‌తెగ మనిషి ఎవరైనా ఉన్నాడా? మీ సోదరుడు స్వర్గద్వారం దగ్గర నిరోధించబడ్డాడు, అతను చేసిపోయిన అప్పు కారణంగా" అన్నారు. (త్రబాని)

బరా బిన్ ఆజిబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరైనా అప్పు చేసి దాన్ని తీర్చకుండా చనిపోతే, కేవలం ఆ అప్పు కారణంగా అతను నిర్బంధానికి గురవుతాడు. తన అసహాయత, ఒంటరితనాల్ని గురించి దేవుడ్ని మొరపెట్టుకుంటాడు. అప్పు తీరగానే అతని ఆత్మ గమ్యానికి చేరుకుంటుంది." (త్రబాని)

షైబాన్ బిన్ జుబైర్ (రజి) కథనం: మా నాన్నగారు, అబ్దుల్ వాహిద్ బిన్ జైద్ గారు ఒక యుద్ధంలో పాల్గొనడానికి వెళ్తున్నారు. దారిలో ఒక చోట ఓ పెద్ద లోతైన బావి కన్పించింది. ఆ బావిలో నుంచి బాధతో మూల్గుతున్న ఓ మనిషి కంఠస్వరం విన్పిస్తుంటే, అదేమిటో చూడటానికి ఒకతను అందులోకి దిగాడు. దిగి చూస్తే ఒక మనిషి ఆసనం మీద కూర్చొని ఉన్నాడు. ఆసనం కింద నీళ్ళున్నాయి. బావిలో దిగి చూస్తున్న వ్యక్తి అతనితో "నీవు మనిషివా లేక భూతాని(జిన్)వా? మనిషివయితే నీ వాస్తవ పరిస్థితి ఏమిటో చెప్పు" అన్నాడు.



అప్పుడు బావిలో ఆసనం మీద కూర్చున్న మనిషి తన గోడు చెబుతూ "నేను మనిషినే. అంతాకియా నివాసిని. నేను చనిపోయిన తరువాత ఇక్కడ బంధించబడ్డాను. నామీద కొంత రుణభారం ఉండిపోయింది. నా కొడుకు అంతాకియాలో ఉన్నాడు. కాని వాడు నన్ను జ్ఞాపకం చేయడంలేదు. నేను చేసిన అప్పు కూడా తీర్చడంలేదు. అప్పు తీర్చితే నేనీ దుర్గతి నుండి బయటపడతాను" అని అన్నాడు.

ఈమాట విన్న తరువాత బావిలో దిగిన వ్యక్తి బయటికి వచ్చాడు. బయటికి వచ్చి విషయం తన సహచరునికి వివరించాడు. ఇద్దరు ఒక నిర్ణయం తీసుకుంటూ తాము యుద్ధంలో పాల్గొని తమకు లభించే సమరసొత్తులో నుంచి కొంత సొమ్ము తీసి అతని అప్పు తీర్చుదాం అని చెప్పుకున్నారు. ఆ విధంగా వారిద్దరు అతని అప్పు తీర్చారు.

తరువాత వారు మరోసారి అటుగా ప్రయాణం చేస్తూ ఆ బావి దగ్గరకు పోయి లోపలికి తొంగిచూశారు. బావిలో ఆ మనిషి కన్పించలేదు. ఆరోజు రాత్రి వారిద్దరు మిత్రులు అక్కడే పడుకున్నారు. ఆ రాత్రి వారి కలలో ఆ మనిషి కన్పించి "దైవం మీకు పుణ్యఫలం ప్రసాదించుగాక! మీరు నాఅప్పు తీర్చారు. దాంతో నేనిప్పుడు స్వర్గానికి చేరుకున్నాను" అని చెప్పాడు. (ఇబ్నె అబిద్దున్యా)

హ్రజత్ అబూహురైరా (రజి) కథనం: ఒకతను దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి పరుషపదజాలంతో తన అప్పు తీర్చమని ఒత్తిడి చేయసాగాడు. ప్రవక్త అనుచరులు ఈ దురుసు మాటలు విని దూషించడానికి (లేదా గద్దించడానికి) ఉపక్రమించారు. అయితే దైవప్రవక్త (స) (వాళ్ళను వారిస్తూ) "అతడ్ని ఏమీ అనకండి, వదిలేయండి. తన సొమ్ము రాబట్టుకోవలసిన మనిషికి ఇలా (కఠినంగా) మాట్లాడే అధికారం ఉంది" అని అన్నారు. ఆ తర్వాత ఆయన "అతను నాకిచ్చిన ఒంటె వయస్సు ఎంతుందో అంతే వయస్సుగల ఒంటెను అతనికిచ్చేయండి"అన్నారు. అప్పుడు ప్రవక్త అనుచరులు "దైవప్రవక్తా! అతని ఒంటెలాంటి ఒంటె లేదు. మన దగ్గర ఉన్నవన్నీ మంచి ఒంటెలే" అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని "ఆ మంచిఒంటే ఇవ్వండతనికి. అప్పు తీర్చడంలో ఉత్తముడే మీలో ఉత్తముడు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

## 52. వడ్డీ ప్రమేయంలేని బ్యాంకులు

వడ్డీ ప్రమేయం లేకుండా Profit sharings సూత్రం ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థ స్థాపించవచ్చు. ఇలాంటి బ్యాంకింగ్ వ్యవస్థలు నేడు కొన్ని ముస్లిం దేశాలలో ఉన్నాయి. ఉదాహరణకు, పాకిస్తాన్‌లోని కొన్ని సాధారణ బ్యాంకులు వడ్డీ ఖాతాలతో పాటు వడ్డీ ప్రమేయంలేని ఖాతాలు కూడా నడుపుతున్నాయి. ఈ ఖాతాలు లాభ నష్టాల ప్రాతిపదిక (Loss and Profit basis)పై నడుస్తాయి. అంటే ఈ ఖాతాలలో డబ్బు డిపాజిట్ చేసుకునే ఖాతాదారులకు లాభాలు కూడా వస్తాయి; ఒక్కొక్కసారి నష్టాలు కూడా వచ్చే అవకాశం ఉందన్నమాట. అయితే వరల్డ్ బ్యాంకు పరిశీలన

ప్రకారం ఈ ఖాతాదారులకు ఇప్పటిదాకా లాభాలే వస్తున్నట్లు తెలుస్తోంది.

వడ్డీ ప్రమేయంలేని ఖాతాలలో ప్రజలు చేసుకునే డిపాజిట్‌లను బ్యాంకు వాణిజ్య సంస్థలలో పెట్టుబడి పెడ్తుంది. వాణిజ్య సంస్థలు ఆ డిపాజిట్ పైకంతో వ్యాపారంచేసి తద్వారా వచ్చిన లాభాలను నిష్పత్తి ప్రకారం బ్యాంకుకు అందజేస్తాయి. బ్యాంకు ఆ లాభాలలో తన ఇష్టాబ్లిష్‌మెంట్ ఖర్చులు తీసేసుకొని మిగిలిన పైకాన్ని డిపాజిట్‌ల నిష్పత్తి ప్రకారం ఖాతాదారులకు (Account Holders) అందజేస్తుంది.

పాకిస్తాన్‌లో ఇలాంటి ఖాతాదారులకు తమ డిపాజిట్‌లపై వడ్డీ తీసుకునే ఖాతా దారులకన్నా ఎక్కువ లాభాలు లభిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం కూడా వరల్డ్ బ్యాంకు పరిశీలనలో వెల్లడయింది. అయినప్పటికీ అమెరికన్లు, యూరోపియన్ల ప్రాబల్యం కింద ఉన్న ప్రపంచ బ్యాంకు వడ్డీ ప్రమేయంలేని ఇలాంటి బ్యాంకులకు, ఖాతాలకు ఏమాత్రం ప్రాముఖ్యం ఇవ్వడం లేదు.

వరల్డ్ బ్యాంకుతో సహా ప్రపంచంలోని పెద్దపెద్ద బ్యాంకులపై యూదుల ప్రభావమే ఎక్కువగా ఉంది. యూదులకు వడ్డీయే ఊపిరి. వారి మతగ్రంథం తౌరాత్‌లో దేవుడు వడ్డీని నిషేధించాడు. వారి ప్రవక్త హజ్రత్ మూసా (అలైహి) కూడా వడ్డీ జోలికి పోరాదని హితవు చేశారు. అయినా యూదులు ఆ మత బోధనలను తారుమారు చేసి వడ్డీని ఒక వ్యాపారంగా మార్చి పేదప్రజల రక్తాన్ని పీలుస్తున్నారు. హజ్రత్ మూసా (అలైహి) సమక్షంలోనే విగ్రహారాధనకు పాల్పడిన ఆ జాతి తౌరాత్ లోని దైవాజ్ఞల్ని తారుమారు చేసి వడ్డీని సైతం ధర్మసమ్మతం చేసుకున్నది.

"యూదులుగా మారినవారు ఎన్నో అన్యాయాలు, అక్రమాలకు పాల్పడ్డారు. వారు దైవమార్గంలో ఆటంకాలు సృష్టిస్తారు. వడ్డీ (వ్యవహారం) నిషేధించబడినప్పటికీ వారు దాన్ని (నిస్సంకోచంగా) తీసుకుంటారు. ప్రజల సొమ్మును అక్రమ పద్ధతుల ద్వారా కాజేస్తారు. ఈ కారణాల వల్ల మేము గతంలో ధర్మసమ్మతం చేయబడిన అనేక పరిశుద్ధ వస్తువుల్ని వారికి నిషేధించాము. వారిలో అవిశ్వాసులైనవారి కోసం మేము దుర్భరమైన (నరక) యాతనల్ని సిద్ధపరచి ఉంచాము." (ఖుర్‌ఆన్–4:160,161)

పచ్చి స్వార్థపరులు, భయంకరమైన కుట్రదారులు, అక్రమసంపాదనా పరులైన యూదుల పెట్టుబడిదారీ వ్యవస్థ రాక్షసికి వడ్డీయే ప్రత్యర్థుల్ని పొడిచే ఒంటికొమ్ము. ఆ రాక్షసికి ప్రధాన శత్రువు ఇస్లామీయ ఆర్థికవ్యవస్థే. దాని ఒంటికొమ్మును విరగ్గొట్టే సత్తాగల ఇస్లామీయ ఆర్థికవ్యవస్థ యోధుని దగ్గరున్న ముఖ్యమైన ఆయుధాలు జకాత్ విధి, వడ్డీ నిషేధాలే. అందుకే యూదులు ప్రారంభం నుంచీ ముస్లింల దగ్గరున్న ఈ రెండు ఆయుధాలను లాక్కొని వారిని శాశ్వతంగా నిరాయుధులుగా, నిరాశ్రయులుగా చేయడానికి, ఇస్లామీయ జీవనవ్యవస్థ నుండి రాజకీయ, ఆర్థిక రంగాలను వేరుచేయ డానికి, రకరకాల కుట్రలు పన్నడానికి పడరాని పాట్లు పడుతున్నారు.



ముందుగా వారు క్రైస్తవుల్ని మచ్చిక చేసుకొని, వారిపై తమ ఆర్థికాధిపత్యాన్ని రుద్ది వారి ద్వారా ఈ కుట్రలు, కుయుక్తులు పన్నడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో యూదులు చాలా వరకు సఫలం కూడా అయ్యారని చెప్పవచ్చు. కనుక న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై, లండన్‌లోని రైల్వేస్టేషన్లు-బస్సులపై బాంబు దాడులకు వ్యూహరచన చేసింది యూదులే అయివుంటారని ఎవరైనా అంటే అందులో ఆశ్చర్య పడాల్సిన అవసరంలేదు. వారి నరనరాల్లో స్వార్థం, ధనపిపాస, మోసం, కుట్రలు జీర్ణించుకు పోయాయి. యూదులుకాని వారిపై పగపట్టి ప్రతీకారం తీర్చుకోవడంలో వారికి వారే సాటి. వారి రాతిగుండెల్లో దయ, సానుభూతి అనేవే లేవు. దివ్యఖుర్‌ఆన్ యూదుల రాతిగుండెలను గురించి ఇలా పేర్కొన్నది:

"మీ హృదయాలు పాషాణాల్లా కఠినమైపోయాయి. కాదు, అంతకంటే కూడా కఠినమై పోయాయి. పాషాణాలలో కొన్నిటి నుంచి నీటిఊటలు ఉబికి వస్తాయి. మరికొన్ని పగిలిపోయి వాటి నుంచి కూడా నీళ్ళు వస్తాయి. ఇంకా కొన్ని రాళ్ళయితే దైవభీతితో కంపించి క్రింద పడిపోతాయి. దేవుడు మీ చేష్టలను గమనించడంలేదని భావించకండి." (ఖుర్‌ఆన్–2:74)

ఇలాంటి యూదుల మనస్తత్వాన్ని మొదటిసారిగా ప్రపంచానికి వెల్లడించిన వ్యక్తి ఒక క్రైస్తవుడు. కాని ఈనాటి క్రైస్తవులు యూదుల ప్రయోజనాలను కాపాడుతూ, వారి అంతర్జాతీయ కుట్రలకు పావులుగా మారిపోవడం ఆశ్చర్యంగా ఉంది. యూదుల స్వభావాన్ని ఆసాంతం అర్థం చేసుకున్న ఈ క్రైస్తవుడే ప్రఖ్యాత ఆంగ్లేయ మహాకవి విలియం షేక్స్పియర్. ఈయన "మర్చెంట్ ఆఫ్ వెనిస్" అనే తన నాటక రచనలో షైలాక్ పాత్రధారిని యూదుల దుష్టస్వభావానికి ప్రతినిధిగా చిత్రించాడు. ఈ నాటకంలో షైలాక్ కథా కమామీసు ఏమిటో కాస్త తెలుసుందాం:

## 53. మర్చెంట్ ఆఫ్ వెనిస్

పూర్వం ఇటలీ దేశంలోని వెనిస్ పట్టణంలో షైలాక్, అంటోనియో అనే ఇద్దరు వర్తకులు ఉండేవారు. అంటోనియో క్రైస్తవుడు, ఎంతో సహృదయుడు, సకలజన ప్రియుడు. పేదల అవసరాలు తీర్చడం తన విధ్యుక్తధర్మమని భావించేవాడు. ఆపదలో ఉండి సహాయం చేయమని ఎవరైనా వస్తే వారిని ఎన్నటికీ నిరాశపరిచే వాడుకాదు.

షైలాక్ పరమ దురాశపరుడు, అత్యంత కఠినహృదయుడు. అతను వడ్డీవ్యాపారం చేస్తూ జనాన్ని జలగలా పట్టి పీడిస్తుండేవాడు. ఈ కారణంగా వెనిస్ ప్రజలు షైలాక్‌ని అసహ్యించుకుంటూ, అతడ్ని మనిషి రూపంలో ఉన్న తోడేలుగా పరిగణించేవారు.

అంటోనియోకు బసానియో అనే ఒక స్నేహితుడున్నాడు. అతనికి అంటోనియో తరచుగా సహాయం చేస్తుండేవాడు. ఒకసారి బసానియోకు డబ్బు అవసరమయి అంటోనియో ఇంటికి వెళ్ళి ఇలా అన్నాడు:

"అంటోనియో! నేనొక అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమించింది. కాని చిక్కేమిటంటే ఆ అమ్మాయి శ్రీమంతుల బిడ్డ. నేనా పేదవాణ్ని. ప్రేమకు సిరిసంపదల అవసరం లేదనుకో. కాని పేదరికం వల్ల పెళ్ళికొడుకు మామగారి దృష్టిలో చులకనైపోవడం కూడా మంచిదికాదు. అంటోనియో! నువ్వు ఎప్పుడూ నాతో సహకరిస్తూ వచ్చావు. ఈసారి కూడా నీ సహాయసహకారాలు కావాలి. పెళ్ళి చేసుకోడానికి నాకు మూడువేలు సర్దు, నీ మేలు నేను ఎప్పటికీ మరచిపోను."

దురదృష్టవశాత్తు ఆ సమయంలో అంటోనియో దగ్గర డబ్బులేదు. అతని వ్యాపార నౌకలు విదేశాలకు వెళ్ళివున్నాయి. అయితే అంటోనియో తన ప్రాణ స్నేహితుణ్ని నిరాశ పరచదలచలేదు. అతను కాస్సేపు ఆలోచించి ఇలా అన్నాడు:

"మిత్రమా! నా దగ్గరున్న డబ్బంతా ప్రస్తుతం వ్యాపారంలో పెట్టాను. కాని నీకు ఎలాగైనా సరే నీవు కోరిన పైకం సర్దుతాను, నావెంట పోదాం, రా."

ఇలా చెప్పి అంటోనియో తన స్నేహితుణ్ని వెంటబెట్టుకొని వెనిస్ పట్టణంలోనే ఉన్న షైలాక్ దగ్గరికెళ్ళాడు. అతనితో "షైలాక్! నాకు వెంటనే మూడు వేల డ్యూకట్లు కావాలి. ఈడబ్బు చాలా అవసరం. దీనికి నీవు కోరినంత వడ్డీ ఇస్తాను" అని అన్నాడు.

అంటోనియో ఇలా అర్జంటుగా డబ్బు అడగ్గానే షైలాక్ మనసులో రకరకాల ఆలోచనలు తుఫానులా చెలరేగాయి.... "ఎల్లప్పుడూ నన్ను తూలనాడుతూ, నా జాతిని అగౌరవ పరుస్తుండేవాడివి కదూ! నీ మూలంగానే ఎప్పుడూ నా వ్యాపారానికి నష్టం వాటిల్లుతోంది. ఈరోజు అప్పు కోసం నా దగ్గరికొచ్చావు. నీ మీద ప్రతీకారం తీర్చుకోవడానికి ఇదే మంచిఅవకాశం. ఇక నీవు నా వలలో పడి తప్పించుకోలేవులే."

షైలాక్‌లో ప్రతీకారవాంఛ పడగవిప్పింది. అతని ఆంతర్యంలో పేరుకున్న కసి ఒక్కసారిగా ప్రజ్వరిల్లింది. కాని షైలాక్ యూదుడు కదా! యూదులు తమ ప్రతికారాన్ని, కుతంత్రాలను ఏమాత్రం బహిర్గతం చేయకుండా నివురుగప్పిన నిప్పులా ఉండిపోతారు. షైలాక్ కూడా ఆంతర్యంలో ప్రతీకారజ్వాలలు ఎగిసిపడుతున్నా వాటిని అదుపులో పెట్టుకొని పైకి ప్రశాంతంగా ఇలా అన్నాడు:

"అంటోనియో! నీవు అడిగిన పైకం తప్పకుండా ఇస్తాను. దానిమీద ఎలాంటి వడ్డీ కూడా నాకు అవసరం లేదు."

అంటోనియోకు ఆశ్చర్యం వేసింది. పరమ ధనపిశాచి అయిన షైలాకేనా ఈ మాటలు అంటున్నది అనుకున్నాడు మనసులో...."షైలాక్! చెప్పేదేదో సూటిగా చెప్పు. ఆర్థిక వ్యవహారం దగ్గర ముసుగులో గుద్దులాట పనికిరాదు" అన్నాడు అంటోనియో షైలాక్‌ని అనుమానాస్పదంగా చూస్తూ.

"నిజమే చెబుతున్నా అంటోనియో! నేను నీ దగ్గర వడ్డీ వసూలు చేయను. అయితే ఒక షరతు......" అన్నాడు షైలాక్ మెల్లిగా అసలు విషయానికొస్తూ.



"ఏమిటా షరతు?" అడిగాడు అంటోనియో.

"ఆ షరతు ఏమిటో ఇక్కడ చెప్పను. మనం ఒక లాయర్ దగ్గరికి వెళ్దాం. అక్కడ చెబుతాను" అన్నాడు షైలాక్. తరువాత ముగ్గురూ కలసి లాయర్ దగ్గరికి వెళ్ళారు అగ్రిమెంటు రాయించుకోవడానికి.

"నేను అంటోనియోకు మూడువేలు ఇచ్చి దానిమీద ఒక్క పైసా కూడా వడ్డీ తీసుకోనని చెప్పాను. అయితే ఈ మూడువేలు నిర్ణీత గడువులోగా తిరిగి ఇస్తానని అంగీకరిస్తూ ఇతను అగ్రిమెంటు మీద సంతకం చేయాలి. ఒకవేళ నిర్ణీత గడువులోగా నాడబ్బు తిరిగి ఇవ్వలేకపోతే చట్టప్రకారం ఇతని మీద చర్య తీసుకునే అధికారం నాకుంటుంది. ఇతని దేహంలో నేను కోరుకున్న చోటు నుంచి ఒక పౌండు మాంసం కోసి తీసుకుంటాను" అన్నాడు షైలాక్ లాయర్ ముందు.

షైలాక్ పరిహాసానికి ఇలా అంటున్నాడని భావించాడు అంటోనియో. అయినా ఇది విచిత్రమైన షరతు. ఇలాంటి షరతును ఎవరు అమలుపరుస్తారు అనుకున్నాడు. కాని ఈ షరతు మాట వినగానే బసానియో కోపంతో దిగ్గున లేచినిలబడ్డాడు. అంటోనియో అతణ్ని వారిస్తూ "బసానియో! కూర్చో. డబ్బు తీసుకునే మనం ఇక్కడ్నుంచి వెళ్దాం" అన్నాడు.

తరువాత అతను షైలాక్ వైపు తిరిగి "ఈ షరతును నేను ఒప్పుకుంటున్నాను. అగ్రిమెంటు మీద సంతకం పెట్టడానికి సిద్ధంగా ఉన్నాను" అని చెప్పాడు.

స్నేహితుడు నిరాశపడటం అతనికి ఇష్టం లేదు. అదీగాక తన వ్యాపార నౌకలు సకాలంలో తిరిగివస్తాయని, షైలాక్ డబ్బు వాపసు చేయగలనని అతనికి గట్టి నమ్మకం ఉంది. లాయర్ సమక్షంలో అగ్రిమెంటు రాయడం పూర్తయింది. అంటోనియో దాని మీద సంతకం పెట్టాడు. షైలాక్ లోలోన ఎంతో సంతోషించాడు.

అంటోనియో షైలాక్‌నుంచి తీసుకున్న పైకం బసానియోకు ఇచ్చేశాడు. బసానియో డబ్బు తీసికెళ్ళి పెళ్ళిసన్నాహాల్లో నిమగ్నుడైపోయాడు. బసానియో కోసం అతని ప్రియురాలు పోర్షియా తీవ్రంగా నిరీక్షిస్తూ కూర్చుంది. తాను పేదవాణ్ణని, తన దగ్గర ప్రేమ తప్ప మరేదీ లేదని అతను అన్నప్పుడు ఆమె ముఖం తామరపువ్వులా విచ్చుకుంది.

"బసానియో! ప్రేమకు జవాబుగా నేను ప్రేమనే కోరుకుంటున్నాగాని, డబ్బు కాదు. డబ్బు విషయానికొస్తే నా దగ్గరున్న ఆస్తి అంతా నీదే" అంటూ పోర్షియా ఆనందంతో తన వ్రేలికున్న ఉంగరం తీసి బసానియో వ్రేలికి పెట్టింది.

బసానియో సంతోషిస్తూ "పోర్షియా! నేనీ ఉంగరాన్ని నా ప్రాణసమానంగా చూసుకుంటాను. ఎలాంటి పరిస్థితిలోనూ దీన్ని నావ్రేలి నుంచి తీసేయను" అని అన్నాడు.

బసానియో ఇంకా పెళ్ళిసన్నాహాల్లో ఉండగానే అతనికి అంటోనియో దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో ఇలా ఉంది:

"బసానియో! దురదృష్టవశాత్తు నా వ్యాపారనౌకలన్నీ సముద్రంలో మునిగిపోయాయి. డబ్బు విషయంలో షైలాక్‌తో చేసుకున్న ఒప్పందం గడువు ముగిసి పోబోతున్నది. గడువు ముగిస్తే మాత్రం ఆ దుర్మార్గయూదుడు నాశరీరం నుండి పౌండు మాంసం తప్పక కోస్తాడు ఇక నేను జీవించి ఉంటానని నమ్మకం లేదు. చనిపోయే ముందు నిన్నొకసారి చూడాలనివుంది. వెంటనే ఇక్కడికి వస్తావని ఆశిస్తున్నా."

ఉత్తరం చదవగానే బసానియో ముఖం వాడిపోయింది. గుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి. కాళ్ళుచేతులు వణకసాగాయి.

పోర్షియా అతని వాలకం చూసి ఆందోళన చెందింది. అతని వైపు కంగారుగా చూస్తూ "బసానియో! ఏమిటా ఉత్తరం? ఎక్కడ్నుంచి వచ్చింది? ఏముంది అందులో" అని ప్రశ్నల వర్షం కురిపించింది.

బసానియో జరిగిన వృత్తాంతాన్ని పూసగుచ్చినట్లు చెప్పాడు.

"బసానియో! ఈసంగతి నా హృదయాన్ని ఎంతో కలచివేసింది. ఇప్పుడు మనమిద్దరం వెంటనే పెళ్ళిచేసుకోవడం మంచిది. దానివల్ల చట్టపరంగా నీవు నా ఆస్తికి వారసుడవుతావు. ఆ తరువాత నీవు ఈ డబ్బుతో అప్పు తీర్చవచ్చు. ఆ యూదుడు అడిగినంత వడ్డీ కూడా ఇవ్వచ్చు. నా ఆస్తి ఇలాంటి ఆపద్సమయంలో ఉపయోగపడకపోతే ఇంకెప్పుడు ఉపయోగపడుతుంది?" అన్నది పోర్షియా.

బసానియో ఆనందంతో వెంటనే పెళ్ళికి ఉపక్రమించాడు. పెళ్లి వైభవంగా జరిగింది. పెళ్లికాగానే బసానియో భారీఎత్తు డబ్బు తీసుకొని వెనిస్ పట్టడానికి వెళ్ళాడు.

కాని అప్పు చెల్లించాల్సిన గడువు అప్పటికే దాటిపోయింది. అప్పు పైకానికి ఇరవై రెట్లు ఎక్కువ ఇస్తానన్నాడు బసానియో. కాని షైలాక్ డబ్బు తీసుకోవడానికి ఒప్పుకోలేదు. ఒప్పందం ప్రకారం అంటోనియో దేహం నుండి పౌండు మాంసం తీసుకోవడానికే అతను సిద్ధమయ్యాడు.

దాంతో బసానియో చిక్కుల్లో పడిపోయాడు. అతని వైవాహిక సుఖసంతోషాలన్నీ ఎగిరిపోయాయి. తన మూలంగా తన ప్రాణమిత్రుడికి ప్రాణసంకటం వచ్చిపడింది. దాన్నుంచి బయటపడే మార్గం కన్పించడం లేదు. ఏం చెయ్యాలో దిక్కుతోచడం లేదు. నలువైపులా నిరాశాచీకట్లు కమ్ముకొస్తున్నాయి. అంటోనియో ఎప్పుడో నిరాశచెందాడు.

షైలాక్ మాత్రం తన ప్రత్యర్థి అంటోనియోపై ప్రతీకారం తీర్చుకోబోతున్నానన్న భావంతో తెగ సంబరపడిపోతున్నాడు. ఇంతకాలానికి తన కోరిక నెరవేరబోతున్నదని మనసులోనే మహా మురిసిపోతున్నాడు.



షైలాక్, అంటోనియోల కేసు వెనిస్ పట్టణాధికారి దగ్గరకు పోయింది. పట్టణాధికారి ఒప్పందం పత్రాన్ని షైలాక్ దగ్గర్నుంచి తీసుకొని పరిశీలించసాగాడు. అంతలో ఒక యువకుడు న్యాయస్థానంలో అడుగుపెట్టాడు. అతను నేరుగా పట్టణాధికారి దగ్గరికెళ్ళి అతనికి ఒక ఉత్తరం అందించాడు. అది ఓ ప్రఖ్యాత న్యాయవేత్త రాసిన ఉత్తరం.

"మహాశయా! నేను అంటోనియో తరఫున ఈ కేసుపై వాదించడానికి కోర్టుకు రావాలని భావించాను. కాని ఏం చెయ్యను, జబ్బుపడివున్నాను. కోర్టుకు రాలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. అయితే నాదొక విన్నపం. అంటోనియో తరఫున వాదించడానికి ఈ కేసును దయచేసి ఈ లేఖ తీసుకొచ్చిన యువకునికి అప్పగించండి. ఇతని పేరు బాల్‌హితాజార్. నా అభ్యర్ధన మన్నిస్తారని ఆశిస్తున్నాను" అని ఉత్తరంలో ఉంది.

పట్టణాధికారికి అందులో అభ్యంతరం ఏముంది. వెంటనే ఆ యువకునికి అంటోనియో తరఫున వాదించేందుకు అనుమతి ఇచ్చాడు.

బాల్‌హితాజార్ ముందుగా షైలాక్‌ని ఉద్దేశించి మాట్లాడాడు. అతని ముందు తన అసమాన వాగ్ధాటితో దయ, జాలి, కనికరాల విలువల్ని గురించి మనసుకు హత్తుకునే విధంగా ఓ చిన్న ఉపన్యాసమిచ్చాడు. దతు అనేది ఓ కారుణ్యమేఘమని, అది దయ చూపేవాడికి, దయచూపబడే వాడికి ఉభయులకూ ప్రయోజనం కలిగిస్తుందని అన్నాడు. ఇంకా అనేక విధాలుగా నచ్చజెప్పాడు.

కాని ఈ బోధ, ఉపదేశాలేవీ షైలాక్ పాషాణహృదయాన్ని కరిగించలేకపోయాయి. అతను పట్టినపట్టు విడువడానికి ఏమాత్రం సిద్ధంగా లేడు.

"నాకదంతా తెలియదు. ఒప్పందం ప్రకారం అంటోనియో శరీరం నుండి ఒక పౌండు మాంసం తీసుకోవడానికి చట్టపరంగా నాకు హక్కుంది. ఈ హక్కును నేను ఎలాంటి పరిస్థితిలోనూ వదలుకునే ప్రసక్తి లేదు" అన్నాడు షైలాక్ మొండికేస్తూ.

షైలాక్‌లోని రాక్షసప్రవృత్తి స్పష్టంగా బహిర్గతమైంది. అతను కోరే ఒక పౌండు మాంసం అంటోనియో తొడ నుంచో, చేతి నుంచో కాదు. ఎదుర్రొమ్ము దగ్గర కత్తి పెట్టి కోసి తీసుకుంటానన్నాడు. దానికోసం అతను కత్తి కూడా తెచ్చుకున్నాడు. అంటోనియో శరీరం నుంచి పౌండుమాంసం తప్ప మరే వస్తువునీ స్వీకరించేది లేదని తెగేసి చెప్పాడు.

అతనలా మొండిపట్టు పట్టడం చూసి పట్టణాధికారి ఇక చేసేదిలేక చట్టప్రకారం అంటోనియో శరీరం నుంచి మాంసం కోసి తీసుకునేందుకు అనుమతించాడు. పట్టణాధికారి అలా అనుమతి ఇవ్వగానే కోర్టులో అందరూ ఉత్కంఠతతో షైలాక్ వైపు చూడసాగారు. షైలాక్ కత్తికి మరింత పదునుపెట్టి అంటోనియోకు దగ్గరగా వెళ్ళాడు. అంతలో "ఆగు" అన్నాడు యువ న్యాయవాది బాల్‌హితాజార్.

"షైలాక్! ఒప్పందంలోని షరతు ప్రకారం అంటోనియో శరీరం నుంచి నీవు ఒక పౌండు మాంసం మాత్రమే కోసి తీసుకోగలవు. కాని జాగ్రత్త! అలా కోస్తున్నప్పుడు ఒక్క

బొట్టు కూడా రక్తం చిందకూడదు" అన్నాడు హెచ్చరిస్తూ.

ఈమాటలు వినగానే షైలాక్ తెల్లమొహం వేశాడు. తన కుట్ర బెడిసికొట్టినందుకు నివ్వెరపోయాడు. కోర్టులో సర్వత్రా నిశ్శబ్దం తాండవించింది.

"ఒప్పందంలో షైలాక్ ఒక పౌండు మాంసం తీసుకుంటాడని మాత్రమే ఉంది. కాని అందులో మాంసంతో పాటు ఒక్క చుక్కయినా రక్తం చిందించవచ్చని ఎక్కడా పేర్కొనలేదు. ఒకవేళ రక్తం ఒక చుక్కయినా సరే చిందితే చట్టపరంగా అతని ఆస్తంతా జప్తు చేయడం జరుగుతుంది" అన్నాడు యువన్యాయవాది నొక్కి పలుకుతూ.

షైలాక్ అదిరిపోయాడు. మీద పిడుగు పడినట్లు క్రుంగిపోయాడు. అతని మొహం మంగలం బొచ్చెలా నల్లగా మాడిపోయింది. అయినా కృత్రిమ గాంభీర్యంతో "అదెలా కుదురుతుంది? మాంసం కోసినప్పుడు రక్తం చిందకుండా ఎలాఉంటుంది?" అన్నాడు పట్టణాధికారి వైపు చూస్తూ.

"నీవు మాంసంతో పాటు రక్తం కూడా తీసుకోగలవని ఒప్పందంలో ఎక్కడుంది? వీల్లేదు. ఒక్క రక్తపుబొట్టు కూడా కారడానికి వీల్లేదు" అన్నాడు యువన్యాయవాది.

పట్టణాధికారి మాట్లాడకుండా షైలాక్ వైపు చూస్తూ ఉండిపోయాడు, 'దీనికి నీ సమాధానం ఏమిటన్నట్లు. పాపం షైలాక్ ఇరకాటంలో పడిపోయాడు. అంటోనియో, బసానియోలు మాత్రం తమ కేసు నెగ్గుతున్నందుకు లోలోన సంతోషిస్తున్నారు. పట్టణాధికారి యువన్యాయవాది వాదాన్ని సమర్థించాడు. దాంతో షైలాక్ పూర్తిగా నిరాశ చెంది కాళ్ళబేరానికి వచ్చాడు.

"అయితే మహాశయా! అంటోనియో మాంసం వద్దు పాడొద్దు. నా డబ్బు నాకు ఇప్పించండి చాలు. నేను వెళ్ళిపోతా" అన్నాడు.

బసానియో తన వెంట తెచ్చిన పైకాన్ని తీసి షైలాక్‌కు ఇవ్వబోయాడు. అప్పుడు యువన్యాయవాది మళ్లీ అడ్డుతగులుతూ ఇలా అన్నాడు:

"షైలాక్! నీకీ డబ్బు తిరిగిరాదు. నీవు వెనిస్ పట్టణానికి చెందిన ఒక పౌరుడి ప్రాణం తీయడానికి కుట్ర పన్నావు. అందువల్ల చట్టం ప్రకారం నీ ఆస్తిపాస్తులన్నీ జప్తు చేసే అధికారం కోర్టుకుంది. అయితే కోర్టు కోరితే నిన్ను క్షమించి వదిలేయవచ్చు."

యువన్యాయవాది మాటలు వినగానే షైలాక్ ముఖంలో కత్తివాటుకు నెత్తుటి చుక్కలేకుండా పోయింది. పాలిపోయిన మొహంతో పశ్చాత్తాపపడుతూ తల కిందికి దించుకున్నాడు. అయితే కోర్టు షైలాక్ ఆస్తిని జప్తు చేసుకోలేదు. అతడ్ని క్షమించి వదలిపెట్టింది. కాని అతని ఆస్తిని అతని కూతురికి దక్కేలా తీర్పు ఇచ్చింది.

యువ న్యాయవాది బాల్‌హితాజార్ సమయస్ఫూర్తి తెలివితేటల వల్ల అంటోనియో ప్రాణం దక్కింది. షైలాక్ దుష్టపథకం బెడిసికొట్టడంతో అతను న్యాయస్థానంలో అందరి ముందూ అభాసుపాలయ్యాడు. బసానియో సంతోషిస్తూ యువ న్యాయవాదికి (లాయర్) ఫీజు కింద కొంత డబ్బు ఇవ్వబోయాడు. కాని యువ న్యాయవాది బాల్‌హితాజార్ డబ్బు తీసుకోవడానికి నిరాకరిస్తూ, అతని వ్రేలికున్న ఉంగరం ఇవ్వమని అడిగాడు.



బసానియోకు ఈ ఉంగరం అతని భార్య ప్రేమకానుకగా ఇచ్చింది. దాన్నతను ప్రాణప్రదంగా చూసుకుంటున్నాడు. అంచేత దాన్ని యువన్యాయవాదికి ఇవ్వడానికి మనసొప్పలేదు. కాని ప్రాణస్నేహితుడి ప్రాణం కాపాడినందుకు సంతోషంగానే ఆ ఉంగరాన్ని యువన్యాయవాదికి ఇచ్చేశాడు.

కోర్టులో తమ కేసు నెగ్గినందుకు అంటోనియో, బసానియోలు సంతోషిస్తూ పరస్పరం అభినందించుకున్నారు. మరునాడు బసానియో స్నేహితుడి దగ్గర సెలవు తీసుకొని విజయానందంతో తన మామగారి ఊరికెళ్ళాడు. భార్య పోర్షియా దగ్గర యువ న్యాయవాది బాల్‌హితాజార్ చూపిన సమయస్ఫూర్తిని కొనియాడుతూ కోర్టులో జరిగిన వృత్తాంతమంతా పూసగుచ్చినట్లు వివరించాడు. యువన్యాయవాది కోరికపై లాయర్ ఫీజు కింద తానతనికి తన ఉంగరం ఇచ్చిన విషయాన్ని కూడా చెప్పాడు.

"ఏది ఇలాంటి ఉంగరమేనా మీరు న్యాయవాదికి ఫీజు కింద ఇచ్చింది?" అంటూ పోర్షియా తన బ్యాగ్‌లోనుంచి ఒక ఉంగరం తీసి చూపెట్టింది.

"ఇలాంటి ఉంగరమే... ఔను, ఇలాంటి ఉంగరమే. ఏవిటీ, ఈ ఉంగరమే నేను న్యాయవాదికిచ్చింది. కాని ఇది నీ దగ్గరకు ఎలా వచ్చింది!?" అన్నాడు బసానియో సంభ్ర మాశ్చర్యాలు వెలిబుచ్చుతూ.

"మీరు ఎప్పుడైతే మీ స్నేహితుడు చేసుకున్న ఒప్పందం, దానివల్ల అతను ప్రమాదంలో చిక్కుకున్న సంగతి గురించి నాకు చెప్పారో, అప్పుడే నేను మీ స్నేహితుడ్ని ఎలాగైనా కాపాడాలని నిర్ణయించుకున్నాను" అంటూ పోర్షియా తాను మగ లాయర్ వేషంలో కోర్టుకు ఎలా వచ్చింది మొదలైన వివరాలన్నీ తెలియజేసింది.

"అయితే ఆ యువలాయర్‌వి నువ్వేనన్న మాట!" అన్నాడు బసానియో ఆశ్చర్యం, ఆనందం మేళవించిన భావోద్రేకాలతో. "ఔను నేనే" అన్నది పోర్షియా చిరునవ్వుతో.

ఇదండీ! వడ్డీ పిశాచులు, కుట్రకోరులయిన యూదుల మనస్తత్వం!!

## 54. వడ్డీలేని రుణసంస్థలు

మన దేశంలో జమాఅతె ఇస్లామి సంస్థ వడ్డీలేని రుణసంస్థలు నెలకొల్పి అవసర మైనవారికి పరిమిత స్థాయిలో వడ్డీ లేకుండా అప్పులు ఇస్తోంది. రుణసంస్థల నిర్వహణ కోసం జనశ్రేయోభిలాషులైన ధనికుల నుండి షరతుతో కూడిన అప్పులు

(Conditional loans) తీసుకుంటుంది. అదీకాకుండా సంస్థల సభ్యుల నుంచి సభ్యత్వం ఫీజు కింద కూడా నెలకు కొంతపైకం వసూలు చేస్తుంది. సంస్థల నిర్వహణ ఖర్చులు మాత్రం సభ్యత్వ పైకం నుండి మినహాయిస్తుంది.

ఈ సంస్థలు రుణాలు రెండు రకాలుగా మంజూరు చేస్తాయి. ఒకటి, వస్తువులు కుదవపెట్టుకొని అప్పివ్వడం. రెండు, సంస్థ సభ్యులలో ఎవరైనా హామీ ఇస్తే దానిపై అప్పివ్వడం. అప్పులు కావలసినవారు దరఖాస్తులు చేసుకుంటే బంగారం లేదా మరేదైనా విలువైన వస్తువులు తాకట్టు పెట్టుకొనిగాని, లేక సంస్థసభ్యులు ఇచ్చే హామీ పైగాని వారికి రుణాలు అందజేస్తారు.

మన రాష్ట్రంలో జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యాన ఇలాంటి వడ్డీలేని రుణసంస్థలు 28 వరకు పనిచేస్తున్నాయి. ఈ సంస్థల ద్వారా జమాఅత్ సంవత్సరానికి కోటి రూపాయలకు పైగా ప్రజలకు వడ్డీ లేకుండా రుణాలు అందజేస్తోంది. కరీంనగర్ పట్టణంలో స్థాపించిన ఇలాంటి ఒక సంస్థ (Interest free money bank)కు 2000 పైగా ఖాతాదారులున్నారు. వారిలో 250 మంది ముస్లిమేతర ఖాతాదారులు కూడా ఉన్నారు. ఈ బ్యాంకు సంవత్సరానికి 35 లక్షల రూపాయలు వడ్డీ లేకుండా ప్రజలకు అప్పులిస్తోంది. దీని టర్న్ఓవర్ సంవత్సరానికి కోటి రూపాయలకు పైగా ఉంది.

జమాఅతె ఇస్లామి ఆధ్వర్యంలో వడ్డీలేని ఈ రుణసంస్థలు విజయవంతంగా పనిచేస్తున్నాయి. ఇచ్చిన రుణాలను రుణగ్రస్తుల నుండి విడతల (Instalments) వారిగా వసూలు చేస్తుంది. ఈ విధంగా జమాఅతె ఇస్లామి సంస్థ పరిమిత స్థాయిలో నైనా కొందరు ప్రజల్ని వడ్డీ భూతం నుండి కాపాడుతోంది.

## 55. వడ్డీని ధర్మసమ్మతం చేసే సాకులు

వడ్డీని ఇస్లాం పూర్తిగా నిషేధించినప్పటికీ చదువుకున్న కొందరు వ్యక్తులు దాన్ని ధర్మసమ్మతం చేయడానికి రకరకాల సాకులు చెబుతున్నారు. ఇలాంటివాళ్లు ముఖ్యంగా మూడు సాకులు చెబుతారు. ఒకటి: వీరు వడ్డీ కూడా వ్యాపారం లాంటిదే కదా అంటారు. రెండు: అప్పు తీసుకున్నవాడు అప్పిచ్చిన డబ్బుతో ప్రయోజనం పొందుతు న్నప్పుడు అప్పిచ్చినవాడికి తన పెట్టుబడి ద్వారా ప్రయోజనం పొందే హక్కు ఎందుకు ఉండకూడదని వాదిస్తారు. మూడు: ఇళ్ళు, ఫర్నీచర్ మొదలైన వస్తువులు ఇతరులకు తాత్కాలికంగా వాడుకోవడానికి ఇచ్చినప్పుడు వాటికి అద్దె వసూలు చేసినట్లే తమ డబ్బుకు కూడా వడ్డీ రూపంలో అద్దె వసూలు చేస్తే తప్పేమిటని ప్రశ్నిస్తారు.

ఈ వాదనలు వినడానికి బాగానే ఉన్నాయి. కాని దాని వాస్తవికత ఏమిటో విశదీకరిస్తేగాని అసలు విషయం బోధపడదు. దైవచట్టాలను, వాస్తవ దృక్పథాన్ని వదిలేసి తర్కశాస్త్రంలో నిష్ణాతులయినవారు తిమ్మిని బమ్మి చేయగలరు; చచ్చినవాడ్ని బతికించ గలుగుతారు. అంతమాత్రాన నిజం అబద్ధంగా మారదు. "గాడ్ ఈజ్ లవ్"



అనే సామెత ఉంది. అంటే దేవుడు ప్రేమస్వరూపుడు అని అర్థం. అలాగే "లవ్ ఈజ్ బ్లయిండ్" అనే మరో సామెత కూడా ఉంది. అంటే ప్రేమ గుడ్డిది అని అర్థం. అడ్డగోలుగా వాదించే వారెవరైనా ఈ రెండు సామెతలను తీసుకొని "సో, గాడ్ ఈజ్ బ్లయిండ్" (కాబట్టి దేవుడు గుడ్డివాడు) అన్నాడనుకోండి. అప్పుడు జనం అలాంటి వాడ్ని ఏమంటారు? "పోరా గుడ్డి వెధవా!" అని అనరా? ఇలా ఉంటుంది వాస్తవాన్ని కప్పిపుచ్చే వితండవాదం!

సరే, ఇప్పుడు మనం అసలు విషయానికి వద్దాం. వడ్డీని ధర్మసమ్మతం చేసే సాకులను గురించి వాటి వెనుక ఉన్న నిజానిజాలేమిటో పరిశీలిద్దాం:

(1) వడ్డీ కూడా వ్యాపారం లాంటిదే అనే విషయాన్ని పరిశీలిద్దాం. వ్యాపారంలో వర్తకుడు తన పెట్టుబడితో సరకు కొంటాడు. ఆ సరకుపై కొంత లాభం పెట్టుకొని అమ్ముకుంటాడు. దాని కోసం శ్రమిస్తాడు; సమయాన్ని వినియోగిస్తాడు. ఇంతే చేస్తే తప్పకుండా లాభమే వస్తుందన్న గ్యారంటీ లేదు. అమ్మకం, కొనుగోళ్ళలో వ్యాపార వస్తువులకు నష్టం కలిగే ప్రమాదం కూడా ఉంటుంది. కొంచెం పెద్ద వ్యాపారం అయితే దుకాణానికి, సరకుల నిల్వకు తీసుకునే భవనాలకు అద్దెలు చెల్లించవలసి ఉంటుంది. మరోవైపు సిబ్బంది వేతనాలు కూడా ఇవ్వాల్సి వస్తుంది. కాని రుణదాతకు ఈ బాధలేమీ ఉండవు. తాకట్టు వస్తువులు ఉండటం వల్ల తన పెట్టుబడిపై ఒక్క పైసా కూడా నష్టం వచ్చే ప్రసక్తిలేదు. ఈవిధంగా కాలుమీద కాలేసుకొని కూర్చొని డబ్బు ద్వారా డబ్బు సంపాదించే ఈ వడ్డీ వ్యవస్థను వ్యాపారం అనగలమా? వ్యాపారమని చెప్పాలంటే ఇది పేదల రక్తంపీల్చే వ్యాపారమని నిస్సంకోచంగా చెప్పవచ్చు.

(2) అప్పుతీసుకున్నవాడు ఆ డబ్బును మార్చి తనకు కావలసిన వస్తువులు సమకూర్చుకుంటాడు. అప్పిచ్చినవాడు కూడా తనకు కావలసిన వస్తువులు ఆ డబ్బుతో సమకూర్చుకో వచ్చుకదా! అతడ్ని ఈ పని నుండి ఎవరు నిరోధిస్తారు? నిజానికి అప్పిచ్చే వారెవరూ తమ అవసరాలను త్యాగం చేసి లేదా వాయిదా వేసుకొని ఆ డబ్బును ఇతరులకు అప్పుగా ఇవ్వరు. ఆ డబ్బు వారి ఇనుప్పెట్టలలోనో, బ్యాంకుల్లోనో మూల్గుతూ ఉంటుంది. ఆవిధంగా ఇనుప్పెట్టలలో, బ్యాంకుల్లో వృధాగా పడివుండే మిగులు (Surplus) పైకాన్ని పేదవాళ్ళకు వడ్డీ లేకుండా తాకట్టుపై అప్పుగా ఇస్తే వాళ్ళకు వచ్చే నష్టం ఏమిటీ? పేదలపై ఆ మాత్రం సానుభూతి చూపని ముస్లిం ధనికుల ధార్మిక విశ్వాసాన్ని గురించి ఏమని 'వర్ణించ'గలం?

రుణదాత మహాఅంటే 'నా డబ్బుతో ఇతరులకు ప్రయోజనం కలుగుతున్నప్పుడు అందులో నాక్కూడా కొంత ప్రయోజనం కలగాలి' అనంటాడు. రుణగ్రహీతకు దాని వల్ల ఒక అవసరం మాత్రం తీరుతుంది. అంతేకాని లాభాలు ఏమీ రావు. ఉదాహరణకు- ఓ పేదవాడు రుణదాతతో "నాకు యాభై రూపాయలు అప్పివ్వండి, దాంతో నేను గొడ్డలి కొని కట్టెలు కొట్టి అమ్ముకుంటాను" అని అంటాడనుకోండి. దానికి

రుణదాత "నువ్వు నాడబ్బుతో ప్రయోజనం పొందుతున్నావు గనక అందులో నా వాటాగా వడ్డీ రూపంలో కొంతివ్వాలి" అంటే పేదవాడు గత్యంతరంలేక ఒప్పుకుంటాడు.

ఆ తరువాత అతను కట్టెలు కొట్టి అమ్ముకున్నా ఆ వచ్చిన డబ్బుతో అతని జీవిత కనీసావసరాలు కూడా తీర్చుకోలేక సతమతమవుతూ అప్పు తీర్చడానికి కొంచెం కొంచెం మిగిల్చి పెడ్తాడనుకుందాం. అలా తీర్చేనాటికి వడ్డీతో సహా మొత్తం బాకీ నూట యాభై రూపాయలు అయినప్పుడు, అతని దగ్గర అంత కష్టపడి మిగిల్చినా వంద రూపాయలు కూడా జమకాకపోతే అతనేం చేయాలి?

రుణదాత బలవంతుడయితే గూండాల చేతనో లేదా పోలీసుల చేతనో ఆ పేదోడ్ని చితకబాదించి అతని ఇంటిసామగ్రిని స్వాధీనం చేసుకుంటాడు. ఇదేనా రుణదాత నుండి పేద రుణగ్రహీత పొందే ప్రయోజనం? రుణదాత పేదోడికిచ్చిన డబ్బు ద్వారా పొందే ప్రయోజనం అతని నడ్డి విరగ్గొట్టడం కాదా? పేదోడి ఆర్థిక బలహీనతను ఆసరాగా చేసుకొని పొందే ప్రయోజనం అక్రమ లాభం కాదా? వడ్డీ రూపంలోని ఈ అక్రమార్జనకు బదులు "నేను నీకిచ్చే డబ్బుతో కట్టెలు అమ్ముకో. వచ్చిన లాభంలో నాకు కొంత ఇవ్వు" అనంటే బాగుంటుంది. అప్పుడు డబ్బిచ్చే వాడు లాభంలోనూ భాగస్తుడవుతాడు, నష్టంలోనూ భాగస్తుడవుతాడు. డబ్బిచ్చేవాడు తానిచ్చే డబ్బుద్వారా ప్రయోజనంపొందడం అంటే ఇదే. ఇదే సక్రమార్జన, ధర్మ సమ్మతమైన ప్రయోజనం.

ఒకవేళ నా డబ్బుపై లాభమే రావాలిగాని, నష్టం ఏమాత్రం ఉండకూడదని పేదల నడ్డి విరగ్గొట్టి వారినుండి వడ్డీ వసూలుచేసే కఠినుడి రాతిగుండెను ఎవరు కరిగిస్తారు?

"మీ హృదయాలు పాషాణాల్లా కఠినమైపోయాయి. కాదు, అంతకంటే కూడా కఠినమై పోయాయి. పాషాణాలలో కొన్నిటి నుంచి నీటిఊటలు ఉబికి వస్తాయి. మరికొన్ని పగిలిపోయి వాటి నుంచి కూడా నీళ్ళు వస్తాయి. ఇంకా కొన్ని రాళ్ళయితే దైవభీతితో కంపించి క్రింద పడిపోతాయి. దేవుడు మీ చేష్టలను గమనించడంలేదని భావించకండి." (ఖుర్‌ఆన్-2:74)

దేశానికి వెన్నెముక, అన్నదాత అని పొగడబడే రైతన్నకు ప్రభుత్వం స్వయంగా భుజంతడుతూ బ్యాంకుల నుంచి అప్పు ఇప్పిస్తుంది. ఆ డబ్బుతో రైతన్న విత్తనాలు, ఎరువులు కొని రెక్కలు ముక్కలు చేసుకొని పంట పండిస్తాడు. ఆశించిన పంట చేతికి వస్తే సరే, ఒకవేళ ప్రకృతి వైపరీత్యాల వల్ల నాశనమయి నష్టమొస్తే బ్యాంకులు అతని రుణాన్ని మాఫీచేస్తాయా? అప్పు తీర్చడంలో ఆలస్యమైన కొద్దీ దాని వడ్డీ పాపపు కొండలా పెరిగిపోతే పేదరైతు దాన్ని ఎలా తీర్చగలుగుతాడు? తీర్చలేడు. అందుకే మన దేశంలో పేదరైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.



(3) మూడో విషయం అద్దె. డబ్బుకు అద్దె! ఈమాట వింటేనే ఆశ్చర్యం వేస్తుంది. సాధారణంగా అద్దెకు ఇచ్చే వస్తువులకు నిర్వహణఖర్చులు (Maintanance charges) యజమానే భరిస్తాడు. ఉదాహరణకు- ఇల్లు అద్దెకిచ్చినప్పుడు దాని మరమ్మత్తు వగైరా ఖర్చులు యజమానే పెట్టుకుంటాడు. అలాగే కారు అద్దెకిచ్చి నప్పుడు డ్రైవర్ జీతం, పెట్రోల్ ఖర్చులు దాని యజమానే భరిస్తాడు. అదీగాక అద్దెకు ఇచ్చే వస్తువు జీవితంకాలం క్రమంగా తగ్గిపోతుంది. అంటే దాని అరుగుదల ఖర్చులు (Depreciation charges) కూడా యజమానే భరిస్తాడు. ఈ కారణంగానే ఇతరుల కిచ్చే వస్తువులపై అద్దె వసూలుచేసే హక్కు అతనికి ఉంటుంది. రుణదాత తాను దాచుకున్న డబ్బు ఇతరులకు అప్పుగా ఇచ్చినంతమాత్రాన అతనిపై వచ్చిపడే ఆర్థిక బాధ్యతలేమీ ఉండవు. అలాంటప్పుడు రుణగ్రహీత నుండి వడ్డీ రూపంలో అదనంగా డబ్బు వసూలుచేసే అధికారం రుణదాతకు ఎందుకుండాలి?

## 56. కూర్చున్న కొమ్మను నరుక్కోవడమంటే ఇదే?

మన దేశంలో ముస్లిములు బ్యాంకుల నుండి లభించే వడ్డీని అనుభవించే విషయంలో కొందరు మరికాస్త ముందుకుపోయి ఈ వడ్డీ ధర్మసమ్మతమేనని నిరూ పించడానికి ప్రయత్నిస్తున్నారు. వీరు "దారుల్‌ఇస్లాం, దారుల్‌కుఫ్ర్, దారుల్‌హరబ్" అనే పారిభాషిక పదాలను తమ వాదనలకు ఆధారాలుగా చూపెడుతున్నారు.

దారుల్‌ఇస్లాం అంటే రాజ్యచట్టం (Law of the land) ఇస్లామీయ చట్టాలుగా అమల్లో ఉన్న ముస్లిందేశం అని అర్థం. దారుల్‌కుఫ్ర్ అంటే రాజ్యచట్టం ఇస్లామేతర చట్టాలుగా అమల్లోఉన్న ముస్లిమేతర దేశమని అర్థం. దారుల్‌హరబ్ అంటే ఇస్లామీయ రాజ్యం ప్రత్యర్థి దేశమని అర్థం. దారుల్‌హరబ్ ప్రజల నుండి లభించే ఎలాంటి సంపదనైనా ముస్లింలు తీసుకోవడం ధర్మసమ్మతమేనని ఫిఖ్హ్‌వేత్తల అభిప్రాయం. ఇప్పుడు ముస్లింలు బ్యాంకువడ్డీ తీసుకోవడాన్ని ధర్మసమ్మతంచేసే ఫత్వాలు జారీచేసిన ధర్మవేత్తలు మన దేశాన్ని దారుల్‌హరబ్ చిత్రించడానికి ప్రయత్నిస్తున్నారు.

కాని దారుల్‌హరబ్ ప్రస్తావన ప్రపంచంలో దారుల్‌ఇస్లాం దేశం ఉన్నప్పుడే ఉత్పన్న మవుతుంది. అలాంటి దేశం ఇప్పుడు ఎక్కడా లేదు. కనుక మన దేశాన్ని దారుల్ హరబ్‌గా చిత్రించడం ఏమాత్రం సరికాదు. ఇస్లాంవ్యతిరేక చట్టాలను ముస్లింలపై బలవంతంగా రుద్దబడనంతవరకు వారు మన దేశానికి సంబంధించిన ఇతర చట్టాలను గౌరవించవలసి ఉంటుంది.

ఉదాహరణకు మన దేశచట్టం ప్రకారం మద్యం సేవించడం, అమ్మడం, కొనడం చట్టసమ్మతమే అనుకోండి. అయినప్పటికీ ఇక్కడ ముస్లింలపై మద్యాన్ని బల వంతంగా రుద్దడం జరగడంలేదు. కనుక వారు ఇస్లాం ప్రకారం మద్యం జోలికి పోకూడదు. అలాగే మన దేశచట్టాలలో లంచం, వ్యభిచారం, జూదం మొదలైనవి నేరాలుగా

పరిగణించే చట్టాలు కూడా ఉన్నాయనుకుందాం. అప్పుడు ఈ దేశ ముస్లింలు ఆ చట్టాలు ఇస్లాంకు వ్యతిరేకం కాకపోయినా వాటిని గౌరవించవలసి ఉంటుంది.

పైన ప్రస్తావించిన మూడుచర్యలు ఇస్లాంలో కూడా నేరాలుగానే పేర్కొన బడ్డాయి. మద్యపానంపై నిషేధం దారుల్ఇస్లాంలో ఉన్నట్లే దారుల్హరబ్ లేదా దారుల్కుఫ్ దేశాలలో కూడా ఉన్నప్పుడు ముస్లింలు రెండు చోట్లా ఆ నిషేధాన్ని పాటించాలి. అయితే ఆ రెండు ప్రాంతాల మధ్య తేడా ఒక్కటే. దారుల్హరబ్ లేదా దారుల్కుఫ్ దేశంలో మద్యం సేవించడం కంటే దారుల్ఇస్లాం దేశంలో మద్యం సేవించడం తీవ్రమైన నేరం అవుతుంది.

ఈ విషయాన్ని మరో విధంగా చెప్పాలంటే ఇంటిని, మసీదును తీసుకోండి. మద్యం ఇంటిలో సేవించినా, మసీదులో సేవించినా పాపమే. కాకపోతే మద్యం మసీదులో కూర్చొని సేవిస్తే ఘోరమైన పాపమవుతుంది. గడ్డం పెట్టుకొని మసీదులో సేవిస్తే ఘోరాతిఘోరమైన పాపం అవుతుంది. ఇలాంటి ముస్లింలు దేవుని దృష్టి నుండి కూడా దిగజారుతారు, దైవదాసుల దృష్టి నుండి కూడా దిగజారుతారు.

సోషలిజాన్ని ప్రాణప్రదంగా ప్రేమించే ఒక కామ్రేడ్ మార్గాంతరం లేని పరిస్థితిలో ఏదైనా క్యాపిటలిస్ట్ దేశానికి వలస పోయాడనుకోండి. అక్కడ ఈ కామ్రేడ్ క్యాపిటలిస్టు లతో చేతులు కలిపి పెద్దకంపెనీ స్థాపించి కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించు కోగలడా? అక్కడి పెట్టుబడిదారీ విధానాలను అవలంబించి వందల ఎకరాల వ్యవసాయ భూములకు భూస్వామి కావడానికి ఉబలాటపడతాడా? తన సిద్ధాంతంపై దృఢనమ్మకం, ఆశయసాధనలో చిత్తశుద్ధి ఉన్న ఏకామ్రేడ్ కూడా ఇలా చేయలేడు.

స్వాతంత్ర్యానికి పూర్వం మన దేశంలో గాంధీ, నెహ్రూ వగైరా స్వాతంత్రోద్యమ నాయకులు ఖద్దరు బట్టలు ధరించి విదేశీవస్తు బహిష్కరణకు పిలుపు నిచ్చినప్పుడు తాను గొప్ప గాంధేయ వాదినని చెప్పుకునే, మాతృదేశంపై ఎల్లలులేని ప్రేమ ఉందని ప్రకటించుకునే మనిషి ఎవరైనా లండన్లో తయారైన ఖరీదైన సూటు ధరించడానికి, లండన్లోనే తయారైన గడియారం పెట్టుకోవడానికి ఇష్టపడతాడా? ఏమాత్రం ఇష్ట పడడు. ఆనాడు లండన్లో చదివి తెచ్చుకున్న ఐ.సి.యస్. పట్టాలు సైతం చింపేసి దేశస్వాతంత్రోద్యమంలో దూకిన త్యాగమూర్తులు ఉన్నారు.

తాను నమ్మిన సిద్ధాంతాలకు, ఆశయాలకు విరుద్ధంగా ఏ కామ్రేడయినా, ఏ గాంధేయవాదయినా ఈవిధంగా ఎన్నటికీ చేయడు. మరి ఏకేశ్వరుడైన అల్లాహ్ను, ఆయన ప్రవక్తను దృఢంగా విశ్వసించి అమితంగా ఆరాధించే అభిమానించే, తనను తాను స్వచ్ఛమైన ముస్లింఅని చెప్పుకునే ఏ మనిషైనా వారి ఆజ్ఞలకు బోధనలకు, వాటి ఆశయానికి వ్యతిరేకంగా ఉండే విషయాలను ఎలా పాటించగల్గుతాడు? ఇస్లాం ధర్మ శాస్త్రం పట్ల సరైన అవగాహన, దృఢమైన విశ్వాసం ఉన్న ఏముస్లిం కూడా తన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉండే ఏవిషయాన్నయినా అవలంబించి తాను కూర్చున్న చెట్టుకొమ్మను తానే నరుక్కునే దుస్సాహసానికి ససేమిరా పాల్పడలేడు. ఒకవేళ ఎవరైనా అలాచేస్తే అంతకంటే ఆత్మహత్యా సదృశం లోకంలో మరొకటి ఉండదేమో!



గమనార్హమైన మరో విషయం. మన దేశంలోని ట్రాఫిక్ రూల్స్ ప్రకారం ప్రజలు తమ వాహనాల్ని రోడ్డుకు ఎడమవైపున నడపాలి, ఈ రూల్స్ను ముస్లింలు కూడా పాటించాలి. వారు అమెరికా లేదా గల్ఫ్దేశాలకు వెళ్తే అక్కడి రూల్స్ ప్రకారం వాహనా లను రోడ్డుకు కుడివైపున నడపాలి. ఒకవేళ ఈ రూల్స్కు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ప్రమాదాలు సంభవించి ఆస్పత్రి పాలుకావలసి వస్తుంది. పైగా అలాంటి వారికి ప్రభుత్వం శిక్ష కూడా విధిస్తుంది. అదీగాక మరణానంతరం దైవశిక్షకు గురికావచ్చు.

ఈ ధర్మవేత్తలు మన దేశంలో బ్యాంకు వడ్డీ తీసుకోవడాన్ని మాత్రమే ఎందుకు ధర్మసమ్మతం చేయాలి? జూదం, మట్కాలను కూడా ధర్మసమ్మతం చేయవచ్చుకదా, ఎందుకు చేయరు? చేయరు. వీటిని ధర్మసమ్మతం చేస్తే దేశ పోలీసులు సంబంధిత నేరస్తుల్ని పట్టుకెళ్ళి వారి బొమికలు విరగ్గొడ్తారన్న భయం ఉంటుంది. మరి బ్యాంకు వడ్డీ తీసుకుంటే దైవపోలీసులు ముక్కెలు విరగతంతారన్న భయం లేదా? ప్రపంచ పోలీసులంటే ఈ ముస్లింలకు ఎంత భయం! పరలోక పోలీసులంటే కాస్తయినా భయం లేదన్న మాట!! ఏమి ధైర్యం వీరిది!!

# 57. వాణిజ్య రుణాలు

పోతే కొందరు 'ప్రముఖులు' వ్యక్తిగత అవసరాలకైతే అప్పిచ్చిన డబ్బుకు వడ్డీ తీసుకోవడం తప్పేగాని, వ్యాపార అవసరాల కోసం అప్పిచ్చే డబ్బుకు వడ్డీ వసూలు చేయడంలో ఎలాంటి తప్పు లేదని వాదిస్తారు. దైవప్రవక్త (సల్లం) కాలంలో అరబ్బులు అవలంబించిన రుణ విధానాలకే ఖుర్ఆన్ విధించిన వడ్డీ నిషేధం వర్తిస్తుందని, ఆనాటి రుణ విధానాలలో వాణిజ్య అవసరాల ప్రస్తావనే లేదు కాబట్టి ఈనాటి వాణిజ్య రుణాలపై ఉండే వడ్డీ నిషేధం క్రిందికి రాదని అంటారు వీరు.

కాని వీరు ఒక విషయం మరచిపోతున్నారు. వడ్డీ కోసం ఖుర్ఆన్లో వాడబడిన "రిబా" అనే పదానికి "మూలధనం (Capital amount)పై అదనపు ధనం (Extra amount)" అని అర్థం. ఈ అదనపు ధనాన్నే ఖుర్ఆన్ నిషేధించింది. దీన్నే మనం ఇప్పుడు వడ్డీ అంటున్నాము. ఆనాడు అరబ్బులు అప్పు ఏ ఉద్దేశ్యంతో తీసుకున్నారనే విషయాన్ని పరగణనలోకి తీసుకునేవారు కాదు. ఇచ్చేవాడికి తీసుకునేవాడి అవసరంతో ప్రమేయం లేదు. 'నేనిచ్చే పైకాన్ని నువ్వు ఫలానా పనికి మాత్రమే వినియోగించాలి' అనే షరతు విధించేవాడు కాదు. అతనికి కావలసిందల్లా తాను అప్పురూపంలో పెట్టే పెట్టుబడికి ప్రతిఫలంగా నిర్ణీత షరతు ప్రకారం అదనపు మొత్తం (Extra amount), అంటే వడ్డీ లభించడమే.

అందువల్ల ఆ కాలంలో రుణవ్యవహారాలు వ్యక్తిగత అవసరాల కోసమని, వాణిజ్య అవసరాల కోసమని, వ్యవసాయ అవసరాల కోసమని ఉండేవి కావు. వ్యక్తిగత రుణమయినా, వ్యాపార రుణమయినా, మరెలాంటి రుణమయినా అది రుణం కిందే లెక్క. అప్పు విషయంలో మూలధనం కంటే ఎక్కువ ధనం తీసుకునే ప్రతి వ్యవహారం వడ్డీయేనని వారు భావించేవారు. ఆనాటినుంచి ఈనాటివరకు ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫై (రహ్మలై) తదితర ఇమాములు, ప్రఖ్యాత ధర్మ వేత్తలు అందరూ మూలధనంపై అదనంగా తీసుకునే ఈపైకాన్ని ఖుర్‌ఆన్ నిషేధించిన వడ్డీగానే పరిగణిస్తూవచ్చారు. దీనిపై ఎవరికీ ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు.

ప్రాచీన భాష్యకారులలో 'జహాక్' ఖుర్‌ఆన్‌లోని "మీరు నిజంగా విశ్వసించిన వారయితే మీకు రావలసిన వడ్డీని వదిలేయండి" (2:278) అనే సూక్తిపై వ్యాఖ్యానిస్తూ "అనాగరిక కాలంలో (అరబ్) ప్రజలు అమ్మకం కొనుగోళ్ళ వ్యవహారంలో ఇచ్చిపుచ్చు కునే వడ్డీ ఇలాంటిదే" అని అన్నారు. (ఇబ్నెజరీర్)

హజ్రత్ ఖతాదా ఆనాటి వ్యాపార లావాదేవీలను గురించి ఇలా తెలియజేశారు: "ఆనాడు ఒక వ్యక్తి మరొకతనికి తన సరుకు అమ్ముతున్నప్పుడు దాని ధర చెల్లింపు కోసం ఒక గడువు నిర్ణయిస్తాడు. ఆ గడువులోపు కొన్నవాడు నిర్ణీతధర చెల్లించలేకపోతే అమ్మకందారుడు గడువును మరికొంతకాలం పొడిగించి మొదట్లో నిర్ణయించిన ధరను పెంచుతాడు. ఇదే ఆనాటి అనాగరికుల వ్యాపార విధానం." (ఇబ్నెజరీర్)

ఇది పెట్టుబడిదారుడు వర్తకునికి ముందుగానే నగదు రూపంలో ఇచ్చే వాణిజ్య రుణం కాదు. ఇది అమ్మకందారుడు తన సరుకును కొనుగోలుదారునికి అప్పుగా ఇచ్చే పద్ధతి. ఈ పద్ధతి ఈనాడు కూడా అనేక దేశాలలో కొనసాగుతోంది. గడువు దాటిన తరువాత దాన్ని మరికొంతకాలం పొడిగించి ముందుగా నిర్ణయించిన ధరను పెంచడం షరీఅత్ ప్రకారం వడ్డీ కిందికే వస్తుంది.

ఖలీఫా ఉమర్ (రజి) పాలనాకాలంలో జరిగిన సంఘటన. ఈజిప్టు గవర్నర్ అబూమూసా అష్‌అరీ (రజి) ఖలీఫా కుమారులు అబ్దుల్లా, ఉబైదుల్లాలకు వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వ ధనాగారం నుంచి కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. అయితే ఆతర్వాత ఖలీఫా ఈ రుణాన్ని అభ్యంతరకరమైన విషయంగా పరిగణించి మూల ధనంతో పాటు వ్యాపారంలో వచ్చిన లాభమంతా ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. చివరికి ఆయన కొందరి సలహాతో ప్రభుత్వధనాగారం నుంచి తీసుకున్న పైకాన్ని అప్పుకు బదులు వ్యాపార భాగస్వామ్యం (Bussiness partnership)గా పరిగణించి సగం లాభం వసూలు చేశారు. (మువత్తా- కితాబుల్‌ఖిరాజ్)

ప్రాచీనకాలంలో వడ్డీ లేకుండానే వ్యాపార అవసరాల కోసం రుణాలు ఇచ్చే పద్ధతి కూడా ఉండేదని ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. అందులో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:



"పూర్వం ఇస్రాయీల్ సంతతిలో ఒక వ్యక్తి మరొకతని దగ్గర వ్యాపారం కోసం వేయి దీనార్లు (ఈనాటి ధర ప్రకారం లక్షా అరవై వేల రూపాయలు) అప్పు తీసు కున్నాడు. అప్పుడతను రుణదాతతో 'ఈ వ్యవహారంలో నాకు, నీకు మధ్య దేవుడే సాక్షి! దేవుడే జామీనుదారుడు" అన్నాడు. ఇలా చెప్పి అతను ఓడలో పయన మయ్యాడు. అక్కడ తన వ్యాపార వ్యవహారాలు ముగించుకొని తిరుగు ప్రయాణం కోసం రేవు దగ్గరకు చేరుకున్నాడు. కాని అక్కడ చాలా రోజులదాకా ఎలాంటి నౌకలు దొరకలేదు. ఈలోగా అప్పు గడువు ముగిసిపో వచ్చింది.

"చివరికా వ్యక్తి ఓ కర్రకు రంధ్రంచేసి ఆ రంధ్రంలో వేయి దీనార్ల (నాణాల)తో పాటు ఒక లేఖ కూడా పెట్టి దాని రెండు చివర్లు మూసివేశాడు. అలా మూసేసిన ఆ కర్రను సముద్రంలో వదలిపెడ్తూ 'దేవా! నేను నిన్ను సాక్షిగా, పూచీకత్తుగా చేసి ఈ పైకం అతని దగ్గర అప్పుగా తీసుకున్నాను. ఇప్పుడు నీవే దీన్ని అతని దగ్గరకు చేర్చు" అని ప్రార్థించాడు. విధివశాత్తు అటు రుణదాత తన దేశంలో ఓరోజు సముద్ర తీరం మీద కూర్చొనిఉంటే అకస్మాత్తుగా ఆ కర్ర నీటి అలలపై తేలియాడుతూ అతని ముందుకొచ్చి ఆగిపోయింది. రుణదాత ఆ కర్రను చేతిలోకి తీసుకొని పరిశీలిస్తే అందులో వేయి దీనార్లతో పాటు తన పేర ఒక ఉత్తరం కూడా కన్పించింది.

"తరువాత కొంతకాలానికి రుణగ్రహీత స్వదేశానికి తిరిగొచ్చాడు. అతను అప్పు తీర్చడానికి వేయి దీనార్లు తీసుకొని రుణదాత దగ్గరకు పోయాడు. కాని రుణదాత ఆ డబ్బు తీసుకోవడానికి నిరాకరిస్తూ 'నాడబ్బు నాకు లభించింది చాలు' అన్నాడు."

(ఈ ఉల్లేఖనం బుఖారిలో ఏడు చోట్ల, నిసాయిలో ఒక చోట వచ్చింది.)

ఏమైనప్పటికీ వాణిజ్య రుణాలపై ఇచ్చే లేదా తీసుకునే వడ్డీ కూడా నిషిద్ధమేనని పై వివరణను బట్టి స్పష్టంగా తెలుస్తోంది. సాధారణంగా పేదలు, మధ్యతరగతి ప్రజలే వ్యక్తిగత అవసరాల కోసం పరిమిత స్థాయిలో అప్పు చేస్తారు. బడా వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు లక్షల్లో, కోట్లలో రుణాలు తీసుకుంటారు. అలాంటప్పుడు కరుణా మయుడు, కృపాసాగరుడయిన దేవుడు పెద్ద చేపలను వదలి చిన్న చేపలైన పేదలపై మాత్రమే వడ్డీ నిషేధం వేటు ఎందుకు వేస్తాడు? దేవునికి పేదలపై కంటే ధనికులపైనే అభిమానం ఎక్కువని ఈ అభ్యంతాలు లేవదీసేవారి భావమా??

# 58. అప్పుల ఊబిలో దేశం

ఈనాడు జాతీయబ్యాంకులు, దేశాలు రుణాలు మంజూరు చేయడానికి రకరకాల షరతులు విధిస్తున్నాయి. ఒక వ్యక్తి వ్యాపారం కోసం లేదా వ్యవసాయం కోసం లేదా పైచదువుల కోసం అప్పు అడిగినప్పుడు బ్యాంకులు అప్పు మంజూరు చేస్తూ సదరు వ్యక్తి వ్యాపారం లేదా వ్యవసాయం లేదా పైచదువులకు మాత్రమే ఈ పైకాన్ని వినియోగించాలని బ్యాంకులు షరతు విధిస్తాయి. ఈ షరతును ఉల్లంఘిస్తే అవి

రుణగ్రహీత నుండి వడ్డీతో సహా మొత్తం డబ్బు రాబట్టుకోవడానికి అతనిపై వత్తిడి తెస్తాయి. రుణగ్రహీత బలహీనుడైతే అతనిపై కఠినచర్యలు కూడా తీసుకుంటాయి.

ఇక ఒక బలమైన దేశం ఒక బలహీన దేశానికి అప్పులు ఇవ్వడంలో ఎన్నెన్నో షరతులు విధిస్తుంది. అలాగే అగ్రరాజ్యం చెప్పుచేతల్లో ఉన్న ప్రపంచబ్యాంకు కూడా అంతే. ఆర్థిక, ఆయుధ, సాంకేతిక శక్తియుక్తులు గల అగ్రరాజ్యాలు పేద దేశాలకు వడ్డీతో కూడిన అప్పులు సైతం నిస్వార్థంగా ఇవ్వవన్న సంగతి చాలా మందికి తెలుసు. ఆదేశాలు పేదదేశాల రుణాల ద్వారా మెడలు వంచి వీలైనంత ఎక్కువ ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తాయి.

అవి తామిచ్చే రుణాలు ఫలానా ఫలానా పనుల కోసమే వినియోగించాలని, తమదేశ ఉత్పత్తుల్ని అమ్ముకోవడానికి ఆ దేశాల తలుపులు బార్లా తెరచి ఉంచాలని, అవి తమ కరెన్సీ విలువలను తాము కోరిన విధంగా తగ్గించుకోవాలని, తమ మతాన్ని ప్రచారం చేసుకోవడానికి పూర్తి స్వేచ్ఛనివ్వాలని, ఆ దేశాలలో తమ కార్యకలాపాలు ఎలాంటివైనా వాటికి రాజకీయ అవాంతరాలు ఉండకూడదని ప్రత్యక్షంగానో, పరోక్షం గానో రకరకాల షరతులు విధిస్తాయి. ఈ షరతుల మూలంగానే పేద దేశాలలో విదేశీ రుణాల వల్ల ఆర్థిక సంక్షేమానికి బదులు ఆర్థిక సంక్షోభం ఏర్పడుతోంది. ఇప్పుడు మన దేశంలో కూడా అదే పరిస్థితి నెలకొన్నది.

గతదశాబ్దం మన దేశంలో ఏర్పడిన తీవ్రమైన ఆర్థికసంక్షోభం పట్ల జన సామాన్యం ఆందోళనపడుతున్నప్పుడు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు సంబర పడిపోయారు. ఆనాడు ప్రభుత్వం రూపాయి విలువను ఘోరంగా తగ్గించి, అత్యధిక విదేశీ మారకద్రవ్యం రాబట్టేందుకు ఎగుమతుల్ని ప్రోత్సహించడమే వారి సంతోషానికి కారణం. కాని నలభై ఏళ్ళ సుదీర్ఘపాలన చేసిన కాంగ్రెస్ నాయకులు దేశాన్ని పీకల దాకా అప్పుల ఊబిలోకి దించి సగటు పౌరుడిపై మోయలేని భారం వేశారు.

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారం చేపట్టక ముందు 1980లో అమెరికన్ డాలర్ విలువ 21.08 రూపాలుండగా అది 1991లో 25.95 రూపాయలకు పెరిగింది. అంటే మన రూపాయి విలువ 18.74 శాతం తగ్గిందన్నమాట. 28-6-1981 నాటికి బ్రిటన్ పౌండ్ విలువ 34.36 రూపాయలుండగా 1991లో ఇది 41.59 రూపాయలకు చేరుకుంది. అంటే రూపాయి విలువ 17.38 శాతం తగ్గిపోయింది. అలాగే పడిపోయిన రూపాయి విలువ ప్రకారం 1991 మధ్యకాలంలో ఆస్ట్రేలియన్ డాలర్ విలువ 19.88 రూపాయలు, ఫ్రెంచి ఫ్రాంక్ విలువ 4.16 రూపాయలు, జపాన్ 100 ఎన్‌ల విలువ 18.65 రూపాయలు, సౌదీ రియాల్ విలువ 6.90 రూపాయలు, బహ్రెయిన్ దీనార్ విలువ 68.96 రూపాయలు, కువైట్ దీనార్ విలువ 88.18 రూపాయలు అయ్యాయి.



1957-58లో ప్రవేశపెట్టిన మన మెట్రిక్ విధానపు రూపాయి ఎన్నో ఒడిదుడుకు లకు లోనవుతూ వచ్చింది. ఆనాటి రూపాయిలోని ఒక నయాపైసా ఈనాటి ఒక రూపాయితో సమానమంటే అతిశయోక్తి కాదేమో! 1970కు పూర్వమే ప్రభుత్వం రూపాయి విలువను బాగా కుదించింది. 1970-71ని ప్రమాణంగా తీసుకొని మళ్ళీ రూపాయి లెక్క ప్రారంభించింది. ఆతర్వాత కూడా రూపాయి విలువను తగ్గించింది. 1991లో మరోసారి తగ్గిపోయింది. ఈవిధంగా 1970-71లో ఉన్న మన రూపాయి విలువ 1991 నాటికి 11 పైసలకు దిగజారింది. అంటే 1971 నాటి ఒక రూపాయికి 100గ్రాములు వచ్చే వస్తువు 1991 నాటి రూపాయికి 11గ్రాములు మాత్రమే లభిస్తుంది. మరోమాటలో చెప్పాలంటే 1971లో ఒకానొక వస్తువు ధర ఒక్క రూపాయి మాత్రమే ఉందనుకుంటే అది 1991 నాటికి 9 రూపాయలకు పెరిగిపోయిందన్న మాట!

ఆనాడు ప్రభుత్వం రూపాయి విలువను తగ్గించడానికి అసలు కారణం ఏమిటో వింటే ఆశ్చర్యం కలుగుతుంది. విదేశాల నుండి తెచ్చిన భారీ రుణాలపై పాముపుట్టలా పెరిగిపోతున్న కోట్లాది రూపాయల వడ్డీని తీర్చేందుకు మళ్ళీ అప్పులు తీసుకురావడానికట! రూపాయి విలువ తగ్గిస్తేనే మనకు ఐరోపావారి అధీనంలోని "అంతర్జాతీయ ద్రవ్యనిధి" నుంచి అప్పు పుడ్తుందట!!

1980లో మన విదేశీరుణం 20 బిలియన్ల డాలర్లు మాత్రమే ఉండగా 1990 నాటికి ఈ రుణభారం 60 బిలియన్ల డాలర్లకు (6000 కోట్ల డాలర్లకు) చేరుకుంది. అంటే 1990 నాటికి దాదాపు 2,00,000 కోట్ల రూపాయలు మనం విదేశాలకు అప్పు పడ్డా మన్నమాట! మారిన మారకంవిలువ ప్రకారం ఈరుణం మీద సుమారు నలభై వేల కోట్ల రూపాయలు వడ్డీ తీర్చడానికే సరిపోతుంది!!

ఇక రూపాయి విలువ తగ్గింపు వల్ల ఎగుమతులు గణనీయంగా పెరిగి విదేశీ మారకద్రవ్యం ప్రవాహంలా వచ్చిపడుతుందని చెప్పింది అప్పటి ప్రభుత్వం. 1949లో, తిరిగి 1966లో రూపాయి విలువను తగ్గించినప్పుడు కూడా ఇలాగే చెప్పింది. 1950లో ప్రపంచవ్యాపారంలో మన ఎగుమతుల వాటా 2.2 శాతం ఉండగా, 1960లో 1.1 శాతానికి, 1970లో 0.7 శాతానికి, 1980లో 0.5 శాతానికి, 1990లో 0.45 శాతానికి పడిపోతూ వచ్చింది. ఎగుమతిచేసే దేశాల్లో మనదేశం 1950లో 16వ స్థానంలో ఉంటే, 1989లో 43వ స్థానానికి దిగజారిపోయింది. అలాగే 1987 మార్చిలో మన విదేశీ మారకం నిల్వలు 7645 కోట్ల రూపాయలుండగా 1990 జూన్ నాటికి అవి 2640 కోట్లకు పడిపోయాయి.

ఒకవేళ రూపాయి విలువ తగ్గింపు వల్ల ఎగుమతులు పెరుగుతాయనుకున్నా మహాఅయితే అయిదేళ్ళలో 1 శాతం మాత్రమే పెరగవచ్చు. ప్రపంచవ్యాప్త ఎగుమ తుల్ని దృష్టిలో పెట్టుకుంటే ఇది సముద్రంలో కాకిరెట్ట లాంటిదే. అయినా ఎగు మతులు పెరగడం వల్ల అత్యధికంగా లాభపడేదెవరు? పెట్టుబడిదారులు, బడా

వ్యాపారస్తులే కదా! సగటు పౌరుడికి మిగిలేదేమిటీ? కూరలేక కడుపు నింపుకోవడానికి మజ్జిగ, పున్నీళ్ళలో ఉల్లిగడ్డ నంజుకునే పేదోడిపై దీని ప్రభావం పడదా?

1991 జులై ప్రారంభంలో క్వింటాల్ 150 రూపాయలున్న ఉల్లిపాయల ధర అదే సంవత్సరం జులై మాసాంతానికి 325 రూపాయలకు చేరుకోవడం ఎగుమతుల పుణ్యం కాదా? దేశ ఆర్థిక దుస్థితికి అసలు కారణాలైన అవినీతిని, అక్రమ వ్యాపారాన్ని అరికట్టే బదులు జనసామాన్యాన్ని కష్టాల కడలిలో నెట్టివేసే ఇలాంటి ఆర్థిక విధానాల మూలంగానే ఆనాడు దేశం బంగారాన్ని కుదువబెట్టేంతగా దివాళా తీయవలసిన దుస్థితి ఏర్పడింది. విదేశీ రుణభారం మరింత పెరిగి, రూపాయి విలువ అధఃపాతాళానికి జారిన 2005వ సంవత్సరం జరుగుతున్న ఈనాడు ప్రజల జీవనప్రమాణం కాస్తంత మెరుగుపడి కొనుగోలు శక్తి పెరిగినప్పటికీ పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది.

## 59. లైఫ్ ఇన్‌స్యూరెన్స్

జీవితభీమా (లైఫ్ ఇన్‌స్యూరెన్స్) కూడా ఇప్పుడు ఓ పెద్ద వ్యాపారమై పోయింది. జీవితభీమా అనేది జూదం, వడ్డీల సమ్మేళన విధానం. ఇది మనిషి జీవితానికే పరిమితమైపోలేదు; వాహనాలు, యంత్రాలు, పరిశ్రమలు మొదలైన వాటన్నిటికీ ఇన్‌స్యూరెన్స్ వర్తింపజేస్తున్నారు. ప్రపంచంలో జీవితాలకు ప్రమాదం జరిగే ఇన్‌స్యూరెన్స్ పాలసీల కంటే ప్రమాదం జరగని పాలసీలే ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు ఏదైనా ఇన్‌స్యూరెన్స్ కంపెనీ వంద పాలసీలు సేకరిస్తే అందులో మహాఅయితే పది పాలసీలకు మాత్రమే ప్రమాదాలు జరుగుతాయి. అది కూడా ఎక్కువే. మిగిలిన తొంభై పాలసీలపై వచ్చే వడ్డీలో అత్యధిక భాగం కంపెనీకే లభిస్తుంది.

ఈ భీమా విధానంలో మూడు విషయాలు గమనార్హమైనవి ఉన్నాయి. ఈ మూడు విషయాలు కూడా ఇస్లాం ధర్మశాస్త్రానికి (షరీఅత్‌కు) విరుద్ధమయినవి.

ఒకటి, ఇన్‌స్యూరెన్స్ కంపెనీలు ప్రీమియం రూపేణ వసూలుచేసే పైకంలో అత్యధిక భాగాన్ని వడ్డీ వ్యవహారాలో వినియోగించి లాభాలు గడిస్తాయి. ఈ అక్రమ లావాదేవీలలో తన జీవితాన్నిగాని, లేదా ఏదైనా వస్తువునుగాని ఇన్‌స్యూరెన్స్ చేసిన వ్యక్తి కూడా భాగస్తుడయి పోతాడు. అంటే అతను కూడా ఇన్‌స్యూరెన్స్ కంపెనీ నిర్వహించే వడ్డీవ్యాపారంలో పరోక్షంగానైనా పాలుపంచుకుంటున్నాడన్న మాట.

రెండు, మరణం లేదా ప్రమాదం లేదా మరేదైనా నష్టం జరిగిన పక్షంలో ఇన్‌స్యూరెన్స్ కంపెనీ పాలసీదారునికి ఇంత పైకం చెల్లిస్తానని తీసుకున్న బాధ్యతలో జూదం సూత్రమే ఇమిడి ఉంది.

మూడు, పాలసీదారుడు చనిపోయిన పక్షంలో ఇన్‌స్యూరెన్స్ కంపెనీ చెల్లించే పైకం ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం అతను "చనిపోతూ వదలిపెట్టిన ఆస్తి" (తర్కా)గా



పరిగణించబడుతుంది. అలాంటి ఆస్తి షరీఅత్ చట్టం ప్రకారం మృతుని వారసులందరికీ లభించాలి. కాని అలా జరగడానికి బదులు ఇన్‌స్యూరెన్స్ కంపెనీ నిబంధనల ప్రకారం పాలసీదారుడు భీమా పైకం తన తదనంతరం తన వారసుల్లో ఎవరికి చెందాలని ముందుగానే వ్రాస్తాడో అతనికి మాత్రమే లభిస్తుంది.

## 60. ఔపాధిక వ్యవహారాలు

జీవనోపాధి కోసం అనేక ఒనరులు, మార్గాలు ఉన్నాయి. అయితే సాధారణంగా ప్రపంచంలో వ్యాపారం, వ్యవసాయం, కూలినాలి, రుణం-తాకట్టు, పెట్టుబడి-శ్రమ, భాగస్వామ్యం వగైరా మార్గాల ద్వారా మనిషి ఉపాధి సంపాదించుకుంటాడు. ఉపాధి అన్వేషణలో మనిషి అనేక విధాలా ఆలోచించి తన ఆర్థికస్తోమత, మేధా సామర్థ్యం, శారీరకశక్తి, నైపుణ్యం, ఆసక్తులను బట్టి ఏ పని చేయాలన్న నిర్ణయానికి వస్తాడు.

అయితే ఔపాధిక వ్యవహారాల్లో ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం కొన్ని చేయవలసినవి, కొన్ని చేయకూడనివి ఉంటాయి. చేయవలసిన వాటిలో ప్రాథమిక విషయం- రెండు పక్షాలు ఆమోదించాలి, ఇష్టపడాలి. ఇరువురిలో ఏ ఒక్కరికి ఇష్టం లేకపోయినా వ్యవహారం సాగదు. అంటే ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని ఎలాంటి బలప్రయోగాలకు తావుండకూడదు. చేయకూడనివాటిలో ప్రాథమిక విషయం- అక్రమమైనది, అధర్మమైనది కాకూడదు.

ఉభయపక్షాల ఆమోదం విషయానికి వస్తే అమ్మకం, కొనుగోళ్ళ వ్యవహారంలో దుకాణదారుడు, కొనేవాడు ఇద్దరూ ఇష్టపడాలి. అదేవిధంగా యజమాని, కార్మికుల మధ్య ఏదైనా వ్యవహారం నిర్ణయమయితే అది ఉభయపక్షాలకు ఆమోదయోగ్యంగా ఉండాలి. అయితే వారి వ్యవహారంలో అధర్మ వస్తువులు, అధర్మ కార్యాలు మాత్రం ఉండకూడదు. ఉదాహరణకు- వ్యాపార వ్యవహారంలో మోసం, అబద్ధం, వాగ్దాన భంగం, లంచం, వడ్డీ, అశ్లీలసామగ్రి, మత్తుపదార్థాలు ఉండకూడదు.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ధర్మయుక్త ఉపాధి మార్గాలలో కష్టపడి సంపాదించే పనికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన ఇలా ప్రవచించారు:

"కష్టపడి, కూలినాలి చేసే సంపాదించే ఉపాధి కంటే శ్రేష్ఠమయిన ఉపాధి మరొకటి లేదు." (బుఖారి) "నేను ఒక ఖిరాత్ (రూపాయి) రోజువారి వేతనం మీద ఖురైషీయుల మేకలను కాస్తుండేవాణ్ణి." (బుఖారి)

అదేవిధంగా హజ్రత్ దావూద్ (అలైహి), హజ్రత్ ఇద్రీస్ (అలైహి), మరికొందరు దైవప్రవక్తలు కూడా కష్టపడి సంపాదించిన ఉపాధినే అనుభవించేవారని అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) కొన్ని హదీసులలో తెలిపారు. ధర్మాధర్మ సంపాదనలను గురించి ఆయన ఇలా ప్రవచించారు:

"ధర్మయుక్తమైన సంపాదన కోసం పాటుపడటం ప్రతి ముస్లింకు విధిగా నిర్ణయించబడింది."

"ధర్మయుక్తమైన సంపాదన కోసం పాటుపడినందున లభించే పుణ్యఫలం జిహాద్ పుణ్యఫలంతో సమానం."

"అక్రమ సంపదతో పోషించబడిన శరీరం స్వర్గంలో ప్రవేశించలేదు."

"అక్రమ సంపాదన తిని చేసే ఆరాధనను దేవుడు ఆమోదించడు. అతని దుఆ (వేడుకోలు)ను ఆయన స్వీకరించడు."

"ఎవరైనా అన్యాయంగా ఇతరుల భూమిని జానెడు ఆక్రమించుకున్నా ప్రళయ దినాన దేవుడు అతని మెడలో అవమానకరమైన గుదిబండ కడ్తాడు."

# 61. వ్యాపారం

ప్రజలు తిండి, బట్ట, ఇతర జీవితావసరాలు సమకూర్చుకోవడానికి అన్నిటికంటే గొప్ప సాధనాలు రెండున్నాయి. ఒకటి, వ్యాపారం. రెండు, వ్యవసాయం. కాని ఈనాడు వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర ఉపాధి మార్గాలన్నీ వ్యాపారం అధీనంలోకి వచ్చేశాయి. వ్యాపారం సరైన విధానాలతో సాగకపోతే దేశంలో ఆహార పదార్థాలు, ఇతర జీవితావసరాలు ఎంత పెద్దఎత్తున ఉత్పత్తి అయినా వాటి కొరత ఉంటూనే ఉంటుంది. అలాగే వాటి ధరలు నానాటికి పెరుగుతూనే ఉంటాయి. వ్యాపారానికున్న ఈ ప్రాముఖ్యం దృష్ట్యానే దైవప్రవక్త (స) "ప్రజలకు ఉపాధి మార్గాలు పదిలో తొమ్మిది వంతులు (తొంభై శాతం) వ్యాపారం ద్వారానే లభిస్తాయి" అని అన్నారు.

వర్తకుల ఆలోచనా వైఖరిని, వారి మనస్తత్వాన్ని సంస్కరించి సరైనగాడిలో పెట్టేందుకు ఇస్లాం వ్యాపారానికి సంబంధించిన అనేక సకారాత్మక, నకారాత్మక సూచనలు చేసింది. ఈ సూచనలు రెండు విధాలుగా ఉన్నాయి. ఒకటి, నీతిపరమైనవి. రెండు, చట్టపరమైనవి. నీతిపరమైనవి అంటే, ఈ విషయాలు ముస్లిం మతవిశ్వాసాలకు, సాధారణ మానవ విలువలకు వ్యతిరేకమైనవని, అంచేత వాటి ఫలితాలు పరలోకంలో చాలా దారుణంగా ఉంటాయని బోధించడం. చట్టపరమైనవి అంటే, వాటిని ఉల్లంఘిస్తే ఈ ప్రపంచంలో కూడా శిక్ష విధించబడవచ్చు.

వ్యాపార లావాదేవీలలో జరిగే అబద్ధం, వంచన, వాగ్దానభంగం మొదలైన చెడులు సాధారణ నైతిక విలువలకు, ఇస్లామీయ విశ్వాసాలకు వ్యతిరేకమైనవి. వీటికి పరలోకంలో శిక్షలు ఉంటాయి. పదార్థాలలో కల్తీచేయడం, తూనికల్లో కొలతల్లో తగ్గించి ఇవ్వడంలాంటి అక్రమాలు దేశచట్టాల పరిధిలోకి కూడా వస్తాయి. కనుక మనిషి పట్టుబడితే ఈ నేరాలకు పరలోకంలోనే గాకుండా ప్రపంచంలో కూడా శిక్షలు పడతాయి. ఇలాంటి చెడులకు-అక్రమాలకు పాల్పడకుండా, కొనుగోలుదారుని



అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని హద్దుమీరిన లాభార్జనకు పోకుండా నిజాయితీగా వ్యాపారం చేసే వర్తకుడ్ని ఇస్లాం ప్రశంసిస్తుంది. అతని వ్యాపారంలో వర్ధివికాసాలు కలగజేస్తుంది.

ఒకసారి దైవప్రవక్త (స) ఒకతనికి ఒక దీనార్ (పైకం) ఇచ్చి, ఖుర్బానీ పశువును కొని తీసుకురమ్మని చెప్పి పంపారు. ఆ వ్యక్తి వెళ్ళి ఒక దీనార్‌తో ఒక పొట్టేలును కొని దాన్ని రెండు దీనార్లకు అమ్మాడు. తరువాత ఒక దీనార్‌తో ఖుర్బానీ పశువును కొని, మిగిలిన ఒక దీనార్‌తో తిరిగొచ్చి వాటిని దైవప్రవక్త (స) అందజేశాడు. దైవప్రవక్త (స) ఆ దీనార్‌ని దానం చేసి, అతని వ్యాపారంలో శుభం, వృద్ధి కలుగుగాక అని దీవించారు. (తిర్మిజి, అబూదావూద్)

ఈనాడు ప్రతి వ్యవహారం వ్యాపారంగా మారిపోతూ వ్యాపార పరిధి నానాటికి విస్తరిస్తూ పోతోంది. విద్యా, వైద్యం, న్యాయం- ఒకటేమిటీ, ప్రతీది వ్యాపారంగా మారి పోయింది. చివరికి ధనపిపాసులైన పెట్టుబడిదారులు మానవ అవయవాలతో సైతం వ్యాపారం చేయడం మొదలెట్టారు. అంతేకాదు, కార్పొరెట్ సంస్థలు రంగంలోకి దిగిన తరువాత ఆయా వ్యాపార రంగాలు ప్రజల జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని కూడా చూపుతున్నాయి. పూర్వం నుంచి వస్తున్న వారి సభ్యతాసంస్కృతులు మారి పోయి వాటి స్థానంలో వ్యాపారసంస్కృతి (Market Culture) చోటుచేసుకుంది.

విద్య మనిషికి సభ్యతా సంస్కృతులు నేర్పుతుంది; సంఘసేవకు సమాయత్తం చేస్తుంది. కాని నేటి కార్పొరెట్ విద్య మనిషిని పదార్థపూజారి (Materialist)గా మార్చి "విద్య ఉన్న వింతపశువుగా, నీతిని దిగజార్చి కోతికంటే పాడుమనిషి"గా తయారు చేస్తోంది. దేశస్వాతంత్ర్యానికి పూర్వం "ఎక్కడైతే విద్యాజ్ఞానాలు ఉచితంగా లభిస్తాయో ..... అలాంటి స్వర్గంలో నన్ను ప్రవేశింపజెయ్యి ప్రభూ!" అని దైవాన్ని ప్రార్థించిన మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నేడు బ్రతికుంటే మన విద్యాసంస్థల తీరుతెన్నుల్ని చూసి ఆయన మనసు ఎంత క్షోభిస్తుందో కదా!

మనిషి ప్రాథమిక అవసరాల్లో ఒకటైన వైద్యం కూడా నేడు సగటుపౌరునికి గగన కుసుమమైపోయింది. కార్పొరెట్ ఆస్పత్రుల్లో బిల్లు లక్షల రూపాయలకు చేరుకున్నా రోగి పూర్తిగా కోలుకొని బ్రతికి బయటపడతాడన్న నమ్మకంలేదు. మధ్యతరగతి ప్రజల ఆదాయంలో సగానికి పైగా విద్య, వైద్య ఖర్చులకే సరిపోతుంది. తలకు మించిన ఈ ఖర్చులు ప్రజలను అక్రమసంపాదనకు గొనిపోతుందన్నా ఆశ్చర్యం లేదు.

నీతి-నిజాయితీలు అడుగంటిపోయి, అన్యాయం-అక్రమాలు కొండలెక్కుతున్న ఈనాటి సమాజంలో పేదవాడికి న్యాయం లభించడం అంటే ఎండమావిలో నీటి కోసం అన్వేషించడమే. కనీసవసరాలే తీర్చుకోలేక సతమతమయ్యే పేదవాడు న్యాయ స్థానం మెట్లు ఎక్కలేడు. ఒకవేళ ఎవరైనా అప్పుచేసి కోర్టు గడప దాకా చేరుకున్నా

అతనికక్కడ న్యాయం లభిస్తుందన్న గ్యారంటీ లేదు. అవతలి పక్షంవాడు కోటీశ్వరుడై ఉండి, ప్రతీకారవాంఛతో రగలిపోయేవాడయితే ఆ పేదవాడు కటకటాల వెనక్కి కూడా పోవాల్సిన దుర్గతి పట్టవచ్చు. కారణం మనిషి నీతికి, దైవభీతికి దూరమయి పచ్చి ధనపిపాసిగా, పదార్థపూజారిగా మారిపోవడమే.

ప్రతి విషయాన్ని వ్యాపార దృష్టితో చూస్తూ మనోవాంఛలకు బానిసయి పోయిన ధనపిపాసులను గురించి దివ్యఖుర్‌ఆన్ ఏమంటున్నదో చూడండి:

"తన మనోవాంఛల్ని దైవంగా చేసుకున్నవాడ్ని గురించి నీవెప్పుడైనా ఆలోచించావా? అతను విద్యాజ్ఞానాలు కలిగివున్నా దేవుడు అతడ్ని దారి తప్పించాడు. అతని హృదయ కవాటాలు మూసివేశాడు; చెవులకు సీలువేశాడు; కళ్ళకు గంతలుకట్టాడు. దేవుడే అలా చేసిన తర్వాత ఇక అతనికి ఎవరు దారి చూపగలరు? మీరు గుణపాఠం నేర్చుకోరా? 'జీవితమంటే ఈ ప్రపంచజీవితమే. ఇక్కడే మనం చావాలి, ఇక్కడే బ్రతకాలి. కాలచక్ర భ్రమణం తప్ప మనల్ని ఏదీ నాశనం చేయలేదు' అంటారు వీరు. వీరి దగ్గర ఎలాంటి (సత్య)జ్ఞానం లేదు. వీరు కేవలం ఊహాగానాలు చేస్తున్నారు." (45:23,24)

"నీవు మటుకు వారికి ఏమాత్రం లొంగకు. (ముఖ్యంగా) చీటికి మాటికి ఒట్లు వేసుకునే తుచ్ఛుడు, ఎత్తిపొడిచేవాడు, చాడీలు చెబుతూ తిరిగేవాడు, సత్కార్యాల నుండి (ప్రజలను) నిరోధించేవాడు, మితిమీరిన దౌర్జన్యాలకు పాల్పడేవాడు, ఘోరపాపి, పరమ దుర్మార్గుడు, వీటన్నిటికి తోడు ఏమాత్రం నీతిలేని నికృష్టుడు...(ఇలాంటివాడికి లొంగకు). అతను తన సంతానం, సిరిసంపదలు చూసుకొని మిడిసిపడుతున్నాడు. మా సూక్తులు చదివి విన్పిస్తున్నప్పుడు 'ఇవి పూర్వీకుల పుక్కిటిపురాణాలు మాత్రమే' అంటాడు. త్వరలోనే మేమతని ముక్కు మీద వాతపెట్టి అతని పీచం అణచివేస్తాం." (68:10-16)

"స్త్రీలు, సంతానం, వెండి బంగారం రాశులు, మేలుజాతి గుర్రాలు, పశుసంపద, సేద్యభూములు (వగైరా) వ్యామోహ వస్తువులు మానవులకు మనోహరమయినవిగా చేయబడ్డాయి కాని ఇదంతా ఇహలోకంలో మూన్నాళ్ళ ముచ్చటగా ఇవ్వబడిన జీవన సామగ్రి మాత్రమే. (శాశ్వత సౌఖ్యాలతో కూడిన) శ్రేష్ఠమైన నివాసం దేవుని దగ్గరే లభిస్తుంది." (3:14)

## 62. అబద్ధం, మోసం

"విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్మును మరొకరు అన్యాయంగా, అక్రమంగా కాజేయకండి. ఇచ్చిపుచ్చుకోవడాలు జరగవలసిందే. అయితే అవి పరస్పరం ఆమోదంతో జరగాలి. మిమ్మల్ని మీరు హతమార్చుకోకండి. (ఆత్మవంచనకు పాల్పడకండి.) దేవుడు మీపట్ల ఎంతో దయామయుడని గ్రహించండి. ఎవరు అన్యాయం, అక్రమాల ద్వారా ఇలా చేస్తాడో అతడ్ని మేము తప్పనిసరిగా నరకంలో పడవేస్తాము." (ఖుర్‌ఆన్-4:29,30)



సత్యప్రియులకు అసత్యం ఏవిధంగానూ శోభించదు. అసత్యం ఏ వ్యవహారంలోనైనా, ఏ స్థాయిలోనైనా, ఎంత చిన్న విషయంలోనైనా గర్హించదగినదే. దైవప్రవక్త (స) అబద్ధం, నమ్మకద్రోహాలను గురించి ఇలా ప్రవచించారు:

"విశ్వాసి (మోమిన్) స్వభావంలో అన్ని విధాల పాపాలు ఉండటం సాధ్యమే. (అంటే విశ్వాసి వల్ల ఏపాపమైనా జరగడం సంభవమే.) కాని అసత్యం, నమ్మకద్రోహం విశ్వాసి ఔన్నత్యానికి వ్యతిరేకమైనవి." (బుఖారి, ముస్లిం)

"మనిషి ఏదైనా అబద్ధం పలికినప్పుడు అతని నోటినుండి ఒక విధమైన దుర్గంధం వెలువడుతుంది. దాంతో కారుణ్య (దైవ)దూత అతని దగ్గర్నుంచి తొలగి మైలు దూరం పోయి నిల్చుంటాడు." (అహ్మద్)

"మీరు అబద్ధానికి దూరంగా మసలుకోండి. అబద్ధం దౌష్ట్యానికి, వ్యభిచారానికి దారితీస్తుంది. దౌష్ట్యం, వ్యభిచారాలు నరకాగ్ని వైపుకు తీసికెళ్తాయి. మనిషి ఎల్లప్పుడూ అబద్ధాలాడుతుంటాడు. అబద్ధాన్ని గురించి సంకల్పించుకుంటాడు. ఇలా చివరికి అతని పేరు దేవుని దగ్గర పరమ అబద్ధీకుడని రాయబడుతుంది." (మిష్కాత్)

ఇక అసత్యప్రమాణం కూడా చాలా తీవ్రమైన విషయమే. చేసింది చేయనట్లు, చేయనిది చేసినట్లు, ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చెప్పి ప్రమాణం చేయడం అత్యంత ఘోరమైన నేరం. అక్రమ ప్రయోజనాల కోసం ఎదుటివారిని నమ్మించడానికి కొందరు ఇలా అసత్య ప్రమాణాలు చేస్తుంటారు. సాధారణంగా వ్యాపారలావాదేవిల్లో ఈ దుర్లక్షణం కన్పిస్తుంది.

అసత్య ప్రమాణం తమకెంతో లాభం చేకూర్చుతుందనుకుంటారు చాలామంది వ్యాపారులు. కాని దానివల్ల జరిగే పరోక్ష నష్టం సంగతి వారు గ్రహించరు. దైవప్రవక్త (సల్లం) ముఖ్యంగా వ్యాపారస్తుల్ని దృష్టిలో పెట్టుకొని ఇలా అన్నారు:

"(అసత్య)ప్రమాణం చేయడం వల్ల సరుకు అమ్ముడుపోతుంది గాని, వ్యాపారంలోని శుభం మాత్రం తరిగిపోతుంది." (బుఖారి)

"అసత్య ప్రమాణం చేసి ఒక ముస్లిం ధనాన్ని తనదిగా చేసుకున్నవాడు దైవ సన్నిధికి పోయినప్పుడు దేవుడు అతనిపై తీవ్రమైన ఆగ్రహం వెలిబుచ్చుతాడు. (అంటే ఇక అతనికి ఘోరమైన శిక్ష పడిందన్న మాటే.)"

"అసత్యప్రమాణం చేసినవాడు తన నివాసం నరకంలో ఏర్పరచుకున్నట్లే." (హాకిం)

అసత్యప్రమాణం అనేది తీవ్రమైన విషయమే. ప్రవక్తమసీదులోని ప్రసంగవేదిక దగ్గర అసత్యప్రమాణం చేయడం మరింత తీవ్రమైన విషయం. "ఒక చిన్న పలుదోము పుల్ల విషయంలో కూడా ప్రవక్త ప్రసంగవేదిక దగ్గర అసత్యప్రమాణం చేస్తే అలాంటి వ్యక్తికి నరకశిక్ష పడటం తప్పనిసరి (వాజిబ్) అవుతుంద"ని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు. (ఇబ్నెమాజ)

అసత్యప్రమాణానికి మనిషి నరకంలోనే గాకుండా సమాధిలో కూడా దుర్భర శిక్ష చవిచూడవలసి వస్తుంది. అంతేకాదు, దీని దుష్పరిణామాలు ఒక్కోసారి ఇహలోకంలో సైతం బహిర్గతమయ్యే అవకాశం లేకపోలేదు. నేనిక్కడ కనువిప్పు కోసం రెండు సంఘటనలు పేర్కొంటున్నాను:

ఖలీఫా అబ్దుల్ మలిక్ పాలనాకాలంలో జరిగిన సంఘటన. ఒక యువకుడు తరచుగా సమాధులు తవ్వి శవాలమీది కఫన్ వస్త్రాలు దొంగిలిస్తుండేవాడు. చివరికి అతను సమాధుల్లో కొన్ని భయానక దృశ్యాలు చూశాక చోరవృత్తి మానేసి నీతిమంతు డవుతాడు. అతను ఒకరోజు శ్మశానంలో జనం ఒక మృతదేహాన్ని పూడ్చి వెళ్ళిపోగానే వచ్చి ఆ సమాధిని తవ్వాడు. చూస్తే సమాధిలో శరీరం గగుర్పొడిచే దృశ్యం కన్పించింది. శవం అగ్నిమంటలో కాలిపోతోంది. దైవదూతలు అతడ్ని కొరడాలతో కొడ్తున్నారు. అతను బాధతో పొలికేకలు పెడ్తున్నాడు.

దొంగతనానికి వచ్చిన యువకుడు ఈ దృశ్యం చూసి భయంతో పరుగు లంకించుకున్నాడు. అతనలా కొంచెం దూరం పోయిన తర్వాత దారిలో ఒక అదృశ్య వాణి అతడ్ని పిలుస్తూ "ఈశిక్షకు కారణం ఏమిటో నువ్వు మృతుడ్ని అడగవేమిటీ?" అని ప్రశ్నించింది. దానికా యువకుడు "శిక్ష గురించి అడిగే ఓపిక కూడా లేదు నాలో ఇప్పుడు" అన్నాడు. అప్పుడా అదృశ్యవాణి శిక్షకు కారణం తెలియజేస్తూ "ఇతను అసత్యవాది, అసత్యప్రమాణాలు చేస్తుండేవాడు" అని చెప్పింది.

రెండవ సంఘటన ఖలీఫా హారూన్ రషీద్ పాలనాకాలంలో జరిగింది. ఒక రోజు ఖలీఫాతో యహ్యా బిన్ అబ్దుల్లా, అబ్దుల్లా బిన్ ముస్అబ్ అనేవారు సమావేశమయి ఉన్నప్పుడు యహ్యా ఖలీఫాను ఉద్దేశించి "అబ్దుల్లా బిన్ ముస్అబ్ రాసిన ఒక గేయం ఉంది, పాడి విన్పిస్తాను" అంటూ గేయం పాడాడు. ఖలీఫా ఆ గేయం విని ఎంతో బాధపడ్డాడు. అతని ముఖ కవళికలు మారిపోయాయి. అది చూసి భయపడిన అబ్దుల్లా వెంటనే ఈ గేయం తనది కాదని ప్రమాణం చేసి చెప్పాడు.

యహ్యా కూడా ప్రమాణం చేసి "అమీరుల్ మోమినీన్! ఈ గేయం ముమ్మాటికీ ఇతనిదే. తనదికాదని ఇతను నిరాకరిస్తే, ఇతని మాటలను అసత్యపరచి వెంటనే ఇతను దైవశిక్షకు పట్టుబడేలా తీవ్రమైన ప్రమాణం చేస్తా నేను, అనుమతించండి" అని అన్నాడు. ఖలీఫా అనుమతించాడు. అప్పుడు యహ్యా ఓపెద్ద ప్రమాణం చేశాడు. అబ్దుల్లా ఆప్రమాణాన్ని త్రోసిపుచ్చి దాన్ని ఎదుర్కోవడానికి తిరిగి ప్రమాణం చేయలేదు.

అతనిధోరణి చూసి ఖలీఫా ఉగ్రుడైపోయి "అబ్దుల్లా సత్యవంతుడైతే ప్రమాణం ఎందుకు చేయడు?" అని తన అంగరక్షకుడు ఫజల్తో అన్నాడు. అతను తన దగ్గరున్న దుప్పటిని చూపిస్తూ "ఈ దుప్పటి విషయంలో ఎవరైనా నన్ను ప్రమాణం చేయమంటే ఇది నాదేనని తప్పకుండా ప్రమాణం చేస్తాను" అని అన్నాడు. అప్పుడు



అబ్దుల్లాను ఫజల్ ఒక తన్ను తన్ని "ప్రమాణం చెయ్" అన్నాడు గద్దిస్తూ. అబ్దుల్లా గత్యంతరంలేక ప్రమాణం చేశాడు.

అబ్దుల్లా ప్రమాణం చేశాడేకాని, ప్రమాణం చేశాక నిలువెల్లా వణికిపోసాగాడు. అతని ముఖం వివర్ణమై పోయింది. దీనికితోడు యహ్యా అతని దగ్గరికెళ్ళి భుజం తట్టి "అబ్దుల్లా! నువ్వు అసత్యప్రమాణం చేశావు. ఇక నీకు కీడు తప్పదు" అని మరింత భయపెట్టాడు. భయపెట్టినంత మాత్రాన ప్రమాదమేమీ ఉండదు. కాని అసత్య ప్రమాణంవల్ల పచ్చి అబద్ధాలరాయుడు కూడా భయపడటానిక్కారణం దాని తక్షణ దుష్ప్రభావమే. పాపం! అబ్దుల్లా ఇంటికి వెళ్ళేందుకు ఖలీఫా దర్బారు నుంచి లేచి ద్వారం దగ్గరకు చేరుకున్నాడో లేదో అతనికి కుష్ఠువ్యాధి సోకింది. చర్మం వాడి చిట్లిపోయి ముక్కలుముక్కలుగా కిందపడటం మొదలైంది. అతనిపై దైవాగ్రహం విరుచుకుపడింది.

అబ్దుల్లా ఈ విధంగా మూడు రోజులపాటు దుర్భర యాతనలు అనుభవించి చనిపోయాడు. ఖలీఫా అంగరక్షకుడు ఫజల్ కూడా అతని అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. జనం అబ్దుల్లా మృతదేహాన్ని సమాధిలో పెట్టి పూడ్చడానికి ఇటుకలు పేరుస్తుంటే సమాధి ఒక్కసారిగా ఎంతో లోపలికి క్రుంగిపోయింది. దాంతో శవం ప్రజలకు కన్పించ కుండా భూమిలోకి దిగబడిపోయింది. ఆ తర్వాత హఠాత్తుగా సమాధి నుండి తీవ్రమైన ధూళితుఫాను లేచింది. ఫజల్ భయపడిపోయి "మట్టి తెచ్చి పోయండి, మట్టి తెచ్చి పోయండి" అంటూ కేకలు పెట్టాడు. కాని మట్టి ఎంత పోస్తున్నా ఆ గొయ్యిలో అంతూ పంతూ లేకుండా పోతోంది. మట్టి అయిపోయాక జనం దగ్గర్లో ఉన్న ముళ్ళపొదలు తెచ్చిపోశారు. అవి కూడా ఆ గోరీలో అడుక్కి పోయి మాయమయ్యాయి. చివరికి ఫజల్ ఆజ్ఞతో వారు సమాధి మీద కర్రలతో ఒక తడిక కట్టి దాన్ని మూసేశారు.

(కష్ఫొహాలుల్ వల్ ఖబూర్- మౌత్ ఝట్కా)

హజ్రత్ అబూహురైరా కథనం: దైవప్రవక్త (సల్లం) ప్రవచనం ప్రకారం మూడు రకాల మనుషుల వైపు దేవుడు ప్రళయదినాన దయాభావంతో కన్నెత్తి కూడా చూడడు. వారి పాపాలు క్షమించి వారిని పరిశుద్ధపరచడు. పైగా వారికి తీవ్రమైన (నరక) శిక్ష విధిస్తాడు. వారిలో ఒక కోవకు చెందిన మనిషి అవసరానికి మించిన ప్రయాణసామగ్రి కలిగివున్నా తోటిప్రయాణీకులకు వాటినిచ్చి ఆదుకోవడానికి నిరాకరిస్తాడు. రెండవ మనిషి ప్రాపంచిక స్వలాభాపేక్షతో రాజ్యాధినేతకు మద్దతునిస్తూ ప్రమాణం చేస్తాడు. అయితే ఆ రాజ్యాధినేత ధనమిస్తే సంతోషిస్తాడు, ఇవ్వకపోతే ముఖం మాడ్చుకుంటాడు. మూడవ మనిషి సాయంత్రంవేళ తన వ్యాపార సరుకుతో నిలబడి "సాటిలేని మేటి అయిన దేవుని సాక్షిగా చెబుతున్నాను. నేనీ సరుకును ఇంత ధరకు కొన్నాను" అని (అబద్ధం) చెబుతాడు. ప్రజలు అతను నిజమే చెబుతున్నాడని భావిస్తారు.

దైవప్రవక్త (స) ఆ తరువాత ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి పఠిస్తారు: "కొందరు తమ వాగ్దానాలను, దేవుని విషయంలో చేసిన ప్రమాణాలను అతిస్వల్ప మూల్యానికి అమ్ముకుంటారు. ఇలాంటి (అమ్ముడుబోయిన)వారికి పరలోకంలో ఎలాంటి (సుకృతఫలం) వాటా లభించదు. వారితో దేవుడు మాట్లాడడు. చివరికి ప్రళయదినాన వారివైపు కన్నెత్తి కూడా చూడడు. వారిని పరిశుద్ధపరిచే ప్రసక్తి అంతకన్నా లేదు. పైగా వారికి (నరకంలో) వ్యధాభరితమైన శిక్ష పడుతుంది." (3:77) (బుఖారి, ముస్లిం)

హ్జ్రత్ హుజైఫా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మాకు (భవిష్యత్ ప్రకటనలకు సంబంధించిన) రెండు హదీసులు విన్పించారు. ఇందులో ఒకటి నిజమవడం నేను చూశాను. రెండవదాని కోసం ఎదురుచూస్తున్నాను. దైవప్రవక్త (సల్లం) మా ముందీ విషయం ప్రస్తావిస్తూ "నిజాయితీ, విశ్వసనీయతలు ప్రజల హృదయాల్లో వేళ్ళూని ఉన్నాయి. ఆ తరువాత ప్రజలు వాటిని గురించి ఖుర్‌ఆన్, హదీసుల ద్వారా వివరంగా తెలుసుకున్నారు" అని అన్నారు.

ప్రజల హృదయాల నుండి నిజాయితీ, విశ్వసనీయతలు క్షీణించిపోవడం గురించి ఆయన మాట్లాడుతూ ఇలా అన్నారు: "ఒక మనిషి కాస్సేపు పడుకుంటాడు. అప్పుడు అతని హృదయం నుండి నిజాయితీ తీసివేయబడుతుంది. గాయం నయమైన తరువాత దానిగుర్తు మిగిలిపోయినట్లు అతని నిజాయితీకి సంబంధించిన ఓ చిన్న గుర్తు మాత్రమే ఉండిపోతుంది.

ఆ తరువాత ఆ వ్యక్తి మరికాస్సేపు పడుకుంటాడు. మిగిలిపోయిన ఆ కాస్త నిజాయితీ కూడా తీసివేయబడుతుంది. నిప్పుకణం కాలు మీద పడినప్పుడు బొబ్బి వచ్చి చర్మం ఎలా ఉబ్బెత్తుగా కన్పిస్తుందో అలా ఉంటుంది మిగిలిన ఈ నిజాయితీకి సంబంధించిన గుర్తు. బొబ్బి లోపల ఏమీ ఉండదు (పల్చటి రసి తప్ప). ఈ నిజాయితీ స్థితి కూడా అంతే. (మరో మాటలో చెప్పాలంటే ఇది నేతి బీరకాయ వంటి నిజాయితీ అన్నమాట). ప్రజలు అమ్మకం, కొనుగోళ్ళయితే చేస్తారు. కాని ఏ ఒక్కరూ నిజాయితీతో వ్యవహరించరు. చివరికి 'ఫలానా తెగ మనిషి ఎంతో నిజాయితీపరుడు, ఫలానా వ్యక్తి ఎంతో మంచివాడు, ఎంతో బుద్ధిమంతుడు' అని ప్రశంసిస్తారు. కాని అతనిలో అణుమాత్రం నిజాయితీ కూడా ఉండదు.

ఒకప్పుడు నేను ఎవరి నుండి కొనుగోలు చేస్తున్నానన్న విషయం పట్టించుకునే వాణ్ని కాను. ఆ వ్యక్తి ముస్లిం అయివుంటే అతని ధర్మమయిన ఇస్లాం నాకు రావలసిన హక్కు అతని నుండి ఇప్పిస్తుంది. ఒకవేళ ఆ వ్యక్తి క్రైస్తవుడయి ఉంటే అతని అధికారి ఆ హక్కు నాకు ఇప్పించేవాడు. ఈనాడు పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు నేను ఫలానా వ్యక్తులతో మాత్రమే అమ్మకం, కొనుగోళ్ళు చేస్తున్నాను.

(సహీబుఖారి: 81వ ప్రకరణం, 35వ అధ్యాయం; సహీముస్లిం)



# 63. సరకుల కల్తీ, నాణ్యతలు

దగా, మోసం, దోపిడి, దౌర్జన్యం, అబద్ధం, అక్రమ మార్గాలా ద్వారా వ్యాపారం చేయడం ఆత్మహత్యా సదృశమని, పరలోకంలో వినాశానికి కారణభూతమవుతుందని ఖుర్‌ఆన్ తెలియజేస్తోంది. పేరాశ మనిషిని అక్రమ లాభార్జన వైపుకు ప్రేరేపిస్తుంది. అక్రమలాభాల కోసం అతను అబద్ధమాడతాడు. సరుకులు కల్తీచేసి అమ్ముతాడు. తూనికల్లో, కొలతల్లో వస్తువులు తగ్గించి ఇస్తాడు. బ్లాక్‌మార్కెట్ చేస్తాడు. విచ్చలవిడిగా ధరలు పెంచి అత్యధికలాభాలు గడించడానికి అవసరమైతే అధికారులకు లంచాలు కూడా ఇస్తాడు. అబద్ధం, వంచన అనే దుర్గుణాలు ఈనాడు వ్యాపార లావాదేవీల్లో సర్వ సామాన్యమైపోయాయి. ఈవైఖరి ముస్లింల విశ్వాసానికి తీవ్రమైన విఘాతం కలిగించి వారి పరలోక జీవితాన్ని నాశనం చేస్తుంది.

దైవప్రవక్త (స) ఓసారి (మార్కెట్‌లో) ఒక ధాన్యపు దుకాణం దగ్గరికొచ్చి ధాన్యపు కుప్పలో చేయి దూర్చారు. చూస్తే చేతికి తడి అంటుకుంది. అది చూసి ఆయన "ధాన్యపు వర్తకుడా! ఏమిటిది?" అని అడిగారు. దానికా వర్తకుడు "దైవప్రవక్తా! ఇది వర్షానికి తడిసింది" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) "మరి ఆ ధాన్యాన్ని పైన ఎందుకు పెట్టలేదు? పైన పెట్టివుంటే జనం చూసేవారుకదా! మోసం చేసేవాడు నావాడు కాడు" అని అన్నారు. (ముస్లిం-మిష్కాత్)

హ్జ్రత్ అబ్దుల్ హమీద్ బిన్ మహ్మూద్ మగ్రిబి కథనం: నేను ఓసారి అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) దగ్గరకు వెళ్ళినప్పుడు అక్కడికి కొందరు మనుషులు వచ్చి ఓ సంఘటన గురించి ఇలా తెలిపారు: "మేము హజ్‌యాత్రకు బయలుదేరి జుల్‌సఫా ప్రాంతానికి చేరుకునేటప్పటికి మా సహచరుడొకతను చనిపోయాడు. మేము స్నానం, వస్త్రసంస్కారం చేయించి సమాధి తవ్వడం ప్రారంభించాం. త్రవ్వకం పూర్తయిన తర్వాత శవాన్ని సమాధిలో దించుదామని అనుకుంటుండగా అకస్మాత్తుగా సమాధిలో ఓ పెద్ద నల్లత్రాచు ప్రత్యక్షమయింది. ఆ పాము ఎంత పెద్దదంటే అది మొత్తం సమాధిని ఆక్రమించుకుంది. మేము ఆ సమాధిని వదిలేసి వేరే చోట మరో సమాధి తవ్వాము. కాని అక్కడ కూడా సమాధి త్రవ్వకం పూర్తికాగానే ఎక్కడ్నుంచో ఇలాంటి పామే వచ్చి చుట్టచుట్టుకొని పడుకున్నది. మేమా సమాధిని వదిలేసి మీ దగ్గరకు వచ్చాం (ఈ విచిత్ర సంఘటనకు కారణం ఏమిటో చెబుతారని)."

హ్జ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఈ సంగతి విని "అది మృతుడి ఆచరణ, నల్లత్రాచు రూపంలో వచ్చింది. మీరు యావత్తు భూమండలంలో ఎక్కడ సమాధి తవ్వినా అక్కడికి ఈ పాము వస్తుంది. అంచేత మీరు ఏదో ఒక సమాధిలో వేసి పూడ్చి పెట్టండి" అని చెప్పారు. మేము అలాగే ఒక సమాధిలో పూడ్చివేశాం. తరువాత మేము హజ్‌యాత్ర జరిపి వచ్చాము. రాగానే మృతుని ఇంటికి వెళ్ళి అతని భార్యకు విషయం వివరించి అతని ఆచరణ గురించి అడిగాము. దానికామె ఇలా చెప్పింది:

“మా ఆయనగారు ధాన్యపు వ్యాపారం చేస్తుండేవారు. వ్యాపార సరుకు నుంచి ఇంటిఖర్చుల కోసం ఎంత ధాన్యం తీస్తారో అంతే పొట్టు, పుల్లలు, గడ్డిపరకలు వ్యాపార ధాన్యంలో కలిపి అమ్మేవారు. ఈ దుష్కార్యమే ఆయనకు సమాధిలో యాతనకు కారణమయింది.” (బైహఖి, ఇబ్నె అబిద్దున్యా)

దైవప్రవక్త (సల్లం) ప్రవచనం:- “అమ్ముతున్న సరుకులోని లోపాలను కొనుగోలు దారులకు బహిర్గతం చేసి మరీ అమ్మడం (ధర్మయుక్తమైన పద్ధతి. అది) తప్ప మరే పద్ధతినయినా అనుసరించి సరుకు విక్రయించడం ఎట్టి పరిస్థితిలోనూ ధర్మసమ్మతం కాదు. అంతేకాదు, ఆ లోపం తెలిసివున్న వ్యక్తి దాన్ని బహిర్గతం చేయకుండా మౌనం వహించడం కూడా ధర్మసమ్మతం కాదు”. (ముస్తఖా)

## 64. బ్లాక్‌మార్కెట్

ఇస్లాంలో వ్యాపారలావాదేవీలు కూడా ఒక భాగమే. అయితే ఈ వ్యాపారం పూర్తిగా నిజాయితీతో కూడినదై ఉండాలి. నేటి ముస్లింలు నమాజ్, రోజాల్లాంటి విషయాలపై చూపుతున్నంత ఆసక్తి ఆర్థికవ్యవహారాలో చూపకపోవడం ఎంతో శోచనీయం. ఇస్లాంను విశ్వసించానని చెప్పుకునే వ్యక్తి మసీదులోనేగాక మార్కెట్‌లో కూడా నిజమైన ముస్లింగా వ్యవహరించాలి. అలా కాకుండా కేవలం ధనార్జననే ధ్యేయంగా పెట్టుకొని కొనుగోలు దారుల్ని దోచుకుంటూ అక్రమ పద్ధతులతో వ్యాపారం చేస్తే, దానివల్ల అతను ప్రపంచం లో కోటీశ్వరుడయి కులకగలడేమోగాని, పరలోకంలో మాత్రం ఘోరమైన నరక శిక్షలకు గురికావలసి వస్తుంది.

అక్రమ లాభార్జన పద్ధతుల్లో బ్లాక్ మార్కెట్ ఒకటి. ఈ రోజుల్లో చిన్నా పెద్దా వ్యాపారస్తులంతా ఈ జాడ్యానికి లోనయి వినియోగదారుల రక్తాన్ని పీల్చివేస్తున్నారు. వీరు వీలయినంత ఎక్కువగా లాభాలు గడించాలన్న ఆత్యాశతో నిత్యావసర వస్తువుల్ని నెలల తరబడి దాచిపెట్టి అక్రమంగా నిలువ చేస్తారు. అలా కృతిమ కరువు సృష్టించి విపరీతమైన ధరలతో వాటిని మెల్లమెల్లగా మార్కెట్‌లోకి ప్రవేశపెడ్తారు. ఇలాంటి అక్రమ వ్యాపారస్తుల విషయంలో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) చేసిన ఈ మహితోక్తులు గమనించండి:

“అక్రమ నిల్వలు చేసేవాడు పాపాత్ముడవుతాడు.” (ముస్లిం-మిష్కాత్)

“అక్రమనిల్వలు చేసేవాడు దుర్మార్గుడు. దేవుడు ధరలు తగ్గిస్తే అతను సంతోషిస్తాడు, ధరలు పెంచితే తెగ బాధపడిపోతాడు.” (బైహఖి-మిష్కాత్)

“నిత్యావసర వస్తువుల్ని నిలువచెయ్యక సమయానికి బజారుకు తెచ్చి అమ్మే వ్యక్తి దైవానుగ్రహానికి అర్హుడవుతాడు. దేవుడు అతనికి పుష్కలంగా ఉపాధి ప్రసాదిస్తాడు. దీనికి భిన్నంగా (సరుకులు) నిలువచేసే వ్యక్తి దైవశాపానికి గురవుతాడు”. (ఇబ్నెమాజ)



“ఒక మనిషి నలభై రోజులదాకా ధాన్యాన్ని (బజారుకు తరలించకుండా) ఆపి వుంచి ధరలు పెరిగేందుకు ఎదురుచూస్తున్నాడంటే అతను దేవుని పట్ల విసిగెత్తి పోయాడన్న మాట. దేవుడు కూడా అతని పట్ల విసిగెత్తిపోతాడు.” (మిష్కాత్)

“ఎవరైనా నలభై రోజులదాకా ధాన్యం (మార్కెట్‌లోకి తీసుకురాకుండా) ఆపి వుంచిన తరువాత దానికి సంబంధించిన దానం చేస్తే ఆ దానం అతనికి పాప పరిహారంగా మారదు.” (మిష్కాత్ షరీఫ్)

ఈ హదీసుల్నిబట్టి ధాన్యం, అపరాలు వంటి నిత్యావసర వస్తువులు గోదాముల్లో గరిష్ఠంగా నలభై లేక అంతకంటే ఎక్కువ రోజులు నిలువ ఉంచకూడదని తెలుస్తోంది. రైతుగాని, రైతు దగ్గర కొన్నవాడుగాని ధాన్యాన్ని త్వరగా మార్కెట్‌కు తరలించాలి. అంతేగాని ధరలు పెంచే ఉద్దేశ్యంతో దాన్ని నెలల తరబడి నిల్వ ఉంచకూడదు.

దొంగవ్యాపారులు దేశంలో కరువుకాటకాలు వస్తే మరింత సంబరపడిపోతారు. ఆహార పదార్థాలను ఆకాశాన్నంటే ధరలకు అమ్ముకోవడానికి వారికి మంచి అవకాశం లభిస్తుంది. గోదాముల్లో నుంచి సరుకుల్ని కొద్దికొద్దిగా విడుదలచేస్తూ మండే ధరలతో అమ్మి విపరీతమైన లాభాలు గడిస్తారు. ఇలాంటి చీడపురుగుల మూలంగా సమాజంలో అప్పుడప్పుడు ఆకలిచావులు కూడా సంభవించడం తెలిసిన విషయమే.

కరువు వచ్చినప్పుడు ప్రవక్త అనుచరులు పరిస్థితిని ఎలా ఎదుర్కొనేవారో చూడండి: ఒకసారి మదీనాలో తీవ్రమైన క్షామం ఏర్పడింది. ఈ దుస్థితి చూసి ఖలీఫా ఉస్మాన్(రజి) ధాన్యాగారాలను తెరిపించి, ధాన్యం కావలసిన వాళ్ళు వచ్చి పట్టుకెళ్ళ వచ్చని ప్రకటన గావించారు. ఆ విధంగా ప్రభుత్వ ధాన్యాగారాలు ఖాళీఅయ్యాయి.

అలాగే మదీనాలో మరోసారి కరువు ఏర్పడే సూచనలు కన్పించగానే ప్రజలు ఆందోళన చెంది ఆహారధాన్యాల అన్వేషణకై అనేక ఇబ్బందులు పడుతూ ఊరూరు తిరగసాగారు. ఇమామ్ జైనుల్ ఆబిదీన్ (రజి) ప్రజల అగచాట్లను గమనించి తన సొంత ధాన్యాగారాన్ని నిర్వహించే వ్యక్తిని పిలిపించారు. అతనితో, ప్రస్తుతం మన దగ్గర ఎంత ధాన్యం ఉందని అడిగారు. కరువు పరిస్థితిని వాడుకొని అధిక లాభాలు ఆర్జించడానికే ఇమామ్‌గారు ఇలా అడుగుతున్నారని భావించి ఆ వ్యక్తి పరమ సంతోషంతో మన దగ్గర ధాన్యం చాలా ఉందండీ అని చెప్పాడు.

వెంటనే ఇమామ్ “అయితే ఆ ధాన్యం మొత్తాన్ని మార్కెట్‌కు తరలించు” అని ఆదేశించారు. కోశాధికారి విస్తుబోయి “అయ్యా! ఈ ధాన్యం కాస్తా అయిపోయాక మన పరిస్థితి ఏమిటీ?” అని అడిగాడు. దానికి ఇమామ్ “ప్రజలందరి పరిస్థితి ఏమిటో అదే మన పరిస్థితి కూడా. వారు కూడా మన సోదరులే కదా!” అని అన్నారు.

మానవతా దృష్టి ఉన్న ఏ వ్యాపారీ అధిక లాభాల కోసం ప్రజలను దోచుకునే ఎలాంటి అడ్డదారీ తొక్కడు. అందులో విశ్వప్రభువుని, ఆయన ప్రవక్త (సల్లం)ను,

పరలోక పరిణామాలను విశ్వసించి దైవప్రసన్నతే తన జీవిత పరమావధిగా భావించిన ముస్లిం అయితే వ్యాపారంలో ఎన్నటికీ నీచమైన పద్ధతులు అవలంబించలేడు.

## 65. తూనికలు, కొలతలు

ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన ఖుర్‌ఆన్, హదీసు ఆజ్ఞలను పాటించడం కూడా దైవారాధన క్రిందికే వస్తుంది. శారీరక ఆరాధనల విషయంలో ఏవైనా పొరపాట్లు జరిగితే దేవుడు క్షమిస్తాడని ఆశించగలం. కాని అర్థ సంబంధమైన ఆరాధనల విషయంలో జరిగిన పాపాలను సంబంధిత వ్యక్తులు క్షమించనంతవరకూ దేవుడు కూడా క్షమించడని కొన్ని హదీసులు నొక్కి చెబుతున్నాయి.

అయితే ఈనాడు ఇస్లాంను అనుసరిస్తున్న చాలామంది ముస్లింలు నమాజ్, దైవనామ సంస్మరణ, ఉపవాసాలు వంటి పైసా ఖర్చుకాని విషయాల్లో మాత్రమే ఖుర్‌ఆన్, హదీసు ఆజ్ఞలను పట్టిపట్టి చూస్తారు. కాని ఆర్థిక వ్యవహారాల్లో విధిగా నిర్దేశించిన ఆజ్ఞలను సైతం ఖాతరుచేయడం లేదంటే, అది వారి ఏమరుపాటు అనుకోవాలా లేక దైవధర్మం పట్ల వారికి పూర్తిగా సదవగాహన లేదని భావించాలా? ఈ క్రింది ఖుర్‌ఆన్ సూక్తులు చూడండి:

"సరైన పాత్రతో కొలచి ఇవ్వండి. తూచవలసి వస్తే సరైన త్రాసుతో తూచివ్వండి. ఇదే సరైన పద్ధతి. ఫలితం రీత్యా కూడా ఈ పద్ధతే మంచిది". (17:35)

"ఆయనే త్రాసును (న్యాయాన్ని) కూడా సృష్టించాడు. కనుక మీరు త్రాసు సమ తూకాన్ని చెడగొట్టకండి. న్యాయంగా, సవ్యంగా తూచివ్వండి". (55:8,9)

"తూనికల్లో, కొలతల్లో న్యాయం పాటించండి. ఎవరికీ నష్టం కలగజేయకండి. సరైన త్రాసుతో తూచి ఇవ్వండి. ప్రజలకు రావలసిన వస్తువులు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో అల్లర్లు, అలజడులు రేపుతూ తిరగకండి. మిమ్మల్ని, మీకు పూర్వముండిన తరాలను సృష్టించిన దేవునికి కాస్త భయపడండి". (26:181-184)

"తూనికల్లో, కొలతల్లో న్యాయం పాటించండి. ఎవరికీ నష్టం కలగజేయకండి. సరైన త్రాసుతో తూచి ఇవ్వండి. ప్రజలకు రావలసిన వస్తువులు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో అల్లర్లు, అలజడులు రేపుతూ తిరగకండి. మిమ్మల్ని, మీకు పూర్వముండిన తరాలను సృష్టించిన దేవునికి కాస్త భయపడండి". (26:181-184)

"తూకం తగ్గించేవారికి వినాశం తప్పదు. వారు ప్రజల నుండి (సరుకు) తీసుకునేటప్పుడు పూర్తిగా తూచి లేక కొలచి తీసుకుంటారు; ఇచ్చేటప్పుడు తగ్గించి ఇస్తారు. ఒక భయంకర దినాన తాము లేపి ప్రవేశపెట్టబడతామని వారికి తెలియదా? ఆరోజు యావత్తు మానవులు విశ్వప్రభువు ముందు (తలలు వంచి) నిలబడతారు." (దివ్య ఖుర్‌ఆన్-83:1-6)



ఇస్లాం మానవుని సకల జీవనరంగాలను పరివేష్ఠించి వున్న సమగ్ర జీవనవ్యవస్థ. అందులో వ్యాపార లావాదేవీలు కూడా ఉన్నాయి. అయితే ఆ వ్యాపారం పూర్తిగా న్యాయం, నిజాయితీలతో కూడినదయి ఉండాలి.

నీతిమంతుడైన వ్యాపారిని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "నీతిమంతుడైన వ్యాపారి అంతిమ (ప్రళయ) దినాన దైవప్రవక్తల, సత్యవంతుల, అమరగతుల సహచర్యంలో ఉంటాడు". (తిర్మిజి)

దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు కూడా పరిశీలించండి:

"మేము మద్యన్ ప్రజల దగ్గరకు వారి సోదరుడు షుఐబ్‌ను పంపాము. అతను తన జాతిప్రజలతో ఇలా అన్నాడు: 'నా జాతిప్రజలారా! దేవుడ్ని ఆరాధించండి. ఆయనతప్ప వేరే ఆరాధ్యుడు లేడు. మీ దగ్గరకు మీప్రభువు నుండి స్పష్టమైన నిదర్శనం వచ్చింది కనుక మీరు తూనికలు, కొలతలు పూర్తిగా పాటించండి. ప్రజలకు రావలసిన సరుకు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో శాంతీసామరస్యాలు ఏర్పడ్డాక అరాచకం, అలజడులు సృష్టించకండి. మీరు విశ్వాసులయితే (విషయం గ్రహించండి), అందులోనే మీ శ్రేయస్సు ఉంది". (7:85)

"భూమండలంపై సంచరించే ప్రతిప్రాణికీ ఉపాధినిచ్చే బాధ్యత దేవునిపైనే ఉంది. అలాగే ఏప్రాణి ఎక్కడ నివసిస్తుందో, ఎక్కడ (దానిప్రాణం) భద్రపరచబడుతుందో కూడా దేవునికి తెలుసు. సమస్తవిషయాలు స్పష్టంగా గ్రంథంలో వ్రాయబడి ఉన్నాయి." (11:6)

"ఒకవేళ దేవుడు తన దాసులందరికీ పుష్కలంగా ఉపాధినిస్తే, వారు ప్రపంచంలో గర్విష్ఠులయి తిరుగుబాటుకు పాల్పడతారు. అందువల్ల ఆయన తాను తలచిన విధంగా ఒక నిర్ణీత పరిమాణంలో (ఉపాధి) దించుతున్నాడు. ఆయనకు తన దాసుల (స్వభావం) గురించి బాగా తెలుసు. వారిని ఆయన ఓకంట గమనిస్తున్నాడు." (42:27)

## 66. తప్పుడు వ్యాపార పద్ధతులు

పూర్వం అరేబియాలో కొన్ని తప్పుడు వ్యాపారపద్ధతులు ఇలా ఉండేవి:

✦ హజ్రత్ అబూహుర్రైరా (రజి) కథనం: "వస్తువుని చేత్తో తాకడం ద్వారా, చేతిలోకి తీసుకొని విసరేయడం ద్వారా వ్యాపార నిర్ధారణ చేయడాన్ని దైవప్రవక్త (స) నిషేధించారు." (బుఖారి, ముస్లిం)

ఈ హదీసు మూలభాషలో "ములామస, మునాబజ" అనే పదాలు వచ్చాయి. ఇవి వ్యాపార నిర్ధారణ కోసం పూర్వం అరేబియాలో వాడే పదాలు. (1) నీవు గనక నా వస్త్రాన్ని తాకితే బేరం కుదిరినట్లే అని అమ్మకందారుడు కొనుగోలుదారుడితో అంటాడు. దీన్ని "ములామస" వ్యాపారం అంటారు. ఈ వ్యాపారంలో కొనుగోలుదారుడు బట్టనాణ్యతను పూర్తిగా పరిశీలించడానికి వీల్లేదు. (2) రెండో విధానంలో

అమ్మకందారుడు ఈవస్త్రాన్ని వంద రూపాయలకు నీవైపు విసురుతున్నాను అంటాడు. కొనుగోలుదారుడు దానికి అంగీకరించి ఆ వస్త్రాన్ని పట్టుకుంటాడు. దాంతో బేరం అయిపోయినట్లే. దీన్ని "మునాబజ" అంటారు. ఈ రెండు వ్యాపార విధానాలు నిషేధించబడ్డాయి.

✦ అబ్దుల్లా బిన్ ఉమర్ కథనం: ఒంటె (ఈనక ముందే దాని) కడుపులో ఉన్న పిల్లను అమ్మి వేయడాన్ని నిషేధించారు. ఇలాంటి వ్యాపారం (ఇస్లాంకు పూర్వం) అజ్ఞానకాలంలో ఉండేది. ఆనాడు ఒక మనిషి (ఉనికిలోకే రాని) ఒంటెను కొనేముందు అమ్మేవాడితో ఒప్పందం చేసుకుంటూ "సూడిఒంటె కడుపులో ఉన్న పిల్ల (బయటికొచ్చి) పెరిగి పెద్దదయి ఈనాలి" అని మాట్లాడుకుంటాడు. (బుఖారి).

✦ దైవప్రవక్త (స) ప్రవచనం: "మేక పొదుగులో పాలను ఆపి ఉంచకూడదు. ఒకవేళ ఎవరైనా (మోసపోయి) అలాంటి పశువును కొన్న పక్షంలో, పాలు పితుక్కున్న తరువాత ఆ మేకను ఇష్టమయితే ఉంచుకోవడానికి, ఇష్టంలేకపోతే ఒక "సా" ఎత్తు ఖర్జూర పండ్లిచ్చి వాపసు చేయడానికి అతనికి హక్కుంది." (బుఖారి)

✦ దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒక ముస్లిం తోటిముస్లిం సోదరుడు బేరం చేస్తున్నప్పుడు అదే వస్తువు కోసం పోటాపోటీగా బేరం చేయకూడదు." (బుఖారి)

## 67. దళారీ వ్యవస్థ

ఏ వస్తువునైనా స్వయంగా కొని మన స్వాధీనంలోకి తీసుకోనంతవరకు దాన్ని ఇతరులకు అమ్మడం ఇస్లాంలో నిషిద్ధం. "మీ దగ్గరలేని వస్తువును అమ్మకూడద"ని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. (తిర్మిజి) అంతేకాదు, "ఏదైనా వస్తువును కొనడం జరిగితే దాన్ని మీరు మీ అధీనంలోకి తీసుకోక ముందే ఇతరులకు అమ్మకూడద"ని కూడా దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. (అహ్మద్)

"ప్రజలు మార్కెట్‌లో ధాన్యపు రాసులను నిల్చున్నపళంగా కొని అక్కడికక్కడే అమ్మేస్తారు. కాని దైవప్రవక్త (సల్లం) ధాన్యపు రాసిని కొన్నచోటు నుంచి వేరే చోటుకు తరలించనంత వరకు దాన్ని ఇతరులకు అమ్మకూడదని సెలవిచ్చారు." (బుఖారి)

ఈ పద్ధతి అనేకచోట్ల ఈనాడు కూడా సాగుతోంది. ఒకతను ఒకచోట సరుకును లక్ష రూపాయలకు "బుక్" చేసుకొని దాన్ని మరొకతనికి బయానా (అడ్వాన్స్) తీసుకొని లక్షన్నర రూపాయలకు అమ్ముతాడనుకోండి. లేదా మొదటి వ్యక్తి సరుకును పదివేలో లేక ఇరవై వేలో బయానా మాత్రమే ఇచ్చి కొన్న తరువాత దాన్ని లాభం మీద మరొకతనికి అమ్ముతాడు. అలాంటి పరిస్థితిలో మొదటి వ్యక్తి అమ్మకందారునికి, కొనుగోలుదారునికి మధ్య దళారీగా వ్యవహరించినట్లు అవుతుంది. ఈ పద్ధతినే ఇస్లాం నిషేధించింది.



హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "మీరు అమ్మకంలో అత్యధిక లాభాలు గడించే ఉద్దేశ్యంతో పట్టణం వెలుపలకెళ్ళి వర్తక బిడారాలను ముందుగా కలుసుకోకండి. పట్టణవాసి బయట నుండి సరుకులతో వచ్చే గ్రామీణుని సరుకు అమ్మకూడదు."

ఈ హదీసు ఉల్లేఖించినవారు హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి)ని "పట్టణవాసి గ్రామీణుని కొరకు సరుకు అమ్మడం అంటే ఏమిటీ?" అని అడిగారు. దానికి ఆయన "అంటే దళారిగా మారకూడదని అర్థం" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) కథనం: "పట్టణం వెలుపల వాణిజ్య బృందాలకు ఎదురేగి సరుకు (మార్కెట్‌కు చేరుకోకముందే) కొనడాన్ని దైవప్రవక్త (సల్లం) వ్యతిరేకించారు." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: "ప్రజలు పెద్ద మార్కెట్‌లో సరుకు కొని అక్కడే ఒకచోట వాటిని అమ్మేవారు. దైవప్రవక్త (స) సరుకును అదేచోట అమ్మ కూడదని, దాన్ని తీసికెళ్ళి వేరేచోట అమ్ముకోవాలని ఆదేశించారు." (బుఖారి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ధాన్యం లేక అపరాలను కొన్న తరువాత వాటిని స్వాధీనం చేసుకోనంత వరకు మరొకరికి అమ్మకూడదు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: "ధాన్యం, అపరాలను (అమ్మకం దారుడి నుండి) స్వాధీనం చేసుకోక ముందే (మరొకరికి) అమ్మకూడదని దైవప్రవక్త (స) ఆంక్ష విధించారు." హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉద్దేశ్యంలో ఈ ఆజ్ఞ ఇలాంటి వస్తువులకు మాత్రమేగాని అన్ని వస్తువులకు వర్తించదు. (బుఖారి)

కాని ఇమాం షాఫయి (రహ్మ) ప్రకారం ఒక్క ధాన్యం, అపరాలే కాదు స్థిర, చర వస్తువులన్నీ స్వాధీనంలోకి తీసుకోక ముందే అమ్మడం ధర్మసమ్మతం కాదు. అయితే ఇమాం అబూహనీఫా (రహ్మలై) అభిప్రాయం ప్రకారం భూమి, ఇల్లు, తోట మొదలైన స్థిరాస్తులు స్వాధీనం చేసుకోవడానికి ముందే అమ్మడం ధర్మసమ్మతమే. ఎక్కువ మంది ధర్మవేత్తలు ఈ అభిప్రాయాన్నే సమర్థించారు.

ఈనాడు పెద్దపెద్ద కంపెనీలు కమీషన్ ప్రాతిపదికపై ఏజెంట్లను నియమించి వ్యాపారం నడుపుతున్నాయి. ఈ పద్ధతి కొంతవరకు నయమే. కాని ఏజెంట్లు దళారులై సంస్థ నుంచి కమీషన్‌తో పాటు కొనుగోలుదారుల నుంచి కూడా దోచుకుంటున్నారు.

## 68. వస్తుమార్పిడి విధానం

వస్తుమార్పిడి విధానం ఈనాడు కూడా అనుసరించడం జరుగుతోంది. అయితే ఈ విధానం వల్ల రెండు పక్షాలలో ఎవరికీ నష్టం జరగకుండా ఉన్నప్పుడే దీన్ని అనుస

రించాలి. దాని కోసం మార్పిడికి సంబంధించిన రెండు వస్తువులు ఒకే విలువ లేదా ధర కలిగి ఉండాలి. రెండు వస్తువులు ఒకే విలువ కలిగిలేనప్పుడు అంచనాలతో వస్తు మార్పిడి చేసుకోవడం సరైన పద్ధతి కాదు. అప్పుడు మనిషి తన దగ్గరుండే ఆ వస్తువును నగదు పైకానికి అమ్మి ఆ పైకంతో ఇతర వస్తువుల్ని కొనుక్కోవాలి. ఇస్లాం ఈ చివరి పద్ధతిని అనుసరించడానికే అనుమతినిస్తుంది.

హ్రజత్ అబూసయీద్ ఖుద్రీ (రజి), హ్రజత్ అబూహురైరా (రజి)ల కథనం:

దైవప్రవక్త (సల్లం) ఓసారి ఖైబర్ ప్రాంతపు శిస్తు వసూలు చేయడానికి ఒకతడ్ని నియమించారు. అతను వెళ్ళి (శిస్తు కింద) మేలుజాతి ఖర్జూరపండ్లను (వసూలుచేసి) తీసుకొచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "ఖైబర్‌లో లభించే ఖర్జూరపండ్లన్నీ ఇలాగే ఉంటాయా?" అని ప్రశ్నించారు. దానికా వ్యక్తి సమాధానమిస్తూ "లేదు దైవప్రవక్తా! దైవసాక్షిగా చెబుతున్నాను. అన్నీ ఇలా ఉండవు. మేము ఇలాంటి ఒక 'సా' ఎత్తు (మేలు రకం) ఖర్జూరపండ్లను రెండు 'సా'ల ఎత్తు రెండవ రకం ఖర్జూరపండ్లకు బదులుగా కొంటాము. లేదా ఇలాంటి రెండు 'సా'ల ఎత్తు ఖర్జూరపండ్లను మూడు 'సా'ల ఎత్తు నాసిరకం ఖర్జూరపండ్లకు బదులుగా కొంటాము" అని అన్నాడు.

దైవప్రవక్త (స) ఈమాట విని "అలా చేయకండి. మొదట (నాసిరకం) ఖర్జూర పండ్లన్నీ దిర్హంలకు (అంటే నగదు పైకానికి) అమ్మేయండి. తరువాత ఆ దిర్హంలతో (నగదుపైకంతో) మేలురకం ఖర్జూరపండ్లు కొనండి" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హ్రజత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: హ్రజత్ బిలాల్ (రజి) దైవప్రవక్త (సల్లం) సన్నిధికి బర్నీ (అత్యంత మేలు)జాతికి చెందిన ఖర్జూరపండ్లను తెచ్చారు. దైవ ప్రవక్త (సల్లం) వాటిని చూసి "ఇవి ఎక్కడ్నుంచి తెచ్చావు?" అని అడిగారు. దానికి హ్రజత్ బిలాల్ (రజి) సమాధానమిస్తూ "మా దగ్గర మొదట్లో కొన్ని నాసిరకం ఖర్జూర పండ్లు ఉండేవి. మేము వాటిలో రెండు 'సా'ల ఎత్తు ఇచ్చి ఈ ఖర్జూరపండ్లు ఒక 'సా' ఎత్తు చొప్పున తీసుకున్నాం మీకు సమర్పించడానికి" అని అన్నారు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "చాలా విచారకరమైన విషయం. ఇది పూర్తిగా వడ్డీ క్రిందికి వస్తుంది. (ఇక ముందు) అలా చేయకండి. ఇలాంటి (వస్తుమార్పిడి) వ్యాపారం చేయాలనుకున్నప్పుడు ముందుగా మీ దగ్గర ఉండే ఖర్జూరపండ్లను నగదు పైకానికి అమ్మేయండి. తరువాత ఆ పైకంతో మరో రకం ఖర్జూరపండ్లు కొనుక్కోండి" అని అన్నారు. (ముస్లిం)

హ్రజత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: మాకు అన్ని రకాలు కలసిన నాసి రకం ఖర్జూరపండ్లు లభించేవి. మేము అలాంటి రెండు 'సా'ల ఎత్తు ఖర్జూరపండ్లకు బదులుగా అమ్మేవాళ్ళము. కాని దైవప్రవక్త (స) (ఇలాంటి వస్తుమార్పిడి వ్యాపారాన్ని నిషేధిస్తూ) "ఒక 'సా'ఎత్తు ఖర్జూరపండ్లకు బదులు రెండు 'సా'లఎత్తు ఖర్జూరపండ్లను గాని, ఒక దిర్హానికి బదులుగా రెండు దిర్హంలుగాని ఏదీ అమ్మడం ధర్మసమ్మతం కాదు" అని చెప్పారు. (బుఖారి)



# 69. వ్యాపార ఒప్పందాలు

వ్యాపార ఒప్పందాలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ఆదేశించారు:

"కొనేవారు, అమ్మేవారు ఇద్దరూ వ్యాపారం జరుగుతున్న చోట ఉన్నంతవరకు వారికి వ్యాపార వ్యవహారాన్ని కొనసాగించడానికి లేక రద్దు చేసుకోవడానికి హక్కుంది. అయితే హక్కుకు సంబంధించిన షరతు ఏదైనా పెడితే ఆ షరతును బట్టి ఆ హక్కు ఉంటుంది." (బుఖారి, ముస్లిం)

"కొన్నవాడు, అమ్మినవాడు వ్యాపార వ్యవహారం జరిగిన చోట కలిసి ఉన్నంత వరకు వారిరువురికి వ్యాపార వ్యవహారం ఖాయపరచడానికి లేదా రద్దుపరచడానికి హక్కుంటుంది. లేదా దాన్ని ఖాయపరచడానికి లేక రద్దుపరచడానికి ఒకరికొకరు అధికారం ఇచ్చుకోవచ్చు. ఆ తరువాత వారిద్దరు వ్యాపార వ్యవహారాన్ని అమలుపరచ డానికి అంగీకరిస్తే అప్పుడు కూడా ఆ వ్యవహారం ఖాయమవుతుంది. ఒకవేళ వారిద్దరు వ్యాపార వ్యవహారం జరుపుకున్న తరువాత పరస్పరం విడిపోతూ ఇద్దరిలో ఏ ఒక్కరూ సరుకును మానుకునే విషయం ప్రస్తావించకపోతే అప్పుడు కూడా వ్యాపార వ్యవహారం ఖాయమైపోతుంది. (ఇక దాన్ని రద్దుచేసే హక్కుండదు.)" (బుఖారి)

"కొనేవారు, అమ్మేవారు పరస్పరం విడిపోనంతవరకు వారిద్దరికి (వ్యాపార వ్యవహారాన్ని రద్దుపరచడానికి లేదా ఖాయపరచడానికి) హక్కుంటుంది. వ్యాపార వ్యవహారంలో వారిద్దరు ఏ విషయాన్నీ దాచకుండా నిజం చెప్పి పరస్పరం స్పష్టంగా మసలుకుంటే అలాంటి వ్యాపారంలో ఇద్దరికీ శుభం కలుగుతుంది. దానికి భిన్నంగా వారిద్దరు అబద్ధమాడి పరస్పం (సరుకు) లోపాలను దాచినట్లయితే ఆ వ్యాపారంలో వారిద్దరికీ ఎలాంటి శుభం చేకూరదు." (బుఖారి, ముస్లిం)

హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: వ్యాపారంలో తరచుగా మోసానికి గురవుతున్న ఒక వ్యక్తిని గురించి దైవప్రవక్త (సల్లం) ముందు ప్రస్తావన వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "నీవు ఏదైనా కొనేటప్పుడుగాని లేదా అమ్మేటప్పుడుగాని మోసం చేయకూడదని ముందే చెప్పేయాలి" అని అన్నారు. (బుఖారి)

హ్రజత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మదీనా తరలి వచ్చిన తరువాత (చూస్తే ఇక్కడ) మదీనావాసులు రెండు మూడేండ్ల అడ్వాన్సు చెల్లింపు ప్రాతిపదికపై వ్యాపారం చేస్తుండేవారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "ఏదైనా సరుకు విషయంలో అడ్వాన్సు చెల్లింపు ప్రాతిపదికపై వ్యాపారం చేయదలచుకుంటే ఆ సరుకు బరువు, కొలత, పరిమాణాలతో పాటు గడువు కూడా నిర్ణయించబడాలి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

# 70. వ్యాపార భాగస్వామ్యం

వ్యాపార భాగస్వామ్యంలో ముఖ్యంగా రెండు విధానాలు ఉన్నాయి. ఒకటి, పెట్టుబడి ఒకరిదయితే శ్రమ మరొకరిదవుతుంది. దీన్ని షరీఅత్ పరిభాషలో "ముజారబత్" అంటారు. రెండు, ఇద్దరు లేక ఇద్దరికంటే ఎక్కువ మంది వాటాదారులతో వ్యాపారం చేయడం. దీన్ని షరీఅత్ పరిభాషలో "షిరాకత్" అంటారు.

ముజారబత్ వ్యాపారంలో వ్యాపార సరుకు, వ్యాపార కేంద్రం, వ్యాపార కాలం, లాభాల వాటాల విషయంలో పనిచేయని పెట్టుబడిదారుడి (Sleeping Partner)కి, పనిచేసే వాటాదారుని (Working Partner)కి మధ్య ఏదైనా ఒప్పందం కుదిరితే ఆ ఒప్పందంలోని షరతులకు ఇద్దరూ కట్టుబడిఉండాలి. అయితే ఇమామ్ అబూ హనీఫా (రహ్మ), ఇమామ్ షాఫయి (రహ్మ)ల దృక్పథం ప్రకారం ఆ ఇద్దరిలో ఏఒక్కరికైనా తాము కోరుకున్నప్పుడు ఒప్పందాన్ని రద్దుచేసుకునే అధికారం ఉంటుంది.

పనిచేయని పెట్టుబడిదారుడు వ్యాపారం సాగుతున్నప్పుడు మధ్యలో జోక్యం చేసుకోకూడదు. అలాగే అతను తన వైపున ప్రతినిధినిగాని, ఉద్యోగినిగాని వ్యాపారంలో పెట్టకూడదు. ఒప్పందంలో అలాంటి షరతు విధించడం కూడా సరైన విధానం కాదు. ఒకవేళ వర్కింగ్ పార్ట్‌నర్ ఒప్పందంలోని షరతులకు వ్యతిరేకంగా పనిచేసిగాని, లేదా మరేదైనా మోసానికి పాల్పడిగాని వ్యాపారంలో నష్టం కలిగిస్తే దానికి అతనే బాధ్యుడవు తాడు. మొత్తం పెట్టుబడిలో ఎంత నష్టం కలిగిస్తే అంత పైకం అతను స్లీపింగ్ పార్ట్‌నర్‌కు చెల్లించవలసి ఉంటుంది.

"కలిసిమెలిసి పనిచేసేవాళ్ళు సాధారణంగా పరస్పరం అన్యాయానికి పాల్పడతారు. అయితే సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు మాత్రం అలా చేయరు. అలాంటి నిజాయితీపరులు బహుకొద్ది మంది మాత్రమే ఉంటారు." (ఖుర్‌ఆన్–38:24)

సంవత్సరాంతంలో లేక నిర్ణీతకాలం చివర్లో వచ్చే లాభాలను ఒప్పందంలోని వాటాల శాతం ప్రకారం 50, 50 శాతం చొప్పునో లేక 65, 35 శాతం చొప్పునో ఇద్దరు పంచుకోవాలి. నిర్ణీత వాటాల పంపిణీకి ముందే లాభంలో కొంత మొత్తం (Amount) పెట్టుబడిదారుడు తన కోసం ప్రత్యేకించుకోవడం ధర్మసమ్మతం కాదు. అలాగే పనిచేసే వాటాదారుడు (Working Partner) కూడా వ్యాపార నిర్వహణ లేక ఫ్యాక్టరీనిర్వహణ పేరుతో తనకోసం కొంత మొత్తాన్ని కేటాయించుకోవడం కూడా ధర్మ సమ్మతంకాదు. అలాంటి షరతులతో కూడిన ఒప్పందం ధర్మసమ్మతమైనది కాదు.

అయితే అతనికి లాడ్జింగ్, బోర్డింగ్, ట్రావెలింగ్ ఖర్చులు తీసుకునే అధికారం ఉంది. తానొక్కడే పనిచేయలేని పరిస్థితిలో ఉద్యోగుల్ని పెట్టుకునే అధికారం కూడా ఉంది. మొత్తం రాబడిలో ఈ ఖర్చులన్నీ మినహాయించిన తరువాతనే మిగిలిన నికరాదయం (Net Profit) ఇద్దరు పంచుకోవాలి. పోతే లాభనష్టాల విషయం తెలక



ముందే ఏదైనా కారణంతో ఒప్పందం రద్దయిపోవడం జరిగితే పెట్టుబడి పెట్టిన భాగస్వామి (Sleeping Partner) పనిచేసే భాగస్వామి (Working Partner)కి పనిచేసిన కాలానికి సముచితరీతిలో తగిన వేతనం చెల్లించాలి.

భాగస్వామ్యం (Partnership) వ్యాపారం, వ్యవసాయం, పరిశ్రమలు మొదలైన అనేక వ్యవహారాలలో ఉంటుంది. అయితే ఎలాంటి భాగస్వామ్య వ్యవహారమైనా అందులోని భాగస్వాములు ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం నీతి నిజాయితీలకు కట్టుబడి ఉండాలి. అప్పుడే ఆ వ్యవహారంలో దైవసహాయం, శుభాలు లభిస్తాయి. మహాప్రవక్త (సల్లం) ఒక హదీసులో దేవుని మాటలను ఇలా తెలిపారు:

"ఇద్దరు భాగస్వాములు కలసి ఏదైనా పని చేస్తున్నప్పుడు వారిద్దరు పరస్పరం నమ్మక ద్రోహానికి, మోసానికి పాల్పడకుండా నిజాయితీగా వ్యవహరిస్తున్నంతవరకూ నేను వారితో ఉంటాను. (అంటే నేను వారికి సహాయం చేస్తూ వారికి శుభాలు ప్రసాదిస్తూ ఉంటాను.) ఒకవేళ వారు నమ్మకద్రోహానికి పాల్పడటం మొదలుపెడితే మాత్రం నేను వారికి సహాయం చేయడం వదిలేస్తాను." (మిష్కాత్)

ఈ హదీసు వెలుగులో ప్రవక్త అనుచరులు ముస్లిమేతరులతో కూడా వ్యాపార లావాదేవీలు జరిపేటప్పుడు ఎంతో నిజాయితీగా వ్యవహరించారని ఇస్లాం చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఖైబర్‌యుద్ధంలో జరిగిన ఒప్పంద ప్రకారం ముస్లింల యాజమాన్యంలోకి వచ్చిన యూదుల సేద్యభూముల్ని యూదులు సేద్యంచేసి అర్ధపంట ముస్లింలకు ఇచ్చే షరతుపై వాటిని ఖైబర్ యూదుల అధీనంలోనే ఇవ్వడం జరిగింది. మరుసటి సంవత్సరం పంటలు పండిన తరువాత దైవప్రవక్త (స) పంట వసూలుచేసి తీసుకు రావడానికి అబ్దుల్లా బిన్ రవాహా (రజి)ను ఖైబర్‌కు పంపించారు.

ఆయన వెళ్ళి యూదులతో "మీరు పంచుతారా లేక నన్ను పంచమంటారా?" అని అడిగారు. దానికి వారు మీరే పంచండని అన్నారు. అప్పుడాయన మొత్తం పంటను రెండు భాగాలుగా చేసి "వీటిలో మీరు కోరుకున్న భాగం తీసుకోండి" అని చెప్పారు. యూదులు ఈ న్యాయవైఖరి చూసి "ఈ న్యాయవైఖరి కారణంగానే భూమ్యాకాశాలు నిలకడగా ఉన్నాయి. (లేకుంటే ఎప్పుడో ప్రళయం వచ్చిపడేది.)" అన్నారు.

షిరాకత్(Partnership) వ్యాపారంలో పాల్గొనేవారందరికీ తమతమ పెట్టుబడుల రీత్యా ఆ వాణిజ్యసంస్థపై ఉమ్మడి యాజమాన్యహక్కులు ఉంటాయి. వ్యాపారాభివృద్ధి కోసం అందరూ పనిచేస్తారు. ఒకవేళ ఎవరైనా ఏదైనా కారణంగా సంస్థ కార్యకలాపాలలో పాల్గొనలేకపోయినా లాభాలలో అతనికీ వాటా లభిస్తుంది; కారణం నష్టం వచ్చినప్పుడు ఇతర వాటాదారులతో పాటు అతనూ నష్టం భరించవలసి ఉంటుంది.

ఇలాంటి వ్యాపారంలో కూడా వాటాదారులు ఒప్పందం చేసుకోవాలి. పెట్టుబడులు సమానంగా ఉన్నప్పుడు లాభాలు కూడా సమానంగా ఉండాలి. పెట్టు

బడులు సమానంగా లేనప్పుడు వాటి నిష్పత్తి ప్రకారం లాభాలు పంచుకోవాలి. అలాగే వాటాదారులంతా ఏకాభిప్రాయంతో సంస్థ విధాననిర్ణయాలు తీసుకోవాలి. వాటా దారులలో ఎవరైనా మేనేజింగ్ డైరెక్టరుగా ఎంపికయినప్పుడు అతను తనకున్న అత్యధిక శక్తిసామర్థ్యాలతో పని చేసినందుకు అదనపు లాభం లేక ప్రత్యేక వేతనం తీసుకోవడం సరికాదు. అలాంటి విషయాలుంటే ముందే నిర్ణయించుకొని ఒప్పందం లో చేర్చాలి. లేదా సంస్థ భాగస్వాముల్లో లేని వ్యక్తిని మేనేజర్‌గా నియమించి అతనికి తగిన వేతనం ఇవ్వచ్చు.

## 71. పండ్లు, పంటల వ్యాపారం

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: "పండ్లు వాడేందుకు యోగ్యమైనవని స్పష్టం కానంతవరకు వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (సల్లం) వారించారు. ఆయన కొనేవాడిని కూడా వారించారు." (బుఖారి, ముస్లిం)

పండ్లు, కాయలు కోయనివ్వకుండా చెట్లకే ఉండనివ్వాలని షరతుపెట్టి వ్యాపారం చేయకూడదు. వ్యాపారం జరిగిన తరువాత అవి చీడపట్టి చెడిపోవచ్చు లేదా మరేదైనా కారణం వల్ల పంటకు నష్టం కలగవచ్చు. అప్పుడు అమ్మకందారుడు తన సోదరుని డబ్బు అప్పనంగా ఎగరేసుకున్న వాడవుతాడు. అదే విధంగా ఎలాంటి షరతు లేకుండా అమ్మడం కూడా ధర్మసమ్మతం కాదు. కాకపోతే పండ్లు బాగా ఎదిగి పంటకు వచ్చినప్పుడు అమ్మడం, కొనడం ధర్మసమ్మతమే.

సహెల్ బిన్ అబూహష్మా (రజి) ఉల్లేఖనం: ఎండు ఖర్జూరపండ్లకు బదులు చెట్ల మీదున్న పండ్లు అమ్మకూడదని దైవప్రవక్త (స) వారించారు. అయితే చెట్ల మీదుండే పండ్లు పక్వానికి వచ్చిన సంగతి అంచనా వేసి అమ్మవచ్చని అన్నారు. (మిష్కాత్)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: "పండ్లు బాగా ఎదిగి పంటకు రానంతవరకూ వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (సల్లం) వారించారు. అలాగే ఆ పండ్లను అరాయా (అంటే నగదు చేతిలోలేని నిరుపేద కొనుగోలుదారుల) విషయంలో తప్ప దిర్హం, దీనార్‌లకు (అంటే నగదు పైకానికి) మాత్రమే అమ్మాలని ఆయన (సల్లం) ఆదేశించారు." (బుఖారి)

హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం: "నగదు డబ్బు చేతిలోలేని నిరుపేద అమ్మకందారులు తమ (తోటలోని పచ్చి) ఖర్జూర పండ్లను ఎండు ఖర్జూర పండ్లకు బదులు అమ్ముకోవచ్చని దైవప్రవక్త (స) అనుమతించారు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఖర్జూరపండ్లు తినడానికి యోగ్యం కానంత వరకు లేదా బరువయినవి కానంతవరకు వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (స) వారించారు. అప్పుడు ఒకతను "బరువయినవి అంటే ఏమిటీ?" అని అడిగితే



"అంటే నిల్వచేయడానికి వీలయినవి (బాగా పండి పంటకు వచ్చినవి) అని అర్థం" అని చెప్పారు ఆయన. (బుఖారి)

అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: పండ్ల మీద రంగు స్పష్టంగా వ్యక్తం కానంత వరకు వాటిని అమ్మకూడదని దైవప్రవక్త (స) ఆదేశించారు. అప్పుడు ఒకతను "రంగు స్పష్టంగా వ్యక్తమవడం అంటే ఏమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "పండి దానిపై ఎరుపుదనం రానంతవరకు" అని చెప్పారు. ఆ తర్వాత ఆయన "కాస్త మీరే ఆలోచించండి. (కాపుకు రాకముందే లావా దేవీలు జరిగిన పక్షంలో) ఒకవేళ దేవుడు పండ్లను ఆపివుంచితే (అంటే పంట నష్టం జరిగేతే) అమ్మకందారుడు తనసోదరుని పైకం ఏ వస్తువుకు బదులుగా తీసుకుంటాడు?" అని అన్నారు. (బుఖారి)

## 72. సేద్యభూములు కౌలుకు ఇవ్వడం

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) కథనం: మాలో కొందరి దగ్గర బీడుభూములు వృథాగా పడివున్నాయి. అలాంటి భూములను వారు అర్థపంట, పావుపంట, లేదా మూడోవంతు పంట షరతుపై పాలికివ్వాలని భావించారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "భూమి ఉన్నవాడు అందులో స్వయంగా సేద్యం చేయాలి లేదా తోటి ముస్లిం సోదరునికి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేద్యం చేసుకోవడానికి ఇచ్చేయాలి. ఇలా చేయకపోతే ఆ భూమిని అలాగే పడి ఉండనివ్వాలి." (బుఖారి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరి దగ్గరయినా భూమి ఉంటే అతనా భూమిలో స్వయంగా సేద్యం చేసుకోవాలి లేదా తోటి ముస్లిం సోదరునికెవరికైనా దాన్ని ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేద్యం చేసుకోవడానికి ఇచ్చేయాలి. అలా చేయకపోతే దాన్ని అలాగే ఆపి ఉంచాలి." (బుఖారి)

హజ్రత్ జహీర్ బిన్ రాఫె (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని మాకు ప్రయోజనం చేకూర్చే ఒక పని నుండి వారించారు." (ఈ హదీసు ఉల్లేఖించిన రాఫె బిన్ ఖుదైజ్ మాట్లాడుతూ) "దైవప్రవక్త (సల్లం) చెప్పింది వాస్తవం, సత్యంతో కూడినది. ఇంతకూ అదేమిటీ?" అని అడిగాను నేను.

దానికి జహీర్ (రజి) సమాధానమిస్తూ "దైవప్రవక్త (సల్లం) నన్ను పిలిచి 'నీవు నీ సేద్యభూముల విషయంలో ఎలా చేస్తున్నావు?' అని అడిగారు. నేను 'అద్దెకు ఇస్తున్నాను లేదా నాల్గవ భాగం పంటకై పాలికిస్తున్నాను లేదా కొన్ని వసఖ్‌ల ఎత్తు ఖర్జూరపండ్లు, గోధుములకు బదులుగా ఇస్తున్నాను' అని చెప్పాను.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) "అలా చేయకు. నువ్వు స్వయంగా సేద్యం చెయ్యి లేదా (ప్రతిఫలం తీసుకోకుండా) ఇతరులకు సేద్యం చేసుకోవడానికి ఇచ్చేయ్యి, లేదా దాన్ని అలాగే పడి ఉండనివ్వు" అని అన్నారు.

హజ్రత్ జహీర్ బిన్ రాఫె (రజి) మాట్లాడుతూ "నేను మీ ఆజ్ఞ విన్నాను, దానికి కట్టుబడి ఉంటాను" అని అన్నాను. (ముస్లిం)

ఇవి పేదముస్లింలను ఉద్ధరించడానికి ఇవ్వబడిన ప్రాథమిక హితవులు. ఆ తర్వాత సేద్యభూమిని కౌలుకు లేక పాలికిచ్చే అనుమతి లభించింది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: "దైవప్రవక్త (సల్లం) వ్యవసాయ భూమిని పాలికివ్వకూడదని మమ్మల్ని వారించలేదు. నిర్ణీత పైకంతో భూమిని అద్దెకు ఇవ్వడం కంటే ఎలాంటి ప్రతిఫలం తీసుకోకుండా దాన్ని తోటి ముస్లిం సోదరునికి ఉచితంగా ఇవ్వడం ఎంతో మంచిదని మాత్రమే ఆయన అన్నారు." (బుఖారి)

సేద్యభూమి కౌలుకిచ్చినప్పుడు నగదు పైకం, పంటలు, కాలపరిమితిని గురించి ఒప్పందం వ్రాసుకోవాలి. పాలికిచ్చినప్పుడు విత్తనాలు, ఎరువులు, శ్రమ తదితర విషయాలను గురించి ఎవరెవరు ఏ బాధ్యత తీసుకోవాలో భూమి యజమాని, రైతు కలసి తగిన నిర్ణయం తీసుకోవాలి.

## 73. షేర్ మార్కెట్

షేర్ మార్కెట్ అంటే వాటాదారుల మార్కెట్ అని చెప్పవచ్చు. ఈ మార్కెట్‌లో బడా వాటాదారులు, చిన్నాచితకా వాటాదారులు అని రెండు విధాల వాటాదారులు ఉంటారు. బడా వాటాదారులే ఎక్కువగా మార్కెట్‌పై పెత్తనం చెలాయిస్తారు. మార్కెట్ విధాననిర్ణయాలు కూడా వారే తీసుకుంటారు. చిన్న వాటాదారులు పెట్టుబడి పెట్టి ఊరుకుంటారు. వీరుభయుల మధ్య వ్యవహారం అటునుంచి ఇటు, ఇటునుంచి అటు నడపడానికి బ్రోకర్‌లు (మధ్యదళారులు) ఉంటారు. వీరిలో కూడా "ఆంబోతులు (Bulls), ఎలుగుబంట్లు (Bears) అని రెండురకాల బ్రోకర్లు ఉంటారు. "ఆంబోతుల్లో కొన్ని "కొమ్ములు తిరిగిన ఆంబోతులు" (Big Bulls) కూడా ఉంటాయి. అలాంటి కొమ్ములు తిరిగిన ఆంబోతులలో ప్రభుత్వానికి పట్టుబడి జైలుపాలయి, గుండెపోటుతో హరీ అన్న హర్షద్ మెహతా కూడా ఉన్నాడు.

ఇదీ షేర్‌మార్కెట్ సంక్షిప్త పరిచయం. కాస్త వివరాల్లోకి పోతే షేర్లు కొనడానికి (1) ప్రైమరీ మార్కెట్, (2) సెకండరీ మార్కెట్ అని రెండు పద్ధతులు ఉన్నాయి.

**ప్రైమరీ మార్కెట్** అంటే ఒక కంపెనీ కొత్తగా నెలకొల్పబడుతున్నప్పుడు తనకు కావలసిన మూలధనం కోసం ప్రజలకు షేర్లను ప్రత్యక్షంగా అమ్ముతుంది. కంపెనీ పత్రికలలో "పబ్లిక్ ఇష్యూ" పేర ప్రకటనలిచ్చి ఇలా చేస్తుంది. దీని షేర్ ముఖవిలువ (ఫేస్‌వ్యాల్యూ) 10 లేక 100 రూపాయలు ఉంటుంది. ఈ ప్రైమరీ మార్కెట్‌లో నిర్ణీతషేర్ల కంటే ప్రజలనుండి ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీవేసి షేర్లను కేటాయిస్తారు. లాటరీ తగలనివారికి పైకం తిరిగిచ్చేస్తారు.



కొంతకాలం తరువాత ఆ షేర్లు స్టాక్‌మార్కెట్‌లో లిస్టవుతాయి. అంటే ఇంతకు ముందే ఉన్న వివిధ కంపెనీల షేర్ల జాబితాలోకి ఎక్కుతాయన్నమాట. ఆ షేర్లు కావలసినవారు వాటిని స్టాక్‌మార్కెట్‌లో బ్లాక్‌లో కొనుక్కుంటారు. ఈ స్టాక్‌మార్కెట్‌నే సెకండరీ మార్కెట్ అని కూడా అంటారు.

నలుగురు మిత్రులు ఇరవై కోట్ల రూపాయలతో ఒక కంపెనీ స్థాపించదలిచారనుకోండి. కాని వారికి తలా రెండుకోట్లు మాత్రమే పెట్టుబడి పెట్టే స్తోమత ఉంటుంది. అగ్రిమెంట్లు, గ్యారంటీల ద్వారా బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల నుండి మరో నాలుగు కోట్లు తెచ్చుకుంటారు. అయినా పెట్టుబడి సరిపోదు. అప్పుడా కంపెనీ ప్రమోటర్లు మిగతా ఎనిమిది కోట్ల కోసం మరికొంతమందిని భాగస్వాములుగా చేర్చుకుంటారు లేదా పైన పేర్కొన్నట్లు ప్రజల నుండి రూ.10/- ఫేస్‌వ్యాల్యూ చొప్పున షేర్ల రూపంలో పెట్టుబడులు ఆహ్వానిస్తారు. ఆ విధంగా ప్రైమరీమార్కెట్‌లో షేర్లు కొనుగోలుచేసిన వ్యక్తి ఆ కంపెనీ వాటాదారుడు అవుతాడు. అతనికి కొన్ని పరిమిత హక్కులు సంక్రమిస్తాయి.

కంపెనీ స్థాపనకు కావలసిన స్థలం+బిల్డింగ్ కోసం కోటి రూపాయలు, యంత్రాల కోసం 6 కోట్లు, ముడిపదార్థాల కోసం 4 కోట్లు, వర్కింగ్ క్యాపిటల్ కోసం 8 కోట్లు, ఇతరఖర్చుల కోసం కోటి రూపాయలు లభించిన తర్వాత పని ప్రారంభమైందనుకోండి. ఆ తర్వాత వస్తూత్పత్తి ప్రారంభం కావాలి. ప్రజలు షేర్లు కొన్న సమయం నుండి ఉత్పత్తి ప్రారంభమయ్యే నాటికి పట్టేకాలాన్ని "గెస్టేషన్ పీరియడ్" అంటారు. ఈ గెస్టేషన్ పీరియడ్ ఎంత తక్కువగా ఉంటే అంతత్వరగా ఆదాయం షేర్‌హోల్డర్‌లకు లభిస్తుంది.

ఒక సంవత్సరం తర్వాత వివిధ పన్నులు, బ్యాంకు వడ్డీలు, నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల వేతనాలు, యంత్రాల అరుగుదలచార్జీలు వగైరా ఖర్చులు పోగా మిగిలిన నికరాదాయం (నెట్‌ప్రాఫిట్) రెండు కోట్లు తేలిందనుకుందాం. అప్పుడు రెండు కోట్ల రూపాయల్ని కోటి షేర్లతో భాగిస్తే వచ్చేది ఒక షేర్ ఆర్జించిన లాభంగా లెక్కించాలి. అలా లెక్కిస్తే 100 షేర్లు కొన్న వ్యక్తికి తాను పెట్టిన రూ.1000/- పెట్టుబడిపై రూ.200- లాభం లభిస్తుంది. అంటే ఏడాది కాలవ్యవధిలో 20% లాభం వచ్చిందన్న మాట.

**రిజర్వుడ్ ఫండ్** : ఇది షేర్‌హోల్డర్‌కు న్యాయంగా లభించవలసిన లాభం. కాని నిజానికి అలా జరగదు. ఏ కంపెనీ తనకొచ్చిన రాబడి మొత్తాన్ని వాటాదారులకు పంచదు. భవిష్యత్ అవసరాల కోసం అందులో ఓ పెద్ద భాగాన్ని రిజర్వుడ్ ఫండ్‌లోకి మళ్ళిస్తుంది. ఇలా 50% రాబడి రిజర్వుడ్‌ఫండ్‌కు పోగా మిగిలిన 50% వాటాదారులకు పంచుతుందనుకుంటే, 100 షేర్లు కొన్న వ్యక్తికి తన రూ.1000/-ల పెట్టుబడిపై రూ.100/-లు మాత్రమే డివిడెండ్ రూపంలో లాభం వస్తుంది.

**రైట్ ఇష్యూస్** : ఒక కంపెనీ తన వ్యాపార విస్తరణ కోసం మరింత డబ్బు కావలసి వచ్చినప్పుడు వడ్డీలపై రుణాలు తీసుకోకుండా సాధారణంగా తన సొంత ఇన్వెస్టర్ల నుండే ఆ డబ్బును సేకరించే షేర్ల విధానాన్ని రైట్ ఇష్యూస్ అంటారు. అయితే ఆ ఇన్వెస్టర్లు తమ మొదటి షేర్ "ఫేస్‌వ్యాల్యూ"(ముఖవిలువ)పై ప్రీమియం రూపంలో మరికొంత సొమ్ము చెల్లించవలసి ఉంటుంది. అంటే మొదటి షేర్ ముఖవిలువ రూ.10/- ఉంటే దానికి రూ.20/- కలిపి మొత్తం రూ.30/- చెల్లించాలన్న మాట. అదే షేర్‌మార్కెట్‌లో అయితే రూ.50/- లేక రూ.60/- ఉండవచ్చు.

ఏమైనప్పటికీ ప్రైమరీమార్కెట్‌లో షేర్లు కొనడం కొంత లాభసాటి వ్యవహారమే నని చెప్పవచ్చు. అయితే ప్రైమరీమార్కెట్‌ను పూర్తిగా 'రిస్క్‌ఫ్రీ' వ్యవహారమని భావించ రాదు. ముఖ్యంగా ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తరువాత కంపెనీలకు నిధుల సేకరణ తేలికైపోయింది. 'కంట్రోల్ ఆఫ్ క్యాపిటల్ ఇష్యూస్'ను రద్దుచేయడం తో నిధుల సేకరణకు ప్రైమరీమార్కెట్‌కు వచ్చే కంపెనీలు తామరతంపగా పెరిగాయి. దాంతో పేరు-ఊరులేని ప్రమోటర్లు ప్రజలను మభ్యపెట్టి తేలిగ్గా వారి జేబులు కొల్ల గొట్టే దారులు వెతుకుతున్నారు. కొన్ని కంపెనీలు నిధులు వసూలుచేసి స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లో 'లిస్ట్' చేసుకోవు. దానివల్ల ఆ కంపెనీ షేర్లను ఇన్వెస్టర్లు అమ్ముకోడానికి వీలుపడదు. మరికొన్ని కంపెనీలు అడ్రసులేకుండా మాయమవడం కూడా జరుగుతుంది.

ఇక ఇస్లాం దృక్పథంతో ఆలోచించినపుడు మనం కొన్ని విషయాలు గమనించాలి. షేర్లు కొనేముందు కంపెనీల ఎన్నిక పట్ల జాగ్రత్త వహించాలి. బ్యాంకులు, ఇన్షూరెన్స్ సంస్థల్లాంటి 'నాన్‌ప్రొడక్టివ్' కంపెనీల జోలికి పోకూడదు. అలాగే మత్తుపదార్థాలను ఉత్పత్తిచేసే, అశ్లీలవిషయాలకు తావిచ్చే కంపెనీల షేర్లు కూడా కొనకూడదు.

**కోటీశ్వరుల్లోనే కోట్ల రూపాయలు కేంద్రీకృతం** : ప్రైమరీమార్కెట్‌లో ఒకసారి పెట్టుబడి పెడ్తే ఇక ఎన్నటికీ అక్కడ్నుంచి మనం దాన్ని వాపసు తీసుకోలేము. అంతగా డబ్బు అవసరమైతే మన దగ్గరుండే షేర్ సర్టిఫికెట్‌ను స్టాక్‌మార్కెట్‌లో ఇతర వ్యక్తు లకు అప్పటి మార్కెట్‌ధర ప్రకారం అమ్ముకోవాలి. అతను కావాలంటే మరొకతనికి అమ్ముకోవచ్చు. అంతేగాని కంపెనీ ప్రజలనుండి తీసుకున్న డబ్బును ఎన్నటికీ వాపసు చేయదు. ఈవిధంగా సంపద ప్రజలనుండి పోయి కోటీశ్వరుల చేతుల్లో కేంద్రీకృత మవుతుంది. ఇది ఇస్లాం స్థాపించదలచిన 'ధనవికేంద్రీకరణ' స్వభావానికే విరుద్ధం.

**సెకండరీ మార్కెట్:** దీన్ని స్టాక్‌మార్కెట్ లేక స్టాక్‌ఎక్స్ఛేంజ్ అని కూడా అంటారు. స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లో 'లిస్ట్' అయిన కంపెనీల (సెకండ్‌హ్యాండ్) షేర్ల అమ్మకాలు, కొనుగోళ్ళు జరుగుతాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లు మాత్రమే ఈ అమ్మకం, కొనుగోళ్ళు నిర్వహించవలసి ఉంటుంది. ఇక్కడ షేర్లను అమ్మాలన్నా, కొనాలన్నా కొంతమంది ఆధారిత వ్యక్తులు ఉంటారు. వీరినే బ్రోకర్లు (దళారులు) అంటారు. ఈ బ్రోకర్లు స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లో డబ్బు చెల్లించి బ్రోకర్‌షిప్ కార్డు పొందుతారు.



వీరు ప్రజలకు షేర్లు కొనిచ్చినందుకు లేదా అమ్మిపెట్టినందుకు షేర్ల మొత్తంలో 0.5% నుండి 1% దాకా కమీషన్ తీసుకుంటారు.

షేర్ల లావాదేవీల కోసం ఇన్వెస్టర్లకు స్టాక్‌మార్కెట్‌లో అనుమతి లేనందున వారు బ్రోకర్లను ఆశ్రయించాల్సి ఉంటుంది. ఈ బ్రోకర్లలో మోసగాళ్ళు కూడా ఉంటారు. అంచేత అధిక ధరల్లో షేర్లు కొనడం, ఎక్కువ కమీషన్ తీసుకోవడం, షేర్ సర్టిఫికెట్లు ఆలస్యంగా ఇవ్వడం, చెల్లని సర్టిఫికెట్లు ఇవ్వడంలాంటి మోసాలు కూడా జరుగుతాయి.

దేశంలో వివిధప్రాంతాల్లో బ్రోకర్లు ఉంటారు. వారందరికీ కంప్యూటర్లుంటాయి. ఆ కంప్యూటర్‌ని సంబంధిత ఎక్స్ఛేంజ్‌కి శాటిలైట్‌ద్వారా కనెక్ట్ చేయగానే వివిధ కంపెనీల షేర్లధరలు ప్రత్యక్షమౌతాయి. ఏఏ షేర్లు ఏఏ ధరలతో ఎంతమంది అమ్ము తున్నారో, దానికోసం ఏఏ ధరలతో ఎంతమంది కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారో ఆ కంప్యూటర్ స్క్రీన్‌లో కన్పిస్తాయి. అలా దేశంలో బ్రోకర్లందరి కంప్యూటర్లు స్టాక్‌ఎక్ఛేంజ్ లోని సెంట్రల్ కంప్యూటర్‌తో అనుసంధానం చేయబడి షేర్లు ఒకదానికి (కొనేరేటు) మరొకటి (అమ్మేవారి రేటుకు) 'మ్యాచ్' అయి కొనుగోళ్ళు, అమ్మకాలు జరుగుతాయి.

స్టాక్‌ఎక్స్ఛేంజ్ ఇలా ఎలాక్ట్రానిక్ ట్రేడింగ్ ద్వారా జరిగే లావాదేవీలను పర్యవేక్షించ డం, బ్రోకర్ల ద్వారా జరిగే క్రయవిక్రయాలకు చెల్లింపులు సక్రమంగా జరిగేటట్లు చూడటం, ఏ బ్రోకర్ మీదైనా ఇన్వెస్టర్లు ఆరోపణచేస్తే పరిశీలించి న్యాయాన్యాయాలను తేల్చడం, అవసరమైతే బ్రోకర్‌పై చర్య తీసుకోవడం లాంటి పనులు చేపడుతుంది.

**సెబి పాత్ర:** అలాగే యావత్తు స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లు, బ్రోకర్లపై ఆధిపత్యం వహించ డానికి ప్రభుత్వం ఒక సంస్థను నెలకొల్పింది. దీన్ని "సెబి" (Securities Exchange Board of India) అంటారు. ఈ సెబి ఆదేశాల ప్రకారం స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లు, బ్రోకర్లు నడుచుకోవాల్సి ఉంటుంది. షేర్ల ధరల్లో రిగ్గింగ్, బ్రోకర్ల అక్రమాలు, రిజిస్ట్రేషన్ తదితర వ్యవహారాల మీద సెబి నిరంతరం ఓ కన్నేసి ఉంచుతుంది.

**ఫండమెంటల్స్, లిక్విడిటీ** : షేర్ ఏధరకు కొనాలో, అమ్మాలో తెలుసుకోవ డానికి కంపెనీ ఫండమెంటల్స్‌ను విశ్లేషించవలసి ఉంటుంది. ఆ ఫండమెంటల్స్- 1. డివిడెండ్, 2. ఎర్నింగ్ ఫర్ షేర్ (ఇ.పి.ఎస్.), 3. బుక్ వ్యాల్యూ, 4. ప్రైస్‌ఎర్నింగ్ రేషియో (పి.ఇ.). విశ్లేషించిన ఫలితాలు తృప్తికరంగా ఉంటే షేర్ అమ్మవచ్చు లేక కొనవచ్చు.

అయితే అన్నిటికంటే ముఖ్యం ఆ షేర్ ఎప్పుడు అమ్మకానికి పెడితే అప్పుడు తేలిగ్గా అమ్ముడుపోవాలి. అంటే ఆ షేర్‌కు అధికస్థాయిలో లావాదేవీలు జరిగి ఉండాలి. దీన్ని "లిక్విడిటీ" అంటారు. దీన్ని తెలుసుకోవడానికి పత్రికల్లో షేర్ కొటేషన్ (ధర) పక్క నుండే సంఖ్యను చూడాలి. ఉదా- 18,550 సంఖ్య వేస్తారనుకోండి. అదే రిలయన్స్‌షేర్ అయితే ఆ సంఖ్య లక్షల్లో ఉంటుంది. అంటే ఆ షేర్‌లో అంత

స్థాయిలో అమ్మకాలు, కొనుగోళ్ళు జరిగాయన్నమాట. సాధారణంగా ఒక షేర్‌కు 50,000 లావాదేవీలు జరుగుతుంటే దానికి ఓ మోస్తరు లిక్విడిటీ ఉన్నట్లు లెక్క. మార్కెట్ 'క్రాష్' అయినప్పుడు కనీసం 25,000 లావాదేవీలు జరుగుతున్నా దాని షేర్‌కు లిక్విడిటీ ఉన్నట్లే.

**సెన్సెక్స్ (ఇండెక్స్)** : మార్కెట్ గమనాన్ని కొలిచే ప్రమాణవిధానాన్ని సెన్సెక్స్ లేక ఇండెక్స్ అంటారు. దీనికి 1978-79 సంవత్సరాన్ని ప్రాతిపదిక కాలంగా నిర్ణయించారు. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌లో ఉన్న వివిధ కంపెనీలలో అభివృద్ధి చెందిన 30 కంపెనీల షేర్లను పరిగణనలోకి తీసుకొని, ప్రతి షేర్‌కు ఒక విలువ ఇస్తారు. ప్రతి రెండు నిమిషాల సమయయంలోనూ సెన్సెక్స్ 30 షేర్ల మార్కెట్ పెట్టుబడి విలువని లెక్కకడ్తుంది. మనం ప్రతిరోజూ సెన్సెక్స్ పాయింట్లుగా చెబుతున్న అంకెలు 1978-79 సంవత్సరం నాటి 30 షేర్లకి ఈనాటి మార్కెట్ పెట్టుబడి విలువ అన్నమాట.

**షేర్ల రిగ్గింగ్:** షేర్ల ధరలు సాధారణంగా ఏడాదికాలంలో 50% నుంచి 150% వరకు పెరిగే అవకాశం ఉంటుంది. కాని ఒక్కోసారి బ్రోకర్లు, కంపెనీల ఉద్యోగులు కుమ్మక్కయి హఠాత్తుగా షేర్లధరలను విపరీతంగా పెంచి ఇన్వెస్టర్లను దోచుకుంటారు.

ఉదాహరణకు, బలహీనంగా ఉన్న ఒక కంపెనీ పటిష్ఠమైన మరో కంపెనీలో విలీనం కావడాన్ని "టేక్ఓవర్" అంటారు. అయితే టేక్ఓవర్ వార్త బయటికి పొక్కక ముందే బ్రోకర్లు దాని ఆధారంగా బలహీనమైన కంపెనీ షేరును వదంతుల ద్వారా ఉచ్ఛస్థితికి తీసుకువెళ్తారు. దాంతో షేర్‌ధర బాగా పెరిగిపోతుంది. అలాగే ఒకానొక కంపెనీ షేర్‌కు మార్కెట్ కొరత ఏర్పడే "షార్ట్ పొజిషన్" ద్వారా కూడా బ్రోకర్లు షేర్ విలువను పెంచేస్తారు. పోతే బ్రోకర్లు ఒక కంపెనీ ఫలితాలు ఆశాజనకంగా లేవన్న రహస్యసమాచారాన్ని ఆ కంపెనీ ఉద్యోగుల ద్వారా సేకరించి చార్టడ్ ఎకౌంటెంట్‌తో కుమ్మక్కయి షేర్‌ధరను వీలైనంత దిగువస్థాయికి పడవేస్తారు. షేర్ల విపరీత పెరుగుదలను అరికట్టడానికి ప్రభుత్వం షేర్లకు పరిమితులు, సీలింగులు, సస్పెండులు విధిస్తుంది. అయినా బ్రోకర్లకు ఏవో కొన్ని దొడ్డిదారులు దొరుకుతూనే ఉంటాయి.

**స్పెక్యులేషన్** : స్టాక్‌మార్కెట్‌లో నిజమైన పెట్టుబడిదారులే కాకుండా స్వల్ప కాలంలో భారీలాభాలు ఆర్జించడానికి సెక్యూరిటీలను కొని అమ్మేవాళ్ళున్నారు. వారిని స్పెక్యులేటర్లని, వారు చేసే వ్యాపారాన్ని స్పెక్యులేషన్ వ్యాపారమని అంటారు. భవిషత్తును గమనించడం, ధరలలో తాము భావించే మార్పు వస్తుందన్న ఆశతో సెక్యూరిటీల కొనుగోళ్లు, అమ్మకాలు సాగించడాన్ని స్పెక్యులేషన్ అంటారు. భవిష్యత్తులో లాభానికి అమ్మే ఉద్దేశంతో సెక్యూరిటీలను కొంటారు. అలాగే భవిష్యత్తులో తక్కువ ధరకు కొనవచ్చనే ఉద్దేశంతో షేర్లను అమ్ముతారు. ఈవిధంగా స్పెక్యులేటర్లు స్వల్పకాలంలో కేవలం షేర్ల ధరల్లోని తేడాల ఆధారంగా లాభాలు ఆర్జించాలనుకుంటారు.



"స్టాక్‌మార్కెట్" రచయిత డాక్టర్ కిరణ్ కుమార్ అభిప్రాయం ప్రకారం "స్పెక్యులేషన్ నిజమైన సదుద్దేశంతో కూడిన చర్య కావచ్చు. లేదా జూదం కిందికి దిగజారనూ వచ్చు." ఈ స్పెక్యులేషన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే "తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుంది" అన్న చందాన స్పెక్యులేషన్ వ్యవహారం ముదిరితే అది జూదంగా మారుతుంది. ఆ జూదంలో ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో చెప్పలేం. అయితే ఓడిపోయేవారే ఎక్కువమంది ఉంటారని మాత్రం చెప్పవచ్చు.

షేర్‌మార్కెట్‌లో షేర్‌హోల్డర్స్‌గా మధ్యతరగతి ప్రజలే అత్యధికమంది ఉంటారు. వారికి జరిగే లాభనష్టాల విషయానికొస్తే దాన్ని ఒక ఉదాహరణ ద్వారా చెప్పవచ్చు. మధ్యతరహా వ్యాపారం చేసే వందమంది వర్తకులు వందరకాల వ్యాపారాలు చేస్తారనుకోండి. అప్పుడు వారిలో మహాఅయితే పదిమందికి మాత్రమే నష్టం వస్తుంది. అదే షేర్‌బిజ్నెస్ చేసే వందమంది షేర్‌హోల్డర్స్ వందరకాల షేర్లు కొని అమ్మినప్పుడు వారిలో తొంభై మందికి నష్టం వచ్చే ప్రమాదం ఉంటుంది. మొత్తం మీద సెకండరీ మార్కెట్ షేర్‌బిజినెస్ చాలా 'రిస్క్'తో కూడిన వ్యవహారమని చెప్పక తప్పదు.

**మ్యూచువల్ ఫండ్** : షేర్‌మార్కెట్‌లో 'రిస్క్' తీసుకొని పెట్టుబడి పెట్టలేని వారు మ్యూచువల్‌ఫండ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. మ్యూచువల్ ఫండ్ నిర్వాహకులు అలాంటివారికి వారిడబ్బుకు సమానంగా 'యూనిట్'లు (షేర్లుకాదు) ఇచ్చి, ఆ డబ్బును రకరకాల కంపెనీ షేర్లలో పెట్టుబడి పెడతారు. దానివల్ల వచ్చే లాభాలను తిరిగి యూనిట్ వాటాదారులకే పంచుతారు. మ్యూచువల్ ఫండ్ పథకాలను ప్రభుత్వ అనుబంధ సంస్థలైన ఎల్.ఐ.సి., యు.టి.ఐ. లాంటి సంస్థలు నిర్వహిస్తున్నాయి.

షేర్‌మార్కెట్‌తో పోల్చితే మ్యూచువల్ ఫండ్‌లో రిస్క్ తక్కువ. పైగా ఇన్వెస్టర్ల డబ్బుకు రక్షణ ఉంటుంది. అయితే మ్యూచువల్ ఫండ్‌ని నిర్వహించేవారు ఒక్కోసారి కొన్ని కంపెనీల ప్రలోభాలకు లోబడి పటిష్టంకాని షేర్లను కొనవచ్చు. దానివల్ల వాటి విలువ పడిపోయి వాటాదారుడికి నష్టం రావచ్చు. పోతే ఇన్వెస్టర్ల డబ్బును ఫండ్ నిర్వాహకులు మత్తుపదార్థాలు ఉత్పత్తిచేసే, వడ్డీవ్యాపారం చేసే సంస్థలలో పెట్టుబడి పెడితే అది ధర్మశాస్త్రం దృష్టిలో నిషిద్ధమవుతుంది.

షేర్‌మార్కెట్ లేక మ్యూచువల్‌ఫండ్‌లో పెట్టే పెట్టుబడులు ఆయా కంపెనీల నుండి తిరిగొచ్చే ప్రసక్తి లేనందున ఇలాంటి వ్యాపారప్రక్రియలు ఇస్లాం ప్రతిపాదించే ఆర్థికన్యాయం, ధనవికేంద్రీకరణల లక్ష్యానికి విరుద్ధమని చెప్పక తప్పదు. కనుక షేర్స్‌కు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొనడాన్ని ఈ రచయిత సమర్థించలేక పోతున్నాడు.

## 74. ఇస్లామిక్ మార్కెట్

ఇస్లాం అమ్మకం, కొనుగోళ్ళ విషయంలో సవివరమైన ఆదేశాలు ఇచ్చింది. మదీనాలో ముహమ్మద్ ప్రవక్త (సల్లం) స్థాపించిన మొట్టమొదటి మార్కెట్‌లో మార్కెట్

విధానానికి సంబంధించిన అతి చిన్న అంశాలను కూడా ఆయన వివరించారు.

ఆర్థిక వ్యవస్థలో మార్కెట్ లేక మండి ఓ కీలక అంశం. మార్కెట్ అనేది విస్తృత భావంతో కూడుకున్న పదం. అయితే సాధారణంగా మనం మార్కెట్ అనే పదాన్ని వివిధ సరుకులు అమ్మకం, కొనుగోలు చేసే ప్రదేశం అనే అర్థంలో వాడతాం. ఉదాహరణకు పండ్లు కూరగాయల మార్కెట్, ధాన్యపు మార్కెట్ వగైరా.

దివ్యఖుర్ఆన్‌లో దైవదాస్యానికి సంబంధించిన విషయాలన్నీ సూత్రప్రాయంగా పేర్కొనడం జరిగింది. అలాగే మానవులు శాంతియుతమైన జీవితం గడపడానికి కావలసిన చట్టాలు సంక్షిప్తంగా తెలియజేయబడ్డాయి. ఈ చట్టాలు, సూత్రాల ఆచరణాత్మక రూపమే మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పవిత్ర జీవన సరళి. ఇది వేలకొలది హదీసుల్లో విస్తరించి ఉంది.

దైవప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలస వచ్చినప్పుడు మదీనాలోని ఆర్థిక, వాణిజ్యలావాదేవీలన్నీ యూదుల స్వాధీనంలో ఉండేవి. యూదులు వాటిని తమకిష్టమైన రీతిలో నిర్వహిస్తూ మితిమీరిన లాభాలు గడిస్తుండేవారు. ఆనాడు మదీనా లోని ఒకేఒక ముఖ్యమైన వాణిజ్యకేంద్రం యూదుల వాడైన బనూఖైనుఖాలో ఉండేది. వారీ వ్యాపార కేంద్రంపై గుత్తాధిపత్యం వహించి దగా, మోసం, కల్తీ, బ్లాక్‌మార్కెటింగ్ మొదలైన అవినీతి చర్యలన్నీ యథేచ్ఛంగా సాగిస్తూ ప్రజలను దోచుకునేవారు.

దైవప్రవక్త (స) ఈ అన్యాయం, అక్రమాలు చూసిన తర్వాత ఎలాంటి నియంత్రణలు లేకుండా విచ్చలవిడిగా సాగుతున్న ఈ ఆర్థికదోపిడీ నుంచి ప్రజల్ని కాపాడేందుకు వేరే మార్కెట్‌ను నెలకొల్పాలని నిశ్చయించారు. వెంటనే ఆయన తన ముఖ్య అనుచరులతో సంప్రదించి బనూఖైనుఖాలోని యూదుల మార్కెట్ దగ్గర్లోనే మరొక మార్కెట్‌ని నెలకొల్పారు. మార్కెట్ కోసం నిర్దేశించిన ప్రదేశంలో ఆయన డేరాతో కూడిన ఒక శిబిరాన్ని వేయించారు. ఇది మార్కెట్ ఉనికిని తెలియజేసే చిహ్నం. ఆరోజు నుంచి ప్రజలు ఈ శిబిరం చుట్టూచేరి సరుకులు అమ్మకం, కొనుగోళ్ళు నిర్వహించసాగారు.

ఈ కొత్త మార్కెట్ నెలకొనడంతో ఆర్థిక రంగం మీద యూదులకున్న గుత్తాధిపత్యం క్రమంగా తగ్గిపోవడం ప్రారంభించింది. పైగా ఇక్కడ వ్యాపారస్తులు అమ్మకం, కొనుగోళ్ళలో నైతిక సూత్రాలు పాటిస్తున్నందు వల్ల ప్రజలు యూదుల మార్కెట్‌ని వదిలేసి ఇస్లామిక్ మార్కెట్ వైపే అమితంగా ఆకర్షితులవసాగారు.

ఈ మార్పు చూసి యూద వ్యాపారస్తులు ఆగ్రహోదగ్రులయ్యారు. దైవప్రవక్త (సల్లం) నెలకొల్పిన ఈ కొత్త మార్కెట్‌ని అంతమొందించడానికి సంకల్పించుకున్నారు. ఇస్లాంకు బద్ధవిరోధి అయిన కాబ్ బిన్ అష్రఫ్ అనే యూదనాయకుడు మార్కెటింగ్ కోసం దైవప్రవక్త (సల్లం) వేయించిన శిబిరాన్ని పీకివేశాడు.



మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) అతని ఓర్వలేనితనం, దుశ్చర్యల్ని సహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అతడ్ని శిక్షించడం వల్ల గాని, అతని నుండి నష్టపరిహారం వసూలు చేయడం వల్ల గాని ప్రయోజనం ఉండదని భావించారు. ఆయన ప్రజల్లో ఒక ప్రకటన చేస్తూ "నేనీ మార్కెట్‌ని అతనిలో మరింత కోపాన్ని రగల్చ గలిగేటటు వంటి (కీలక) ప్రదేశానికి తరలిస్తాను" అని అన్నారు.

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) మదీనాలో ఒక విశాలమైన బహిరంగ ప్రదేశాన్ని ఎంపికచేసి "ఇకనుంచి ఇదీ మన మార్కెట్. ఇది చాలా విశాలమైన స్థలం. రాళ్ళతో సరిహద్దు గోడలు కూడా నిర్మించనవసరం లేదు" అని చెప్పారు.

ఇదే ఇస్లామీయ వాణిజ్యకేంద్రం. దీని వ్యాపార పద్ధతులు, సూత్రాలు, నిబంధనలన్నీ యూదుల వర్తకకేంద్రం విధానాలకు పూర్తి భిన్నంగా ఉండేవి. ఇదే ఇస్లామిక్ ఎకానామిక్ మార్కెట్. ఇక్కడ దగా, మోసం, కల్తీ, దోపిడీ, నల్లబజారు (బ్లాక్‌మార్కెట్) వంటి అక్రమాలేవీ జరిగేవికావు. ఈ కారణంగా ఇది కొనుగోలుదారులను విపరీతంగా ఆకట్టుకునేది. ఇలా స్వచ్ఛమైన లావాదేవీల కారణంగా ఈ మార్కెట్ అనతికాలంలోనే వినుతికెక్కి అనూహ్యమైన ప్రగతి సాధించింది.

ఈ మార్కెట్‌లో ప్రతి వస్తువుకూ వేర్వేరు స్థలాలు కేటాయించబడ్డాయి. ఒంటెల కోసం ఒకస్థలం, గొర్రెలు-మేకల కోసం ఒకస్థలం, ధాన్యం కోసం ఒకస్థలం, పండ్ల కోసం ఒకస్థలం- ఇలా వేర్వేరు అంగళ్ళు వెలిశాయి. ప్రతి వ్యక్తీ తనకు కావలసిన వస్తువును నిర్దేశిత అంగడి నుంచి కొనుగోలు చేసేవాడు. ఈ మార్కెట్ ప్రత్యేకతలు ఇలా ఉండేవి:

- ఇదొక ఓపెన్ మార్కెట్. ఈ మార్కెట్‌లో ప్రవేశించడానికి కొనుగోలుదారులందరికీ పూర్తి స్వేచ్ఛ ఉండేది.
- ఇక్కడ ప్రజలందరికీ సమాన అవకాశాలు ఉండేవి. ఎవరికీ ఏ ప్రాతిపదికపై కూడా ప్రత్యేక రాయితీలు ఇవ్వడంగాని, విచక్షణ చూపడంగాని జరిగేదికాదు.
- మార్కెట్‌పై గుత్తాధిపత్యం నిర్వహించడానికి ఎవరు ప్రయత్నించినా వారి అక్రమ ప్రయత్నాలను వమ్ముచేయడం జరిగేది.
- ఇతరులకు నష్టం కలగజేసే రహస్య లావాదేవీలకు ఇక్కడ తావే లేదు. ఇటు అమ్మకందారులకు, అటు కొనుగోలుదారులకూ మాయమాటలు చెప్పి ఉభయపక్షాల నుండి కమీషన్లు కొల్లగొట్టే మధ్యదళారుల బెడద అసలే ఉండేది కాదు.
- ఈ మార్కెట్‌లో ఏ వర్తకునికీ తనకంటూ ఒక శాశ్వతమైన చోటును ప్రత్యేకించడం జరిగేది కాదు. దీనివల్ల అలాంటి కీలక స్థలం పొందిన ఒకరిద్దరు వర్తకులే ఎల్లప్పుడూ అధిక లాభాలు గడిస్తారు; ఇతరుల వ్యాపారాలు క్షీణిస్తాయి. ఈ మండిలో ఆనాడు ఎలాంటి సుంకాలు కూడా వసూలు చేయడం జరిగేది కాదు.

ఈ మార్కెట్‌ని స్వయంగా దైవప్రవక్తే (సల్లం) పర్యవేక్షిస్తుండేవారు. ఆయన తరచుగా మార్కెట్ పరిస్థితుల్ని, అక్కడ ధరవరల్ని సమీక్షిస్తుండేవారు. అప్పుడప్పుడు ఆయన స్వయంగా మార్కెట్ ప్రాంతాన్ని పర్యటించి అక్కడి స్థితిగతుల్ని విచారించి తెలుసుకునేవారు. నీతి నిజాయితీ సూత్రాలకు వ్యతిరేకంగా ఏవైనా అక్రమాలు, అవక తవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వస్తే తక్షణమే ఆయన సంబంధిత వర్తకుల్ని మందలించేవారు. ఆయన మార్కెట్‌లో వ్యాపారస్తుల్ని ఉద్దేశించి "దగా, మోసం చేసే వారు మాలోనివారు కాదు" అని మూడు సార్లు నొక్కి చెప్పేవారు.

వ్యాపార వ్యవహారాల్లో కూడా నమ్రతను, మృదు వైఖరిని పాటించాలని, నీతి నిజాయితీలతో వ్యవహరించాలని ఆయన ఇలా బోధించేవారు:

"కొనుగోలులో, అమ్మకంలో, ఇచ్చిన అప్పును తిరిగి రాబట్టడంలో నెమ్మదిని, నమ్రతను, మంచి నడవడికను ప్రదర్శించే వ్యక్తిని దైవం కరుణించుగాక." (బుఖారి)

"నీతిమంతుడయిన వ్యాపారి ప్రళయ దినాన దైవప్రవక్తల, సత్యవంతుల, అమరగతుల సహచర్యంలో ఉంటాడు". (తిర్మిజి)

వంచన, అసత్య ప్రమాణాలు, ఐహికజీవితంలో క్షణిక లాభాలు తెచ్చిపెట్టినా అవి వర్తకుని పరలోక జీవితాన్ని పాడుచేస్తాయి. అసత్యప్రమాణం చేసి తన సరకును అమ్ముకునే మనిషి వైపు దేవుడు ప్రళయదినాన కన్నెత్తి కూడా చూడడని దైవప్రవక్త (సల్లం) వర్తకులకు హితోపదేశం చేస్తుండేవారు. ఆయన ఒకసారి వ్యాపారస్తుల్ని సంబోధిస్తూ "సరకును అమ్మడానికి మాటిమాటికి ఒట్లు వేసుకోవడం మానుకోండి. ఇది వృద్ధి పరిచేదిగా కన్పించినా చివరికి నష్టమే కలగజేస్తుంది. పైగా శుభాన్ని దూరం చేస్తుంది" అని హెచ్చరించారు. (ముస్లిం)

సరకులను అక్రమంగా నిలువ ఉంచి కృత్రిమ కొరత సృష్టించడం, చాటు మాటుగా అత్యధిక ధరలకు అమ్ముకోవడం వంటి చర్యలు ఘోరమైన నేరాలుగా ఆయన పరిగణించారు. సకాలంలో సరకుల్ని మార్కెట్‌కు తెచ్చి అమ్మే వర్తకుల్ని దైవ మార్గంలో ధర్మయుద్ధంచేసే యోధుల వంటివారని అభివర్ణించారు.

"నిత్యావసర వస్తువుల్ని నిలువచెయ్యక సమయానికి బజారుకు తెచ్చి అమ్మే వ్యక్తి దైవానుగ్రహానికి అర్హుడవుతాడు. దేవుడతనికి పుష్కలంగా ఉపాధి ప్రసాదిస్తాడు. దీనికి భిన్నంగా (సరుకులు) నిలువచేసే వ్యక్తి దైవశాపానికి గురవుతాడు". "అక్రమ నిల్వలు (Hoarding) చేసేవాడు పరమపాపిష్ఠి." (ఇబ్నెమాజ)

మత విషయం వేరు, ప్రపంచ వ్యవహారం వేరని తలిచే ముస్లింలు దైవప్రవక్త (సల్లం) బోధించిన ఈ ప్రవచనాలు చూసి ఏం సాకులు చెబుతారో! ఇతర మతాల విషయంలో ఈమాట కొంతవరకు నిజం కావచ్చునేమో కాని, సమగ్ర జీవనవ్యవస్థ అయిన ఇస్లాంలో మానవజీవితం అవిభాజ్యమైన ఏకాంకం. ఇక్కడ మత విషయాలు,



ప్రపంచ విషయాలు వేర్వేరు సూత్రాల మీద ఆధారపడి ఉండవు. నిజమైన ముస్లిం జీవితంలోని వివిధ కోణాలు పరస్పరం విరుద్ధమైనవి కావు. ఇవన్నీ ఒకదాని కొకటి అవినాభావ సంబంధం కలిగివుండి ఒకే వ్యవస్థ సూత్రాలకు, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండే వివిధ కోణాలు.

అందువల్ల ఈ వ్యవస్థను, ఇందులోని సూత్రాలను, ఆదేశాలను విశ్వసించిన వ్యక్తి మస్జిద్‌లోనే కాదు మార్కెట్‌లోనూ, న్యాయస్థానంలోనూ, చట్టసభల్లోనూ ముస్లిం గానే మసలుకోవలసిఉంటుంది. అతను వ్యక్తిగత జీవితంలోనే కాకుండా సామూహిక జీవితంలోనూ దైవదాసుడుగానే వ్యవహరించాల్సి ఉంటుంది. అప్పుడే అతను దేవుని దృష్టిలో పరిపూర్ణ ముస్లింగా పరిగణించబడతాడు. ఈ వాస్తవికతనే సృష్టికర్త తన గ్రంథంలో ఇలా ఆదేశించాడు:

"విశ్వసించిన ప్రజలారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగు జాడలలో నడవకండి. అతను మీకు ఆగర్భశత్రువు. స్పష్టమైన బోధనలు అందినప్పటికీ మీరు తిరిగి తప్పటడుగులు వేస్తే మటుకు, బాగా తెలుసుకోండి! దేవుడు సర్వశక్తి మంతుడు, సర్వం తెలిసిన మహావివేకి." (దివ్యఖుర్ఆన్–2:208,209)

# 75. పేదల ఆర్థికహక్కు-జకాత్

"విశ్వాసులారా! ఎలాంటి క్రయవిక్రయాలు జరగని, స్నేహసహకారాలు ఉపయోగ పడని, ఎవరి సిఫారసు కూడా చెల్లని (పరలోక తీర్పు) దినం రాకముందే మేము మీకు ప్రసాదించిన సంపద నుండి (కొంత దైవమార్గంలో కూడా) ఖర్చుపెట్టండి. (మా మాటలు నమ్మని) సత్యతిరస్కారులే పరమ దుర్మార్గులు." (ఖుర్ఆన్–2:254)

జకాత్ అంటే పవిత్రత, పరిశుద్ధత అని శాబ్దిక అర్థాలున్నాయి. ఇక్కడ ప్రత్యేక పారిభాషలో, ధనికుడు పవిత్రుడయ్యే ఉద్దేశ్యంతో ఏడాదికొకసారి తన సంపద నుండి రెండున్నర శాతం చొప్పున నిరుపేదలకు, ధర్మసంస్థాపనా కార్యాలకు దానం చేయవలసిన ధనకనక వస్తువుల్ని జకాత్ అంటారు. ఈ విషయాన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"దేవుడు జకాత్ చెల్లింపును ముస్లింలకు విధిగా చేశాడు. ఇది వారి ధనికుల నుండి వసూలుచేసి, వారి నిరుపేదలకు అందజేయబడుతుంది". (బుఖారి, ముస్లిం)

ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూలస్తంభాలలో విశ్వాస ప్రకటన, నమాజ్‌ల తరువాత 'జకాత్' మూడవ స్తంభంగా పరిగణించబడుతుంది. ఖుర్ఆన్‌లో కనీసం 32 చోట్ల నమాజ్‌తో పాటు జకాత్ ప్రస్తావన వచ్చింది. దీన్నిబట్టి జకాత్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో తెలుస్తుంది. అదీగాక ఆచరణ దృష్ట్యా ఈ రెండు ఆరాధనలే మొత్తం ధర్మానికి ప్రతీకలుగా నిలిచినట్లు కూడా మనం గ్రహించగలం. దివ్య ఖుర్ఆన్ లోని ఈక్రింది సూక్తులు చదవండి:

"(సత్యాన్ని) విశ్వసించి సదాచార సంపన్నులయి నమాజ్ (విధి) నిర్వహిస్తూ, (పేదల ఆర్థికహక్కయిన) జకాత్‌ను నెరవేరుస్తూ ఉండేవారికి వారిప్రతిఫలం వారిప్రభువు వద్ద సిద్ధంగాఉంది. వారికి ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు." (ఖుర్ఆన్-2:277)

"వారు నమాజ్ స్థాపిస్తారు; జకాత్ చెల్లిస్తారు; దేవునికి తప్ప మరెవరికీ భయపడరు. అలాంటివారే సన్మార్గంలో నడుస్తారని ఆశ ఉంటుంది." (ఖుర్ఆన్-9:18)

"విశ్వసించిన స్త్రీలు, పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు (ప్రజలకు) మంచివిషయాలు బోధిస్తారు. చెడువిషయాల నుండి వారిస్తారు. నమాజ్ (వ్యవస్థ)ను స్థాపిస్తారు. జకాత్‌ని నెరవేరుస్తారు. దేవుని పట్ల, ఆయన ప్రవక్తపట్ల వినయ విధేయతలతో మసలుకుంటారు. వీరిపైన్నే దైవకారుణ్యం వర్షిస్తుంది." (ఖుర్ఆన్-9:71)

ఇస్లాం మానవులపై రెండేరెండు రకాల బాధ్యతలను మోపుతోంది. ఒకటి, దేవుని హక్కులు; రెండు, దాసుల హక్కులు. నమాజ్ మనిషిని దేవుని హక్కులు నెరవేర్చేం దుకు సమాయత్త పరుస్తుంది. కాగా జకాత్ దాసుల హక్కులు నెరవేర్చడం గురించిన బాధ్యతాభావాన్ని జనింపజేస్తుంది. ఈరెండు హక్కుల్ని సక్రమంగా నెరవేర్చడాన్నే ఇస్లాం అంటారు. ఖుర్ఆన్‌లో అనేకచోట్ల 'ఈమాన్' (విశ్వాసం) తర్వాత ఈ రెండు ఆచరణలనే ప్రస్తావించి, ఇవే మొత్తం ధర్మానికి ముఖ్య ప్రాతిపదికలన్న భావాన్ని స్ఫురింపజేస్తుంది. బహుదైవారాధకులు గనక ఇస్లాం స్వీకరించి నమాజ్, జకాత్ ఆజ్ఞలను పాటిస్తే వారు మీ ధార్మిక సోదరులవుతారని ఖుర్ఆన్ ముస్లింలకు తెలుపుతోంది.

"ఇప్పటికైనా వారు పశ్చాత్తాపం చెంది నమాజ్, జకాత్ విధులు పాటించడం ప్రారంభిస్తే వారు మీ ధార్మిక సోదరులవుతారు." (ఖుర్ఆన్-9:11)

జకాత్ చెల్లించనివారు రుజుమార్గం పొందలేరని, ఒకవేళ రుజుమార్గం ప్రాప్తమైనా అందులో వారు స్థిరంగా ఉండలేరని ఖుర్ఆన్ బోధనలు స్పష్టం చేస్తున్నాయి. అలాంటి వారు అవిశ్వాసులు, బహుదైవారాధకులని గుర్తించబడటానికి వారు జకాత్ చెల్లించకపోవడమే పెద్ద నిదర్శనమని ఖుర్ఆన్ అధ్యయనం ద్వారా తెలుస్తుంది.

"పరలోకాన్ని తిరస్కరించి జకాత్ (విధి) నెరవేర్చని బహుదైవారాధకులకు వినాశం (రాసిపెట్టి) ఉంది." (ఖుర్ఆన్-41:6,7)

ఇస్లాం స్వీకరించినవారి ధర్మపరాయణత ఎందులో ఉంది? అసలు పుణ్యకార్యం ఏమిటీ? దీనికి జవాబుగా ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

"మీ ముఖాలు తూర్పు లేక పడమరకు తిప్పుకోవడమే పుణ్యకార్యం కాదు. దేవుణ్ని, అంతిమ దినాన్ని, దైవదూతలను, దేవుడు పంపిన (అంతిమ) గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించి, దేవుని మీది ప్రేమాభిమానాలతో మీకత్యంత ప్రియమైన ధనాన్ని బంధువుల కోసం, అనాథల కోసం, నిరుపేదల కోసం, బాటసారుల



కోసం, సహాయార్థుల కోసం, బానిసలవిముక్తి కోసం ఖర్చుచేయాలి; ప్రార్థనావ్యవస్థ నెలకొల్పాలి; (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లించాలి; ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి; కష్టకాలంలో, (సత్యాసత్యాల మధ్య జరిగే) పోరాటంలో సహనం వహించాలి. ఇలాంటి సత్కార్యాలు చేసేవారే సన్మార్గ గాములు. వారే భయభక్తులు కలిగినవారు." (2:177)

దేవుడు మానవునికి మనుగడ కోసం ఈ ప్రపంచంలో అనేక రకాల సంపదలు ప్రసాదించాడు. అందుకుగాను అతడు దేవునికి కృతజ్ఞుడై ఉండటంతో పాటు, ఆ సంపదలో కొంత భాగం నిరుపేదలైన తోటి మానవులక్కూడా అందజేయాలి. స్తోమత కలిగినవారు తమ ధన, కనక, వస్తు, పశు సంపదల నుండి ప్రతి ఏడూ రెండున్నర శాతం చొప్పున తీసి పేదలకు దానం చేయాలి. దీన్ని 'జకాత్' అంటారు.

అంతేకాకుండా వారు ధాన్యం, అపరాలు, పండ్లు, కూరగాయలు తదితర భూ ఉత్పత్తుల నుండి కూడా జకాత్ తీయవలసి ఉంటుంది. దీన్ని "ఉష్ర్" అంటారు. అయితే ఉష్ర్ యేడాదికి ఒకసారి మాత్రమే గాక, సంవత్సరానికి ఎన్నిసార్లు పండిస్తే అన్నిసార్లు తీసి పేదలకు దానం చేయాలి. వర్షంవల్ల పండే పంట నుండి పది శాతం, ఖర్చుతో కూడిన నీటిపారుదల సౌకర్యం వల్ల పండే పంట నుండి అయిదు శాతం చొప్పున ఉష్ర్ తీసి పేదలకు విధిగా అందజేయాలి.

"విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేలనుండి మీ కోసం ఉత్పత్తి చేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైవమార్గంలో ఖర్చుచేయండి. దైవమార్గంలో ఖర్చు చేయడానికి నాసిరకం వస్తువుల్ని ఏరితీసే ప్రయత్నం చేయకండి. అలాంటి వస్తువుల్ని మీకే గనక ఎవరైనా ఇస్తే మీరు తీసుకోవడానికి ఇష్టపడతారా? కళ్ళు మూసుకొని స్వీకరిస్తారేకాని, మనస్ఫూర్తిగా మీరు ఎన్నటికీ వాటిని స్వీకరించరు. దేవుడు నిరపేక్షా పరుడు, స్వతహాగా ప్రశంసనీయుడని తెలుసుకోండి." (ఖుర్ఆన్-2:267)

"పంట కోతకు వచ్చినప్పుడు అందులో నుంచి దేవునిహక్కు కూడా నెరవేర్చండి. దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు." (ఖుర్ఆన్-6:141)

"(కనుక ముస్లింలారా! మీరు దైవధర్మంపై పూర్తిగా దృష్టి కేంద్రీకరించి) నమాజ్ (ప్రార్థనా) వ్యవస్థను నెలకొల్పండి. (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లిస్తూ ఉండండి. మీ పరలోకశ్రేయస్సు కోసం మీరు ఏసత్కార్యం చేసినా అది దేవుని వద్ద మీకు లభిస్తుంది. మీరు చేస్తున్న పనులన్నిటినీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్ఆన్-2:110)

ముస్లింలకు రోజుకు అయిదు సార్లు నమాజ్ చేయడం ఎంత విధియో ప్రతి ఏడూ ఒక సారి జకాత్ చెల్లించడం కూడా అంతే విధి. జకాత్ చెల్లించని వ్యక్తి పాలిట అతని డబ్బు పరలోకంలో విషసర్పంగా మారుతుందని కొన్ని హదీసులు హెచ్చరిస్తు న్నాయి. జకాత్ చెల్లించనివాడు చేసే నమాజ్‌ని దేవుడు స్వీకరించడని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) స్పష్టంగా తెలియజేశారు.

# 76. గత షరీఅత్‌లలో జకాత్ ప్రస్తావన

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు పూర్వం గత దైవప్రవక్తల అనుచర సముదాయాలకు కూడా నమాజ్ స్థాపనతో పాటు జకాత్ చెల్లింపు విధించబడింది. దివ్య ఖుర్‌ఆన్ దైవప్రవక్తలయిన హజ్రత్ మూసా, హజ్రత్ హారూన్, హజ్రత్ ఇబ్రాహీమ్, హజ్రత్ లూత్, హజ్రత్ ఇస్‌హాఖ్, హజ్రత్ యాఖూబ్ (అలైహి)లను గురించి ప్రస్తావించిన తరువాత ఇలా పేర్కొన్నది:

"వారిని మేము మాఆజ్ఞ ప్రకారం (ప్రజలకు) మార్గదర్శకత్వం వహించే నాయకులుగా చేశాం. సత్కార్యాలు చేస్తుండాలని, నమాజు (వ్యవస్థ) నెలకొల్పాలని, (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లించాలని వారికి దివ్యావిష్కృతి ద్వారా ఉపదేశించాము. వారు మా (ప్రియ)భక్తులు." (21:73)

ఇలాంటి ఆజ్ఞలు హజ్రత్ ఇస్మాయీల్, ఈసా (అలైహి)ల విషయంలో కూడా ఇవ్వడం జరిగింది. దేవునికి, ఇస్రాయీల్ సంతతివారికి మధ్య జరిగిన ఒక ఒడంబడి కను గురించి ఖురాన్‌లో అనేకచోట్ల ప్రస్తావన వచ్చింది. ఈ ఒడంబడికలో ఇస్రాయీల్ సంతతిప్రజలు జకాత్ చెల్లించాలన్న అతి ముఖ్యమైన నిబంధన ఇలా ఒకటుంది:

"గ్రంథప్రజల దగ్గరకు (రుజుమార్గానికి సంబంధించిన) స్పష్టమైన బోధనలు వచ్చిన తరువాతే వారిలో విభేదాలు ఏర్పడ్డాయి. (తమ) జీవన విధానాన్ని దేవుని కోసం ప్రత్యేకించి ఏకాగ్రచిత్తులై ఆయన్నే ఆరాధించాలని, ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పాలని, (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లించాలని, అదే సత్యధర్మమని మాత్రమే వారికి ఆదేశించబడింది." (ఖుర్‌ఆన్-98:4,5)

మూసా ప్రవక్త (అలైహి) అనుచర సమాజానికి కూడా ఇది విధించబడింది. కాని యూదులు పేదలకు జకాత్ ఇవ్వడానికి బదులు, వారి నుండి వడ్డీ వసూలుచేసి తినడం ప్రారంభించారు. వారికివ్వబడిన ఆదేశం ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

"ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పండి. పేదల ఆర్థికహక్కు (జకాత్) చెల్లిస్తూ ఉండండి. నాముందు మోకరిల్లేవారితో పాటు మీరు కూడా నాముందు మోకరిల్లండి." (2:43)

దైవప్రవక్త హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి)ను గురించి ప్రస్తావిస్తూ ఖుర్‌ఆన్ ఇలా పేర్కొన్నది: "ఈ గ్రంథంలో ఇస్మాయీల్ గాథను కూడా ప్రస్తావించు. అతను మంచి వాగ్దానపాలకుడు, సందేశహరుడయిన దైవప్రవక్త. అతను తన కుటుంబసభ్యులకు నమాజ్, జకాత్ విధుల్ని గురించి ఆజ్ఞాపిస్తుండేవాడు." (19:54,55)

అలాగే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలైహి) చంటిపిల్లవాడిగా ఉన్నప్పుడే ఆయన నోట వెలువడిన మాటలను ఖుర్‌ఆన్ ఇలా పేర్కొన్నది: "నేను బ్రతికున్నంత కాలం నమాజ్, జకాత్ విధులు పాటిస్తూ ఉండాలని ఆయన నన్ను ఆదేశించాడు." (19:31)



# 77. ఆర్థిక నేరస్తులు

ఆర్థిక స్తోమత కలిగిన ముస్లింలు తమ సంపద నుండి రెండున్నర శాతం జకాత్ తీసి ఇస్లామీయ ప్రభుత్వానికి విధిగా చెల్లించాలి. ఇస్లామీయ ప్రభుత్వం లేని చోట్ల ముస్లింలు వ్యక్తిగతంగాగాని, లేదా ఏదైనా సంఘం ద్వారాగాని ఈ జకాత్‌ని అర్హులైన వారికి దానం చేయాలి. జకాత్ చెల్లించడానికి నిరాకరించేవారు ఇస్లామీయ ప్రభుత్వం దృష్టిలో ఆర్థిక నేరస్థులుగా పరిగణించబడతారు. అలాంటి ముస్లింల నుండి బలవంతంగా జకాత్ వసూలు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

హజ్రత్ అబూబకర్ (రజి) ఖలీఫాగా ఎన్నికయిన తర్వాత కొన్ని అరబ్ తెగలు ప్రభుత్వానికి జకాత్ చెల్లించడానికి నిరాకరించాయి. అప్పుడాయన ఆ తెగలతో యుద్ధంచేసి వాటి నుండి బలవంతంగా జకాత్ వసూలు చేయడానికి నిర్ణయించు కున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈ నిర్ణయం పట్ల అభ్యంతరం లేవదీసినప్పుడు ఆయన ఇలా సమాధానమిచ్చారు:

"దైవసాక్షి! నమాజ్, జకాత్‌ల మధ్య విచక్షణ చేసే ప్రతి వ్యక్తితో నేను యుద్ధం చేస్తాను. జకాత్ సంపద హక్కు. (అంటే సంపద కలిగినవారు దానిమీద పేదల ఆర్థిక హక్కు అయిన జకాత్‌ని విధిగా చెల్లించాలి.) దైవసాక్షి! వారు గనక దైవప్రవక్త (సల్లం) కాలంలో ఇస్తూ ఉండిన సంపద నుండి ఒంటె తాడయినా సరే ఇవ్వడానికి నిరాకరిస్తే నేను వారితో తప్పకుండా పోరాడుతాను".

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "దైవసాక్షి! దేవుడు సత్యావగాహన కోసం అబూబకర్ హృదయకవాటాలు తెరిచాడు. అబూబకర్ దృక్పథమే సరైనదని నేను ఆ తరువాత గ్రహించాను" అని అన్నారు. (సహీ బుఖారి)

దైవప్రవక్త (సల్లం) హజ్రత్ ముఆజ్ (రజి)ని యమన్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించి పంపుతూ ఇలా ఉపదేశించారు:

"ముఆజ్! నీవిప్పుడు క్రైస్తవులుండే ప్రాంతానికి వెళ్తున్నావు. అందువల్ల మొట్ట మొదట నీవు వారిని ఏకేశ్వరాధన వైపుకు పిలువాలి. వారు గనక ఏకేశ్వరుడయిన అల్లాహ్‌ను ధృవీకరించడం జరిగితే, ఆయన వారికి రోజుకు అయిదు సార్లు విధిగా నమాజు చేయాలని ఆదేశించాడని చెప్పు. దీనికి వారు అంగీకరిస్తే వారు తమ సిరి సంపదల నుండి విధిగా జకాత్ తీసి చెల్లించాలని ఆయన ఆజ్ఞాపించాడని తెలియ జెయ్యి. ఈ జకాత్ సొమ్ము వారిలో ధనికుల నుండి వసూలు చేసి పేదలకు పంచ బడుతుంది. ఈ ఆదేశాన్ని కూడా శిరసావహించి జకాత్ చెల్లించడానికి అంగీకరిస్తే వారి దగ్గర జకాత్ వసూలు చేయాలి. అయితే ఒక విషయం బాగా గుర్తుంచుకో. ప్రజల దగ్గరుండే అతి శ్రేష్ఠమైన వస్తువుల జోలికి మాత్రం పోకూడదు." (బుఖారి, ముస్లిం)

ఆర్థిక నేరస్తులంటే సాధారణంగా ప్రజలు దొంగలు, మోసగాళ్ళు, అవినీతిపరులు అని మాత్రమే అనుకుంటారు. దొంగలకు హస్తఖండన శిక్షలే ఉంటాయి. కాని దాసుల హక్కులకు సంబంధించిన అతి ముఖ్యమైన జకాత్ విధి నెరవేర్చడానికి తిరస్కరించిన ముస్లింలు అవిశ్వాసులైపోతారు. అలాంటివారికి ఇస్లాంలో మరణదండన శిక్షలు పడతాయి. (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ చెల్లించని నేటి ధనికముస్లింలు ఈ విషయాన్ని గురించి కాస్త ఆలోచించాలి.

## 78. జకాత్ చెల్లించనివారి పర్యవసానం

దైవప్రవక్త (స) హితోక్తి: "ఎవరికైతే దేవుడు ఐశ్వర్యం ప్రసాదించాడో అతను జకాత్ చెల్లించకపోతే ప్రళయదినాన ఆ ధనం ఓపెద్ద కొండచిలువగా మారుతుంది. దాని నెత్తి మీద రెండు చుక్కలుంటాయి. ఆ పామును కంఠపాశంగా చేసి అతని మెడలో వేయడం జరుగుతుంది. అప్పుడా పాము నోటితో అతని దౌడలు పట్టుకొని 'నేను నీధనాన్ని, నీనిధిని' అంటుంది." ఆ తర్వాత దైవప్రవక్త (స) ఈసూక్తి పఠించారు:

"దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది." (ఖుర్ఆన్-3:180)

జకాత్ చెల్లించకుండా ధనం కూడబెట్టేవారి పర్యవసానం గురించి ఖుర్ఆన్‌లో మరోచోట ఇలా హెచ్చరించబడింది:

"(ముహమ్మద్!) వెండిబంగారాలు కూడబెట్టి వాటిని దైవమార్గంలో వినియోగించని పిసినారులకు దుర్భరయాతన కాచుకొని ఉందని శుభవార్త విన్పించు! ఆ వెండి బంగారాలనే నరకాగ్నిలో బాగా కాల్చి వారి నుదుళ్ళపై, పక్కలపై, వీపులపై వాతలు పెట్టే రోజు (త్వరలోనే) వస్తుంది. 'ఇవే మీరు కూడబెట్టుకున్న సిరిసంపదలు, ఇక వీటిని చవిచూడండి' (అని అప్పుడు వారికి చెప్పబడుతుంది)." (9:34,35)

వెండి బంగారాలను కూడబెట్టే పిసినారులను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "వెండి బంగారాలు కలిగి వున్నవాడు వాటి హక్కు (జకాత్) నెరవేర్చకపోతే ప్రళయదినాన ఆ వెండిబంగారాలను అగ్నిలో కాల్చి పలకలుగా చేసి మండుతున్న ఆ పలకలతో అతని వీపుపై, పక్కలపై, నుదుటిపై వాతలు పెట్టడం జరుగుతుంది. పలక లలు చల్లారినప్పుడల్లా వాటిని మళ్ళీ కాల్చి అతని శరీరం మీద వాతలు పెడ్తారు. ఈ విధంగా యాభైవేల సంవత్సరాల సుదీర్ఘదినాన యావత్తు మానవాళి తీర్పు ముగిసేదాకా మాటిమాటికి వాతలు పెట్టడం జరుగుతుంది. చివరికి అతను (తన విశ్వాసం, కర్మలను బట్టి) స్వర్గానికి లేక నరకానికి పంపబడతాడు..... (ముస్లిం)



దైవప్రవక్త (సల్లం) ప్రవచనం: "ఏ సంపద నుండి జకాత్ తీయకుండా అందులోనే కలసి ఉంటుందో ఆ సంపదను ఇది నాశనం చేస్తుంది". (మిష్కాత్)

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి) కథనం: నేనొకసారి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వెళ్ళాను. అప్పుడాయన కాబా (గోడ) నీడలో కూర్చొని "కాబా ప్రభువు సాక్షి! అందరి కంటే వాళ్ళే ఎక్కువగా నష్టపోయేవాళ్ళు. కాబా ప్రభువు సాక్షి!! అందరికంటే వాళ్ళే ఎక్కువగా నష్టపోయేవాళ్ళు" అని అన్నారు.

నేను (ఆశ్చర్యపోతూ) "ఏమిటీ, నా పరిస్థితి ఏమిటీ? నాలో అలాంటి దేదయినా కన్పిస్తుందా?" అని అడిగాను. ఆ తరువాత నేను దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి కూర్చు న్నాను. ఆయన తిరిగి అవే మాటలు ఉద్ఘాటించారు. నేను తీవ్రంగా చింతిస్తూ ఉండ బట్టలేక "దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీ కోసం అర్పితమవు గాక, ఎవరు వాళ్ళు?" అని అడిగాను మళ్ళీ. అప్పుడాయన ఇలా సమాధానమిచ్చారు:

"అత్యధిక సిరిసంపదలు కలవాళ్ళు. అయితే ఈవిధంగా, ఆవిధంగా (అంటే ముందూ, వెనుకా, కుడి, ఎడమల వైపు) దైవమార్గంలో ఖర్చు పెట్టేవాళ్ళు మాత్రం కాదు. ఒంటెలు, ఆవులు లేదా మేకలు కలిగివున్నవాడు వాటి హక్కు (జకాత్) గనక నెరవేర్చకపోతే ప్రళయదినాన ఆ పశువులు బాగా పెరిగి బలిసిపోయేలా చేసి తీసుకు రాబడతాయి. ఆ తర్వాత అవి ఒకదాని తర్వాత మరొకటి వరుసగా ఆ వ్యక్తిని కొమ్ము లతో పొడిచి, కాళ్ళతో తొక్కివేస్తాయి. చివరి పశువు కూడా బాగా పొడిచి, తొక్కివేసిన తరువాత తిరిగి మొదటి పశువు వచ్చేస్తుంది. ఈవిధంగా ఈ యాతన యావత్తు మానవుల్ని గురించి తీర్పు ముగిసేదాకా కొనసాగుతుంది." (బుఖారి, ముస్లిం)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా అన్నారు: "గుర్రాలు మూడు విధాలుగా ఉంటాయి. కొందరికవి పుణ్యఫలానికి ఉద్దేశించినవి. మరికొందరికి లోపాలను కప్పి పుచ్చేవిగా ఉంటాయి. ఇంకా కొందరికి (నరక)యాతనకు కారణభూతమవుతాయి.

దైవమార్గంలో పోరాడేందుకు గుర్రాన్ని పెంచే మనిషికి అది పుణ్యఫలం ఆర్జించి పెడుతుంది. అతనా గుర్రాన్ని పొడుగాటి త్రాటితో కట్టివేసి ఏదైనా పచ్చిక బయలులో గాని తోటలోగాని వదలిపెడితే, ఆ త్రాటిపొడవు ఆ పచ్చిక బయలులో లేక తోటలో ఏమేరకు విస్తరిస్తుందో అన్ని పుణ్యాలు అతని కర్మలచిట్టాలో వ్రాయబడతాయి. ఒకవేళ ఆ గుర్రం తాడు తెంచుకొని ఒకటి రెండు గుట్టలు దూకి వెళ్తే దాని లద్ది, దాని గిట్టల గుర్తులు సైతం అతని కోసం పుణ్యాలుగా పరిగణించబడతాయి. అదీగాక, ఆ గుర్రానికి దాని యజమాని నీళ్ళు తాగించే ఉద్దేశం లేకపోయినా అది తనంతటతాను ఏదైనా నది దగ్గరకెళ్ళి నీళ్ళు తాగితే అప్పుడూ అతని ఖాతాలో పుణ్యాలు వ్రాయబడతాయి.

దీనికి భిన్నంగా ఎవరైనా ప్రదర్శనా బుద్ధితో, గర్వకారణం కోసం గుర్రాన్ని పెంచుతూ, ఇస్లాం శత్రువులకు వ్యతిరేకంగా పోరాడే ఉద్దేశ్యంతో కట్టి ఉంచితే అతని

కోసం ఆ గుర్రం పాపఫలానికి కారణభూతమవుతుంది."

ఆ సందర్భంలో దైవప్రవక్త (సల్లం)ను మరి గాడిదను గురించి ఏమిటీ అని అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు: "ఆ విషయంలో నాపై ఎలాంటి దైవాజ్ఞ అవతరించలేదు. కాకపోతే మన్నింపురీత్యా ఎంతో సమగ్రమైన అసాధారణ సూక్తి ఒకటి అవతరించింది. అదేమిటంటే-

"ఆరోజు మానవులు విభిన్న వర్గాలుగా విడిపోయి (న్యాయస్థానం నుండి) తిరిగొస్తారు. అప్పుడు వారికి వారి కర్మలు చూపించబడతాయి. ఆ తర్వాత ఎవరైనా అణుమాత్రం సత్కార్యం చేసివున్నా అతను దాన్ని (కళ్ళారా) చూసుకుంటాడు. అలాగే ఎవరైనా అణుమాత్రం దుష్కార్యం చేసివున్నా అతనూ దాన్ని (కళ్ళారా)చూసుకుంటాడు." (ఖుర్ఆన్-99:6,7,8)

## 79. జకాత్ వ్యవస్థ లక్ష్యం

జకాత్‌వ్యవస్థ ద్వారా ఇస్లాం ముస్లిం హృదయం నుంచి ప్రాపంచిక వ్యామోహాన్ని, దాని విషవృక్షాలను నిర్మూలించి స్వచ్ఛమైన దైవప్రేమను జనింపజేయదలిచింది. ముస్లిం కేవలం జకాత్ చెల్లించడంతోనే సంతృప్తిచెందకుండా, దాని అసలు ఉద్దేశాన్ని గ్రహించి తదనుగుణంగా నడచుకున్నప్పుడే ఈ లక్ష్యం నెరవేరుతుంది.

మన దగ్గర ఉన్నదంతా నిజానికి దేవుడు ప్రసాదించినదే. దాన్ని ఆయన చూపే మార్గంలో, ఆయన ఆదేశించిన రీతిలో సద్వినియోగం చేసినప్పుడే మనం ఆయన ప్రసన్నత పొందగలము. ఈ భావనే ముస్లిం హృదయంలో నిరంతరం మెదులుతూ ఉండాలి. ఈ భావనలేని ముస్లిం తన తోటి దైవదాసుల్ని చిత్తశుద్ధితో, కేవలం దైవ ప్రసన్నత కోసం ప్రేమించలేడు. అలాంటి ముస్లిం దేవుని హక్కుల్ని కూడా విశాల హృదయంతో మనస్ఫూర్తిగా నెరవేర్చలేడు.

జకాత్ వ్యవస్థ వాస్తవానికి సమాజంలో ప్రజలకు ఆర్థిక న్యాయాన్ని చేకూర్చే అపురూప సాధనం. ఇది ప్రజల హృదయాల నుండి స్వార్థం, సంకుచితత్వం, లోభత్వం, అసూయ, ద్వేషం, కాఠిన్యత, దోపిడి లాంటి చెడు భావాలను తీసేసి వాటి స్థానంలో ప్రేమ, పరోపకారం, త్యాగం, సానుభూతి, శ్రేయోభిలాష, సహకారం, స్నేహశీలత, చిత్తశుద్ధి, ఔదార్యం వంటి సద్భావాలను పెంపొందింపజేస్తుంది.

అందుకే జకాత్ ప్రతి దైవప్రవక్త అనుచర సమాజం కొరకు తప్పనిసరిగా పాటించ వలసిన విధిగా నిర్ణయించబడింది. గతప్రవక్తల కాలంలో జకాత్ ఎంత చెల్లించాలి, ఏ మేర సంపద ఉన్నప్పుడు చెల్లించాలి మొదలైన ఫిఖా విషయాల్లో వ్యత్యాసం ఉందన్నది నిజమే కావచ్చు. కాని జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలన్న దైవాజ్ఞ మాత్రం ప్రతి షరీఅత్ (ధర్మశాస్త్రం)లోనూ ఉంటూ వచ్చింది.



జకాత్ ప్రభుత్వాలు తమ ప్రజలపై విధించే పన్ను లాంటిది కాదు. ఇదొక ధన సంబంధమైన దైవారాధన. నమాజ్, రోజా, హజ్‌యాత్రల మాదిరిగానే జకాత్ ఇస్లాం సౌధానికి చెందిన ఒక మూలస్తంభం. ఖుర్ఆన్‌లో నమాజ్‌తో పాటు జకాత్‌ని గురించి కూడా అనేక చోట్ల ప్రస్తావన వచ్చింది. ప్రతి యుగంలోనూ ప్రతి దైవప్రవక్త పాటిస్తూ వచ్చిన దైవధర్మం (ఇస్లాం)లో జకాత్ అతిముఖ్యమైన అంశంగా పరిగణించబడింది.

జకాత్‌వ్యవస్థ వల్ల వ్యక్తికి, సమాజానికి అత్యున్నత నైతికత, అపారమైన ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఒనగూడుతాయి. అయితే ధన సంబంధమైన ఈ దైవారాధనకు, పన్ను (ట్యాక్స్)కు మధ్య ఉండే మౌలికవ్యత్యాసాన్ని దృష్టిలో పెట్టుకొని, జకాత్‌ని దైవారాధనగా భావిస్తూ చెల్లిస్తున్నప్పుడే ఈ నైతిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు లభిస్తాయి.

జకాత్‌ని వసూలుచేసి పంపిణీచేసే బాధ్యత ఇస్లామీయ ప్రభుత్వంపై ఉందన్న సంగతి నిజమే. అయితే ఇదేదో ట్యాక్స్ అయిననందున ప్రభుత్వం చేయవలసిన పని అని మాత్రం దీని అర్థంకాదు. ఇస్లాంకు సంబంధించిన మొత్తం సామూహిక ఆరాధన లలో క్రమశిక్షణ తీసుకురావడం కూడా ఇస్లామీయ పాలకుల బాధ్యతే.

నిజమైన ముస్లింలు రాజకీయ, పరిపాలనా వ్యవహారాలలో కూడా ఇస్లామీయ నియమాలు, విధానాలను అనుసరిస్తారు. వారి పరిపాలన వెనుక ముఖ్యంగా నాలుగు లక్ష్యాలు ఉంటాయి. పాలకులు సాధించవలసిన ఆ నాలుగు లక్ష్యాలు ఏమిటో దివ్యఖుర్ఆన్ ఈ విధంగా తెలియజేస్తోంది:

"దేవుడు (తన ధర్మానికి) సహాయం చేసేవారిని తప్పకుండా ఆదుకుంటాడు. దేవుడు ఎంతో బలాఢ్యుడు, సర్వశక్తిమంతుడు. వీరు (ఎంతో నీతిమంతులు), వీరికి మేము ధరణిలో రాజ్యాధికారమిస్తే నమాజ్ వ్యవస్థ నెలకొల్పుతారు. (పేదల ఆర్థికహక్కు) జకాత్ చెల్లిస్తారు. మంచిని గురించి ఆదేశిస్తారు. చెడులను అరికడ్తారు. సమస్త వ్యవహారాల పర్యవసానం దేవుని చేతిలోనే ఉంది." (22:41)

ఇస్లామీయ పరిపాలనా ధ్యేయం ఏమిటో ఈ సూక్తి పరిశీలించిన వారికి ఇట్టే తెలిసిపోతుంది. ఇస్లామీయపాలన, అంటే ముస్లింలపాలన కాదు. కేవలం ముస్లింలు అధికసంఖ్యాక ప్రజలుగా, పాలకులుగా ఉండే దేశాలను నేడు ఇస్లామీయ దేశాలుగా పేర్కొనడం జరుగుతోంది. ఇది సరికాదు. వీటిని ముస్లిందేశాలని మాత్రమే చెప్ప గలం. ఇస్లాం ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాప్రతినిధుల ద్వారా ఖిలాఫత్ (దైవ ప్రాతినిధ్య) వ్యవస్థ ఏర్పడిన తరువాత అలాంటి ప్రభుత్వానికి ప్రజల్ని సన్మార్గంలో నడిపించవలసిన బాధ్యత కూడా ఉంటుంది. దానికోసం ఈ సూక్తిలో నాలుగు ప్రాథమిక సూత్రాలు తెలియ జేయబడ్డాయి:

(1) పాలకులు ప్రజల్లో నమాజ్ వ్యవస్థను నెలకొల్పాలి.

(2) వారు ధనికుల నుండి జకాత్ వసూలు చేసి దాన్ని పేదలు, అనాథలు,

వితంతువుల కోసం, ఇతర జనసంక్షేమ కార్యకలాపాల కోసం వినియోగించాలి.

(3) సత్కార్యాలను గురించి విస్తృత ప్రచారం చేయాలి.

(4) వివిధ స్థాయిల్లో ఉండే చెడులన్నిటిని సమూలంగా తుడిచిపెట్టేందుకు కృషిచేయాలి.

ఈ విధంగా జరిగినప్పుడే అది నిజమైన ఇస్లామీయ పాలనగా, శ్రేయోరాజ్యంగా వర్థిల్లుతూ శాంతి, సామరస్యాలు నెలకొంటాయి.

## 80. జకాత్ విధి కావడానికి షరతులు

జకాత్ ధనవంతుడైన ప్రతి ముస్లిం ప్రతి సంవత్సరం తప్పనిసరిగా పాటించ వలసిన విధి (Obligatory duty). జకాత్ విధిని నిరాకరించిన మనిషి కాఫిర్ (అవిశ్వాసి) అవుతాడు. విధి అని తెలిసికూడా జకాత్ చెల్లించని ముస్లిం పాపాత్ముడి గా, పరమదుర్మార్గుడిగా పరిగణించబడతాడు.

జకాత్ విధి (వాజిబ్) కావడానికి ఏడు షరతులు ఉన్నాయి. ఈ ఏడు షరతులు పూర్తి అయితే జకాత్ చెల్లించడం విధి (వాజిబ్) అవుతుంది. ఇందులో ఏ ఒక్క షరతు పూర్తి కాకపోయినా జకాత్ చెల్లించడం విధి కాజాలదు.

**(1) జకాత్ చెల్లించవలసిన మనిషి ముస్లిం అయి ఉండాలి.** ఇస్లాంను తన ధర్మంగా అంగీకరించి తనను ముస్లిం అని ప్రకటించుకున్న మనిషి మాత్రమే జకాత్ చెల్లించడం విధి (వాజిబ్)గా నిర్ణయించబడింది. జకాత్ చెల్లించే బాధ్యత ముస్లిమే తరులకు లేదు. ఒకవేళ ముస్లిమేతరుడు ఎవరైనా ఇస్లాం స్వీకరిస్తే ఇస్లాం స్వీకరించక పూర్వం ఉండే జకాత్‌ను అతను చెల్లించనవసరం లేదు. ఇస్లాం స్వీకరించిన దగ్గర్నుంచే అతనిపై జకాత్ చెల్లింపు బాధ్యత ఏర్పడుతుంది.

**(2) మనిషి చైతన్యవంతుడయి ఉండాలి.** బుద్ధి, విజ్ఞత, చైతన్యం కలిగివున్న వారి మీదనే జకాత్ చెల్లింపు బాధ్యత ఉంటుంది. మానసికంగా ఎదగనివారిపై, మనోస్థిమితం కోల్పోయినవారిపై, ఉన్మాదులపై జకాత్ చెల్లింపు బాధ్యత లేదు.

**(3) జకాత్ చెల్లించవలసిన వ్యక్తి వయోజనుడై ఉండాలి.** యుక్త వయస్సురాని పిల్లలు ఎంత ఆస్తిపరులైనప్పటికీ వారిపై జకాత్ చెల్లింపు విధిగా లేదు. వారి సంరక్షకు లపై కూడా జకాత్ విధిగా లేదు. అయితే కొందరు ధర్మవేత్తలు ఈ షరతు విషయం లో విభేదించారు. ప్రఖ్యాత తత్వవేత్త మౌలానా అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై) వాటి వివరాలను గురించి అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలా అన్నారు:

"యుక్త వయస్సురాని పిల్లల విషయంలో భేదాభిప్రాయాలు ఉన్నాయి. ఒక దృక్పథం ప్రకారం, అనాథ పిల్లలపై జకాత్ విధిగా (వాజిబ్)గా లేదు. రెండవ దృక్పథం ప్రకారం, అనాథ బాలుడు యుక్త వయస్సుకు వచ్చిన తరువాత అతని సంరక్షకుడు



అతని ఆస్తిని అప్పగిస్తూ జకాత్ చెల్లింపు వివరాలను గురించి అతనికి తెలియజేయాలి. అప్పుడు అనాథవయస్సు గడిపిన కాలానికి సంబంధించిన మొత్తం జకాత్‌ని చెల్లించడం అతని బాధ్యత అవుతుంది. మూడవ దృక్పథం ప్రకారం, అనాథ బాలుని సంపదను అతని సంరక్షకుడు ఏదైనా వ్యాపారంలో పెట్టుబడి పెట్టి అందులో లాభాలు గనక వస్తుంటే సంరక్షకుడు అతని సంపద నుండి జకాత్ చెల్లంచవలసి ఉంటుంది. లాభాలు రానిపక్షంలో మాత్రం జకాత్ చెల్లించనవసరం లేదు.

నాల్గవ దృక్పథం ప్రకారం, అనాథబాలుని ఆస్తిపై కూడా జకాత్ విధిగా చెల్లించాలి. జకాత్ చెల్లింపు బాధ్యత ఆ బాలుని సంరక్షకునిపై ఉంది. నా దృష్టిలో ఈ నాల్గవదృక్పథమే ఎక్కువగా సరైనది. ఒక హదీసులో ఈ ప్రస్తావన ఇలా ఉంది-

"జాగ్రత్త! సంపద కలిగివున్న అనాథ బాలునికి సంరక్షకునిగా ఉన్నవాడు ఆ ధనంతో ఏదైనా వ్యాపారం చేయాలి. అంతేగాని ఆ బాలుని ధనమంతా జకాత్ చెల్లింపుకే హరించిపోయేలా దాన్ని అలాగే ఉంచకూడదు." (బైహఖి, తిర్మిజి)

"ఇదేకాకుండా ఇలాంటి భావాన్నే స్ఫురింపజేసే మరికొన్ని హదీసులు అనేకమంది సహాబీల, తాబయీల ఆచరణలు, ప్రవచనాలు కూడ ఈ దృక్పథాన్నే సమర్థిస్తున్నాయి."

(వివరాల కోసం "రసాయల్ వ మసాయల్" రెండవ భాగం చూడండి.)

**(4) జకాత్ చెల్లించేవాడు ధనవంతుడయి ఉండాలి.** అంటే జకాత్ విధింపుకు కావలసిన కనీస సంపద కలిగిన స్థితిపరుడయి ఉండాలి.

**(5) సంపద లభించిన తరువాత ఒక సంవత్సరం గడవాలి.** జకాత్ విధింపుకు అవసరమైనంత సంపద లభించగానే జకాత్ చెల్లింపు విధి (వాజిబ్) కాజాలదు. సంపద లభించిన తరువాత ఒక సంవత్సరం పూర్తిగా గడచిపోవాలి. అప్పుడే ఆ సంపదపై జకాత్ చెల్లింపు వాజిబ్ అవుతుంది. ఆ సంవత్సరం చాంద్రమానం ప్రకారం ఉంటే మంచిది. సూర్యమానం ప్రకారం కూడా సంవత్సరం లెక్క కట్టవచ్చు.

ఈనాటి ప్రభుత్వాలు మనిషికి ఎవరి దగ్గర్నుంచయినా ఏదైనా కారణంగా సంపద లభించిన మరుక్షణమే అతని నుండి ఆదాయపు పన్ను వసూలు చేస్తున్నాయి. సంపద పొందిన మనిషి దాన్ని అనుభవించక ముందే ప్రభుత్వం ఇంకమ్‌ట్యాక్స్ వసూలు చేయడం ఎంత అన్యాయమో ఊహించవచ్చు. దీనికి భిన్నంగా ఇస్లాం, లభించిన సంపదను అనుభవించడానికి ఏడాదిపాటు గడువిస్తుంది. ఏడాది లోపు ఆ సంపద ఖర్చయిపోతే అతనిపై జకాత్ విధింపు ఉండదు. అలాగే జకాత్ చెల్లింపు విధి అయిన తరువాత ధనం ఏదైనా కారణంతో వృధా అయిపోతే కూడా జకాత్ లేదు.

సంవత్సరారంభంలో జకాత్ విధింపుకు కావలసిన సంపద ఉండి, మధ్యలో కొంత కాలం సంపద తగ్గిపోవడంగాని లేదా పూర్తిగా ఖర్చయిపోవడంగాని జరిగి, ఆ

తరువాత సంవత్సరం గడవక ముందే జకాత్ విధింపుకు అవసరమైనంత సంపద మళ్ళీ లభిస్తే ఆ సంపదపై జకాత్ చెల్లించవలసి ఉంటుంది. సంవత్సరం మధ్యలో కొంతకాలం సంపద తగ్గినా లేక పూర్తిగా ఖర్చయిపోయినా అది లెక్కలోకి రాదు.

**(6) రుణగ్రస్తుడయి ఉండకూడదు.** ఒక వ్యక్తి దగ్గర జకాత్ విధింపుకు అవసరమైనంత సంపదున్నా అతనిపై అంతకంటే ఎక్కువ రుణభారముంటే అతనిపై జకాత్ చెల్లింపు తప్పనిసరి కాదు. లేదా అప్పులు తీర్చాక జకాత్ విధింపుకు అవసరమైనంత కనీస సంపద మిగలనంతగా రుణభారం ఉన్నా జకాత్ చెల్లింపు బాధ్యత ఉండదు. ఒకవేళ అప్పులు తీర్చిన తరువాత కూడా జకాత్ విధింపుకు అవసరమైనంత సంపద మిగిలితే అప్పుడు జకాత్ తప్పనిసరిగా చెల్లించాలి. తాకట్టు వస్తువులపై జకాత్ లేదు. రుణగ్రస్తుడుగాని, రుణదాతగాని వాటిపై జకాత్ చెల్లించ నవసరం లేదు.

**(7) సంపద కనీసవసరాలకు మించి ఉండాలి:** కనీస అవసరాలంటే మనిషి మనుగడకు, అతని గౌరవప్రతిష్ఠలకు కావలసిన నిత్య జీవితావసరాలు అన్నమాట. ఉదాహరణకు- తిండి, బట్ట, ఇల్లు, వృత్తిసాధనాలు, వాహనం, (గుర్రం, బగ్గీ, సైకిల్, స్కూటర్, కారు వగైరా), గృహోపకరణాలు, సొంత గ్రంథాలయం. ఇలాంటివన్నీ కనీస అవసరాల క్రిందికి వస్తాయి. వీటి మీద జకాత్ లేదు. అలాగే ఇత్తడి, రాగి, కంచు, జర్మన్‌సిల్వర్, అల్యూమినియం, స్టీల్ వంటి లోహపాత్రలు; దుప్పట్లు, కంబళ్ళు, మంచాలు, ఫర్నీచర్ మొదలైన ఇంటి సామగ్రిపై; వెండి బంగారాలకు చెందని ఇతర లోహాలతో తయారైన నగలపై కూడా జకాత్ లేదు. ఈ అవసరాలకు మించి జకాత్ విధింపుకు అవసరమైనంత సంపద ఉంటే దానిపై జకాత్ ఉంటుంది.

ఒకవేళ కనీసవసరాల కోసం తీసిన పైకం ఒక సంవత్సరందాకా భద్రపరిస్తే అప్పుడు ఆ పైకంపై జకాత్ చెల్లించవలసి ఉంటుంది. సంవత్సరం లోపే ఆ పైకాన్ని కనీసవసరాల కోసం ఖర్చుపెడితే దానిపై జకాత్ చెల్లించనవసరం లేదు.

**మరో మూడు ముఖ్యవిషయాలు:** జకాత్ చెల్లించే వ్యక్తి మరో మూడువిషయాలు గుర్తుంచుకోవాలి:

✦ అర్హులైనవారికి జకాత్ ఇస్తున్నప్పుడు జకాత్ ఇస్తున్నాని మనసులో సంకల్పించుకోవాలి. లేదా సంపద నుండి జకాత్ ధనం తీసిపెట్టే సమయంలో జకాత్ తీస్తున్నానని సంకల్పించుకోవాలి. జకాత్ గురించి మనసులో సంకల్పించుకోకపోతే జకాత్ చెల్లింపు బాధ్యత నెరవేరదు.

✦ జకాత్ ఇచ్చేటప్పుడు జకాత్ తీసుకునే వ్యక్తిని జకాత్ యజమానిగా పరిగణించాలి. అతడ్ని ఫిఖా పరిభాషలో 'తమ్లీక్' అంటారు. ఈ తమ్లీక్ జకాత్ స్వీకార అర్హుడైన వ్యక్తి ఎవరైనా కావచ్చు. లేదా జకాత్ వసూలుచేసి పంపిణీచేసే వ్యక్తులు గాని, సంస్థలుగాని లేక ఇస్లామీయ ప్రభుత్వంగాని కావచ్చు.



✦ జకాత్ స్వీకార అర్హులుగా ఖుర్‌ఆన్‌లో సూచించబడిన పద్దులలో మాత్రమే జకాత్ ధనాన్ని వెచ్చించాలి. ఈ ఖాతాలను తప్పించి మరే ఇతర ఖాతాలలో వెచ్చించినా జకాత్ బాధ్యత నెరవేరదు.

# 81. జకాత్ నుండి మినహాయించిన సంపదలు

(1) నివాస గృహాలు ఎంత విలవయినవైనా వాటి మీద జకాత్ లేదు. వాటి మీద వచ్చే అద్దెలపై మాత్రమే జకాత్ ఉంటుంది.

(2) మణులు, మాణిక్యాలు, ముత్యాలు, మరకతాలు, పగడాలు, వజ్రాలు, వైఢూర్యాల మీద జకాత్ లేదు.

(3) సేద్యానికి, నీళ్ళు తోడటానికి ఉపయోగించే పశువులపై జకాత్ లేదు. వ్యవ సాయానికి ఉపయోగించే ట్రాక్టర్‌లు, ఇతర యంత్రాలపై కూడా జకాత్ లేదు. అలాగే వ్యాపారంలో ఉపయోగించే ఉత్పత్తి సాధనాలన్నీ జకాత్ నుండి మినహాయించబడ్డాయి. అంటే ఉత్పత్తి కోసం వాడే అన్ని రకాల పరికరాలపై, పనిముట్లపై జకాత్ చెల్లించనవసరం లేదన్న మాట.

(4) కర్మాగారాల్లోని యంత్రాలపై, యంత్రపరికరాలపై జకాత్ లేదు. అదే విధంగా ఫ్యాక్టరీ భవనాలపై, దుకాణ భవనాలపై, ఫ్యాక్టరీలలో, దుకాణాలలో వాడే ఫర్నీచర్‌పై, వాటిలో ఉపయోగించే స్టేషనరీ సామగ్రిపై కూడా జకాత్ లేదు.

(5) పాల ఉత్పత్తికి సంబంధించిన డైరీఫారాలలోని పశువులపై, గుడ్ల ఉత్పత్తి కోళ్ళఫారాలలోని కోళ్ళపై జకాత్ లేదు. కారణం ఇవి కూడా ఉత్పత్తి సాధనాల క్రిందికే వస్తాయి. అయితే డైరీఫారాలలో, కోళ్ళఫారాలలో తయారయ్యే ఉత్పత్తులపై జకాత్ ఉంది. అలాగే ఆ పశువుల, కోళ్ళ అమ్మకాలలో వచ్చే లాభాల పై జకాత్ ఉంటుంది.

(6) అత్యంత విలువైన, అపురూపమైన వస్తువుల్ని జ్ఞాపకార్థం వస్తుప్రదర్శన శాలలో ఉంచితే వాటి మీద జకాత్ లేదు. కాని ఆ వస్తువుల్ని వ్యాపార సరుకులుగా చేసి అమ్ముతుంటే మాత్రం వాటిపై జకాత్ ఉంటుంది.

(7) సొంత అవసరాల కోసం వాహనాలుగా, ప్రయాణ సాధనాలుగా వాడుకునే బండ్లు, పశువులపై జకాత్ లేదు.

(8) అద్దెకిచ్చే భవనాలు, వాహనాలు, యంత్రాలు, ఫర్నీచర్, క్రాకరీ వస్తువులపై జకాత్ లేదు. వాటిపై వచ్చే అద్దెలపై మాత్రమే జకాత్ సంపద పరిమాణానికి (నిసాబ్‌కు) చేరినప్పుడు జకాత్ ఉంటుంది.

(9) ధర్మాభ్యున్నతి కోసం అంకితం చేసిన, జిహాద్ కోసం పెంచిన జంతువులపై జకాత్ లేదు. జిహాద్‌కు సంబంధించిన సామగ్రి, వాహనాలు, ఆయుధాలపై; ధర్మసేవ కోసం వినియోగించే ఇతర వస్తువులపై కూడా జకాత్ లేదు.

# 82. పశుసంపద మీద జకాత్

(1) పాల కోసం, పశువృద్ధి కోసం పెంచే జంతువులపై సాధారణ పచ్చిక మైదానాలలో మేసే పెంపుడు జంతువులపై జకాత్ ఉంది. ఇలాంటి జంతువుల్ని ఫిఖ్హా పరిభాషలో "సాయ్‌మా" అంటారు. వాహనంగా, మాంసం కోసం పెంచుకునే జంతువులపై; జింకా, దుప్పి, ఎనుబోతు, పులి మొదలైన అడవి జంతువులపై జకాత్ లేదు. అయితే ఈ జంతువుల్ని వ్యాపారంకోసం పెంచితే వాటిపై వాణిజ్య సరుకులకు సంబంధించిన జకాత్‌వంటి జకాతే చెల్లించవలసి ఉంటుంది. అంటే వాణిజ్య వస్తువుల విలువ సంవత్సరారంభంలో, అంతంలో 630 గ్రాముల వెండి విలువగాని, లేదా అంతకంటే ఎక్కువ విలువగాని ఉంటే వాటి మీద జకాత్ చెల్లించాలి.

(2) అడివి జంతువులు, పెంపుడు జంతువుల కలయికతో పుట్టే సంకర జాతి పశువుల విషయంలో జకాత్ చెల్లింపు విధి కావడానికి అలా కలిసే జంతువుల్లో పెంపుడుజంతువు పెంటి (□□□□□□)దయి ఉండాలి; అడవిజంతువు పోతు (□□□□) దయి ఉండాలి. ఉదాహరణకు- పెంటి మేకతో పోతు జింక జతకడ్తే పుట్టే సంకర జాతి పశువుల మీద జకాత్ చెల్లింపు విధి అవుతుంది.

(3) ధర్మాభ్యున్నతికి అంకితం చేసే "సాయ్‌మా" రకం జంతువులపై జకాత్ లేదు. అదేవిధంగా ధర్మాభ్యున్నతికి అంకితం చేసే గుర్రాలపై, జిహాద్ కోసం పెంచే గుర్రాలపై కూడా జకాత్ లేదు.

(4) కేవలం పశుగణాభివృద్ధి కోసం "సాయ్‌మా" రకం జంతువుల్ని పెంచుతూ, సంవత్సరం మధ్యలో వాటి వ్యాపారం చేయాలన్న ఆలోచన కలిగితే ఆ ఏడు వాటి మీద వ్యాపారపు జకాత్ ఉండదు. వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్న రోజు నుంచే "వాణిజ్య సంవత్సరం" ఆరంభమవుతుంది. ఆ వాణిజ్య సంవత్సరం పూర్తయిన తర్వాతే "వాణిజ్యపు జకాత్" చెల్లించవలసి ఉంటుంది.

**మేకల, గొర్రెల జకాత్:** జకాత్ విషయంలో మేక, గొర్రె, పొటేలు అన్నీ ఒకే లెక్క కిందికి వస్తాయి. అన్నిటికీ ఒకే 'నిసాబ్', ఒకే జకాత్ పరిమాణం వర్తిస్తాయి. మేకలు, గొర్రెలు- రెండు జాతుల పశువులు ఉండి, రెండిటి నిసాబ్‌లు పూర్తిగా ఉంటే రెండిటి జకాత్‌లు వేర్వేరుగా ఇవ్వాలి. అంటే మేకలపై మేకల్ని, గొర్రెలపై గొర్రెల్ని మాత్రమే జకాత్‌గా ఇవ్వాలి. ఒకవేళ రెండుజాతుల పశువుల సంఖ్యాపరిమితి విడివిడిగా తక్కువగా ఉండి, రెండిటిని కలిపితే సంఖ్య (నిసాబ్)కి చేరుకున్న పక్షంలో- ఏజాతి పశువుల సంఖ్య ఎక్కువగా ఉంటే ఆజాతి పశువుల్నే జకాత్‌గా ఇవ్వాలి. రెండిటి సంఖ్య సరిసమానంగా ఉంటే మన ఇష్టమొచ్చిన జాతి పశువుల్ని జకాత్‌గా ఇవ్వచ్చు.

మేకలు లేక గొర్రెలు 1 నుండి 39 వరకుంటే జకాత్ లేదు. 40 నుండి 120 వరకుంటే ఒక దాన్ని జకాత్‌గా ఇవ్వాలి. 121 నుండి 200 వరకుంటే రెండిటిని



ఇవ్వాలి. 201 నుండి 399 వరకుంటే మూడింటిని ఇవ్వాలి. 400 వరకుంటే నాల్గింటిని ఇవ్వాలి. 400కు పైబడితే ప్రతి వందకు ఒకటి చొప్పున ఇవ్వాలి. వందకు తక్కువయితే జకాత్ లేదు. జకాత్ పశువు ఒక సంవత్సరం లేదా అంతకు పైబడిన వయస్సు కలదై ఉండాలి.

**గేదలు, ఆవుల జకాత్:** జకాత్‌విషయంలో గేదెలు, దున్నలు, ఆవులు, ఎద్దులు అన్నీ ఒకే లెక్క కిందికి వస్తాయి. దైవప్రవక్త (స) ఆవుల కోసం నిర్ణయించిన జకాత్ ప్రమాణాన్నే గేదెల కోసం కూడా నిర్ణయించారు. ఈ రెండు జాతుల పశువులకు కూడా ఒకే నిసాబ్ (సంఖ్యాపరిమితి), ఒకే 'జకాత్ ప్రమాణం' వర్తిస్తాయి. ఎవరి దగ్గరైనా ఈ రెండు జాతుల పశువులు ఉంటే, ఈ రెండిటి సంఖ్యను కలపగా నిసాబ్ పూర్తయితే వాటి జకాత్ చెల్లింపు విధి అవుతుంది. అయితే వాటిలో ఏజాతి పశువులు అతని దగ్గర ఎక్కువగా ఉంటే వాటినే జకాత్‌గా ఇవ్వాలి.

ఈ జాతి పశువులపై జకాత్ ఈవిధంగా ఉంది: 1 నుండి 29 వరకు జకాత్ లేదు. 30 నుండి 39 వరకుంటే ఏడాది వయస్సుగల ఒక దూడను ఇవ్వాలి. 40 నుండి 59 వరకుంటే రెండేళ్ళు నిండిన ఒక దూడను ఇవ్వాలి. 60 నుండి 69 వరకుంటే ఏడాది వయస్సుగల రెండు దూడలను ఇవ్వాలి. 70 నుండి 79 వరకుంటే ఏడాది వయస్సుగల ఒక దూడతో పాటు రెండేళ్ళ వయస్సుగల మరొక దూడను ఇవ్వాలి. 80 నుండి 89 వరకుంటే రెండేళ్ళ వయస్సుగల రెండు దూడలు ఇవ్వాలి. 90 నుండి 99 వరకుంటే ఏడాది వయస్సుగల మూడు దూడలు ఇవ్వాలి. 100 నుండి 109 వరకుంటే ఏడాది వయస్సుగల రెండు దూడలతో పాటు రెండేళ్ళ వయస్సుగల ఒక దూడను ఇవ్వాలి.

ఇలా ఈసంఖ్య పెరిగిన కొద్దీ జకాత్ రేటు కూడా పెరుగుతుంది. జకాత్‌ను నిర్ణయించడానికి సులువైన పద్ధతి, 30,40 సంఖ్యలను ప్రమాణంగా తీసుకోవాలి. 60కు మించి ఎంతసంఖ్య ఉన్నా 30,40 సంఖ్యలనే ప్రమాణంగా తీసుకొని జకాత్ ఇవ్వాలి.

ఉదాహరణకు- ఎవరి దగ్గరైనా 70 పశువులు ఉంటే వాటిలో 40 పశువులపై రెండేళ్ళ వయస్సుగల ఒక దూడను, 30 పశువులపై ఏడాది వయస్సుగల ఒక దూడను జకాత్‌గా ఇవ్వాలి. ఒకవేళ 80 పశువులు ఉంటే 40 సంఖ్యను రెండు ప్రమాణాలుగా తీసుకొని, రెండేళ్ళ వయస్సుగల ఒక దూడ చొప్పున మొత్తం పశువుల మీద రెండు దూడలను జకాత్‌గా ఇవ్వాలి. ఒకవేళ 90 పశువులు ఉంటే 30 సంఖ్యను మూడు ప్రమాణాలుగా తీసుకొని, ఏడాది వయస్సుగల ఒక దూడ చొప్పున మొత్తం పశువుల మీద మూడు దూడలను జకాత్‌గా ఇవ్వాలి.

ఆవులు, గేదెల్లో ఏ జాతి పశువులూ వేర్వేరుగా నిసాబ్‌కు సరిపడినన్ని లేకుండా రెండిటి సంఖ్యను కలిపిన పక్షంలో నిసాబ్ పూర్తయితే వాటి మీద జకాత్ చెల్లించాలి.

పోతే పశువులకు బదులు వాటి ధరను కూడా నగదు రూపంలో జకాత్‌గా ఇవ్వచ్చు.

**ఒంటెల జకాత్:** అయిదు ఒంటెల నుండి జకాత్ ప్రారంభమవుతుంది. ఎవరి దగ్గరైనా అయిదు ఒంటెలు ఉంటే అతను విధిగా జకాత్ చెల్లించవలసి ఉంటుంది. అంతకు తక్కువ ఒంటెలపై జకాత్ లేదు.

వివరాలు ఇలా ఉన్నాయి: 1 నుండి 4 వరకుంటే జకాత్ లేదు. 5 నుండి 9 వరకుంటే ఒక మేకను జకాత్‌గా ఇవ్వాలి. 10 నుండి 14 వరకుంటే రెండు మేకలను ఇవ్వాలి. 15 నుండి 19 వరకుంటే మూడు మేకలను ఇవ్వాలి. 20 నుండి 24 వరకుంటే నాలుగు మేకలను ఇవ్వాలి. 25 నుండి 35 వరకుంటే ఏడాది వయస్సుగల ఒక పిల్ల ఒంటెను ఇవ్వాలి. 36 నుండి 45 వరకుంటే రెండేళ్ళ వయస్సుగల ఒక ఒంటె పిల్లను ఇవ్వాలి. 46 నుండి 60 వరకుంటే మూడేళ్ళ వయస్సుగల ఒక ఒంటె పిల్లను ఇవ్వాలి. 61 నుండి 75 వరకుంటే నాల్గేళ్ళ వయస్సుగల ఒక ఒంటె పిల్లను ఇవ్వాలి. 76 నుండి 90 వరకుంటే రెండేళ్ళ వయస్సుగల రెండు ఒంటె పిల్లలను ఇవ్వాలి. 91 నుండి 120 వరకుంటే మూడేళ్ళ వయస్సుగల మూడు ఒంటె పిల్లలను ఇవ్వాలి.

ఒంటెలు 120కు మించిన తరువాత ఇదే జకాత్ లెక్క మళ్ళీ మొదలవుతుంది. అంటే 5 ఒంటెల మీద ఒక మేక, 10 ఒంటెల మీద రెండు మేకలు చొప్పున ఇవ్వాలి. పోతే పశువులకు బదులు వాటి ఖరీదు కూడా నగదురూపంలో జకాత్‌గా ఇవ్వచ్చు.

## 83. జకాత్ స్వీకార యోగ్యులు

"అసలీ దానధర్మాలు (జకాత్) అగత్యపరులకు-1, ఆత్మాభిమానులైన నిరుపేదలకు-2, వాటిని వసూలుచేసే ఉద్యోగుల కోసం-3, హృదయాలు చూరగొన డానికి-4, బానిసల విముక్తికి-5, రుణగ్రస్తుల రుణభారం తగ్గించడానికి-6, దైవమార్గంలో వినియోగించడానికి-7, (నిర్ధనులైన) బాటసారులకు-8 మాత్రమే కేటాయించబడ్డాయి. ఇది దేవుని వైపున నిర్ణయించబడిన విధి. దేవుడు సర్వం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు." (ఖుర్ఆన్-9:60)

**(1) అగత్యపరుడు (ఫకీర్):** ధనికుడు అనే పదానికి వ్యతిరేకభావంలో ఇది ఉపయోగించబడింది. షరీఅత్ పరిభాషలో 'ఫకీర్' అంటే జకాత్ విధింపుకు కావలసినంత సంపదలేనివాడని అర్థం. జకాత్ విధింపుకు అవసరమైన ఆస్తిపాస్తులుగాని, జీవనోపాధి కోసం పనిచేసే శక్తిగాని, యోగ్యతగాని, అవకాశంగాని లేని రోగులు, వికలాంగులు, అనాథలు, వితంతువులు వగైరా వ్యక్తులందరూ ఈ పద్దు కిందికి వస్తారు.

**(2) ఆత్మాభిమాని ఐన నిరుపేద (మిస్కీన్):** మిస్కీన్ అంటే ఎంత కష్టపడినా సరిగా ఇల్లు కూడా గడవని, ఒక్కొక్కసారి ఒకపూట తింటే మరోపూట పస్తుండే, ఎవరి



ముందూ చేయి జాపడానికి ఇష్టపడని ఆత్మాభిమానంగల నిరుపేద అని అర్థం. మిస్కీన్ గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా అభివర్ణించారు:

"అతను తన అవసరాలకు సరిపడ సంపద పొందలేనివాడు; ప్రజలు ఆర్థిక సహాయం చేయడానికి అవకాశంలేకుండా (తన ఆత్మాభిమానం వల్ల) గుర్తించబడని వాడు; ప్రజల ముందు నిలబడి (ఆర్థిక సహాయం) అడగనివాడు." (బుఖారి, ముస్లిం)

**(3) జకాత్ వసూలు చేసే ఉద్యోగి (ఆమిల్ సదఖా):** ఇస్లామీయ ప్రభుత్వం జకాత్ వసూలు చేయడానికి నియమించిన ఉద్యోగి ఎంత స్థితిపరుడైనా సరే అతని జీతం జకాత్ ధనం నుండే ఇవ్వడం జరుగుతుంది.

**(4) హృదయాలను చూరగొనడానికి (తాలిఫే ఖులూబ్):** అతి ముఖ్యమైన ధార్మిక, జాతీయ (మిల్లత్‌కు సంబంధించిన) ప్రయోజనాల కోసం వ్యక్తుల హృదయాలను ఆకట్టుకోవడానికి వారికి కూడా జకాత్ ఇవ్వచ్చు. హనఫీ దృక్పథం ప్రకారం ఇప్పుడీ పద్దు లేదు. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) దృక్పథం కూడా ఇదే. కాని మరి కొందరు ఇమామ్‌లు, షరీఅత్‌వేత్తల దృక్పథం ప్రకారం ఈ పద్దు యథాతథంగా ఉంది. అవసరం రీత్యా ఎప్పుడైనా ఈ పద్దులో జకాత్ ధనాన్ని వినియోగించవచ్చు.

ఈ చివరి దృక్పథం ప్రకారం కొత్తగా ఇస్లాం స్వీకరించినవారు ఇస్లాంలో స్థిరంగా ఉండేందుకు వారికి ఈ పద్దు కింద జకాత్ పైకం ఇవ్వచ్చు. అలాగే ఇస్లాం వ్యతిరేక శక్తుల విరోధభావం తగ్గించడానికి అవసరమైతే జకాత్ పైకం ఖర్చు పెట్టవచ్చు.

**(5) బానిస విముక్తి (రిఖాబ్):-** బానిసత్వం నుంచి విముక్తి కలిగించడానికి జకాత్ పైకం ఖర్చుపెట్టవచ్చు. ఇంత డబ్బిస్తే బానిసత్వం నుంచి విముక్తి కలిగించడం జరుగు తుందని యజమానితో ఒప్పందం చేసుకునే బానిసను షరీఅత్ పరిభాషలో "మకాతబ్" అంటారు. ఇలాంటి బానిసక్కూడా జకాత్ పైకం ఇవ్వచ్చు. ఈనాడు బానిసత్వం ఆచారం లేనందువల్ల జైలుశిక్ష అనుభవించే అమాయకుల్ని జైలు నుండి విడిపించడానికి జకాత్ పైకం ఖర్చుపెట్టవచ్చని కొందరు ధర్మవేత్తలు అన్నారు.

**(6) రుణభారంతో సతమతమవుతున్న రుణగ్రస్తుడు (గారిమ్):** రుణభారం క్రింద నలుగుతూ తన జీవితావసరాల నుండి మిగిల్చి అప్పు తీర్చలేని రుణగ్రస్తునికి కూడా జకాత్ నుండి ఆర్థిక సహాయం చేయవచ్చు. అంతేకాకుండా ఆస్తి ధ్వంసానికి గురైనవారు, అసాధారణ జరిమానా విధించబడినవారు, వ్యాపారంలో దివాళా తీసిన వారు, ప్రకృతి విపత్తులు సంభవించి సర్వస్వం కోల్పోయినవారు కూడా ఈ ఖాతా క్రిందికి వస్తారు. అయితే వ్యభిచారం, మద్యసేవనం, దుబారాఖర్చులతో అప్పుల పాలైన మనిషికి జకాత్ ఇవ్వడం మంచిది కాదని ధర్మవేత్తలు అన్నారు.

**(7) నిర్ధనులైన బాటసారి (ఇబ్నుస్సబీల్):** ప్రయాణంలో ఉన్నవారు ఎవరైనా సరే, గృహజీవితంలో వారు ఎంత ఆనందంగా గడిపేవారైనా, జకాత్ విధింపుకు

అవసరమైన సంపద కలిగిన స్థితిపరులైనా ప్రయాణావస్థలో ఒక్కొక్కసారి హఠాత్తుగా ఏదైనా ఆపదకు గురయి ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి బాటసారులను ఆదుకోవడానికి కూడా జకాత్ పైకం ఇవ్వచ్చు.

**(8) దైవమార్గంలో (ఫీసబీలిల్లాహ్):** పైసూక్తిలోని పద్దులలో ఒకటి "దైవమార్గంలో" అని ఉంది. అంటే దైవమార్గంలో జరిపే పోరాటం అని అర్థం. ధర్మసంస్థాపన కోసం, ధర్మప్రచారం కోసం చేసే ప్రతిపనీ "దైవమార్గం" పద్దు క్రిందికే వస్తుంది. "ఫీసబీలిల్లాహ్" (దైవమార్గంలో) అనే పదం చాలా విస్తృతమైన అర్థంతో కూడుకున్నది.

జకాత్ సంపదలో వచ్చిన ఒంటెలను హజ్‌యాత్రికులకు ఇవ్వచ్చని దైవప్రవక్త (స) అనుమతించినట్లు కొన్ని హదీసుల ద్వారా తెలుస్తోంది. ఈ కారణంగానే హనఫీ ఫిఖ్హ్‌కావేత్తలలో ఇమామ్ ముహమ్మద్ (రహ్మాలై), ఇమామ్ అబూయూసుఫ్ (రహ్మాలై), హసన్ (రహ్మాలై) ప్రభృతులు 'దైవమార్గం' పద్దులో హజ్‌యాత్రికుల ప్రయాణం కోసం వాహనాల ఏర్పాటును ధర్మసమ్మతం చేశారు. "షామీ" రెండవ భాగం, 25వ పేజీలో ధర్మవిద్య నేర్చుకునే విద్యార్థుల్ని కూడా 'దైవమార్గం' పద్దులో చేర్చారు.

అల్లామా ఆలూసీ (రహ్మా) తన గ్రంథం 'రూహుల్‌మాని'లో "దైవమార్గంలో" అనే పదానికి రాసిన వ్యాఖ్యానంలో హనఫియా దృక్పథాన్ని ఉటంకిస్తూ ఇలా పేర్కొన్నారు: "ఇందులో విద్యార్థులనే భావం కూడా ఉంది. 'ఫతావా జహీరియా'లో ఈ పద్దు విద్యార్థుల వరకే పరిమితం చేయబడింది. 'అల్‌బదాయివుజ్జాయి'లో దీని వ్యాఖ్యానం ఇలా ఉంది- ఈ పద్దులో దేవునికి సన్నిహితం చేసే పనులన్నీ ఉన్నాయి. కనుక దేవుని విధేయత, సత్కార్యాల మార్గాలలో చేసే ప్రయత్నాలన్నీ ఈ పద్దు క్రిందికి వస్తాయి."

మౌలానా సులైమాన్‌నద్వీ (రహ్మా) తన గ్రంథం "సీరతున్నబీ" అయిదో భాగంలో "ఫీసబీలిల్లాహ్" పదాన్ని వ్యాఖ్యానిస్తూ ఇలా వ్రాశారు: "చాలామంది ఫిఖ్హ్‌కావేత్తలు ఫీ సబీలిల్లాహ్ అంటే దైవమార్గంలో జరిపే పోరాటం అని మాత్రమే అర్థం తీసుకున్నారు. కాని ఇలా ఒక హద్దు ఏర్పరచడం సమంజసంగా తోచడం లేదు. పైన 'దైవమార్గంలో నిమగ్నులైపోయి, జీవనోపాది. కోసం ధరణిపై తిరిగే అవకాశంలేని నిరుపేదలకు (సహాయం చేయండి)' (2:273) అనే సూక్తి వచ్చింది. ఇక్కడ 'దైవమార్గంలో' అంటే జిహాద్ కాదన్న భావం అందరూ అంగీకరించిన విషయమే. ఇక్కడ 'దైవమార్గంలో' అంటే ధర్మానికి సంబంధించిన ప్రతి పనీ, ప్రతి సత్కార్యమూ అని అర్థం."

"అమారతె షరిఆ" (బిహార్) నాయకులు మౌలానా అబ్దుస్సమద్ రహ్మానీ గారు కూడా "కితాబుల్ ఉష్ర్ వజ్జకాత్" అనే తన గ్రంథంలో 'ఫీసబీలిల్లాహ్' పద్దు క్రింద 'దైవమార్గంలో నిమగ్నులైపోయిన వారిని చేర్చారు.

"తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్" గ్రంథకర్త మౌలానా మౌదూదీ (రహ్మాలై) 'ఫీసబీలిల్లాహ్' అనే పద్దును గురించి ఆ గ్రంథంలో ఇలా వ్యాఖ్యానించారు:



"దైవమార్గం అనే పదం సర్వసాధారణమైనది. దైవప్రసన్నత కోసం చేసే సత్కార్యాలన్నీ 'దైవమార్గం' పరిధిలోకి వస్తాయి. అందువల్లనే కొందరు ధర్మవేత్తలు 'ఈ ఆదేశానుసారం జకాత్ పైకాన్ని అన్ని విధాల సత్కార్యాల కోసం వెచ్చించవచ్చని అభిప్రాయం వ్యక్తపరిచారు.....అయితే పూర్వకాలం నాయకులు ఫీసబీలిల్లాహ్ అనే పదాన్ని 'జిహాద్ ఫీసబీలిల్లాహ్' (దైవమార్గంలోపోరాటం) అనే అర్థంలో ప్రయోగించారు. ఈపోరాటం అనే పదాన్ని వారు సాధారణంగా యుద్ధం అనే భావంలో తీసుకున్నారు. ఈ కారణంగానే ప్రజలు జకాత్ స్వీకార పద్దులలోని ఫీసబీలిల్లాహ్ అనే పద్దు యుద్ధం కోసం మాత్రమే ప్రత్యేకించబడిందని అపోహపడ్డారు. కాని వాస్తవం అది కాదు.

'జిహాద్ ఫీసబీ లిల్లాహ్' అనే పదం యుద్ధం కంటే కూడా ఎంతో విస్తృతమైన భావం స్ఫురింపజేస్తుంది. ఇది 'దుష్టవచనాన్ని' అణచి 'దైవవచనాన్ని' ఉద్ధరించడానికి, దైవధర్మాన్ని ఒక జీవనవ్యవస్థగా నెలకొల్పడానికి చేసే సకల ప్రయత్నాలకు వర్తిస్తుంది. ఆ ప్రయత్నాలు ప్రచార-పరిచయాల ప్రారంభ దశలో ఉన్నా లేక సంఘర్షణ-సమరాల అంతిమ దశలో ఉన్నా సరే సకల విధాల ప్రయత్నాలకు ఈభావం వర్తిస్తుంది."

పైన పేర్కొన్న ఎనిమిది పద్దులలో తప్ప జకాత్ ధనాన్ని మరే ఇతర ఖాతాలలో వినియోగించకూడదు. అయితే జకాత్ చెల్లించే వ్యక్తి తప్పనిసరిగా ఈ మొత్తం పద్దులలో తన జకాత్‌ను వినియోగించాలన్న నిబంధన ఏదీ లేదు. వీటిలో కొన్ని పద్దులలోనో లేదా ఒకే పద్దులోనో కూడా మొత్తం జకాత్‌ను వినియోగించవచ్చు. 'ఉష్ర్' (వృక్షసంపదకుపై చెల్లించే జకాత్)కు కూడా ఈ ఆజ్ఞలే వర్తిస్తాయి.

"ఒకసారి ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి జకాత్ ధనం నుండి కొంత తనక్కూడా ఇవ్వమని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) అతనికి సమాధానమిస్తూ 'జకాత్ వినియోగ పద్దులకు సంబంధించిన (ఖుర్‌ఆన్‌లోని) నిర్ణయాన్ని దేవుడు ఏ ప్రవక్తకూ, ఏ ప్రవక్తేతరునికీ వదలిపెట్టలేదు. ఆయన స్వయంగా (ఖుర్‌ఆన్‌లో) జకాత్ పద్దులను నిర్ణయించాడు. దాన్ని ఎనిమిది భాగాలు (పద్దులు)గా నిర్ణయించాడు. నీవు ఈ పద్దు లలో ఏదైనా పద్దు క్రిందికి వస్తే నేను తప్పకుండా నీకు జకాత్ పైకం కొంత ఇవ్వ గలను' అని అన్నారు." (అబూదావూద్)

పోతే 2,7 పద్దులను గురించి ప్రయోగించిన పదాలను గమనిస్తే ఈ క్రింది ఖుర్‌ఆన్ సూక్తి గుర్తుకొస్తుంది:

"ముఖ్యంగా దైవకార్యాల్లో నిమగ్నులయిపోయి, జీవనోపాధి కోసం ధరణిపై తిరిగే అవకాశంలేని నిరుపేదలకు (ఆర్థికసహాయం చేయండి). వారి స్థితిగతులు ఎరగనివారు వారి ఆత్మాభిమానం చూసి వారు స్థితిపరులేనని భావిస్తారు. కాని వారి ముఖాలు చూస్తే మీరు వారి వాస్తవస్థితి గ్రహిస్తారు. వారు (సిగ్గు వదలి) ప్రజల వెంటపడి అర్థించే (యాచకుల్లాంటి) వారు కాదు. వారి సహాయం కోసం మీరు చేసే ఏ ఖర్చయినా దేవునికి తెలియకుండా ఉండదు." (ఖుర్‌ఆన్-2:273)

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) "తినడానికి తిండి ఉన్నవాడు, సంపాదించే శక్తి ఉన్నవాడు జకాత్ తీసుకోకూడదు" అని అన్నారు. అయితే మరొక హదీసులో "అర్థించే వాడు గుర్రమెక్కి వచ్చినా అది అతని హక్కు" అని చెప్పారు.

## 84. జకాత్ స్వీకారానికి అనర్హులు

ఏడు విధాల వ్యక్తులకు జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతంకాదు. ఒకవేళ వారికిచ్చినా జకాత్ చెల్లింపు బాధ్యత నెరవేరదు. అలాంటి వ్యక్తుల వివరాలు ఇలా ఉన్నాయి:

(1) తల్లి, తండ్రి, తాత, ముత్తాత, అమ్మమ్మ, అమ్మమ్మ తల్లి, నాయనమ్మ, నాయనమ్మ తల్లి.

(2) కొడుకులు, కూతుళ్ళు, మనమళ్ళు, మనుమరాళ్ళు, మనుమళ్ళ సంతానం, మనుమరాళ్ళ సంతానం.

(3) భార్య తన భర్తకు జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతం కాదు.

(4) భర్త తన భార్యకు జకాత్ ఇవ్వడం కూడా ధర్మసమ్మతం కాదు.

పైన పేర్కొన్న నాలుగు రకాల బంధువులకు తప్ప మిగిలిన బంధువులందరికీ జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతమే. పైగా వారికివ్వడం వల్ల అత్యధిక పుణ్యఫలం లభించే అవకాశం కూడా ఉంటుంది.

(5) జకాత్ విధింపుకు అవసరమైన కనీస మూలధనం గల వ్యక్తి (సాహెబె నిసాబ్)కి, స్థితిపరుడికి జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతం కాదు. నిరుపేద "సాహెబె నిసాబ్" అయ్యేటంత ఎక్కువ ధనం కలిగివుంటే అతనిక్కూడా జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతంకాదు. ఒకవేళ అతను రుణభారం కింద పడిపోయో లేదా కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉన్న కారణంగానో దుర్భర ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే అతనికి వీలైనంత ఎక్కువగా జకాత్ సహాయం అందజేయవచ్చు.

దైవప్రవక్త హితోక్తి : "ధనికుడికి జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతం కాదు, ఈ అయిదు రకాల వ్యక్తులకు తప్ప- 1. దైవమార్గంలో పోరాడే యోధుడు; 2. దాన ధర్మాల వసూలు, పంపిణీ లాంటి పనులు చేసేవాడు; 3. రుణగ్రస్తుడు; 4. డబ్బుతో సదఖా (దానం) వస్తువులు కొనేవాడు; 5. తన పొరుగున పేదవాడు కలిగివున్న వ్యక్తి. ఆ పేదవాడికి సదఖా లభిస్తే అతను దాన్ని తన ధనికుడైన పొరుగువానికి కానుకగా ఇచ్చే వ్యక్తి." (ముఅత్తా-ఇమామ్‌మాలిక్)

(6) ముస్లిమేతరునికి కూడా జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతం కాదు.

(7) హాషిం సంతతిలోని మూడు కుటుంబాలకు చెందినవారికి జకాత్ ఇవ్వడం ధర్మసమ్మతం కాదు: 1. హజ్రత్ అబ్బాస్ (రజి) సంతతికి; 2. హారిస్ సంతతికి; 3. అబూతాలిబ్ సంతతికి. బనీఫాతిమాకు చెందిన సయ్యిద్ వంశీయులు, అలవీ



సంతతికి చెందిన సయ్యిద్ వంశీయులు మూడవ కోవ కిందికి వస్తారు. వీరంతా అబూతాలిబ్ కుమారుడు హజ్రత్ అలి (రజి) సంతతికి చెందినవారు.

అయితే ఈరోజుల్లో వీరంతా నిజంగా హాషిం సంతతికి చెందిన వారేనా అని పరిశోధించడం చాలా కష్టమైన పని. అంచేత బైతుల్‌మాల్ నుండి ప్రతి నిరుపేదకు, అగత్యపరునికి సహాయం అందజేయాలి. కాకపోతే ఎవరికైనా తాము హాషిం సంతతికి చెందిన వారమేనని గట్టి నమ్మకముంటే అలాంటి వారు జకాత్ తీసుకోకూడదు.

ఇమామ్ మాలిక్ (రహ్మాలై) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "సదఖా ప్రజలకు చెందిన సొత్తు అయినందున సదఖా (జకాత్) సొమ్ము ముహమ్మద్ (సల్లం) సంతతికి ఇవ్వడం ధర్మసమ్మతం కాదు." (ఆసాన్ ఫిఖ్హా రెండో భాగం)

(8) ధనికుల పిల్లలకు జకాత్ పైకం ఇవ్వడం ధర్మసమ్మతం కాదు.

(9) మస్జిద్ నిర్మాణం కోసం జకాత్ ధనాన్ని ఖర్చు పెట్టకూడదు.

(10) మృతుని వస్త్ర సంస్కారానికి, మృతుని అప్పుల చెల్లింపుకు జకాత్ పైకం వినియోగించకూడదు. (ఇస్లామీ ఫిఖ్హా మొదటి భాగం, పే. 250)

## 85. జకాత్‌కు సంబంధించిన ఇతర ఆజ్ఞలు

(1) ఏదైనా సొంత పని చేయించుకొని దానికి ప్రతిఫలంగా లేక వేతనంగా జకాత్ పైకం ఇవ్వడం ధర్మసమ్మతం కాదు.

(2) సరైన జకాత్ చెల్లింపు కోసం, అర్హులైనవారికి జకాత్ అందజేస్తున్నప్పుడు ఇది జకాత్ పైకమని చెప్పనవసరం లేదు. దానికి బదులు వారికి కానుకగానో, పిల్లలకైతే పారితోషికంగాగానో జకాత్ అందజెయ్యాలి.

(3) ఏ వస్తు లేక పశు సంపదపై జకాత్ చెల్లించవలసి ఉంటుందో జకాత్‌గా దాన్నిగాని లేదా దాని ధరనుగాని ఇవ్వవచ్చు. ధరను జకాత్‌గా ఇచ్చేటప్పుడు అప్పటి మార్కెట్ ధరనే ఇవ్వాలి.

(4) జకాత్‌గా నాసిరకం వస్తువులు ఇవ్వకూడదు. అలాగే జకాత్ వసూలుచేసే వ్యక్తి ఎంతో నాణ్యమైన వస్తువులను తీసుకోవడం కూడా మంచి పద్ధతి కాదు.

(5) ఇస్లామీయ ప్రభుత్వమున్న చోట అక్కడి ముస్లింలు తమ జకాత్ సొమ్మును ప్రభుత్వ ధనాగారంలోనే జమచేయవలసి ఉంటుంది. ఇస్లామీయ ప్రభుత్వంలేని దేశాల ముస్లింలు తమంతటతాము "ముస్లిం ధనాగారం"ను స్థాపించుకొని, దాని ద్వారా జకాత్ వసూలు, పంపిణీ పనులు నిర్వహించుకోవడం మంచిది. అలా కాకపోతే వారు వ్యక్తిగత స్థాయిలో తమ జకాత్ సొమ్ములను అర్హులైన వారికి, సంస్థలకు అందజేయాలి.

(6) వ్యాపారం ప్రారంభించిన తేదీ నుండి సంవత్సరం గడిచిన తర్వాత కంపెనీలో మిగిలిన వ్యాపారసరుకు (Stock in Trade) విలువ ఎంతుంది, నగదు పైకం ఎంత అనే విషయాలు లెక్కవేసుకొని ఆ మొత్తం నిసాబ్‌కు చేరుకుంటే దానిపై 2-1/2 శాతం చొప్పున "వ్యాపారజకాత్" తీయవలసివుంటుంది. అలా జకాత్ తీసిన తర్వాతే మిగిలిన లాభాలను వాటాదారులు తమ వాటాలనిష్పత్తి ప్రకారం పంచు కోవాలి. కాని వ్యాపారసరుకు, నగదుపైకంల మొత్తం నుండి సేల్స్‌ట్యాక్స్ తీసేయకూడదు.

(7) వ్యక్తిగత అవసరాల కోసం కనీసం నిసాబ్‌కు సరిపడినంత అప్పు తీసుకున్నప్పుడు సంవత్సరం గడిచిపోయే వరకు ఆ పైకం ఖర్చుచేయకపోతే దానిపై జకాత్ చెల్లించవలసి ఉంటుంది. వ్యాపార అవసరాల కోసం తీసుకున్న అప్పుఅయితే, వ్యాపార ఖర్చులు పోగావచ్చే లాభం నిసాబ్‌కు చేరినంత సొమ్మయి ఉండి దానిపై ఒక సంవత్సం గడచిపోతే జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

(8) ఇచ్చిన అప్పులు సకాలంలో తిరిగివచ్చే అవకాశముంటే వాటిపై జకాత్ చెల్లించాలి. కొందరు ఫిఖ్హా వేత్తల అభిప్రాయం ప్రకారం ఆ రుణాలపై ప్రతి ఏడూ జకాత్ చెల్లించాలి. ఇది హజ్రత్ ఉస్మాన్ (రజి), అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి), తావూస్, హసన్ బస్రీ (రహ్మలై)ల దృక్పథం. మరికొందరి అభిప్రాయం ప్రకారం అప్పు వసూలయ్యాక గడచినపోయిన సంవత్సరాలకన్నిటికీ జకాత్ చెల్లించాలి. ఇది హజ్రత్ అలి (రజి), అబూసౌర్, సుఫ్యాన్‌సౌరి, హనఫీయుల దృక్పథం.

కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం అప్పు పైకం తిరిగొస్తుందో లేదో అన్న అనుమానం ఉన్నప్పుడు, చివరికి ఎప్పుడో తిరిగి లభించిన పక్షంలో ఒక సంవత్సరానికి మాత్రమే జకాత్ చెల్లించాలి. ఇది హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై), హసన్, లైస్, ఔజాయి, ఇమామ్ మాలిక్ (రహ్మలై)ల దృక్పథం.

(9) వివాదాస్పదమైన ఆస్తి ఎవరి అధీనంలో ఉంటే అతను దానిపై జకాత్ చెల్లించాలి. తరువాత తీర్పు ప్రకారం ఆస్తి ఎవరికి లభిస్తే అతను జకాత్ చెల్లించాలి.

(10) మనం ఎవరికైనా అప్పిచ్చిన తరువాత అప్పు తీసుకున్న వ్యక్తి ఇంకా ఆర్థిక ఇబ్బందులలోనే కొట్టుమిట్టాడుతున్న పక్షంలో ఆ అప్పును జకాత్ రూపేణ మాఫీచేస్తే మన జకాత్ చెల్లింపు బాధ్యత నెరవేరదు. దాని కోసం మొదట జకాత్ సొమ్మును రుణగ్రస్తుడికి అందజేయాలి. ఆ తరువాత రుణగ్రస్తుడు అప్పు చెల్లిస్తున్నట్లు చెప్పి ఆ సొమ్మును మనకు తిరిగిస్తే మన జకాత్ చెల్లింపు విధి నెరవేరుతుంది.

(11) పేదవాళ్ళకు జకాత్ పైకంతో బట్టలు, దుప్పట్లు, కంబళ్ళు కొని ఇవ్వచ్చు. అలాగే వివాహ అవసరాల కోసం కూడా వారికి జకాత్ పైకం అందజేయవచ్చు.

(12) ఒకతనికి మనం జకాత్‌స్వీకార అర్హుడని తలచి అతనికి జకాత్ అందజేస్తాం. కాని ఆతర్వాత అతను జకాత్‌స్వీకార అర్హుడు కాదని మనకు తెలిసినా జకాత్ చెల్లింపు విధి నెరవేరుతుంది. దాని కోసం మరొకసారి జకాత్ చెల్లించనవసరం లేదు.



(13) కరెన్సీనోట్లు, నాణాలు, వాణిజ్య సరుకులు ఏవైనా సరే బంగారం లేదా వెండికి సంబంధించిన "నిసాబ్" (మూలధన పరిమితి) విలువకు సరిపడేంత ఉంటే వాటిపై జకాత్ చెల్లించవలసి ఉంటుంది. ఉదాహరణకు- ఒకతని దగ్గర కొన్ని కరెన్సీ నోట్లు, మరికొన్ని నాణాలు మాత్రమే ఉంటాయి. అవన్నీ కలిపితే 52-1/2 తులాల "వెండి నిసాబ్"కు చేరుకుంటే, లేదా అంతే 'నిసాబ్'కు సరిపడేంత విలువగల వ్యాపార సరుకు ఉంటే వాటిపై జకాత్ చెల్లించాలి. అతని దగ్గరున్న ఈ ధనమంతా "బంగారం నిసాబ్"కు చేరుకోకపోయినా అతను విధిగా జకాత్ చెల్లించవలసిందే.

## 86. ప్రావిడెంట్ ఫండ్

కొన్ని ప్రభుత్వశాఖల ఉద్యోగుల జీతాల నుండి తీసే ప్రావిడెంట్ ఫండ్‌కు వడ్డీ కలిపి ఇస్తారు. వడ్డీ నిషిద్ధం కనుక దాన్ని పుణ్యఫలం ఆశించకుండా పేదలకు దానం చేయాలి. అలాకాని ఇతర ప్రభుత్వఉద్యోగుల జీతాల నుండి తీసే ప్రావిడెంట్‌ఫండ్ పైకం జకాత్ విధింపుకు అవసరమైనంత మూలధనాని (నిసాబ్)కి చేరుకుంటే, దాని మీద ప్రతియేడూ జకాత్ చెల్లించాలి. ప్రావిడెంట్‌ఫండ్ ఖాతాలో సంవత్సరాంతానికి ఎంత జమఅయితే అంత మొత్తంపై ప్రతి యేడూ జకాత్ చెల్లించవలసిందే.

ప్రావిడెంట్‌ఫండ్ పైకం ప్రస్తుతం ఉద్యోగి దగ్గర లేకపోయినా అది అతని సొంత ఆస్తిగానే పరిగణించబడుతుంది. అతను ఉద్యోగం మానేసినా లేదా రిటైర్ అయినా ఆ సొమ్ము అతనికి ఎలాగూ లభిస్తుంది. కనుక ప్రావిడెంట్‌ఫండ్ మీద జకాత్ చెల్లించవలసిఉంటుంది. మొత్తం ప్రావిడెంట్‌ఫండ్ సొమ్ము చేతికందిన తర్వాత, గడచిపోయిన సంవత్సరాల కంతటికీ లెక్కగట్టి జకాత్ చెల్లించడం కూడా ధర్మసమ్మతమే.

కొందరు ధర్మవేత్తలు ప్రావిడెంట్‌ఫండ్‌ని అప్పుగా పరిగణించి, ఆ మొత్తం చేతికి అందిన తరువాతనే దాని మీద జకాత్ చెల్లింపు విధి అవుతుందని అభిప్రాయపడ్డారు. "ఇస్లామీ ఫిఖ్హా" గ్రంథకర్త మాత్రం ప్రావిడెంట్ ఫండ్‌ని బ్యాంకుల్లో లేక పోస్టాఫీసుల్లో దాచుకున్న డిపాజిట్‌ల కింద పరిగణించారు. మొత్తం మీద ఈ రెండు పరిస్థితుల్లోనూ ప్రావిడెంట్ ఫండ్‌పై జకాత్ చెల్లించాల్సిందే. (ఇస్లామీ ఫిఖ్హా, మొదటిభాగం-పే.224)

## 87. జకాత్ విధింపుకు మూలధన పరిమితి (నిసాబ్)

జకాత్ విధింపు కోసం మూలధన పరిమితి అంటే జకాత్ చెల్లింపు విధి (వాజిబ్) కావడానికి ధర్మశాస్త్రం (షరీఅత్) నిర్ణయించిన కనీస మూలధనం అని అర్థం. దీన్ని "నిసాబె జకాత్" అని కూడా అంటారు. నిసాబ్‌అంత లేక నిసాబ్‌కు మించిన మూలధనం కలిగివున్న వ్యక్తిని "సాహెబె నిసాబ్" అంటారు. అంటే జకాత్ విధింపుకు అవసరమైన కనీస మూలధనం కలిగివున్న వ్యక్తి అన్న మాట.

జకాత్ విధింపుకు కావలసిన కనీస మూలధనం ఎంత ఉండాలన్న విషయాన్ని దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు:

"అయిదు ఊఖియాలు కన్నా తక్కువ వెండిపై జకాత్ లేదు. ఐదు కంటే తక్కువ ఒంటెలపై కూడా జకాత్ లేదు. అలాగే అయిదు వసఖ్ల కన్నా ఖర్జూరం లేక ధాన్యంపై కూడా జకాత్ లేదు." (బుఖారి)

హ్జత్ షాహ్ వలియుల్లాహ్ (రహ్మాలై) ఈ హదీసులో ప్రస్తావించబడిన కొల మానాలను గురించి వివరిస్తూ ఇలా అన్నారు: "ఆ కాలంలో అయిదు 'వసఖ్'లు అంటే ముప్ఫయి మణుగుల (దాదాపు 609 కిలో్గ్రాముల) ఖర్జూర పండ్లు. అవి ఒక చిన్న కుటుంబం ఏడాదిపాటు గడపటానికి సరిపోయేవి. ఇదే విలువ అయిదు 'ఊఖీ'ల, అంటే రెండొందల దిర్హమ్ల వెండికి (లేక) ఐదుఒంటెల ధరకు సమానంగా ఉండేది. అందువల్ల ఈ పరిమాణమంత సంపద కలిగివుండే వ్యక్తిని ధనికుడిగా పరిగణిస్తూ అతనిపై జకాత్ని విధి (వాజిబ్)గా నిర్ణయించడం జరిగింది.

**వెండి, బంగారాల పరిమితి (నిసాబ్):** జకాత్ విధింపుకు బంగారం పరిమితి (నిసాబ్) ఇరవై 'మిస్ఖాల్'లు. దీని బరువు అయిదు తులాల రెండున్నర మాషాల (దాదాపు 5-1/2 తులాలు= 65 గ్రాముల)కు సమానం. అంటే కనీసం అంత పరిమాణంలో ఎవరి దగ్గరైనా బంగారం ఉండి, ఒక సంవత్సరం గడచిపోతే అతనిపై జకాత్ చెల్లింపు విధి అవుతుంది. అంతకంటే తక్కువ బంగారంపై జకాత్ లేదు.

కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం బంగారం పరిమితి (నిసాబ్) 7-1/2 తులాలు (అంటే దాదాపు 87 గ్రాములు). ఈ విషయమే ప్రసిద్ధి చెందింది. "బెహిష్తి జేవర్" గ్రంథంలో కూడా బంగారం పరిమితి 7-1/2 తులాలేనని పేర్కొనబడింది.

వెండిపరిమిత (నిసాబ్) 200 దిర్హమ్లు. దీనిబరువు 38 తులాల అయిదున్నర మాషాల (దాదాపు 38-1/2 తులాలు= 455 గ్రాముల)కు సమానమవుతుంది. కనీసం అంత పరిమాణంలో ఎవరి దగ్గరైనా వెండి ఉండి, ఒక సంవత్సరం గడచిపోతే అతనిపై జకాత్ చెల్లింపు విధి అవుతుంది. అంతకంటే తక్కువ వెండిపై జకాత్ లేదు.

కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం వెండి పరిమితి (నిసాబ్) 52-1/2 తులాలు (అంటే దాదాపు 609 గ్రాములు). ఈ విషయమే ఎక్కువగా ప్రసిద్ధి చెందింది. "బెహిష్తి జేవర్" గ్రంథంలో కూడా వెండి పరిమితి 52-1/2 తులాలనే ఉంది.

**కరెన్సీనోట్లు, నాణాల పరిమితి (నిసాబ్):** కరెన్సీనోట్లు, నాణాల విషయంలో వెండి బంగారాల ధరలనే పరిగణనలోకి తీసుకోవాలి. ఎవరి దగ్గరైనా వెండి, బంగారాల పరిమితికి సమానమైన కరెన్సీ నోట్లు, నాణాలు ఉండి, ఒక సంవత్సరం గడచిపోతే అతను విధిగా జకాత్ చెల్లించవలసి ఉంటుంది.



అయితే వెండి, బంగారాలలో ఏ ఒక్కదాని నిసాబ్ పూర్తిఅయినా దాని ప్రకారమే లెక్కకట్టి జకాత్ చెల్లించాలన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఉదాహరణకు- ఈనాడు ఎవరి దగ్గరైనా ఏడువేల రూపాయలు నగదుంటే అతనిపై జకాత్ చెల్లింపు విధి అవుతుంది. కారణం ఏడువేల రూపాయలు బంగారం పరిమితి (నిసాబ్) విలువకు (అంటే 87 గ్రాముల బంగారం ధరకు) సమానం కాకపోయినా, ఆ పైకం వెండి పరిమితి (నిసాబ్) విలువకు (609 గ్రాముల వెండి ధరకు) మించిపోతుంది.

ఈనాడు (2005 సంవత్సరంలో) మార్కెట్ ధరలు బంగారం 10 గ్రాములు రూ.6,000/-లు; వెండి కిలో దాదాపు రూ.10,000/-లు ఉన్నాయి. ఇస్లాం ప్రారంభ కాలంలో వెండి, బంగారం ధరలు 1:7 నిష్పత్తిలో ఉంటే, నేడివి 1:60 నిష్పత్తిలో ఉన్నాయి. అంటే ఈనాడు బంగారం ధర ముందు వెండి ధర దాదాపు తొమ్మిది రెట్లు తగ్గిపోయింది. జకాత్ నిసాబ్ కోసం నేటి 1:60 నిష్పత్తికి బదులు ఆనాటి 1:7 నిష్పత్తినే ప్రాతిపదికగా తీసుకోవడం జరిగింది. ఈ కారణంగానే కొంత వెండి లేక కరెన్సీనోట్లతో పాటు 15గ్రాములు బంగారం ఉన్నా చాలు, జకాత్ చెల్లించవలసి ఉంటుంది. కారణం ఈ 15 గ్రాముల బంగారంధర (రూ. 9,000/-) వెండి పరిమితి (నిసాబ్) విలువ (రూ. 6,100/-) కన్నా ఎక్కువగా ఉండటమే. అంటే ఈనాడు మన దగ్గర రూ.6,100/-లు నగదు ఒక ఏడాదిపాటు ఉంటే చాలు, జకాత్ చెల్లింపు విధి అవుతుందన్న మాట.

**వ్యాపార సరుకు మీద జకాత్:** వ్యాపార సరుకు మీద జకాత్ చెల్లించే పద్ధతి ఇలా ఉంది- వ్యాపారం ప్రారంభించిన తేదీనుండి ఒక సంవత్సరం గడచిన తర్వాత వ్యాపారసరుకు (Stock in Trade) ఎంతుందో, రొఖ్ఖం (Stock in Hand) ఎంతుందో లెక్కగట్టాలి. ఈ రెండిటివిలువ (Cost) కలసి నిసాబ్కు చేరుకుంటే జకాత్ ఇవ్వాలి. అంటే వ్యాపారసరుకు, రొఖ్ఖం రెండిటి సముదాయంపై జకాత్ చెల్లించాలన్న మాట.

ఒకవేళ వ్యాపార సామగ్రి, నగదుపైకం విలువ 'నిసాబ్' కన్నా తక్కువగా ఉండి, కొన్నాళ్ళకు హఠాత్తుగా ధరలు పెరగడం వల్ల వ్యాపార సామగ్రి ధర నిసాబ్ అంత లేదా అంతకంటే ఎక్కువ అయిపోతే ధరలు పెరిగిన తేదీ నుండే 'జకాత్ సంవత్సరం' ప్రారంభమవుతుంది. అంటే వ్యాపారం మొదలుపెట్టిన తేదీ నుండి గాకుండా ధరలు పెరిగిన దగ్గర్నుంచి ఒక ఏడు గడచిన తర్వాత జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

**నగలకు సంబంధించిన జకాత్:** బంగారం, వెండి ఏ రూపంలో ఉన్నా సరే వాటి మీద జకాత్ చెల్లించవలసిందే. వెండి బంగారాలతో చేయబడిన నాణాలు, కడ్డీలు, బిస్కట్లు, తీగలు, రేకులు, ఆభరణాలు, బట్టలలో కలిపి నేయబడిన వెండి బంగారు జల్తారు, ఎంబ్రాయిడరీ మొదలైన ప్రతి దానిపై జకాత్ ఉంటుంది.

హ్జత్ ఉమ్మెసల్మా (రజి) కథనం: నేను (చేతులకు) కడియాలు ధరించేదాన్ని. (అందువల్ల) నేను దైవప్రవక్త (సల్లం)ను "దైవప్రవక్తా! ఇవి కూడా నిధి (ఖజానా)

కిందికి వస్తాయా?" అని అడిగాను. అప్పుడు ఆయన ఇలా అన్నారు- "జకాత్ చెల్లింపుకు అవసరమైనంత పరిమాణానికి చేరుకున్న ధనం ఉంటే దానిపై జకాత్ కూడా ఇస్తుంటే ఆ ధనం నిధి కిందికి రాదు." (అబూదావూద్)

ప్రఖ్యాత తత్వవేత్త మౌలానా మౌదూదీ (రహ్మలై) "రసాయల్ వ మసాయల్" రెండవ భాగంలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలా పేర్కొన్నారు:

"ఆభరణాల జకాత్ విషయంలో అనేక దృక్పథాలు ఉన్నాయి. ఒక దృక్పథం ప్రకారం ఆభరణాల మీద జకాత్ లేదు. వాటిని చేబదులుగా ఇవ్వడమే వాటి జకాత్ అవుతుంది. ఇది అనస్ బిన్ మాలిక్, సయీద్ బిన్ మసీబ్, ఖతాదా, షాబీ (రహ్మలై)ల అభిప్రాయం. రెండవ దృక్పథం ప్రకారం జీవితంలో కేవలం ఒకసారి నగలపై జకాత్ ఇస్తే సరిపోతుంది. మూడవ దృక్పథం ప్రకారం స్త్రీలు రోజూ ధరించే ఆభరణాల మీద జకాత్ లేదు. తరచుగా తీసి దాచుకునే ఆభరణాల మీద మటుకు జకాత్ తప్పనిసరిగా చెల్లించాలి. నాల్గవ దృక్పథం ప్రకారం అన్ని రకాల ఆభరణాల మీద జకాత్ ఉంది. నా దృష్టిలో ఈ నాల్గవ దృక్పథమే సరైనది."

"వెండి, బంగారాలపై జకాత్ చెల్లింపు వాజిబ్ (విధి)గా ఆదేశించబడిన హదీసుల వాక్యాలు సర్వసామాన్యమైనవి."

"వెండి మీద రెండున్నర శాతం జకాత్ ఉంది. అయిదు "ఊఖీ"లకు లోపు ఉంటే జకాత్ లేదు." అదీగాక అనేక హదీసుల్లో, ఉల్లేఖనాలలో, ఆభరణాల మీద జకాత్ ఉందని స్పష్టంగా వివరించబడింది. ఉదాహరణకు అబూదావూద్, తిర్మిజి, నసాయి గ్రంథాల్లో బలమైన ఆధారాలతో కూడిన ఈహదీసు పేర్కొనబడింది:

"దైవప్రవక్త (సల్లం) సన్నిధికి ఓసారి యమన్ దేశానికి చెందిన ఒక స్త్రీ వచ్చింది. ఆ స్త్రీ వెంట ఆమె కూతురు కూడా ఉంది. ఆ అమ్మాయి చేతులకు బరువైన రెండు బంగారు మురుగులు ఉన్నాయి. దైవప్రవక్త (స) ఆ స్త్రీని ఉద్దేశించి 'నీవు ఈ బంగారు మురుగుల మీద జకాత్ చెల్లిస్తున్నవా?' అని అడిగారు. అందుకామె లేదండీ అన్నది. దానిపై దైవప్రవక్త (స) 'అయితే ప్రళయదినాన దేవుడు దీని పర్యవసానంగా నీకు అగ్ని మురుగులు తొడిగించడం ఇష్టమేనా?' అని అడిగారు.

(ఈ మాటలు వినగానే) ఆ స్త్రీ ఆ రెండు బంగారు మురుగులు తీసి దైవప్రవక్త (సల్లం)కు ఇచ్చివేస్తూ 'దేవుని ప్రసన్నత, ఆయన ప్రవక్త (సల్లం) ప్రీతి కోసం నేను వీటిని మీకు సమర్పించుకుంటున్నాను' అని అన్నది." (తిర్మిజి, నసాయి)

ఒకసారి దైవప్రవక్త (స) సన్నిధికి ఇద్దరు స్త్రీలు వచ్చారు. వారి చేతులకు బంగారు గాజులు ఉన్నాయి. దైవప్రవక్త (స) వాటిని చూసి "ఈ బంగారుగాజులపై మీరు జకాత్ చెల్లిస్తున్నారా?" అనడిగారు. దానికి వారు "లేదు దైవప్రవక్తా!" అన్నారు. అప్పుడు దైవ ప్రవక్త (స) "మరి (పరలోకంలో) వీటికి బదులు మీకు అగ్నిగాజులు తొడిగించడాన్ని



మీరు ఇష్టపడతారా?"అని ప్రశ్నించారు. దానికి వారు "ఇష్టపడం దైవప్రవక్తా!" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "అయితే వీటిపై జకాత్ చెల్లించండి" అన్నారు. (తిర్మిజి)

సాధారణంగా స్త్రీలకు ఆభరణాలు అంటే ఎంతో ఇష్టం. ఇది సహజసిద్ధమైన కోరికే. అయితే కొందరు స్త్రీలు హోదా-అంతస్తులు, పేరుప్రతిష్ఠల కోసం ఆభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు, డిన్నర్ పార్టీలకు పోయినప్పుడు తాము ఇతర స్త్రీల కంటే గొప్ప అన్పించుకోవడానికి కొత్తకొత్త చీరెలతో పాటు ఖరీదైన నగలు ధరిస్తారు. మరికొందరు ఆభరణాల రూపంలో ఆస్తులు కూడబెట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. ఏమైనప్పటికీ వెండి, బంగారు ఆభరణాలపై ప్రతి సంవత్సరం జకాత్ చెల్లించక పోతే మాత్రం పరలోకంలో తీవ్ర యాతనలకు గురికావలసి వస్తుందని పై హదీసుల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. ఈ విషయాన్ని స్త్రీలు సదా గుర్తుంచుకోవాలి.

ఇబ్నె హజమ్ తన గ్రంథం "ముహల్లీ"లో పేర్కొన్నదాని ప్రకారం రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) తన గవర్నర్ హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి)కి పంపిన ఒక ఉత్తర్వులో "తమ ఆభరణాల మీద జకాత్ చెల్లించాలని ముస్లిం స్త్రీలను ఆజ్ఞాపించు" అని ఆదేశించారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి)ని ఒకతను "ఆభరణాలను గురించి ఆజ్ఞ ఏమిటీ?" అని అడిగాడు. దానికి ఆయన "అవి రెండొందల దిర్హమ్‌లకు చేరుకుంటే వాటిపై జకాత్ ఉంది" అని సమాధానమిచ్చారు.

ఇదే విషయాన్ని గురించి చెప్పిన సహబీలలో ఇబ్నె అబ్బాస్ (రజి), అబ్దుల్లా బిన్ అమ్ బిన్ ఆస్ (రజి), హజ్రత్ ఆయిషా (రజి); తాబయీలలో సయీద్ బిన్ మసీబ్ (రహ్మలై), సయీద్ బిన్ జబీర్ (రహ్మలై), జహ్రీ; ఇమాములలో సుఫ్యాన్ సౌరి (రహ్మలై), అబూహనీఫా (రహ్మలై), వారి అనుచరులు ఉన్నారు. వీరంతా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు."

---(మౌలానా అబుల్ ఆలా మౌదూదీ)

## 88. జకాత్ పరిమాణం (రేటు)

(1) వెండి, బంగారం ఆభరణాలు, వ్యాపార సరుకులపై; లోహపు నాణాలు, కరెన్సీనోట్లు, డాలర్, పౌండ్, రియాల్, దీనార్, దిర్హమ్ మొదలైన పైకంపై 40వ వంతు, అంటే రెండున్నర (2-1/2) శాతం జకాత్ విధిగా చెల్లించాలి.

(2) వెండి, బంగారం ఆభరణాల్లో నలభయ్యో వంతు బంగారం లేక వెండిని జకాత్‌గా ఇవ్వాలి. అయితే జకాత్‌గా వెండి, బంగారాలనే ఇవ్వనవసరం లేదు. దాని ధర లెక్కగట్టి నగదు రూపంలోనైనా ఇవ్వచ్చు. నగదు కాకుండా బట్టలు లేదా మరేవైనా వస్తువులు కూడా ఇవ్వచ్చు. నగదు గాని, వ్యాపార సరుకుల విలువ గాని

1వెండి, బంగారాలలో ఏ ఒక్కదాని నిసాబ్ (మూలధన పరిమితి)కు చేరినా వాటిపై రెండున్నర శాతం చొప్పున జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

(3) ఎవరి దగ్గరైనా వెండి లేక బంగారానికి సంబంధించిన మూలధనం (నిసాబ్) పరిమితికి కొంచెం మించిన వెండి, బంగారం లేక వ్యాపార సరుకు ఉంటే-అది ఆ నిసాబ్‌లో అయిదో భాగమంత ఉన్న పక్షంలో జకాత్ చెల్లింపు విధి అవుతుంది. అంత కంటే తక్కువ ఉంటే మాఫీ ఉంది.

(4) వెండి, బంగారం రెండూ కలసి ఉన్న నగలు, పాత్రలు లేక బట్టలు ఉన్న పక్షంలో- ఆ రెండిటిలో ఏది ఎక్కువగా ఉంటే దాన్నే పరిగణనలోకి తీసుకోవాలి. బంగారం పాలు ఎక్కువగా ఉంటే మొత్తం బంగారంగానే పరిగణించి బంగారం నిసాబ్ ప్రకారం జకాత్ చెల్లించాలి.

(5) బంగారం, వెండి నగలలో రాగి, ఇత్తడి లాంటి లోహాలు కలసి ఉన్నప్పుడు ఆ లోహాలపరిమాణం బంగారం లేక వెండికన్నా తక్కువగా ఉన్నా అది లెక్కలోకి రాదు. మొత్తంవస్తువు బంగారం లేక వెండితో చేయబడిందని తలచి జకాత్ చెల్లించాలి. ఒకవేళ ఈ వస్తువులలో రాగి, ఇత్తడి లాంటి లోహాల కంటే బంగారం లేక వెండి పరిమాణం తక్కువగా ఉంటే, ఆ మేరకున్న బంగారం లేక వెండినే లెక్కలోకి తీసుకొని, అది నిసాబ్‌కు సరిపోతే జకాత్ ఇవ్వవలసి ఉంటుంది. మిశ్రమలోహ వస్తువులలో ఉన్న వెండి బంగారాలు నిసాబ్‌కు సరిపడేంత లేకపోతే మాత్రం జకాత్ చెల్లించనవసరం లేదు.

(6) ఒకతని దగ్గర కొంత బంగారం, కొంత వెండి ఉన్నప్పుడు వాటిలో ఏ ఒక్కటి నిసాబ్‌కు (అంటే జకాత్ విధింపుకు అవసరమైన కనీస ధనం) కావలసిన పరిమాణంలో ఉన్నాసరే, దాని ధరతో పాటు రెండవదాని ధర కూడా కలిపి మొత్తం విలువ మీద రెండున్నర శాతం చొప్పున జకాత్ చెల్లించాలి.

(7) ఒకతని దగ్గర బంగారం, వెండి ఉన్నప్పటికీ వాటిలో ఏ ఒక్కటీ నిసాబ్‌కు సరిపడేంత పరిమాణంలో లేనప్పుడు ఆ రెండిటిని కలపగా వచ్చే మొత్తం విలువ బంగారం లేక వెండి నిసాబ్‌కు సరిపడేంత అవుతే దాని మీద రెండున్నర శాతం చొప్పున లెక్కగట్టి జకాత్ చెల్లించాలి. అదేవిధంగా కొంత నగదు, కొంత వెండి, కొంత వ్యాపార సరుకు ఉన్నప్పుడు అన్నిటి విలువ కలిపి బంగారం లేక వెండి నిసాబ్‌కు చేరితే దానిపై కూడా జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

(8) ఆభరణాల్లో ఉండే ముత్యాలు, మణులు, మాణిక్యాలు, వజ్రాలు, వైఢూర్యాల మీద జకాత్ లేదు. వాటి బరువును మినహాయించిన తరువాత ఆభరణాల్లో మిగిలిన వెండి లేక బంగారం బరువు మీద (అది నిసాబ్‌కు చేరుకుంటే) రెండున్నర శాతం చొప్పున జకాత్ చెల్లించాలి.



# 89. ఉష్ర్ (వృక్షసంపదపై జకాత్)

"ఉష్ర్" అంటే పదో వంతు అని అర్థం. షరీఅత్ పరిభాషలో ఉష్ర్ అంటే కొన్ని పంటభూముల ఉత్పత్తులపై పదోవంతుగా, మరికొన్ని పంటభూములపై ఇరవయ్యో వంతుగా విధించబడిన "ఉత్పత్తి సంబంధిత జకాత్" అని అర్థం. ప్రకృతి సంబంధమైన వర్షాలు, నదులు, వాగులు, చెరువుల మూలంగా పండే భూముల్లో గాని లేదా నదీతీరాల తేమ కారణంగా పండే చిత్తడి నేలల్లోగాని ఉత్పత్తి అయ్యే ఫలసాయం నుంచి పదో భాగాన్ని ఉష్ర్‌గా చెల్లించడం విధి. అలాగే కృత్రిమకాలువలు, జలాశయాలు, సాధారణ బావులు, గొట్టపుబావుల మూలంగా పండే భూముల్లోగాని, లేదా మరేదైనా శ్రమ లేక డబ్బు ద్వారా లభించే నీటివల్ల పండే భూముల్లోగాని ఉత్పత్తి అయ్యే ఫలసాయం అయితే ఇరవయ్యో భాగాన్ని ఉష్ర్‌గా చెల్లించాలి.

**ఉష్ర్ ఆదేశం:** భూ సంబంధ ఉత్పత్తులపై ఉష్ర్ చెల్లింపు విధి (వాజిబ్)గా నిర్ణయించబడింది. ఉదాహరణకు- ధాన్యం, అపరాలు, వేరుసెనగ, పండ్లు, ఫలాలు, పుష్పాలు, కాయగూరలు, ఆముదాలు, తేనె మొదలైనవి. ఇలాంటి ఫలసాయాలపై 'ఉష్ర్' చెల్లించాలని ఖుర్‌ఆన్ స్పష్టంగా ఆదేశించింది.

అహ్లెహదీస్ ధర్మవేత్తలు దైవప్రవక్త (స) కాలంలో గోధుములు, యవలు, ఖర్జూరపండ్లు, ద్రాక్షాపండ్లు మొదలైన వాటిపై మాత్రమే ఉష్ర్ చెల్లింపు ఉండేదని, నిల్వచేయడానికి వీలుకాని కూరగాయలు, ఆకుకూరలు లాంటి వాటిపై ఉష్ర్ ఉండేదికాదని అంటారు. ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయి (రహ్మలై)ల దృక్పథం ప్రకారం ఎండి నిల్వచేయడానికి వీలైన ఆహారవస్తువులపై మాత్రమే ఉష్ర్ విధి అవుతుంది. కాని ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) దృక్పథం ప్రకారం ఉద్దేశ్యపూర్వకంగా పండించిన, అమ్మడానికి వీలైన భూఉత్పత్తులన్నిటిపై ఉష్ర్ విధిగా చెల్లించవలసి ఉంటుంది. ఈ దృక్పథాన్ని ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు కూడా ధృవపరుస్తున్నాయి:

"విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేలనుండి మీ కోసం ఉత్పత్తిచేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైమార్గంలో ఖర్చుచేయండి." (2:267)

"(మీకోసం) పందిళ్ళ మీద ప్రాకే, ప్రాకని చెట్లతో సహా రకరకాల తోటలు, తోపులను సృష్టించినవాడు ఆ దేవుడే. వివిధ రకాల ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసే పొలాలు, ఖర్జూరపు చెట్లను సృష్టించినవాడు కూడా ఆయనే. ఆయనే ఆలివ్ (జైతూన్), దానిమ్మ వృక్షాలను సృజిస్తున్నాడు. వాటి పండ్లు చూడటానికి ఆకారంలో ఇంచుమించు ఒకేలా ఉన్నప్పటికీ రుచిలో వ్యత్యాసం ఉంటుంది. అవి పంటకు వచ్చినప్పుడు వాటి పండ్లు హాయిగా తినండి. దాంతోపాటు పంట కోతకు వచ్చినప్పుడు అందులో నుంచి దేవుని హక్కు (పేదల ఆర్థికహక్కు) కూడా నెరవేర్చండి. దుబారా చేయకండి. దుబారా చేసేవారిని దేవుడు ప్రేమించడు." (6:141)

హాఫిజ్ ఇబ్నెహజర్ (రహ్మలై) 'తల్ఖీసుల్‌జబీర్' గ్రంథంలో దోసకాయలు, గుమ్మడి కాయలు, దానిమ్మపండ్లు, కూరగాయల మీద ఉష్ర్ లేదని దైవప్రవక్త (సల్లం) చెప్పిన ఒక హదీసును ఉల్లేఖించిన తర్వాత ఈహదీసు బలహీనమైనదని, దాని ప్రమాణంలో కంటిన్యూటి లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఆయన తిర్మిజీ (రహ్మలై) అభిప్రాయాన్ని కూడా ఇలా ఉదాహరించారు: "దైవప్రవక్త (స) కూరగాయలు, తీగెసాగులు మొదలైనవాటి విషయంలో చెప్పిన ఏహదీసు కూడా సరిగా ఉల్లేఖించబడలేదు."

ఉష్ర్ (భూ సంబంధ ఉత్పత్తులపై చెల్లించే జకాత్-ఉష్ర్)ను గురించి దైవప్రవక్త (సల్లం) ఉపదేశించిన ఈ క్రింది హదీసులు చూడండి:

"వర్షం లేక సెలయేరుల ద్వారా నీరు పొందే భూముల (ఉత్పత్తుల)పైగాని, స్వతహాగా (నదుల దగ్గర్లో) నీరు పొందే భూముల (ఉత్పత్తుల)పైగాని ఉష్ర్ చెల్లింపు విధి అవుతుంది. బావుల నుండి తోడటం ద్వారా నీరు పొందే నేలల (ఉత్పత్తుల)పై అర్ధ 1/2 ఉష్ర్ చెల్లింపు విధి (వాజిబ్) అవుతుంది." (బుఖారి, బైహఖి)

"నదులు, వర్షం వల్ల పండిన పంటపై పదో వంతు, మోటబావి ద్వారా పండే పంటపై ఇరవయ్యే వంతు ఉష్ర్ (జకాత్) ఉంది." (ముస్లిం)

తేనెకు సంబంధించిన జకాత్ గురించి ఆయన ఇలా ప్రవచించారు:

"తేనె (సంపద)పై ఉష్ర్ చెల్లించండి." (బైహఖి, తిర్మిజి)

"పది మిష్కల తేనె (సంపద)పై ఒక మిష్క్ తేనె ఇవ్వడం విధి." (తిర్మిజి)

## 90. "ఉష్ర్"కు సంబంధించిన ఆదేశాలు

(1) ఉష్ర్ విధి కావడానికి ఎలాంటి సంపదపరిమితి (నిసాబ్) ఉండాలన్న నిబంధన లేదు. ఉత్పత్తి కొంచెం ఉన్నా, ఎక్కువ ఉన్నా మొత్తం మీద ఉష్ర్ తప్పని సరిగా చెల్లించాలి. కాకపోతే ఒక 'సా' అంటే 1.75 కిలోగ్రాములకు తక్కువగా ఉండ కూడదు. ఇది ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) దృక్పథం. ఇమామ్ షాఫయి (రహ్మలై), అహ్లెహదీసుల దృక్పథం ప్రకారం అయిదు 'వసఖ్'ల కంటే తక్కువగా ఉంటే ఉష్ర్ విధించకూడదు. ఒక వసఖ్ అరవై 'సా'లకు సమానం. ఈవిధంగా అయిదు వసఖ్‌లు అంటే 666 కిలోగ్రాములన్న మాట.

(2) ఉష్ర్ విధింపు కోసం 'లభించిన సంపద'పై ఒక సంవత్సరం కాలం గడవాలన్న నిబంధన ఏదీ లేదు. పైగా ఏదైనా పంటభూమిలో రెండు, మూడు పంటలు పండితే ప్రతిపంట మీద ఉష్ర్ చెల్లించవలసి ఉంటుంది. అన్ని రకాల పండ్లు, కూరగాయల మీద ఉష్ర్ విధించబడింది. ఎక్కువ కాలం నిల్వ ఉంచడానికి వీలుకాని కూరగాయలైనా అరటి, మామిడి, జామ లాంటి పండ్లయినా సరే ఉష్ర్ చెల్లింపు విధి అవుతుంది.



(3) భూమి యజమాని యుక్త వయస్సుకురాని పిల్లవాడైనా, మానసికంగా ఎదగనివ్యక్తి అయినా, పిచ్చివాడైనా ఉష్ర్ చెల్లించవలసిందే. ఇందులో వయోజనుడు, చైతన్యవంతుడు అయివుండాలన్న షరతు లేదు.

(4) ఇతరుల పంటభూమిని ఎవరైనా కౌలుకు తీసుకుంటే ఆ భూమిలో ఉత్పత్తి అయ్యే పంటపై కౌలుదారుడే ఉష్ర్ చెల్లించాలి. ఉష్ర్ విధింపుకు కావలసిన అసలు వస్తువు పంట మాత్రమేగాని, పంటభూమి కాదు. అందువల్ల కౌలుదారుని పైనే ఉష్ర్ చెల్లింపు బాధ్యత పడుతుంది.

(5) సేద్యభూమిని పాలుకివ్వడం జరిగితే పాలుకిచ్చినవాడు, పాలుకు తీసుకున్నవాడు ఇద్దరూ ఉష్ర్ చెల్లించవలసిందే.

(6) ప్రకృతి ఒనరులయిన వర్షాలు, నదుల మూలంగాను, ఇటు కృత్రిమ ఒనరులైన కాలువలు, బావుల మూలంగాను పండే పంటభూముల ఉంటే, ఎక్కువగా ఏ ఒనరుల మూలంగా పంటలు పండితే ఆ ఒనరుల్ని పరిగణనలోకి తీసుకొని ఉష్ర్ చెల్లించవలసి ఉంటుంది. ఎక్కువగా ప్రకృతిఒనరుల మీద ఆధారపడే భూమి అయితే దాని ఉత్పత్తులపై పూర్తి ఉష్ర్ (అంటే పదో వంతు ఫలసాయం) చెల్లించాలి. ఎక్కువగా కృత్రిమ ఒనరుల మీద ఆధారపడే భూమి అయితే అర్ధ ఉష్ర్ (అంటే ఇరవయ్యో వంతు ఫలసాయం) చెల్లించాలి.

(7) మొత్తం ఉత్పత్తిపై పదోవంతు ఉష్ర్ చెల్లించడం విధి (వాజిబ్). ఉత్పత్తి ఖర్చులు పోగా మిగిలిన పంట మీద జకాత్ చెల్లించకూడదు. ఉదాహరణకు- వంద క్వింటాళ్ళు గోధుమ పండితే దానిపై పది క్వింటాళ్ళ గోధుమను ఉష్ర్‌గా చెల్లించాలి. ఉత్పత్తి ఖర్చులు ఆ తరువాత వేరుగా లెక్కవేసుకోవాలి.

(8) ఏ పంటపై ఉష్ర్ విధి అవుతుందో దాన్నిగాని లేక దాని ధరనుగాని ఉష్ర్‌గా చెల్లించవచ్చు. అంటే వందక్వింటాళ్ళ గోధుమ ఉత్పత్తిపై పది క్వింటాళ్ళ గోధుమల్నిగాని లేదా ఆ పది క్వింటాళ్ళ గోధుమ ధరను నగదు రూపంలోగాని ఉష్ర్‌గా చెల్లించవచ్చు.

(9) ఏఏ సత్కార్యాలకు, ఏఏ వ్యక్తుల కోసం జకాత్ ఖర్చు చేయాలో ఆయా సత్కార్యాలకు, ఆయా వ్యక్తుల కోసమే ఉష్ర్‌ను కూడా వెచ్చించాలి.

(ఫిఖ్హా ఇస్లామి, మొదటి భాగం- పే.220,221)

(10) ఎవరైనా తన పొలం లేక తోటలో ఉత్పతయిన పండ్లను అవి పండి పక్వానికి రాకముందే అమ్మితే పండ్లు కొన్నవాడు ఉష్ర్ చెల్లించాలి. ఒకవేళ పండ్లు పక్వానికి వచ్చిన తర్వాతే అమ్మదలచుకుంటే ఆ పొలం లేక తోట యజమానే ఉష్ర్ చెల్లించాలి.

(11) వ్యవసాయంలో ఇద్దరు భాగస్వాములు ఉంటే, విత్తనాల ఖర్చు ఎవరు భరించినా ఉష్ర్ చెల్లించే బాధ్యత ఇద్దరి మీదా ఉంటుంది.

(12) వక్ఫ్ భూమిని ఎవరైనా సాగుచేస్తే, సాగుచేసేవాడే ఉష్ర్ చెల్లించాలి.

(13) భారతదేశంలో ముస్లింల యాజమాన్యంలో ఉన్న పంటభూములు ఉష్ర్‌కు సంబంధించిన భూములుగానే పరిగణించబడతాయి. అందువల్ల వాటి ఉత్పత్తులపై ముస్లింలు తప్పనిసరిగా ఉష్ర్ చెల్లించవలసి ఉంటుంది.

(ఆసాన్ ఫిఖ్హా, రెండవ భాగం నుండి గ్రహించబడ్డాయి.)

(14) ఎవరైనా తన సొంతానికి వాడుకునేందుకు ఇంటి పెరట్లోగాని, ప్రాంగణం లోగాని పండ్లు, కూరగాయలు పండిస్తే వాటిపై అతను ఉష్ర్ చెల్లించనవసరం లేదు. (ఇస్లామీ ఫిఖ్హా). ఒకవేళ వాటిని పెద్దఎత్తున పండించి వ్యాపారంచేస్తే వ్యాపార సరుకుపై చెల్లించే జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

# 91. రికాజ్ (ఖనిజసంపదపై జకాత్)

"రికాజ్" అంటే నిక్షిప్త వస్తువులు, ఖనిజాలు అని అర్థం. ఖనిజ నిక్షేపాలు భూమి లోపలి పొరలలో దాగివుంటాయి గనక వీటిని రికాజ్ అంటారు.

(1) వెలికితీసిన ఖనిజ సంపదపై అయిదోవంతు సంపదను బైతుల్‌మాల్‌కు (ఇస్లామీయ ప్రభుత్వ ధనాగారానికి) చెల్లించాలి. హదీసులో "ఖనిజ సంపదపై అయిదో వంతు చెల్లించాలి" అని ఉంది.

(2) గనుల నుండి వెలికితీసే ఇనుము, బంగారం, వెండి, తగరం, అభ్రకం, గంధకం, మొదలైన ఎలాంటి ఖనిజాలైనా వాటిలో అయిదో వంతు "బైతుల్‌మాల్"కు చెందుతుంది. మిగిలిన నాలుగు భాగాలు గని యజమానికి లభిస్తాయి.

(3) నేలలో లభించేవాటిలో అగ్నికి మెత్తబడని వజ్రాలు వగైరా వస్తుసంపదపై ఉష్ర్‌గాని, జకాత్‌గాని లేదు. అలాగే భూమిలో లభించే పెట్రోలు, సహజ వాయువు ల్లాంటి సున్నితమైన పల్చటి ఖనిజసంపదపై కూడా ఉష్ర్‌గాని, జకాత్‌గాని లేదు.

ఈ విషయంపై ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) తన అభిప్రాయం వ్యక్తపరుస్తూ ఇలా అన్నారు: "లోహ సంబంధమైన ఖనిజాలైనా, (గంధకం లాంటి) అసలు (స్థిర) స్థితిలో ఉండే ఖనిజాలైనా లేక (పెట్రోలు, పాదరసం లాంటి) ద్రవరూప ఖనిజాలైనా సరే నిసాబ్‌కు సరిపడే పరిమాణంలో ఉంటే, అవి ప్రైవేటు యాజమాన్యంలో ఉంటే అన్నిరకాల ఖనిజ సంపదలపై రెండున్నర శాతం చొప్పున జకాత్ చెల్లించడం విధి (వాజిబ్) అవుతుంది."

(అల్‌మగ్ని- రెండవ సంపుటం, ఆసాన్ ఫిఖ్హా-రెండవ భాగం)

సేద్యభూమిలోనైనా, బీడుభూమిలోనైనా, నివాసస్థలంలోనైనా, మరే సొంత స్థలంలోనైనా బంగారంగాని, వెండిగాని, మరెలాంటి విలువైన వస్తువులు దొరికినా సరే, అవి భూమి యజమానికే చెందుతాయి. ప్రభుత్వం వాటిని బలవంతంగా స్వాధీనం



చేసుకోదు. అయితే అలాంటి భూమిని ఎవరైనా కొంటే అందులో లభించే నిక్షేపాలు ఎవరికి చెందుతాయనే సమస్య వస్తే ఏం చెయ్యాలి? ఈక్రింది హదీసు చూడండి:

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: పూర్వకాలంలో ఒకతను మరొక వ్యక్తి దగ్గర కొంత భూమిని కొన్నాడు. ఆ భూమిలో ఒక మట్టిముంత బయల్పడింది. ఆ ముంతలో బంగారం కన్పించింది. భూమిని కొన్నవాడు అమ్మినవాడి దగ్గరకు వెళ్ళి "నీ దగ్గర కొన్న స్థలంలో ఓ ముంతలో దాచిన బంగారం బయల్పడింది. ఇదిగో ఈ బంగారం నీదే, తీసుకో. నేను భూమిని మాత్రమే నీ దగ్గర కొన్నాను, అందులోని బంగారాన్ని కొనలేదు" అని అన్నాడు. భూమిని అమ్మినవాడు (ఆ బంగారాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తూ) "నేను నీకు భూమిని, అందులో ఉన్నవాటిని కూడా అమ్మేశాను" అని అన్నాడు.

చివరికి వారీ వివాదాన్ని ఒకతని దగ్గరకు తీసికెళ్ళారు. అతను వారిద్దరి మాటలు విని "మీకు పిల్లలున్నారా?" అనడిగాడు. ఆ ఇద్దరిలో ఒకతను "నాకో కొడుకున్నాడ"ని చెప్పాడు. రెండోవాడు "నాకొక కూతురుంది" అన్నాడు. అప్పుడా మధ్యవర్తి తీర్పిస్తూ "అయితే ఆ ఇద్దర్ని కలిపి పెళ్ళిచేయండి. ఈ బంగారాన్ని వాళ్ళిద్దరి కోసం ఖర్చు చేయండి. కొంత దానం కూడా చేయండి" అని అన్నాడు. (బుఖారి, ముస్లిం)

# 92. ఫిత్రా దానం

"ఫిత్ర్" అంటే శాబ్దికభావం ఉపవాస విరమణ. సదఖాయె ఫిత్ర్ అంటే ఉపవాస విరమణకు సంబంధించిన (ఫిత్రా) దానం అని అర్థం. షరీఅత్ పరిభాషలో సదఖాయె ఫిత్ర్ అంటే ఉపవాసాల పాటింపులో జరిగిన లోపాలకు, పొరపాట్లకు పరిహారంగా, రమజాన్ నెలాఖరులో ఉపవాస వ్రతాలు ముగుస్తున్న సందర్భంలో విధిగా అందజేయ వలసిన దానం అని అర్థం. ముస్లింలపై రమజాన్ ఉపవాసాలు విధి (ఫర్జ్) అయిన సంవత్సరమే దైవప్రవక్త (సల్లం) ఫిత్రా దానం చెల్లించాలని ఆదేశించారు.

రమజాన్ ఉపవాసాలను వాటి నియమ నిబంధనలతో ఎంత కచ్చితంగా పాటించినప్పటికీ మానవదౌర్బల్యం వల్ల ఏవోకొన్ని పొరపాట్లు, లోటుపాట్లు జరుగు తూనే ఉంటాయి. వాటికి పరిహారమే ఫిత్రాదానం. ఫిత్రా దానం చేశాక మన ఉపవా సాలను దేవుడు స్వీకరిస్తాడన్న నమ్మకం కలుగుతుంది. ఫిత్రా విధి రమజాన్ ఉపవా సాలకు మాత్రమే వర్తిస్తుంది. ఇచ్ఛిక (నఫిల్) ఉపవాసాలకు వర్తించదు.

మరోవైపు ఈ ఫిత్రా దానం వల్ల సమాజంలోని నిరుపేదలు కూడా పండుగ శుభ సందర్భంగా మరింత ఆనందోత్సాహాలతో తిండి, బట్టలు వంటి ముఖ్యావసరాలను పూర్తిగా సమకూర్చుకొని ఇతర ముస్లింలతో కలసి 'ఈద్గాహ్' వెళ్ళ గలుగుతారు. ఈ విధంగా ఈద్గాహ్‌లో, ఈద్గాహ్‌కు వెళ్ళే, తిరిగొచ్చే మార్గాల్లో కన్పించే అత్యధిక ముస్లిం జనసంఖ్యతో ఇస్లాం ఔన్నత్యం, వైభవాలు వ్యక్తమవుతాయి.

ఈదుల్ ఫిత్ర్ (రమజాన్ పండుగ) రోజు ఉషోదయం ప్రారంభం కాగానే ఫిత్రా చెల్లింపు విధి అవుతుంది. ఉషోదయానికి పూర్వమే ఎవరైనా ధనికుడయిపోతే లేదా ముస్లిమేతరుడెవరైనా ఇస్లాం స్వీకరిస్తే అలాంటివారు కూడా విధిగా ఫిత్రా చెల్లించ వలసి ఉంటుంది. పండుగకు రెండు మూడు రోజులు ముందే ఫిత్రా చెల్లించడం మంచిది. దానివల్ల పేదవాళ్ళు కూడా పండుగ ఏర్పాట్లు చేసుకొని అందరితో పాటు పండుగ నమాజ్ కోసం ఈద్గాహ్‌కు వెళ్ళడానికి వీలుపడుతుంది.

"పండుగ నమాజ్‌కు పూర్వమే ఫిత్రా చెల్లిస్తే అది 'స్వీకృత దానం' అవుతుంది. పండుగ నమాజ్ ముగిసిన తరువాత ఫిత్రా చెల్లిస్తే అది సాధారణ దానం అవుతుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం). (అబూదావూద్)

దైవప్రవక్త (స) తెలిపిన ఫిత్రాఆశయాల్ని ఇబ్నెఅబ్బాస్ (రజి) ఇలా వివరించారు:

"ఉపవాసం పాటించేవారి వల్ల జరిగే పనికిమాలిన పనుల నుండి, నీతిబాహ్యా మైన విషయాలనుండి వారిని పావనం చేయడానికి, పేదవాళ్ళకు ఆహార పానీయాలు సమకూరడానికి దైవప్రవక్త (స) ఫిత్రాదానం చెల్లింపును విధిగా నిర్ణయించారు. కనుక పండుగ నమాజ్‌కు ముందే ఫిత్రా దానం చెల్లించేవారి దానం స్వీకరించబడుతుంది. పండుగ నమాజ్ ముగిసిన తరువాత చెల్లించేవారి ఫిత్రా దానం సాధారణ దానాలలో మాత్రమే ఒక దానంగా పరిగణించబడుతుంది." (అబూదావూద్, ఇబ్నెమాజ)

కనుక ఫిత్రా ప్రతి ముస్లిం చెల్లించవలసిందే. అతను ధనికుడైనా, బీదవాడైనా, స్వతంత్రుడైనా, బానిసైనా, స్త్రీఅయినా, పురుషుడైనా, పిల్లలైనా, పెద్దలైనా సరే అందరూ ఫిత్రా చెల్లించవలసిందే. చివరికి ఫిత్రా స్వీకరించే అగత్యపరుడు సైతం తన ఫిత్రాను మరొకరికి చెల్లించాల్సిందేనని ఒక అభిప్రాయం. కారణం ఫిత్రా శరీర సంబంధమైన దానం మాత్రమేగాని, ధన సంబంధమైన దానంకాదు. అయితే ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) దృష్టిలో జకాత్ చెల్లించేటంత స్తోమతగలవారికే ఫిత్రా చెల్లింపు వర్తిస్తుంది.

**ఫిత్రా పరిమాణం:** దైవప్రవక్త (స) కాలంలో ఆనాటి ప్రజానీకం తినే ముఖ్యాహార పదార్థాలనే పరిగణనలోకి తీసుకొని ఫిత్రా చెల్లించడం జరుగుతుండేది. ఈ పదార్థాలలో ఏదైనా ఒక 'సా' పరిమాణమంత ఫిత్రా చెల్లించడం ముస్లింలకు విధిగా చేయబడింది.

అబూసయీద్ ఖుద్రీ (రజి) కథనం: "మేము దైవప్రవక్త (స) కాలంలో ఈదుల్ ఫిత్ర్ (పండుగ) దానంగా ఒక 'సా' (పరిమాణమంత) ఆహార పదార్థాన్ని ఇచ్చేవాళ్ళము. అప్పుడు మా ఆహారంగా యవలు, ఎండు ద్రాక్షపండ్లు, జున్ను వగైరా ఉండేవి. అలాగే ఖర్జూరపండ్లు కూడా ఆహారంగా ఉండేవి." (బుఖారి)

అబూసయీద్ ఖుద్రీ (రజి) నోట అయాజ్ బిన్ అబ్దుల్లా విన్న విషయం: "మేము దైవప్రవక్త (స) నిర్దేశించిన 'సా'తో ఒక 'సా' గోధుమలుగాని, ఒక 'సా' యవలుగాని, ఒక 'సా' ఖర్జూర పండ్లుగాని, ఒక 'సా' జున్నుగాని, ఒక 'సా' ఎండు



ద్రాక్షగాని తీసుకొని ఫిత్రా దానం చేయడానికి బయలుదేరే వాళ్ళము" (మువత్తా)

హదీసుల్లో వచ్చిన "సా" అనే తూకపు కొలమానాన్ని మెట్రిక్ కొలమానం ప్రకారం ఎంత అనే విషయంలో ధర్మవేత్తలందరూ ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. కొందరు ధర్మవేత్తల పరిశోధన ప్రకారం 'సా'అంటే 1.11 కిలోగ్రాములు, మరికొందరు ధర్మవేత్తల పరిశోధన ప్రకారం 1.75 కిలోగ్రాములు, ఇంకొందరు ధర్మవేత్తల పరిశోధన ప్రకారం 2.20 కిలోగ్రాములు అని తెలుస్తోంది. ప్రజలలో చాలామంది 1.75 కిలోగ్రాములనే ఫిత్రా చెల్లింపుకు ప్రమాణంగా తీసుకుంటున్నారు. నా అభిప్రాయం కూడా ఇదే.

## 93. ఫిత్రాకు సంబంధించిన ఇతర ఆదేశాలు

(1) స్థితిపరుడైన ప్రతి ముస్లిం తానొక్కడే గాకుండా యుక్తవయస్సుకు రాని తన పిల్లల తరపున కూడా ఫిత్రా చెల్లించాలి. సంతానం సంపాదనాపరులైతే తమ ఫిత్రాలు తామే చెల్లించుకోవాలి. వారి తరపున తండ్రి కూడా చెల్లించవచ్చు. సంపాదనాపరులు కాకపోతే వారి తరపున తండ్రి తప్పనిసరిగా చెల్లించాలి. అంటే ఒక కుటుంబంలో చంటిపిల్లలతో సహా ఎంతమంది సభ్యులుంటే అంతమంది తరపునా ఫిత్రా చెల్లించాలి.

(2) స్థితిపరుడైన వ్యక్తి తన సంరక్షణలో, తన పోషణలో ఉండే సేవకులకు సంబంధించిన ఫిత్రా దానాలు కూడా వారి తరపున విధిగా చెల్లించవలసి ఉంటుంది.

(3) యుక్తవయస్సుకు రాని పిల్లల తండ్రి చనిపోతే వారి ఫిత్రా దానాల చెల్లింపు బాధ్యత తాత మీదగాని, సంరక్షకుని మీదగాని ఉంటుంది.

(4) ఆర్థికస్తోమత గల స్త్రీ తరపున ఆమె తల్లిదండ్రులు, సంతానం, భర్త లేక మరే ఇతర బంధువులు కూడా ఫిత్రా చెల్లించవలసిన అవసరం లేదు. ఆ స్త్రీ స్వయంగా తన ఫిత్రా చెల్లించుకోవాలి.

(5) రమజాన్ నెలలో ఏదైనా కారణం వల్ల ఉపవాస వ్రతాలు పాటించక పోయినా ఫిత్రా మాత్రం తప్పనిసరిగా చెల్లించాలి. ఫిత్రా చెల్లింపు విధి కావడానికి ఉపవాసాలు పాటించాలన్న షరతు లేదు.

(6) ఎవరైనా ఏదైనా కారణం వల్ల పండుగకు ముందుగాని, పండుగ రోజుగాని ఫిత్రా చెల్లించలేకపోతే అది మాఫీ కాదు. ఆ తరువాతయినా అతను చెల్లించాలి.

(7) ఒక ఫిత్రాను కొందరు పేదవాళ్ళకైనా ఇవ్వచ్చు లేదా అనేక ఫిత్రాలను ఒకే పేదవాడికైనా ఇవ్వచ్చు. రెండు పద్ధతులూ ధర్మసమ్మతమే.

(8) ఫిత్రాగా గోధుమలు లేక యవలు ఇవ్వడానికి బదులు వాటికి మార్కెట్ రేటు ప్రకారం వెలకట్టి నగదు రూపంలో కూడా ఇవ్వచ్చు. పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎలా బాగుంటే అలా ఫిత్రా ఇవ్వడం సమంజసంగా ఉంటుంది. (ఫిఖ్హా, ఇస్లామీ-మొదటి భాగం)

(9) ఫిత్రా దానంగా గోధుమలు లేక యవలు కాకుండా జొన్నలు, సజ్జలు, సెనగలు, బియ్యం వగైరా ఇతర రకాల ధాన్యం ఇవ్వదలచుకుంటే వాటిని గోధుమల ధరగాని లేదా యవల ధరగాని లెక్కకట్టి ఇవ్వాలి.

(10) అవసరమైతే ఫిత్రా దానాలను ఇతర ప్రాంతాలకు కూడా పంపవచ్చు. కాని సరైన కారణం, అత్యవసరం లేనిదే అలా చేయకూడదు.

(11) జకాత్ ధనాన్ని ఎవరెవరి కోసం, ఏఏ పనులకు ఖర్చు చేయాలో ఫిత్రాదానం కూడా ఆయా ఖాతాలలోనే వినియోగించాలి. అంటే- 1. అగత్యపరులకు, 2. ఆత్మాభి మానులైన నిరుపేదలకు, 3. వాటిని వసూలుచేసే ఉద్యోగుల కోసం, 4. హృదయాలు చూరగొనడానికి, 5. బానిసల విముక్తికి, 6. రుణగ్రస్తుల రుణభారం తగ్గించడానికి, 7. దైవమార్గంలో వినియోగించడానికి, 8. (నిర్ధనులైన) బాటసారులకు.

(ఆసాన్ ఫిఖ్హా- రెండవ భాగం)

గమనార్హం:- దానగ్రహీత విషయంలో జకాత్‌కు, ఫిత్రాకు ఓ చిన్న తేడా ఉంది. జకాత్ ముస్లిమేతరులకు ఇవ్వడం ధర్మసమ్మతం కాదు. ఫిత్రా ముస్లిమేతర పేదలకు కూడా ఇవ్వచ్చు. (ఇస్లామీ ఫిఖ్హా-మొదటి భాగం)

## 94. ఖుర్బాని (త్యాగం)

"ఖుర్బాని" అంటే త్యాగం. జంతుబలిని కూడా ఖుర్బాని అంటారు. జంతుబలి ద్వారా విశ్వాసి దేవుని ప్రసన్నత కోసం ధర్మసంస్థాపనా మార్గంలో దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహి) మాదిరిగా అవసరమైతే తనకు అత్యంత ప్రీతికరమైన ఎలాంటి వస్తువునైనా, తన యావదాస్తినైనా, చివరికి తన ప్రాణాలనైనా సరే త్యాగం చేయడానికి సిద్ధపడతానని భావిస్తాడు. ఖుర్బానీ స్పిరిట్‌ని, దాని మర్మహేతువుని అర్థం చేసుకోవా లంటే ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు గమనించండి:

"(ప్రవక్తా!) ఇలా చెప్పు: "నా ప్రార్థన-ఆరాధనలు, నా జీవన్మరణాలు సమస్తం సర్వలోక ప్రభువయిన అల్లాహ్‌కే సమర్పితం. ఆయనకు ఎలాంటి భాగస్వాములు లేరు. దీన్ని గురించే నాకు ఆజ్ఞ లభించింది. అందుకే నేను అందరికన్నా ముందు ఆయనకు విధేయుణ్ణయి పోయాను." (6:162,163)

"దేవుని దగ్గరకు వాటి రక్తమాంసాలు చేరవు. మీ భయభక్తులే ఆయన దగ్గరకు చేరు కుంటాయి. మీకు సన్మార్గం చూపినందుకు కృతజ్ఞతగా తనను స్తుతించడానికే దేవుడు ఈ పశువుల్ని మీ అదుపులో ఉంచాడు. ప్రవక్తా! సజ్జనులకు శుభవార్త అందజేయి." (22:37)

దైవప్రసన్నత కోసం ఖుర్బానీ ఇచ్చే సంప్రదాయం గత ప్రవక్తల ధర్మశాస్త్రాలలో కూడా ఉండేది. కాకపోతే ఖుర్బానీ పద్ధతులు వేర్వేరుగా ఉండేవి.



"ప్రజలు తమకు దేవుడిచ్చిన పశువుల్ని దేవునిపేరు స్మరించి బలివ్వడానికి మేము ప్రతి సమాజానికి ఒక బలివిధానం నిర్ణయించాము. గుర్తుంచుకోండి, మీఆరాధ్యుడు ఒక్క దేవుడు మాత్రమే. ఆయన ఆజ్ఞలనే శిరసావహిస్తూ ఆయనకే మీరు విధేయులై ఉండాలి." (ఖుర్‌ఆన్-22:34)

ఇస్లాంలో ఖుర్బానీకి ఎంత ప్రాముఖ్యం ఉందో దైవప్రవక్త (సల్లం) ప్రవచించిన ఈ క్రింది హదీసుల ద్వారా స్పష్టమవుతుంది. ఆయన ఇలా అన్నారు:

"(ఆర్థిక) స్తోమత ఉండి కూడా ఖుర్బానీ ఇవ్వని మనిషి మన ఈద్గాహ్ (పండుగ నమాజ్ చేసే స్థలం) దగ్గరకు రాకూడదు." (జమా ఫవాయిద్-కితాబుల్ ఇజాహి)

"దేవుని దృష్టిలో జిల్‌హజ్జ పదో రోజు ఖుర్బానీ రక్తం చిందించడం కంటే ఎక్కువ అభిలషనీయమైన పనేదీ లేదు. ప్రళయదినాన ఖుర్బానీ పశువును తన కొమ్ములు, గిట్టలు, వెండ్రుకలతో సహా ప్రవేశపెట్టడం జరుగుతుంది. ఖుర్బానీ పశువు రక్తం నేల మీద చిందక ముందే ఆ పుణ్యకార్యాన్ని దేవుడు స్వీకరిస్తాడు. కాబట్టి సంతోషంగా, మనస్ఫూర్తిగా ఖుర్బానీ ఇవ్వండి." (తిర్మిజి, ఇబ్నెమాజ)

దైవప్రవక్త (సల్లం) ఆయన అనుచరులు ఓసారి "ఖుర్బానీ అంటే ఏమిటీ?" అని అడిగారు. దానికి ఆయన "ఇది మీ తండ్రి ఇబ్రాహీమ్ (అలైహి) సంప్రదాయం" అని చెప్పారు. "అయితే దైవప్రవక్తా! ఇందులో మాకు ఎలాంటి పుణ్యఫలం లభిస్తుంది?" అని అనుచరులు మళ్ళీ ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (సల్లం) "పశువు శరీరం మీద ఉండే ప్రతి వెండ్రుకకు ఒక్కొక్క యూనిట్ చొప్పున పుణ్యం లభిస్తుంది" అని అన్నారు. "మరి ఉన్నికి బదులుగా ఏం లభిస్తుంది?" అని అనుచరులు అడిగారు. దానికి మహాప్రవక్త ముహమ్మద్ (స) "ప్రతి ఉన్నికి బదులుగా కూడా ఒక్కొక్క యూనిట్ పుణ్యం లభిస్తుంది" అని చెప్పారు. (తిర్మిజి, ఇబ్నెమాజ)

ఈ ఖుర్బానీ ముఖ్యంగా రెండు విధాలుగా ఉంది. ఒకటి, పిల్లవాడు పుట్టిన ఏడవ రోజు ఒకటి లేక రెండు మేకలనో, గొర్రెలనో బలివ్వడం జరుగుతుంది. ఇది దైవ ప్రవక్త (స) సంప్రదాయం. రెండు ఈదుల్అజ్హా (బక్రీదు పండుగ) నాడు స్తోమత గలవారు తప్పనిసరిగా ఇవ్వవలసిన జంతుబలి కూడా ఖుర్బానీయే. ఇలా ఖుర్బానీ ఇవ్వడం ద్వారా ఆ పశువు మాంసంలో బంధుమిత్రులకు, పేదలకు కూడా హక్కు లభిస్తుంది. అంటే ఖుర్బానీ మాంసం రూపంలో కూడా ప్రతి యేడూ ధనికుల నుండి లక్షల మంది పేదలకు ఎంతోకొంత సంపద సంక్రమిస్తుందన్న మాట. సాధారణంగా ఖుర్బానీపశువు మాంసంలో మూడోవంతు పేదలకు ఇవ్వడం పరిపాటి.

హజ్‌యాత్ర జరపడానికి పోయే ప్రతి యాత్రికుడూ మక్కాలో ఒక పశువును తప్పనిసరిగా బలిచ్చుకోవలసి ఉంటుంది. అలా ఖుర్బానీ ఇవ్వకపోతే యాత్రికుని హజ్ విధి నెరవేరదు. హజ్‌యాత్రకు పోనివారు కూడా ఖుర్బానీ ఇవ్వగల స్తోమత

కలవారు ప్రతి సంవత్సరం ఈదుల్‌అజ్హా నాడు విధిగా ఖుర్బానీ ఇవ్వాలి.

"మేము బలి పశువుల్ని మీ కోసం దైవచిహ్నాల జాబితాలో చేర్చాము. వాటిలో మీ శ్రేయస్సు ఉంది. కనుక వాటిని (ఒంటెలను) నిలబెట్టి దేవుని పేరు ఉచ్చరించండి. (అంటే దేవుని పేరు స్మరించి జిబహ్ చేయండి. బలిచేసిన కొద్ది క్షణాలకు) వాటి వీపులు నేలమీద (చలనరహితంగా) నిలిచిపోయిన తరువాత వాటి మాంసాన్ని మీరూ తినండి; అర్థించే వారికి, అర్థించనివారికి కూడా ఇవ్వండి. మీరు మాపట్ల కృతజ్ఞులై ఉండటానికే మేమిలా పశువుల్ని మీకోసం అదుపులో ఉంచాము." (ఖుర్‌ఆన్-22:36)

పై సూక్తిలో సృష్టికర్త ఖుర్బానీ పశువుని దైవచిహ్నాల జాబితాలో చేర్చానని చెబుతున్నాడు. ఒకదేశ పౌరులు తమ జాతీయచిహ్నమైన పతాకాన్ని ఎంతో గౌరవిస్తారు. అలాగే ముస్లింలు దైవచిహ్నాలలో ఒకటైన ఖుర్బానీ కూడా ఎంతో గౌరవిం చాలి. అంటే ఖుర్బానీ విధిని తప్పకుండా పాటించాలి. ఖుర్బానీ పశువును గౌరవించని, ఖుర్బానీ విధిని పాటించని ముస్లిం దేవుని దృష్టిలో నిజమైన విశ్వాసిగా పరిగణించబడలేడు.

ఏమైనప్పటికీ ఖుర్బానీ అనేది దైవప్రసన్నత కోసం చేసే త్యాగానికి మారు పేరని తెలుస్తోంది. దైవధర్మాన్ని ఆచరించడంలో, దాన్ని తోటిమానవులకు అందజేయడంలో విశ్వాసి సదా ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలి. ఒక్కోసారి మన కోరికలు, అభిరుచులు, ఇష్టాయిష్టాలను కూడా త్యాగం చేయవలసి ఉంటుంది. మనిషి తన కత్యంత ప్రియమైన వస్తువును సైతం దైవమార్గంలో వినియోగించనంత వరకు అతను ధర్మపరాయణత స్థాయికి చేరుకోలేడని దైవప్రవక్త (స) కూడా నొక్కి చెప్పారు.

## 95. దానం చేయడంలో జనశ్రేయోభిలాష

జకాత్ అయినా, ఉష్ర్ అయినా ఫిత్రా అయినా, మరే దానమైనా చిత్తశుద్ధితో దైవప్రసన్నత కోసమే ఇవ్వాలి. దానం చేయడంలో ఎలాంటి స్వార్థం, సంకుచిత తత్వం, ప్రదర్శనాబుద్ధి, పిసినారితనాలు ఉండకూడదు. దానంచేసే వ్యక్తి దృష్టిలో ఎల్లప్పుడూ దైవప్రసన్నతా కాంక్ష, జనశ్రేయాభిలాషలే ఉండాలి. మానవుని దగ్గరుండే ఏ వస్తువూ అసలు తనది కాదు. అతని దగ్గరుండే సిరిసంపదలు కూడా తనవి కావు. వాటి యజమాని సృష్టికర్తే. మానవుని దగ్గరున్న వస్తువులన్నీ సృష్టికర్త ప్రసాదితాలే. కనుక దానం చేసేవాడు దానంచేసే వస్తువులకు తాను యజమాని కాదని, తాను ఎవరెవరికి దానం చేస్తాడో వారే వాటికి యజమానులని భావించాలి.

స్థితిపరుడు తన సంపద నుండి జకాత్, ఉష్ర్, ఫిత్రా దానాల కోసం ఒక సారి పైకం తీశాడంటే ఇక ఆపైకం అతని సొత్తు కాజాలదు. అది దైవం నిర్ణయించిన పేదల, అగత్యపరుల హక్కయి పోతుంది. దీన్నిబట్టి జకాత్‌గాని, ఫిత్రాగాని పేదలకు ఇచ్చే వ్యక్తి వారికి తానేదో ఉపకారం చేస్తున్నట్లు భావించడానికి ఆస్కారమే లేదని స్పష్టంగా తెలుస్తోంది. కాబట్టి అతను పేదల హక్కుల్ని పేదలకు అందజేస్తున్నానని,



తన మీదున్న ఒక బాధ్యతా భారాన్ని దించుకుంటున్నానని భావించాలి.

అందువల్ల జకాత్, ఫిత్రా దానాలు ఇస్తున్నప్పుడు మన హృదయంలో ఎలాంటి దురాలోచనలు, దుర్భావనలు చోటు చేసుకోనీకుండా ఎంతో జాగ్రత్త వహించాలి. ఒక వేళ దానం ఇస్తూ మనం ఏదో పరోపకారం చేస్తున్నమని భావించడంగాని లేదా దానం స్వీకరిస్తున్నవారి నుంచి ప్రశంసల్ని, కృతజ్ఞతల్ని ఆశించడంగాని లేదా మరేదైనా ప్రవర్తన మూలంగా వారి మనస్సును నొప్పించడంగాని జరిగితే మన దానధర్మాలకు అర్థమే ఉండదు. దానివల్ల పరలోకంలో దైవాగ్రహానికి గురికావలసిన పరిస్థితి ఎదురుకావచ్చు. ఇలాంటి చెడుభావాలు లేకుండా చిత్తశుద్ధితో దానం చేసేవారి గుణగణాలను గురించి ఖుర్‌ఆన్ ఇలా అభివర్ణించింది:

"దైవమార్గంలో ధనాన్ని ఖర్చుచేయడంతో పాటు, చేసినమేలు గుర్తుచేసి (దాన గ్రహీత) మనస్సు నొప్పించనివారి కోసం వారి ప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు." (2:262)

"కేవలం దైవప్రసన్నత కోసం చిత్తశుద్ధితో తమ సంపదను ఖర్చుచేసే వారు మెరక ప్రాంతంలో ఉండే తోట లాంటివారు. ఆతోట వర్షాలు బాగాఉంటే రెండింతలు ఫలసాయం ఇస్తుంది. అంతగా వర్షాలు లేకుండా సన్నటి జల్లులు పడినా దానికి సరిపోతుంది. మీరు చేసే పనులన్నీ దేవుడు గమనిస్తూనే ఉన్నాడు." (2:265)

దాతలు పేరుప్రతిష్ఠల కోసం దానం చేయకూడదని, ఎత్తిపొడుపు మాటలతో దానగ్రహీతల హృదయాలను నొప్పించకూడదని; అలాచేస్తే వారి దానధర్మాలు వృథా అవుతాయని ఖుర్‌ఆన్ ముస్లింలకు హితవు చేస్తోంది. అంటే వారి దానధర్మలకు పర లోకంలో ఎలాంటి ప్రతిఫలం లభించదని హెచ్చరిస్తోంది. ఈ సూక్తులు చూడండి:

"విశ్వాసులారా! లోకులమెప్పు కోసం ప్రదర్శనాబుద్ధితో దానధర్మాలుచేసే వాడిలా, మీరు మీ దానధర్మాలను ఎత్తిపొడుపు మాటలద్వారా, (గ్రహీత) మనస్సు నొప్పించి వృథా చేసుకోకండి. అతనికి దేవునిమీద, పరలోకమ్మీద నమ్మకం లేదు. అలాంటి వ్యక్తి (చేసే దానధర్మాలు) భారీవర్షం కురవగానే పైనున్న పల్చటి మట్టిపొర కాస్తా తుడిచి పెట్టుకుపోయి నున్నగా మిగిలిపోయే రాతి(ప్రదేశం)తో సమానం. అలాంటివారు సత్కార్యాలు చేసి ఎలాంటి పుణ్యఫలం పొందలేరు. సత్యతిరస్కారులకు దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు." (ఖుర్‌ఆన్-2:264)

"దానంచేసి (దానగ్రహీత) మనస్సు నొప్పించే పని కన్నా మృదువుగా మాట్లాడటం, క్షమించడం అనేవి ఎంతో శ్రేష్ఠమైన పనులు." (ఖుర్‌ఆన్-2:263)

రాతిప్రదేశాల మీద ఏర్పడే మట్టిపొరలు తాత్కాలికమైనవి. అలాంటి నేలలో విత్తనాలు నాటినా ఒకసారి కురిసే భారీవర్షానికే అంతా కొట్టుకుపోయి నిరుపయోగ మవుతుంది. అదేవిధంగా చిత్తశుద్ధి లోపించిన జకాత్, ఫిత్రా తదితర దానధర్మాలు

కూడా పరలోకంలో నిష్ఫలమవుతాయి. కనుకనే జకాత్ అందజేసేటప్పుడు గ్రహీతను ఆ పైకానికి యజమానిగా పరిగణించాలని షరీఅత్ చెబుతోంది. చివరికి వారు అంద జేసే ఈపైకం జకాత్, ఉష్ర్, ఫిత్రాలకు సంబంధించినది అని కూడా గ్రహీతలకు చెప్పకూడదని; దానివల్ల వారి ఆత్మాభిమానం దెబ్బతినవచ్చని అంటోంది షరీఅత్.

"మీలో ఎవరికైనా ఒక పండ్లతోట ఉందనుకోండి. అందులో కాలువలు కూడా ప్రవ హిస్తుంటాయి. తోటలో అతని కోసం రకరకాల పండ్లు ఫలాలు పుష్కలంగా పండి సిద్ధంగా ఉంటాయి. అతనికి వృద్ధాప్యం వస్తుంది. అయితే అతని పిల్లలు ఇంకా పిన్న వయస్సులోనే ఉంటారు. అలాంటి స్థితిలో ఓరోజు హఠాత్తుగా తీవ్రమైన వడగాల్పులకు తోట మొత్తం మాడి మసయిపోతుంది. ఇలా సంభవించడాన్ని అతను ఇష్టపడతాడా? మీరు (సత్యాన్ని) అర్థంచేసుకోవడానికి దేవుడిలా తన సూక్తుల్ని మీముందు వివరిస్తున్నాడు." (ఖుర్ఆన్-2:266)

జకాత్, ఉష్ర్, ఫిత్రా వగైరా దానాలను ధాన్యం, వస్తువుల రూపేణ ఇవ్వదలచు కున్నప్పుడు నాసిరకం ఇవ్వకూడదని ఖుర్ఆన్ తాకీదు చేస్తోంది. విశ్వాసులు తమ కోసం ఇష్టపడిన దాన్నే ఇతరుల కోసం కూడా ఇష్టపడాలని కూడా బోధిస్తోంది.

"(కాబట్టి) విశ్వాసులారా! మీరు సంపాదించిన దానిలోనూ, మేము నేల నుండి మీ కోసం ఉత్పత్తిచేసిన దానిలోనూ శ్రేష్ఠమైనదాన్ని దైమార్గంలో ఖర్చుచేయండి. దైవమార్గంలో ఖర్చు చేయడానికి నాసిరకం వస్తువుల్ని ఏరితీసే ప్రయత్నం చేయకండి. అలాంటి వస్తువుల్ని మీకే గనక ఎవరయినా ఇస్తే మీరు తీసుకోవడానికి ఇష్టపడతారా? కళ్ళు మూసుకొని స్వీకరిస్తారేకాని, మనస్ఫూర్తిగా మీరు ఎన్నటికీ వాటిని స్వీకరించరు. దేవుడు నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడని తెలుసుకోండి." (2:267)

నిరుపేదలకు, ధర్మప్రచార కార్యాలకు ఆర్థిక సహాయం అందజేసేవారు ముఖ్య మైన మరొక విషయం కూడా గుర్తుంచుకోవాలి. మనిషి తన దగ్గరున్న సిరిసంపదలు తన శ్రమ, సామర్థ్యాల ఫలితమేనని భావించినప్పుడు కేవలం దైవ ప్రసన్నత కోసం వాటిలో కొంత ఖర్చుపెట్టడానికి "ఇవ్వాలా, వద్దా?" అని ఒకటికి పది సార్లు ఆలోచిస్తూ ఊగిసలాడుతాడు. "ఇస్తే తాను లక్షాధికారి నుంచి బిక్షాధికారికి దిగజారిపోతానేమో"నని సందేహం, సందిగ్ధాలలో పడి సతమతమవుతాడు. ఇలాంటి పిసినిగొట్టు ఆలోచనలకు పోకుండా దేవుని అనుగ్రహం మీద గట్టి నమ్మకం ఉంచి దైవమార్గంలో ఉదారంగా ఖర్చుపెట్టాలని ఖుర్ఆన్ ఇలా ముస్లింలకు పరోక్షంగా ఉపదేశిస్తోంది:

"షైతాన్ మిమ్మల్ని పేదరికం గురించి భయపెట్టి సిగ్గుమాలిన పనులకు పాల్పడేలా ప్రేరేపిస్తాడు. కాని దేవుడు మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. ఆయన ఎంతో ఉదారస్వభావుడు, సర్వం తెలిసినవాడు. తాను తలచుకున్న వారికి వివేకం, విచక్షణ జ్ఞానం ప్రసాదిస్తాడు. వివేకం, విచక్షణల జ్ఞానం లభించినవాడు ఎంతో



అదృష్టవంతుడు. నిజంగా అతనికి అపారసంపదలు లభించినట్లే. బుద్ధిమంతులు మాత్రమే (మా) హితోపదేశం గ్రహిస్తారు." (2:268,269)

"మీరు (దైవమార్గంలో) ఖర్చు చేసిందయినా, లేక మీరు మొక్కుబడి చేసుకున్న దైనా సరే, అంతా దేవునికి తెలుసు. దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయరు. మీరు దానధర్మాలు బహిరంగంగా చేసినా మంచిదే; ఒకవేళ మీరు ఇతరుల కంట పడకుండా రహస్యంగా అగత్యపరులకు దానం చేస్తే అది మరీ మంచిది. అలాంటి దానం మీ పాపాలను కడిగివేస్తుంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు." (2:270,271)

"రాత్రింబవళ్ళు బహిరంగంగానూ, గోప్యంగానూ (దైవమార్గంలో) తమ సంపద ఖర్చు చేసేవారి కోసం తగిన ప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సిద్ధంగా ఉంది. వారికి (అక్కడ) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు." (2:274)

ఈ హిత బోధనలన్నీ ఇస్లాం ప్రతిపాదించిన "ధనవికేంద్రీకరణ" వ్యవస్థను పటిష్ఠ పరచి సమాజంలో "ఆర్థికన్యాయం" నెలకొల్పడానికే ఇవ్వబడ్డాయి. కాకపోతే ఈ దానధర్మాలలో కొన్ని తప్పనిసరిగా చెల్లించవలసిన "విధిదానాలు", మరికొన్ని ఇష్టపూర్వకంగా ఇవ్వవలసిన "ఐచ్ఛికదానాలు" ఉన్నాయి.

**జకాత్ వల్ల ఐహిక ప్రయోజనాలు:** జకాత్, ఉష్ర్, ఫిత్రా దానాల వల్ల పరలోక ప్రయోజనాలతో పాటు ఐహిక ప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయి:

✦ జకాత్, ఉష్ర్, ఫిత్రా దానాలు చెల్లించే మనిషి హృదయంలో పిసినారితనం పోయి ఔదార్యం, దాతృత్వాలు జనిస్తాయి.

✦ అతనిలో ధనవ్యామోహం తగ్గిపోతుంది. ధనవ్యామోహం తగ్గిపోవడం వల్ల అతని స్వభావంలో అహంకారం పోయి అణుకువ చోటు చేసుకుంటుంది.

✦ జకాత్ చెల్లింపు వల్ల సమాజంలో కాఠిన్యత, కర్కశత్వాలు తగ్గిపోయి దయ, సానుభూతులు పెరుగుతాయి.

✦ జకాత్ చెల్లింపు వల్ల దేశంలోని కోట్లాది పేదప్రజల కనీస అవసరాలు తీరుతాయి. ఏ ఒక్కరూ దారిద్ర్యరేఖకు దిగువనుండే పరిస్థితి ఉండదు.

✦ జకాత్ వల్ల క్యాపిటలిజంలోని దోపిడి, అక్రమార్జనలు; సోషలిజంలోని రక్తపాతాలులేకుండా సర్వామోదయోగ్యమైన ఆర్థికన్యాయం నెలకొంటుంది.

## 96. వారసత్వపు ఆస్తి-ప్రాథమిక సూత్రాలు

ధనవికేంద్రీకరణ విషయంలో జకాత్ తరువాత వారసత్వపు ఆస్తిపంపిణీకి ఎంతో ప్రాముఖ్యం ఇవ్వబడింది. ఆస్తిపంపిణీకి సంబంధించిన విద్య ప్రతి ముస్లిం స్వయంగా తాను నేర్చుకోవడమే గాకుండా ఇతరులకు కూడా నేర్పాలని దైవప్రవక్త (సల్లం) ముస్లిం లకు తాకీదు చేశారు. వారసత్వపు ఆస్తిపంపిణీలో సంపద ఒకటి

రెండు కుటుంబాలలో కేంద్రీకృతమై ఉండకుండా దాదాపు బంధువులందరిలో వికేంద్రీకరణ చెందుతుంది.

ఇస్లాం సమస్త జీవనరంగాలను పరివేష్టించివున్న సమగ్ర జీవనవ్యవస్థ. దేవుడు స్వయంగా తన ప్రవక్త (సల్లం) ద్వారా పంపిన ధర్మం ఇది. అందువల్ల ప్రతి ముస్లిం నమాజ్, రోజా వంటి ఆరాధనలను గురించే కాకుండా, సామాజిక బాధ్యతలు, ఆస్తి పంపకం, ఇతర ఆర్థిక విషయాలకు సంబంధించిన ఇస్లాం బోధనలను గురించి కూడా క్షుణ్ణంగా తెలుసుకొని ఉండాలి. అజ్ఞానం మనిషిని దైవాగ్రహం నుండి తప్పించజాలదు. జ్ఞానార్జన కూడా ముస్లింల విధ్యుక్త ధర్మమే.

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "మీ విధులేమిటో తెలుసుకోండి. అంటే మీరు ఆస్తి పంపకం పద్ధతుల్ని నేర్చుకోండి. ఇతరులక్కూడా నేర్పండి. ఆస్తి పంపకానికి సంబంధించిన జ్ఞానం సగం జ్ఞానంతో సమానం" అని తమ అనుచరులకు ఉపదేశించారు. (ఇబ్నెమాజ)

ఈ హదీసులో ఆస్తిపంపిణీ జ్ఞానాన్ని మొత్తం ఇస్లామీయజ్ఞానంలో సగం జ్ఞానమని చెప్పబడింది. కాని ఈ జ్ఞానాన్నే నేటి ముస్లింలు మరచిపోయారు. లేదా దానికి తగిన ప్రాముఖ్యం ఇవ్వడంలేదు. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలిపారు:

"ఆస్తి పంపకం గురించిన జ్ఞానాన్ని ప్రజలు మరచిపోతారు. నా అనుచర సముదాయం (ఉమ్మత్)లో మొట్టమొదట (ఆకాశానికి) ఎత్తుకోబడే విషయమిదే." (ఇబ్నెమాజ)

వారసత్వపు ఆస్తిపంపిణీకి సంబంధించిన ఆజ్ఞలు అవతరించక పూర్వం ప్రతి ముస్లిం తప్పని సరిగా వీలునామా రాయాలని ఖుర్‌ఆన్‌లో ఒక ఆదేశం అవతరించింది. ఆస్తిపంపిణీ వివరాలు అవతరించిన తరువాత ఈ ఆదేశానికి సంబంధించిన సూక్తులు రద్దయిపోయాయి. కనుక ఇకనుంచి ఎవరూ మొత్తం ఆస్తిని తన ఇష్టమొచ్చిన విధంగా వీలునామా రాయడానికి వీల్లేదు. ఒకవేళ ఎవరైనా అలా వీలునామా రాస్తే అది ఇస్లామీయ షరీఅత్ ప్రకారం చెల్లదు.

అయితే మొత్తం ఆస్తిలో మనిషి తాను అర్హులని భావించిన దూరపు బంధువుల కోసం లేదా ఇతర సత్కార్యాల కోసం 1/3 వంతు లోపు వీలునామా రాయడానికి ఇస్లాం అనుమతించింది. తరువాయి అధ్యాయంలో దీని ప్రస్తావన వస్తుంది.

"తల్లిదండ్రులు, ఇతర బంధువులు వదలి వెళ్ళిన ఆస్తి కొద్దిగా వున్నా, ఎక్కువగా వున్నా అందులో పురుషులకూ వాటా ఉంది; స్త్రీలకూ వాటా ఉంది. ఇవి (దైవ)నిర్ణీత వాటాలు. (వాటిని తగ్గించడానికిగాని, పెంచడానికిగాని ఎవరికీ అధికారం లేదు.) ఆస్తి పంపకం జరుగుతున్న సమయంలో వారసులుకాని (నిరుపేద) బంధువులు, అనాథలు, అగత్యపరులు ఎవరయినా వస్తే వారికి కూడా మీరు ఎంతో కొంత ఇచ్చి పంపండి. వారితో మృదువుగా మాట్లాడండి." (ఖుర్‌ఆన్-4:7,8)



దూరపు బంధువులలో ఎవరైనా నిరుపేదలు, అనాథలు ఉంటే ఆస్తిపరుడు చనిపోయే ముందు తన ఆస్తిలో 1/3 వంతు లోపు భాగాన్ని అలాంటి అగత్యపరులకు చెందేలా వీలునామా వ్రాయడం మంచిది. ఒకవేళ అతను అలాంటి వీలునామా ఏదీ వ్రాయకుండా చనిపోతే అతని వారసులు విశాల హృదయంతో తమ వాటాలకు వచ్చిన దానిలో నుంచే ఆ అభాగ్యులకు ఎంతోకొంత ఇచ్చి వారిని సంతోషపెట్టాలని ఈ సూక్తులలో దేవుడు ఆదేశిస్తున్నాడు.

దైవప్రవక్త (స) ప్రవచనం: "వారసత్వపు ఆస్తిని దాని హక్కుదారులకు (అంటే వారసులకు) ఇచ్చేయండి. అందులో ఏదైనా మిగిలితే దాన్ని పురుషులలో మృతునికి సన్నిహితులైనవారికి ఇవ్వండి." (బుఖారి, ముస్లిం)

"దేవుడు మీకు జీవనాధారంగా చేసిన సంపదను మూఢులకు అప్పగించకండి. అయితే వారికి తిండి, బట్ట సమకూర్చండి. వారికి హితబోధ చేస్తూ ఉండండి." (ఖుర్‌ఆన్-4:5)

సంపదను సద్వినియోగం చేసే సామర్థ్యంలేని మూఢులకు దాన్ని అప్పగించ కూడదని ఈ సూక్తిలో సృష్టికర్త మనకు ఉపదేశిస్తున్నాడు. కాకపోతే వారికి కనీస జీవితావసరాలు సమకూర్చాలని, వారికి మంచిని గురించి, ధర్మాన్ని గురించి బోధిస్తూ ఉండాలని మరోవైపు దేవుడు మనల్ని ఆదేశిస్తున్నాడు.

"ప్రజలు చనిపోతూ తమ పసి పిల్లలను నిస్సహాయ స్థితిలో వదలి వెళ్ళవలసి వస్తే, ఆ తరువాత వారి పరిస్థితి ఏమిటీ అని ఆలోచించి భయపడాలి. కనుక వారు (ఇతరుల అనాథ బాలల విషయంలో కూడా) దేవునికి భయపడుతూ సవ్యమైన మాటనే పలకాలి. అన్యాయంగా అనాథ బాలల ఆస్తుల్ని తింటున్నవారు నిజానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు." (ఖుర్‌ఆన్-4:9,10)

ఉహుద్ యుద్ధం తరువాత హజ్రత్ సాద్ బిన్ రుబై (రజి) భార్య తన కుమార్తె లిద్దర్ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చారు. ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువుపెడ్తూ ఇలా అన్నారు: "దైవప్రవక్తా! వీళ్ళిద్దరూ సాద్ కుమార్తెలు. సాద్ మీతోపాటు ఉహుద్ యుద్ధంలో పాల్గొని అమరగతులయ్యారు. ఆ తరువాత ఈ బాలికల పినతండ్రి మా ఆస్తినంతటినీ స్వాధీనం చేసుకున్నాడు. వీరికోసం ఒక్క పైసా వదలిపెట్ట లేదు. ఇలాంటి స్థితిలో ఈ బాలికల్ని ఎవరు పెళ్ళి చేసుకుంటారు?" దీన్ని గురించే పై సూక్తులు అవతరించాయి.

వారసులు మృతునికి సంబంధించిన మూడు విధాల ఖర్చులు చెల్లించనంత వరకు అతని ఆస్తి నుండి తమ వాటాలు పంచుకోవడానికి వీల్లేదు.

(1) అతను చేసిన అప్పులన్నీ తీర్చాలి. అతని ఆస్తికంటే చేసిన అప్పులే ఎక్కువగా ఉంటే, శవసంస్కారం ఖర్చులు పోగా మిగిలిన ఆస్తిని అప్పుల నిష్పత్తి ప్రకారం

అప్పుల వాళ్ళకు చెల్లించాలి. మిగిలిన రుణధనం రుణదాతలు మాఫీచేస్తే మంచిది. మాఫీ చేయకుండా నిరాకరించే హక్కు కూడా వారికుంది. ఇస్లామీయ ప్రభుత్వం ఉంటే మిగిలిన అప్పులు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఆస్తివాటాలు దక్కని వారసులపై ఈ బాధ్యత లేదు. ఒకవేళ వారు స్థితిపరులై ఉంటే మృతుని అప్పులు తీర్చడం వారి నైతిక విధి అవుతుంది. ఎవరూ అప్పులు తీర్చకపోతే, రుణదాతలు కూడా వాటిని మాఫీచేయకపోతే రుణగ్రస్తుడు పరలోక శిక్షకు గురయ్యే ప్రమాదం ఉంది.

మృతుని భార్యకు భర్త నుండి ఇంకా మహర్ సొమ్ము లభించకపోతే అది కూడా అప్పు కిందకు వస్తుంది గనక దాన్ని కూడా వారసులు ఆమెకు చెల్లించిన తర్వాతే తమ వాటాలు పంచుకోవలసి ఉంటుంది. అదేవిధంగా మృతుడు ఎవరికైనా నష్టం కలిగించి ఉంటే ఆ నష్టపరిహారం కూడా వారసులు నష్టపోయిన వ్యక్తికి చెల్లించవలసి ఉంటుంది.

పోతే మనిషి తన ఆస్తిపై సకాలంలో జకాత్ చెల్లించకుండా ఆలస్యం చేస్తే, ఈలోగా అతను చనిపోవడం జరిగితే అతని వారసులు ఆ జకాత్పైకం చెల్లించిన తరువాతే తమ ఆస్తివాటాలు పంచుకోవలసి ఉంటుంది. జకాత్ పేద(దాసు)ల హక్కు. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లించాలి. మృతుడు వీలునామా వ్రాయకపోయినా సరే వారసులు దాన్ని చెల్లించిన తరువాతే తమ వాటాలు పంచుకోవలసి ఉంటుంది.

ఫరజ్ నమాజులు, రమజాన్ రోజాలు దైవహక్కుల జాబితాలోకి వస్తాయి. కనుక మృతుని ఫరజ్ నమాజులు ఏవైనా ఖజా అయిపోతే లేదా రమజాన్ రోజాలు ఏవైనా తప్పిపోతే వాటి పాపపరిహారం (ఫిదియా లేక కప్ఫారా) చెల్లంచవలసి ఉంటుంది. పాపపరిహారం గురించి ముందు రాబోతుంది. మొత్తంఆస్తిలో 1/3 వంతులోపు పాప పరిహారం పైకం ఉండి పరిహారం చెల్లించాలని మృతుడు వీలునామా వ్రాసిపోతే దాన్ని వారసులు విధిగా చెల్లించాలి. పాపపరిహారం పైకం అంతకంటే ఎక్కువ ఉంటే ఆ అదనపు పైకం చెల్లించే బాధ్యత వారసుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది.

(2) అతని శవసంస్కారానికి సంబంధించిన ఖర్చులుతీయాలి. అయితే ఇస్లాం సంప్రదాయాల పరిధిలోలేని దశదిన కర్మలు, నలభైదినాల కర్మలు, వార్షిక కర్మలు లాంటి నవీన దురాచారాల కోసం డబ్బు ఖర్చుపెట్టకూడదు. ఇవన్నీ పాపకార్యాలు.

(3) అతను షరీఅత్ ప్రకారం వీలునామా రాసిపోతే దాని ప్రకారం ఎవరెవరికి, ఏఏ సత్కార్యాలకు ఎంతెంత ఇవ్వాలో ఆడబ్బు కూడా ఆయా వ్యక్తులకు, సత్కార్యాలకు ఇచ్చేయాలి. ఆ తర్వాతే వారసులు తమ వాటాలు పంచుకోవలసి ఉంటుంది.

మృతునికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేని పక్షంలో అతని అప్పులు, శవసంస్కారం ఖర్చులు అతని వారసులే భరించవలసి ఉంటుంది. మృతునికి ఆస్తి ఉన్న పక్షంలో అతని వారసులకు ఎంతెంత వాటాలు లభిస్తాయో ఆ మేరకు వారసులు ఈ ఖర్చులు భరించవలసి ఉంటుంది.



# 97. వీలునామా (మరణ శాసనం)

"మీపై (మరో) బాధ్యత మోపబడుతోంది (వినండి). మీలో ఎవరికైనా మరణ కాలం ఆసన్నమయితే, అతను ఆస్తి కూడా వదలిపోతున్న పక్షంలో తల్లిదండ్రులకు, బంధువులకు ఆస్తిపంపిణీ విషయమయి తగిన వీలునామా రాసిపోవాలి. ఇది (దేవుని పట్ల) భయభక్తులు వున్నవారు నెరవేర్చవలసిన విధ్యుక్తధర్మం." (ఖుర్ఆన్–2:180)

"ఒకవేళ వీలునామాలోని విషయాలు విన్న తర్వాత వాటిని ఎవరైనా మార్చివేస్తే మాత్రం ఆపాపం వారినే చుట్టుకుంటుంది. నిస్సందేహంగా దేవుడు సర్వం వినేవాడు, సమస్తం తెలిసినవాడు. వీలునామా రాసిన వ్యక్తి పక్షపాతానికి పాల్పడ్డాడనిగాని, లేదా ఎవరి హక్కైనా హరించి వేశాడనిగాని (వారసుల్లో) ఎవరికైనా అనుమానం వస్తే, అతను (వీలునామాను మార్చివేసి) వారసుల మధ్య రాజీ కుదుర్చవచ్చు. అందులో ఎలాంటి దోషం లేదు. దేవుడు క్షమించేవాడు, కరుణించేవాడు." (ఖుర్ఆన్–2:181,182)

ఈ సూక్తుల్లో వారసత్వపు ఆస్తిపంపకం గురించి ఇంకా ఎలాంటి దైవచట్టం నిర్ణయించకబడక ముందు ఈ ఆదేశం ఇవ్వబడింది. ఆనాడు వారసుల్లో ఎలాంటి గొడవలు రాకుండా ఉండేందుకు ప్రతివ్యక్తీ (తన మరణానికి ముందుగా) వీలునామా ద్వారా విధిగా తన వారసుల వాటాలను నిర్ణయించాలని పైసూక్తిలో చెప్పబడింది. ఆ తర్వాత కొన్నాళ్ళకు దేవుడు వారసుల వాటాలను నిర్ణయించడంతో ఈసూక్తిలో పేర్కొనబడిన ఆజ్ఞ రద్దయిపోయింది. (ఈ విషయం 4వ అధ్యాయంలో వచ్చింది.)

దాని ప్రకారం దైవ నిర్ణీత వాటాలలో ఏ విధంగానూ ఎక్కువ తక్కువలు చేయకూడదని, వారసులుకానివారికి ఏదయినా సహాయం చేయదలచుకుంటే మొత్తం ఆస్తిలో మూడోవంతుకు లోపుగా మాత్రమే (అలాంటివారికి) వీలునామా రాయాలని దైవప్రవక్త (స) బోధించారు. మూడో వంతుకు మించి వీలునామా రాయించడానికి ఎవరికీ ఎలాంటి అధికారం లేదు. అలాగే విశ్వాసి, అవిశ్వాసులు ఒకరి ఆస్తులకు మరొకరు వారసులు కాజాలరని కూడా దైవప్రవక్త (స) చెప్పారు.

వీలునామా విషయంలో ముఖ్యంగా మూడు షరతులు గుర్తుంచుకోవాలి. ఈ మూడు షరతుల్లో ఏ ఒక్కటి నెరవేర్చకపోయినా వీలునామా, ఆస్తిపంపకాలు చెల్లవు. ఆ మూడు షరతులు ఇలా ఉన్నాయి:

(1) మృతుని శవసంస్కారం ఖర్చులు, అప్పులతోపాటు వీలునామాలో రాయబడిన పైకం తీసేసిన తర్వాతే వారసులు తమ వాటాలు పంచుకోవాలి.

(2) షరీఅత్ (ధర్మశాస్త్రం) సూచించిన వారసులలో ఎవరికైనా వారి నిర్ణీత వాటా కంటే ఎక్కువ సంక్రమించేలా వీలునామా వ్రాయకూడదు. "దేవుడు ప్రతి హక్కుదారుని (వారసుని) హక్కు ఇచ్చేశాడు. కనుక ఏ వారసుని విషయంలో కూడా

వీలునామా వ్రాయకూడద"ని దైవప్రవక్త (స) ఆదేశించారు. (బుఖారి). అయితే ఇతర వారసులు ఇష్టపడితే అలాంటి వీలునామా వ్రాయవచ్చు.

షరీఅత్ ప్రకారం ఆస్తిపరుని జీవితకాలంలోనే తన సంతానంలో ఒక కుమారుడు చనిపోతే అతని కొడుక్కి (అంటే మనవడికి) తాత ఆస్తిలో భాగం లభించదు. అలాంటి అనాథ మనవడికి తాత తన జీవితకాలంలోనే 1/3 వంతు లోపు ఆస్తివాటా లభించేలా వీలునామా వ్రాయవచ్చు. అలా వ్రాయడం ఎంతో పుణ్యకార్యం కూడా.

అనాథ వ్యవహారం గురించి "అన్యాయం, దౌర్జన్యం" అనే అధ్యాయంలో చర్చించడం జరిగింది. ఇక్కడ దైవప్రవక్త (సల్లం) బోధించిన మూడు హితోక్తుల్ని మాత్రమే పేర్కొంటున్నాను. ఆయన ఇలా ప్రవచించారు:

"కేవలం దేవుని ప్రసన్నత కోసం అనాథబాలుడి తలను నిమిరే వ్యక్తి కర్మల చిట్టాలో ఆ అనాథబాలుడి తలలోని ప్రతి వెంట్రుకకు బదులుగా ఒక్కొక్క పుణ్యం వ్రాయబడుతుంది." (తిర్మిజి)

"ఎవరైతే తాను తినే తాగే ఆహారపానీయాలలో అనాథబాలుడ్ని చేర్చుకుంటాడో దేవుడు అతనికి స్వర్గప్రవేశం విధిగా చేస్తాడు." (ఇబ్నెమాజ)

"నేను మీకు ఇద్దరు బలహీనుల హక్కులను గురించి తాకీదు చేస్తున్నాను. ఆ ఇద్దరు బలహీనులు- అనాథ బాలలు, స్త్రీలు." (నిసాయి)

ఇక్కడ ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కొందరు ఈ నైతిక బోధనలను ఎవరు ఖాతరు చేస్తారని ప్రశ్నిస్తారు. దేవుడ్ని, ఆయన ప్రవక్త (సల్లం)ను, పరలోక తీర్పుదినాన్ని మనస్ఫూర్తిగా విశ్వసించిన ముస్లిం నమాజు, ఉపవాసాలను పాటించడం లేదా? ఒకవేళ నమాజు, ఉపవాసాలను పాటించని ముస్లిం ఈ నైతిక బోధనలనే కాదు, షరీఅత్ పరమైన ఏ ఆజ్ఞలనైనా ఖాతరు చేస్తాడని ఆశించలేము. షరీఅత్ చట్టాలను గౌరవించే వారు నైతిక బోధనలను కూడా గౌరవిస్తారు. ఇవి రెండూ ఒకదానికొకటి అవినాభావ సంబంధం కలిగి ఉన్నాయి.

(3) మొత్తం ఆస్తిలో 1/3 వంతు లోపుపై మాత్రమే వీలునామా వ్రాయాలి. అంతకు మించిన పైకంపై వీలునామా రాసినా అది చెల్లదు.

హజ్రత్ సాద్ బిన్ అబీవఖాస్ (రజి) కథనం: వీడ్కోలు హజ్‌యాత్ర జరిగిన యేడు నేను జబ్బుతో తీవ్రంగా బాధపడుతుంటే దైవప్రవక్త (స) నన్ను పరామర్శించ డానికి వచ్చారు. అప్పుడు నేను ఆయనతో మాట్లాడుతూ "దైవప్రవక్తా! నా జబ్బు బాగా ముదిరిపోయింది. నేను ధనవంతుడ్ని. నాకు ఒక కూతురు తప్ప వారసులు లేరు. ఈ స్థితిలో నేను మూడింట రెండొంతులు ఆస్తిని దానం చేయవచ్చా?"అని అడిగాను. దానికి దైవ ప్రవక్త (స) "లేదు, అర్ధభాగం కూడా చేయకూడదు" అని అన్నారు.



ఆ తర్వాత ఆయన ఇలా చెప్పారు: "మూడింట ఒకవంతు ఆస్తి దానం చెయ్యి. ఇది కూడా ఎక్కువే. నీ వారసులు లోకుల ముందు చేతులు జాపి దేబరించే లా వారిని నిరుపేదలుగా, నిరాధారులుగా చేసి వెళ్ళడం కంటే స్థితిపరులుగా చేసి వెళ్ళడం ఎంతో ఉత్తమం. నీవు ఏది ఖర్చుపెట్టినా ఖర్చుపెట్టేటప్పుడు దైవప్రసన్నత పొందడం నీ ఉద్దేశ్యమై వుంటే నీకు దాని పుణ్యఫలం తప్పక లభిస్తుంది. చివరికి నీభార్య కోసం వెచ్చించే ధనం కూడా నీకు పుణ్యం ఆర్జించిపెడుతుంది."...(బుఖారి)

వారసులకు నష్టం కలిగించే ఎలాంటి వీలునామా వ్రాయకూడదు. వ్రాసినా అది చెల్లదు. పైగా అలాంటి వీలునామా వల్ల పరలోక శిక్ష అనుభవించవలసి వస్తుంది. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి గమనించండి:

"మృతుడు రాసిన వీలునామా నెరవేర్చి, అప్పులు తీర్చిన తర్వాతనే వారసులకు వాటాలు లభిస్తాయి. అయితే వీలునామా (ఎవరికీ) బాధాకరంగా ఉండరాదు. ఇది దేవుడు జారీచేస్తున్న ఆజ్ఞ. దేవుడు సర్వజ్ఞుడు; ఎంతో మృదుహృదయుడు." (4:12)

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఈ సూక్తి గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు:

"ఎందరో పురుషులు, స్త్రీలు ఇలాంటి వారున్నారు- వారు అరవై ఏళ్ళ వయస్సు వచ్చేదాకా మొత్తం జీవితాన్ని దేవుని విధేయతలో గడుపుతారు. కాని తీరా మరణ కాలం ఆసన్నమయినప్పుడు వారు తమ వీలునామా ద్వారా (వారసులకు) నష్టం కలిగిస్తారు. (లేదా అర్హుల కోసం వీలునామాలో ఏదీ రాయరు.) ఈ కారణంగా వారు నరకానికి అర్హులైపోతారు." (అబూదావూద్)

ఇలాంటి వీలునామా చెల్లదు. దాన్ని అమలుపరచాల్సిన అవసరం లేదు. మృతుని ఆస్తిలో మూడువిధాల వారసులకు తప్పనిసరిగా నిర్ణీతవాటాలు లభించాలి. వారు (1) కొడుకులు, కూతుళ్ళు, (2) తల్లిదండ్రులు, (3) భార్యాభర్తల్లో బ్రతికి ఉండేవారు.

"విశ్వాసులారా! మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమయినప్పుడు అతను వీలునామా రాయదలిస్తే, అందుకు మీలో నిజాయితీపరులైన ఇద్దరు వ్యక్తులు సాక్షులుగా ఉండాలి. ఒకవేళ మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు అక్కడ మరణ సమయం ఆసన్నమైతే ముస్లిమేతరుల నుండయినా సరే ఇద్దర్ని సాక్షులుగా పెట్టు కోండి. ఒకవేళ వారి నిజాయితీ పట్ల మీకేదయినా అనుమానం వస్తే, ప్రార్థన తరువాత వారిద్దరి చేత (మసీదులో) ప్రమాణం చేయించాలి. వారు దేవుని మీద ప్రమాణం చేస్తూ ఇలా పలకాలి: 'మేము ఎలాంటి స్వార్థప్రయోజనాల కోసం ఈ సాక్ష్యాన్ని వాడుకోము, మా బంధువులైనా సరే (మేము పక్షపాతం చూపము). దేవుని కోసం చెప్పే సాక్ష్యాన్ని మేము ఎన్నటికీ దాచము. అలా చేస్తే మేము పాపాత్ములలో చేరిపోతాము." (5:106)

"అయితే అలా ప్రమాణం చేసి కూడా వారు అన్యాయం, పక్షపాతాలకు పాల్పడితే వారి స్థానంలో వారికంటే కొంచెం యోగ్యులైన మరో ఇద్దరు సాక్షులుగా ముందుకు

రావాలి. ఈసాక్షులు అన్యాయానికి గురయినవారై ఉండాలి. మృతునికి సన్నిహితులయి కూడా ఉండాలి. వారు (మసీదులో నిలబడి) దేవుని మీద ప్రమాణం చేసి 'వారి సాక్ష్యం కంటే మాసాక్ష్యం నిజమయినది; మేము మా సాక్ష్యంలో ఎలాంటి హద్దు మీరలేదు. అలా చేస్తే మేము దుర్మార్గులలో చేరినవారమవుతాము' అని పలకాలి." (5:107)

"ఇలాంటి పద్ధతి వల్ల ప్రజలు సరైన సాక్ష్యమిస్తారని ఆశ ఉంటుంది. లేదా వారు తాము ప్రమాణం చేసిన తరువాత రెండో వర్గం చేసే ప్రమాణం తమకు వ్యతిరేకంగా ఉంటుందేమోనని భావించయినా భయపడతారు. దేవునికి భయపడండి. వినండి, నీతిలేనివారికి దేవుడు ఎన్నటికీ సన్మార్గం చూపడు. (ఖుర్ఆన్-5:108)

దైవప్రవక్త (స) హితోక్తి : "ఒక ముస్లింకు ఏదైనా ఆస్తి ఉండి దాని విషయంలో వీలునామా రాయదలచినప్పుడు (వెంటనే రాయాలి.) రెండురాత్రులు గడచిపోయినా వీలునామా రాయకుండా ఉండటం అతనికి వాంఛనీయం కాదు." (బుఖారి)

దేవుడు వారసుల వాటాలను నిర్ణయించిన తరువాత వీలునామా తప్పనిసరిగా రాయాలన్న విధి రద్దయిపోయింది. రాయదలచుకుంటే మొత్తం ఆస్తిలో మూడో వంతుకు మించి రాయకూడదు. అసలు వీలునామా రాయడానికి విషయం ఏదీ లేనప్పుడు వీలునామా రాయకపోవడంలో తప్పు లేదు.

హజ్రత్ తల్హా బిన్ మసర్రఫ్ (రజి) కథనం: నేనొక సారి అబ్దుల్లా బిన్ అబీఔఫా (రజి) గారిని "దైవప్రవక్త (స) వీలునామా రాశారా?" అనడిగాను. దాని కాయన లేదన్నారు. "మరి ప్రజలకు వీలునామాను ఎలా విధించారు? ప్రజలకు వీలునామా ఆజ్ఞ ఎలా ఇచ్చారు?" అని అడిగాను నేను. అప్పుడు అబ్దుల్లా బిన్ అబీఔఫా (రజి) సమాధానమిస్తూ "ప్రజలు దైవగ్రంథాన్ని గట్టిగా పట్టుకొని దాని ప్రకారం నడుచుకోవాలని దైవప్రవక్త (స) ఆదేశించారు కదా!" అని అన్నారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ఎలాంటి ఆస్తిపాస్తులు వదలిపెట్టి పోలేదు గనక ధన వ్యవహారంలో ఆయన వీలునామా రాయలేదు. అయితే దైవగ్రంథాన్ని గట్టిగా పట్టుకొని దానిప్రకారం ఆచరించాలని వీలునామా రాసి పోయారు. వారసులకు ఆస్తిపంపకం విషయంలో వీలునామా విధి గురించి ఖుర్ఆన్‌లో ఉంది. అయితే కొంత కాలానికి వారసుల వాటాలు దేవుడు నిర్ణయించినందున వీలునామా విధి రద్దయిపోయింది. ఇప్పుడు 1/3వంతు ఆస్తిపై మాత్రమే వీలునామా రాయడానికి వీలుంది.

## 98. ఆస్తి పంపకం

ఏ మనిషయినా చనిపోయిన తరువాతే అతని ఆస్తి వారసుల్లో పంచడం జరగాలి. తండ్రి బ్రతికుండగానే తన వాటా ఇవ్వమని అడిగే అధికారం కొడుక్కు లేదు. అలాగే తన తాత ఆస్తి ఇవ్వమని తండ్రిని అడిగే అధికారం కూడా అతనికి లేదు. తాత చనిపోయినప్పుడే అతని ఆస్తి కొడుకులకు, కూతుళ్ళకు సంక్రమిస్తుంది.



స్త్రీపురుషుల ఆస్తి వాటాలను గురించి ఖుర్ఆన్ ఓ ప్రాథమిక సూత్రాన్ని ఈ విధంగా పేర్కొన్నది:

"మీ సంతానం విషయంలో దేవుడు మిమ్మల్ని ఇలా ఆదేశిస్తున్నాడు: ఒక పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాలతో సమానం." (4:11)

ఉదాహరణకు- మృతునికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నప్పుడు అతను వదలిపోయిన 7 లక్షల రూపాయల ఆస్తిలో ఒక్కొక్క కుమారునికి 2 లక్షలు చొప్పున ఇద్దరు కుమారులకు 4 లక్షలు, ఒక్కొక్క కుమార్తెకు 1 లక్ష చొప్పున ముగ్గురు కుమార్తెలకు 3 లక్షలు లభిస్తాయి.

ఇలా పురుషునికి లభించే వాటాలో స్త్రీకి సగం లభిస్తుంది. ఇది ఆస్తిపంపిణీ విషయంలో ఇస్లాం నిర్దేశిస్తున్న సూత్రప్రాయమైన విషయం. దేవుని దృష్టిలో స్త్రీపురుషులిద్దరూ సమానమైనా ఈ ఆర్థిక వ్యత్యాసానికి ముఖ్యంగా మూడు కారణాలున్నాయి.

(1) కుటుంబపోషణ భారాన్ని ఇస్లాం పురుషుడి మీదనే మోపింది. భర్త సంపాదించకుండా సోమరిపోతులా తిరిగి లేదా సంపాదనంతా స్వార్థానికో, వ్యసనాలకో ఖర్చుచేసి భార్యాపిల్లల్ని నిర్లక్ష్యం చేస్తే ఇస్లామీయ ప్రభుత్వం అతని మీద చట్టపరమైన చర్య తీసుకుంటుంది. పరలోకంలోనూ దైవశిక్షకు గురికావలసి వస్తుంది.

(2) పురుషుడు ఒకేవంశానికి చెందినవాడైఉంటాడు. కాని స్త్రీ రెండు వంశాలకు చెందినదై ఉంటుంది. ఆమె ఇటు పుట్టింటి ఆస్తిలోనూ, అటు మెట్టింటి ఆస్తిలోనూ భాగస్తురాలవుతుంది. పురుషునికి తన వంశపు ఆస్తి మాత్రమే సంక్రమిస్తుంది.

(3) వివాహ సందర్భంలో స్త్రీకి వరుడి నుంచి మహర్ రూపంలో కొంతఆస్తి లభిస్తుంది. నేడు మన దేశంలో ముస్లింలు అతి ముఖ్యమైన ఈ దైవాజ్ఞను నిర్లక్ష్యం చేసి, సహవాసదోషంతో కట్నకానుకల రూపంలో వేలాది, కాదు లక్షలాది రూపాయలు నిలువుదోపిడి చేస్తున్నారు. ఇది తీవ్రమైన నేరం, ఘోరమైన పాపం.

ఈ విధంగా ఇస్లాం పుట్టింటి బంధువుల నుండి ఆస్తివాటా ద్వారా, భర్త నుండి మహర్ ద్వారా, మెట్టింటి బంధువుల నుండి ఆస్తివాటా ద్వారా స్త్రీకి మొత్తం మీద పురుషునితో పాటు ఆర్థిక సమానత్వం ప్రసాదించింది. ఈ కారణంగానే స్త్రీల వాటాను పురుషుల వాటా కంటే తక్కువగా నిర్ణయించబడింది.

ఆర్థిక రంగంలో మహిళల పట్ల ఇంతటి ఉదారత కనబరచిన ఖుర్ఆన్ మహత్తును గురించి కాస్త ఆలోచించాలి యోచనాపరులు. ఈ ప్రపంచంలోనే దైవం ప్రసాదించిన ప్రకృతి ధర్మాలు విస్మరించి కొందరు తమ సొంత ఆలోచనలతో మహిళా ఆర్థిక స్వాతంత్ర్యానికి సూచనలు చేస్తుంటే, మరికొందరు ముస్లింలు స్త్రీలకు రావలసిన చట్టపరమైన ఆస్తి హక్కుల్ని కూడా హరిస్తున్నారు.

పై ప్రాథమిక సూత్రం తరువాత వారసులు, వారికి రావలసిన ఆస్తి వాటాలను గురించి ఖుర్‌ఆన్ ఇలా వివరంగా పేర్కొంటోంది:

“(మృతునికి) ఇద్దరు లేక ఇద్దరికన్నా ఎక్కువమంది కుమార్తెలు ఉంటే, వారికి అతని ఆస్తిలో మూడింట రెండు వంతులు (2/3) లభించాలి. ఒకవేళ ఒకే కుమార్తె ఉంటే, ఆమెకు ఆస్తిలో అర్ధభాగం (1/2) లభించాలి.” (ఖుర్‌ఆన్-4:11)

మిగిలిన 1/3 వంతు లేక 1/2 అర్ధభాగం ఇతర వారసులకు లభిస్తుంది.

“మృతుడు సంతానం కలిగివున్నవాడైతే అతని తల్లిదండ్రులలో ప్రతి ఒక్కరికీ అతని ఆస్తిలో ఆరోవంతు (1/6) లభించాలి.” (ఖుర్‌ఆన్-4:11)

మిగిలిన 2/3 వంతు సంతానానికి లభిస్తుంది. మృతునికి ఒక్క కొడుకు మాత్రమే ఉండి ఇతర వారసులు ఎవరూ లేకుంటే, 2/3 వంతు ఆస్తి అంతా అతనికే దక్కుతుంది. ఇతర వారసులుంటే 2/3 భాగంలో వారివాటాలు పోగా మిగిలినది కొడుక్కు లభిస్తుంది. మృతునికి కొడుక్కు బదులు కూతురుండి ఇతర వారసులు ఎవరూ లేకుంటే, ఆమెకు 1/3 వంతు మాత్రమే లభిస్తుంది. మిగతా 1/3 వంతు తండ్రికి వస్తుంది. ఈవిధంగా తండ్రికి మొత్తం 1/6+1/3=1/2 వంతు లభిస్తుంది.

ఇక్కడ మరో విషయం వివరించడం సందర్భోచితంగా ఉంటుంది. మృతునికి ఒక భార్య, తండ్రి, ఒక కొడుకు మాత్రమే ఉన్నప్పుడు తండ్రికి 1/6 వంతు, భార్యకు 1/8 వంతు, కొడుక్కు 1-(1/6+1/8)= 17/24 వంతు ఆస్తి లభిస్తుంది. ఒకవేళ మృతునికి ఒక భార్య, తండ్రి, ఒక కూతురు మాత్రమే ఉన్నప్పుడు భార్యకు 1/8 భాగం, కూతురికి 1/2 భాగం, తండ్రికి 1-(1/8+1/2)=9/24 భాగం లభిస్తుంది.

“అతనికి సంతానం లేకుండా తల్లిదండ్రులే అతని వారసులైతే, తల్లికి మూడింట ఒక భాగం (1/3) ఇవ్వాలి.” (ఖుర్‌ఆన్-4:11)

ఈ సూక్తిలోని మిగిలిన 2/3 భాగం ఇతర వారసులు ఎవరూ లేనప్పుడు తండ్రికి లభిస్తుంది. ఇతర వారసులు ఉంటే 2/3 భాగంలో వారి వాటాలు పోగా మిగిలింది తండ్రికి లభిస్తుంది. అంటే మృతునికి తండ్రి, తల్లి, ఒక భార్య ఉన్నప్పుడు భార్యకు 1/4వంతు, తల్లికి 1/4వంతు, తండ్రికి 1-(1/4+1/4)=1/2 వంతు లభిస్తాయన్న మాట.

“మృతునికి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు కూడా ఉంటే, తల్లికి ఆరవ భాగం (1/6) రావాలి.” (ఖుర్‌ఆన్-4:11) ఈసూక్తిలో పేర్కొనబడిన తల్లివాటా ఆరవభాగం (1/6) పోగా మిగిలిన 5/6 భాగం తండ్రికి లభిస్తుంది. మృతుని తల్లిదండ్రులు జీవించివుంటే అతని అన్న దమ్ములకు, అక్కచెల్లెళ్ళకు ఎలాంటి వాటాలు లభించవు.

దైవప్రవక్త (స) ప్రవచనం: “మృతునికి తల్లి లేనిపక్షంలో అతని నాయనమ్మకు ఆరవభాగం (1/6) లభిస్తుంది.” (అబూదావూద్)



“మృతుడు రాసిపోయిన వీలునామా నెరవేర్చడంతో పాటు, అతను చేసిన అప్పులన్నీ తీర్చిన తరువాతనే ఈ వాటాలన్నీ పంచాలి.” (ఖుర్‌ఆన్-4:11)

ముందుగా అప్పులన్నీ తీర్చాలి. తరువాత మిగిలిన ఆస్తిలో 1/3 భాగం మేరకు మాత్రమే వీలునామా వర్తిస్తుంది.

“మీ తల్లిదండ్రులలో, మీ సంతానంలో ప్రయోజనరీత్యా ఎవరెక్కువ సన్నిహితులో మీకు తెలియదు. ఇవి దేవుడు నిర్ణయించిన వాటాలు. దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు, ఎంతో వివేచనాపరుడు.” (ఖుర్‌ఆన్-4:11)

“మీ భార్యలకు సంతానం లేనప్పుడు వారు వదలివెళ్ళిన ఆస్తిలో మీకు అర్ధ భాగం (1/2) లభిస్తుంది. సంతానం ఉంటే, మీకు నాల్గింట ఒక భాగమే (1/4) దక్కుతుంది. అయితే వారు రాసిన వీలునామా నెరవేర్చి, చేసిన అప్పులన్నీ తీర్చిన తరువాతే ఇలా జరగాలి.” (ఖుర్‌ఆన్-4:12)

“మీకు సంతానం లేకపోతే మీరు వదలిన ఆస్తిలో మీ భార్యలకు నాల్గోవంతు (1/4) వాటా లభిస్తుంది. సంతానం ఉంటే ఎనిమిదోవంతు (1/8) మాత్రమే దక్కుతుంది. మీరు రాసిన వీలునామా నెరవేర్చి, అప్పులన్నీ తీర్చడం జరిగిన తరువాతే ఈ వాటాలు లభిస్తాయి.” (ఖుర్‌ఆన్-4:12)

మృతునికి సంతానం జీవించి ఉన్నప్పుడు అతని మనవళ్ళకు, మనవరాళ్ళకు ఎలాంటి ఆస్తివాటాలు లభించవు. సంతానం జీవించి లేకుండా ఒక భార్య, ఒక మనవడు, ఒక మనవరాలు మాత్రమే ఉన్నప్పుడు భార్యకు 1/4 వంతు లభిస్తుంది. మిగిలిన 3/4 వంతులో మనవడికి, మనవరాలికి 2:1 నిష్పత్తిలో వాటాలు లభిస్తాయి. అంటే 1/2 వంతు మనవడికి, 1/4 వంతు మనవరాలికి లభిస్తాయన్నమాట.

భర్త వ్యాధిగ్రస్త స్థితిలో ఉండి భార్యకు తలాఖ్ ఇచ్చినప్పుడు ఇద్దత్ (మూడు రుతు కాలాల గడువు) ముగిసిపోకముందే అతను చనిపోతే అతని ఆస్తిలో చట్టప్రకారం భార్యకు లభించవలసిన వాటా లభిస్తుంది. ఒకవేళ ఆ వ్యాధిగ్రస్త భర్త ఇద్దత్ ముగిసిన తరువాత చనిపోవడం జరిగితే అతని ఆస్తి నుండి భార్యకు వాటా లభించదు.

భర్త వ్యాధిగ్రస్త స్థితిలో ఉన్నప్పుడు భార్య కోరికపై అతను విడాకులివ్వడం జరిగితే భర్త ఇద్దత్ ముగిసిపోక ముందు చనిపోయినా లేదా ఇద్దత్ ముగిసిన తర్వాత చనిపోయినా అతని ఆస్తిలో ఆమెకు వాటా మాత్రం లభించదు. ఒకవేళ భార్య తన వ్యాధిగ్రస్త భర్తకు ‘ఖులా’ ఇచ్చి దాన్ని ఆమోదింపజేసుకున్న తరువాత ఇద్దత్ గడువు ముగిసిపోక ముందే భర్త చనిపోవడం జరిగితే అతని ఆస్తిలో ఆమెకు వాటా లభిస్తుంది.

వ్యాధిగ్రస్త భర్త తనభార్యతో ‘నీవు ఇంటినుండి వెళ్ళిపోతే నీకు తలాఖ్’ అని చెప్పినా భార్య వినకుండా వెళ్ళిపోవడం జరిగితే ఆమెకు భర్త ఆస్తి నుండి వాటా లభించదు.

"పురుషునికి లేక స్త్రీకి సంతానంగాని, తల్లిదండ్రులుగాని లేకుండా ఒక సోదరుడో, ఒక సోదరియో ఉంటే వారిద్దరిలో ఒక్కొక్కరికి ఆరోవంతు (1/6) లభిస్తుంది. సోదరులు, సోదరీలు ఒకరి కంటే ఎక్కువమంది ఉంటే మొత్తం ఆస్తిలో మూడింట ఒకభాగం (1/3) వారికి లభిస్తుంది. అదైనా రాసిన వీలునామా నెరవేర్చి, అప్పులు తీర్చిన తర్వాతనే లభిస్తుంది. అయితే వీలునామా (ఎవరికీ) బాధాకరంగా ఉండరాదు. ఇది దేవుడు జారీచేస్తున్న ఆజ్ఞ. దేవుడు సర్వజ్ఞుడు; ఎంతో మృదుహృదయుడు." (4:12)

మిగిలిన 5/6 లేదా 2/3 భాగం ఇతర వారసులకు లభిస్తుంది. ఇతర వారసులు లేనప్పుడు మిగిలిన ఆస్తిని గురించి వీలునామా రాసే అధికారం మృతునికి ఉంది.

మృతునికి ఒక కూతురు, ఒక భార్య, ఒక సోదరి ఉన్నప్పుడు అతని ఆస్తిలో కూతురికి 1/2 భాగం, భార్యకు 1/8 భాగం, సోదరికి 3/8 భాగం లభిస్తాయి.

అలాగే మృతురాలికి భర్త, తల్లి, ఒక కూతురు, ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్న పక్షంలో ఆమె ఆస్తిలో భర్తకు 1/4 భాగం, తల్లికి 1/6 భాగం, కూతురికి 1/2 భాగం, సోదరుడికి 1/18 భాగం, సోదరికి 1/36 భాగం లభిస్తాయి.

"ఇవి దేవుడు నిర్ణయించిన పరిమితులు. దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులై నడచుకునేవారిని దేవుడు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అక్కడే వారు కలకాలం (సుఖంగా) ఉంటారు. ఇదే అసలు ఘనవిజయం. దీనికి భిన్నంగా దేవునికి, ఆయన ప్రవక్తకు అవిధేయులై, దేవుడు నిర్దేశించిన పరిమితుల్ని అతిక్రమించేవారిని ఆయన నరకాగ్నిలో పడవేస్తాడు. అక్కడే వారు ఎల్లకాలం పడిఉంటారు. వారికి అత్యంత అవమానకరమయిన శిక్ష సిద్ధంగా ఉంటుంది." (ఖుర్ఆన్-4:13,14)

ఈ సూక్తుల్లో దేవుడు నిర్ణయించిన పరిమితుల్ని (హద్దుల్ని) ఉల్లంఘిస్తే లేదా ఆయన నిర్ణయించిన ఆస్తి వాటాలను మార్చివేస్తే నరకశిక్ష విధించబడుతుందని హెచ్చరించడం జరిగింది. కాని నేడు ముస్లింలలో అనేకమంది దైవనిర్ణీత వాటాలను విస్మరిస్తూ వారసత్వపు ఆస్తిని కుమార్తెలకు ఇవ్వకుండా కుమారులకు మాత్రమే కట్ట బెడుతున్నారు. ఇదెంతో విచారకరమైన విషయం.

వితంతుస్త్రీ పునర్వివాహం చేసుకుంటే సాధారణంగా ఈనాటి ముస్లింలు కొందరు ఆమెకు మొదటి భర్త నుండి ధర్మశాస్త్రం ప్రకారం రావలసిన వారసత్వపు ఆస్తిని ఇవ్వడంలేదు. పునర్వివాహం చేసుకోకుండా ఉంటేనే వాటా ఇస్తున్నారు. ఒకవేళ ఆ వితంతు మహిళకు సంతానం లేకపోతే ఆస్తివాటా ఇవ్వకపోవడమే గాకుండా ఆమెను కట్టుబట్టలతో భర్తనుండి తరిమేయడం కూడా జరుగుతోంది. ఇది చాలా హేయమైన పాపకార్యం. వితంతు మహిళ పునర్వివాహం చేసుకున్నా, సంతానం లేకపోయినా సరే ఆమెకు మొదటి భర్త నుండి ఆస్తివాటా లభించితీరాలి.



అదేవిధంగా ఈనాడు కొందరు ముస్లింలు తమ సంతానంలో ఎవరైనా అవిధేయుడయి తాగుబోతుగా, వ్యభిచారిగా, జులాయిగా మారిపోతే అతనికి వారసత్వపు ఆస్తివాటా ఇవ్వరు. కొడుకు ఇలా దుర్గుణుడుగా మారిపోయినంత మాత్రాన అతనికి ఆస్తివాటా లేకుండా చేయడం సమంజసం కాదు. ఇతర సంతానంతో పాటు షరీఅత్ ప్రకారం అతనికీ చనిపోయిన తన తండ్రి నుండి ఆస్తివాటా లభించాలి. కొడుకు ఇస్లాం ధర్మాన్ని తిరస్కరించి మతభ్రష్టుడైపోతే లేదా తండ్రిని హత్యచేస్తే మాత్రం అతనికి తండ్రి ఆస్తి నుండి వాటా లభించదు.

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం ముస్లిం మేతరునికి వారసుడు కాలేడు. అలాగే ముస్లిమేతరుడు ముస్లింకు వారసుడు కాలేడు. అదేవిధంగా పితృహంతకుడు కూడా తన తండ్రికి వారసుడు కాలేడు.

పోతే రక్తసంబంధమైన సంతానం మాత్రమే తమ తల్లిదండ్రుల ఆస్తులకు వారసులవుతారు. సవతి కొడుకులు, సవతి కుమార్తెలు వారసులు కాలేరు. అలాగే ఎవరికైనా ఇద్దరు భార్యలున్నప్పుడు ఆ ఇద్దరి సంతానానికి తండ్రిఆస్తి నుండి వాటాలు లభిస్తాయి. అయితే ఆ సంతానంలో ఏ ఒక్కరికీ తమ సవతితల్లి ఆస్తి నుండి వాటా లభించదు. వారికి వారి కన్నతల్లుల ఆస్తుల నుండే వాటాలు లభిస్తాయి.

మృతునికి వారసులు ఎవరూ లేకపోతే అతని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు అతని వారసులవుతారు. వారికి అతని ఆస్తి నుండి వాటాలు లిభిస్తాయి. ఒకవేళ వారు కూడా లేకపోతే అతని మొత్తం ఆస్తి (Unclaimed Property)ని స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది.

అయితే ఒక హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలియజేశారు: "దైవప్రవక్త (సల్లం) బానిస ఒకతను స్వేచ్ఛపొందిన తరువాత (కొన్నాళ్ళకు) చనిపోయాడు. అతను కొంత ఆస్తి వదలి పోయాడు. కాని అతనికి సంతానంగాని ఇతర వారసులుగాని ఎవరూ లేరు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అతని ఆస్తిని అతని ఊళ్లోని (పేద) వ్యక్తి ఎవరికైనా ఇచ్చేయమని చెప్పారు." (తిర్మిజి, అబూదావూద్)

"ప్రజలు నిన్ను నిర్వారసుడి విషయంలో దైవాజ్ఞ ఏమిటని అడుగుతున్నారు. వారికి చెప్పు: దేవుడు మీకిలా తన ఆజ్ఞ విన్పిస్తున్నాడు- ఎవరైనా సంతానరహితుడుగా చనిపోతే, అతనికి ఒక సోదరి మాత్రం ఉంటే అతని ఆస్తిలో ఆమెకు అర్ధభాగం లభిస్తుంది. సోదరి సంతానం లేకుండా చనిపోతే ఆమె సోదరుడే ఆమె ఆస్తికి వారసుడవు తాడు. మృతునికి వారసులుగా ఇద్దరు సోదరీలు ఉన్నప్పుడు వారిద్దరికి అతని ఆస్తిలో మూడింట రెండువంతుల ఆస్తి లభిస్తుంది. అనేకమంది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు గనక ఉంటే స్త్రీలకు ఒకవాటా, పురుషులకు దానికి రెట్టింపు వాటా లభిస్తుంది."

"మీరు దారితప్పి తిరగకుండా ఉండేందుకే దేవుడిలా మీకు తన ఆజ్ఞల్ని విడమరచి తెలియజేస్తున్నాడు. ఆయన సమస్త విషయాలు ఎరిగినవాడు." (ఖుర్‌ఆన్-4:176)

# 99. దత్తస్వీకారం నిషిద్ధం

సాధారణంగా సంతానం లేని తల్లిదండ్రులు తమ బంధువుల నుంచో లేదా ఇతరుల నుంచో ఒక పిల్లవాడ్ని దత్తత తీసుకొని పెంచుకుంటారు. ఆ పెంపుడు కొడుకును కన్నకొడుకుగా భావించి బంధుత్వ సంబంధాలను ఏర్పరుస్తారు. పైగా తమ తదనంతరం తమ ఆస్తిపాస్తులకు వేరే కుటుంబాలకు పోకుండా ఉండేందుకు వాటిని దత్తకొడుక్కు కట్టబెడ్తారు. దీనివల్ల మృతుని అసలు వారసులయిన దగ్గరి బంధువులు, రక్తసంబంధీకులు తమకు దక్కవలసిన ఆస్తివాటాలను కోల్పోయేవారు. పైగా ఇది ఇస్లాం ఆర్థికవ్యవస్థ లక్ష్యమైన ధనవికేంద్రీకరణకు విరుద్ధం కూడా. అంచేత ఇస్లాం ఈ రెండు పద్ధతుల్ని నిషేధించింది.

ఇస్లాం ఆవిర్భవించిన ప్రారంభకాలంలో కొన్నేండ్ల వరకు అరేబియాలో ఈ దత్త స్వీకారపద్ధతి అమల్లో ఉండేది. దైవదౌత్యానికి పూర్వం మహనీయ ముహమ్మద్ (సల్లం) కూడా జైద్ బిన్ హారిస్ (రజ)ని దత్తపుత్రునిగా స్వీకరించారు. కాని ఆ తరువాత ఇది పకృతివిరుద్ధమైన అవాస్తవిక పద్ధతి అయినందున ఇస్లాం దీన్ని నిషేధించింది. పెంపుడు కొడుకు ఎన్నటికీ కన్నకొడుకు కాలేడు.

"ఆయన (దేవుడు) మీ పెంపుడు కొడుకుల్ని సొంత కొడుకులుగా చేయలేదు. ఇవన్నీ మీరు నోటికొచ్చినట్లు కల్పించుకున్న మాటలే. దేవుడు సత్యంతో కూడిన మాట చెబుతున్నాడు. ఆయనే మీకు సరైనమార్గం చూపేవాడు. పెంపుడు కొడుకుల్ని వారి కన్న తండ్రుల సంబంధంతోనే పిలవండి. ఇదే దేవుని దృష్టిలో న్యాయమైన విషయం. ఒకవేళ వారి కన్నతండ్రులెవరో మీకు తెలియకపోతే వారిని మీ ధార్మిక సోదరులుగా, స్నేహితులుగా పరిగణించండి." (ఖుర్‌ఆన్-33:4,5)

వారసత్వపు హక్కుల విషయంలో ఖుర్‌ఆన్ రక్తసంబంధంగాని, దాంపత్య సంబంధంగాని, దగ్గరిబంధుత్వంగాని లేనివారికి ఎలాంటి ప్రాముఖ్యం ఇవ్వలేదు. వారికి వారసత్వపు ఆస్తిలో ఎలాంటి వాటా ఉండదు. అలాగే వివాహం విషయంలో కూడా కన్నకొడుకుల భార్యలు మాత్రమే నిషిద్ధం, దత్తపుత్రుల భార్యలు కారని ఖుర్‌ఆన్ స్పష్టంగా పేర్కొన్నది.

పూర్వం అరేబియాలో తండ్రి చనిపోయిన తరువాత అతని మొదటిభార్య కొడుకు తన సవతి తల్లిని వివాహం చేసుకునే పద్ధతి ఉండేది. కాని పెంపుడు కొడుకు భార్య వింతంతు వయినప్పుడు లేక విడాకులు ఇవ్వబడినప్పుడు ఆమెను అతను చేసుకోవడం పెద్ద తప్పుగా భావించబడుతుండేది. ఖుర్‌ఆన్ ఈ రెండు దురాచారాలను నిషేధించింది.



"దైవగ్రంథం ప్రకారం రక్తసంబంధీకులే ఒకరికొకరు ఎక్కువ హక్కుదారులు. నిస్సందేహంగా దేవుడు ప్రతి విషయాన్నీ ఎరిగినవాడు." (ఖుర్‌ఆన్-8:75)

"కన్నకొడుకుల (వితంతువులైన లేక విడాకులు పొందిన) భార్యలు (అంటే కోడళ్ళు) కూడా మీకు నిషేధించబడ్డారు." (ఖుర్‌ఆన్-4:23)

కన్నకొడుకుల భార్యలు నిషేధించబడ్డారంటే, కన్నకొడుకుల భార్యలు మాత్రమే నిషేధించబడ్డారని, పెంపుడుకొడుకుల భార్యలు కాదని అర్థం.

ఈ వివరణ వల్ల బంధుత్వం, వారసత్వాల రీత్యా పెంపుడుకొడుకు ఎన్నటికీ సొంతకొడుకు కాలేడని, అతని భార్య సొంతకోడలు కాలేదని స్పష్టమవుతోంది. సంతానం లేనివారు అనేకమంది మాతృమమకారం, పితృపేమలను అణచుకోలేక బంధువుల నుంచో లేక ఏదైనా అనాథశరణాలయం నుంచో ఓ పిల్లవాడ్ని తెచ్చుకొని పెంచుకోవడం నేటికీ జరుగుతోంది. ఇది మంచి విషయమే. ఇందులో తప్పులేదు. పుణ్యంరీత్యా అనాథపిల్లవాడైతే మరీ మంచిది. ఏ ఇంట్లో అనాథ పట్ల మంచిగా ప్రవర్తించడం జరుగుతుందో ఆ ఇల్లు అన్నిటికంటే శ్రేష్ఠమైనదని దైవప్రవక్త (స) చెప్పారు.

అయితే పెంపుడుకొడుకు మూలంగా నిజమైన వారసులైన బంధువులకు వారి ఆస్తిహక్కులు దక్కనీయకుండా చేయడానికి వీల్లేదు. పెంపుడుకొడుక్కు ఇస్లామీయ చట్టం ప్రకారం అతని కన్న తండ్రి నుంచే ఆస్తి వాటా లభిస్తుంది. పోతే అనాథ అయితే అతడ్ని పెంచుకున్న వ్యక్తి తన ఆస్తిలో 1/3వంతును ఆ పెంపుడు కొడుక్కు సంక్రమింప జేస్తూ వీలునామా రాయవచ్చు. అయితే షరీఅత్ చట్టం ప్రకారం ఆ వీలునామా ఆస్తి వాటా 1/3 వంతుకు లోపే ఉండాలిగాని, దానికి మించకూడదు.

# 100. మహర్ (స్త్రీ ఆస్తి)

"మహర్" అనేది పురుషుడి నుండి స్త్రీకి సంక్రమించవలసిన ఆర్థికహక్కు. కనుక వధువుకు వరుడు మహర్ (వధుకట్నం) చెల్లించాలి. ఏదైనా కారణం వల్ల మహర్ వివాహ సమయంలో చెల్లించలేకపోతే ఆ తరువాతయినా వీలైనంత త్వరగా చెల్లించాలి. ఇది స్త్రీ ఆస్తిహక్కు. దాన్ని ఆమెకు తప్పకుండా ఇచ్చేయాలి. ఇవ్వకపోతే పురుషుడు ఘోరమైన పాపం చేసినవాడవుతాడు; ప్రళయదినాన పట్టుబడతాడు.

మహర్ త్వరగా చెల్లించకుండా ఏళ్ళతరబడి గడపడం మంచిది కాదు. అందునా రోజురోజుకు ధరలు పెరుగుతూ, రూపాయివిలువ తరుగుతున్న ఈరోజుల్లో మహర్ చెల్లింపులో జాప్యం చెయ్యడమంటే భార్యహక్కును తొక్కిపట్టడమే. స్త్రీ హక్కును త్వరగా నెరవేర్చినప్పుడే పురుషుడు స్త్రీతో కాపురం చేయడానికి అర్హుడవుతాడు.

ఇస్లాం ప్రకారం స్త్రీకి తన తండ్రి నుంచి తన సోదరునికి లభించే ఆస్తివాటాలో సగమే లభిస్తుంది. మిగతా సగం మహర్ రూపంలో భర్త నుండి లభిస్తుంది. ఈ

మహర్ వివాహసందర్భంలో ఇవ్వలేకపోతే ఆ తరువాత ఎప్పటికైనా భర్త దాన్ని అప్పుగా భావించి తన భార్యకు ఇవ్వవలసిందే. వివాహంలో మహర్ చెల్లింపు కూడా ఒక షరతుగా ఉంది. ఈ షరతు పాటించనిదే వివాహం కాదు. మహర్‌ని గురించి ఖుర్‌ఆన్ ఇలా చెబుతోంది:

"స్త్రీలకు లభించవలసిన మహర్ (వధు కట్నం)ను (విధిగా భావించి) వారికి సంతోషంగా ఇచ్చివేయండి. అయితే వారు గనక సంతోషంగా కొంత మహర్ మాఫీచేస్తే దాన్ని మీరు నిరభ్యంతరంగా అనుభవించవచ్చు." (ఖుర్‌ఆన్-4:4)

"మీరు వారి వల్ల అనుభవించే దాంపత్య సుఖానికిగాను వారికి చెల్లించవలసిన నిర్ణీత మహర్‌ధనాన్ని విధిగా భావించి చెల్లించాలి." (ఖుర్‌ఆన్-4:24)

కాని స్త్రీధనం విషయంలో నేటి ముస్లింల పరిస్థితి చాలా శోచనీయంగా ఉంది. ఎంతో నాగరికత అభివృద్ధి చెందిన నేడు కూడా స్త్రీలకు ఇవ్వడానికి బదులు స్త్రీల నుండే పురుషులు కట్నాలు-కానుకల రూపంలో లక్షలు గుంజుతూ వారి జీవితాలను దుర్భరం చేస్తున్నారు. దస్తావీజుల్లో మటుకు మహర్ చెల్లిస్తామని వ్రాయిస్తారు. కాని ఆ స్త్రీ చనిపోయే వరకూ ఇవ్వరు. స్త్రీకి ముందు పురుషుడు చనిపోతే మహర్ పైకం మాఫీ చేయమని ఆమెపై బంధువులు వత్తిడి చేస్తారు. శోకమూర్తి అయిన ఆ స్త్రీ భర్తకు చెల్లించాల్సిన మహర్‌ను మాఫీ చేయడం తప్ప గత్యంతరం ఉండదు.

పోతే పురుషుడు పెళ్ళయిన తరువాత భార్యకు ఇచ్చిన నగలు తదితర కానుకల్ని తనవిగా భావించి దుర్వినియోగం చేయకూడదు.

"విశ్వాసులారా! బలవంతంగా స్త్రీల (ఆస్తి)కి వారసులై పోవడం మీకు ధర్మ సమ్మతం కాదు. అలాగే మీరు మీ భార్యలకిచ్చిన మహర్ ధనంలో కొంతభాగం కాజేసే ఉద్దేశ్యంతో వారిని వేధించడం కూడా మీకు భావ్యంకాదు." (ఖుర్‌ఆన్-4:19)

మహర్ సొత్తు, ఇతర కానుకల రూపంలో పురుషుడు స్త్రీకి ఎంత పెద్ద ధనరాసి ఇచ్చి ఉన్నా అవన్నీ ఆమె సొంత ఆస్తుల క్రిందికి వస్తాయి. వాటిని పురుషుడు మళ్ళీ తీసుకోకూడదు. అలాగే మహర్‌కు పరిమితి విధించి అంతే చెల్లించాలని షరతులు పెట్టడానికి కూడా ఎవరికీ అధికారం లేదు.

"మీరు గనక ఒకభార్య స్థానంలో మరొక భార్యను చేసుకోవడానికి నిర్ణయించుకుంటే, మొదటి భార్యకు మీరు (మహర్‌గా) ఎంతపెద్ద ధనరాసి ఇచ్చివున్నా దాన్ని ఎలాంటి పరిస్థితిలోనూ మళ్ళీ తీసుకోరాదు. మీరామెపై నీలాపనిందలు వేసి, మరీఅంత అన్యాయంగా దాన్ని తిరిగి తీసుకుంటారా? (ఎంత సిగ్గుచేటు!) మీరిద్దరు ఒకరి ద్వారా మరొకరు సుఖం అనుభవించారు. ఆమె మీదగ్గర (వివాహం ద్వారా) గట్టివాగ్దానం తీసుకుంది. అలాంటప్పుడు మీరామె ధనాన్ని బలవంతంగా ఎలా తీసుకుంటారు?" (ఖుర్‌ఆన్-4:20,21)



మహర్ చెల్లింపు విషయంలో దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ఎగవేసే ఉద్దేశ్యం పెట్టుకొని మహర్ కింద కొంత పైకం చెల్లించే ఒప్పందంతో ఏదైనా స్త్రీని వివాహమాడిన పురుషుడు వాస్తవంగా ఒక వ్యభిచారి. అప్పు తీసుకొని తిరిగి చెల్లించే ఉద్దేశ్యం లేనివాడు వాస్తవంగా ఒక దొంగ." (హదీసు)

ముస్లిమేతరుల్లో ఎవరైనా వివాహితులు ఇస్లాం స్వీకరిస్తే వారి పూర్వపు భార్య లేక భర్తతో సంబంధం తెగిపోతుంది. అలాంటివారు ముస్లింలను వివాహమాడటం జరిగినప్పుడు వారి మహర్ సమస్యను ఖుర్‌ఆన్ ఈవిధంగా పరిష్కరిస్తుంది:

"విశ్వాసులారా! విశ్వసించిన స్త్రీలు, హిజ్రత్ (వలస) చేసి మీ దగ్గరకు (మదీనా) వచ్చినప్పుడు (వారి విశ్వసనీయతను) మీరు ఓసారి పరీక్షించుకోండి. నిజానికి వారి విశ్వాసస్థితి దేవునికే బాగా తెలుసు. వారు నిజమైన విశ్వాసులే అని మీరు నిర్ధారించుకుంటే వారిని అవిశ్వాసుల దగ్గరికి తిప్పిపంపకండి. వారు అవిశ్వాసులకు (భార్యలుగా) ధర్మసమ్మతం కాలేరు. అవిశ్వాసులు కూడా వారికి (భర్తలుగా) ధర్మసమ్మతం కాలేరు. ఆ స్త్రీలకు ఇవ్వబడిన మహర్‌ని వారి (భర్తల)కి తిరిగి ఇచ్చివేయండి. అప్పుడు మీరు ఆ స్త్రీలకు మహర్ చెల్లించి వారిని వివాహమాడవచ్చు. అందులో ఎలాంటి తప్పు లేదు."

"స్వయంగా మీరు కూడా అవిశ్వాసులయిన స్త్రీలను మీ వైవాహిక బంధంలో అట్టే ఆపి ఉంచకండి. అవిశ్వాసులైన మీ భార్యలకు మీరిచ్చిన మహర్ ధనాన్ని అడిగి తీసుకోండి. అలాగే అవిశ్వాసులు కూడా తమ ముస్లింభార్యలకు లోగడ ఇచ్చిన మహర్ ధనాన్ని వారి నుండి అడిగి తీసుకోవచ్చు. ఇది దైవాజ్ఞ. దేవుడు మీమధ్య (ఈవిధంగా) తీర్పు చేస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు. ఎంతో వివేకవంతుడు."

"ఒకవేళ మీరు (అవిశ్వాసులైన) మీభార్యలకు ఇచ్చిన మహర్ అవిశ్వాసుల నుండి మీకు తిరిగి లభించని పక్షంలో, మీవంతు వచ్చినప్పుడు, అవిశ్వాసులకు మీరు చెల్లించవలసిన ధనాన్ని (వారికి అందజేయకుండా) ఇటు మహర్ నష్టపోయినవారికి ఇచ్చివేయండి. మీరు విశ్వసించిన దేవునికి భయపడుతూ మసలుకోండి." (60:10,11)

స్త్రీ విడాకులు ఇవ్వబడినప్పుడుగాని, వితంతువయి నప్పుడుగాని నిర్ణీత కాలలకు ఆమెకు భర్త లేదా భర్త తరపు బంధువులు తగిన జీవనభృతి ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని గురించి దివ్య ఖుర్‌ఆన్ ఈవిధంగా చెబుతోంది:

"మీలో ఎవరికైనా మరణకాలం ఆసన్నమైనప్పుడు వారి భార్యలు జీవించివుంటే, ఒక ఏడాదిపాటు వారి (పోషణ) ఖర్చులు భరించాలని, ఇంటినుండి వెడలగొట్టరాదని వారు (తమ వారసులకు) విల్లు రాసిపోవాలి. ఆ స్త్రీలు తమంతటతాము ఇంటి నుండి వెళ్ళిపోయి తమకు నచ్చిన పని (పునర్వివాహం) ధర్మసమ్మతంగా చేసుకోదలిస్తే దానికి మీపై ఎలాంటి బాధ్యత ఉండదు. దేవుడు సర్వశక్తిమంతుడు, ఎంతో వివేచనా పరుడు." (ఖుర్‌ఆన్2:240)

"విడాకులు పొందిన మహిళలకు కూడా సముచిత రీతిలో జీవనభృతి ఇచ్చి పంపాలి. ఇది దైవభీతిపరులు నెరవేర్చవలసిన విధ్యుక్తధర్మం. మీరు విషయాన్ని అర్థం చేసుకుంటారని దేవుడు ఈవిధంగా తన ఆజ్ఞలను మీకు విడమరచి బోధిస్తున్నాడు." (ఖుర్ఆన్2:241,242)

# 101. సమరసొత్తు (అన్ఫాల్, ఫై)

యుద్ధంలో శత్రువర్గం ఓడి పారిపోతూ యుద్ధమైదానంలో వదలిపెట్టిన వివిధ వస్తుసంపదను "సమరసొత్తు" అంటారు. ఇది విజేతవర్గానికి లభిస్తుంది. అయితే ఈ సమరసొత్తులో యుద్ధంలో పాల్గొన్న సైనికులతో పాటు ప్రభుత్వానికి కూడా వాటా ఉంటుంది. ప్రభుత్వం దాన్ని పేదలకు, ఇతర ప్రజాసంక్షేమకార్యాలకు వినియోగిస్తుంది. ఈ పద్ధతి పూర్వం నుంచీ వస్తోంది. ఖుర్ఆన్‌లో యుద్ధప్రస్తావన సందర్భంలో అవతరించిన ఈ సూక్తులు చూడండి:

"ముహమ్మద్ (సల్లం)! వారు నిన్ను సమర సొత్తు గురించి అడుగుతున్నారు. వారికి చెప్పు: ఈ సమరసొత్తు దేవునికి, ఆయన ప్రవక్తకు మాత్రమే చెందుతుంది. కనుక మీరు నిజమైన విశ్వాసులైతే (అన్నిటికన్నా ముందు) దేవునికి భయపడి మీ పరస్పర సంబంధాలు మెరుగుపరచుకోండి; దేవునికి, ఆయన ప్రవక్తకు పూర్తిగా విధేయులై మసలుకోండి." (ఖుర్ఆన్–8:1)

యుద్ధంలో శత్రువులు ఓడిపోయి చావడమో, పారిపోవడమో జరిగిన తరువాత వారు వదలి వెళ్ళిన సామగ్రిని విజేతలు హస్తగతం చేసుకుంటారు. దీన్నే సమరసొత్తు (అన్ఫాల్ లేక మాలెగనీమత్) అంటారు. ఈ సమరసొత్తులో ఆయుధాలు, ఆహార వస్తువులు, వాహనాలు, వస్త్రాలు తదితర సామగ్రితో పాటు యుద్ధ ఖైదీలు కూడా ఉంటారు. ఇదంతా సమరసొత్తుగా విజేత వర్గానికి దక్కుతుంది. ఈ సమరసొత్తును ఇస్లామీయ రాజ్యాధినేత దైవనిర్ణీత వాటాల ప్రకారం పంపిణీ చేస్తాడు.

"సత్యాన్ని నిరాకరించినవారు దైవమార్గం నుండి (ప్రజలను) నిరోధించే కార్యకలాపాల కోసం తమ ధనాన్ని వెచ్చిస్తున్నారు. ఇకముందు కూడా మరింత వెచ్చిస్తారు. అయితే చివరికి ఈ (పైశాచిక) కార్యకలాపాలే వారి పశ్చాత్తాపానికి కారణ మవుతాయి. ఆ తర్వాత వారు (మాకు) లొంగిపోతారు. ఆపై ఈ తిరస్కారులు నరకం వైపు తోలబడతారు. పరిశుభ్రత నుండి మాలిన్యాన్ని వేరుచేసి, ఆ మాలిన్యాలన్నిటిని ఒకదానిపై ఒకటి కుప్పగాపోసి, ఆ కుప్పను నరకంలో పడవేయడానికే దేవుడిలా చేస్తున్నాడు. ఇలాంటివారే నష్టపోయేవారు." (ఖుర్ఆన్–8:36,37)

"మీకు లభించిన సమరసొత్తులో అయిదో వంతు దేవునికి, ఆయన ప్రవక్తకు, బంధువులకు, అనాథ బాలలకు, నిరుపేదలకు, బాటసారులకు చెందినదని తెలుసు కోండి. మీరు దేవుణ్ని, (సత్యాసత్యాలను) వేరుచేసిన రోజు, అంటే రెండుసైన్యాలు



పరస్పరం ఢీకొన్న రోజు మేము మా దాసునిపై అవతరింపజేసినదాన్ని విశ్వసించిన వారైతే (ఈ అయిదో వంతు సమరసొత్తు సంతోషంగా ఇచ్చేయండి)." (ఖుర్ఆన్–8:41)

ఈ అయిదోవంతు 1/5 సమరసొత్తు ప్రజాసంక్షేమకార్యాల వినియోగం కోసం ప్రభుత్వధనాగారంలో జమ అవుతుంది.

పోతే యుద్ధం జరగకుండా శత్రువర్గం లొంగిపోయి ఏదైనా ఒప్పందం చేసు కున్నప్పుడు ఆ ఒప్పందం ప్రకారం ఇస్లామీయ రాజ్యానికి లభించే సంపదను షరీఅత్ పరిభాషలో "ఫై" అంటారు. అలాగే యుద్ధం జరగకుండానే శత్రువులు పారిపోయి కోల్పోయిన భూభాగం కూడా ఇస్లామీయ రాజ్యం అధీనంలోకి వస్తుంది. అలాంటి భూభాగంలోని సంపద కూడా "ఫై" క్రిందికే వస్తుంది. ప్రభుత్వం ఇలాంటి సంపదను సైనికులకు పంచకుండా దాన్ని దైవనిర్ణీత పద్దుల క్రింద ఖర్చుపెడుతుంది. వాటి వివరాలు ఖుర్ఆన్‌లో ఈవిధంగా ఉన్నాయి:

"దేవుడు వారి అధీనం నుండి తీసి తన ప్రవక్తకు హస్తగతం చేసిన సిరిసంపదలు, నిజానికి (యుద్ధంలో) మీరు గుర్రాలు, ఒంటెల్ని పరుగెత్తించి సాధించిన సిరిసంపదలు కావు. దేవుడు తన ప్రవక్తలకు తాను కోరిన వారిపై ఆధిక్యతనిస్తాడు. ఆయన ప్రతి పనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడు. దేవుడు ఈ వాడవాసుల నుండి తన ప్రవక్తకు అధీనంచేసిన ధన(కనక)వస్తు సంపదల్లో దేవునికి, దైవప్రవక్తకు, బంధువులకు, అనాథ లకు, పేదలకు, బాటసారులకు హక్కుంది. ధనం (ఎల్లప్పుడూ) మీలోని ధనికవర్గంలోనే కేంద్రీకృతమై ఉండరాదన్న లక్ష్యంతో ఈ విధానం నిర్ణయించబడింది." (59:6,7)

"(మక్కాలోని) తమ ఇండ్ల నుండి, తమ ఆస్తిపాస్తుల నుండి వెడలగొట్టబడిన పేద కాందిశీకులకు కూడా (ఆ సంపదలో) హక్కుంది. వారు దేవుని అనుగ్రహాన్ని, ఆయన ప్రసన్నతను ఆశిస్తూ దేవునికి, ఆయన ప్రవక్తకు అన్ని విధాలా మద్దతు నివ్వడానికి నడుం బిగించారు. వారే సత్యసంధులు, సన్మార్గగాములు." (59:8)

"ఈ కాందిశీకులు రాక పూర్వమే (ఇస్లాం ధర్మాన్ని) విశ్వసించి (మదీనా)పట్టణంలో నివసిస్తున్నవారికి కూడా (ఆ సంపదలో) హక్కుంది. (మక్కానుండి) తమ దగ్గరకు (మదీనా) వలసవచ్చిన వారిని వీరు అభిమానిస్తున్నారు. వీరికి ఏదిచ్చినా అది తమకు అవసరమని వీరు తమ హృదయాల్లో సైతం ఆకాంక్షించరు. వారు నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తారు. పేరాశ, పిసినారితనాల నుండి రక్షించ బడినవారే ధన్యులు." (59:9)

"పోతే వీరందరి తరువాత (ఇస్లాంలోకి) వచ్చినవారికి కూడా (ఆ సంపదలో హక్కుంది). వారిలా ప్రార్థిస్తారు: "ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందర్నీ క్షమించు. విశ్వాసుల పట్ల మాహృదయాల్లో ఎలాంటి అసూయాద్వేషాలు ఉంచకు. ప్రభూ! నీవు గొప్ప క్షమాశీలివి, అపార దయామయుడవు". (59:10)

**జిజ్యా (భద్రతారుసుం):** శత్రుదేశం యుద్ధం చేయకముందే ఇస్లాం సేనలకు లొంగిపోయి నిర్యుద్ధ ఒడంబడిక చేసుకుంటే ఆ దేశం ఇస్లామీయ రాజ్యానికి ప్రతి ఏడూ కొంత పన్ను కట్టవలసి ఉంటుంది. ఇది సామంతరాజులు తమ విజేత చక్రవర్తికి చెల్లించే కప్పం లాంటిది. దీన్ని షరీఅత్ పరిభాషలో "జిజ్యా" అంటారు.

"గ్రంథప్రజల్లో కూడా దేవుడ్ని, అంతిమదినాన్ని విశ్వసించనివారితో యుద్ధం చేయండి. దేవుడు, ఆయనప్రవక్త నిషేధించినవాటిని వారు నిషేధితాలుగా పరిగణించడం లేదు. సత్యధర్మాన్ని తమ జీవనధర్మంగా చేసుకోవడం లేదు. కనుక వారు మీకు పూర్తిగా లొంగిపోయి తమ చేతులారా జిజ్యా చెల్లించనంతవరకూ వారితో పోరాడండి." (9:29)

జిజ్యా అంటే, ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులు తమ మతాచారాలు (పర్సనల్ లా) పాటించడానికి పొందే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు, విదేశీశక్తుల దాడుల నుంచి ప్రభుత్వం కల్పించే రక్షణకు ప్రతిఫలంగా ఇస్లామీయ ప్రభుత్వానికి ప్రతియేటా చెల్లించవలసిన "భద్రతా రుసుం" అన్నమాట. ఇమాం అబూయూసుఫ్ (రహ్మలై) ప్రకారం ముస్లిమేతరుల్లో స్తోమత కలిగిన పురుషులు మాత్రమే జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, అంధులు, సన్యాసులు, దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు జిజ్యా చెల్లింపు నుండి మినహాయించబడ్డారు.

దీనికి భిన్నంగా ఆర్థికస్తోమత కలిగిన ప్రతి ముస్లిం జకాత్ విధిగా ప్రభుత్వానికి చెల్లించాలి. స్త్రీలైనా, పిల్లలైనా, వృద్ధులైనా, వికలాంగులైనా, సరేస్థితిపరులై ఉంటే చాలు, జకాత్ చెల్లించవలసిందే. అంతేకాదు, విదేశీశక్తుల నుండి ప్రమాదం ఎదురైనప్పుడు శారీరకశక్తి ఉండే ప్రతిముస్లిం పురుషుడు తప్పక యుద్ధంలో పాల్గొనాలి. ముస్లిమేతరులు ఆ యుద్ధంలో పాల్గొనవసరం లేదు. ముస్లిమేతరులు జిజ్యా చెల్లిస్తున్నందున వారికి రక్షణ చేకూర్చడానికి ముస్లింలే విదేశీశక్తులతో పోరాడాలి.

ప్రఖ్యాత యూద పండితుడు జర్జి జైదాన్ "ఇస్లామీయ సంస్కృతీ చరిత్ర" అనే తన గ్రంథంలో 'జిజ్యా' ను గురించి రాస్తూ ఇలా పేర్కొన్నాడు:

"ముస్లింలు యర్మూక్ యుద్ధంలో శత్రువులతో తలపడవలసిన పరిస్థితి రాక ముందు వరకూ హమాస్ పట్టణం ముస్లింల అధీనంలోనే ఉండేది. అయితే వారు పరిస్థితి గమనించి హమాస్‌వాసుల నుండి లోగడ వసూలుజేసిన జిజ్యా హమాస్ వాసులకు తిరిగి ఇచ్చివేస్తూ- 'మేమిప్పుడు పెద్దసమస్య (యుద్ధం)లో చిక్కుకున్నాం. ఈ పరిస్థితిలో మేము మీకు రక్షణ కల్పించలేం. అందువల్ల మీకు ఇష్టమైన రీతిలో మీరంతట మీరే స్వీయరక్షణ ఏర్పాట్లు చేసుకోండి' అన్నారు. హమాస్ వాసులు ఈ మాటలు విని 'మేమింతకు ముందు అనుభవించిన దౌర్జన్యాలకన్నా మీ రాజ్యం, మీ న్యాయదృష్టే మాకెంతో ప్రియమైనవి. మేము మీ యోధులతో కలసి హమాస్ పట్టణాన్ని హెర్క్యులస్ సేనల నుండి కాపాడుతాం' అని చెప్పారు."



# 102. పాప పరిహారం

రక్తపరిహారం, నష్టపరిహారం, పాపపరిహారాలు కూడా ధనవికేంద్రీకరణలోని భాగాలే. ఈ పరిహారాల ద్వారా కూడా ధనం ఒకరి నుండి మరొకరికి సంక్రమిస్తుంది.

దేవుడు ధర్మసమ్మతం చేసిన విషయాలకు వ్యతిరేకంగా ప్రమాణం చేయడం అధర్మకార్యం అవుతుంది. ఉదాహరణకు తినడానికి దేవుడు ధర్మసమ్మతం చేసిన కొన్ని ఆహారపదార్థాలను జీవితంలో ఇక ఎన్నటికీ తినము అని ప్రమాణం చేయడం; లేదా ప్రాపంచిక సుఖాలు పూర్తిగా త్యజించి ఎల్లప్పుడు దైవారాధనలోనే జీవితం గడుపుతామని ప్రమాణం చేయడం. ఇలాంటి పనులకు పాల్పడేవారు తప్పు తెలిసిన తరువాత వాటికి పాపపరిహారం చెల్లించవలసి ఉంటుంది.

"మీరు చేసే అర్థం పర్థంలేని ఉత్తుత్తి ప్రమాణాలను గురించి దేవుడు మిమ్మల్ని పట్టుకోడు. కాని బుద్ధిపూర్వకంగా చేసే ప్రమాణాల విషయంలో మాత్రం ఆయన మిమ్మల్ని తప్పకుండా నిలదీస్తాడు. (బుద్ధిపూర్వకంగా ఏదైనా తప్పుడు ప్రమాణం చేసి వుంటే) దానికి నిష్కృతి- మీరు మీ భార్యాపిల్లలకు పెట్టేటటువంటి సగటు రకం భోజనం పదిమంది పేదలకు పెట్టాలి, లేదా బట్టలు ఇవ్వాలి, లేదా ఒక బానిసకు స్వేచ్ఛ కలిగించాలి. ఇవేమీ లేనివారు మూడు రోజులు ఉపవాసం పాటించాలి." (ఖుర్ఆన్-5:89)

దేవుడు ధర్మసమ్మతం చేసిన వస్తువుల్ని, విషయాల్ని నిషేధించుకునే అధికారం ఎవరికీ లేదని ఈసూక్తి స్పష్టంచేస్తోంది. ఆత్మవికాసం కొరకు పరిశుద్ధ పదార్థాలను, దాంపత్యసుఖాన్ని ప్రాపంచిక సౌఖ్యాలను త్యజించడం ఇస్లాంలో పాపం.

అలాగే మరొక విధమైన పాపపరిహారం గురించి ఈ క్రింది సూక్తి గమనించండి:

"ఉపవాసం పాటించే శక్తి ఉండి కూడా దానిని పాటించనివారు మాత్రం పాప పరిహారం చెల్లించవలసి ఉంటుంది. ఒక ఉపవాస దినానికి పరిహారంగా ఒక నిరుపేదకు భోజనం పెట్టాలి. (ఈ విషయంలో) ఎవరైనా తమంతట తాము సంతోషంగా మరింత పుణ్యం చేయదలచుకుంటే అది వారికే మేలు చేకూర్చుతుంది." (ఖుర్ఆన్-2:184)

ఈ సూక్తిలోని విషయం ఉపవాసం గురించి అవతరించిన మొట్టమొదటి ఆజ్ఞ. ఇందులో శక్తి ఉండి కూడా ఉపవాసం పాటించని వ్యక్తి నిరుపేదలకు అన్నదానం చేస్తే సరిపోతుందని చెప్పబడింది. అయితే ఆ తర్వాత సూక్తిలో రమజాన్ ఉపవాసాలు శక్తి కలిగినవారు విధిగా పాటించాలని ఆజ్ఞయింది.

రమజాన్ ఉపవాసాలు పాటించే శక్తిలేని వృద్ధులు, శాశ్వత రోగగ్రస్తులు ఒక ఉపవాసానికి పరిహారం (ఫిదియా)గా ఒక నిరుపేదకు రెండు పూటలు కడుపునిండా తిండిపెట్టాలి లేదా ఫిత్రాదానం పరిమాణమంత (1.75 కిలోల) గోధుమలుగాని, దాని ధరనుగాని పేదలకివ్వాలి. ఇలా ఆ నెలమొత్తం ఉపవాసాలకు పరిహారం ఇవ్వాలి.

ఒకవేళ ఎవరైనా ఉపవాసం ఉండి పొరపాటున తన భార్యను కలుసుకోవడం జరిగితే అలాంటి మనిషి దానికి పాపపరిహారం (కప్ఫారా)గా రెండు నెలలపాటు నిరంతరాయంగా ఉపవాసాలు పాటించాలి లేదా పైన చెప్పబడిన విధంగా పాప పరిహారం చెల్లించాలి. ఒకవేళ ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా ఒక ఉపవాసం భంగపరిస్తే అతను ఆ ఒక్క ఉపవాసానికే పాపపరిహారంగా రెండునెలలు ఉపవాసం పాటించడం గాని లేదా పైన పేర్కొనబడిన విధంగా పాపపరిహారం చెల్లించడంగాని చేయాలి.

దాంపత్యజీవితంలో చేసే కొన్ని తప్పులకు కూడా పాపపరిహారం చెల్లించవలసి ఉంటుంది. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"ఎవరు తమ భార్యల్ని తల్లుల వంటివారని చెప్పి వారి పట్ల దాంపత్య విచ్ఛిన్న వైఖరి అవలంబిస్తారో వారు (తప్పు తెలుసుకున్న తరువాత) దాంపత్య సంబంధాన్ని పునరుద్ధరించుకోవడానికి సిద్ధమైనప్పుడు, దంపతులు పరస్పరం కలుసుకోక ముందే (భర్త) ఒక బానిసకు విముక్తి కలిగించాలి. దీనిద్వారా మీకు హితోపదేశం చేయబడు తోంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు. ఒకవేళ బానిస లేకపోతే, ఇద్దరు కలుసుకోక ముందే అతను రెణ్ణెల్లు నిరంతరాయంగా ఉపవాసం పాటించాలి. అదీ చేయలేకపోతే అరవై మంది పేదలకు అన్నదానం చేయాలి." (ఖుర్‌ఆన్-58:3,4)

పై సూక్తులలో ప్రస్తావించబడపిన ఈ స్త్రీ పేరు హజ్రత్ ఖౌలా బిన్త్ సాలబా (రజి). అజ్ఞానకాలంలో అరబ్బులు తమభార్యలతో పోట్లాడి వారిని వదిలించుకోవడానికి "నువ్వు నాకు తల్లివంటిదానవు" అని చెప్పేవారు. దీన్ని షరీఅత్ పరిభాషలో "జిహార్" అంటారు. హజ్రత్ ఖౌలా (రజి)కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఆమె దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి, భర్త దూరమయితే తాను చిక్కుల్లో పడవలసి వస్తుందని, తన పిల్లలు నాశనమవుతారని విన్నవించుకున్నారు. దేవుడు ఈ వైఖరిని గర్హించాడు. ఆ తరువాత అలాంటి భర్త పైన పేర్కొన్నట్లు పాపాపరిహారం చెల్లించాలని ఆజ్ఞవుతుంది.

హజ్‌యాత్ర సందర్భంగా ఎవయినా అవాంఛనీయమైన పనులు జరిగిపోతే వాటికి కూడా పాపపరిహారం చెల్లించవలసి ఉంటుంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు కూడా గమనించండి:

"దేవుని ప్రసన్నత కోసం హజ్‌యాత్ర చేయండి. ఉమ్రా ఆచారం కూడా పాటించండి. మార్గమధ్యలో మీకేదైనా అవరోధం ఎదురైతే, మీకు అందుబాటులో ఉన్న బలిదానాన్నే దేవునికి సమర్పించుకోండి. అయితే బలి (పశువు) దానం, దాని స్థానానికి చేరుకోనంత వరకు మీరు శిరోముండనం చేయించుకోకండి. ఒకవేళ మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులైతే లేదా శిరోబాధకు లోనయి (బలిపశువు నిర్ణీతస్థలానికి చేరుకోకముందే) శిరోముండనం చేయించుకోవలసివస్తే దానికి పరిహారంగా ఉపవాసవ్రతం పాటించాలి; లేదా దానధర్మాలు చేయాలి; లేదా బలిదానం (ఖుర్బాని) ఇవ్వాలి." (ఖుర్‌ఆన్-2:196)



"విశ్వాసులారా! మీరు హజ్‌దీక్ష (ఇహ్రాం)లో ఉన్నప్పుడు వేటాడకండి. ఒకవేళ ఎవరైనా కావాలని ఇలా చేస్తే అతను తాను వేటాడిన జంతువుకు సమానమైన మరో జంతువును సమర్పించి మొక్కుబడి చెల్లించవలసి ఉంటుంది. దీన్ని గురించి మీలో ఇద్దరు నిజాయితీపరులు నిర్ణయం తీసుకోవాలి. తరువాత ఈ (బలిపశువు) కానుకను కాబాగృహానికి చేర్చాలి. అలాంటి మొక్కుబడి చెల్లించే స్తోమత లేనివారు తమపాపానికి నిష్కృతిగా కొందరు పేదలకు అన్నదానం చేయాలి. లేదా దానికి సమానమైన ఉపవాసాలు పాటించాలి. ఈ విధంగా వారు తాము చేసిన నేరానికి శిక్ష అనుభవించాలి. గతంలో చేసిన దాన్ని దేవుడు క్షమిస్తాడు." (ఖుర్‌ఆన్-5:95)

## 103. రక్త పరిహారం

కొన్ని నేరాలకు ఇస్లామీయ షరీఅత్‌లోనే గాకుండా ప్రపంచదేశాలకు సంబంధిం చిన చట్టాలలో కూడా శిక్షలు ఉంటాయి. వీటిని "లా ఆఫ్ ది ల్యాండ్" అంటారు. ఇలాంటి చట్టాలు ఇస్లామీయ రాజ్యంలో కూడా ఉంటాయి. ఈ శిక్షలలో కొన్ని జరిమా నాల రూపంలో కూడా ఉంటాయి. ఉదాహరణకు ఇక్కడ హత్యానేరాన్ని తీసుకుందాం. హత్య పొరపాటున చేసినా లేక ఉద్దేశ్యపూర్వకంగా చేసినా శిక్ష ఒకటే.

"విశ్వాసులారా! మీకోసం హత్య వ్యవహారాలకు సంబంధించిన ఆజ్ఞ జారీ చేస్తున్నాము. స్వేచ్ఛాపరునికి బదులు స్వేచ్ఛాపరుడ్ని, బానిసకు బదులు బానిసను, స్త్రీకి బదులు స్త్రీని మాత్రమే (హతమార్చాలి). ఒకవేళ హంతకుని పట్ల అతని (మానవతా) సోదరుడు (అంటే హతుని బంధువు) కొంత మృదువైఖరి అవలంబించడానికి సిద్ధపడితే, రక్తపరిహార సమస్య సామరస్యంగా పరిష్కారమవ్వాలి. దానిప్రకారం హంతకుడు నిర్ణీత రక్తపరిహారాన్ని సంతోషంగా ఇచ్చివేయాలి. ఇది మీ ప్రభువు నుండి లభిస్తున్న సౌలభ్యం, దైవానుగ్రహం. ఆపై కూడా ఎవరైనా హద్దుమీరితే అతనికి (పరలోకంలో) దుర్భరశిక్ష పడుతుంది. కనుక బుద్ధిమంతులారా! (ఇలాంటి) ప్రతిక్రియలోనే మానవ జీవితానికి భద్రత ఉందని తెలుసుకోండి. తద్వారా మాత్రమే మీరు హత్యా రక్తపాతాలకు దూరంగా ఉండగలరు." (ఖుర్‌ఆన్-2:178,179)

పై సూక్తుల్ని బట్టి హతునిబంధువులు క్షమించి రక్తపరిహారం (దియత్) తీసుకో వడానికి ఇష్టపడితే హంతకునికి ప్రభుత్వం శిక్ష విధించదని తెలుస్తోంది. రక్తపరిహారం క్రింద హంతకుడు హతునిబంధువులకు వంద ఒంటెలు ఇచ్చుకోవాలి. లేదా వేయి దీనార్లు పైకం చెల్లించవలసి ఉంటుంది. పైగా హంతకుడు పాపపరిహారం కూడా నెరవేర్చవలసి ఉంటుంది. పాపపరిహారంగా రెండు నెలలు నిరంతరాయంగా ఉపవాసాలు పాటించాలి లేదా 60మంది పేదలకు అన్నదానం చేయాలి. అదేవిధంగా ఎవరైనా ఒకడ్ని కొట్టి తీవ్రంగా గాయపరచడం జరిగితే, శరీరంలోని విభిన్న అవయవాల నష్టానికి కూడా నిర్ణీత పరిహారాలు చెల్లించవలసి ఉంటుంది.

అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: రబీ (రజి) అనే మహిళ ఓ అన్సారీ యువతికి ముందరిపళ్ళు నాల్గింటిని ఊడగొట్టింది. ఆ స్త్రీ తరపు బంధువులు దైవప్రవక్త (సల్లం) దగ్గరికెళ్ళి ఖిసాస్ (ప్రతీకారం) జరగాలని ఫిర్యాదు చేశారు. దైవప్రవక్త (సల్లం) ఖిసాస్ ఆజ్ఞ జారీచేశారు. అయితే హజ్రత్ అనస్ బిన్ నజర్ (రజి) జోక్యం చేసుకుంటూ "దైవప్రవక్తా! దైవసాక్షిగా చెబుతున్నాను. ఈమె పళ్ళను ఊడగొట్టడం జరగదు" అని అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) "అనస్! ఖిసాస్ నిర్ణయం దైవగ్రంథంలోనిది కదా! (నువ్వలా అంటావేమిటీ!) అని అన్నారు (ఆశ్చర్యం వెలిబుచ్చుతూ).

ఆ తరువాత బాధితురాలి బంధువులు నిందితురాలిని క్షమించి నష్టపరిహారం తీసుకోడానికి ఒప్పుకున్నారు. దీనిపై దైవప్రవక్త (సల్లం) వ్యాఖ్యానిస్తూ "నిస్సందేహంగా దేవుని దాసుల్లో కొందరు ప్రత్యేక దాసులు కూడా ఉన్నారు. వారు దేవుని (అనుగ్రహాన్ని) నమ్ముకొని ప్రమాణం చేసినప్పుడు దేవుడు వారి ప్రమాణాన్ని నిజం చేస్తాడు" అని అన్నారు. (బుఖారి)

ఈ హదీసులో హజ్రత్ అనస్ బిన్ నజర్ (రజి) ప్రమాణం చేసి అలా అన్నారంటే దానర్థం దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞను త్రోసిపుచ్చడం ఎంతమాత్రం కాదు. క్షతగాత్రురాలి బంధువులు నష్టపరిహారం తీసుకొని వదలిపెట్టేందుకు మీరు సిఫారసు చేయండని ఆయన బహుశా దైవప్రవక్త (సల్లం)ను కోరి ఉండవచ్చు. ఆయన దేవుని సహాయం మీద నమ్మకముంచి ప్రమాణం చేశారు గనక దేవుడు దాన్ని నిజపరచి చూపాడు.

"పొరపాటున తప్ప తోటి విశ్వాసిని హతమార్చడం ఏ విశ్వాసికీ శోభించదు. ఒకవేళ పొరపాటున హతమార్చడం జరిగితే అందుకు ఒక బానిసముస్లింకు స్వేచ్ఛ నివ్వాలి. మరోవైపు హతుని వారసులకు రక్తపరిహారం కూడా చెల్లించాలి. ఒకవేళ వారు క్షమించివేస్తే అది వేరే విషయం. అయితే హతుడు మీ శత్రువర్గానికి చెందినవాడయి, అతను విశ్వాసి కూడా అయి ఉంటే, ఒక ముస్లిం బానిసకు స్వేచ్ఛనిస్తే చాలు. అలా కాకుండా హతుడు మీరు శాంతి ఒడంబడిక చేసుకున్న జాతికి చెందినవాడై ఉంటే, మీరు హతుని వారసులకు రక్తపరిహారంతో పాటు ఒక బానిసముస్లింకు సేచ్ఛ కూడా ఇవ్వాలి."

"స్వేచ్ఛనివ్వడానికి బానిస లేకపోతే హంతకుడు వరుసగా రెండు నెలలపాటు ఉపవాసవ్రతం పాటించాలి. ఇది చేసిన తప్పును పశ్చాత్తాపంతో సరిదిద్దుకోవడానికి దేవుడు నిర్ణయించిన నిష్కృతీ విధానం. దేవుడు సమస్తం తెలిసినవాడు, ఎంతో వివేచనాపరుడు." (ఖుర్ఆన్-4:92)

రక్తపరిహారంగా 100 ఒంటెలు లేదా 200 ఆవులు లేదా 2000 మేకలు చెల్లించా లని దైవప్రవక్త (సల్లం) నిర్ణయించారు. తర్వాతి కాలంలోను ఇవే కొలమానాలుగా పరిగ ణించబడ్డాయి. హంతకుడు ఎవరైనదీ నిర్ధారణకాని పక్షంలో హతుని వారసులకు ప్రభుత్వమే రక్తపరిహారం చెల్లించవలసి ఉంటుంది.



హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) (ప్రముఖ సహాబీలయిన) హజ్రత్ ముగైరా బిన్ షాబా (రజి), హజ్రత్ ముహమ్మద్ బిన్ ముస్లమా (రజి)లను సంప్రదిస్తూ "స్త్రీ కడుపులోని పిల్లవాడు (ఎవరైనా కొట్టడంవల్ల) గర్భస్రావమై చచ్చిపోతే దానికి రక్తపరి హారం ఏమిటీ?" అని అడిగారు. హజ్రత్ ముగైరా (రజి) సమాధానమిస్తూ "ఒక బానిసను గాని లేదా బానిసరాలిని గాని ఇచ్చుకోవాలని దైవప్రవక్త (స) తీర్పిచ్చారు" అని చెప్పారు. దానికి ముహమ్మద్ బిన్ ముస్లమా (రజి) సాక్ష్యమిస్తూ "దైవప్రవక్త (స) ఈ తీర్పిచ్చేటప్పుడు నేను అక్కడ ఉన్నాను" అని అన్నారు. (బుఖారి)

ఈ హదీసు గురించి ఇమామ్ నవవీ (రహ్మలై) ఇలా వ్యాఖ్యానించారు: ఆడ పిల్లయినా, మగపిల్లోడయినా మాతృగర్భంలో ప్రాణం కోల్పోయి బయటికి వస్తే దోషి తప్పనిసరిగా రక్తపరిహారం చెల్లించుకోవలసి ఉంటుంది. సజీవంగా బయటికి వచ్చి ఆ తరువాత (అదే దెబ్బ వల్ల) చనిపోయినా సరే మగదోషి నుండి పూర్తి రక్తపరిహారం- అంటే వంద ఒంటెలు, ఆడదోషి నుండి అర్ధ రక్తపరిహారం- అంటే యాభై ఒంటెలు తప్పనిసరిగా వసూలుచేయాలి.

## 104. ప్రజాసేవే పరమాత్మసేవ

ఇస్లాంలో దేవుని హక్కులు, దాసుల హక్కులని రెండు భాగాలున్నాయి. నమాజ్, ఉపవాసం, హజ్‌యాత్ర మొదలైనవి దేవునిహక్కులు. ఆర్థిక విషయాలతో పాటు మానవ సంబంధాలకు చెందిన వ్యవహారాలన్నీ దాసులహక్కుల కిందికొస్తాయి. మన ప్రార్థనలు, ఉపవాసాలు పుణ్యక్షేత్ర యాత్రలే దేవుని దైవత్వాన్ని నిలబెట్తాయని, ఆయన ఉనికిని కాపాడుతాయని ఎవరైనా భావిస్తే; లేదా అవే మనకసలు ముక్తీ మోక్షాలు ప్రసాదిస్తాయిని అనుకుంటే అంతకంటే పెద్ద పొరపాటు, అపోహ మరేమీ లేవు.

రోజుకు అయిదు సార్లు చేసే నమాజ్‌లో భక్తుడు ఖుర్ఆన్ సూక్తులే మాటి మాటికి పఠిస్తాడు. ఖుర్ఆన్‌లో తొంభైశాతం మానవ సంబంధాలు, వాటి ఉల్లంఘన వల్ల జరిగే ఇహపరలోకాల నష్టాలను గురించిన విషయాలే ఉన్నాయి. ఉపవాసాల పాటింపు ద్వారా పేదల ఆర్థికబాధలు ఆచరణాత్మకంగా అర్థమవుతాయి. శుక్రవారం నమాజ్, పండుగ నమాజ్, హజ్‌యాత్రలు తోటి మానవుల కష్టసుఖాలు తెలుసు కోవడానికి, అంతర్జాతీయ సంబంధాలు పటిష్టం కావడానికి దోహదపడతాయి. ఈవిధంగా ఇస్లాంలో దైవహక్కుల నిర్వహణ కూడా దాసులహక్కుల నిర్వహణకే తోడ్పడుతుంది.

ఈ కారణంగానే ఇస్లాం అంటే ఏమిటీ అనే ప్రశ్నకు మహాప్రవక్త ముహమ్మద్ (స) "(ఇస్లాం అంటే) మంచి మాటలు చెప్పడం, (ఆకలిగొన్నవారికి) అన్నం పెట్టడం" అని సమాధానమిచ్చారు. అలాగే 'విశ్వాసం' అంటే ఏమిటని అడిగిన మరో ప్రశ్నకు ఆయన "సహనం వహించడం, దానం చేయడం" అని చెప్పారు. (అహ్మద్- మిష్కాత్)

దాసుల హక్కులకు సంబంధించిన ఈ ప్రధాన లక్ష్యం (ధనవికేంద్రీకరణలోని) పేదల ఆర్థిక హక్కయిన జకాత్, బంధువుల్లో ఆస్తిపంపిణీ వగైరా విధుల నిర్వహణ ద్వారానే నెరవేరుతుంది. ఈ విధులు పరలోకపు జవాబుదారీభావన, ప్రభుత్వ వ్యవస్థ లోని శాంతిభద్రతలు- న్యాయశాఖల ద్వారానే సక్రమంగా నిర్వహించబడతాయి.

పరలోకపు జవాబుదారీభావనతో పాటు ప్రభుత్వ వ్యవస్థ ఉన్నప్పుడే ధనపిపాసి, పిసినారి అయిన ధనికుడు సైతం జకాత్ చెల్లిస్తాడు. అప్పుడే పెట్టుబడిదారుడు "శ్రామికునికి చెమట ఆరకముందే అతని వేతనం ఇచ్చేయండి" అనే ప్రవక్త ఆదేశాన్ని పాటిస్తాడు. అప్పుడే ధనికుల్ని మరింత ధనికులుగా, పేదలను మరింత పేదలుగా చేసే వడ్డీవ్యవస్థ అంతమవుతుంది. అప్పుడే ఆర్థిక నేరస్థుల ఆటలు ఆగిపోతాయి.

అయితే చెల్లెలి పిల్లల ఆకలిబాధ తీర్చడానికి ఒక రొట్టె ముక్కను దొంగిలించిన 'జీన్‌వాల్‌జీన్'కు పాశ్చాత్యప్రభుత్వం విధించిన శిక్షలా ఇస్లామీయ ప్రభుత్వం ఆకలి తీర్చుకోడానికి కొన్ని రొట్టెలు మాత్రమే దొంగిలించిన మనిషిని అతని జీవితాంతం వెంటపడి వేధించదు. పైగా అలాంటి పరిస్థితికి కారణం పరిశీలించి అతనికి తగిన సహాయం చేస్తుంది. పరిపాలనలో ఏమయినా లోపాలుంటే సరిచేసి నిజమైన ఆర్థిక న్యాయం నెలకొల్పుతుంది.

ఇలాంటి ఆర్థిక న్యాయం మూలంగానే "మీకొక కాలం రానున్నది. ఆ కాలంలో మనిషి దానం తీసుకొని బయలుదేరుతాడు. కాని దానం స్వీకరించేవారెవరూ దొరకరు. ఎవరికైనా ఇద్దామని వెళ్తే ఆ వ్యక్తి 'నీవు నిన్న వచ్చివుంటే నేనే దానం స్వీకరించేవాణ్ణి. ఈరోజు నాకు దీని అవసరం లేదు' అంటాడు" అన్న ప్రవక్త భవిష్యత్‌వాణి ఖలీఫా హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) పాలనాకాలంలో నెరవేరింది.

ధనవికేంద్రీకరణ వ్యవస్థలో బంధువులు, పేదల తర్వాత పొరుగువాళ్ళు, అతిథులు కూడా ఉన్నారు. మనింటికి ఇరుగు పొరుగున ఉన్నవాళ్ళేగాక, ప్రయాణావస్థలో మన దగ్గరుండేవాళ్ళు కూడా పొరుగు క్రిందికే వస్తారు. మన సంపదలో వారిక్కూడా హక్కుంది. అవసరం వచ్చినప్పుడు ఇలాంటి వాళ్ళందరికీ సహాయపడటం ముస్లింల విధి. పొరుగువారి హక్కుల్ని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"తన పొరుగున ఉన్నవాడు పస్తుండగా తాను కడుపునిండా తిన్నవాడు నిజమైన విశ్వాసి (ముస్లిం) కాడు."- "దేవుణ్ణి, ఆయన ప్రవక్తను ప్రేమించడాన్ని ఇష్టపడేవాడు మాట్లాడితే నిజమే మాట్లాడాలి; ఎవరైనా నమ్మి అతని దగ్గర ఏదైనా వస్తువు పెడితే అతనా వస్తువును సురక్షితంగా దాని యజమానికి అప్పగించాలి; తన ఇరుగుపొరుగు వారి పట్ల మంచిగా ప్రవర్తించాలి." (మిష్కాత్)

"(దైవదూత) జిబ్రీల్ (అలైహి) పొరుగువారి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని మాటిమాటికి నన్ను తాకీదు చేసేవారు. ఆయన చేస్తున్న తాకీదు గురించి ఆలోచిస్తే



ఒక పొరుగువాని ఆస్తికి మరొక పొరుగువాణ్ణి వారసుడిగా చేయడం జరుగుతుందా అన్పించింది నాకు." (బుఖారి, ముస్లిం)

"దేవుణ్ణి, అంతిమ దినాన్ని విశ్వసించినవాడు తన అతిథికి మర్యాద చేయాలి. ఒక పగలు, ఒక రాత్రి అతిథ్యమివ్వడం అతని విధి. మూడు రోజులు ఆతిథ్యమిస్తే చాలా మంచిది. అంతకంటే ఎక్కువ రోజులు ఆతిథ్యమిస్తే అది దానం (సదఖా)గా పరిగణించబడుతుంది. అయితే అతిథి ఆతిథ్యమిచ్చేవాని ఇంట అతనికి కష్టం కలిగేటంత కాలం వరకు తిష్ఠవేసి కూర్చోవడం ధర్మసమ్మతం కాదు." (బుఖారి)

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం: మేము ఓరోజు దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "మీరు మమ్మల్ని ఎక్కడికైనా పంపినప్పుడు ఒక్కోసారి మేము మాకు ఆతిథ్యం ఇవ్వనివారి దగ్గరికెళ్ళి బసచేయవలసి వస్తుంది. అలాంటి పరిస్థితిలో మేము ఏం చేయాలి?" అని అడిగాము. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "మీరేదైనా తెగవారి ప్రాంతానికి వెళ్ళి విడిది చేసినప్పుడు ఆ తెగవాళ్ళు మీకు సంప్రదాయం ప్రకారం ఆతిథ్యమివ్వడానికి ముందుకొస్తే సరే, లేకపోతే మీరు మీకు దక్కవలసిన హక్కును వారి నుండి రాబట్టుకోండి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

దీన్నిబట్టి మనిషి తనకు రావలసిన హక్కు కోసం శక్తి ఉంటే బలవంతంగానైనా రాబట్టుకోవచ్చని తెలుస్తోంది. ప్రభుత్వం ఉన్నప్పుడు బలప్రయోగాలకు తావులేకుండా ఎవరి హక్కులు వారికి సులభంగా లభించే వాతావరణం సృష్టించాలి. అప్పుడే ధనం ఎల్లప్పుడూ కొందరు ధనికుల్లోనే కేంద్రీకృతమై ఉండకుండా వికేంద్రీకరణతో నిజమైన ఆర్థిక న్యాయం నెలకొంటుంది.

**(-సమాప్తం-)**

**సత్యాన్వేషకులకు ఓ సదవకాశం**

ఇస్లాం ఓ సమగ్రమైన జీవనవ్యవస్థ. ఇది సృష్టికర్త తనప్రవక్తల ద్వారా మనకు పంపిన సంపూర్ణ సంవిధానం. కాని ఈనాడు ఇస్లాం అనుచరులైన ముస్లింలు దీన్ని పూర్తిగా ఆచరించకపోవడం వల్ల, మరోవైపు జాత్యహంకారులైన మతదురభిమానులు వ్యాపింపజేసిన అపోహలవల్ల సత్యాన్వేషకులకు ఇస్లాంను సరిగా, పూర్తిగా అర్థం చేసుకోవడం కష్టమై పోయింది. అనువాదాల భాషాశైలి కూడా అన్వేషకులకు ఆసక్తి కల్గించలేకపోతోంది. ఇప్పుడు తెలుగువారి కోసం తేటతెలుగులో ఇస్లాం గురించి సరైన, సమగ్ర సమాచారం అందజేయడానికి "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" నడుం కట్టింది. పాఠకులే న్యాయ నిర్ణేతలు. మీఅభిప్రాయాలు ✆ 9441515414 ద్వారా తెలియజేయగలరు.